# ప్రసార సాధనాల్లో భారతీయ భాషల నవీకరణ సమస్యలు: తెలుగు

**ఖండాలు 1 – 6**

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం

హైదరాబాద్

2003

**పాఠ్య నిర్మాతలు**
ఆచార్య చేకూరి రామారావు (సంపాదకుడు)

డా. పి. రామనరసింహం
ఆచార్య కె.కె. రంగనాథచార్యులు
ఆచార్య చేకూరి రామారావు
ఆచార్య వెన్నెల కంటి ప్రకాశం
డా. జె. ప్రభాకర రావు
డా. జయశ్రీ
డా. కె.యెస్. రమణ
డా. సాయి ప్రసాద్
ఆచార్య జి. సాంబశివరావు
ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

**కార్యక్రమ సమన్వయ కర్త**
ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

**పాఠ్యాంశ సమన్వయకర్త**
డా. కె.యెస్. రమణ

**సమన్వయం**
డా. ఆర్. వసుసందన్
ఘంటా చక్రపాణి
డా. ఉమాపతి వర్మ

**ముఖచిత్రం**
చంద్ర

11 5093
29-4-05
BRAOU
Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115093
Date 29.4.2005
Call No

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్

మొదటి ముద్రణ – 1996 2003

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలో ఏ భాగమైనా ఉపయోగించదలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు: డైరెక్టర్ (అకాడమిక్) డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500 033

Lr.No.51/Dr. BRAOU/DMP/PTG/F.No.45/J.O.204/2003-2004/dt.16.4.03/No. of Copies 200

Printed at : **Graphica Printers**, Hyderabad.

(PGDWMMT) Book 4

# ప్రసార సాధనాల్లో భారతీయ భాషల నవీకరణ సమస్యలు – తెలుగు

**ఖండాలు 1–6**


1. భాష ఆధునీకరణ
2. భాష ప్రమాణీకరణ
3. రచనా భాష – సమస్యలు, పరిష్కారాలు
4. అనువాద సమస్యలు
5. రచనారీతులు
6. ప్రసార సాధనాలు – శైలీ పత్రం


BRAOU

# ఖండాల, భాగాల క్రమం


పుటలు – సంఖ్య

**ఖండం : 1 భాష ఆధునీకరణ**

| | | | |
|---|---|---|---|
| భాగం : 1 | భాష ఆధునీకరణ : నిర్వచనాదికాలు | | 1 |
| భాగం : 2 | భారతీయ భాషల వర్తమాన స్థితి, అభివృద్ధి : సాధారణ సమస్యలు | | 9 |
| భాగం : 3 | భాష ఆధునీకరణలో ప్రసారసాధనాల పాత్ర | | 17 |
| భాగం : 4 | విశేష పద నిర్మాణం | | 26 |
| భాగం : 5 | వాక్య నిర్మాణ ప్రయోగాల్లో కొత్త రీతులు | | 36 |

**ఖండం : 2 భాష ప్రమాణీకరణ**

| | | | |
|---|---|---|---|
| భాగం : 6 | తెలుగు భాషాభివృద్ధి ప్రయత్నాలు : భాషా యోజన | | 47 |
| భాగం : 7 | భాష ప్రమాణికీకరణ: నిర్వచనాదికాలు | | 59 |
| భాగం : 8 | భాష ప్రమాణీకరణ: మాండలికాలు | | 63 |
| భాగం : 9 | ప్రమాణ భాషగా తెలుగు: పత్రికల పాత్ర | | 69 |
| భాగం : 10 | ప్రసార సాధనాల్లో తెలుగు మాండలికాలు | | 78 |
| భాగం : 11 | తెలుగు పత్రికలలో భాషా శైలి: క్రమ పరిణామం (ప్రత్యేక అధ్యయనం) | | 85 |

**ఖండం : 3 రచనాభాష: సమస్యలు, పరిష్కారాలు**

| | | | |
|---|---|---|---|
| భాగం : 12 | లేఖన – ఉచ్చారణ సమస్యలు | | 92 |
| భాగం : 13 | కొత్త భావనలు, పదకల్పనలు, ప్రత్యేక పదాలు, ఉచిత పదప్రయోగం | | 119 |


BRAOU

భాగం : 14 వాక్య ప్రయోగ విధానం 129

భాగం : 15 విరామ చిహ్నాలు 141

భాగం : 16 శైలి: విశేష పదాలు, మాండలికత 151

భాగం : 17 పత్రికా భాషలో మార్పులు 'జమీన్ రైతు' భాష పరిశీలన ( ప్రత్యేక అధ్యయనం ) 158

**ఖండం : 4 అనువాద సమస్యలు**

భాగం : 18 అనువాదం: నిర్వచనాలు, సిద్ధాంతాలు, పద్ధతులు 168

భాగం : 19 అనువాదం : భాషా సాంస్కృతిక సమస్యలు 180

భాగం : 20 వైజ్ఞానిక , సాహిత్య, న్యాయ, మత, తాత్విక, పత్రికా రచనల అనువాదం, అనువర్తన 193

భాగం : 21 విశేష వార్తలు: అనువాద సమస్యలు 213

భాగం : 22 భిన్నరంగాల్లో అనువాదం ( ప్రత్యేక అధ్యయనం ) 225

**ఖండం : 5 రచనా రీతులు**

భాగం : 23 సృజనాత్మక రచన – విషయ ప్రధాన రచన 253

భాగం : 24 బాలల కోసం రాయడం 270

భాగం : 25 మహిళల కోసం రాయడం 274

భాగం : 26 నిరక్షరాస్యుల కోసం రాయడం 278

భాగం : 27 కొత్తగా అక్షరాస్యులైన వారికోసం రాయడం 291

**ఖండం : 6 శైలీ పత్రం : ప్రసార సాధనాలు**

భాగం : 28 శైలీ పత్రం 309

భాగం : 29 విరామ చిహ్నాలు 318


BRAOU

BRAOU

# భాషా ప్రయోగ రీతికి ప్రారంభం

పూర్వ సమాజాల్లో కన్నా ఆధునిక సమాజంలో భాషా ప్రయోగం విస్తృతమయింది. ఇది సహజ పరిణామమే. భారతీయ సమాజాల్లో ఆధునికత కొంత ఆలస్యంగా ప్రవేశించింది. భారతీయ భాషల్లో ఆధునికతను ఇముడ్చుకో గలిగిన వనరులకు కొదవేం లేకపోయినా ఇతర సమాజాల్లో జరిగిన అభివృద్ధిని అందుకోవటంలోఆలస్యంజరిగింది. ఆ అభివృద్ధిని అందుకొనే లోగానే అనేక రంగాల్లో పెను మార్పులు వస్తున్నాయి. తక్కువ వ్యవధిలో ఎక్కువ అభివృద్ధిని సాధించటానికి భాషలోని అన్ని వనరులను ఉపయోగంలోకి తేవాలి.

ఆధునిక భారతీయ భాషల్లో శాస్త్ర విజ్ఞానం తక్కువ. ఉన్నదంతా సంస్కృతంలోనే ఉంది. దాన్ని దశలవారీగా దేశ భాషలు తమలోకి దించుకున్నాయి.

భారతీయ భాషలు ఒకనాటి నాగరికతను, శాస్త్ర సాంకేతికాభివృద్ధిని బాగానే ఇముడ్చుకోగలిగాయి. అందుకు దేశ భాషల వనరులతో పాటు, పద సృష్టి విషయంలో సంస్కృతం అక్కరకొచ్చింది. అనేకార్థాల్లో రూపాంతర పద నిర్మాణం చెయ్యగలిగిన ధాతు సంపద, ఉత్పన్నం చేయగలిగిన వ్యాకరణ ప్రక్రియలూ ఆ భాషకున్నాయి. వాటినన్నింటినీ వాడుకునే సంప్రదాయం ఆధునిక భారతీయ లిఖిత భాషలన్నింటికీ ఉంది.

ఆధునిక సమాజం ప్రపంచంలో వస్తున్న శాస్త్ర సాంకేతికాభివృద్ధిని వాడుకోవాలన్నా కొత్త విజ్ఞానాన్ని సృజించాలన్నా భారతీయ భాషలు ఆధునికం కావాలి. భారతీయ భాషల్లో ఆధునిక విజ్ఞాన రచన జరగాలి. ఆ ప్రయత్నంలో వచ్చే సమస్యలను పరిష్కరించుకోవాలి.

ఆధునిక సమాజంలో సమాచార వ్యాప్తి ఒక ప్రధానం అంశం. సంచలనశీలమైన సమాజంలో జరిగిన సంఘటనలను, జరుగుతున్న యోచనలను, పెరుగుతున్న జ్ఞానాన్ని అన్ని వైపులకు పంచటం ఈనాటి అవసరం. ఈ సమాచార వ్యాప్తిని దృశ్య, శ్రవణ, పఠన మాధ్యమాలు నిర్వహిస్తాయి. వీటన్నిటిలోనూ దృశ్యాదృశ్యంగా మాట్లాడే భాష రాతలోకి వస్తుంది.

మాట్లాడే భాషనుంచే రాసే భాష ఏర్పడినా రెండింటికీ కాలక్రమంలో కొన్ని భేదాలు ఏర్పడతాయి. పరిష్కరించుకోవాల్సిన సమస్యలు వస్తాయి. అట్లాంటి వాటిల్లో అక్షర క్రమం (స్పెల్లింగు) సమస్య ఒకటి. ఇతర భారతీయ భాషల సంగతేమోకానీ తెలుగులో ఈ సమస్య అధికంగానేఉంది. ఒక మాటకు నాలుగైదు రకాల అక్షర క్రమాలు కనిపిస్తున్నాయి. వీటిని ప్రమాణీకరించుకోవాలి. అట్లాగే వాక్య నిర్మాణంలో కూడా కొంత క్లిష్టత ఏర్పడొచ్చు. మాట్లాడే భాషలో అంత ఉపయోగంలో లేని వాక్యాలను రాతలో ఉపయోగించాల్సి రావచ్చు. మాట్లాడే భాషలో వాడని పదాలు, రాసే భాషలో వాడుకోవాల్సి రావచ్చు. ఇందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. సాధారణ భాష నిత్యావసర విషయాలకు పరిమితం. నాగరిక సమాజాల్లో ఎన్నో విశేష విషయాలను శాస్త్రాలను, రంగాలను, అంశాలను మాట్లాడుకోవాల్సిన అవసరం వస్తుంది. రాసేటప్పుడు అవసరం మరీ పెరుగుతుంది. అందువల్లే మాట్లాడినట్లే రాయాలనటం. ఆ భాషా వ్యవహారం మాట్లాడే విషయాలకే పరిమితమైనప్పుడే మాట్లాడినట్లే రాయడం సాధ్యమౌతుంది. భాషా ప్రయోజనం విస్తృతం కనుక రాసే భాష మాట్లాడే భాషతో అనేకాంశాలలో భేదించే అవకాశం వుంది. ఒకే విషయాన్ని మాట్లాడుతూ మారుస్తాము. గనక రెండింటికి సామ్యాలు ఎట్లాగూ ఉంటాయి. సామ్య భేదాలు మనం తెలుసుకొని భాషా ప్రయోగం చేయాలి.

BRAOU

ప్రపంచంలో అన్ని సమాజాల్లోనూ అభివృద్ధి ఒకే క్రమంలో జరగదు, ఒకే రకంగా జరగదు. అందులో ఒక భాషలో నిక్షిప్తమైన సమాచారం మరో భాషలోకి వెళ్ళాలి. దీన్ని అనువాదం అంటారు. కారణాలేవన్నా కానీ ఈ అవసరం భారతీయ భాషలకు చాలావుంది. అందువల్ల భాష ఆధునీకరణలో అనువాదం కూడా ఒక ప్రేరణాంశం. ప్రసార సాధనాల్లో పనిచేసే వారు అనువాద విధానం గురించి తప్పని సరిగా తెలుసుకోవాలి.

ఆధునిక సమాజాల్లో భాషా ప్రయోగంలో ఏకత్వంతో పాటు భిన్నత్వం ఉంటుంది. ఏకత్వం వ్యాకరణాంశాల్లో పద రూపాల్లో ఉన్నా భిన్నత్వం పద ప్రయోగంలో వాక్య భేద ప్రయోగంలో ఉంటుంది. వీటిలో శైలీభేదాలుంటాయి. ఇవి ఉద్దేశించిన శ్రోతలను బట్టి, పాఠకులను బట్టి ఉంటాయి.

అందులో ఒకటి మాండలిక భాషా ప్రయోగం. ఇటీవలి కాలం రచనల్లో, తెలుగులో మాండలిక భాషా ప్రయోగం పెరిగింది. సామాన్య ప్రజలకు సమాచారం అందాలంటే మాండలిక భాషా ప్రయోగం అవసరమవుతుంది. పత్రికలకు జిల్లాల ఎడిషన్లు వచ్చిన తరువాత ఈ అవసరం ఇంకా పెరిగింది. మాండలికం సృజనాత్మక రచనలకు సహజ సౌందర్యాన్ని ఇస్తుంది.

వివిధ ప్రసార సాధనాల్లో పనిచేసేవారు తమ మాండలికంలో రచనా ప్రావీణ్యం సంపాదించాలి. ఇతర మాండలికాల్లో అవగాహన సామర్థ్యాన్ని ఏర్పర్చుకోవాలి.

ప్రసార సాధనాల్ని బట్టి భాషా అవసరాలుంటాయి. రేడియోల్లో, టెలివిజన్‌లో ఎన్నో రకాల కొత్తకొత్త సృజనాత్మక ప్రక్రియలు వస్తున్నాయి. వాటికి సంబంధించిన రచనా భేదాలు గ్రహించాల్సి ఉంది.

ప్రసార సాధనాలకు రాసేటప్పుడు ఉద్దేశించిన పాఠకులను బట్టి రచనా భేదాలుంటాయి. నిరక్షరాస్యుల కోసం రాసే పద్ధతులకూ స్వల్ప అక్షరాస్యుల కోసంచేసే రచనలకూ అక్షరాస్యుల కోసం రాసే రచనలకూ భేదాలు గ్రహించాలి. ముఖ్యంగా పద ప్రయోగాల్లో ఈ తేడా వుంటుంది. మహిళల కోసం రాసే రచనలలో లింగ వివక్ష గురించి ఇతోధికమైన జాగ్రత్త తీసుకోవాలి. బాలల కోసం రాసేటప్పుడు పదవాక్య రీతుల గురించి జాగ్రత్త అవసరం.

ఒక్కో రచన చేసేటప్పుడు ఒక్కో రకం శైలిని వాడుక చేస్తాం అంతే. పత్రికల వారికి వేరువేరు శైలీ పద్ధతులుండొచ్చు. అన్నిటితో పాటు అన్యార్థ నివారణకు విరామ చిహ్నాలు అవసరమవుతాయి. పదక్రమంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా వుంది.

అసలు ఏ రచనైనా ఒక సృజనాత్మక వ్యాపారం (Creative activity). రచనల్లో సారళ్యం, అర్థస్పష్టత అత్యవసర గుణాలు. వాటికి ఆటంకం కలిగించే అంశాలను నివారించాలి. రచన పాఠకులకు ఆసక్తికరంగా ఉండాలి. మాట్లాడేటప్పుడు సమాచార దృష్టేఎక్కువగా ఉంటుంది. రాసేటప్పుడు అర్థబోధకు ఆటంకం కాని విధంగా సౌందర్య దృష్టి ఉండటంలో తప్పులేదు. అందుకు రచయితలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ఈ పాఠ్యాంశం తయారయింది. ఈ పాఠ్యాంశ రచయితలంతా విజ్ఞాన నిధులే. అయితే తెలుగు రచనలో కొందరికి అంత అలవాటు లేదు. అందువల్ల విషయగాంభీర్యం ఉన్నా రచనా శైలిలో కొద్దిపాటి ఒడుదుడుకులుండొచ్చు. ఈ పాఠ్యాంశం సర్వ సమగ్రమైనదిగా మేం భావించటం లేదు. అయితే తెలుగులో ఇటువంటి పాఠ్యాంశం అవతరణకు ఇదే ఆరంభం. ముందుముందు దీన్ని ఇంతకన్నా మెరుగుపరిచే ప్రయత్నాలెట్లాగూ ఉంటాయి. ఈ పాఠ్యాంశం ప్రసార మాధ్యమాల కోసం రాసే రచయితలకు కొంతవరకైనా ఉపయోగిస్తుందని మా ఆశ.

-సంపాదకుడు

BRAOU

# ఖండం : 1 భాష ఆధునీకరణ

భాష ఆధునీకరణ క్రమాన్ని అధ్యయనం చేయాలంటే ముందుగా ఆధునీకరణ అంటే ఏమిటో తెలుసుకోవాలి. భారతీయ భాషల వర్తమాన స్థితిని సమీక్షించుకున్న తర్వాతనే ఆధునీకరణ క్రమంలో ఆ భాషలు ఎదుర్కొంటున్న సాధారణ సమస్యల్ని మనం గుర్తించగలుగుతాం. ప్రసారసాధనాలు భాష ఆధునీకరణలో నేడు ఎంతో ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నాయి. భాషా వ్యవహారంలో తదనుగుణంగా ఎన్నో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. వీటన్నిటినీ పరిశీలించేందుకు వీలుగా ఈ ఖండంలో అయిదు భాగాలున్నాయి. అవి :

1. భాష ఆధునీకరణ : నిర్వచనాదికాలు
2. భారతీయ భాషల వర్తమాన స్థితి, అభివృద్ధి, సాధారణ సమస్యలు,
3. భాష ఆధునీకరణలో ప్రసార సాధనాల పాత్ర
4. విశేష పద నిర్మాణ రీతులు
5. వాక్య నిర్మాణ ప్రయోగాల్లో కొత్త రీతులు

BRAOU

భాష ఆధునీకరణ అంటే ఏమిటి? భారతీయ భాషలు ఎంత వరకు ఆధునికం అయ్యాయి? ఎంత అభివృద్ధి అయ్యాయి? వాటి ఆధునీకరణలోని సమస్యలేవి? భాష ఆధునీకరణకు ప్రసార సాధనాలు ఎంత వరకు తోడ్పడతాయి? భాష ఆధునీకరణకు అవసరమైన కొత్త పదాలను నిర్మించే పద్ధతులేమిటి? వాక్య నిర్మాణంలోనూ, ప్రయోగంలోనూ ఉపయోగించదగిన కొత్త పద్ధతులేమిటి? మొదలైన అంశాలను ఈ భాగాల ద్వారా తెలుసుకుంటారు.

ఈ అంశాలకు సంబంధించి ఫెర్గూసన్, ఫిష్‌యన్, ఖూబ్ చందానీ, న్యూస్టుప్నే, భద్రిరాజు కృష్ణమూర్తి మొదలైన భాషా శాస్త్రవేత్తలు ఎంతో కృషి చేశారు. ఈ ఖండంలో చర్చించబోయే అంశాలకు వారి రచనలే ఆధారాలు.

ఈ ఖండం చదివాక భాష ఆధునీకరణను మీరు నిర్వచించగలుగుతారు. భారతీయ భాషల ఆధునీకరణ సమస్యలను విశ్లేషించగలుగుతారు.

BRAOU

## భాగం : 1 భాష ఆధునీకరణ : నిర్వచనాదికాలు

### విషయక్రమం


1.0 ఉద్దేశం

1.1 ప్రవేశిక

1.2 ఆధునికత – అభివృద్ధి

**అభ్యాసం – 1**

1.3 భాష ఆధునీకరణ: నిర్వచనం

1.3.1 భాష ఆధునీకరణ ఎందుకు?

1.3.2 భాషల ద్విభాజ్యత (dichotomy of languages)

**అభ్యాసం – 2**

1.4 భాష ఆధునీకరణ లక్ష్యాలు

1.4.1 స్వతంత్రత (autonomy) అనువదనీయత(translatability)

1.4.2 అంతరనువదనీయత (inter - translatability)

**అభ్యాసం – 3**

1.5 భాష ఆధునీకరణకు తోడ్పడే కార్యకలాపాలు

1.5.1 భాష క్రోడీకరణ

1.5.2 భాషా విస్తరణ

1.5.3 భాషా సంస్కరణ

**అభ్యాసం – 4**

1.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

1.7 అదనపు సమాచారం

1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 1.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది విషయాలను వివరించగలుగుతారు:

- భాష ఆధునీకరణ
- భాష ఆధునీకరణ లక్ష్యాలు
- భాష ఆధునీకరణకు తోడ్పడే కార్యకలాపాలు

BRAOU

BRAOU

## 1.1 ప్రవేశిక

ప్రపంచ దేశాలలో కొన్నింటిని అభివృద్ధి చెందిన దేశాలనీ, కొన్నింటిని అభివృద్ధి చెందుతున్న దేశాలనీ వ్యవహరించటం మీకు తెలుసు. అభివృద్ధికీ ఆధునికతకూ గల సంబంధాన్ని, భాష ఆధునీకరణను గురించి కొన్ని మౌలికాంశాలనూ మీరు ఈ భాగంలో తెలుసుకుంటారు.

## 1.2 ఆధునికత - అభివృద్ధి

పద్దెనిమిదో శతాబ్దం చివర యూరప్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవం ఫలితంగా యూరోపియన్ దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రగతిని సాధించాయి. దానివల్ల అవి ఆర్థిక ప్రగతిని సాధించి అభివృద్ధి చెందిన దేశాలుగా గుర్తింపుపొందాయి. అభివృద్ధి చెందిన దేశాల వలస పాలనలో అభివృద్ధి కుంటుపడిన ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని చాలా దేశాలు, రెండో ప్రపంచ యుద్ధం తరువాత స్వాతంత్ర్యాన్ని పొంది, అప్పటికే శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి చెందిన దేశాల పురోగమనాన్ని అందుకోలేని స్థితిలో ఉండిపోయాయి.

ఈ విధంగా ప్రపంచ దేశాలలో కొన్ని అభివృద్ధి చెందిన దేశాలుగానూ, కొన్ని అభివృద్ధి చెందుతున్న లేదా అభివృద్ధి చెందవలసిన దేశాలుగానూ వేరు పడ్డాయి. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు అభివృద్ధి చెందిన దేశాల వారు శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన పురోగమన వేగాన్ని అందుకోటానికి ప్రయత్నించటమే లక్ష్యం అయింది. కాగా అభివృద్ధి చెందిన దేశాల జీవన విధానం ఆధునికతకు గీటురాయిగా గుర్తింపు పొందింది. వారి భాషలు కూడా ఆధునికతను పొందిన భాషలుగా గుర్తించబడుతున్నాయి. ఒక సమాజం ఆధునికం అయింది అంటే ఆ సమాజం ఉపయోగించే భాష కూడా ఆధునికతను సాధించినట్లే. అందువల్ల అభివృద్ధి చెందుతున్న సమాజాలు - అభివృద్ధే ఆధునికతకు గీటురాయి కనుక - ఆధునికతను సాధించని సమాజాలే అని చెప్పవచ్చు. అంటే అవి వ్యవహరించే భాషలు కూడా ఆధునికం కానివే.

B R A O U

**అభ్యాసం - 1**

I. అభివృద్ధి చెందుతున్న దేశాల లక్ష్యం ఏమిటి?

II. ఆధునికతకు ఏది గీటురాయిగా గుర్తింపు పొందింది?

## 1.3 భాష ఆధునీకరణ: నిర్వచనం

అధునిక సమాజ జీవన విధానాలు అనదగిన అన్ని కార్యకలాపాలలోనూ అవసరమైన మౌఖిక లిఖిత సమాచార ప్రసరణ (Communication) కు సమర్థమైన వాహికగా పనిచేయగల భాషను ఆధునికతను పొందిన భాషగా పరిగణించ వచ్చు.

ఒక సమాజం వాడే భాష ఆ సమాజం అవసరాలకు లోబడే సమాచార ప్రసరణకు సమర్థమై ఉంటుంది. ఉదాహరణకు ఆ సమాజం ఆటవిక సమాజం అయితే దాని అవసరాల మేరకు మాత్రమే ఆ భాష సమాచార ప్రసార యోగ్యమై ఉంటుంది. రాజ్యపాలన, శాస్త్ర సాంకేతిక విద్యలు మొదలైన అవసరాలు ఆ సమాజానాకి ఉండవు. కనుక ఆ భాషకు ఈ రంగాలలో సమాచార ప్రసార సామర్థ్యం ఉండదు. అట్లాగే అభివృద్ధి చెందుతున్న సమాజంలోని అంటే ఆధునిక పూర్వదశలో ఉన్న సమాజం(pre - modern society) లోని భాషకు కూడా అభివృద్ధి చెందిన – అంటే ఆధునిక దశలో ఉన్న – సమాజానికి అవసరమైన సమాచార ప్రసార సామర్థ్యం ఉండదు. అయితే ఒక సమాజం అభివృద్ధి చెందుతున్న దశలో, తన భాషకు ఆధునిక కాలపు అవసరాలకు కావలసిన సమాచార ప్రసార సామర్థ్యం లేదు అని అంటే, అభివృద్ధి చెందిన సమాజంలోని భాషలతో సమానంగా శాస్త్ర సాంకేతిక న్యాయ పరిపాలనా రంగాలలో సమాచార ప్రసార సామర్థ్యం లేదు అని గుర్తించటం అన్నమాట. దీన్నిబట్టి భాష ఆధునీకరణను ఈ విధంగా నిర్వచించవచ్చు :

పారిశ్రామికీకరణను పొంది లౌకిక సమాజాలుగా అభివృద్ధిచెందిన ఆధునిక సమాజాల భాషలతో ఒకానొక సాంప్రదాయకమైన భాష ''అంతరనువదనీయత'' ( inter transatability) ను సాధించడమే భాష ఆధునీకరణ.

ఇక్కడ అంతరనువదనీయత అంటే, ఒక భాషలోని విషయాన్ని, శబ్దాలు, వ్యాకరణాంశాలు, శైలి మొదలైన భాషాంశాలు ప్రాధాన్యం చెందకుండా ఇంకొక భాషలో సులభంగానూ, నిర్దుష్టంగానూ వ్యక్తం చెయ్యగలగటం. దీన్నే ఇంకొక విధంగా చెప్పాలంటే, అభివృద్ధి చెందిన ఒక సమాజపు భాష వ్యక్తం చేయగలిగిన అంశాలన్నింటి నీ మరొక భాష సులభంగానూ, సూటిగానూ వ్యక్తం చేయగలిగితే, ఆ రెండు భాషల మధ్య అంతరనువదీయత ఉన్నట్లు.

BRAOU

### 1.3.1 భాష ఆధునీకరణ ఎందుకు?

రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటికి ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని ఎన్నో దేశాలు ఏదో ఒక యూరోపియన్ భాషా ప్రభావానికిలోనై ఉన్నాయి. ఈ దశలోనే అభివృద్ధి చెందిన దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో పురోగతిని సాధించాయి. ఇప్పుడు ఈ ఆసియా, ఆఫ్రికా ఖండాల దేశాలు ఆ రంగాలలో అభివృద్ధిని సాధించడానికి తాము భాషాపరంగా వెనుకబడి ఉన్నట్లు గుర్తించాయి. తాము కూడా ఆయా రంగాలలో అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాయి. నేడు వాటి లక్ష్యం ఆధునిక ప్రపంచపు పోకడల వేగాన్ని అందుకోవడమే. అందుకు తగిన విధంగా తమ భాషలను ఆధునీకరించుకోవలసిన అవసరాన్ని కూడా అవి గుర్తించాయి.

### 1.3.2 ద్విభాజ్యత: భాషల ద్వైధీ భావం (dichotomy of languages)

దేశాలలో అభివృద్ధి చెందినవి, అభివృద్ధి చెందుతున్నవి అనే ద్విభాజ్యత ఏర్పడినట్లే ఆధునికత కారణంగా భాషలలో కూడా ద్విభాజ్యత ఏర్పడింది. అది : 1. సామాజికమూ, భాషాపరమూ అయిన భిన్నత్వం (heterogenity) చాలా ఎక్కువగా ఉన్న భాషలు. (2) వ్యవహారిక ఏకరూపత (homogenity) వేగంగా పెరుగుతున్న భాషలు. మొదటి విభాగంలోని భాషలు అభివృద్ధి చెందుతున్న/ ఆధునికం అవుతున్న సమాజాల వారివి. రెండవ విభాగంలోని భాషలు అభివృద్ధి చెంది పారిశ్రామికం అయిన సమాజాల వారివి. ఇక్కడ 'భిన్నత్వం' అభివృద్ధి చెందుతున్న సమాజాల లక్షణంగానూ, 'ఏకరూపత' అభివృద్ధిచెందిన సమాజాల లక్షణంగానూ పరిగణించబడింది. ఉదాహరణకు అమెరికా భారత దేశం కంటే భౌగోళికంగా ఎంతో పెద్ద దేశం. కానీ, అమెరికాలో భాషాపరమైన ఏకరూపత నెలకొని ఉంది.

భారత దేశంలో పరిస్థితి ఇందుకు భిన్నం. భాషా భేదాల వల్ల, మాండలిక భేదాల వల్ల వైవిధ్యం ఎక్కువ. బహుభాషలుండడం అనే లక్షణంలో భారత దేశం యూరప్ ఖండంతో పోల్చదగినది . అయితే మన దేశంలోని ఒక్కొక్క భాష, పలు మాండలిక భేదాలతో భిన్నత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

**అభ్యాసం – 2**

(I) భాష ఆధునీకరణ అంటే ఏమిటి

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

(II) భాషల ద్విధీభావం ఏ విధంగా ఉంటుంది?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

BRAOU

## 1.4 భాష ఆధునీకరణ లక్ష్యాలు

భాష ఆధునీకరణకు రెండు లక్ష్యాలున్నాయి. అవి: 1. స్వతంత్రత 2. అంతరనువదనీయత.

### 1.4.1 స్వతంత్రత (autonomy)

ఆయా విజ్ఞాన రంగాలలోని విషయాల్ని వ్యక్తం చేయడంలో ఒక భాష స్వయం సమృద్ధిని సాధించడమే స్వతంత్రత. ఆధునిక మానవ జీవనానికి సంబంధించిన అన్ని అంశాలనూ సమగ్రంగా వ్యక్తం చేయగలిగే విధంగా భాషల పురోగతిని సాధించడం కొరకు ఈ లక్ష్యం ఏర్పడింది.

### 1.4.2 అంతరనువదనీయత (intertranslatability)

అభివృద్ధి చెందిన సమాజాల వారి భాషలతో, ఒక సంప్రదాయ సమాజపు భాషకు ఎంత మేరకు అంతరనువదనీయత ఉందో ఆ భాష అంత ఆధునీకరణను పొందినట్లుగా నిర్ణయిస్తారు. ఉదాహరణకు తెలుగువంటి అభివృద్ధి చెందుతున్న సమాజపు భాష ఆంగ్లంవంటి అభివృద్ధి చెందిన భాషతో ఎంత స్థాయికి అనువదనీయతను సాధించిందో అంతస్థాయికి తెలుగు ఆధునీకరణను పొందింది అని అర్థం.

**అభ్యాసం - 3**

అంతరనువదనీయత అంటే ఏమిటి?

## 1.5 భాష ఆధునీకరణకు తోడ్పడే కార్యకలాపాలు

భాష ఆధునీకరణకు దోహదం చేసే ముఖ్యమైన కార్యకలాపాలు : 1. భాషా క్రోడీకరణ 2. భాషా విస్తరణ 3. భాషా సంస్కరణ.

### 1.5.1 భాషా క్రోడీకరణ, వ్యవస్థీకరణ (language codification)

లేఖన పద్ధతులను ప్రమాణీకరించడం, భాషల్లో ప్రామాణిక రూపాలను నిర్ణయించడం, వ్యాకరణాలను రాయడం, నిఘంటువులను, సాంకేతిక పదకోశాలను నిర్మించడం, శైలీపత్రాలను (style sheets) తయారు చేయడం మొదలైన వాటివల్ల ప్రమాణాలను నిర్దేశించడం భాషా క్రోడీకరణ లేదా వ్యవస్థీకరణ అంటారు.

### 1.5.2 భాషా విస్తరణ (language elaboration)

కొత్త సాంకేతిక పదాలు తయారు చేసి భాషను శాస్త్ర సాంకేతిక రంగాలు, ప్రసార సాధనాలు, విద్య మొదలైన రంగాలలో వాడుక చేయడాన్ని భాషా విస్తరణ అంటారు. ఇందులో భాషా ప్రయోగం ఇంత వరకు ఉపయోగించని అనేక రంగాలకు విస్తరించింది.

### 1.5.3 భాషా సంస్కరణ (language cultivation)

ఒక భాషలో ఉన్న పలు మాండలిక భేదాలలో నుంచి ఒక భేదాన్ని ప్రముఖ వ్యక్తుల రచనలు ఆధారంగా ఎంచుకుని ప్రమాణీకరించడాన్ని భాషా సంస్కరణ అంటారు. ప్రముఖ రచయితలు ఉపయోగించే భాష ఎన్నుకోవడం వలన ఎక్కువ మందికి ఆ భాష ఆమోదయోగ్యం అవుతుంది. ఈ విధానం వలన భాషలో నమ్యస్థిరత(flexible stability) ఏర్పడుతుంది.

**అభ్యాసం - 4**

I. భాష ఆధునీకరణకు దోహదం చేసే కార్యకలాపాలు ఏవి?

BRAOU

II. భాషలో సమ్యస్థిరత దేనివల్ల ఏర్పడుతుంది.

## 1.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- అభివృద్ధి చెందుతున్న దేశాల లక్ష్యం ఆధునిక ప్రపంచపు పోకడల వేగాన్ని అందుకోవడమే.
- ఆధునిక సమాజ జీవన విధానాలు అనదగిన అన్ని కార్యకలాపాల్లో నూ మౌఖిక, లిఖిత సమాచార ప్రసరణ (communication)కు సమర్థమైన వాహికగా పని చేయగల భాష ఆధునికతను పొందిన భాష.
- అభివృద్ధి చెందిన సమాజాల వారి భాషలతో ఒక సాంప్రదాయక భాష అంతరనువదనీయతను సాధించడమే భాష ఆధునీకరణ.
- ఒక భాషలో వ్యక్తం చేయదగిన విషయాలనూ, శబ్దాలూ, వ్యాకరణాంశాలూ, శైలి మొదలైన భాషాంశాల ప్రాధాన్యం చెడకుండా, సులభంగానూ, సూటిగానూ మరొక భాషల్లో చెప్పగలటమే అంతరనువదనీయత.
- భాష అధునీకరణ లక్ష్యాలు రెండు: స్వతంత్రత, అంతరనువదనీయత.
- ఏ విషయాన్నైనా వ్యక్తం చేయడంలో ఒక భాష స్వయం సమృద్ధమై ఉండటమే స్వతంత్రత.
- భాష అధునీకరణకు తోడ్పడే కార్యకలాపాలు: భాష వ్యవస్థీకరణ; భాషా విస్తరణ, భాషా సంస్కరణ.

BRAOU

## 1.7 అదనపు సమాచారం

ఒక సమాజం ఆధునికం అయిందీ అంటే ఆ సమాజం ఉపయోగించే భాష కూడా ఆధునికం అయినట్లే. మరొక విధంగా చెప్పాలంటే భాష ఆధునికం కాకపోతే ఆ భాషాసమాజం ఆధునికం కావడం కుంటుపడుతుంది. దీనికి కారణం ఈ విధంగా వివరించ వచ్చు.

సమాచార ప్రసరణకు వాహిక భాష. ఒక సమాజం వాడే భాష ఆధుసిక జీవనానికి సంబంధించిన సమాచారం ప్రసరణకు వాహికగా పని చేయలేక పోతే ఆ సమాజం ఆధునికం కావడం కష్టం. కనుక ఆ భాష ఆధునికం అయ్యే దిశలో సాధించే అభివృద్ధి అ భాషా సమాజం సాధించిన అభివృద్ధితో అనులోమ సంబంధం (direct relation)తో ఉంటుంది. ఇక్కడ అభివృద్ధి అనేది ఒక సమాజం ఆర్థిక, రాజకీయ రంగాలలో సాధించిన ఆభివృద్ధిగా గ్రహించాలి. ఈ అభివృద్ధే ఆధునికతకు చిహ్నం.

అధునికత అంటే 'ఈనాటి సమకాలీనత' అని గ్రహించకూడదు. సమకాలీనమైనప్పటికీ రాజకీయ, ఆర్థిక రంగాలలో అభివృద్ధి సాధించని సమాజాలు ఆధునిక సమాజాలుగా గుర్తింపబడవు. రాజకీయ ఆర్థిక రంగాలలో ఆభివృద్ధి చెందిన సమాజాలే అధునిక సమాజాలు. ఆ సమాజాలు వాడే భాషలే ఆధునికం అయిన భాషలు.

అభివృద్ధిచెందుతున్న సమాజాలు (దేశాలు) అభివృద్ధి చెందిన సమాజాల (దేశాల) పురోగతిని అందుకోవాలని కృషి చేస్తూ ఉంటాయి. అందులో భాగంగా. ఆధునికంకాని తమ భాషలను ఆధునికరించుకోడానికి ప్రయత్నిస్తాయి.

## 1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I ముప్పై పంక్తులలో జవాబులు రాయండి**

(1) భాష ఆధునీకరణ అంటే ఏమిటో వివరించి దాని ఆవశ్యకతని తెలపండి?

(2) భాష ఆధునీకరణ లక్ష్యాలను, అందుకు తోడ్పడే కార్యకలాపాలను వివరించండి?

**II పదిహేను పంక్తులలో జవాబు రాయండి.**

(1) అంతరనువదనీయత అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యం ఏమిటి?

(2)సమాజాభివృద్ధికి భాషాభివృద్ధికి గల సంబంధాన్ని వివరించండి?

BRAOU

# భాగం : 2 భారతీయ భాషల వర్తమాన స్థితి, అభివృద్ధి : సాధారణ సమస్యలు

**విషయక్రమం**


2.0 ఉద్దేశం

2.1 ప్రవేశిక

2.2 భాషల గుర్తింపు

2.3 భాషల అభివృద్ధి, అర్థం, నిర్వచనం

**అభ్యాసం – 1**

2.4 భాషల్లో వచ్చే మార్పులు, సంఘ పరిణామం

**అభ్యాసం – 2**

2.5 భాషలకు ఉన్న పరిమితులు

2.6 భాషల పటిమ

**అభ్యాసం – 3**

2.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు :

- నేటి భారతీయ భాషల పరిస్థితి
- మన భాషలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిమితులు.
- సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గదర్శక సూత్రాలు.

## 2.1 ప్రవేశిక

మన దేశంలో సుమారు 1600 భాషలు మాతృభాషలుగా చెలామణీ అవుతున్నాయి. ఇందులో 400 మాత్రమే లిఖిత భాషలుగా ప్రసిద్ధి కెక్కినవి. అంటే వాటికి లిపి, ఎంతోకొంత లిఖిత సాహిత్య సంపద ఉన్నాయన్న మాట. అయితే ఈ నాలుగు వందల భాషలను ఉపయోగించే ప్రజల సంఖ్యలో చాలా వ్యత్యాసాలున్నాయి. హిందుస్తానీ (హిందీ, ఉర్దూల మిశ్రమం) ఉపయోగించే వారు 25 కోట్లు ఉంటే, మిజోభాష వాడేవాళ్ళు కేవలం కొన్ని లక్షలు మాత్రమే. ఈ భాషల్లో ఇంకా కొన్ని తారతమ్య భేదాలున్నాయి. తెలుగు, తమిళ, కన్నడ భాషలకు చారిత్రాత్మకంగా విస్తృతమైన లిఖితమైన సాహిత్యం ఉంటే, భోజ్‌పురి, తుళు, కొంకిణి భాషల సాహిత్యం చాలా కొద్ది. పైగా ఇటీవలి కాలానివి. కొన్ని భాషల్లో సాహిత్యం లౌకికం, మరికొన్నిటిలో మతానికి పరిమితం. ఈ నాలుగు వందల భాషల్లో మౌలికమైన మరికొన్ని తేడాలున్నాయి.

## 2.2 భాషలు - గుర్తింపు

కొన్ని రాజ్యాంగ నిబద్ధమైన, రాష్ట్ర భాషలుగా వాడుకలో ఉన్నాయి. తెలుగు, హింది, మళయాలం, గుజరాతి వగైరా మరికొన్ని ఏదో ఒక రాష్ట్రంలో ఉప భాషలుగా చెలామణీలో ఉన్నాయి : బీహార్‌లో మైథిలి, మాగధి, భోజ్‌పురి, కర్నాటకలో తుళు, రాజస్థాన్‌లో రాజస్థానీ, ఆంధ్రలో ఉర్దూ వగైరా. ఈ భాషల ఉనికినీ, స్థాయినీ నిర్ణయించడానికి అందరూ అంగీకరించిన ప్రమాణాలు లేవు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో 18 భాషలను జాతీయ భాషలుగా గుర్తించారు. వీటిలో ఎక్కువ భాగం ఏదోఒక రాష్ట్రంలో రాష్ట్ర భాషలుగా ఉన్నవే. మన దేశంలో ప్రాచీన సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అయిన సంస్కృతానికి ఇందులో స్థానం ఇచ్చారు. అది మాట్లాడే జనులు తక్కువైనా, సాహితీ సంపద మూలంగా మిగిలిన భాషలకి స్ఫూర్తిదాత కనుక ఆ నిర్ణయం సముచితమే. అయితే నేపాలీ, సింధి, కొంకిణి, మణిపురిగూడా ఇందులో సభ్యత్వం పొందాయి. అవి వాడే జనులు కొద్దిమందే అయినా, రాజకీయ కారణాల వల్ల వాటిని గుర్తించారు. ఆలిండియా రేడియోలో దాదాపు 40 భాషల కార్యక్రమాలు నడుస్తుంటాయి. సాహిత్య అకాడమి ఇంగ్లీషుతో సహా 22 భాషల్ని గుర్తించింది. మన విద్యా వ్యవస్థలో మాధ్యమంగా (medium)గాని, విషయ ప్రధానంగా (subject)గాని, ముప్పైభాషలు వాడుకలో ఉన్నాయి. ఈ వాడుకలోనూ, ప్రాచుర్యంలోనూ కొన్ని గుణాత్మక (qualitative)మైన వ్యత్యాసాలున్నాయి. అభివృద్ధి చెందిన 13 భాషలు (తెలుగు, తమిళం, కన్నడం, మళయాలం, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, ఉర్దూ, హింది, బెంగాలీ, అస్సామీ, ఒరియా) ప్రతిపత్తిని ఈ కింది ప్రాతిపదికపై నిర్ణయించారు :

1. ఒక రాష్ట్రానికి అధికార భాష
2. విస్తృతమైన సాహిత్యం
3. ప్రసార మాధ్యమాలు దన్ను
4. చిరకాలం నుంచి విద్యావ్యవస్థలో ఒకభాగం
5. కోటి మందికి పైగా వాడుక భాష.

ఆయా ప్రాంతాల్లో ఈ భాషలు బాగా పాదుకుని స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నాయి. అయితే ఏ రాష్ట్రంలోనూ మాతృ భాషగా లేని సింధి, కాశ్మీరీలు ఎనిమిదవ షెడ్యూలులో ఉన్నాయి. మాతృభాష కాకపోయినా కాశ్మీర్‌లో ఉర్దూ అధికార భాషగా గుర్తింపు పొందింది. మన దేశం వైవిధ్యపూరితం కనుక ఇలాంటి అంతర్గత వైరుధ్యాలు(internal

BRAOU

contradictions)సహజమే. ఎనిమిదవ షెడ్యూలులో చేరిస్తే ఒక భాషకి ఒనగూడే సదుపాయాలేమిటి, ఉద్దేశాలేమిటి అనేవి మనం తెల్సుకోవడం అవసరం. భారత దేశంలో ఏ భాషకీ అన్ని ప్రాంతాల్లో నూ ప్రాచుర్యం లేదు. ఇప్పటి వరకు ఇంగ్లీషు అనుసంధాన భాషగా, అధికార భాషగా చెలామణీ అవుతున్నది. అయితే 1950లో ఇంగ్లీషు బదులు హిందీని అధికార భాషగా నిర్ణయించి ఇంగ్లీషును ఉప అధికార భాషగా చేశారు. రాజ్యాంగంలో పదిహేను భాషలను జాతీయ భాషలుగా గుర్తించి ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చారు. ప్రధానమైన ఉద్దేశం ఏమిటంటే, ఇతర భాషల నుంచి పదాలను సంగ్రహించి హిందీనీ ఒక జాతీయ అనుసంధాన భాషగా అభివృద్ధిచేయడం. అంటే link language గా ప్రతి జాతీయ భాషకూ సమాన ప్రతిపత్తి కలిగించడం. అయితే ఆచరణలో ఇవి రెండూ నెరవేర లేదు.

## 2.3 భాషల 'అభివృద్ధి' : అర్థం, నిర్వచనం

ఒక భాషను అభివృద్ధి చెందిన భాష అని ఎలా గుర్తిస్తారు? భాషా శాస్త్ర రీత్యా అన్ని భాషలు సమానమే. ఏ విధమైన సృజనాత్మకమైన భావాన్నైనా ప్రతిభాషలోనూ వ్యక్తీకరించ వచ్చు. అయితే ఆయా భాషల సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ, భౌగోళిక పరిస్థితులనుబట్టి ఒక్కో భాషా ఒక్కో రీతిలో అభివృద్ధిచెందుతుంది. ఉదాహరణకి కొంకిణిభాషను నాలుగు రాష్ట్రాల్లో మాట్లాడతారు. నాలుగు లిపుల్లో రాస్తారు. కనుక దాని విస్తృత వాడకంపైన, సమీకృతి(Consoli-dation) పైన పరిమితులున్నాయి. భిల్లు భాషను మూడు కోట్ల మంది ఉపయోగిస్తారు. కానీ, దానికి లిపి లేదు, లిఖిత సాహిత్యమూ లేదు. తెలుగు మొదలైన భాషలకు రాజకీయంగా ఒక రాష్ట్ర భాషగా గుర్తింపు ఉంది. కానీ సింధీకి అదిలేదు. తమిళసాహిత్యం రెండువేల సంవత్సరాలది. కానీ హిందీ సాహిత్యం వెయ్యేళ్ళ క్రితంనుంచే మొదలైంది. బెంగాలీ భాషలో ముద్రణ మొదట మొదలయింది. ఆ ఊపులో అక్కడ ప్రచురణ, సాహిత్యం, సమాచార మాధ్యమాలు ముఖ్యంగా పత్రికలు వేళ్ళూనుకున్నాయి. కేరళలో అక్షరాస్యత చాలా ఎక్కువ. అందుచేత వార్తా పత్రికలు అక్కడ అతివేగంగా ప్రబలి ప్రజల ఆదరణని పొందాయి. ఇవన్నీ కూడా ఏదో ఒక విధంగా భాష అభివృద్ధి చెందడానికి దోహదపడతాయి. ఆంధ్రలో సినిమా ప్రాచుర్యం ఎక్కువ. కనుక మాండలికాలు వెనుక బడి ఒక ప్రమాణ భాషవ్యాప్తిలోకి వచ్చింది. అలాగే పరిసరాలను బట్టి ఒక్కో భాషలో ఒక్కోరకంగా పదాల ఉత్పత్తి, వాడకం పెరుగుతుంది. ఉదాహరణకి మళయాళంలో 18 రకాల చేపలని విడివిడిగా గుర్తిస్తారు. అవి ప్రజల వాడుకలో ఉన్నాయి. మనకితెలుగులో "rice' అనే ఇంగ్లీషు పదానికి ఐదు రకాల మాటలు ఉన్నాయి. అంటే దైనందిన వ్యవహారంలో అవసరాన్ని బట్టి పద సంపద పెరుగుతుందన్న మాట.

ప్రతి భాషకి ఏదోఒక ప్రత్యేకత ఉంటే కొన్నింటినీ అభివృద్ధిచెందిన భాషలని, మరికొన్నింటిని అభివృద్ధి చెందుతున్న లేదా చెందని భాషలనీ పేర్కొంటారు. ఇదెలా సబబు? ఇవి మనం ఆర్థిక శాస్త్రం నుంచి అరువు తెచ్చుకున్న కొలమానాలు. జీవభాషలకివి వర్తించవు. అయితే, భాషని ఏ పనికి మనం ఉపయోగిస్తున్నాం( Function)? , ఎవరు ఉపయోగిస్తున్నారు? అనే వాటిని బట్టి భాషలలో తరతమ భేదాలేర్పడ్డాయి. సమాజం ఆటవిక దశ నుంచి వ్యవసాయ దశకి, అక్కడి నుంచి క్రమంగా పారిశ్రామిక దశకి, సాంకేతిక దశకి, సేవాదశ(service sector) కి పరిణమిస్తూ వస్తున్నది. ప్రతి దశలోనూ మానవుడికి అవసరమైన పదజాలాన్ని, సాంస్కృతిక తృప్తిని ఆయా భాషలు సమకూరుస్తున్నాయి. ఉదాహరణకి అడవిలో నివసిస్తూ, అడవిలో దొరికే ప్రకృతి సంపదమీద ఆధారపడే కోయ ప్రజలకు వారి కోయ భాష అన్ని అవసరాల్నీ తీరుస్తుంది. అలాగే బుడంపాడులో పుట్టి పెరిగి కేవలం వ్యవసాయాధారంగా బ్రతికే గ్రామీణ ప్రజలకు తెలుగు భాషచాలు. అలాగే న్యూయార్క్‌లో సాంకేతిక రంగంలో పనిచేస్తుంటే అక్కడ ఇంగ్లీషు అవసరం. ఆయా రంగాలలో ఉండే వారివారి భాషలు వాళ్ళకు నిండుగా ఉపయోగిస్తాయి. అయితే, సాంఘిక పరిణామంలో, ఉధృతంగా వచ్చే ఆర్థిక మార్పుల్లో ఏ జీవీ ఏ రంగానికీ పరిమితమై ఉండటం లేదు. ప్రచార సాధనాలు, విద్యావ్యాప్తి, సాంకేతిక ప్రాబల్యం పెరుగుతున్న నేటి సమాజంలో వృత్తులు మారుతున్నాయి, ప్రజల్లో వలస (Mobility) పెరిగింది, సుఖాపేక్ష ఎక్కువయింది. ఈ మార్పుల

BRAOU

కారణంగా భాషకూడా మార్పు చెందుతుంది. అయితే ఒక్కోసారి ఈ మార్పులు సంఘంలో ముందు జరుగుతాయి. అప్పుడు భాష ఈ మార్పులకు అనుగుణంగా వేగం అందుకోలేదు. అందుకే భాషల్లో ఇందాకా చెప్పిన తరతమ భేదాలు ఉత్పన్నం అవుతున్నాయి. భాషలో తేడాలు ప్రయోజనత్వానికి(Functionality) కి సంబంధించినవే గానీ భాషా నిర్మాణానికి సంబంధించినవి కావు. కోయమనిషి ఉన్నత విద్యను అభ్యసించాలన్నా, బుడంపాడు రైతు బిడ్డ ఉద్యోగం కావాలన్నా, నగర వాసి విదేశీ వ్యాపకాలకి వెళ్ళాలన్నా, వారి వారి భాషల్లో ఉన్న పరిమితులు అడ్డు వస్తాయి. దీని అర్థం ఏమిటంటే 'అభివృద్ధి' అనేది భాషకి సంబంధించినది కాదు. మనిషి వ్యాపకాలకు సంబంధించినది. అంటే ఆశిస్తున్న మార్పులకు తన భాష అనే సాధనాన్ని భౌతిక ప్రయోజనాలకి ఉపయోగించగలగాలి. భావ వ్యక్తీకరణ పెరగాలి. దానికి తగిన సాధన సంపత్తిని భాషలో ఏర్పర్చుకోవాలి. ఇది తన భాషలోని సాధ్యంకానప్పుడు మరో భాష ( అంటే మరో పనిముట్టు) ని ఉపయోగించాలి. ఈ సందర్భంలోనే 'భాషాభివృద్ధి' అనే సమస్య మనకు కనిపిస్తుంది.

**అభ్యాసం - 1**

భాషాభివృద్ధి అవశ్యకతను తెల్పండి?

## 2.4 భాషల్లో వచ్చే మార్పులు, సంఘ పరిణామం

BRAOU

ఆర్థిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా భాషలో మార్పులు రావాలి; భాష వాడుకలో మార్పులు రావాలి. వేయ్యేళ్ళ క్రితం ఇంగ్లీషు భాష, ఏరకంగా ఉండేదో పరిశీలిద్దాం. ఎందుకంటే ఆ దశలో అన్నీ రాచరికంలో, వ్యవసాయ దశలో ఉన్న దేశాలే. సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి ఒకే దశలో ఉన్నాయి కనుక అయా భాషలు వారి వారి అవసరాలకు సరిపోయాయి. అయితే 13వ శతాబ్దంలో వచ్చిన గూటెన్ బెర్గ్ విప్లవం(printing press), 17వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం ప్రపంచ చరిత్రనే మార్చి వేశాయి. ఈ రెండింటికి పుట్టినిల్లు యూరప్. కనుక ఆ ప్రాంతంలోని భాషలన్నీ ఒకే రకంగా ప్రభావితం అయాయి. వస్తున్న మార్పులకు అనుగుణంగా భాషల్లో మార్పులు వచ్చాయి. భిన్న ప్రయోజనాలకు(functions) భాషలని ఉపయోగించ వలసిన అవసరం ఏర్పడింది. కొత్త పదజాలం, పలుకుబళ్ళ , వ్యాపక ప్రక్రియలు అవసరమయ్యాయి. అవసరానికి తగ్గట్టుగా ఆ భాషా పండితులు, పామరులూ భాషలని నవ్యమార్గాల్లో నడిపించారు. వాటిని ఈ కింది పద్ధతిలో అనుసరించారు :

1. పాత మాటలనే కొత్త అర్థాలకు అన్వయం చేసుకోవడం (market, yeild, export, money etc- సామాన్యార్థాల్లోంచి సాంకేతిక అర్థాలు ప్రచారమయ్యాయి). కొత్త వ్యాకరణ ప్రయోగాలు (handle - handle) భాషలో ప్రవేశించాయి.
2. సాంకేతిక పద సృష్టిని ప్రాచీన భాషల నుంచి అరువు తెచ్చుకోవడం.
3. కొత్త సాహిత్య ప్రకియలను సృష్టించడం ( నవల, డైరీ, పత్రికా రచన, వ్యాసం మొదలైనవి ).

యూరోపియన్ దేశాల్లో సాంకేతిక, పారిశ్రామికాభివృద్ధులు, భాషభివృద్ధీ చేదోడు, వాదోడుగా జరిగాయి. అంటే ఇతర రంగాల్లో జరుగుతున్న మార్పుల కనుగుణంగా భాషలో గూడా అదే వేగంలో మార్పులు జరుగుతున్నాయి. కనుక ఆ ప్రజలకి పెద్ద ఇబ్బందేమీ కలుగలేదు. భాషలో విప్లవం నిదానంగా అప్రయత్నంగా అప్రకటితంగా, గుంభనగా జరిగింది. అదే సమయంలో అక్షరాస్యత గూడా క్రమేణా పెరుగుతూ వచ్చింది. వాడుక భాషకీ, గ్రంథస్థ భాషకీ పెద్ద తేడా లేకపోవటంతో అవగాహన సులువైంది. ప్రాచుర్యం వేగం అందుకొంది. కనుక పెద్ద సమస్యలేవీ ఉత్పన్నం కాలేదు. అయితే, మనకి ఇవి సమస్యలయి కూర్చున్నాయి. ఎందుకు? ఒక్క మాటలో చెప్పాలంటే మనం ఒక సామాజిక, ఆర్థిక దశ నుంచి మరో దానికి ఒక్క ఉమ్మడిగా గెంతువెయ్యాలనుకుంటున్నాం. ఆటవికులు వ్యవసాయ దశకు, వ్యవసాయ వర్గాలు నాగరిక జీవనా(urbanisation)నికి, నాగరికులు సేవా రంగానికి(service sector), సేవా రంగస్థులు విదేశాలకీ ఒక తరంలోనే మారాలని తీర్మానించుకోవటంతో భాష, దాని వాడుక మనకి సమస్యలయినాయి. మనం వాడే భాషల పరిమితులు మనకి అడ్డంకి అయి కూర్చున్నాయి. పూర్తిగా మాతృభాష రాకుండానే ఇంగ్లీషులో ఈల వెయ్యాలనే తపన మొదలయింది. దరిమిలా రెంటికీ చెడిన రేవళ్ళు తయారవుతున్నారు. సాంకేతిక విద్య, పారిశ్రామిక విజ్ఞానం మనకి ఇంగ్లీషులో విస్తారంగా లభ్యమవుతుంది. దాన్ని మనం అనువాదమైనా చేసుకోవాలి లేదా ఆ భాష నేర్చుకోవాలి. మనం 300 సంవత్సరాల ప్రగతిని ఒక్క గంతులో అందుకోవాలని ప్రయత్నిస్తున్నాం. లభ్యమయ్యే సాహిత్యాన్నంతా అనువాదం చేయటానికి సమయం లేదు. పైగా పాశ్చాత్య దేశాల్లో సాంకేతిక విజ్ఞానం ప్రతి సంవత్సరం రెట్టింపవుతున్నది. మనం భాషని ఒక పనిముట్టుగా కాక, ఒక నినాదంగా చూస్తున్నాం. మాతృభాషని వదిలి పరాయి భాషని నేర్చుకోవటం నేల విడిచి సాము. ఈ కసరత్తులో మనకి రెండూ సరిగా అబ్బటం లేదు. అట్లా అని దేన్నీ విడనాడగలిగే స్థితిలోనూ లేము. ఇది మన ప్రధానమైన సమస్య.

**అభ్యాసం – 2**

సమాజంలోని మార్పులకీ భాషలలో మార్పులకీ సంబంధాన్ని వివరించండి.

BRAOU

## 2.5 భాషలకి ఉన్న పరిమితులు

మన భాషల్లో గొప్ప సాహిత్యం ఉంది. వాటికి సాంప్రదాయికంగా వస్తున్న చరిత్ర ఉంది. ప్రస్తుతం అన్ని భాషలనీ – అంటే ప్రధానమైన 13 భాషలనీ – అన్ని ప్రయోజనాలకీ ఉపయోగిస్తున్నాం. అన్నీ గుర్తింపబడిన రాష్ట్ర అధికార భాషలు. అన్నిటిలోనూ విద్య నేర్పే అవకాశం ఉంది. ప్రసార మాధ్యమాల్లో మన భాషలని విరివిగా విస్తృతంగా ఉపయోగిస్తున్నాం. అందుకు కొన్ని కారణాలున్నాయి . అవి :

1. బహుభాషలు ఉండటం, ఒకదానిలో జరిగే పరిణామాలు మరో భాషల వారికి తెలియక పోవటం.

2. వీటన్నింటినీ విడనాడి ఒక్క హిందీనే జాతీయ భాషగా, అనుసంధాన భాషగా చెయ్యాలనుకోవటం.

3. సృజనాత్మక మైన మౌలికమైన పరిశోధన దేశ భాషల్లో జరగక పోవటం. ఇప్పటికీ అన్ని విషయాల (Subjects, disciplines)మీద మంచి పుస్తకాలు ఇంగ్లీషులోనే రాస్తున్నారు. భాషా సాహిత్యాల మీద గూడా ప్రమాణ గ్రంథాలు ఇంగ్లీషులోనే లభ్యమవుతున్నాయి.

4. దేశీయ భాషల్లో ఉన్నత విద్యా బోధన, పరిశోధన జరగక పోవటం.

5. ప్రాథమిక విద్య ఇంకా విస్తరించక పోవటం వలన అక్షరాస్యత పెరగడం లేదు. ప్రస్తుతం 56% అక్షరాస్యులైనా ఈ సంఖ్య అస్తవ్యస్తంగా ఉంది. అంటే కొన్ని వర్గాల్లో, ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటం మరి కొన్ని చోట్ల చాలా తక్కువగా ఉండటం. ఉదాహరణకి చండీగఢ్‌లో 90% అక్షరాస్యులైతే, రాజస్థాన్‌లోని గిరిజన మహిళల్లో ఇది కేవలం 6% మాత్రమే. అంచేత ఆయా భాషల్లో లభ్యమయ్యే సాహిత్య సంపద, ప్రయోజనాత్మకమైన వాడుక (functional utility) అందరికీ అందుబాటులోలేదు.

6. ఒక్కో విషయం (disciplines)లో నిష్ణాతులైన బుద్ధి జనులు( intellectuals) తమ మాతృ భాషలని పరిత్యజించి ఇంగ్లీషులోనే కృషి చేయటం వల్ల మాతృభాషల్లో అందరికీ సులభంగా ఉండే నుడికారం, పారిభాషిక పద సంపత్తి పెరగటం లేదు.

7. ప్రాచీన భారత దేశం అన్ని రంగాల్లోనూ అత్యున్నత స్థానంలో ఉండేది. వైద్యం, వాస్తు, వ్యాకరణం, ఇంజనీరింగ్, ఖగోళ శాస్త్రం, గణితం మొదలైన విభాగాల్లో ఆనాడు ఇతర దేశాలకంటే పురోగతి సాధించాం. అయితే మన దేశంలో జ్ఞానం గుప్తం కావడం వలన, దేశ దండయాత్రల వల్ల, ఆత్మముగ్ధత్వం వంటి సాంస్కృతిక కారణాల వల్ల శాస్త్ర పురోగతికి తీరని గండి పడింది. గడిచిన 500 సంవత్సరాలు మన దేశపు బుద్ధి జీవనాని (Intellectual Life)కి చీకటి పర్వం. మాతృభాషల్లో కృషి సన్నగిల్లింది. భాషా వికాసం అడుగంటింది.

8. అనేక రాష్ట్రాల్లో భారతీయ భాషలకి సముచిత ప్రాధాన్యం, ప్రాపకం, విస్తృతమైన వాడుక ఉన్నాకూడా కింది నుంచి పైదాకా ఇంగ్లీషు భాష మీద ఉన్న వ్యామోహం వల్ల, మాతృభాషా బోధన వ్యూహం నిర్మాణాత్మకంగా లేదు.

9. భారతీయ భాషల లిపులు టైపింగ్ వగైరా యాంత్రిక సదుపాయాలకి సులువుగా లొంగక పోవటం మరో కారణం. ఇంకోరకంగా చెబితే జరిగిన సాంకేతికాభివృద్ధి మన భాషల, లిపుల ఆధారంగా జరక్క పోవడం. ఒక ఉత్తరం గానీ, వ్యాసంగానీ, పుస్తకంగానీ ఇంగ్లీషులో టైపు చేయించడం, ముద్రించడం సులువవుతున్నది. అంతేకాదు, త్వరితంగా అవుతున్నది. ఇప్పటికీ రచయితలు కలం, కాగితాలను ఉపయోగించి రాయవలసి వస్తున్నది. ఇది అప్రమేయమైన ప్రతిబంధకం కాకపోయినా, స్వతాహాగా సోమరులైన బుద్ధి జీవులకు నిరుత్సాహం కలిగిస్తున్నది. ఈ రోజుల్లో కంప్యూటర్లు వచ్చినా అవి అందరికీ అందుబాటులో లేవు. పైగా మోపెడు ఖర్చు.

10. ప్రామాణికమైన సాంకేతిక భాష మాతృభాషల్లో ఇంకా ఏర్పడలేదు. అన్ని రాష్ట్రాల్లో కంటే మన ఆంధ్రప్రదేశ్ ఒక రకంగా ఈ విషయంలో ముందడుగు వేసింది. తెలుగు అకాడమి ఈ దిశగా కొంత మెచ్చుకోదగిన కృషిచేసింది, చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటుని సద్వినియోగం చేసుకుని అనేక విషయాల్లో (disciplines) ప్రామాణిక గ్రంథాలు తయారు చేసింది. ఈ కృషి గణనీయమే అయినా, తగినంతగా లేదు. ఎందుకంటే ప్రతిభ ఉన్న శాస్త్రకారులు తెలుగులో రాయటానికి తగిన సంఖ్యలో ముందుకు రాక పోవటం, ప్రభుత్వం ఇటీవల కాలంలో తగిన ఆర్థిక సహాయం అందించక పోవటం ఇందుకు కారణాలు.

BRAOU

## 2.6 భాషల పటిమ

మన భాషల పురోభివృద్ధికి ఆటంకాలని కొన్నింటిని మాత్రమే పైన స్థూలంగా వివులీకరించాము. వాటికి విరుగుడు కనిపెట్టడమే ప్రస్తుతం మేధావులు కర్తవ్యం. భాషల్లో సృజనాత్మక కృషి గురించి, వివిధ రంగాలలో వ్యాపకం గురించి, అక్షరాస్యత పెరగవలసిన అవసరం గురించి ముందే క్లుప్తంగా తరచి చూడటం జరిగింది. ఈ విభాగంలో భాషాభివృద్ధి గురించిన కొన్ని బాహ్యాభ్యంతర భావనలు (internal and external concepts) గురించి మాట్లాడుకుందాం. భాషకి కావలసింది విస్తృతమైన వాడుకే కాకుండా, ఒరవడి పెట్టగల పటిమ(vitility)కూడా కావాలి. ఈ పటిమని గుర్తించాలంటే ఈ కింది కొలబద్దలు (parameters) అవసరం :

1. అందరికీ లేదా పలువురికి ఆమోదయోగ్యమైన ప్రామాణికత. (acceptable standard)
2. మాండలిక లేదా ప్రాచీన శైలుల నుండి వనరుల తవ్వకం(exploitation of ancient or regional styles)
3. సాధికారంగా ప్రాచుర్యంలోకి తేగలిగిన బుధవర్గం (intellectual class)
4. అధునాతన యాంత్రిక సదుపాయాలు
5. సమాచార, ప్రచార మాధ్యమాలు. – ముఖ్యంగా వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్.
6. ఈ రంగా ల్లో పనిచేసే విశ్వవిద్యాలయాలకి, పరిశోధనా సంస్థలకి దండిగా ప్రభుత్వం ఆర్థిక సహాయం, సహకారం.
7. బోధనా భాషగా ప్రాంతీయ/ మాతృభాషను విస్తృతంగా వినియోగించటం.
8. సాంకేతిక పదాలను విరివిగా (Frequency), వైవిధ్యంగా ఉపయోగించి అందరికీ అందుబాటులోకి తేగలిగిన సాధన సామగ్రి (infrastructure), వివిధ రంగాల్లో, వివిధ భాషల్లో పాండిత్యమున్న బుద్ధిజనులు విరివిగా తెలుగులో రాయాలి. ఇందులో మన రాష్ట్రంలో తగిన కృషి జరగడం లేదు. ప్రభుత్వ సహాయం మృగ్యం. అధికార భాషా సంఘం ఉన్నా దాని లక్ష్యాలలో స్పష్టత లేదు. అది సాధించిన ప్రయోజనం శూన్యం. తెలుగు భాషని కంప్యూటీకరణ చేయాల్సిన అదును వచ్చింది. అవసరం ఉంది. దీనికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తగిన వనరులు కూర్చ వలసిన అవసరం ఎంతైనా ఉంది. విశ్వవిద్యాలయాలకి తెలుగు సాఫ్ట్‌వేర్, పి.సి.లు(personal computers)సరఫరా చేసి వాటికి అవసరమైన మనుషులకు సరైన సాంకేతిక శిక్షణ ఇవ్వాలి. నవీన యుగంలో వస్తున్న సాంకేతిక విప్లవానికి – మరీ ముఖ్యంగా కంప్యూటరు విప్లవానికి – అనుగుణంగా మనం ఎదగాలి. దీనికి ప్రభుత్వమే చొరవతీసుకుని ముందుకు రావాలి. ఇంకో ముఖ్యమైన అంశం ఏమంటే భాషని సృజనకి ఉపయోగించటం, భాషని పనిముట్టుగా ఉపయోగించుకోవటంలోని వ్యత్యాసాన్ని మన ప్రజలు గ్రహించాల్సిన అవసరం ఉంది.

**అభ్యాసం – 3**

భాషా పటిమను కొలవటానికి కొలమానాలను విశ్లేషించండి



Dr. BRAOU LIBRARY
Acc. No. 115093
Class No. 659.2 PRA
BRAOU

## 2.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- మన దేశంలో 1600ల భాషలున్నాయి. వాటిలో 400 వందలు లిఖిత భాషలు.
- రాజ్యాంగంలో 18 భాషల్ని జాతీయ భాషలుగా గుర్తించారు.
- సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితులను బట్టి అక్కడ భాషాభివృద్ధి ఉంటుంది.
- సమాజంలో మార్పులకనుగుణంగా భాషల్లో మార్పులొస్తాయి.
- భాషల పురోభివృద్ధికి కొన్ని పరిమితులున్నాయి. వాటిని అధిగమించేందుకు భాషకి విస్తృతమైన వాడుకే కాకుండా, ఒరవడి పెట్టగల పటిమ కూడా కావాలి.

## 2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. భారత దేశంలోని భాషల వర్తమాన స్థితిగతుల్ని వివరించండి
2. భాషల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న అంశాలను పేర్కొనండి

**II. 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. భాషల అభివృద్ధి అంటే ఏమిటో వివరించండి
2. భాషలకు ఒరవడి పెట్టే అంశాలను గురించి వివరించండి

BRAOU

## భాగం : 3 భాష ఆధునీకరణలో ప్రసారసాధనాల పాత్ర

**విషయక్రమం**


3.0. ఉద్దేశం

3.1. ప్రవేశిక

3.2 భాష ఆధునీకరణలో ప్రసార సాధనాల కృషి

**అభ్యాసం -1**

3.3 ప్రాంతీయ భాషా సాహిత్యాల్లో కొత్త ప్రక్రియల ఆవిర్భావం, వికాసం

**అభ్యాసం -2**

3.4 ఆధునిక ప్రమాణ భాష వ్యాప్తి

**అభ్యాసం -3**

3.5 కొత్త భావనల వ్యాప్తి, కొత్త పదాల సృష్టి, విస్తరణ

**అభ్యాసం -4**

3.6 శైలీ భేదాలు, ప్రయోగవ్యాప్తి

**అభ్యాసం -5**

3.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

3.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 3.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు కింది విషయాలను చర్చించగలుగుతారు :

- ప్రాంతీయ భాష సాహిత్యాల్లో కొత్త ప్రక్రియ ఆవిర్భావం, వికాసం
- అధునిక ప్రమాణ భాషా వ్యాప్తి
- కొత్త భావనల వ్యాప్తి, కొత్త పదాల సృష్టి, విస్తరణ
- శైలీ భేదాలు ప్రయోగ వ్యాప్తి

## 3.1 ప్రవేశిక

ఈ ఖండం మొదటి భాగంలో మీరు ఆధునీకతకూ అభివృద్ధికీ గల సంబంధాన్ని గురించి తెలుసుకున్నారు. భాషను ఎందుకు ఆధునీకరించాలి? భాష ఆధునీకరణ లక్ష్యాలేమిటి? అనే అంశాలతో పాటు, భాష ఆధునీకరణకు తోడ్పడే ప్రధాన కార్యకలాపాలను గురించి కూడా మీరు తెలుసుకున్నారు. పారిశ్రామికీకరణను పొంది లౌకిక సమాజాలుగా అభివృద్ధి చెందిన ఆధునిక సమాజాల భాషలతో ఒకానొక సాంప్రదాయకమైన భాష అంతరవదనీయత (inter translatability)ను సాధించడమే భాష ఆధునీకరణ అని మనం మొదటి భాగంలో నిర్వచించుకున్నాం. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే అభివృద్ధి చెందిన ఒక సమాజ భాష వ్యక్తం చేయగల అంశాలన్నింటినీ, మరొక అభివృద్ధి చెందుతున్న భాష సులభంగాను, సూటిగానూ వ్యక్తం చేయగల స్థితిని సాధించడమన్నమాట. రెండవ భాగంలో భారతీయ భాషల అభివృద్ధి స్థితి గతులను గురించి తెలుసుకున్నారు. ఈ భాగంలో భాష ఆధునీకరణలో ప్రసార సాధనాలు నిర్వహించగలిగిన పాత్రను చర్చించుకుందాం.




BRAOU

పై పట్టికను బట్టి భాషా ప్రయోగ రంగాలకూ, ప్రసార సాధన వ్యవస్థకూ మధ్యగల సంబంధం మనకు తెలుస్తోంది. ఈనాటి ప్రసార సాధనాలు సమాచార ప్రసారానికీ, విజ్ఞాన వ్యాప్తికీ అటు మాట్లాడే భాషనూ, ఇటు రాసే భాషనూ వినియోగించుకుంటున్నాయి. వాటిని ప్రభావితం చేస్తున్నాయి. శ్రవ్య, దృశ్య, మాధ్యమాలైన రేడియో, ఆడియో, టి.వి., వీడియో, సినిమా, ఉపగ్రహ ప్రసారంవంటి ప్రసార మాధ్యమాలు మాట్లాడే భాషను వినియోగించుకుంటున్నాయి. పుస్తకాలు, పత్రికలు, కంప్యూటర్లు రాసే భాషను వాడుకుంటున్నాయి. ఈ మాధ్యమాల ద్వారా జరిగే భావ ప్రసారం భాషద్వారానే జరుగుతుంది. కాబట్టి ఆ భాషకు శ్రోతలు, ప్రేక్షకులు, పాఠకులు అయిన కోట్లాది ప్రజల భాషా మర్యాదలను ఈ మాధ్యమాలు దిద్ది తీర్చడానికి అవకాశముంది.

## 3.2 భాష ఆధునీకరణలో ప్రసారసాధనాలకృషి

భారత దేశంలోని ప్రాంతీయ భాషలకు వందలాది ఏండ్ల సాహిత్య సంప్రదాయముంది. ఈ సాహిత్య సంప్రదాయం ప్రధానంగా కవిత్వ సాంప్రదాయానికి సంబంధించిందే. శాసన సాహిత్యంలోనూ, పరిమితంగా కనిపించే వచన గ్రంథాల్లోనూ వచనండున్నప్పటికీ ఆధునిక వచన వ్యాప్తి ఆధునిక యుగంలోని ప్రసార సాధనాల వల్లనే సాధ్యమయింది. 180 ఏళ్ల చరిత్ర గలిగిన వార్తా పత్రికలూ, ఏడు దశాబ్దాల చరిత్ర గలిగిన రేడియోలూ, ఆరు దశాబ్దాల చరిత్రగలిగిన సినిమాలూ, రమారమి అయిదు దశాబ్దాల చరిత్ర గలిగిన టెలివిజన్, రెండు దశాబ్దాలపై చరిత్ర గలిగిన ఉప గ్రహ ప్రసార వ్యవస్థా ఆధునిక వచనాభివృద్ధికి ఎంతో దోహదం చేశాయి.

భాషాభివృద్ధిలోనూ, భాష ఆధునీకరణలోనూ ప్రసార సాధనాలు నిర్వహించిన పాత్రను కొన్ని అంశాలు ఆధారంగా మనం గమనించ వచ్చు.

**అభ్యాసం -1**

ఆధునిక వచన వ్యాప్తికి దోహదపడిన అంశాలని వివరించండి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 3.3 ప్రాంతీయ భాషా సాహిత్యాల్లో కొత్త ప్రక్రియల ఆవిర్భావం, వికాసం

BRAOU

సృజనాత్మక సాహిత్య రంగాల్లో ఖండకావ్యం, వచన కవిత, కార్టూన్ కవిత, మినీ కవిత వంటి రూపాలూ, నవల, కథానిక, నాటకం, నాటిక, వ్యాసం, మ్యూజింగ్స్, లేఖా రచన, దినచర్య, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర, గల్పిక, కార్డుకథ, శ్రవ్య రూపకం, దృశ్యరూపకం వంటి రూపాలు వికసించాయి. సృజనేతర రంగంలో పత్రికా రచన ప్రముఖ స్థానం వహించింది. వివిధ వార్తా భేదాలు, కథనాలు, వ్యాసాలు, సంపాదకీయాలు వ్యాప్తి చెందాయి. రేడియో, ఆడియో, టెలివిజన్, వీడియోలలో, డాక్యుమెంటరీలు, వాణిజ్య ప్రకటనలు, చర్చలు, రూపకాలు అభివృద్ధి చెందాయి. సినిమా రంగంలో కథాచిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సమాచార చిత్రాలు, వాణిజ్య ప్రకటనలు పెద్ద ఎత్తున ఉత్పత్తి అయ్యాయి. ప్రసార సాధనాలన్నీ పరిపాలనకూ, బోధనకూ, పరిశోధనకూ నిర్ణీత ప్రయోజనాలకూ అవసరమైన సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తికి తెచ్చాయి.

**అభ్యాసం -2**

సృజనాత్మక, సృజనేతర రంగాల్లో ఆధునిక వచన వికాసాన్ని సమీక్షించండి.

______________________________

______________________________

______________________________

______________________________

## 3.4 ఆధునిక ప్రమాణ భాష, వ్యాప్తి

ప్రాచీన భాషా సమాజాల్లో భాషా సందర్భాలు పరిమితం. లిఖిత వ్యవస్థ ఉన్న భాషల్లో అయినా ఈ సందర్భాలు పరిమితమే. వీటని అప్పటి భాషా భేదాలను బట్టి సామాన్య భాష, సాహిత్య భాష అని విభజించ వచ్చు. సాహిత్య భాష, సాహిత్యాభిమానులైన కొందరికే పరిమితం. సామాన్య భాషల్లో మళ్లీ మాండలిక భేదాలుంటాయి. నిత్య వ్యవహారం ఈ మాండలికాలలోనే జరుగుతుంది.

ఆధునిక సమాజాన్ని ప్రజాస్వామ్య సమాజం అంటున్నాం. ఆధునిక సమాజంలో పరిపాలన, విద్య, సాంకేతికాది వివిధ రంగాల్లో ఎక్కువ మంది పాల్గొంటున్నారు. ప్రత్యక్ష పాత్రలేని వారికి కూడా వీటితో సంబంధం అవసరం అవుతుంది. ఇట్లాంటి అవసరాల కోసం మాండలికాతీతమైన, సృజనేతర సామాన్య భాష ఒకటి అవసరం అవుతుంది. దీన్నే ప్రామాణిక భాష అంటారు అని మీరు తెలుసుకున్నారు.

ప్రామాణిక భాష ప్రారంభంలో ఏదో ఒక మాండలిక భాషపైన ఆధారపడ్డా, కొద్దికాలంలో అన్ని ప్రాంతాలకు విస్తరించి అందరి ఆమోదాన్ని పొందుతుంది. ఏ మాండలికానికి పరిమితంకాదు. ప్రమాణ భాష మాండలికాతీతమైనది. అన్ని మాండలికాల నుంచి ప్రమాణ భాషలో ఎప్పుడైనా కొత్త పదాలు చేరవచ్చు. అందిరికీ ఆమోదయోగ్యం అవుతుంది. కాబట్టి ఇది ప్రామాణిక భాష అయింది. ప్రామాణిక భాష అందరికీ అవసరమైనది. అందరూ అంగీకరించేది.

ప్రామాణిక భాషా వ్యాప్తికీ సృజనకూ పాఠ్యగ్రంథాలు, పత్రికా రచన, విద్యాబోధ, పత్రికా పఠనం ప్రధాన కారణాలు. చాలాకాలంనుంచి తెలుగు మాధ్యమంలో పాఠ్య గ్రంథాల రచన జరుగుతూ ఉంది. వివిధ వార్తలు, విజ్ఞానం ప్రజలకందించే పనిని పత్రికలు చేస్తుండటం వల్ల పత్రికల ద్వారా ప్రామాణిక భాష వ్యాప్తి చెందుతుంది. ఈనాటి ప్రామాణిక భాష ప్రధానంగా పత్రికా రచనలో తయారవుతూ, నిత్యవ్యాప్తి చెందుతుండటం గమనించ వచ్చు. అంతేకాక సాంకేతిక విజ్ఞానాన్ని సామాన్యులకందించే ప్రయత్నంలో పత్రికలు నూత్న పదసృష్టిని ఎక్కువగా చేస్తుంటాయి. వివిధ శాస్త్రాలకనుగుణంగా భాషా ప్రయోగాన్ని సిద్ధం చేస్తున్నాయి.

BRAOU

ఈ రకంగా ఏర్పడుతున్న ప్రామాణిక భాషకు, రేడియో, టెలివిజన్లు మరింత వ్యాప్తి కలిగిస్తున్నాయి. పత్రికలు,పుస్తకాలు అక్షరాస్యులకే పరిమితం. రేడియో, టెలివిజన్‌లు చదువురాని వారికి కూడా అందుబాటులో ఉంటాయి. ఇటీవల ప్రాంతీయ భాషల్లో ఛానల్స్ పెరిగాయి. ఇవి వివిధ విజ్ఞాన, వినోద, విద్యాకార్యక్రమాలను విస్తారంగా ప్రసారంచేయటం వల్ల ఇవాళ అందరికీ అర్థమయ్యే, అనేకవసరాలకు పనికొచ్చే ప్రామాణిక భాష ఏర్పడుతున్నది. ఈ ప్రామాణిక భాష లక్షణ నిరూపణ చేయటం ఒక్కటే మిగిలి ఉన్నది. పూనుకోవాలే. కానీ అది ఏమంత కష్టమైన పనికాదు.

**అభ్యాసం -3**

ప్రామాణిక భాషా వ్యాప్తికి దోహదపడుతున్న అంశాలేమిటి?

---

---

---

---

## 3.5 కొత్త భావనల వ్యాప్తి, కొత్తపదాల సృష్టి, విస్తరణ

భాష ఆధునీకరణలో అత్యంత ముఖ్యపాత్ర నిర్వహించేది కొత్తభావనల కనుగుణమైన కొత్త పదాల సృజన, వ్యాప్తి. భావనలు ఆయా శాస్త్రాలలో, రంగాలలో పరిశోధనల వల్ల, ప్రయోగాల వల్ల కొత్త వస్తువుల, ఆలోచనల ఉత్పత్తి వల్ల ఏర్పడతాయి. ఇవి స్వదేశంలో, స్వభాషా సమాజాల్లో ఏర్పడవచ్చు. లేదా పరభాషా సమాజాల్లో, పరదేశాల్లో ఏర్పడవచ్చు. ఇటీవల ఇంగ్లీషు భాష ద్వారా పారిశ్రామిక సంస్కృతికి సంబంధించిన కొత్త భావనలు విరివిగా భారతీయ భాషల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇట్లా ప్రవేశించిన భావనలతో పాటు పదాలు కూడా భాషల్లో ప్రవేశించడం సహజం. అయితే ఎప్పుడూ పరభాషా పదాలనే వాడుకుంటూ ఉండటం సాధ్యపడదు. అట్లా వాడుతుంటే స్వభాషలో ప్రత్యయాలు మాత్రమే మిగిలి, పదాలు మాయమవుతాయి. అందువల్ల కొత్త భావనలకు కొత్త పదాల సృష్టి ఎప్పుడూ జరుగుతుంది. ప్రత్యయాదులు చేర్చడం వల్లా, కొన్ని పదాలు కలిపి సమాసాలు చేయడం ద్వారాను కొత్త పదాలు ఏర్పడతాయి.

పాఠ్య గ్రంథాల ద్వారా శాస్త్ర సాంకేతిక పదాలు తెలుగులో ఈ శతాబ్ది ప్రారంభం నుంచి ఏర్పడుతున్నాయి. ఇటీవలి కాలంలో పత్రికల సంఖ్య పెరగటం వల్ల, నూత్న పదసృష్టి పత్రికల ద్వారా ఎక్కువగా జరుగుతున్నది. ముఖ్యంగా రాజకీయ, ఆర్థిక, పాలనా రంగాలలో ఈ పదసృష్టి అత్యధికంగా జరుగుతున్నది. ఈ పదాలను క్రోడీకరించి కొన్ని నిఘంటువులు కూడా వచ్చాయి. ఈనాడు పదకోశం, తెలుగు విశ్వవిద్యాలయం వారి పత్రికా భాష నిఘంటువు, విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించిన పత్రికా రచయితల పదకోశం, వార్త పలుకుబడి ఈ రకమైన పదసృష్టికి నిదర్శనాలు. ఈ సృష్టి ఇంకా విస్తృత స్థాయిలో జరగాలి.

భారతీయ భాషల నుంచి, ఇంగ్లీషునుంచి చాలా పదాలను ఈనాడు ఎరవు తెచ్చుకుంటున్నాము. ప్రసార సాధనాల ద్వారా ఈ పదాలు అనేకం వ్యాప్తికి వచ్చాయి. ఉదాహరణకు బంద్, రాస్తారోకో, ఆయారాం, గయారాం, పార్కులాం, లాకౌట్, కంప్యూటర్, రిట్, ధర్నా మొదలైనవి. అన్యభాషా పదాలను కలిపిన మిశ్ర సమాసాలు కూడా అనేకం వ్యాప్తిలోకి వచ్చాయి. ఉదాహరణకు రిట్ దాఖలు, ప్రపంచ బ్యాంకు, ఫ్యూడల్ వ్యవస్థ, రేడియో ప్రసంగం, షేర్ మార్కెట్, కస్టమ్స్, సుంకం, ఎలక్ట్రానిక్ పరికరాలు, బంగారు, మార్కెట్ మొదలైనవి.

కొత్త పదాల, పద నిర్మాణాల రూపకల్పనలో ప్రముఖంగా ప్రతిదేయ అనువాదాలు. (loan translation) అనుసరణ పదాలు (adaptive coinages), వివరణాత్మక పదాలు, అర్థ విస్తృతి ఏర్పరచిన పదాలు నుడికారాలు మొదలైనవి కనిపిస్తాయి.

కింది ఉదాహరణలు గమనించండి:

**ప్రతిదేయ అనువాద పదాలు**

| | |
|---|---|
| black money | నల్లధనం |
| balanced diet | సమతులాహారం |
| population explotion- | జన విస్ఫోటనం |
| green revolution | హరిత విప్లవం |

**అనుసరణ పదాలు**

| | |
|---|---|
| Industry | పరిశ్రమ |

BRAOU

sobatage — విద్రోహక చర్య
hostage — బంది

**వివరణాత్మక పదాలు**

Non-aligned — ఏ రాజ్యకూటమికీ చెందని, అలీన, నిబంధ
power cut — విద్యుత్ కోత
budget cut- — బడ్జెట్ కోత

**నుడికారాలు**

out of wood — గట్టెక్కడం
dracunian law — కఠోరచట్టము
showdown — అమీతుమీ తేల్చుకోవడం

**అభ్యాసం -4**

వినూత్న పదసృష్టి ఏర్పడే పరిస్థితుల్ని కొన్నింటిని గుర్తించండి.

BRAOU

## 3.6 శైలీ భేదాల ప్రయోగ వ్యాప్తి

భాషలో పదాలను, వాక్యాలను, ఎన్నుకునే పద్ధతిని, ప్రయోగించే తీరును బటి శైలి బేధాలు ఏర్పడుతాయి. ఈ శైలి భేదాలు ఒక్కోసారి ఆ భాష లక్షణాన్ని బట్టి కూడా ఉంటాయి.

తెలుగుభాష మొదటి నుంచి ఇతర భాషా పదాలను ఎక్కువగా ఇముడ్చుకునే స్వభావం ఉన్న భాష కనుక తక్కువ మార్పులతో ప్రాచీన కాలంలో సంస్కృతంనుంచి, మధ్య యుగాల్లో పార్శీ మొదలైన భాషల నుంచి, ఆయా మతోద్యమాల ప్రారంభంలో తమిళ, కన్నడ, మరాఠీ భాషల నుంచి అనేక పదాలు కలిసి చేరాయి. ఇందులో సంస్కృత పదాల వ్యాప్తి అతి విస్తృతమయినది. ఏ సంస్కృత పదమైనా తెలుగులో ప్రయోగించడానికి భాషా నిర్మాణం దృష్ట్యా వ్యవహర్తల అంగీకారం దృష్ట్యా ఎటువంటి అభ్యంతరమూ లేదు. ఇవ్వాళ తెలుగు భాష నుండి సంస్కృత పదాలను వేరు చేయడం సాధ్యం కాదు. ప్రయోజనమూ లేదు. కానీ, ఇంగ్లీషు మాటలు ఇదే పద్ధతిలో తెలుగులో ప్రవేశిస్తున్నాయి. ఈ ప్రవేశానికి సంస్కృతానికి ఉన్నంత ఆమోదం ఉన్నట్లు కనిపించదు. ఇంగ్లీషు చదువుల తొలిరోజుల్లో, ఇంగ్లీషు భాషా పదాలు, పదబంధాలు, వాక్యోప వాక్యాలు వాడే ఒక శైలి కొంతకాలం వ్యాప్తిలో ఉంది. కన్యాశుల్కంలో

గిరీశం మాటల్లోనూ, చలం మ్యూజింగ్స్ లాంటి కొన్ని రచనల్లోనూ ఈ శైలి కనిపిస్తుంది. దీన్ని భాషా సమ్మిశ్ర శైలి (code mixture)అంటారు. ఈ రకమైన శైలి తెలుగువారి సంభాషణల్లో తరచుగా వినిపిస్తుంది. ఇతర రచనల్లో – కొన్నినాటకాల్లోనూ , కొందరు రచయితల ప్రత్యేక శైలుల్లోనూ – మాత్రమే కనిపిస్తుంది. రచనా భాషలో ఈ సమ్మిశ్ర శైలి అంత అదరణీయంగా కనబడదు. మరీ ముఖ్యంగా విషయ ప్రధానమైన పాఠ్య గ్రంథాల్లోనూ, శాస్త్ర రచనల్లోనూ, పత్రికా రచనల్లోనూ ప్రసార మాధ్యమాల్లో వాడే భాషా వ్యవహారాల్లోనూ కనబడదు. తప్పని సరి అయినప్పుడు, ప్రత్యమ్నాయం దొరకనప్పుడు, ఇతర భాషా పదాల ప్రయోగం కనిపిస్తుందికానీ, మాట్లాడేటప్పుడు వాడినంత విరివిగా రాసేటప్పుడు లేదు. సాధారణ వ్యవహారంలో ఇంగ్లీషు లేదా ఇతర భాషా పదాలు వాడినా ముందుగా యోచించుకుని మాట్లాడే రేడియో, టెలివిజన్ ప్రసంగాల్లో కూడా ఇంగ్లీషు మాటల వాడకం తగ్గుతుంది. జాగ్రత్తగా చేసే భాషా వ్యవహారంలో స్వభాషలో ప్రత్యామ్నాయాల కోసం చేసే వెతుకులాట కనిపిస్తుంది.

ఆధునిక వ్యవహారంలో సాహిత్యేతర వచనానికి ప్రాధాన్యం పెరిగింది. అన్నివేళలా సాహిత్య, సాహిత్యేతర వచనాల మధ్య భేదం నిరూపించటం సాధ్యంకాకపోయినా, సాహిత్యేతర వచనంలో విషయ ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. సాహిత్య వచనంలో కూర్పు ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. ప్రసార సాధనాల్లో సాహిత్య వచనమూ ఉంటుంది. సాహిత్యేతర వచనమూ ఉంటుంది. సాహిత్య వచనానికి ఇతరత్రా కన్పించే లక్షణాలే కానీ, నవలలో, కథలో కానీ ఉండే భాషా ప్రయోగం ప్రసార సాధనాల్లోనూ ఇతరత్రా అచ్చయ్యే పుస్తకాల్లోనూ ఏమంత తేడాతో కన్పించదు.

పత్రికా రచనలో వివిధ సందర్భాల్లో వాడే వచనంలో శైలీ భేదాలు కన్పిస్తాయి. శీర్షికలు ఉంచటంలోనూ, వార్తలను పంపించటంలోనూ, సంపాదకీయ వ్యాఖ్యల్లోనూ వివిధ రచనా ధోరణులు మనకు కన్పిస్తాయి. ఇవికాక ఇటీవలి కాలంలో వివిధ పత్రికలు అనేక రకాల శీర్షికలు (columms) నిర్వహిస్తున్నాయి. వీటన్నింటినీ కలిపి పరిశీలిస్తే మనకు వివిధ శైలీ భేదాలు కన్పిస్తాయి.

వార్తా రచనలో, వార్తను కథలాగా చెప్పే కాల్పనిక శైలి కనిపిస్తుంది. లేదా వార్తలాగా చెప్పే విషయ ప్రధాన శైలి కనిపిస్తుంది. తెలుగు పత్రికల్లో ( కొన్ని ఇంగ్లీషు పత్రికల్లో కూడా) కవితాత్మకంగా కనిపించే కొన్ని శైలులు కనిపిస్తాయి. సంపాదకీయ పుటలో అచ్చయ్యే వివిధ వ్యాసాల ధోరణులు వేర్వేరుగా కన్పిస్తాయి. సంపాదకీయంలో సాధారణంగా విషయ వివేచన, విశ్లేషణ, విమర్శ, హెచ్చరిక, సలహాలు, వీటిల్లో కొన్నిగానీ, అన్నీగానీ కలిసి ఉంటాయి. కొన్ని సంపాదకీయాల్లో కొందరు సంపాదకులు ఆవేశాన్ని చూపిస్తే, మరికొందరు పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు. వారివారి అభిరుచుల్ని బట్టి శైలీ భేదాలు కన్పిస్తాయి.

సంపాదకీయ పుటలో కేవలం విషయ ప్రధానమైన, విజ్ఞానదాయకమైన, విశ్లేషణాత్మకమైన, సమాచార భరితమైన వ్యాసాన్నొకదాన్ని ప్రచురించటం పత్రికల్లో ఆచారం. ఈ వ్యాసం సాధారణంగా నిరలంకారంగా, చదవటానికి అత్యంత ఆసక్తికరమైన శైలిలో ఉంటుంది. దీని ప్రయోజనం కేవలం విషయ ప్రతిపాదన. ఇటీవలి కాలంలో వీటితో బాటు కొంత వినోదం, కొంత హాస్యం, మరికొంత వ్యంగ్యం కలిపి చేసే రచనలుంటాయి. ఈనాడులో కబుర్లు, వార్తలో కొంటెచూపు లాంటి రచనలు ఇట్లాంటివే.

ఆధునిక పత్రికా భాషలో సామాన్య భాషలో అరుదుగా కన్పించేవీ, అసలే కనిపించనివీ కొన్ని వాక్యాలు కన్పిస్తాయి. కొందరు పత్రికా సంపాదకులు ఎంతగా నిరసించినా కర్మ ప్రధాన వాక్యాలు వీటినే బడు ప్రయోగాలు అంటారు– క్రియా ప్రధాన వాక్యాలు – చెప్పటం జరిగింది, చేయుటం జరిగింది – లాంటి వాక్యాలు – అధికంగా కన్పిస్తాయి. అట్లాగే వార్తా రచనల్లో మాట్లాడటం అనే అర్థం వచ్చే ఉద్ఘాటించు, వక్కాణించు,అభిభాషించు, నొక్కిచెప్పు వంటి క్రియా



BRAOU

ప్రయోగాలు కన్పిస్తాయి.

ఈ రకమైన ధోరణి దూరశ్రవణ, దూరదర్శన్ వార్తా ప్రసారాల్లోనూ కన్పిస్తుంది. ఈ మాట్లాడే భాష అనే భ్రమ కల్పించడం కోసం ఈ ప్రసారాల్లో 'ఇకపోతే, ఇదిలా వుండగా' వంటి సమాచారాన్ని కలిపే ప్రయోగాలు అదనంగా కన్పిస్తాయి. ఇటీవల కొందరు రచనల్లో, కేవలం మాట్లాడినట్లుగా మాండలికాలతో సహా మాట్లాడే భాషా లక్షణాలను యథాతథంగా వాడుతూ రాయటం చూడవచ్చు. ఈ పద్ధతిలో తెలంగాణ, కళింగాంధ్ర, రాయలసీమ మాండలికాల్లోని రచనలు కన్పిస్తాయి.

వార్తా శీర్షికలుగా పూర్వం నామవాచకాలే ఉండేవి. ఈ రకపు శీర్షికల్లో కొన్ని నామవాచకాలు ప్రయత్నించి బలవంతంగా పుట్టించినవి. తరువాతి కాలంలో పూర్తి వాక్యాలు శీర్షికలుగా వచ్చేవి. ఇటీవలి కాలంలో ఉత్తమ పురుష క్రియలలో కూడా వార్తా శీర్షికలు వస్తున్నాయి. సృజనాత్మక రచనల్లోని భాషాభివ్యక్తివేరు, సృజనేతర రచనల్లోని రచనా పద్ధతులు వేరు అని గ్రహించడానికి మరికొంతకాలం పట్టేటట్లు ఉంది. ఈ విషయాలను మరింత వివరంగా రెండవ ఖండంలోనూ, మూడవ ఖండంలోనూ తెలుసుకుంటారు.

**అభ్యాసం -5**

భాషా సమ్మిశ్రశైలి అంటే ఏమిటి

## 3.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- భాషా ప్రయోగ రంగాలకూ ప్రసార సాధన వ్యవస్థకూ మధ్య సంబంధం ఉంది.
- ఆధునిక రచన అభివృద్ధికి ప్రసార వ్యవస్థ ఎంతో దోహదం చేసింది.
- సృజనాత్మక రంగంలో కొత్త ప్రక్రియలు ఎన్నో రచనా వ్యాప్తికి దోహదం చేశాయి. సృజనేతర రంగంలో పత్రికా వ్యవస్థ రచన వికాసానికి తోడ్పడింది.
- ప్రమాణ భాష మాండలికాతీతమైంది. అందరికీ ఆమోదయోగ్యమయింది.
- కొత్తగా ప్రవేశించే భావనలకు కొత్త పదాల సృష్టి జరుగుతూ ఉంటుంది.
- సాహిత్యేతర వచనంలో విషయ ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. సాహిత్య వచనంలో కూర్పు ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది.
- పత్రికా రంగంలో వివిధ సందర్భాల్లో వాడే వచనంలో శైలీ భేదాలు కనిపిస్తాయి.

BRAOU

## 3.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. ఆధునిక వచన వ్యాప్తికి దోహదం చేసిన పరిస్థితుల్ని సమీక్షించండి
2. పత్రికా రంగంలో కనిపించే శైలీ భేదాలను సోదాహరణంగా వివరించండి

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. ప్రామాణిక భాషతో ప్రసార వ్యవస్థకు ఉన్న సంబంధాన్ని చర్చించండి
2. కొత్త భావనలకు కొత్త పదాల సృష్టి భాషలో ఎలా జరుగుతుందో ఉదాహరణతో చర్చించండి

BRAOU

## భాగం : 4 విశేష పద నిర్మాణం

### విషయ క్రమం


4.0 ఉద్దేశం

4.1 ప్రవేశిక

4.2 విశేష పదజాలం ఎలా ఏర్పడుతుంది?

4.2.1 కొత్త ప్రయోజనాల కోసం భాషను వాడడం

4.2.2 పత్రికలలో పదాలు

అభ్యాసం -1

4.3 విశేష పదజాలం, ప్రత్యేకతలు

4.4 విశేష పదజాల కల్పన : కొన్ని అంశాలు

అభ్యాసం - 2

4.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

4.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 4.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు -

- విశేష పదాలను నిర్వచించగలుగుతారు.
- విశేష పదాల కల్పనకు ఏ అంశాలు తోడ్పడుతాయో వివరించగలుగుతారు.

## 4.1 ప్రవేశిక

విశేష పద నిర్మాణం (register) అనేది దానంతట అదే భాషలో పుట్టుకొచ్చే అంశం కాదు. అనాలోచితంగా ప్రజలు సృష్టించేదీ కాదు. విజ్ఞులు కావాలని ప్రతిపాదించే పదాలని విశేష పదజాలం అంటాం. ఉదాహరణకి విశాఖపట్నం

రేవు అయాచితంగా క్షణికాలోచనతో(spontaneous) సృష్టించిన పదం 'తవ్వోడ'. 'తవ్వటం' 'ఓడ' అనే రెండు పదాలని సంధించి జానపదులు కల్పించిన మాట ఇది. అయితే ఇది ప్రామాణిక భాషలో చేరలేదు. అలాగే, నాల్గ నలభయి సంవత్సరాల క్రితం(non-aligned)అనే ఇంగ్లీషు పదానికి 'అలీన' అని వాడారు. అది ప్రామాణికమయి పోయింది. విశేష పదజాలానికీ (register) సహజ పద ఉత్పత్తి (natural development of words) కీ ఉన్న తేడాయే ఇది. జనుల వాడుకలో వివిధ రంగాల్లో వివిధ రకాలైన విశేష పదజాలం పుడుతుంది, కాదు పుట్టిస్తారు. భాషా పండితులు, విషయ నిపుణులు (subject experts) తమతమ అవసరాలకి ఒక ప్రత్యేకమైన పదజాలాన్ని సృష్టించుకుంటారు. ఈ పదజాలాన్నే విశేష పదాలంటారు. విశేష పదాలకీ, వృత్తి పదాలకీ సూక్ష్మ మైన తేడా ఉంది. వృత్తి రీత్యా ఏర్పడిన ప్రత్యేక పదజాలం వృత్తి పదజాలం అవుతుంది. కానీ విశేష పదజాలం కాదు. ఉదాహరణకి వడ్రంగి సాధారణ భాషలో లేని అనేక ప్రత్యేక శబ్దాలను ఉపయోగిస్తాడు. ఇవి అతను ఇప్పుడు సృష్టించినవి గావు. వేల సంవత్సరాల నుంచీ అతని వృత్తితో పాటు పెరుగుతున్న, పుట్టిన పదజాలం. మరో ఉదాహరణ తీసుకోండి. వేదాంతంలో 'శబ్ద ప్రమాణం' 'అనుమాన ప్రమాణం' అనే రెండు మాటలున్నాయి. అవి వేదాంతి తన అవసరాలకి సృష్టించినవి. ఇతరులు వాటిని ఆమోదిస్తే, అవి ప్రమాణ భాషలో భాగం అయిపోతాయి. అయితే, అది వేదాంత శాస్త్రానికి మాత్రమే పరిమితం. అవి ఇతరుల అనుభవంలోకి వాడుకలోకి రానవసరం లేదు. మొదటి రకానికి పర్యాయపదం ఉండదు. కాని రెండో దానికి ఉండే అవకాశం ఉంది. అంటే సమకాలీన శిష్టులు వాటి బదులు మరో విధమైన పదాలు ప్రతిపాదించవచ్చు.

## 4.2 విశేష పదజాలం ఎలా ఏర్పడుతుంది?

విశేష పదజాలం గానీ, ప్రత్యేక పదజాలం గానీ సామాన్య వాడుక భాషలోకి అరుదుగా వస్తుంటాయి. అవి బహు కొద్ది. అయితే, విశేష పదాలని ప్రత్యేకంగా ఎందుకు చర్చించవలసి వస్తున్నది? ఎందుకంటే, అవి కొన్ని ప్రత్యేక అవసరాల కోసం, కావాలని సృష్టించిన అభివృద్ధి చేసిన (deliberately - promoted) పదాలు గనుక. ఈ విశేష పదజాలాన్ని ఎలా సృష్టిస్తారు అనేది మనం తెలుసుకోవటం అవసరం.

BRAOU

### 4.2.1 కొత్త ప్రయోజనాల కోసం భాషను వాడడం

భాషని కొత్త ప్రయోజనాల కొరకు ఉపయోగించటానికి ఉద్యమిస్తే, ప్రస్తుతం ఉన్న భాషల్లోని లొసుగులు (inadequacies) అర్థమవుతాయి. మరీ ముఖ్యంగా కొత్త భావాలని క్లుప్తంగా, సూటిగా చెప్పాలంటే, ఉదాహరణకి కంప్యూటర్ల రంగంలో mouse అనేది చాలా తరచుగా ఉపయోగిస్తుంటారు. ఇది జంతువు కాదు కాని అలా ఉండే ఒక చిన్న యాంత్రిక విశేషం. దాన్ని మీటలు నొక్కుతూ కంప్యూటర్‌లో మనకి కావలసిన చేర్పులు, మార్పులు చేయవచ్చు. ఇంగ్లీషు భాషలో mouse అన్నప్పుడు, ఇంగ్లీషు వాళ్ళు దాన్ని ఒక సాంకేతిక పదంగా ఆమోదించారు. కాని తెలుగులో దాన్ని 'ఎలక' అంటే ఎబ్బెట్టుగా ఉండొచ్చు. అందుకని దాన్ని అందరూ ఒప్పుకోకపోవచ్చు. దీనికి కారణం మన మనస్తత్వంలో సాంకేతిక పదం అంటే దానికో హంగూ, ఆర్భాటమూ ఉండాలి. అది ఒకటి, బాగా పరిచయమైన పేలవం (?) గా ధ్వనించే మాట కాకూడదు. సంస్కృత ధాతువు మీద అధారపడిందయి ఉండాలి. మూడు, అది ఒక పదం అయ్యుండాలి. వర్ణనాత్మకమైన వాక్యం కాకూడదు. ఇవన్నీ గూడా మనో దృక్పథానికి సంబంధించినవే గాని భాషకి సంబంధించినవి కాదు. ఒక కొత్త పదాన్ని లేదా పాత పదాన్ని కొత్త అర్థంలో ఉపయోగించినప్పుడు దానికి ప్రాచుర్యం కలిగించాలి. పదుగురు, పలుచోట్ల, పలుమార్లు ఉపయోగిస్తే అదే ప్రామాణికమైన వాడుక అయిపోతుంది. కాలమే దానికి నిర్ధారణ. అయితే, కొన్ని పదాలు రాణించవు. గుత్తంగా పడే మంచుని 'పిండిమంచు' అన్నా – ఇంచు, ధాతువుతో 'పెరిషించు' అని ప్రయోగించినా అవి ఎక్కువ కాలం మనలేదు. అర్థవంతమే అయినా వాడుకలో వాసికెక్కలేదు. అలాగే 'కూరగాయలు = కాయగూరలు' అనే పదాలు ఒకే రకంగా ఉన్నా, వాట్లో సూక్ష్మమైన అర్థ వ్యత్యాసం ఉంది. మొదటిది

అపక్వ పదార్థాలు; రెండోవి పక్వ పదార్థాలు. ఈ వ్యత్యాసం వంట పనులు చేసే వారికి సులభ గ్రాహ్యం. కాని మిగిలిన వాళ్ళకి రెండూ ఒకే లాగే కనిపిస్తాయి. అలాగే గణితంలో మహిష్ఠ (maximal), గరిష్ఠ (highest)అనేవి రెండు ప్రత్యేకార్థంలో ఉపయోగిస్తారు. కాని సామాన్య భాషలో రెండూ ఒకే లాగానే కనిపిస్తాయి.

### 4.2.2 పత్రికలలో పదాలు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పత్రికలు చదివే పాఠకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పత్రికలు నూతన పాఠకుల అవసరం కోసం, కొత్తగా ప్రవేశిస్తున్న అర్థవిశేషాల ఒత్తిడి వలన కొత్త మాటలు, కొత్త ప్రయోగాలు, అనువాద పదాలు దండిగా ప్రయోగిస్తున్నారు. ఇవి ముఖ్యంగా రాజకీయాలకి సంబంధించినవి. ఇందులో కొన్ని రాత దశనుంచి మౌఖిక దశకి చేరుకున్నాయి, ముఖ్యంగా విద్యావంతుల వాడకంలో ఈ కింది పద ప్రయోగ సముదాయాలని గమనించండి.

1. (a) నినాదం : నినదించు

   (b) రాజకీయం : రాజకీయాలు

   (c) స్వాగతం : స్వాగతించు

ఈ విధమైన ప్రయోగాలను, పది సంవత్సరాల క్రితం 'నినదించు' 'రాజకీయాలు' అనే పదాలను ఎవరూ ఉపయోగించలేదు. ఇంగ్లీషు భాషా ప్రభావం ఇక్కడ మనం గమనించవచ్చు.

(a) Slogan : నినాదం
Sloganeering

(b) Politics : రాజకీయాలు
Politicians రాజకీయవాదులు/ రాజకీయులు

(c) Welcome(N) : స్వాగతం
Welcome (V) స్వాగతించు

పూర్వం 'రాజకీయవాదులు' అనే వారు కాని ఇప్పుడు రాజకీయులు అని ఉపయోగిస్తున్నారు. అయితే ఈ రెంటికీ అర్థ వ్యత్యాసం ఉందని వాదించటానికి అవకాశం ఉంది. అంటే Politician = రాజకీయ వాది; Politicking man = రాజకీయుడు. ఈ రెండో వర్గం కొంచెం తక్కువ రకం అన్నమాట. ప్రవర్తనలో కొంచెం ముతక అని కూడా అనుకోవచ్చు.

2. స్పందన : స్పందించు

   ప్రోత్సాహం : ప్రోత్సాహకాలు

ఈ రెండు పదాలు కేవలం రాత భాషకీ, అదీ హృదయావేశానికి(emotion, love)సంబంధించి మాత్రమే పూర్వం ఉపయోగించేవారు. ప్రస్తుతం, 'response' 'respond' అనే ఇంగ్లీషు మాటలకి ప్రత్యామ్నాయంగా



BRAOU

వాడుతున్నారు. ముఖ్యంగా రాజకీయ సంబంధమైన సభల్లో, చర్చల్లో ఈ మాటలు వింటుంటాం. 'ఆంధ్రజ్యోతి వార్తకు ప్రభుత్వ స్పందన', 'లక్ష్మీ పార్వతి సభలకు ప్రజల విశేష స్పందన' 'బిజెపికి కూడా ఒక అవకాశం ఇవ్వాలి' – అని పాల్కీవాలా స్పందించారు – ఇలాంటి ప్రయోగాలు మనం ఇప్పుడు తరచూ చూస్తున్నాం; కాదు వింటున్నాం. అంటే పత్రికల ప్రభావం వలన మరుగున ఉన్న పదాలు సామాన్య ప్రజల వాడకంలోకి ప్రవేశించాయన్న మాట. అవి కొత్త అర్థాలని పుణికి పుచ్చుకున్నాయి. పాత మాటే కొత్త చొక్కా తొడుక్కుంది అని చెప్పవచ్చు.

3. పంచాయతీ అధ్యక్షుడు : సర్పంచ్

| | | |
|---|---|---|
| సాంఘిక శాస్త్రం | : | సామాజిక శాస్త్రం |
| ప్రభుత్వం | : | సర్కార్ |
| ఆక్రమణ | : | కబ్జా |
| సమావేశం | : | భేటీ |
| బహుమానం | : | పురస్కారం |

ఇంతకు ముందే ప్రాచుర్యంలో ఉన్న పదాలని వదిలి కొత్తగా హిందూస్తానీ నుంచి వచ్చిన పదాలని ప్రయోగించటం ఈనాడు ఫ్యాషనై పోయింది. వీటిలో అర్థ విశేషమూ లేదు, తెలుగు పద ఒరవడికి అనుకూల మయినవీ కాదు. కాని పత్రికలు పనిగట్టుకొని వీటికి ప్రాముఖ్యం ఇస్తున్నాయి. ఇది అభిలషణీయమైన మార్పు కాకపోయినా, వాటిని అంగీకరించే స్థితికి మన పాఠకులు వచ్చారు. వాడుక భాషలో గూడా ఇవి ప్రాచుర్యం పొందుతున్నాయి. దీనికి మరో కారణం రేడియో, టీవీల్లో 90% హిందూస్తానీ కార్యక్రమాలే ఉండటం. అంటే ఇతర భాషల మీద హిందూస్తానీ ఒత్తిడి పెరుగుతున్న దనటానికి ఇది నిదర్శనం.

BRAOU

4. గతితార్కిక భౌతిక వాదం : dialectical materialism

| | | |
|---|---|---|
| ఒంటెత్తు పోకడ | : | sectarianism |
| గుత్త సంస్థలు | : | monopolies |
| పంచమాంగదళం | : | fifth columnists |

ఈ పద ప్రయోగాలన్నీ ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఉచ్ఛ దశలో ఉన్నప్పుడు తెలుగులో ప్రవేశించాయి. గురజాడ, వీరేశలింగం, వావిళ్ళ రామశాస్త్రులు తర్వాత తెలుగు భాషాభివృద్ధికి విశేష సేవ చేసింది విశాలాంధ్ర సంస్థ అని చెప్పటంలో సందేహం లేదు. కొత్త పుస్తకాలు ప్రచురించటం, పాత వాటిని పునర్ముద్రించటం, పుస్తక వారోత్సవాలు జరపడం 1956 –64 మధ్య కాలంలో విపరీతంగా జరిగేవి. వాటివల్ల ఎప్పుడూ చదవని వాళ్ళు చదవటం, ఒకే రంగానికి పరిమితమైన వాళ్ళు, వేరే రంగాల్లోని పుస్తకాలు చదవటం ఎక్కువయింది. ముఖ్యంగా యువజనుల్లో, మొదటిసారి అక్షరాస్యత సంపాదించిన వ్యవసాయ కుటుంబాల్లో చదివే అలవాటు ఏర్పడింది. అందుకు విశాలాంధ్ర పాత్ర చాలా

ఉంది. తెలుగు భాషాభివృద్ధిలో ఇదొక గీటురాయి. కొవ్వలి ప్రేమ నవలలూ, టెంపోరావు డిటెక్టివ్ నవలలూ, సులోచనా రాణి కాల్పనిక నవలలూ వయోజనుల్లో, యువకుల్లో, గృహిణుల్లో పఠనాసక్తిని రేకెత్తించాయి అని చెప్పవచ్చు. తర్వాత దశకంలో వచ్చిన వారపత్రికలకీ సీరియల్ నవలలకీ ఇవి స్ఫూర్తినిచ్చాయి. తర్వాత వచ్చిన అనేక పరిణామాలకి పునాది ఇక్కడే పడింది. అయితే, కమ్యూనిస్టు ఉద్యమానికి పార్టీ ప్రచారమే ముఖ్యోద్దేశంగాబట్టి తరువాత తర్వాత వాళ్ళకి భాష మీద దృష్టి తగ్గింది. వాళ్ళు భాషాభివృద్ధికి నాటిన బీజాలు మాత్రం ప్రస్తుతం మహా వృక్షాలయి వర్ధిల్లుతున్నాయి. గ్రాంధిక భాషా రచన నుంచి వాడుక భాషా రచనకు పరిణామం చెందటానికి కమ్యూనిస్టు ఉద్యమం చాలా దోహదం చేసింది. ముఖ్యంగా శ్రీశ్రీ, చలం, కొడవటిగంటి, మోటూరి హనుమంత రావు, ఏటుకూరి బలరామమూర్తి మొదలైన రచయితలూ మేధావులూ వ్యావహారిక భాషారచన వ్యాప్తికి చాలా కృషి చేశారు. కమ్యూనిస్టు ఉద్యమ సంబంధం లేని ఇతరులు ఎంతో మంది ఆ స్ఫూర్తితో వాడుక భాషని అన్ని ప్రయోజనాలకీ ఉపయోగించే జీవ భాషగా మలిచారు. డాక్టర్ గాలి బాలసుందర్ రావు, నార్ల, వసంత రావు వెంకట రావు, మహీధర నళినీ మోహన్, వి. భానుమూర్తి, వాసిరెడ్డి నారాయణ రావు, ఎ.బి.కె. ప్రసాద్, ఆంధ్రజ్యోతి, ఈనాడు సంస్థ వగైరాలు తెలుగు భాషని కొత్త పుంతల్లో నడిపించారు. వారి కృషి ఫలితమే నేడున్న నవీన తెలుగు భాష, భాషలో వైవిధ్యమూ(diversity), నడకలో సహజత్వమూ రావటానికి వామపక్ష మితవాద అతివాద ఉద్యమాలు ఎంతో దోహదం చేశాయి. ప్రస్తుతం వీస్తున్న సరళీకృత వ్యాపార పవనాల్లో ఆ విశేష పదజాలం కనుమరుగై వేరే వస్తు, పద సంపద తెలుగు భాషలో ప్రవేశిస్తున్నది.

5. బిజెపికి సి.ఎం.నో

రికార్డ్ డేట్స్

లిస్టెడ్ ఫండ్ స్కీములు

సెన్సిటివ్ లిస్ట్ వస్తువులన్నీ

పాస్ బుక్ స్కీము పరిధిలోకి

ఎ.పి. సీడ్స్‌కు పూర్తికాలపు ఎం.డి.

రావిపూడికి త్రిపురనేని అవార్డు

న్యూస్ టుడేతో రైస్ ఫెడ్ ఎం.డి.

ఇవన్నీ ఒక పత్రికలోని పతాక శీర్షికలు.

ఒక రకమైన విశేష పదజాలాన్ని సృష్టించే ప్రయత్నం మానుకొని సులభతరమైన ఇంగ్లీషు పదాలని ఉపయోగించటం కొన్ని పత్రికలకి అలవాటైపోయింది. దీని వలన పాఠకులకి ఏ విధమైన ప్రయోజనమూ కలుగదు. ఎందుకంటే ఇవి ఇంగ్లీషు వచ్చిన వాళ్ళకే అర్థగ్రాహ్యమవుతాయి గాని తెలుగు వాళ్ళకి కాదు. ఒక ఇంగ్లీషు పదాన్ని, తెలుగులో దానికి ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లోనే వాడుకోవాలి గానీ, అన్ని చోట్లా వాడితే భాషాసృజన శక్తి కుంటుపడుతుంది. పై ప్రయోగాలన్నిటికీ సులభ గ్రాహ్యమైన తెలుగు పదాలు ఉన్నాయి. కాని కొందరు పత్రికా రచయితల అలసత్వం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఇది భాషని సంపన్నం చేయటానికి ఏ విధంగానూ దోహదపడదు. పత్రికల్లో వచ్చే వ్యాపార ప్రకటనలలో ఇంగ్లీషును తగ్గించి, తెలుగు భాషనే ఉపయోగిస్తున్నారు. ప్రకటనల్లో సాధ్యమయి పత్రికారచనల్లో సాధ్యం కాదనటం హాస్యాస్పదం.

BRAOU

6. 'పది జింకలు చచ్చాయి'

'రెండు డాములు బద్ధలయ్యాయి'

'నా బాంకు జాతీయం చేశారు'

'ఒక బిళ్ళ గెలిచాను'

ఈ ప్రయోగాలు కోస్తా జిల్లాల్లో పేకాటరాయుళ్ళు సృష్టించుకున్న పదజాలం. అవి వాళ్ళకి మాత్రమే అర్థమవుతాయి. 'జింక' అంటే అయిదు రూపాయల నోటు, 'డాం' అంటే వందరూపాయల నోటు, 'బాంక్' అంటే ఆటగాడు ముందుగా పెట్టవలసిన కనీసపు పెట్టుబడి; బిళ్ళ అంటే కనీసపు పెట్టుబడిలో నాలుగో వంతు. ఒక్కో బిళ్ళకి ఆట స్థాయిని బట్టి, ఒక్కో విలువ ఉంటుంది. ఇది ఒక రకంగా పేకాటలో ఉపయోగించే రహస్య భాష అనవచ్చు. ఒక ప్రత్యేక అవసరానికి సృష్టించుకొన్న విశేష పదజాలం (register) ఇది. దీనికి సామాన్య భాషలో ప్రత్యామ్నాయాలు ఉన్నా, పేకాట రాయుళ్ళు వీటినే ఉపయోగిస్తారు. ఆ వర్గంలో అందరూ ఆమోదించిన పరిభాష ఇది.

పైన ఉదహరించిన ఆరు అంశాలు ఆరు రకాలయిన ప్రయోగాలు. ప్రయోజనం ఒత్తిడి (pressure of usage) వల్ల భాషలో చోటు చేసుకునే నూతన ప్రయోగాలివి. భాషలో కొత్త పదాలు ఎలా చొరబడతాయనటానికి ఉదాహరణలు మాత్రమే. వాడుకలో కొన్ని నిలుస్తాయి, కొన్ని రాలిపోతాయి. ఉదాహరణకి కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధాన్లు 'ఏనుగకి కావలసినంత రొడ్డ ఉంది' అంటాడు. ఈ 'రొడ్డ' అనే పదం ఉత్తరాంధ్రలో కొద్ది మందికి మాత్రమే అనుభవంలో ఉన్న మాండలికం. మిగతా చోట్ల అది ప్రసిద్ధి కెక్కలేదు. ఈ ప్రాంతంలో కూడా ఇపుడు అది వినపడదు. అలాగే మధురవాణి పేకాటలో pair అనే అర్థంలో 'దాడద' అని ఉపయోగిస్తుంది. అది కూడా ప్రస్తుతం మరుగున పడింది. ఎందుకంటే ఇపుడు ఆ ఆట ఆడే వాళ్ళే లేరు. కొన్ని చోట్ల ప్రత్యేక పదాలు పోటీ పడతాయి. ఉదాహరణకి గణితంలో prime number అనే దాన్ని మొదట్లో 'ప్రధాన సంఖ్య' అనీ తర్వాత 'అవిభాజ్య సంఖ్య' అనీ ఉపయోగిస్తూ వచ్చారు. ఒక్కోసారి కొత్తగా సృష్టించే పదజాలం అగమ్య గోచరంగా ఉండొచ్చు. ఉదాహరణకి గణితంలో integral domain (పూర్ణాంక ప్రదేశము) ని మూడు సూత్రాల ఆధారంగా నిర్వచిస్తారు:

తత్సమ సహితం

శూన్య భాజన రహితం

వినిమయ వలయం

వాడుకలో ఇవి స్థిరమై పోనూవచ్చు. లేదా ఇంగ్లీషు పదాలనే యథాతథంగా వాడే అలవాటూ రావచ్చు.

**అభ్యాసం -1**

భాషను కొత్త ప్రయోజనాల కోసం వాడినప్పుడు విశేష పదాలు ఎలా ఏర్పడుతాయో తెలపండి.

BRAOU

## 4.3 విశేష పదజాలం ప్రత్యేకతలు

విశేష పదజాలాన్ని (registers) కొంత మంది భాషలో సృష్టించే లేదా ప్రయోగించే పదాలు లేదా పద సముదాయం అని చెప్పుకున్నాం. ఈ పదజాలానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. అవి:

1. కావాలని సృష్టించబడినవి (deliberate creations)

2. వాటికి ప్రత్యామ్నాయాలు ఉంటాయి.

3. వాటి విశేషార్థంలో ఆయారంగాల్లో పనిచేసే సమకాలీనులు ఆమోదించాలి, ఉపయోగించాలి.

4. ఈ విశేష పదజాలం ఒక వర్గానికే పరిమితం.

5. సామాన్య ప్రమాణ భాషలో ఇది భాగం కానక్కర లేదు.

భాషని కొత్త ప్రయోజనాలకి కొత్త పుంతల్లో నడిపించవలసిన అవసరం కలిగినపుడు భాషా కోవిదులు, విషయ విజ్ఞానులు, వాడకం దార్లు నూతన ప్రయోగాలు చేస్తుంటారు. అవి కొంత కాలానికి భాషలో భాగమయి పోతాయి. ఇక్కడ ఒక విషయం గమనికలో పెట్టుకోవాలి. భాషలోని ప్రతి పదమూ, ప్రతి ప్రయోగమూ ప్రతి వ్యక్తికీ అనుభవంలోకి రావాలని లేదు. కేవలం అందుబాటులో ఉంటే చాలు. ప్రజల వ్యాపకాలూ, అవసరాలూ భిన్నం గనుక ఈ తరతమ భేదం సహజమే. అంటే, ఒక లాయరుగారి పదాలు ఇంజనీరు గారికీ, ఒక జాలరి పదాలు కంప్యూటరు నిపుణుడికీ అర్థం కావు . కాని నిఘంటువు సాయంతో తెలుసుకునే వీలుంది. అనుభవానికీ, అందుబాటుకీ అదే తేడా. అందుకనే విశేష పదజాలం భాషలో భాగం అంటున్నాం; కాని అందరికీ అనుభవంలోకి రాదు.

## 4.4 విశేష పదజాల కల్పన - కొన్ని అంశాలు

భాషలో విశేష పదజాలాన్ని సృష్టించి అవి రాణించేట్లు చేయాలంటే కొన్ని ప్రాథమిక నియమాలున్నాయి:

(1) ప్రస్తుతం ఉన్న మాటలకంటే ఈ కొత్త పదాలు ప్రయోగించటం వలన అవగాహన పెరగాలి. అర్థ ప్రత్యేకత ఒనగూరాలి. ఉదాహరణకి 'కండె' అనే పదం ఉంది. ఇది 'మొక్కజొన్న కండె' అనే ప్రయోగంలో అందరికీ సుపరిచితమే. కాని దాన్నే చేనేత పనివాళ్ళు నూలు చుట్టబడిన కర్రపుల్లకి అన్వయిస్తారు. ఇది ప్రత్యేక పదం. సాంకేతికంగా ఒక నిర్దుష్టమైన అర్థం ఉంది. అలాగే ఇంగ్లీషులో assembly అనే పదం ఒక చిన్న ప్రజా సముదాయాన్ని సూచిస్తుంది. అయితే legislative assembly అన్నప్పుడు ఒక ప్రత్యేకార్థంలో శాసన నిర్మాణ సభ అనే అర్థం వస్తుంది. అంటే సామాన్యార్థంలో ఉన్న మాటలనే ప్రత్యేకార్థంలో ఉపయోగిస్తున్నారన్నమాట. ఆ విధంగా ప్రత్యేకార్థం సంతరించుకున్న పదాలనే విశేష పదాలంటాం.

(2) సాంకేతిక పదాలని అరువు తెచ్చుకొన్నప్పుడు వ్యక్తిగతమైన ఒక మాటని గాకుండా, పూర్తి వ్యాకరణ, వ్యుత్పత్తి సముదాయాన్ని (etymology) తీసుకొన్నప్పుడు అవి భాషలో ప్రాచుర్యం చెందటానికీ, స్థిరపడడానికీ ఎక్కువ అవకాశం ఉంది.

BRAOU

ఉదాహరణకి:

(a) దూర - విద్య

దూర - దర్శిని / దర్శన్

దూర - వాణి

దూర - శ్రవణం

(b) మృత్తిక

విరళ మృత్తిక

మృత్తిక జీవి

మృత్యు ఘటిక

(c) భావం

భావన

భావుకత్వం

భావ కవిత్వం

భావించు

BRAOU

ఒక ధాతువు నుంచి పుట్టిన అనేక మాటల సముదాయం ఇవి. అన్నీ సంస్కృతం నుంచి వచ్చినవే. అన్నీ ప్రస్తుతం వివిధ రంగాలలో వాడుకలో ఉన్నవే. అందుకే అవి స్థిరమై పోయాయి. పరభాషనుంచి మాటలు అరువు తీసుకోవటానికి రెండు ప్రధాన కారణాలుంటాయి. అవి: (1) అవసరం (2) ప్రతిష్ఠ.

సాంకేతిక శాస్త్రం మనకి దిగుమతి అయిన విద్య గనుక సహజంగానే దానికి సంబంధించిన పదాలు కూడా దిగుమతి అవుతాయి. లేక సమానార్థకంలో సృష్టించబడతాయి. మనకి సంస్కృత భాష అందుబాటులో ఉన్న ఒక గని. అందులోంచి పదాలు తీసుకోవటం మనకి సులభం. అయితే, ఇక్కడ రెండు సమస్యలున్నాయి. ఒకటి: ఆ పదం అర్థ బోధక సమర్థంగా ఉందా? రెండు: అది మిగిలిన భారతీయ భాషల్లో సమాంతర ప్రయోగంలో ఉందా? ప్రతి సాంకేతిక పదమూ ఒక ప్రయోజనం కోసం వాడబడిందే. అది అర్థం చేసుకోవాలంటే ఆ రంగంలో పని చేసే వాళ్ళకి మొదట్లో కష్టమైనా రానురాను అభ్యాసమై పోతుంది. ప్రతి భాషకీ ఈ సమస్య ఉంది. ఉదాహరణకి ఇంగ్లీషులో hibiscus అనే పదం సామాన్య వాడుకలో ఉన్నది కాదు. గ్రీకు భాషనుంచి వృక్ష శాస్త్రజ్ఞులు అరువు తెచ్చుకున్న పదం. ఆ రంగంలో పని చేసే వారికి అది ఇపుడు సువిదితం. అలాగే తెలుగులో నత్రజని, ఆమ్లజని, ఉదజని అనే పదాలు ఈ శతాబ్దం తొలి

దశలో సంస్కృతం నుంచి మన భాషలోకి వచ్చి ఇమిడి పోయాయి. సైన్సు చదువుకొనే ప్రతి విద్యార్థికీ ఇవి తెలిసే ఉంటాయి. అయితే, ఈ పదాలకి మిగిలిన భారతీయ భాషల్లో సారూప్యం ఉందా అంటే చెప్పటం కష్టం. కేంద్ర ప్రభుత్వం సాంకేతిక పదజాలానికి ఒక కమిషన్ను నియమించింది. హిందీలో ప్రామాణికమైన సాంకేతిక పదజాలాన్ని సృష్టించటం, ప్రాచుర్యం కలిగించటం, మిగిలిన భాషల్లో ప్రవేశింప చేయటం దీని కర్తవ్యం. కానీ, ఈ ప్రక్రియలో చాలా వైరుధ్యాలేర్పడ్డాయి. అంతకు ముందే ఒక భాషలో ప్రాచుర్యంలో ఉన్న మాటను మార్చి కమిషను సూచించిన పదాన్ని ప్రయోగించటం సబబా?

మరో అంశం : పదజాలం అంతర్జాతీయ రంగంలో పనికి రాకపోవచ్చు. తెలుగు వాళ్ళు మొదట ఒక తెలుగు పదం, ఒక భారతీయ పదం, తర్వాత ఒక అంతర్జాతీయ పదం నేర్చుకోవలసి వస్తున్నది. అంటే శాస్త్ర జ్ఞానం మూడంగల కసరత్తు అన్నమాట. అందుకని తెలుగు రచయితలు నేరుగా ఇంగ్లీషు పదాలనే వాడుతున్నారు. ఉదాహరణకి: ఆక్సిజన్: ఆమ్లజని, నైట్రోజన్: నత్రజని, హైడ్రోజన్: ఉదజని మొదలైనవి. ప్రవేశ పరీక్షల్లో పోటీ పెరగటం, ఉన్నత విద్యకి ఇంగ్లీషే మాధ్యమం కావటం ఈ పరిస్థితికి కారణం. మరో కారణం ప్రతిష్ఠprestige. ఉదాహరణకి Native wisdom / commonsense అనే పదాలకి నాటు తెలివి/ ఇంగిత జ్ఞానం అని ఉపయోగిస్తుంటాం. రెండో దానికి ప్రతిష్ఠ, ప్రామాణికత అబ్బాయి. కాని మొదటి దానికి అబ్బ లేదు. మరో ప్రయోగం son of the soil తీసుకోండి. దీనికి తెలుగులో ఏమంటాం? 'భూమి పుత్రుడు' అంటే ఇంగ్లీషు ప్రయోగంలోని అర్థం స్ఫురించదు. దానికి 'తెలుగు బిడ్డ' అంటేనే సమన్వయం కుదురుతుంది. అంటే ఏ పదమైనా ప్రాచుర్యం పొంది భాషలో నిలబడాలంటే వాడుకే ప్రధానం. తరువాతే, మనం పైన ఉదహరించిన అంశాలు పరిగణలోకి వస్తాయి. పండిత బృందం పద పట్టికలు తయారు చేసినా, పామర బృందం అలవోకగా సృష్టించినా వాటిని ప్రయోగించే సాధువులుండాలి. అప్పుడే అవి భాషలో భాగమౌతాయి.

ప్రత్యేక పదజాలానికి మూలాలు మూడని చెప్పుకున్నాం. మాతృభాషలోనే ఉన్న పాత పదాలకి కొత్త రూపు, అన్వయం ఇవ్వటం. సంస్కృత భాషనుంచి అరువు తెచ్చుకోవటం. ఈ రెండు ప్రక్రియలతో తెలుగులోకి వాడకంలోకి వచ్చిన పదాలు తేలిగ్గా ఇమిడిపోతాయి. కానీ, ఇంగ్లీషు నుంచి వచ్చిన పదాలు మన సంజ్ఞ పద్ధతికి భిన్నంగా ఉంటాయి. రైలు, పెట్రోలు, రేడియో మొదలైన అనేక పదాలు తేలిగ్గా ఇమిడి పోయాయి. ఎందుకంటే అందులో ఎక్కువ భాగం వ్యంజనాంతాలు లేదా sonorants కాబట్టి . కాని కొన్ని మాటలు తెలుగులో ఎబ్బెట్టుగా ఉంటాయి, ముఖ్యంగా హలంతాలు. ఉదాహరణకి

కార్బన్ డయాక్సైడ్

హైడ్రో క్లోరిక్ యాసిడ్

హలాంతాలే గాక ఇందులో కొన్ని అసాధారణమైన సంయుక్తాక్షరాలుంటాయి. ర/బ, క/ల అనేవి తెలుగు భాషకి విరుద్ధం. అయితే, ప్రయోజన రీత్యా అవసరం కొద్దీ కొన్ని మాటలు అలాగే ఉండిపోతాయి. కొన్ని ఉచ్చారణానుకూలంగా మార్పు చెందుతాయి. ఉదాహరణకిhospital అనేది ఆసుపత్రి అయింది. regulator అనేది 'రెగ్గులేటు' అయింది. కొన్ని చోట్ల మూల పదాన్ని తప్పుగా అన్వయించటం కూడా జరుగుతుంది. ఉదాహరణకి – hospital rule అనేది ఫ్రెంచి మూలం. ఫ్రెంచి ఉచ్చారణ ఆధారంగా దానిని 'లోపితా సిద్ధాంతం' అన్నారు. ఇది అర్థ రీత్యా తప్పు అయినా ప్రమాణ రీత్యా స్థిరమై పోయింది.

BRAOU

**అభ్యాసం -2**

విశేష పదకల్పనలో ప్రాథమిక నియమాలను సూత్రీకరించండి.

## 4.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- విశేష పదజాలం విజ్ఞులు కావాలని ప్రత్యేక అవసరాల కోసం ప్రతిపాదించేది.
- కొత్త ప్రయోజనాల కోసం భాషను వాడుతున్నప్పుడు పత్రికల్లో అనేక సందర్భాల్లో, శాస్త్ర సాంకేతిక విషయాల్లో ఈ పదాలు ఏర్పడి స్థిరీకృతమవుతాయి.
- విశేష పదజాలం స్థిరపడటానికి వాడుకే ప్రధానం.

BRAOU

## 4.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. విశేష పదజాలం ఎలా ఏర్పడుతుందో సోదాహరణంగా వివరించండి.
2. ప్రత్యేక పదాల నిర్మాణంలో దోహదపడే నియమాలను వివరించండి.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. పూర్తి వ్యాకరణ చట్రంలో తెలుగులోకి దిగుమతి అయిన అయిదు సంస్కృత పదాలను తీసుకుని వివరించండి.
2. విశేష పదజాలం స్థిరపడడానికి వాడుకే ఎలా ప్రధానమో నిరూపించండి.

# భాగం : 5 వాక్య నిర్మాణ ప్రయోగాల్లో కొత్త రీతులు

**విషయ క్రమం**


5.0 ఉద్దేశం

5.1 ప్రవేశిక

5.2 కర్తృ, కర్మ, క్రియాంశ ప్రధాన వాక్యాలు

**అభ్యాసం -1**

5.3 వాక్య ప్రయోగాలు: ఆమోదయోగ్యత

**అభ్యాసం -2**

5.4 ప్రసంగ క్రియలు

**అభ్యాసం -3**

5.5 వాడకూడని సదృశీకరణాలు

**అభ్యాసం -4**

5.6 వాక్య నిర్మాణం, కొన్ని విశేషాలు

**అభ్యాసం -5**

5.7 పద, వాక్య ప్రయోగాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు

5.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

5.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది అంశాలను చర్చించగలుగుతారు; ప్రయోగించగలుగుతారు:

- మాట్లాడే భాషకూ, రాసే భాషకూ భేదాలు
- కొన్ని విశేష వాక్య పద్ధతులు, సందర్భోచిత ప్రయోగాలు

## 5.1 ప్రవేశిక

పత్రికా రచనలో వాడె భాషను వ్యావహారిక భాష అంటున్నాం. కాని, ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. మాట్లాడే భాషను సాధారణంగా వ్యావహారిక భాష అంటాం. మాట్లాడినట్లే రాస్తే దాన్ని కూడా వ్యావహారిక భాషే అనవచ్చు. కానీ, ప్రపంచంలో రాయటం కూడా ఉన్న భాషలో, మాట్లాడే భాషకూ రాసే భాషకూ, పద్ధతుల వల్లా, ప్రయోజనాన్ననుసరించీ కొన్ని భేదాలు వస్తాయి. మాట్లాడేవన్నీ రాసే భాషలో ఉండక్కర్లేదు, ఉండదు కూడా. అట్లాగే, రాసేవన్నీ మాట్లాడే భాషలో ఉండక్కర్లేదు. దీన్నే ఇంకొక రకంగా చెబితే, మాట్లాడే భాషలో ఉండేవి మాత్రమే, రాసే భాషలో ఉండాలన్న నియమం లేదు. ఉదాహరణకు : 'నీకు మొన్న పరిచయం చేశానే ఆ అబ్బాయే పెళ్ళికొడుకు' – ఈ రకపు వాక్యం మాట్లాడే భాషలో కన్పిస్తుంది. రాసే భాషలో 'నీకు పరిచయం చేసిన అబ్బాయి' అనే పద్ధతిలో మారుతుంది. అట్లాగే కొన్ని వాక్యాలూ, వాక్య పద్ధతులూ, ప్రయోగాలూ రాసే భాషలో అవసరం కావచ్చు. వాటిని వాడడానికి సంకోచం అక్కర్లేదు. అట్లాంటి కొన్ని పద్ధతులను గురించి ఈ భాగంలో తెలుసుకుందాం.

## 5.2 కర్తృ, కర్మ , క్రియాంశ ప్రధాన వాక్యాలు

వాక్యంలో ప్రాధాన్య వివక్షను అనుసరించి మూడు పద్ధతుల్ని మనం చెప్పుకోవచ్చు. సాధారణంగా వాక్యంలో కర్త, కర్మ, క్రియ అనే మూడు అంశాలను తీసుకుంటే వాక్యాలని కర్తృ ప్రధాన వాక్యాలు, కర్మ ప్రధాన వాక్యాలు, క్రియాంశ ప్రధాన వాక్యాలు అని మూడు రకాలుగా విభజించవచ్చు. సాధారణ వాక్యాల్లో చాలా భాగం కర్తృ ప్రధాన వాక్యాలు. 'ఆయన అన్నం తిన్నాడు' అనేది సాధారణ వాక్యం. ఇందులో కర్తకు ప్రాధాన్యం ఉంది. అయితే మిగతా వాటికి ప్రాధాన్యం లేదని కాదు. కర్తను మించిన ప్రాధాన్యం లేదు. అట్లాంటి ప్రాధాన్యం మిగతా పదాలకు ఇవ్వాల్సిన అవసరం భాషా వ్యవహారంలో, ముఖ్యంగా రచనా భాషా వ్యవహారంలో వచ్చే అవకాశం ఉంది. ప్రయోగాల సంగతి తరవాత చూద్దాం. నిర్మాణం కోసం పై వాక్యాన్ని చూడండి. ఆ వాక్యాన్ని అన్నం తినబడింది – (ఆయన చేత) – 'అన్నం ఆయన చేత తినబడింది' అంటే కర్మ ప్రధాన వాక్యం అవుతుంది. 'ఆయన అన్నం తినడం జరిగింది' అంటే అది క్రియాంశ ప్రధాన వాక్యం అవుతుంది. ఈ రెండు రకాల వాక్యాలూ అంటే – కర్మ ప్రధాన, క్రియాంశ ప్రధాన వాక్యాలు తెలుగు భాషకు అసహజాలనీ, వీటిని నిషేధించాలనీ కొందరు అంటారు. పైన ఉదహరించిన వాక్యాలు అసహజంగా ఉన్నాయి. అందువల్ల ఈ అసహజ వాక్యాల వాడకం ఎందుకూ? అని అడగవచ్చు. వాక్య సందర్భంలో ఇమడని మాట ఎట్లా అసహజమో, వ్యవహార సందర్భంలో ఇమడని వాక్యం కూడా అంతే అసహజం, తగిన సందర్భం ఉన్నప్పుడు అసహజంగా కన్పించినవే సహజంగా కన్పించవచ్చు. ఒక దినపత్రిక స్త్రీలకు ప్రత్యేకించిన పేజీలో ఈ వాక్యాలున్నాయి:

''ఒక పురుషుడు చదువుకుంటే అతని వరకే ఆ విద్య పరిమితం. అదే స్త్రీ చదువుకుంటే ఆ కుటుంబానికంతా పరిమితమవుతుంది''

పరిమితమనే మాట మొదటి వాక్యంలో సందర్భోచితంగా ఉంది. రెండవ వాక్యంలో అసందర్భంగా ఉంది. బహుశా ఇక్కడ పర్యాప్తమవుతుంది అనే అర్థంలో పరిమితం అనే మాటను వాడినట్లు అర్థమవుతుంది.

ఇప్పుడు, ఈ ఉదాహరణలు చూడండి:

ఒక తెలుగు మాస పత్రికలో 'లవ్ సైకాలజీ' అనే శీర్షికలో ఈ వాక్యం ఉంది:

''ప్రేమించబడడం అన్నిటికన్న గొప్పది. ప్రేమించే హృదయం లేకుండా ప్రేమించబడడం కల్ల''

BRAOU

ఒక విమర్శ పుస్తకంలో '' ఈ అంశం ఈ వ్యాసంలో ఇంతకు ముందు సూచించబడింది కూడా'' అనే వాక్యం ఉంది. ఒక నవలలో .... '' దుకాణాలన్నీ మూసివేయబడ్డాయి'' అనే వాక్యం ఉంది.

అన్నం తినబడింది అనే వాక్యంతో పోల్చుకుంటే ఈ పైన ఉదహరించిన వాక్యాలేవీ అసహజంగా కన్పించటం లేదు. దీనికి కారణం పైన ఉపయోగించిన కర్మ ప్రధాన వాక్యాలు సందర్భోచితంగా ప్రయోగించబడ్డాయి. పై వాక్యాన్ని వివరిస్తూ వాడిన ఈ పూర్వపు వాక్యం కూడా కర్మ ప్రధాన వాక్యమే. అందువల్ల వాక్యాల ప్రయోగాల్లో సందర్భ శుద్ధి చూసుకుని ప్రయోగించాలి అని తెలుస్తుంది. ఈ కర్మ ప్రధాన వాక్యాల్ని కర్మణి వాక్యాలని, బడు వాక్యాలని అంటుంటారు. వీటి అవసరం మాట్లాడే భాషలో ఉండకపోవచ్చు. రాసే భాషలో అవసరమైన కొన్ని సందర్భాలను స్థూలంగా తెలుసుకుందాం:

1 . కర్త ఎవరో తెలియనపుడు – ఒక పురాతనమైన కట్టడాన్ని ఎవరు నిర్మించారో నిర్మింపజేశారో తెలియనప్పుడు– ఈకోట పదహారో శతాబ్దంలో నిర్మించబడింది' అనవచ్చు.

ఎన్‌కౌంటర్ హత్యలను గురించి రాస్తున్న వ్యాసంలో 'అతను చనిపోలేదు – చంపబడ్డాడు' అన్న వాక్యం ఉండవచ్చు.

డిటెక్టివ్ నవలలో పరిశోధిస్తే కాని తెలియని హంతకుడు చేసింది అనే అర్థంలోనూ పై రకం వాక్యం రావచ్చు.

2. కర్త ఎవరో చెప్పదలచుకోనప్పుడు, లేక చెప్పటం అవసరం లేదనుకున్నప్పుడు:

''ఇక్కడ పాలు అమ్మబడును, ఇక్కడ పిండి రుబ్బబడును, ఇల్లు అద్దె కివ్వబడును' అనే వాక్యాలు మహానగరాల్లో సర్వసాధారణంగా కనిపిస్తాయి. ఇక్కడ కర్తకు ప్రాధాన్యం లేదు. అందువల్ల విషయ ప్రాధాన్యం వల్ల ఇలాంటి వాక్యాలు కన్పిస్తాయి. ఇందులో అసహజమేమీ లేదు.

అట్లాగే హెచ్చరిక చేయబడింది, వార్త పంపబడింది అనే చోట్ల కర్తను గురించి చెప్పదలచుకోకపోవడం కన్పిస్తుంది.

3. వక్తే కర్త అయినప్పుడు మాటిమాటికీ తన్ను గురించి చెప్పుకోవడం ఎబ్బెట్టుగా ఉంటుందని ఈ రకపు వాక్యాన్ని ఆశ్రయించవచ్చు. పైన ఉదహరించిన విమర్శ ఉదాహరణ అలాంటిది.

4. కొన్ని చోట్ల కర్త, కర్మలకు కాకుండా అసలు విషయానికే ప్రాధాన్యం ఇవ్వాలన్నప్పుడు కూడా ఈ వాక్య ప్రయోగం ఉండవచ్చు. పైన ఉదాహరణలో ''ప్రేమించబడడం'' అనేది కూడా అలాంటిదే.

ఈ కర్మ ప్రధాన వాక్యాల సాధారణ దైనందిన సంభాషణ వ్యవహారంలో కనపడదు. సభలూ, సమావేశాల్లోనూ, పత్రికా రచనల్లోనూ, ఉన్నత తాత్విక, సాంస్కృతిక శాస్త్ర విషయ సందర్భాల్లోనూ కన్పిస్తుంది. తెలుగులో ఈ రకపు వాక్యాలు సకర్మక క్రియ ఉన్న వాక్యాలకే వస్తుంది. సంస్కృతం, హిందీ వంటి భాషల్లో సకర్మక, అకర్మక క్రియలు రెండింటికీ ఈ రకపు నిర్మాణ ప్రయోగాలున్నాయి. కొన్ని భాషల్లో వీటి ప్రయోగం ఎక్కువ ఉండవచ్చు. శాస్త్ర రచన బాగా అభివృద్ధి చెందిన భాషల్లో ఈ ప్రయోగాలు కన్పిస్తాయి. అక్షరాస్యత అధికంగా ఉన్న సమాజంలో కూడా ఈ ప్రయోగాల ఆధిక్యం ఎక్కువ కన్పిస్తుంది. తెలుగులో అక్షరాస్యత తక్కువ. శాస్త్ర రచనలూ తక్కువ. అందువల్ల తెలుగు రచనా భాషలో వీటి ప్రయోగాన్ని సందర్భ శుద్ధితో వాడుకోవడం నేర్చుకోవాలి.

ఇప్పుడు క్రియాంశ ప్రధాన వాక్యాలను గురించి ఆలోచిద్దాం. క్రియలను స్థితి బోధక క్రియలనీ, గతి బోధక క్రియలనీ విభజించవచ్చు. ఒక వస్తువు లేక ప్రాణి అస్తిత్వాన్ని, చలన రాహిత్యాన్ని, గుణాన్ని, స్థితిని బోధించే క్రియల్ని, స్థితి బోధక క్రియ లంటారు. గతి బోధక క్రియల్లో వ్యాకరణ గ్రంథాల్లో చెప్పే వ్యాపారం, చలనం మొదలైనవి ఉంటాయి.

BRAOU

వీటికి కాల ప్రాధాన్యం ఉంటుంది. పైన చెప్పిన క్రియాంశ ప్రధాన వాక్యాలు ఈ గతి బోధక క్రియలకే సాధ్యం. ''నేను అన్నం తినటం జరిగింది'' అనే వాక్యం వ్యాకరణ సమ్మతమే కానీ, (ప్రయోగం సంగతి ప్రస్తుతానికి వాయిదా వేద్దాం) ''మా ఇల్లు విశాఖపట్నంలో ఉండడం జరిగింది'' అనీ అనడం వ్యాకరణ సమ్మతం కాదు.

క్రియలో ఉన్న ఈ గతి అంశం వేరు చేసి, దానికి వేరే క్రియను కల్పించి చెబితే, వాటిని క్రియాంశ ప్రధాన వాక్యాలని అంటున్నాం. జరుగు, తటస్థించు, సంభవించు అనే క్రియలు తరచుగా ఈ వాక్యాల్లో కన్పిస్తాయి. ఈ వాక్యాలు కారణమేమిటో తెలియదు. కానీ ఇటీవల రచనా భాషలో ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఎంత ఎక్కువగా కన్పిస్తున్నాయంటే మాట్లాడే భాషలోకి కూడా వచ్చేటంతగా. ఉపన్యాస ధోరణిలో మాట్లాడే వ్యవహర్తల భాషా ప్రయోగంలో ఈ మాటలు ఎక్కువగా కన్పిస్తాయి. అయితే బడు వాక్యాలపై కొందరు మేధావులు విధించిన నిషేధం ఈ వాక్యాల ప్రాచుర్యానికి ఒక కారణమైతే కావచ్చు. ఈ వాక్యాల్లో కూడా కర్మ ప్రధాన వాక్యాల్లోలాగే కర్తకు ప్రాధాన్యం తగ్గుతుంది. కర్త ప్రాధాన్యాన్ని తగ్గించే ఒక వ్యూహం మీద నిషేధం ఉండటం వల్ల బహుశా ఈ రెండో వ్యూహానికి ప్రాధాన్యం పెరిగి ఉండవచ్చు. ఈ రకపు వాక్యాల్ని కూడా సాధారణ దైనందిన వ్యవహారంలో ఎక్కువగా వాడరు. అయితే, కర్త ప్రమేయం ఏమంత లేదు అని చెప్పేటప్పుడు ఈ రకపు వాక్యాలు కొంత ప్రయోజనకరం అవుతాయి. ''నేను మైసూరు వెళ్ళినపుడు భారతీయ భాషల సంస్థకు వెళ్ళటం జరిగింది'' అనే వాక్యంలో నేను ఆ సంస్థకు ప్రత్యేకంగా పనిగట్టుకుని వెళ్ళలేదనీ, ముందుగా అనుకోకుండా వెళ్ళాననీ వక్త చెపుతున్నట్లుగా మనం గ్రహించవచ్చు. అయితే దీన్ని కూడా సందర్భశుద్ధి లేకుండా ఉపయోగిస్తే అసహజంగా కన్పిస్తుంది.

**అభ్యాసం -1**

స్థితి బోధక క్రియలకూ, గతి బోధక క్రియలకూ తేడాలు తెల్పండి.

BRAOU

## 5.3 వాక్య ప్రయోగాలు : ఆమోదయోగ్యత

1. ''నీకు మొన్న పరిచయం చేశానే అతనే పెళ్ళికొడుకు''.
2. ''నీకు ఏ అబ్బాయిని పరిచయం చేశానో ఆ అబ్బాయే పెళ్ళికొడుకు''.
3. ''నీకు పరిచయం చేసిన అబ్బాయి పెళ్ళికొడుకు''.

పై మూడు రకాల వాక్యాల్నీ ఒకే అర్థంలో వాడుతారు. మొదటిది మాట్లాడే భాషలానే కన్పిస్తుంది అనుకుందాం. రెండు, మూడు రచనా భాషలో కన్పిస్తాయి. మూడో రకపు వాక్యాన్ని గురించి వివాదం లేదు. రెండో రకపు వాక్యమే తెలుగు పద్ధతి కాదని కొందరు ఈసడించుకుంటారు. ఇది తెలుగు పద్ధతి అవునా, కాదా అనే చర్చ జోలికి పోకుండా ఈ వాక్యాల అవసరాన్ని మనం గమనిద్దాం. మూడో రకపు వాక్యం సాధ్యం కాని సందర్భాలు కొన్ని ఉన్నాయి. ''నేను ఏ అమ్మాయితో సినిమాకు వెళ్ళానో, ఆ అమ్మాయి'' అనవచ్చు. అదే అర్థంలో ''నేను సినిమాకు వెళ్ళిన అమ్మాయి'' అనలేము. అంటే కొన్ని కొన్ని సందర్భాల్లో రెండవ రకపు వాక్యం రచనా భాషలో అవసరం అవుతుందన్న మాట. ఈ వాక్యాలు వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు అవసరం. ఈ వాక్యాలను రొటీన్ విషయాలకు వాడితే అసందర్భంగా ఉంటుంది. ''నేను ఏ కాయితం కోసం పొద్దుటినుంచి వెతుకుతున్నానో ఆ కాయితం ఇప్పుడు కన్పించింది'' అనే వాక్యం వ్యాకరణ సమ్మతమే కానీ, సందర్భశుద్ధి లేనిది. అంత చిన్న విషయానికి ఇంత పెద్ద వాక్యం అవసరం కాదు. కొన్ని సందర్భాల్లో దీని ప్రయోగం సందర్భోచితంగా ఉంటుంది. ''ఏ ప్రజల విముక్తి కోసం విప్లవవీరులు త్యాగాలు చేశారో ఆ ప్రజలు వారినుంచి స్ఫూర్తి పొందుతున్నారు'' – ఈ రకపు వాక్యాలను అవసరం వచ్చినపుడు సందర్భశుద్ధిని తెలుసుకుని వాడటం రచనలో అవసరం.

మాట్లాడే భాషలో లేని ఓ పద్ధతి రాసే భాషలో మొదలైంది. ఉదాహరణకి ఒక దినపత్రిక హైదరాబాదు నగర అనుబంధ సంచికలో ఈ వాక్యం చూడండి: ''అధికారులు ప్రభుత్వానికి మధ్య లోపిస్తున్న సమన్వయం''. ఇదే వాక్యాన్ని 'అధికారులకీ ప్రభుత్వానికీ మధ్య లోపిస్తున్న సంబంధం ' అని కూడా రాయవచ్చు. ఈ రకపు వాక్యాలను గురించిన చర్చ రంగనాయకమ్మ గారు రచించిన ''వాడుక భాషే రాస్తున్నామా'' అనే పుస్తకంలో విపులంగా ఉంది. ఆ గ్రంథానికి పూర్వం అందులో విషయం కొన్ని వ్యాసాలుగా పత్రికల్లో వచ్చింది. ఆ రకపు వాక్యాలమీద చర్చ చేరాతలలో కూడా జరిగింది. వివరాలు అవసరమైన వారు ఆ చర్చలు చూసుకోవచ్చు. ఇక్కడ మనకు కావల్సింది రచనా భాషలో వీటి స్థితి ఏమిటి అన్నదే. దీనిని గమనించటం కోసం ఈ కింది ప్రయోగాలు చూడండి:

''గొర్రెల పెంపకం, మేకల పెంపకం, పందుల పెంపకం'' అనే అర్థంలో వీటిని కుదించి ''గొర్రెల, మేకల, పందుల పెంపకం'' అనీ; 'గొర్రెలూ, మేకలూ, పందుల పెంపకం' అనీ పత్రికల్లో కన్పిస్తుంది. మొదటి దాని కన్నా రెండు, మూడు సందర్భాల్లో పునరుక్తమయిన పెంపకం అనే మాట చివర మాత్రమే ఉంది. పూర్వ సంబంధాల్లో లోపించింది. చివరి ఉదాహరణలో అట్లా లోపించిన తరువాత ల–లు గా మారింది. అంటే ప్రథమా విభక్తిలోకి మారింది. ఇట్లాంటి మార్పే పెంపకం అనే నామం బదులు ఓ పదంలో సమానమైన విభక్తి పదం ఉన్నప్పుడు కూడా జరిగింది: ''గొర్రెల మీద, మేకల మీద, పందుల మీద వచ్చిన లాభం'' అనేది ''గొర్రెలూ, మేకలూ, పందుల మీద వచ్చిన లాభం'' అనే పద్ధతిలో పత్రికల్లో కన్పిస్తుంది. ఇక్కడ కూడా ఈ కుదింపు జరిగింది. ఈ రకమైన కుదింపు మాట్లాడే భాషలో లేకపోవటానికీ, రాసే భాషలో కన్పించటానికీ కారణమూ ఉంది, అవసరమూ ఉంది. దానికి కారణం రాసే భాషలో ముందూ వెనకలకీ చూసుకోవచ్చు. అందువల్ల అర్థగ్రహణకి ఆటంకం లేదు. మాట్లాడే భాషలో శ్రోత వక్త భాషలో ముందు జరగబోయేది ఊహించుకోలేరు కాబట్టి మాట్లాడే భాషలో ఇట్లా జరగదు. రాసే భాషకు ఒక లక్షణం, మాట్లాడే భాషలో లేని ఒక కుదింపు. అయితే ఈ రకపు పద్ధతినే ప్రత్యయాలకు కూడా విస్తరిస్తున్నారు. ఉదాహరణకు పై పద్ధతిలోనే ''గొర్రెలు, మేకలు, పందులకు రాబడి పెరిగింది''. ఇక్కడ పై పద్ధతి విభక్తి ప్రత్యయానికి విస్తరించింది. ఈ మూడిట్లోనూ పూర్తి నామం లోపించిన పదబంధం ఎక్కువ ఆమోదయోగ్యం. విభక్తి పదం లోపించిన ప్రయోగం అంతకన్నా తక్కువ ఆమోదయోగ్యం విభక్తి ప్రత్యయ లోపం జరిగిన చోట మరింత తక్కువ ఆమోదయోగ్యం. తక్కువ ఆమోదయోగ్యమైన ప్రయోగాలను ఎక్కువ వాడకుండా ఉండే జాగ్రత్త పత్రికా రచయితలకే అవసరమవుతుంది.

BRAOU

**అభ్యాసం -2**

మాట్లాడే భాషలోని కుదింపు రాసే భాషలో ఎలా కన్పిస్తుందో వివరించండి.

## 5.4 ప్రసంగ క్రియలు

మామూలు మాట్లాడే భాషలో సాధారణంగా ఒకరన్న మాటను కోట్ (అనుకరణం) చేసినపుడు అన్నారనో, చెప్పారనో అంటాం. పత్రికల్లో ఎంతో మంది ఉపన్యాసాలనీ, ప్రకటనలనీ వారు చెప్పినట్లుగా రాయాల్సి ఉంటుంది. వారు చెప్పిన విషయాల్ని కొన్ని సార్లు రాయాల్సి ఉంటుంది. ఒక్క రెండు క్రియలతోటే అన్ని ప్రకటనలనూ, ఉపన్యాసాలనూ వర్ణించటం కుదరదు. అందువల్ల ఉద్ఘాటించారు, ప్రకటించారు, తెలియపరచారు, పేర్కొన్నారు అనే విధంగా రక రకాల క్రియలు ఉపయోగిస్తారు. అయితే ఈ క్రియ వాడేటప్పుడు ఆ క్రియలో అర్థానికి, ప్రసంగంలో విషయానికీ పద్ధతికీ సంబంధం పొసిగిందా లేదా చూసుకోవాలి. ''విద్యుత్తుపై పన్ను పెంచక తప్పలేదని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు'' అని రాస్తే అసందర్భంగా ఉంటుంది. అదే క్రియను 'మద్యనిషేధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎత్తివేసేది లేదని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు'' అంటే సందర్భోచితంగా ఉంటుంది.

**అభ్యాసం -3**

ఈ రోజు ఓ తెలుగు వార్తా పత్రికలో మొదటి పేజీలో వాడిన ప్రసంగ క్రియలు(Speech verbs) ఏవి అవి ప్రసంగ విషయానికి ఎంతవరకు సరిపోయిందీ లేనిదీ పరిశీలించండి.

BRAOU

## 5.5 వాడకూడని సదృశీకరణలు

భాషా వ్యవహారంలో ఒక వస్తువుకో, పనికో, భావానికో, మరో వస్తువునో, పనినో, భావాన్నో, సంకేతంలా చేసి మాట్లాడే పద్ధతి ఒకటుంది. సాధారణ భాషలోనే 'అతను చాలా పైకి వెళ్ళాడు' అంటే కొండమెట్లో, చెట్టు కొమ్మనో ఎక్కి పైకి వెళ్ళాడనో కాక, సమాజం కోరుకుంటున్న, లేదా అనుకుంటున్న వాంఛనీయమైన స్థితిని పొందాడు అని అర్థం. అట్లాంటి స్థితిని పొందటానికి పైకి వెళ్ళడం అన్నది సంకేతంగా ఉంది. అట్లాగే 'పతనమయ్యాడు' అంటే నడుస్తూ నడుస్తూ కింద పడ్డాడు అని కాక సమాజ దృష్టిలో అవాంఛనీయం అనుకుంటున్న స్థితిని పొందాడు అని అర్థం. ఈ రకమైన ప్రయోగాలు భాషంతా వ్యాపించి ఉంటాయి. భాషలో మాటలకు కొత్త అర్థాలు కల్పించే పద్ధతి కూడా ఇదే. ఇట్లాంటి దాన్ని 'తెలుగులో సదృశీకరణం' అందాం. ఇంగ్లీషులో 'metaphorisation' అంటారు. అయితే ఆధునిక భాషలో ఇట్లాంటి పదాలు కొన్ని అధికాధికంగా ప్రయోగించబడి అర్థప్రేరణ శక్తిని కోల్పోయి చురుగ్గా నడిచే శైలికి బరువయ్యే ప్రమాదం ఉంది. అట్లాంటి కొన్ని ఉదాహరణలు చూద్దాం. అందులో మరీ ఎక్కువగా కన్పిస్తున్న ఒక క్రియ 'అద్దంపట్టు'. ఈ మాట వాడేటప్పుడు అద్దమనే వస్తువు స్పృహ కూడా ఉండక పోవచ్చు. ఒక పత్రిక ఉత్తరాల శీర్షికలో 'కొడుకూ కూతురు కథ వాస్తవానికి అద్దం పట్టినట్లుంది' అని ఉంది. ఈ రకపు వాక్యాలు పాఠకుల ఉత్తరాల్లో ఎప్పుడూ కన్పిస్తుంటాయి. ఈ వాక్యం ఏ కథను గురించైనా చెప్పవచ్చు. ఈ 'అద్దం పట్టడం' అనేది మొదట ఎలా వచ్చిందో తెలియదు కానీ, ఇటీవల మరీ ప్రయోగాలు పెరిగిపోయాయి. అట్లాంటి వాటిలో మరో క్రియ ' ' చోటు చేసుకును' అన్నది. బహుశ ఇది ఇంగ్లీషులో 'to take place' అనే క్రియకు మారుగా వచ్చి ఉండవచ్చు. కానీ చాలా సార్లు దీని ప్రయోగం అర్థవంతంగా కన్పడదు.

'పద్య స్థానంలో వచన కవిత్వం చోటు చేసుకుంది' అన్నామనుకోండి. ఇక్కడ స్థానం అనే ప్రయోగం వల్ల చోటు చేసుకోటానికి కొంతైనా సార్థక్యముంది. ఇటీవల రచనలో ఒక చోట అచ్చయిన ఈ వాక్యం చూడండి:

'జాషువా జీవితంలో ఎన్నో ప్రధాన ఘట్టాలు చోటుచేసుకున్నాయి'.

ఘట్టాలు సంభవిస్తాయి, జరుగుతాయి. కాని ఈ 'చోటు చేసుకోవటం' ఏమిటి? ఒక వార పత్రికలో 'మందకొడితనం చోటుచేసుకుంటోంది' అన్న వాక్యం ఉంది. ఇక్కడ ఉద్దేశించింది 'వ్యాపిస్తున్నది' అని. అట్లాంటిదే మరొకటి 'వెలుగుచూచు' అనే క్రియ. ఒక తెలుగు పత్రికలో ఈ వాక్యం చూడండి – 'నాంపల్లి రైల్వే స్టేషనులోనూ పాన్‌షాపు యజమాని మహ్మద్‌గౌస్‌కు ఖైరతాబాద్ నివాసి మహ్మద్ లతీఫ్ తరచుగా కర్నాటక వెళ్ళే రైళ్ళలో మద్యం తెచ్చి ఇస్తున్న విషయం వెలుగు చూసింది'. ఈ విషయాన్ని వెలుగు సాయం లేకుండా చెప్పలేమా? ఇక్కడ కేవలం ఉద్దేశించింది ఆ సమాచారం బయట పడింది అని. ఈ కింది వాక్యం చూడండి :

''తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో అట్టడుగు ప్రజానీకం నుంచి కవులూ, కళాకారులూ ఎదిగి వచ్చి విముక్తమైన అద్భుత ప్రజా సృజనాత్మకతతో అద్దం పట్టినట్లు శ్రీకాకుళోద్యమంలో కూడా ఎందరో కవులూ, కళాకారులూ వెలుగు చూశారు''

ఈ జాతికి చెందిన పదజాలమే రూపుదిద్దుకొను, రూపొందు అన్నటువంటివి. ఇట్లాంటివే మరి కొన్ని క్రియలు రాజ్యమేలు, తీర్చిదిద్దుకొను, పాదులు తీయు మొదలైనవి.

BRAOU

**అభ్యాసం -4**

అనవసరమైన క్రియా ప్రయోగాల్ని (అర్థంవట్టు, రూపుదిద్దు) ఏరి వాటిని మామూలు భాషలో ఎట్లా సరిగ్గా ఇవ్వవచ్చో పరిశీలించండి.

## 5.6 వాక్య నిర్మాణం - కొన్ని విశేషాలు

మాట్లాడే భాషలో వాక్యాలు చిన్నవిగా ఉంటాయి. వాటి పద క్రమంలో సాధారణ పద్ధతికి అనుగుణంగా ఉంటుంది. వాక్యం పెద్దదైనపుడు దగ్గరగా వచ్చిన పదాల మధ్య వక్త ఊహించని అర్థాలు వాక్యంలో రావడానికి వీలుంది. వాక్యాలలో పదాల మధ్యన వ్యాకరణ సంబంధాలను అతిక్రమించి ఉచ్చారణలో కానీ, రాతలో కానీ, వచ్చిన వరుసలో సాహిత్యం వల్ల అనుకున్న అర్థాలని మించిన అర్థాలు వచ్చే ప్రమాదం ఉంది. ఉచ్చారణలోనూ, సంభాషణలోనూ వీటిని సవరించుకునే అవకాశం ఉంటుంది. సంభాషణలో వక్త, శ్రోత ఎదురెదురుగా ఉన్నప్పుడు వివరణ ద్వారా సవరించుకుంటారు. రాతలో ముందుగానే ఎడిట్ చేసుకోవటం అవసరం. ఉదాహరణకు పత్రికలో ఎన్నికల సందర్భంగా వచ్చిన వాక్యం చూడండి:

''నక్సలైట్లు కూడా ఓటింగులో పాల్గొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరికలు జారీ చేయటంతో ఉత్తర తెలంగాణాలోనే వార్ ప్రాబల్య గ్రామాలు ఇరుకున పడ్డాయి.''

ఈ వాక్యం ఉత్తర తెలంగాణా పరిస్థితితో ఎక్కువ పరిచయం లేని వారికి వెంటనే అర్థం కావటం కొంత కష్టం. నక్సలైట్లు కూడా - ఓటింగులో పాల్గొంటే – అనే మాటలకు ఈ లేఖకుడు సంబంధాన్ని ఉద్దేశించలేదు. రాతలో దగ్గర దగ్గరగా రావడం వల్ల ఉద్దేశించని సంబంధం వచ్చే ప్రమాదం ఉంది. 'నక్సలైట్లు కూడా' – అనే పదబంధం అన్వయించవలసింది - 'హెచ్చరికలు జారీ చేయటంతో' - అనే పదబంధంతో. అందువల్ల 'నక్సలైట్లు కూడా' అనే పదాన్ని 'హెచ్చరికలు జారీ చేయటంతో' అనే పద బంధానికి ముందు తీసుకొచ్చి పెడితే అనుకున్న అర్థం స్పష్టంగా ఉంటుంది. ఈ పై వాక్యం వ్యాకరణ విరుద్ధం కాదు. అర్థబోధక సామర్థ్యంలో కుంటుపడింది.

ఒక నవలలో ఈ వాక్యం చూడండి: ''శవాన్ని హాస్పటల్ అధికారులు తీసుకుని పోవచ్చు అని అన్నా అక్కడ ఉండే వార్డుబోయ్‌లు అటకాయించారు''. ఈ వాక్యంలో 'హాస్పటల్ అధికారులు' అనే నామవాచకం 'తీసుకుపోవచ్చు' అనే క్రియ ఒకదాని పక్కన ఒకటి వచ్చాయి. రెంటికీ ఉద్దేశించని సంబంధం చదివిన వెంటనే వస్తుంది. ఇక్కడ 'హాస్పటల్ అధికారులు' అన్న మాటను 'అన్నా' క్రియకు ముందు చేరిస్తే ఈ ఉద్దేశించని అర్థం రాదు. ఇప్పుడు మార్చిన వాక్యం

BRAOU

చూడండి : 'శవాన్ని తీసుకుపోవచ్చునని హాస్పటల్ అధికారులు అన్నా అక్కడ ఉండే వార్డుబోయ్‌లు అటకాయించారు'

తెలుగులో ఒక మనిషి చేసే పనులను ఆ చేసిన వరుసలో చెప్పటం కోసం వాక్య పద్ధతి ఒకటి ఉంది. ఇట్లాంటి పద్ధతి చాలా భాషల్లో కన్పిస్తుంది. దీన్ని ఇంగ్లీషులో 'serial verb construction', తెలుగులో 'వరుస క్రమ క్రియా నిర్మాణం' అనవచ్చు. ''ఆయన బజారుకు వెళ్ళి అయిదు గంటలకి ఇంటికి తిరిగి వచ్చారు'' అనే వాక్యంలో ఆ వ్యక్తి చేసిన రెండు పనులను కాలంలో జరిగిన క్రమంలో పేర్కొన్నారు. అయితే ఒక్కొక్కసారి ఈ క్రియలు మరీ దగ్గరగా వస్తే పూర్వ క్రియకూ, తర్వాత క్రియకూ భౌతిక ప్రపంచంలో లేదా సామాజిక ప్రపంచంలో ఉన్న సంబంధాల వల్ల ఇక్కడ వేరే అర్థాలు రావచ్చు. 'అతను వ్యాకరణం పుస్తకం చదివి నిద్రపోయాడు' అనే వాక్యంలో నిద్రకు కారణం వ్యాకరణ పుస్తకం చదవటం అనే అర్థం కూడా వచ్చే వీలుంది'. 'ఆమె భర్తతో పోట్లాడి పుట్టింటికి వెళ్ళింది' అన్న వాక్యంలో భర్తతో పోట్లాడడం అన్నది పుట్టింటికి వెళ్ళడానికి కారణంగా తోచవచ్చు. ఈ రకపు వాక్యాలు ప్రయోగించేటప్పుడు ఉద్దేశించని అర్థాలు రాకుండా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. అట్లా కాకుండా ఉండాలంటే దగ్గరగా వచ్చిన ఆ రెండు క్రియల మధ్యన ఇంకేదైనా పదబంధం చేర్చి ఆ సంబంధాన్ని అడ్డుకోవచ్చు. ఉదాహరణకు ఈ రెండు వాక్యాల్లో భేదం చూడండి:

అమె ఆఫీసుకు జడవేసుకుని వెళ్ళింది.

అమె జడవేసుకుని ఆఫీసుకు వెళ్ళింది.

మొదటి వాక్యంలో అలంకరణ విధానానికి ప్రాధాన్యం వచ్చింది. రెండవ వాక్యంలో పనుల వరసే ప్రాధాన్యం. పత్రికల్లో మనం వెతికితే అనుకోని అర్థాలు వచ్చే వాక్యాలు ఇట్లాంటివి చాలా దొరుకుతాయి.

**అభ్యాసం –5**

ఉద్దేశించని అర్థాలను ఇచ్చే వాక్యాలను కొన్నిటిని గుర్తించి వాటిని వివరించి సరిచేసిన రూపాలను రాయండి.

## 5.7 పద, వాక్య ప్రయోగాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు

పద ప్రయోగంలోనూ, వాక్య నిర్మాణంలోనూ తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలను ఇంతవరకూ పరిశీలించాం. ఇవి సాధారణంగా నేటి వచనంలో ఇతరత్రా కూడా కన్పిస్తాయి. ఈ రచయితలే దృశ్య శ్రవణ మాధ్యమాలకి రాస్తారు. కాబట్టి అక్కడ కూడా ఇలాంటి విశేషాలే కన్పిస్తాయి. అయితే ఒక్కొక్కసారి మాట్లాడినట్లు అన్పించటం కోసం మాట్లాడే భాషలోని కొన్ని చిన్న చిన్న నిర్మాణ రీతులు ఉపయోగించవచ్చు. వార్తా పఠనంలో కాగా; అనీ; ఇక పోతే; అనే సమాచారాల

BRAOU

మధ్య సంబంధాలను సూచించే మాటల వాడకం కన్పిస్తుంది. అంతకు మించి భాషలో లిఖిత శ్రవ్య, దృశ్య మాధ్యమాల మధ్యన విపరీతమైన భేదాలుండవు. వివిధ టెలివిజన్ కార్యక్రమాలలో ఇటీవలి కాలంలో కార్యక్రమాలు నిర్వహించే ఆడవాళ్ళు కానీ, మగవాళ్ళు కానీ, జంటలు కానీ ఎదురుగా ఉన్న ప్రేక్షకులను ఉద్దేశించి వాళ్ళకు గిలిగింతలు కల్గించేందుకు మాట్లాడే భాషా రీతులను వాడుకుంటున్నారు. వీటిని కోర్సు ద్వారా కాకుండా ప్రత్యేక శిక్షణ ద్వారా కానీ, వాటిని నిశితంగా పరిశీలించటం ద్వారా కానీ అవసరం అయితే నేర్చుకోవచ్చు. అయితే ఆ రీతులన్నీ ఇంకా పుట్టుక దశలోనే ఉన్నాయి కనుక వాటి మీద మనం ఇప్పుడే తీర్పులు చెప్పలేం.

## 5.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- మాట్లాడే భాషకూ రాసే భాషకూ కొన్ని పద్ధతుల వల్ల ప్రయోజనాలను, సందర్భాలను అనుసరించి తేడాలుంటాయి.
- వాక్యాలను కర్తృప్రధాన వాక్యాలు, క్రియాంశ ప్రధాన వాక్యాలు, కర్మ ప్రధాన వాక్యాలు అని మూడు రకాలుగా విభజించవచ్చు.
- క్రియలను స్థితి బోధక క్రియలు, గతి బోధక క్రియలు అని రెండు రకాలుగా పేర్కొనవచ్చు.
- రాసే భాషలో కనిపించే ఒక విధమైన కుదింపు మాట్లాడే భాషలో కన్పించదు.
- భాషలో ఒక వస్తువుకో, భావానికో, పనికో మరో వస్తువునో, భావాన్నో, పనినో సంకేతంగా చేసి వ్యవహరించటాన్ని సదృశీకరణం అంటారు. అయితే ఆ పనిని సందర్భోచితంగా చేయాలి.
- ఒక మనిషి చేసే పనులను ఆ చేసిన వరుసలో చెప్పటం కోసం ఒక వాక్య పద్ధతి ఉంది. దీనినే తెలుగులో వరుస క్రమ క్రియా నిర్మాణం (serial verb constructon) అంటారు.
- దృశ్య, శ్రవ్య మాధ్యమాలలో వాడే భాషా రీతులలో మార్పులు వస్తున్నాయి. వాటిని పరిశీలించవచ్చు. కానీ ఇప్పుడు తీర్పులు చెప్పలేం.

BRAOU

## 5.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. వాక్యంలో ప్రాధాన్యవివక్షను అనుసరించి వచ్చే భేదాలను సోదాహరణంగా చర్చించండి?
2. సదృశీకరణం అంటే ఏమిటో వివరించి కొన్ని ఉదాహరణల ద్వారా వాటి సభర్భోచిత్యాన్ని పరిశీలించండి?

**II 15 పంక్తుల్లోజవాబులు రాయండి.**

1. రాసే భాషలో కనిపించే కుదింపు మాట్లాడే భాషలో ఎందుకుండదు?
2. వరుస క్రమ క్రియా నిర్మాణం అంటే ఏమిటో వివరించండి?

BRAOU

## ఖండం : 2 భాష ప్రమాణీకరణ

భాష ప్రమాణీకరణలో ప్రసార సాధనాల పాత్ర చాలా ప్రధానమైంది. తెలుగు భాష ప్రమాణీకరణకు పత్రికలు బాగా తోడ్పడ్డాయి. ప్రమాణ భాషకు భిన్నంగా మాండలికాలు భాషలో కన్పిస్తాయి. అయితే ఈ మాండలికాల వాడుక కూడా ప్రసార సాధనాల్లో లేకపోలేదు. ఈ అంశాలన్నీ సమగ్రంగా చర్చించేందుకు ఈ ఖండంలో ఆరు భాగాలను సమకూర్చాం. అవి:

6. తెలుగు భాషాభివృద్ధి ప్రయత్నాలు – భాషా యోజన

7. భాష ప్రమాణీకరణ: నిర్వచనాదికాలు

8. భాష ప్రమాణీకరణ – మాండలికాలు

9. ప్రమాణ భాషగా తెలుగు: పత్రికల పాత్ర

10. ప్రసార సాధనాల్లో తెలుగు మాండలికాలు

11. తెలుగు పత్రికలలో భాషా శైలి : క్రమ పరిణామం ప్రత్యేక అధ్యయనం

BRAOU

BRAOU

# భాగం : 6 తెలుగు భాషాభివృద్ధి ప్రయత్నాలు: భాషా యోజన

## విషయ క్రమం

6.0 ఉద్దేశం

6.1 ప్రవేశిక

6.2 సమాజాభివృద్ధి

**అభ్యాసం –1**

6.3 భాషాభివృద్ధి

6.4 భాషా యోజన

**అభ్యాసం –2**

6.5 భారతదేశంలో భాషా సమస్యలు

**అభ్యాసం – 3**

6.6 భాషా యోజన నిర్మాణ క్రమం

6.7 భాషా యోజనలో విభాగాలు

6.8 ఆధునిక భాషగా తెలుగు అభివృద్ధికి సూచనలు

6.9 తెలుగు భాష ఆధునికీకరణ చరిత్ర

6.9.1 విద్యారంగంలో తెలుగు

6.9.2 అధికార భాషగా తెలుగు

**అభ్యాసం – 4**

6.10 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

6.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 6.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు:

- భారత దేశంలో భాషా సమస్యల్ని విశ్లేషించగలుగుతారు.
- భాషా యోజన అంటే ఏమిటో వివరించగలుగుతారు.
- తెలుగు భాష ఆధునికమవుతున్న తీరును చర్చించగలుగుతారు.



BRAOU

BRAOU

## 6.1 ప్రవేశిక

అర్థిక సామాజిక రంగాలలో అభివృద్ధికి ప్రణాళికలు, భాషాభివృద్ధి ప్రణాళిక, భారత దేశంలో భాషా సమస్యలు, భాషా యోజనలో ప్రధానాంశాలు, విభాగాలు, తెలుగు భాషాభివృద్ధి లక్ష్యాలు, సాధనాలు, వివిధ రంగాలలో తెలుగు భాష అభివృద్ధి చరిత్ర, తెలుగు భాష ఆధునికీకరణ ప్రయత్నాలు మొదలైన అంశాలను క్రమంగా పరిశీలించటం ద్వారా కాలక్రమంలో తెలుగు భాషాభివృద్ధికి జరిగిన నిర్దిష్టమైన, ప్రయత్నాలను మనం గ్రహించవచ్చు. తెలుగు ఈనాడు ఆధునిక ప్రామాణిక భాషగా అన్ని సామాజిక రంగాల్లోనూ సమర్థంగా ఉపయోగ పడడానికి దారి తీసిన పరిస్థితులను సమీక్షించుకోవచ్చు.

## 6.2 సమాజాభివృద్ధి

దేశాల, జాతుల అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా సాధించడం ఆధునిక ప్రజాస్వామ్య యుగ ప్రధాన లక్షణం. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు, సంస్థలు ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట లక్ష్యాలతో, కార్యక్రమాలతో పని చేయవలసి ఉంటుంది. నిర్దిష్ట కాలపరిమితిలో నిర్దిష్ట లక్ష్యాలను సాధించడం ద్వారానే ప్రభుత్వాలూ, సంస్థలూ తమ అస్తిత్వాన్ని నిరూపించుకోగలుగుతాయి. దీనికి అనుకూలమైన వ్యూహ రచనలు అవసరం. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిలో ముఖ్యమైన అంశాలు ఇవి:

1. అన్ని రంగాలలోనూ ప్రజా సమస్యలను పరిష్కరించటం

2. పరిష్కార విషయంలో సరియైన నిర్ణయాలను తీసుకోవడం

3. ప్రారంభించిన కార్యక్రమాలను ఒక క్రమపద్ధతిలో అమలు పరచడం

4. వ్యయ పరచిన కాలం, ధనం, శ్రమకు తగిన ఫలితాలను సాధించ గలిగారో లేదో అంచనా వేసుకోవడం.

(a) లక్ష్యాలను నిర్దేశించడం (b) సాధనాలను ఎన్నుకోవడం (c) ఫలితాలను సాధించడం అన్నవి ప్రధాన ప్రణాళికా రచనలో ముఖ్యమైన విభాగాలు. ఈ రూపంలో ప్రణాళిక ఒక సంక్లిష్ట కార్యక్రమం. దేశాభివృద్ధికి సంబంధించిన విషయాలలో ప్రాధాన్య, అప్రాధాన్యతలను గుర్తించగలగడం కూడా ప్రణాళికల రచనలో ప్రధానమైన వ్యూహం.

**అభ్యాసం – 1**

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అంటే ఏమిటి?

___

___

___

___

BRAOU

## 6.3 భాషాభివృద్ధి

ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి సంబంధించిన విషయాలు అందరికీ సుపరిచితాలు. జల వనరులు, ఇతర ప్రకృతి వనరులను ప్రజలకు ఉపయోగించే విధంగా వినియోగించుకోవడం, మానవ వనరులను ప్రత్యేక పద్ధతిలో ఉపయోగించుకోవడం, పరిశ్రమలు, విద్యుత్తు, వ్యవసాయం, పాడి పరిశ్రమలు మొదలైన వాటి విస్తరణకూ అభివృద్ధికీ రూపొందించే కార్యక్రమాలూ, ఉత్పత్తుల పంపిణీ విధానం, విద్య, విజ్ఞానం, వైద్య సదుపాయాలు, ప్రయాణ సాధనాలు ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చే కార్యక్రమాలూ దేశాభివృద్ధి ప్రణాళికలో ప్రధానమైన అంశాలు, అంగాలు. ఈ అన్ని రంగాలలోనూ ప్రజల భాగస్వామ్యాన్ని తెలియజేయటానికీ, ప్రజలకు తమకు గల హక్కులను, బాధ్యతలు తెలియజేయడానికీ కూడా కొన్ని కార్యక్రమాలు అవసరం. ఇది ప్రజల భాష ద్వారానే సాధ్యం. ప్రత్యేక దేశంలో, రాష్ట్రంలో, ప్రాంతంలో అత్యధిక సంఖ్యాక ప్రజల భాష ద్వారా ఈ పనులు జరగాలి. మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాలకూ, విషయాలకూ సంబంధించిన అంశాలను అభివ్యక్తం చేయగల సమర్థమైన సాధనంగా భాషను అభివృద్ధి చేయవలసి ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరికీ విద్యార్జనకూ, విజ్ఞాన సముపార్జనకూ కావలసిన అవకాశాలుండాలి. ఇవి భాష ద్వారానే జరుగుతాయి. పరిపాలన, న్యాయ నిర్వహణ, విద్యా బోధన ప్రజల భాషలోనే జరగాలి. పత్రికలు, ప్రసార సాధనాలు కూడా ప్రజల భాషలోనే పని చేస్తాయి. సమస్త రంగాలలోనూ ఉపయోగించే విధంగా భాషను అభివృద్ధి చేయవలసి ఉంటుంది. భాషాభివృద్ధి నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం జరుగవలసి ఉంటుంది. దీన్నే భాషా యోజన అంటున్నాం.

BRAOU

## 6.4 భాషాయోజన

భాషా శాస్త్రంలో భాషా యోజన అన్న భావన ఇటీవలి కాలంలో చాలా ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడిప్పుడే అది అభివృద్ధి చెందుతున్న రంగం. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వాలు, ప్రత్యేక సంఘాలు, వ్యక్తులు భాషాభివృద్ధి కోసం, వివిధ రంగాలలో భాషా వినియోగానికి సంబంధించిన పనుల కోసం ప్రయత్న పూర్వకంగా చేసే కృషి భాషా యోజన. భాషా యోజనకు సంబంధించిన సిద్ధాంతాలు, సూత్రాలు, సమస్యలు మొదలైన వాటిని గురించి సాధారణ రూపంలో చర్చించిన గ్రంథాలు చాలా ఉన్నాయి. కాని ప్రతి దేశానికీ, భాషకూ సంబంధించిన సమస్యలు, భిన్న భిన్నాలుగా ఉండవచ్చు. భిన్నమైన చారిత్రక నేపథ్యాలు, పరిస్థితులు కారణంగా ప్రపంచ భాషలన్నిటికీ వర్తించే విశ్వజనీన సిద్ధాంతాలను రూపొందించటం కష్టం. అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు, వెనుకబడిన దేశాలలోని భాషా సమస్యలు వేరువేరుగా ఉంటాయి. యూరప్‌లో ఏక భాషా జాతుల దేశాలలో భాషాభివృద్ధి సమస్యలు అంత సంక్లిష్టం కావు, భారత దేశం లాంటి బహు భాషా దేశాలలో భాషా సమస్యలు కొంత సంక్లిష్టంగా ఉంటాయి. జాతీయ స్థాయిలో సంసర్గ భాషను గుర్తించడం, వివిధ భాషా ప్రయుక్త రాష్ట్రాలలోని భాషల అభివృద్ధి క్రమం, జాతీయ స్థాయిలోని భాషను, వివిధ ప్రాంతాలలోని భాషలకు గల సంబంధాలు, పరిపాలనా పరమైన సమన్వయాలు మొదలైన సమస్యలు బహు భాషా దేశాలలో ఉంటాయి. కొన్ని దేశాలలో సమాన ప్రతిపత్తి, సుమారుగా సమాన జన సంఖ్య గల జాతుల సమాఖ్యగా ఉంటాయి. అటువంటి దేశాలలో ఒక ప్రధాన భాషను గుర్తించటం కష్టం. అలాంటి దేశాలు సమీపంలో ఉంటే అభివృద్ధి చెందిన దేశాల భాషను పరిపాలన, విద్య, సాంస్కృతిక రంగాలలో మాధ్యమంగా స్వీకరించవచ్చు.

**అభ్యాసం –2**

బహుభాషా జాతుల దేశాలలో భాషా సమస్యల్ని పేర్కొనండి.

## 6.5 భారత దేశంలో భాషా సమస్యలు

భారత దేశంలోని భాషలకు సంబంధించిన సమస్యలలో కొన్ని భేదాలున్నా చాలా వరకు సామ్యాలు కనిపిస్తాయి. భారతదేశంలో లిపి లేని భాషలు అనేకం ఉన్నాయి. లేఖన రూపంలో గుర్తించదగ్గ చరిత్ర, సాహిత్యం గల భాషలు న్నాయి. వీటిలో కొన్ని సమానమైన లక్షణాలు ఉన్నాయి:

1. ఈ భాషలన్నిటికీ స్వతంత్రమైన లిపి ఉంది.

2. ఈ భాషలన్నిటిలో వర్ణ లేఖనానికి సన్నిహితంగా ఉండడం వల్ల లేఖన క్రమానికి సంబంధించిన సమస్యలు తక్కువ.

3. ఆధునిక భారతీయ భాషలన్నిటికీ సుమారుగా వెయ్యి సంవత్సరాలనుంచి, రెండు వేల సంవత్సరాల వరకు గుర్తించదగిన చరిత్ర ఉంది.

4. ఈ భాషలన్నిటిలో పద్య సాహిత్యం చాలా ప్రాచీన మైనది.

5. ఆధునిక యుగ ప్రారంభంలో భాగంగా ఈ భాషలన్నిటిలో సుమారుగా ఒకే కాలంలో వచన సాహిత్య ప్రక్రియలు ప్రారంభం అయ్యాయి. వచనం విస్తరించడం ఆధునికతకు ప్రధాన లక్షణం.

6. ప్రాంతీయ, వర్గ మాండలిక భేదాలు ఎన్ని ఉన్నా, ఈ భాషలన్నిటిలోనూ సాహిత్యంలో, పత్రికలలో, ప్రసారసాధనాలలో చాలా మందికి సమానంగా అంగీకార యోగ్యమైన వచన రచనా శైలి అభివృద్ధి చెందుతున్నది.

7. పరిపాలన, బోధన రంగాలలో ఇంతకు ముందు వలస పాలనలో ఇంగ్లీషు నిర్వహించిన పాత్రను క్రమక్రమంగా ఈ భాషలు నిర్వహించడానికి సిద్ధం అవుతున్నాయి. భాషాభివృద్ధిలో భాషను ఆధునికీకరించడం ముఖ్యమైన భాగం. పై లక్షణాల వల్ల ఆధునికీకరణకు అవసరమైన కింది అంశాలన్నిటినీ

BRAOU

భారతీయ భాషలు సంతరించుకుంటున్నాయని చెప్పవచ్చు:

(a) లేఖనంలో స్థిరీకృత సంప్రదాయం

(b) సమస్త భావాలను, అభిప్రాయాలను వ్యక్తీకరించగల మౌఖిక వ్యవహారం

(c) శాస్త్ర విజ్ఞానాన్ని నిష్కర్షగా, నిర్దుష్టంగా వ్యక్తం చేయగలగడం.

(d) సృజనాత్మక సాహిత్యానికి సమర్థమైన సాధనంగా ఉపయోగించడం.

**అభ్యాసం – 3**

భారతీయ భాషలలో సమాన లక్షణాలను కొన్నిటిని పేర్కొనండి.

BRAOU

## 6.6 భాషా యోజన నిర్మాణ క్రమం

భాషా యోజనలో ప్రధానంగా మూడు దశలుంటాయి:

1. భాషకు సంబంధించిన శాస్త్రీయమైన అధ్యయనం.

భాషాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను రూపొందించే ముందు ఆ భాషకు సంబంధించిన చరిత్ర, సంప్రదాయాలు, భాషా స్వరూపం మొదలైన వాటికి సంబంధించిన శాస్త్రీయ మైన అవగాహన అవసరం అవుతుంది. వీటితో పాటు భాషా వ్యవహర్తల ఉద్దేశ్యాలు, భావాలు, వైఖరులు, మనస్తత్వం, లక్ష్యాలు మొదలైన అంశాలతో పరిచయం కూడా భాషా యోజనను నిర్వహించే వారికి అవసరం అవుతాయి.

2. ప్రజల మధ్య ప్రత్యేక సంబంధాలను గుర్తించడం.

ఒక భాషా వ్యవహారానికి సంబంధించిన వివిధ ప్రాంతాలలో, పట్టణాలలో, గ్రామాలలో నివసించే ప్రజల పరస్పర సంబంధాలు, వారి భాషా వ్యవహారంలో గల భేదాలు, ఉచ్చారణ వైవిధ్యం మొదలైన అంశాల అవగాహన భాషా యోజనకు అవసరం.

3. శాస్త్రీయమైన భాషాయోజన

భాషను గురించి, భాషా వ్యవహర్తల గురించి శాస్త్రీయమైన అవగాహనతో వచ్చిన జ్ఞానంతో ప్రణాళికను నిర్మించాలి. చాలా మందికి అంగీకార యోగ్యమైన ప్రత్యేక భాషా రూపాన్ని అందరికీ సంబంధించిన కార్యక్రమాలకు ఉపయోగించడం, ఎన్నుకోవడం, నిర్దిష్టమైన రచనా శైలికి రూపకల్పన చేయటం, పరిభాషా కల్పన, లేఖన స్థిరీకరణ - ఇవి భాషా యోజనలో ముఖ్యమైన అంశాలు.

## 6.7 భాషా యోజనలో విభాగాలు

భాషాభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన ముఖ్యమైన విభాగాలు ఇవి:

**లిఖిత భాష**

1. అధికార కార్యకలాపాలు

పరిపాలన, న్యాయస్థానాలు, చట్టాలు, ప్రకటనలు మొదలైనవి.

2. సృజనాత్మక సాహిత్యం

వివిధ వచన సాహిత్య ప్రక్రియలు.

3. విద్యా రంగం.

శాస్త్ర విజ్ఞానం, సామాజిక శాస్త్రాల బోధన, ప్రాథమిక, ఉన్నత, పాఠశాల విద్యలు, వయోజన విద్య, అందరికీ విద్య మొదలైనవి.

4. పత్రికలు

**వాచిక భాష**

1. అధికారులతో, ప్రభుత్వంతో చర్చలు, విన్నపాలు

2. ప్రసార సాధనాలు, రేడియో, టి.వి. మొదలైనవి.

3. నిత్య వ్యవహారం.

పై రంగాలలో భాషోపయోగానికి సంబంధించిన విధాన నిర్ణయాలు భాషా యోజనలో భాగం అవుతాయి.

## 6.8 ఆధునిక భాషగా తెలుగు అభివృద్ధికి సూచనలు

తెలుగును ఆధునిక భాషగా అభివృద్ధి చేయటానికి భాషా వేత్తలు చేసిన సూచనలను కింది విధంగా క్రోడీకరించవచ్చు:

1. అన్ని మాండలికాలకు దగ్గరగా ఉండే పద్ధతిలో ప్రమాణ భాష ఏర్పడడం

BRAOU

2. అందరికీ పరిచయం ఉన్న మాటలతో, సరళమైన వాక్యాలలో అభిప్రాయ ప్రకటన చేయగలిగిన అలవాటును పెంచడం

3. భాషను ఉపయోగించే విషయంలో అనవసరమైన కట్టుబాట్లను పరిహరించటం

4. భిన్న శాస్త్రా లకు సంబంధించి తెలుగులోనే పరిశోధన చేయటాన్ని ప్రోత్సహించటం

5. విజ్ఞాన, సామాజిక శాస్త్రాలకు సంబంధించిన అనువాదాలను కాక, స్వతంత్ర గ్రంథ రచనలను ప్రోత్సహించటం

6. వీలయినంత వరకు తెలుగు మాటలలోనే పారిభాషిక పదాలను సృష్టించే ప్రయత్నం చేయటం

7. అవసరాన్ని బట్టి ప్రజలలో నలిగిన ఇంగ్లీషు పదాలనో, తెలుగులో అతికే సంస్కృత పదాలనో ఉపయోగించటం

8. ప్రజలకు పరిపాలనలో భాగస్వామ్యం పెంచడానికీ, శాస్త్ర విజ్ఞానాన్ని ఎక్కువ మందికి అందుబాటులోకి తేవడానికీ చిత్తశుద్ధితో కృషి చేయటం

## 6.9 తెలుగు భాష ఆధునికీకరణ చరిత్ర

BRAOU

తెలుగు భాషను ఆధునీకరించే ప్రయత్నాలు స్వాతంత్ర్యానంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తరువాత మాత్రమే ప్రభుత్వం ద్వారా, సంస్థల ద్వారా ప్రారంభమయ్యాయి. వాస్తవానికి దానికి సుమారు రెండు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. క్రీ.శ. 1800 నాటికే ఆంగ్లేయ పరిపాలన కాలంలో ప్రజల వ్యవహారంలో ఉండే భాషలో ఉన్న స్థానిక చరిత్రలను సేకరించటం, నిత్య వ్యవహారానికి సంబంధించిన భాషాధ్యయనం, పరిశోధనలు ప్రారంభం అయ్యాయి. 1916లో మద్రాసులో సెయింట్ జార్జి ఫోర్టు కళాశాల ప్రారంభమయింది. ఇంగ్లీషు అధికారులకు స్థానిక భాషలలో శిక్షణ ఇవ్వటం ఈ కళాశాల ప్రధాన కార్యక్రమాలలో ఒకటి. సమకాలీన వ్యవహారంలోని తెలుగు భాషకు వ్యాకరణాలు, నిఘంటువులు వచ్చాయి. ఇంగ్లీషు అధికారులు తెలుగులోనే ఉత్తర, ప్రత్యుత్తరాలు, అధికార కార్యకలాపాలు నిర్వహించే వారు. ఏ.డి. క్యాంప్ బెల్, సి.పి. బ్రౌన్ మొదలైన వారు నిర్వహించిన తెలుగు అభివృద్ధి, ఆధునికీకరణ కార్యక్రమాలకు స్థానిక పండితులు తోడ్పడ్డారు. ఈ కాలంలోనే పఠన, పాఠనాదుల కోసం సమకాలీన వ్యావహారిక తెలుగు వచనంలో వాచకాలు, పాఠ్య గ్రంథాలు వచ్చాయి. ఏనుగుల వీరా స్వామి 'కాశీ యాత్ర చరిత్ర' వ్యావహారిక వచనంలోనే ఉంది. ఈ వచన రచనల ఆవిర్భావం భాష ఆధునీకరణలో మొదటి మెట్టు. ఈ కాలంలో వచ్చిన వ్యాకరణాలూ, నిఘంటువులూ తెలుగు భాషా వికాసానికీ, అనేక రంగాలలో తెలుగు భాషా వినియోగానికీ తోడ్పడ్డాయి. 1847-52 మధ్య సామాజిక, సాంస్కృతిక, విద్యా రంగాలలో ఆధునిక భావాలను ప్రవేశ పెడుతూ సామినేని ముద్దు నరసింహ నాయుని వ్యాసాలు వచ్చాయి. మాతృభాషలో విద్యా, విజ్ఞాన బోధన జరగాలనీ, ఆ భాష ఆధునికం అయి ఉండాలనీ ముద్దు నరసింహ నాయుడు భావించాడు. విద్యా, వైజ్ఞానిక రంగాలలో ఉపయోగించవలసిన భాష ఏ రూపంలో ఉండాలి అని ఆధునిక భావాలు గల మేధావులు పందొమ్మిదవ శతాబ్దం మధ్యకాలం నాటికే ఆలోచన చేశారని దీనివల్ల తెలుస్తుంది. 1857 తరువాత పరిపాలనా భాషగా ఇంగ్లీషును ప్రవేశ పెట్టేంత వరకూ, చిన్నయ సూరి వచన రచనలో కూడా గ్రాంథిక ప్రాచీన కావ్య భాషకు పట్టం కట్టేంత వరకూ తెలుగు భాషా వినియోగంలో ఈ పరిస్థితి కొనసాగింది. క్రీ.శ. ఇరవయ్యో శతాబ్ది

ప్రారంభం నాటికి గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావులతో తెలుగు భాష ఆధునీకరణ ప్రయత్నాలు ఉద్యమ రూపం దాల్చాయి.

విశ్వవిద్యాలయాలలో పండితులతోనూ, గ్రాంథిక భాషా వాదులతోనూ సంబంధం లేకుండానే క్రీ.శ. 1900 నాటికి తెలుగు వివిధ రంగాలలో వినియోగానికి వచ్చింది. సామాజిక, రాజకీయోద్యమాలు, వాటి తీవ్రత, వార్తాపత్రికలు, తదితర పత్రికలు, వివిధ వచన సాహిత్య ప్రక్రియలైన నవల, కథానిక, వ్యాసం, జీవిత చరిత్రలు మొదలైన రచనలు, రేడియో, సినిమా, తెలుగు భాష ఆధునీకరణకు తోడ్పడ్డాయి. అనేక భాషా సాహిత్య సంస్థలు, ఉద్యమాలు, ప్రజలలోని ప్రజాస్వామ్య చైతన్యం దీనికి మరింత దోహదం చేశాయి. విద్యా విధానంలో తెలుగు ప్రాధాన్యం పెరుగుతూ వచ్చింది. తెలుగులో పాఠ్య గ్రంథాలు అవసరమయ్యాయి. వివిధ రంగాలలో ఉపయోగించవలసిన తెలుగు భాషా స్వరూపాన్ని గురించి చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. విశ్వవిద్యాలయాలలో తాత్కాలికంగా గ్రాంథిక భాషావాదం నెగ్గినా విశ్వవిద్యాలయాల బయట క్రమంగా తెలుగు ఆధునిక ప్రామాణిక భాష స్థిరపడ సాగింది. 1947 నాటికి సృజనాత్మక రచనలు, వార్తాపత్రికలు, సినిమాలు, రేడియోలు, ఇతర కమ్యూనికేషన్ సౌకర్యాల విస్తరణ, విద్యారంగంలో ఉన్నత తరగతుల వరకు తెలుగును మాధ్యమంగా ఉపయోగించటం తెలుగు ప్రామాణిక భాషకు రూపకల్పన చేశాయి. (6.9.1)

స్వాతంత్ర్యం తరువాత 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. తెలుగును అధికార భాషగా విస్తృతంగా వినియోగంలోకి రావడం (6.9.2) కళాశాలల స్థాయి వరకు తెలుగును బోధనా మాధ్యమం చేయటం మొదలైన కార్యక్రమాలు అమలులోకి వచ్చాయి.

BRAOU

### 6.9.1 విద్యారంగంలో తెలుగు

విద్యారంగంలో బోధనా భాషగా తెలుగును అమలు చేయడానికి కింది లక్ష్యాలతో 1968లో తెలుగు అకాడమీని స్థాపించడం జరిగింది:

(a) బోధనా భాషగా తెలుగును అభివృద్ధి పరచడానికి అనుగుణంగా తెలుగును ఆధునీకరించడం

(b) తెలుగులో వివిధ విషయాలకు సంబంధించిన పాఠ్య గ్రంథాలను, రిఫరెన్సు పుస్తకాలను, పదకోశాలను తయారు చేయడం

(c) విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు మాధ్యమంగా బోధించటానికి సూచనలివ్వడం

(d) తెలుగును అధికార భాషగా అమలు చేయటానికి తగిన దోహదాన్ని ప్రభుత్వానికి అందజేయడం

తెలుగు అకాడమీ చాలా తక్కువ కాలంలో వివిధ విషయాలకు సంబంధించిన ఇంటర్మీడియెట్, డిగ్రీ స్థాయి పాఠ్య గ్రంథాలను సిద్ధం చేసింది. తెలుగు ప్రామాణిక భాషకు దోహదం చేయటానికి తెలుగు మాండలికాల పరిశోధనను ప్రారంభించింది. సమగ్ర తెలుగు నిఘంటు నిర్మాణం అకాడమీ లక్ష్యాలలో ఒకటి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ మాండలిక వృత్తి పదకోశాలు తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడ్డాయి.

### 6.9.2 అధికార భాషగా తెలుగు

భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణ ప్రధాన లక్ష్యం ప్రజల భాషలో పరిపాలన. 1948లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగమైన తూర్పు గోదావరి జిల్లాలో, 1952లో పూర్వ హైదరాబాదు రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలలో తెలుగును అధికార భాషగా అమలు పరచే ప్రయత్నం జరిగింది. 1956లో ఏర్పడిన తొలి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వర రావు అధ్యక్షతన శాసనసభ ఉపసంఘం తెలుగు పారిభాషిక పదకోశాన్ని తయారు చేసింది. 1966లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా శాసనం చట్ట రూపం దాల్చింది. ఆంధ్రప్రదేశ్ గెజెట్‌లో ప్రకటించిన తేదీ14-5-1966 నుంచి తెలుగు అధికార భాషగా అమలులోకి వచ్చింది. శాసనసభలోని బిల్లులు, గవర్నర్ ఆర్డినెన్సులు, ఇతర ఉత్తర్వులు తెలుగు భాషలో వస్తున్నాయి. తెలుగు మాధ్యమంలో డిగ్రీ చేసిన వారికి ప్రభుత్వోద్యోగాలలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఉత్తర్వులు వచ్చాయి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో తెలుగు మాధ్యమం ప్రవేశించింది. 1972లో అధికార భాషగా తెలుగు అమలును పర్యవేక్షించటానికి, దానికి తగిన సూచనలివ్వడానికి, 'ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం' ఏర్పడింది.

ఇవి తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు. కాని ప్రజల అభిరుచులు, అవసరాలు, వారి భాగస్వామ్యం మాత్రమే తెలుగు భాషాభివృద్ధికి నిజంగా తోడ్పడేవి.

**అభ్యాసం – 4**

తెలుగు ఆధునిక ప్రామాణిక భాషగా స్థిరపడడానికి దోహదం చేసిన పరిస్థితులను క్లుప్తీకరించండి.

BRAOU

## 6.10 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- దేశాల జాతుల అభివృద్ధిని ప్రణాళికా బద్ధంగా సాధించటం ఆధునిక ప్రజాస్వామ్య యుగ ప్రధాన లక్షణం.
- భాషాభివృద్ధి కూడా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారంగా జరగాలి. దీన్నే మనం భాషా యోజన అంటున్నాం.
- బహు భాషా దేశాలలో జాతీయ స్థాయిలో సంసర్గ భాషను గుర్తించటం, వివిధ భాషా ప్రయుక్త రాష్ట్రాలలోని భాషల అభివృద్ధి క్రమం, జాతీయ స్థాయిలోని భాషనూ, వివిధ ప్రాంతాలలోని భాషలతు సంబంధాలూ, పరిపాలనా పరమైన సమన్వయాలూ – మొదలైన సమస్యలు కన్పిస్తాయి.

- ☞ భాషా యోజనలో ప్రధానంగా మూడు దశలుంటాయి అవి: 1. భాషకు సంబంధించిన శాస్త్రీయ అధ్యయనం. 2) ప్రజలకు మధ్య ప్రత్యేక సంబంధాలను గుర్తించటం. 3) శాస్త్రీయమైన యోజన.

- ☞ తెలుగు భాషను ఆధునీకరించే ప్రయత్నాలు జరుగుతూ వచ్చాయి. గిడుగు, గురజాడ కాలంలో ఉద్యమ రూపంలో ప్రయత్నించారు. విద్యారంగంలో బోధనా మాధ్యమం ఆధునిక ప్రామాణిక భాష అయ్యింది. అధికార భాషగా తెలుగును ప్రకటించి ప్రభుత్వం అమలు చేసింది.

- ☞ తెలుగు భాషాభివృద్ధికి వాస్తవానికి దోహద పడేవి, తెలుగు ప్రజల అభిరుచులు, అవసరాలు, వారి భాగస్వామ్యం మాత్రమే.

## 6.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. భాషాభివృద్ధి అంటే ఏమిటో వివరించండి?
2. తెలుగు భాష ఆధునీకరణ చరిత్రను వివరించండి?

**II 15 పంక్తులలో సమాధానాలు రాయండి**

1. భాషా యోజనలో విభాగాలను గురించి రాయండి?
2. ఆధునిక భాషగా తెలుగు అభివృద్ధికి సూచనలివ్వండి?

BRAOU

# భాగం : 7 భాష ప్రమాణీకరణ: నిర్వచనాదికాలు

**విషయ క్రమం**


7.0 ఉద్దేశం

7.1 ప్రవేశిక

7.2 భాషా రూప భేదాలు

**అభ్యాసం – 1**

7.3 ప్రామాణిక భాషా స్వరూపం, అభివృద్ధి వికాసాలు

7.3.1 ప్రామాణిక భాషా లక్షణాలు

7.3.2 ఒక భాషను ప్రమాణ భాషగా గుర్తించడానికి ఆధారాలు

7.3.3 ప్రమాణ భాష ప్రయోజనాలు

**అభ్యాసం – 2**

7.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

7.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 7.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు –

- భాషా భేదాలకు సంబంధించిన కొన్ని భావనలను నిర్వచించగలుగుతారు.
- ప్రామాణిక భాష ఎలా రూపం సంతరించుకుంటుందో వివరించగలుగుతారు.
- ప్రమాణ భాష లక్షణాలనూ, ప్రయోజనాలనూ విశదీకరించగలుగుతారు.

## 7.1 ప్రవేశిక

భాషకు సంబంధించిన మౌఖిక, లిఖిత వ్యవహారాలూ, భిన్న భాషా రూప భేదాలూ ఉన్నప్పుడూ ఒక రూపం అంగీకార యోగ్యం కావచ్చు. దానికి కొన్ని కారణాలు పని చేస్తాయి. ప్రామాణిక భాషగా ఒక భాషా రూపం అభివృద్ధి చెందే విధానాన్ని పరిశీలించే క్రమంలోనే మనం ప్రామాణిక భాషాలక్షణాల్నీ, ప్రామాణిక భాష ఉపయోగాల్నీ గుర్తించవచ్చు.

## 7.2 భాషా రూప భేదాలు

మానవ జాతి ఎంత పాతదో సుమారుగా మానవ భాష కూడా అంత పాతది. కొన్ని సహస్రాబ్దాలుగా భాష మౌఖిక రూపంలోనే వ్యవహారంలో ఉంది. లిఖిత విధానం మీద ఆధారపడ్డ మానవ నాగరికతకు నాలుగైదు వేల సంవత్సరాల కంటే ఎక్కువ చరిత్ర లేదు. భాషకు సంబంధించిన లేఖన విధానం అభివృద్ధి చెందడానికీ, మానవ నాగరికత అభివృద్ధికీ అవినాభావ సంబంధం ఉంది. సంక్లిష్ట సామాజిక, రాజకీయ విధానాలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, సృజనాత్మక సాహిత్యం మానవ నాగరికతలో ప్రధానాంశాలు. వీటిని స్థలాంతర వాసులకు, కాలాంతర వాసులకు అందజేయడానికి లేఖన విధానం అవసరం అయింది. మౌఖిక భాషా వ్యవహారం సమీప వర్తుల మధ్యే సాధ్యం. లిఖిత భాషద్వారా దూరంగా ఉన్న వారితో కూడా అభిప్రాయ వినిమయం సాధ్యం అవుతుంది. సంక్లిష్టమైన అనుభవాలనూ, గూఢమైన శాస్త్ర విజయాలనూ, విస్తృతమూ, వైవిధ్యపూరితమూ అయిన భావాలనూ ఎక్కువ మందికి అందించటానికి లిఖిత భాష శక్తి మంతమైన సాధనం. ముద్రణ యంత్రాలు, రేడియో మొదలైన ప్రసార సాధనాలు విశ్వజనీన విద్యావకాశాలకూ, భావనలకూ ఆచరణాత్మక రూపం ఇచ్చాయి. ప్రజాస్వామ్య లక్ష్యాలను చేరుకోవటానికి దీనివల్ల అవకాశం కలిగింది.

లేఖన ప్రవేశం, లిఖిత సాహిత్యాభివృద్ధి భాషకు సంబంధించిన కొన్ని భావనలను ప్రవేశ పెట్టాయి. 'సాధు = అసాధు', 'వ్యాకరణ – వ్యాకరణ విరుద్ధ', 'ప్రామాణిక – అప్రామాణిక' భాషా భేదాలను గురించిన ఆలోచనలు ప్రవేశించాయి. భాషా వికాసానికి సంబంధించిన ప్రతి దశలోనూ లిఖిత భాషా రూపాన్ని స్థిరీకరించే ప్రయత్నాలు జరిగాయి. లిఖిత భాషకు లిఖిత వ్యాకరణాలు వచ్చాయి. లిఖిత భాషలో, సాహిత్యంలో ప్రయోగ యోగ్యాలేవి? కానివేవి? అన్న విషయాలను నిర్ధారించే ప్రయత్నాలు లిఖిత వ్యాకరణాలు చేశాయి. ఆధునిక కాలంలో శాస్త్రీయమైన భాషా పరిశోధనలు, భాషను గురించిన అవగాహనలో మార్పులు తెచ్చాయి. పండితులనుంచి సామాన్యుల వరకు 'వ్యాకరణ సమ్మతం' అని భావిస్తున్న భాషా ప్రయోగాలు నిజానికి సమాజంలో విద్యావంతులైన అల్పసంఖ్యాకుల వ్యవహారానికి సంబంధించినవి. వ్యాకరణ సమ్మతం కాని ప్రయోగాలు అంటే ఎక్కువ మందికి అనివార్యం, అదరణీయం కాని ప్రయోగాలనే అర్థం. ఒక భాషా రూపం సామాజికంగా ఆదరణీయం, అంగీకార యోగ్యం కాకపోవటానికి భాషాగతమైన కారణాలు లేవు. భాషకు సంబంధించిన అనేక వ్యవహార రూపాలలో ఏదీ స్వయంగా తక్కువదీ ఎక్కువదీ కాదు. కొన్ని భాషా రూపాలను ప్రామాణికమని, అప్రామాణికమని భావించటానికి భాషేతరమైన సామాజిక, రాజకీయ, చారిత్రక కారణాలే ప్రధానమైనవి. నాగరికత అభివృద్ధి చెందిన సమాజాలలో భాషేతర రంగాలలోని విలువలూ, విధానాలూ భాషా రంగంలోకి కూడా ప్రవేశిస్తాయి. సామాజిక, ఆర్థిక రంగాలలోని అంతస్తులు, గ్రామీణ, పట్టణ భేదాలు, విద్యావంతులు – అవిద్యావంతులనే తారతమ్యాలు భాషా రంగాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. మంచి భాష, చెడ్డ భాష అన్న భావాలు స్వభావంలోనూ, స్వరూపంలోనూ సామాజిక స్థాయిలో కనిపించే ఆధిక్యత, న్యూనతా భావనలతో ముడిపడి ఉంటాయని భాషా శాస్త్రజ్ఞులు నిరూపించారు.

**అభ్యాసం – 1**

భాషలో కన్పించే భిన్న రూప భేదాలను పేర్కొనండి.

________________________________________

________________________________________

________________________________________

________________________________________

BRAOU

## 7.3 ప్రామాణిక భాషా స్వరూపం - అభివృద్ధి వికాసాలు

భాషకు సంబంధించిన అనేక రూపాలలో ఒక రూపం అనుకార్యమై ప్రామాణిక భాషగా ఆదరణీయం కావటంలో మానవ ప్రవృత్తులు, స్వభావాలు ముఖ్య పాత్ర వహిస్తాయి. అనేక భాషా వ్యవహార భేదాలలో ఎక్కువది ఏది? తక్కువది ఏది? అనుకరణ యోగ్యమైంది ఏది? కానిది ఏది? ఏది ఆదరణీయం? ఏది కాదు? లేఖన ప్రమాణాలకు తగింది ఏది? ఏది కాదు? అన్న ప్రశ్నలకు సమాధానాలు ఆర్థిక, సామాజిక రంగాలలోనే దొరుకుతాయి. సాధారణంగా అధిక విద్యావంతులైన అల్ప సంఖ్యాక వర్గాలైన వారి భాషే ఆదరణీయం, ప్రామాణికం అవుతుంది. అలాంటి వర్గాలు సాధారణంగా పట్టణాల్లోనూ, రాజధాని నగరాల్లోనూ కేంద్రితమై ఉంటాయి. విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక, పరిపాలనా కార్యకలాపాలు ఇక్కడ నుంచే ప్రారంభమై ఇతర ప్రాంతాలలోకి వ్యాపిస్తాయి. అందువల్ల సాధారణంగా ప్రామాణిక భాష రాజధాని నగరాల నుంచి ఇతరత్రా వ్యాపిస్తుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నగరాలలో స్థిరపడే వారి భాషా ప్రయోగాలను తనలో ఇముడ్చుకుంటూ ప్రామాణిక భాష అభివృద్ధి చెందుతుంది. ప్రామాణిక మైన ఇంగ్లీషు లండన్ నుంచి, ఫ్రెంచి పారిస్‌నుంచి, లాటిన్ రోమ్‌నుంచి వ్యాపించింది. కలకత్తాలో చదువుకున్న వారి భాష ప్రామాణికమైన బెంగాలీ భాషగా, పూనాలోని భాష ప్రామాణికమైన మరాఠీ భాషగా, మైసూర్‌లోని భాష ప్రామాణికమైన కన్నడ భాషగా ఇతరులకు ఆదరణీయం, అనుకార్యం అయింది. ఇటీవలి కాలం వరకు తెలుగు వారికి సాంస్కృతిక కేంద్రమైన రాజధాని నగరం లేదు. తెలుగు సాహిత్యం, పత్రికలు, ముద్రణ ఎక్కువగా కోస్తా జిల్లాలలోనే అభివృద్ధి చెందింది. అందువల్ల కోస్తా జిల్లాలలో చదువుకున్న భాష ప్రామాణిక తెలుగు భాషగా ఇంకా చెలామణీలో ఉంది. ఆధునిక ప్రసార సాధనాలు కూడా ప్రమాణ భాష విస్తరించటానికి కారణాలవుతాయి. ప్రామాణిక, అప్రామాణిక భాషలు ఎప్పుడూ పరస్పరం ప్రభావితం అవుతుంటాయి. ఒక దశలో అప్రామాణికమూ, ప్రాంతీయమూ అయిన భాషా ప్రయోగం మరొక దశలో శక్తిమంతమైన సృజనాత్మక రచనల ద్వారా ప్రామాణికం అవుతుంది. పరస్పర ఆదాన ప్రదానాల ద్వారా, భిన్న రంగాలలో విస్తృత వినియోగం ద్వారా మాత్రమే ప్రామాణిక భాష అభివృద్ధి చెందుతుంది. కొంతమంది వ్యక్తులు గాని, సంస్థలు గాని, ప్రభుత్వ సంస్థలు గాని ప్రయత్న పూర్వకంగా భాషా ప్రమాణికతను సాధించలేవు. ప్రామాణిక భాషా వినియోగానికి మాత్రమే అవి కొంత వరకు తోడ్పడగలవు.

BRAOU

### 7.3.1 ప్రామాణిక భాషా లక్షణాలు

ఒక భాష ఆధునిక ప్రామాణిక భాషగా అభివృద్ధి చెందటానికి కింది లక్షణాలు ఉండాలని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం:

1. మాండలికాలకు అతీతమై చాలా మందికి అంగీకారయోగ్యం కావటం.

2. స్థిరత్వంతో పాటు వెసులు బాటు తనం, స్థిరీకరణతో పాటు సాంస్కృతికమైన మార్పులను అనుసరించి మార్పులు పొందటానికి కూడా ప్రామాణిక భాషలో అవకాశం ఉండాలి.

3. బౌద్ధికీకరణం అంటే శాస్త్ర విజయాలనూ, తదితర విషయాలనూ నిష్కర్షగా, నిర్దిష్టంగా, శాస్త్రీయంగా వ్యక్తం చేయగల శక్తి ప్రామాణిక భాషకు ఉండాలి.

4. రచనా విధానానికి సంబంధించిన ప్రత్యేక శైలి రూపొందటం.

5. ఆధునిక విజ్ఞానానికి సాధనంగా భాషను ఉపయోగించటానికి తగిన పదజాలం, పరిభాషా పదాలు.

6. సమగ్రమైన లిపి, లేఖన విధానం: సమానమైన లేఖన క్రమం, వ్యవహారం, పదజాలం మొదలైన వాటలో సమగ్రమైన ప్రామాణిక భాష ఏ భాషకూ కనిపించదు. ఎక్కువ శాతం సమానత్వాన్ని సాధించగలగడమే ప్రమాణ భాష విషయంలో మనం చేయగలిగిన పని. స్వరూప నిర్ణయంలో తక్కువ భేదాన్ని, ప్రయోగంలో ఎక్కువ వెసులుబాటును భేదాన్ని ప్రమాణ భాష అపేక్షిస్తుంది.

### 7.3.2 ఒక భాషను ప్రమాణ భాషగా గుర్తించటానికి ఆధారాలు

ఒక భాషా రూపాన్ని ప్రమాణ భాషగా గుర్తించడానికి ఆధారాలు ఇవి:

1. ఎక్కువ మంది వ్యవహర్తలు అంగీకరించటం.
2. వివిధ రంగాల్లో ఉపయోగించటం.
3. విద్యావంతులుగా గుర్తింపు పొందటానికి కారణం కావటం.
4. సాధారణ వచన సాహిత్యం ఆ భాషలో రావటం.
5. ఒక భాష మాట్లాడే వారి సంస్కృతి, సమైక్యతలకు సంకేతం కావటం.

### 7.3.3 ప్రమాణ భాష ప్రయోజనాలు

అభివృద్ధి చెందిన, చెందుతున్న సమాజాలలో సమానమైన అభివృద్ధిని సాధించటానికి స్థూలంగా ఏకరూపత కలిగిన భాషా వినియోగం అవసరమవుతుంది. ప్రమాణ భాష ప్రయోజనాలను కింది రూపంలో నిర్దేశించవచ్చు:

1. ప్రామాణిక భాష, ఒక భాషకు సంబంధించిన వివిధ మాండలికాలను మాట్లాడే వారిని, ఒక ప్రామాణిక భాషా వ్యవహర్తల సమాజంలో భాగం చేస్తుంది.
2. స్థానిక మాండలికాలను మాట్లాడే వారి మధ్య, ప్రామాణిక భాషా వ్యవహర్తలకు ప్రత్యేక గౌరవస్థానం ఉంటుంది. ఇదే ప్రత్యేక భాషను అనుకరించటానికి, అనుసరించటానికి కారణం అవుతుంది.
3. సాధారణ రచనా కార్యకలాపాలకు నమూనా కావటం ప్రామాణిక భాష లక్షణం.
4. పరిపాలనకు సమర్థమైన వాహికగా ఉపయోగిస్తుంది.
5. నియత విద్యకు సంబంధించిన అన్ని దశలలో ఆధునిక విజ్ఞానాన్ని వ్యాపింపజేయటానికి వాహిక అవుతుంది.
6. తోటి భాషలనుంచి, తమభాషలలోకి పరస్పర అనువాదాల ద్వారా విజ్ఞాన, సమాచార వినిమయానికి సాధనం అవుతుంది.
7. అక్షరాస్యత వ్యాప్తికి ప్రధాన సాధనం అవుతుంది.

BRAOU

ప్రమాణ భాష, సృజనాత్మక రచనలలోనూ, వైజ్ఞానిక, వినోద ప్రచార సాధనాలలోనూ కనిపిస్తుంది. కొంత మాండలిక భేదాలున్నా అర్థం కావటానికి అటంకం లేని పద్ధతిలో ఆ భాష ఉంటుంది. మాండలికాలకూ, సమకాలీన వ్యవహారానికీ దూరమై కావ్య భాష లాగా మాత్రం ప్రమాణ భాష మారిపోకూడదు. వివిధ రంగాలలో ఉపయోగించే భాష ఎలా ఉండాలి అనేది ప్రభుత్వ సంస్థలు గాని, అకాడమీలు గాని శాసించకూడదు. ఈ విషయంలో ప్రయోక్తలకు స్వేచ్ఛ ఉండాలి. వివిధ మాండలికాలు మాట్లాడే వారి మధ్య సంబంధ, బాంధవ్యాల మీద ఆధారంగా మాత్రమే ఎక్కువగా ఏకరూపత కలిగిన ప్రమాణ భాష ఏర్పడుతుంది.

**అభ్యాసం – 2**

A) ప్రామాణిక భాష ఎలా ఏర్పడుతుంది.

B) ప్రమాణ భాష ప్రయోజనాలను క్లుప్తీకరించండి?

BRAOU

## 7.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- భాషలో లిఖిత, అలిఖిత భేదాలున్నాయి.
- భిన్న రంగాల్లో విస్తృత వినియోగం ద్వారా ప్రామాణిక భాష అభివృద్ధి చెందుతూ వస్తుంది.
- ప్రామాణిక భాషకు కొన్ని లక్షణాలనూ భాషా శాస్త్రజ్ఞులు కొందరు పేర్కొన్నారు.
- ఎక్కువ మంది వ్యవహర్తలు, విద్యావంతులు అంగీకరించటం, ఎక్కువ రంగాల్లో విస్తృతంగా ఉపయోగంలో ఉండటం ఆధారంగా ప్రమాణ భాషను గుర్తించవచ్చు.
- ప్రమాణ భాషకు కొన్ని నిర్దిష్ట ప్రయోజనాలున్నాయి.

## 7.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I కింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. మౌఖిక, లిఖిత భాషలను గురించి తెలియజేయండి?

2. ప్రమాణ భాష ఏర్పడే విధానాన్ని తెలియజేయండి?

**II కింది ప్రశ్నకు 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. ప్రామాణిక భాష లక్షణాలను వివరించండి?

2. ప్రమాణ భాష ప్రయోజనాలను వివరించండి?

BRAOU

# భాగం : 8 భాష ప్రమాణీకరణ: మాండలికాలు

విషయ క్రమం

8.0 ఉద్దేశం

8.1 ప్రవేశిక

8.2 భాషా భేదాలు

అభ్యాసం -1

8.3. మాండలికాలు

8.3.1 ప్రాంతీయ మాండలికాలు

8.3.2 వర్గ మాండలికాలు

8.4 ప్రమాణ భాష

అభ్యాసం - 2

8.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 8.0 ఉద్దేశం

ఈ భాగం చదివిం తర్వాత మీరు -

- భాషా వ్యవహారంలో కనిపించే మాండలిక భేదాలను గురించి వివరించగలుగుతారు.
- ప్రమాణ భాష ఎలా ఏర్పడుతుందో విశ్లేషించగలుగుతారు.

## 8.1 ప్రవేశిక

జన వ్యవహారంలోని భాషా భేదాలు, ప్రమాణ భాష ఆవశ్యకత, లక్షణాలు, ప్రయోజనాల గురించి ముందు భాగంలో తెలుసుకున్నాం. ఇప్పుడు ప్రమాణ భాష ఏర్పడే విధానంలో ప్రాంతీయ, వర్గ మాండలికాలూ, భాషలో ప్రామాణికతా ఎలా సంతరించుకుంటాయో పరిశీలిద్దాం.

## 8.2 భాషా భేదాలు

జన వ్యవహారంలోని ఏ భాషకైనా అనేక రూపాలుంటాయి. అందులో కొన్ని కోట్ల మంది వ్యవహరించే తెలుగు వంటి భాషలలో వైవిధ్యం సహజం. భౌగోళికంగా విస్తృత ప్రాంతంలో భాష వ్యవహారంలో ఉన్నప్పుడు, ప్రాంతాలను బట్టి అనేక భేదాలు ఉండవచ్చు. ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వివిధ అంతస్తులు గల సమాజంలో అంతస్తులను బట్టి, వృత్తులను బట్టి భాషా భేదాలు ఉండవచ్చు. ఈ భేదాలు భాషలో భిన్న కాలాలలో వచ్చిన మార్పుల మీద ఆధారపడి ఉంటాయి. క్రీ.శ. పదకొండవ శతాబ్దిలో నన్నయ భారత రచనాకాలం నాటికే కావ్య భాష, సామాన్య వ్యవహార భాష అనే రెండు శైలులు తెలుగులో స్థిరపడ్డాయి. కావ్యాలలో కావ్య శైలి కనిపిస్తుంది. శాసనాలలో వ్యవహార శైలికి సన్నిహితమైన భాష కనిపిస్తుంది. నన్నయకు ముందునుంచి ప్రారంభమైన అనేక రకాలైన భాషా పరిణామాలు ఆధునిక వ్యావహారిక భాషా రూపానికి దారితీశాయి. ఆధునిక కాలంలో వివిధ రంగాలలో రచనా వ్యవహారానికి ఆధునిక భాషా రూపాన్నే ఎన్నుకోవటం అవసరం. సహజం కూడా. సమకాలంలో కూడా ప్రాంతాలను బట్టి, సమాజంలో వర్గాలను బట్టి లేక చదువుకున్న వారు, చదువుకోనివారు అన్న భేదాన్ని బట్టి భాషా వ్యవహారంలో భేదాలు కనిపిస్తాయి. వీటినే మాండలిక భేదాలు అంటున్నాం. అన్ని మాండలికాలకు దగ్గరగా ఉంటూనే సుమారుగా అందరికీ అంగీకారయోగ్యమై, అందుబాటులో ఉండి లిఖిత రూపంలో, ప్రత్యేక సందర్భాలలో, అధికార కార్యకలాపాలలో, విద్యావ్యవహారాలలో ఉపయోగిస్తున్న భాషను ప్రమాణ భాష అంటున్నాం. ఒకప్పుడు మాండలికంగా భావించిన భాషా రూపాలు విస్తృత ఉపయోగం వల్ల ప్రమాణ భాషలో భాగం కావచ్చు.

**అభ్యాసం – 1**

మాండలిక భేదాలంటే ఏమిటి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 8.3 మాండలికాలు

చారిత్రక దశలను బట్టి కనిపించే భాషా భేదాలు ప్రస్తుత విషయం కాదు. ప్రాచీన కాలంలో 'వచ్చుచున్నాడు' అన్న వర్తమాన కాల సమాపక క్రియా రూపానికి 'వస్తున్నాడు' ఆధునికరూపం. సింహంబు/ సింహమ్ము/ సింహము అన్న ప్రాచీన అమహదేక వచన రూపాలకు 'సింహం' అన్నది ఆధునిక రూపం. 'నలుబది' అన్న ప్రాచీన సంఖ్యా వాచక రూపానికి 'నలభై' ఆధునిక రూపం. ప్రస్తుతం ప్రాచీన రూపాలు ఏ మాండలికంలోనూ వ్యవహారంలో లేవు. వాటికి ఆధునిక ప్రమాణ భాషలో స్థానం లేదు. సమకాలీన భాషలో భేదాలు ప్రాంతాలను బట్టి, సమాజంలో స్థాయిలను బట్టి రెండు విధాలుగా ఉండవచ్చని ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఇవి: ప్రాంతీయ మాండలికాలు, వర్గ మాండలికాలు



BRAOU

### 8.3.1 ప్రాంతీయ మాండలికాలు

ప్రాంతాలను బట్టి కనిపించే భాషా భేదాలను ప్రాంతీయ మాండలికాలని అంటారు. వృత్తి పదకోశాలను తయారు చేసే సందర్భంలో వివిధ ప్రాంతాలలోని భాషా భేదాలను పరిశీలించిన భాషా వేత్తలు నాలుగు ప్రధాన మాండలిక భాషా భేదాలను గుర్తించారు.

అవి ఇవి:

**ఉత్తరాంధ్ర (మాండలికం):** ఒకప్పటి హైదరాబాదు రాష్ట్రంలో ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన పది జిల్లాలు, తెలంగాణా అని వ్యవహారంలో ఉన్న ప్రాంతం.

**దక్షిణాంధ్ర (మాండలికం):** రాయలసీమ నాలుగు జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు

**మధ్యాంధ్ర (మాండలికం):** కోస్తా ప్రాంతానికి సంబంధించిన గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలు.

**పూర్వాంధ్ర (మాండలికం):** విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు.

ప్రాంతీయ మాండలిక భేదాలు రెండు రకాలుగా ఉండవచ్చు:

1. ఒకే అర్థాన్ని లేక వస్తువును సూచించడానికి భిన్న ప్రాంతాలలో భిన్న పదాలు వ్యవహారంలో ఉండటం.

| **ఉత్తర** | **దక్షిణ** | **మధ్య** | **పూర్వ** |
|---|---|---|---|
| మోట | కపిల | మోట | మోట |
| నాగలి | మడక/నాగేలి | నాగలి | నాగలి |
| ఆనిగెపుకాయ | సొరకాయ | సొరకాయ | ఆనపకాయ |
| పుంటికూర | గోగాకు | గోంగూర | గోంగూర |
| గడ్డపార | గడ్డపార | గడ్డపార/గడ్డపలుగు | గునపం |

2. ఒక పదానికి భిన్న ప్రాంతాలలో భిన్నమైన ఉచ్చారణలూ, రూపభేదాలూ ఉండవచ్చు.

| **ఉత్తర** | **దక్షిణ** | **మధ్య** | **పూర్వ** |
|---|---|---|---|
| వచ్చిండు | వచ్చినాడు | వచ్చాడు | వచ్చాడు |

BRAOU

| | | | |
|---|---|---|---|
| వస్తడు | వస్తడు | వస్తాడు | వస్తాడు |
| పోయిన | పోయినాను | పోయాను | పోయాను |
| చేయాలె | (చేయవలె) | చెయ్యాలి | చెయ్యాలి |

### 8.3.2 వర్గ మాండలికాలు

సమాజంలో చదువుకున్నవారు, చదువుకోని వారు అన్న భేదాన్ని బట్టి భాషా భేదాలు ఉండవచ్చు. సాధారణంగా మధ్య తరగతి, డబ్బున్న ఉన్నత తరగతి వారిలో మాత్రమే చదువుకున్న వారు ఎక్కువగా ఉండటం వల్ల, కింది తరగతి వారు ఎక్కువగా చదువుకోవడానికి వీలు లేని వారు కావడం వల్ల, ప్రధానంగా ఈ రెండు రకాల వర్గాలను గుర్తించడం సరియైన పద్ధతి. కొంత మంది వీటిని కుల మాండలికాలన్నారు. కాని కింది కులాల వారిలో చదువుకున్న వారు సామాజిక వ్యవహారంలో పై కులాలలో చదువుకున్న వారి భాషనే ఉపయోగిస్తున్నారు. అందువల్ల వీటిని వర్గ మాండలికాలనే వ్యవహరించడం సబబు. ఈ వర్గాలు సాంస్కృతిక భేదాలను సూచించేవిగా మాత్రమే గుర్తించవచ్చు. వర్గ భేదాలను బట్టి కనిపించే భాషా భేదాలను శిష్ట వ్యవహారమని, శిష్టేతర వ్యవహారమని కూడా కొందరు వ్యవహరిస్తారు.

వర్గ మాండలికాలు ప్రధానంగా ఉచ్చారణ భేదాలపైన ఆధారపడి ఉంటాయి. ఆ భేదాలలో కొన్నిటిని భాషా వేత్తలు గుర్తించిన రీతిలో కింది విధంగా చెప్పుకోవచ్చు.

| | చదువుకున్న వారు | చదువుకోని వారు |
|---|---|---|
| 1. | మహాప్రాణోచ్చారణ ఉంటుంది. | ఉండదు |
| | భాగవతం, ధర్మం | బాగవతం, దర్మం |
| 2. | చకారోచ్చారణ | చకారం సకారం ఉచ్చారణ |
| | చదువు, చమురు, చుక్క | సదువు, సమురు, సుక్క |
| 3. | పదాది వకారం | పదాది వకారలోపం |
| | వెళ్లాడు, వాన, వేడి | ఎల్లాడు, అన, ఏది |
| 4. | ళకారోచ్చారణ | ళ ల్లగా ఉచ్చారణ |
| | (మూర్ధన్యోచ్చారణ) | (దంతమూలీయోచ్చారణ) |
| | పెళ్లి, వెళ్లాడు, వాళ్లు | పెల్లి, ఎల్లాడు, అల్లు |
| 5. | హకారోచ్చారణ | హకారలోపం |
| | హరివిల్లు, రోహిణి | అరివిల్లు, రోయిణి |
| 6. | శ, ష, స ల భేదం ఉంటుంది. | ఉండదు |
| | శని, భాష, | సని, బాస |

BRAOU

7. సంయుక్త వర్ణాల ఉచ్చారణ — మార్పు

అన్యాయం, పుణ్యం — అన్నేయుం, పున్నెం

8. 'f' ఉచ్చారణ

కాఫీ — కాపీ

9. రూప భేదాలు

పోతుంది — పోతది/ పొద్ది

ఏమిటి — ఏంది

పై పదాలలో చాల వరకు దేశ్యేతరాలు ఎక్కువగా సంస్కృతం నుంచి వచ్చినవి. సంస్కృతంనుంచి గాని, ఇంగ్లీషు నుంచి గాని తెలుగులో చేరిన పదాలను యథాతథంగా చదువుకున్న వారు మాత్రమే వాడటం నిత్య జీవితంలో మనం చూడవచ్చు.

**అభ్యాసం –1**

ప్రాంతాలను బట్టి మాండలికాలను ఎలా విభజించారో తెల్పండి?

BRAOU

## 8.4 ప్రమాణ భాష

సాధారణంగా విద్యా, సంస్కృతులకు కేంద్రమైన ప్రాంతం, లేదా నగరానికి సంబంధించిన భాష ఇతర ప్రాంతాల వారికి అనుసరణీయమై ప్రమాణ భాషగా రూపొందుతుంది. సాధారణంగా రాజకీయ రాజధాని సాంస్కృతిక కేంద్రం కావచ్చు. చారిత్రక కారణాల వల్ల రాజకీయ రాజధాని కాక మరొక ప్రాంతమో, నగరమో సాంస్కృతిక కేంద్రం కావచ్చు. బెంగాలీలకు రాజకీయ రాజధాని, సాంస్కృతిక కేంద్రం రెండూ కలకత్తా నగరమే. మరాఠీ వారికి రాజకీయ రాజధాని బొంబాయి, కానీ సాంస్కృతిక కేంద్రం పూనా. తెలుగు వారికి కొన్ని శతాబ్దాల చరిత్ర కలిగిన విద్యా సాంస్కృతిక కేంద్రమైన నగరం లేదు. ఆంధ్ర రాష్ట్రం / ఆంధ్రప్రదేశ్ ఏర్పడేంతవరకు కోస్తా, రాయలసీమ ప్రాంతాల వారికి మద్రాసు, తెలంగాణా ప్రాంతం వారికి హైదరాబాదు రాజకీయ రాజధానులు. అందువల్ల కోస్తా ప్రాంతంలో చదువుకొన్న వారి భాషే ప్రమాణ భాషగా లిఖిత రచనా వ్యాసంగంలో అనుకార్యం అయింది. దీనికి కారణం కోస్తా ప్రాంతం ఆర్థికంగా, సాంస్కృతికంగా ముందు ఉండడం. దీని ఫలితంగా ముద్రణ సౌకర్యాలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఏర్పడ్డాయి.

సాహిత్యం, అభివృద్ధి చెందింది. పత్రికలు ఈ ప్రాంతంనుంచే విస్తృతంగా వెలువడ్డాయి. ఇతర ప్రాంతాల వాళ్ళు ఈ సాహిత్యానికీ , పత్రికలకూ పాఠకులు కావడం వల్ల అందులోని భాష వాళ్లకూ అనుకార్యం అయింది. తెలుగు భాష ప్రామాణికీకరణలో, అధునికీకరణలో పత్రికల పాత్ర ప్రముఖమైనదని ఇంతకు ముందే తెలుసుకున్నాం. వీటికి తోడు సినిమాలు, ఆకాశవాణి, దూరదర్శన్ మొదలైన ప్రసార సాధనాలు తెలుగు భాష ప్రామాణికీకరణకు, సమరూపతకు తోడ్పడ్డాయి.

**అభ్యాసం – 2**

తెలుగు భాష ప్రామాణీకరణకు తోడ్పడే అంశాలను క్రోడీకరించండి.

## 8.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ప్రాంతాన్ని బట్టి, వర్గాన్ని బట్టి, చదువుకున్న వారు, చదువుకోని వారు అన్న భేదాన్ని బట్టి భాషా వ్యవహారంలో కనిపించే భేదాలను మాండలిక భేదాలని అంటున్నాం.
- మాండలికాల్లో ప్రాంతీయ మాండలికాలు, వర్గ మాండలికాలు అనే రెండు భేదాలున్నాయి.
- ఆర్థికంగా, సాంస్కృతికంగా ముద్రణ, పత్రికలు, సాహిత్యం పెరగడం వల్ల కోస్తా ప్రాంత భాష ప్రామాణిక భాషగా తయారు అయ్యింది.

## 8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I** 30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. ప్రాంతీయ మాండలికాలను గురించి రాయండి.
2. తెలుగులో వర్గ మాండలికాలను గురించి రాయండి.

**II** 15 పంక్తుల్లో సమాధానాలు రాయండి

1. ఒకే భాషలో భిన్న రూప భేదాలు ఉండడానికి కారణం ఏమిటి?
2. మాండలికాలంటే ఏమిటి?

BRAOU

# భాగం : 9 ప్రమాణ భాషగా తెలుగు: పత్రికల పాత్ర

**విషయ క్రమం**


9.0 ఉద్దేశం

9.1 ప్రవేశిక

9.2 పత్రికలు – భాషా ప్రామాణికీకరణ

**అభ్యాసం –1**

9.3 పత్రికా రచన: కొత్త శైలులు – పద నిర్మాణాలు

9.4 పత్రికల్లో పదజాలం – రకాలు

9.4.1 ఆదానం

9.4.2 సంస్కృత పదాలు

9.4.3 కొత్త పద బంధాల నిర్మాణం

**అభ్యాసం – 2**

9.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

9.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 9.0 ఉద్దేశం

ఈ భాగం చదివిం తర్వాత మీరు –

- పత్రికలు, ప్రమాణ భాష, ప్రమాణ భాషగా తెలుగు అభివృద్ధి చెందడంలో పత్రికల పాత్ర, పత్రికా భాష పరిణామ క్రమం గురించి తెలుసుకోగలుగుతారు.

- నూతన భావాలను వ్యక్తం చేయడానికి నూతన పద బంధాల నిర్మాణం – శైలీ పద్ధతులు గురించి వివరించగలుగుతారు.

## 9.1 ప్రవేశిక

భాషాభివృద్ధి, ప్రమాణీకరణం, ఆధునికీకరణం కొందరు వ్యక్తుల వల్ల, సంస్థల వల్ల, ప్రభుత్వ ఆదేశాల వల్ల మాత్రమే సాధ్యమయ్యేది కావని ఇంతకు ముందు భాగాలలో తెలుసుకున్నాం. వివిధ రంగాలలో భాషను విస్తృతంగా వినియోగించడం ద్వారానే వివిధ విషయాల అభివ్యక్తి సాధనంగా భాష అభివృద్ధి పొందుతుందని, ప్రమాణ భాష రూపొందుతుందని కూడా తెలుసుకున్నాం. ఈ విషయంలో పత్రికల పాత్ర ఎంతో ముఖ్యమైనదని కూడా తెలుసుకున్నాం. ఆధునిక జీవితంలో ప్రాముఖ్యం వహించే అన్ని విషయాలకు పత్రికలు సామాన్య పాఠకులకు అందజేస్తున్నాయి. నిత్య వార్తా ప్రచురణతో పాటు, ఆధునిక మానవ జీవితానికి సంబంధించిన అన్ని రకాల విషయాలు వార్తా పత్రికలలో వస్తాయి. రాజకీయాలు, విజ్ఞాన శాస్త్ర విషయాలు, న్యాయ స్థాన విషయాలు, సాహిత్యం, సినిమా, కళలు, క్రీడారంగం, విద్యారంగం, సమకాలంలో జరిగే ప్రముఖ సంఘటనలు మొదలుగా పత్రికలలో కనిపించని విషయాలు ఉండవు. ప్రత్యేక రంగానికి సంబంధించిన ప్రచురణలు, అవి పుస్తకాల రూపంలో ఉన్నవి గాని, పత్రికల రూపంలో గాని, ప్రత్యేక రంగానికి సంబంధించిన పాఠకులే చదువుతారు. కాని విభిన్న ప్రాంతాలకు, వర్గాలకు సంబంధించిన అధిక సంఖ్యాక ప్రజలు వార్తాపత్రికల పాఠకులు. అందువల్ల అన్ని రకాల పాఠకులకు అంగీకార యోగ్యమైన భాషను పత్రికా రచయితలు వాడవలసి ఉంటుంది. ఈ రూపంలో ప్రమాణ భాష ఏర్పడడానికి పత్రికలు దోహదం చేస్తాయి. సమాన స్వరూపంగల భాష, శైలి పత్రికల ద్వారా పాఠకులకు పరిచయం అవుతాయి. కొత్తగా అక్షరాస్యులైన వారిపైన కూడా పత్రికల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

## 9.2 పత్రికలు - భాష ప్రమాణీకరణ

భాషల ఆధునికీకరణలో ప్రమాణీకరణం ఒక ముఖ్యమైన అంశం. ప్రమాణీకరణం అంటే ఒక రకంగా ఆధునికీకరణం కూడా. ప్రమాణీకరణం ప్రధానంగా స్వరూప సంబంధి – ఆధునికీకరణం అంటే వివిధ విషయాలను అభివ్యక్తీకరించడానికి సమర్థంగా భాష అభివృద్ధి చెందడం. ఈ రెండు విషయాలలోనూ పత్రికల పాత్ర కనిపిస్తుంది. సుమారు నూరు సంవత్సరాల చరిత్ర గల పత్రికలలో కనిపించే భాషా స్వరూపాన్ని పరిశీలిస్తే క్రమంగా పత్రికా భాష ఎలా మారిందో తెలుస్తుంది. ప్రస్తుతం ఆధునిక భాష ఏ విధంగా నిలదొక్కుకుందో కూడా తెలుస్తుంది. ఉదాహరణకు 1842 నాటి వర్తమాన తరంగిణిలోని ప్రకటనను పరిశీలిస్తే సమకాలీన భాషను వాడడంలో మొదటినుంచీ పత్రికలు ఎలాంటి పాత్ర వహిస్తున్నాయో తెలుస్తుంది.

**'మా పత్రికను ---- వరకు ప్రతి బుధవారపు ఉదయమున ప్రచురణము చేస్తూ వుంటిమి. అయితే అడుగడుక్కున్ను మంగళ వారపు గెజిట్టి మంగళవారం రాత్రి వస్తున్నది గనుక అది తర్జుమా చేసి అచ్చు వెయ్యడానికి సావుకాశం చాలనందుననున్ను అథవా కష్టపడి సిద్ధం చేసినా గాని బంట్రోతులు అప్పగించడంలో జరిగించే అజాగ్రత్తవల్ల నున్ను సావుకాశపడుతూ వచ్చినది గనుక యిక మీదట పూర్వపు వృత్తాంతి వలెనే ప్రతి గురువారం ఉదయాన ప్రచురము చేసేలాగున నిశ్చయించుకొని జాగ్రత్తలేని బంట్రోతులకు బదులు కొందరు కొత్త వాండ్రను యేర్పరచి యికమీద చెప్పిన వేళకు సరిగా మా పత్రికలు చందాదార్లకు చేరేలాగున చేసినాము'.**

ఈ భాగంలోని భాషను ప్రస్తుతం వస్తున్న పత్రికలలోని భాషతో పోలిస్తే తెలుగు పత్రికా భాష క్రమ క్రమంగా పాత వాసనలను వదిలి ఎక్కువ మంది పాఠకుల దగ్గరకు వెళ్లే శైలిని సంతరించుకున్న పద్ధతి మనకు తెలుస్తుంది. ప్రామాణీకరణలో గాని, ఆధునికీకరణలో గాని పత్రికల పాత్ర సంస్థల పాత్ర లాగా ప్రణాళికాబద్ధంగా కనిపించదు.

BRAOU

**అభ్యాసం – 1**

వర్తమాన తరంగిణిలోని ప్రకటన భాగాన్ని ఆధునిక పత్రికా భాషలోకి మార్చి రాయండి.

## 9.3 పత్రికా రచన: కొత్త శైలులు - పదనిర్మాణాలు

వార్తలను సేకరించి, ప్రకటించడంలో, వాటిని సంగ్రహించడంలో రోజూ ఇంగ్లీషులో వచ్చిన వార్తలను అనువదించడంలో తక్షణ అవసరాలు కొత్త విషయాలను, భావాలను తెలియజేయడానికి పదజాలాన్ని, వాక్య నిర్మాణ రీతులను, వ్యూహాలను నిర్మించుకోవలసిన అవశ్యకతను కలిగిస్తాయి. పత్రికా రచయితల విషయంలో ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. పుస్తకాలను, నిఘంటువులను సంప్రదించటానికో, పండితులతో చర్చించడానికో వారికి సమయం ఉండదు. కొత్త పదజాలం, కొత్తశైలి వీటిని ఎప్పటికప్పుడు నిర్మించుకుంటూ పత్రికా రచయితలు ముందుకు సాగవలసి ఉంటుంది. సంక్షేప రూపంలోగాని, విపులీకరించి గాని చేసే వార్తాకథనం, వ్యాఖ్యానం, ముఖాముఖి, ప్రముఖులు చెప్పిన విషయాలను సారాంశీకరించడం. ఆకస్మిక సంఘటనలను వర్ణించడం, సంపాదకీయ వ్యాసాల, పరిశోధనాత్మక వార్తారచన, ప్రత్యేక శీర్షికలు, మొదలైన రీతిలో కొనసాగే పత్రికా రచన తగిన పదజాలాన్ని, భాషా శైలులను ఎప్పటికప్పుడు నిర్మించుకోవలసి ఉంటుంది. వీటికి శీర్షికలను తయారు చేయడం మొదలుకొని విషయాన్ని వివరించడం వరకు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను రూపొందించుకోవలసి ఉంటుంది. చాలా శాస్త్ర, సాంకేతిక విషయాలకు సంబంధించినవి తప్పిస్తే చాలా భావాలను సూచించే పదజాలం, పారిభాషిక పదాలు పత్రికల ద్వారా వ్యాప్తిలోకి వచ్చినవే.

## 9.4 పత్రికల్లో పదజాలం - రకాలు

పత్రికలలో కన్పించే పదజాలం ప్రధానంగా మూడు రకాలు. అవి:

1. ఆదానం: ఇంగ్లీషు, పర్షియ – అరబిక్ పదాలు సాధారణంగా వాణిజ్య విషయాలలో ఇంగ్లీషు పదాలను, న్యాయ వ్యవహారాలలో పర్షియ – అరబిక్ పదాలను యథాతథంగా గ్రహించడం జరుగుతుంది.

2. సంస్కృత పదాలు: సంస్కృతం నుంచి సాంప్రదాయికంగా చేరిన పదాలు, పద బంధాలు ఎన్నో కొత్త అర్థాలలో వాడుకలో ఉన్నాయి.

3. కొత్త పదబంధాల నిర్మాణం.



BRAOU

### 9.4.1 ఆదానం

(a) ఇంగ్లీషు: వాణిజ్య రంగానికి సంబంధించిన బ్యాంకు, నోటీసు, టెండరు, ఇన్సూరెన్సు, డివిడెండ్లు మొదలైనవి. క్రీడారంగానికి సంబంధించిన హాకీ, క్రికెట్టు, వికెట్టు మొదలైనవి. ఇంగ్లీషు, తెలుగు పదాలను పర్యాయంగా వాడడం కూడా ఉంది. సినిమా/ చలన చిత్రం, లాకౌట్/ మూసివేత.

(b) పర్షో – అరబిక్: నమూనా, నకలు, తాలూకా, తహసీల్‌దారు, బదిలీ, దరఖాస్తు, ముద్దాయి, వకాలతు, రవాణా మొదలైనవి.

### 9.4.2 సంస్కృత పదాలు

ప్రాచీన వ్యవహారంలో భిన్నమైన అర్థంలో ఉన్న సంస్కృత పదాలను, పద బంధాలను కొత్త సందర్భంలో కొత్త అర్థంలో వాడటం జరుగుతుంది.

ఆకాశవాణి

ఆశ్రిత పక్షపాతం

అజ్ఞాత వాసం

ఆకాశ కన్య

అత్యవసర పరిస్థితి

ఆందోళన

అవినీతి

అత్యాచారాలు

విద్రోహ చర్య

BRAOU

### 9.4.3 కొత్త పద బంధాల నిర్మాణం

ఒకే భాషకు సంబంధించిన పదాలతోనే కాకుండా భిన్న భాషా పదాలతో మిశ్ర పద బంధాలను నిర్మించుకోవడం కూడా పత్రికా భాషలో చూడవచ్చు. ఆదాన అనువాదం పద బంధాల నిర్మాణం కూడా కనిపిస్తుంది. పద బంధాల నిర్మాణం అనేక రకాలుగా ఉంటుంది. ఇంగ్లీషు పదాల స్థానంలో యథాతథంగా సమాన పదాలను ఉపయోగించి కొత్త బంధాలను సూచించడం – సాధారణంగా కనిపించే లక్షణం.

(a) దేశ్యం + దేశ్యం:

| | | |
|---|---|---|
| నల్లడబ్బు | : | black money |
| ముడి సరుకు | : | raw meterial |

(b) సంస్కృతం + సంస్కృతం

| | | |
|---|---|---|
| శ్వేత పత్రం | : | white paper |

అంతరంగిక వ్యవహారాలు : internal affairs

(c) సంస్కృతం + తెలుగు

భూమి పంపకం : distribution

ఆర్థిక వనరులు : financial resources

(d) తెలుగు + సంస్కృతం

నల్లధనం : black money

కోత (తీర్మానం) : cutmotion

(e) ఇంగ్లీషు + తెలుగు

కాంట్రాక్టు (కూలీ): contract labour

కాంక్రీటు గోడ : concrete wall

(f) తెలుగు + ఇంగ్లీషు

లోటు బడ్జెటు : Deficit budget

పెద్ద ప్రాజెక్టు : major project

(g) సంస్కృతం + పర్షో అరబిక్

జన్మహక్కు : birth right

భూమి తనఖా : land/mortgage

వైద్య సలహా : medical advice

(h) పర్షో అరబిక్ + సంస్కృతం

సరిహద్దు రేఖ : border line

సలహా సంఘం : advisory committee

(i) ఇంగ్లీషు + పర్షో అరబిక్

ఓటింగు హక్కు : voting right

(j) పర్షో అరబిక్ + ఇంగ్లీషు

తనఖా బ్యాంకు : mortgate bank

(k) పర్షో అరబిక్ + తెలుగు

కాగితపు పులి : paper tiger

(l) ఇంగ్లీషు + సంస్కృతం

క్యాబినెట్ కార్యదర్శి : cabinet secretary

BRAOU

సప్లిమెంటరీ పరీక్షలు : supplementary examinations

నామినేషన్ పత్రాలు : nomination papers

(m) సంస్కృతం + ఇంగ్లీషు

గ్రామీణ బ్యాంకు : rural bank

సహకార బ్యాంకు : cooperative bank

(n) తెలుగు + పర్షో అరబిక్ + సంస్కృతం

చిన్న తరహా పరిశ్రమ : small scale industry

iii. మూల భావం స్ఫురించేట్టు స్వతంత్రమైన పద బంధాలను సృష్టించుకోవడం

కాల నాళిక : time capsule

అవిశ్వాస తీర్మానం : no confidence motion

విమానాశ్రయం : airport

నీటి పారుదల : Irrigation

మానవ వనరులు : human resources

ఆమరణ నిరాహార దీక్ష : fast-unto-death

బలహీన వర్గాలు : weaker sections

ఎన్నికల సర్దుబాటు : electoral adjustment

దొంగ వ్యాపారం : smuggling

దొంగసారా : Illicit liquor

నిర్యుద్ధ సంధి : no war treaty

iii. కొన్ని పదాలకు వ్యాపార లేక స్థితి బోధక క్రియలను చేర్చి కొన్ని రకాల భావాలను వ్యక్తం చేయడం. ఇంగ్లీషు లో కొన్ని క్రియలకు సమానమైన క్రియలు తెలుగులో లేనప్పుడు ఇటువంటి అభివ్యక్తి అవసరం అవుతుంది.

మంజూరు చేయు : to sanction

విడుదల చేయు : to releive

బదిలీ చేయు : to transfer

దర్యాప్తు చేయు : to investigate

రాజీనామా చేయు : to resign

జోక్యం చేసుకొను: to interfere

పిలుపునిచ్చు : to call



BRAOU
Dr. BRAOU LIBRARY
Acc. No. 115093
Class No.

iv. ఇంగ్లీషు వాక్య నిర్మాణ ప్రభావంతో కొన్ని రకాల కొత్త అభివ్యక్తీకరణ పద్ధతులు పత్రికల ద్వారా తెలుగులో ప్రవేశించాయి.

| | | |
|---|---|---|
| అదుపులోకి తీసుకోవడం | : | taking into custody |
| హర్షం ప్రకటించడం | : | to show happiness |
| అవగాహనకు రావడం | : | to come to an understanding |
| ఉద్రేకాన్ని ప్రదర్శించడం | : | to show excitement |
| తీర్మానం ప్రవేశ పెట్టడం | : | to introduce motion |
| నిర్ణయంగైకొనడం | : | to take decision |
| చర్య తీసుకోవడం | : | to take action |
| పరిస్థితి క్షీణించడం | : | situation worsening |
| తీర్మానంలో కోరు | : | to request in a resolution |

BRAOU

పత్రికలలోని శైలిలో చాలా వెసులుబాటు ఉంటుంది. అందువల్లనే పాఠకులకు విషయం తొందరగా, సులభంగా అర్థం అవుతుంది. శీర్షికలను రూపొందించడంలో నానారకాల అభివ్యక్తీకరణ పద్ధతులు కనిపిస్తాయి. కొన్ని పదబంధాల రూపంలో, కొన్ని క్రియా రహిత వాక్యాలుగా, కొన్ని నామ్నీకృత వాక్యాలుగా కనిపిస్తాయి. శీర్షిక ప్రధాన విషయాన్ని సంగ్రహించి -

జపాన్ విమానం దారి మళ్లింపు

చీలిక దిశగా సమాజ్ వాది పార్టీ

మార్చిలోగా దళితులకు ఉద్యోగాలు

పెద్దల సహకారంతో పెరిగిన బాకీలు

పి.వి, రజనీకాంత్ భేటీ

బీహార్‌లో భూకంపం, పదిహేనుమంది మృతి

పన్నెండు నియోజక వర్గాలలో సి.పి.ఎమ్. పోటీ

దూరదర్శన్ వేగానికి నిధుల కళ్లెం

క్రియా సహిత వాక్యాన్ని నామంగా మార్చడమే నామ్నీకరణం. నామ్నీ కృత వాక్యాలు శీర్షికలుగా ఉపయోగించడం సర్వ సాధారణంగా గమనించవచ్చు. పెద్దల సహకారంతో పెరిగిన బాకీలు - పెద్దల సహకారంతో బాకీలు పెరిగాయి; కేంద్ర పథకాల అమలులో విఫలమైన రాష్ట్రం - కేంద్ర పథకాల అమలులో రాష్ట్రం విఫలమయింది.

అభ్యాసం - 2

A) పత్రికలు నూతన భావాలను సూచించటానికి పదకల్పన చేసే పద్ధతులను గురించి రాయండి.

B) పత్రికా రచనలో శీర్షికలు రూపొందే పద్ధతులను ఉదాహరణ పూర్వకంగా వివరించండి.

BRAOU

## 9.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ప్రామాణిక భాషా స్వరూపాన్ని నిర్దేశించటంలో ఎక్కువ మంది ప్రజలలో వ్యాపింప చేయడంలో పత్రికలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.
- సాంస్కృతిక, సామాజిక జీవితంలో వస్తున్న మార్పులు, దాని ఫలితంగా ప్రవేశిస్తున్న భావాలను అభివ్యక్తీకరించే విధంగా భాషను అభివృద్ధి చెందించడంలో పత్రికలు సృజనాత్మక పాత్రను నిర్వహిస్తున్నాయి.
- విద్యావంతులు మొదలుకొని; సాధారణ అక్షరాస్యుల వరకూ భాష విషయంలో సమరూపతను సాధించడానికి పత్రికలు కృషి చేస్తున్నాయి.
- అనేక భావాలను వ్యక్తం చేసే అనేక పారిభాషిక పదాలు పత్రికల ద్వారానే ప్రజలలో వ్యాప్తిలోకి వచ్చాయి.

## 9.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. ప్రమాణ భాష ఏర్పడడంలో పత్రికల పాత్ర గురించి రాయండి.

2. పత్రికల్లో నూతన పదబంధ నిర్మాణాలు ఎలా జరుగుతాయో సోదాహరణంగా వివరించండి.

**II 15 పంక్తుల్లో సమాధానాలు రాయండి.**

1. సామాజిక జీవితంలో పత్రికల స్థానాన్ని వివరించండి.

2. పత్రికల ద్వారా ప్రచారంలోకి వచ్చిన పదబంధాలు ఎన్ని రకాలో వివరించండి.

BRAOU

# భాగం :10 ప్రసార సాధనాల్లో తెలుగు మాండలికాలు

విషయ క్రమం


10.0 ఉద్దేశం

10.1 ప్రవేశిక

10.2 భాషా వ్యవహారం

అభ్యాసం - 1

10.3 సాహిత్యంలో మాండలికాలు

అభ్యాసం - 2

10.4 ప్రసార సాధనాలు

10.4.1 పత్రికలు

10.4.2 రేడియో

10.4.3 టెలివిజన్

అభ్యాసం -3

10.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

10.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.7 ప్రత్యేక అధ్యయనం కోసం


BRAOU

## 10.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

- ఆధునిక యుగంలో ప్రసార సాధనాలు, పత్రికలు, రేడియో, టెలివిజన్‌ల గురించి, ప్రజా జీవితంలో ప్రసార సాధనాల స్థానం గురించి తెలుసుకుంటారు.

- ప్రజలకు సమాచారాన్ని అందజేయడంలో **రాజకీయ**, సామాజిక, సాంస్కృతిక విషయాలలో ప్రజలను

ప్రభావితం చేయడంలో భిన్న ప్రసార సాధనాలు నిర్వహించే విభిన్న పాత్రలను వివరించగలుగుతారు.

☞ ఈ ప్రయోజనాన్ని సాధించడానికి ప్రసార సాధనాలు అవసరాన్ని బట్టి అనుసరించే భాషా రూపాలు - అంటే మాండలికాలు మొదలైన అంశాలు గురించి విశదీకరించగలుగుతారు.

## 10.1 ప్రవేశిక

ఈ ఖండంలోని ఇంతకు ముందు భాగాలలో మీరు కింది విషయాలు నేర్చుకున్నారు:

1. ఒకే భాషకు సంబంధించిన భిన్న ప్రాంతాల, వర్గాల ప్రజలు వ్యవహరించే భాషా రూపాలలో భేదాలు ఉంటాయి. ఈ భేదాలనే ప్రాంతీయ మాండలికాలని, వర్గ మాండలికాలని అంటారు.

2. ఆధునిక కాలంలో ముద్రణ యంత్రాలు, దానిని అనుసరించి వచ్చిన పత్రికలు, ఆ తరువాత ప్రవేశించిన ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలైన రేడియో, టెలివిజన్ ఎక్కువ మంది ప్రజలకు సమాచారాన్ని అందజేయడానికి; మారు మూల ప్రాంతాలలో వారికి కూడా మారుతున్న ప్రపంచాన్ని గురించి, సామాజిక స్థితి గతులను గురించి, రాజకీయ పరిణామాలను గురించి అవగాహన ఏర్పడటానికి తోడ్పడ్డాయి. విశ్వ జనీన విద్యకు అవకాశాలు కలిగించాయి. అందరికీ అందుబాటులో జ్ఞానం అన్న ప్రజాస్వామ్య భావనకు దీనివల్ల వీలు కలిగింది.

3. తెలుగు ఆధునిక భాషగా అభివృద్ధి చెందాలంటే మాండలికాలకు అతీతమైన ప్రామాణిక భాష అవసరం. అది ఎక్కువ మంది వ్యవహర్తలు అంగీకరించేదిగా ఉండాలి. వివిధ రంగాల్లో ఉపయోగించేదిగా ఉండాలి. అది సాధారణ సాహిత్య భాషగా కూడా ఉంటుంది.

4. తెలుగు ఆధునిక భాషగా అభివృద్ధి చెందడానికి, ప్రమాణ భాష ఏర్పడడానికి పత్రికలు, ప్రసార సాధనాలు ప్రముఖ పాత్రను వహిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో సాహిత్యంలో ప్రసార సాధనాల్లో మాండలికాల పాత్రను పరిశీలిద్దాం.

BRAOU

## 10.2 భాషా వ్యవహారం

సామాజిక దృష్టితో చూచినప్పుడు భాషా వ్యవహారం ప్రధానంగా రెండు రకాలు :

1. సామాజిక సంబంధాలను ఏర్పరచుకోవడంలో భాష నిర్వహించే పాత్ర.

2. వ్యవహర్త తన అభిప్రాయాలను వినిమయం చేయడంలో భాష నిర్వహించే పాత్ర, అందుకోసం వ్యవహర్త స్వీకరించే భాషా భేదం/ రూపం, సామాజిక సంబంధాలు కింది అంశాలతో ముడిపడి ఉంటాయి :

   (1) దైనందిన భాషా వ్యవహారం (2) సామాజిక కార్యకలాపాలు (3) పరిపాలనా వ్యవహారాలు, పౌరజీవితం (4) విద్యారంగం (5) సాంస్కృతిక రంగం (6) ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు (7) వార్తాప్రసారం, ప్రచారం (8) వివిధ భావాల ప్రసారం.

దైనందిన వ్యవహారం చాలా వరకు మౌఖిక వ్యవహారమై ఉంటుంది. కుటుంబ జీవితం, ఇరుగు, పొరుగు సంబంధాలు, కార్యాలయాల్లో, ఇతర కార్య క్షేత్రాలలో సహోద్యోగులతో సంబంధాలు మౌఖిక – వ్యవహారంతోనే సాగుతాయి. వక్త, శ్రోతలను బట్టి వాళ్ళ వాళ్ళ మాండలికాలలోనో, మిశ్ర వ్యవహారాలలోనో, విద్యా, సాంస్కృతిక స్థాయిలను బట్టి ప్రమాణ భాషకు దగ్గరగా ఉండే భాషలోనో భాషా వ్యవహారం ఉంటుంది. మౌఖిక వ్యవహారం కాబట్టి కొంత వెసులుబాటు ఉంటుంది. సామాజిక కార్యకలాపాలు స్వభావాన్ని బట్టి కొన్నింటిలో మౌఖికంగానూ, కొన్నిటిలో లిఖిత రూపంలోనూ భాషా వ్యవహారం ఉంటుంది. లిఖిత రూపంలో ఉన్నప్పుడు అది ప్రమాణ భాషలోనే సాధారణంగా ఉంటుంది. మిగిలిన అంశాలలో భాషా వ్యవహారం ఎక్కువగా లిఖిత రూపంలో ఉంటుంది. అది అందరూ గుర్తించిన ప్రమాణ భాషలో ఉంటుంది. కాని ప్రత్యేక సందర్భాలలో, ప్రత్యేక ప్రయోజనాల కోసం మాండలికాలను కూడా ప్రసార సాధనాలలో వాడుతూ ఉంటారు.

**అభ్యాసం – 1**

భాషా వ్యవహారం ఎన్నిరకాలు?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 10.3 సాహిత్యంలో మాండలికాలు

BRAOU

ఆధునిక సాహిత్యం ప్రారంభ కాలం నుంచి సృజనాత్మక రచనలలో మాండలికాల ప్రయోగం జరుగుతూనే ఉంది. నాటకాలలో, కథలలో, నవలల్లో పాత్రోచిత భాష పేరుతో మాండలిక భాషను వాడడం సాధారణం. కందుకూరి వీరేశలింగం సాధారణ వచన రచనలో సరళ గ్రాంధికం వాడినా 'బ్రాహ్మ వివాహం' 'వ్యవహార ధర్మ బోధిని' మొదలైన నాటకాలలో, ప్రహసనాలలో పాత్రలను బట్టి మాండలికాలను వాడాడు. గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం'లో పాత్రలన్నీ తమతమ మాండలికాలలోనే మాట్లాడతాయి. గురజాడ కథానికలలో పాత్రల సంభాషణలు కూడా మాండలికాలలోనే ఉన్నాయి. ఉన్నవ లక్ష్మీ నారాయణ 'మాలపల్లి'లో ఎన్నో పదాలు రచయిత ప్రాంతానికి సంబంధించినవిగా కనిపిస్తాయి. తరువాత కాలంలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలలో విశాఖ మాండలికం, ఇటీవలి కాలంలో అల్లం రాజయ్య మొదలైన వాళ్ళ రచనలలో తెలంగాణా మాండలికం చాలా శక్తివంతంగా వాడడం చూడవచ్చు. తరువాత కాలంలో పాత్రల సంభాషణలే కాక కథా కథనంలో కూడా ప్రత్యేక మాండలికాన్ని ఉపయోగించిన వాళ్ళున్నారు. నామిని సుబ్రహ్మణ్య నాయుడు 'పచ్చనాకు సాక్షిగా' 'సినబ్బ కతలు' రాయలసీమ మాండలికంలో బలంగా రాసిన రచనలు. ఇవి 'ఉదయం', 'ఆంధ్రజ్యోతి' పత్రికలలో ధారావాహికంగా వచ్చాయి. ఒకప్పుడు సురమౌళి వంటి రచయితలు పూర్తి తెలంగాణా మాండలికంలో రచనలు చేసి ప్రయోగాలు చేశారు. ఇటీవల ఉప్పల నరసింహం మొదలై వాళ్ళు పూర్తిగా

తెలంగాణా మాండలికంలో రాసిన రచనలను దినపత్రికలు ధారావాహికంగా ప్రచురించాయి. 1946-50 మధ్య తెలంగాణా సాయుధ పోరాట కాలం నాటి పాటలు, విప్లవ సాహిత్యోద్యమంతో వచ్చిన గద్దర్ వంటి వాళ్ళ పాటలు పూర్తిగా తెలంగాణా మాండలికంలో ఉన్నాయి. శ్రీకాకుళ ఉద్యమం నుంచి వచ్చిన వంగపండు ప్రసాద రావు పాటలు కళింగాంధ్ర మాండలికంలో ఉన్నాయి. వచన కవిత్వంలో కూడా మాండలికాలను వాడిన వారు ఉన్నారు. రంధి సోమరాజు కోస్తా మాండలికంలో, దేవరాజు మహారాజు, ఎన్. గోపి తెలంగాణా మాండలికంలో వచన కవితలు రాశారు. సృజనాత్మక సాహిత్యంలో భాషా ప్రయోగానికి ఉన్న స్వేచ్ఛ విషయ ప్రధాన రచనలలో ఉండడం కష్టం. ప్రసార సాధనాలలో కూడా మాండలికాల వాడుకకు కొన్ని పరిమితులు ఉన్నాయి.

**అభ్యాసం - 2**

సృజనాత్మక సాహిత్యంలో మాండలికాలను గురించి రాయండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 10.4 ప్రసార సాధనాలు

BRAOU

భాషా వ్యవహారంలో వక్త లేక రచయిత, శ్రోత లేక పాఠకుడు లేక ప్రేక్షకుడు - ఈ ఇద్దరినీ కలిపే ప్రసార విధానాలు ప్రాముఖ్యాన్ని వహిస్తాయి. వీటికి తోడు ప్రయోజనం భాషా రూపాన్ని ఎన్నుకోవడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. పత్రికలు ముద్రణ రూపంలో వార్తా/ భావ ప్రసారం చేస్తాయి. అన్ని ప్రాంతాలకు సంబంధించిన చదువుకున్న వాళ్ళు, కనీసం అక్షరాస్యులైన వాళ్ళు పత్రికల పాఠకులు. అందువల్ల పత్రికలన్నీ అందరూ అంగీకరించిన ప్రమాణ భాషనే వాడతాయి. ఆ విధంగా ప్రమాణ భాషా వ్యాప్తికి కూడా అవి దోహదం చేస్తాయి. పత్రికలు పఠనం కోసం అయితే రేడియో శ్రవ్యం. రేడియోలో వార్తలు, తదితర విషయాల ప్రసారం లిఖిత రూపంలో ఉన్నదానినే చదివి వినిపించడం ద్వారా జరుగుతుంది. అందువలన భాషా స్వీకరణం శ్రవ్య రూపంలో ఉంటుంది. అప్పటి కప్పుడు కల్పించే సంభాషణల రూపంలో కూడా రేడియోలో ప్రసారం ఉండవచ్చు. లిఖిత రూపంలో ఉండి పఠన ప్రధానమైన పత్రికలతో పోలిస్తే శ్రవ్య ప్రధానమైన రేడియో ప్రసారాలలో మాండలికాల ప్రయోగానికి అవకాశం ఎక్కువ. ప్రత్యేక పాత్రల కోసం ఉద్దేశించిన కార్యక్రమాలు మాండలికాలలో ఉంటాయి.

టెలివిజన్ దృశ్య ప్రధానమైంది. నాటకాలు మొదలైన ఇతర కళారూపాలలో ఛాయా గ్రహణ యంత్రం (camera), విద్యుద్దీపకాంతుల (lighting) రంగాలంకరణ లేక దృశ్య నేపథ్యం (setting), ఆహార్యం, నటన, సంగీతం మొదలైన వాటికి కూడా భాషతో పాటు టెలివిజన్ ప్రసారాల్లో స్థానం ఉంది. టెలివిజన్ వార్తా ప్రసారాలలో, ఉపన్యాసాలలో, చర్చలలో ప్రముఖంగా ప్రమాణ భాషనే వాడవలసి ఉంటుంది. నాటకాలలో, ప్రత్యేక కళా రూపాలలో మాండలికాలు

నాటకాలలో, ప్రత్యేక కళా రూపాలలో మాండలికాలు ఉండవచ్చు. వ్యాపార ప్రకటనలు గ్రామీణులకు, ప్రత్యేక వర్గాలకు ఉద్దేశించినవైతే అవి కూడా ప్రత్యేక మాండలికంలో ఉండడానికి అవకాశం ఉంది. ఇంతవరకు చెప్పిన అంశాలు ప్రసార సాధనాల, విధానాల స్వరూప, స్వభావాలు మాండలికాలు వాడడంలో పరిమితులను నిర్ణయిస్తాయని తెలియజేస్తాయి.

### 10.4.1 పత్రికలు

ముద్రణ రూపంలో పాఠకుల ముందుకు వచ్చే పత్రికలలో మాండలికాల ప్రయోగానికి చాలా పరిమితులు ఉంటాయని తెలుసుకున్నాం. వార్తా కథనం, ప్రత్యేక శీర్షికలు, వ్యాసాలు, సంపాదకీయాలు ప్రమాణ భాషలో తప్ప ఉండడానికి అవకాశం తక్కువ. కొన్ని ప్రత్యేక రచనలలో, శీర్షికలలో, వ్యంగ్య రచనలలో, సమకాలీన సంఘటనలపైన, రాజకీయాలపైన రాసే వ్యాఖ్యానాలలో చాలా అరుదుగా పత్రికలలో మాండలికాలను వాడిన ఉదాహరణలు ఉన్నాయి.

'ఉదయం' పత్రికలో తెలిదేవర భానుమూర్తి నిర్వహించిన 'చల్ నేదో బాలకిషన్' 'పలుకుబడి' శీర్షికలలో తెలంగాణా మాండలికాన్ని ఉపయోగించాడు.

'పలుకుబడి' శీర్షికలో సమకాలీన రాజకీయాలను వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం కనిపిస్తుంది. 'చల్ నేదో బాలకిషన్'లో హైదరాబాద్ నగర మాండలికంలో హైదరాబాద్ నగర జీవితాన్ని గురించి రాయడం కనిపిస్తుంది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో అల్లం నారాయణ 'అల్లం కారం' శీర్షికతో సమకాలీన రాజకీయాలపైన వ్యంగ్య వ్యాఖ్యానాలు చేస్తున్నాడు. 'ఉదయం' పత్రికలలోనే బండి గోపాలకృష్ణ గోపన్న పేరుతో నెల్లూరు మాండలికంలో ప్రత్యేక శీర్షికను నిర్వహించాడు. ఉప్పల నరసింహం, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు మాండలికాలలో రాసిన రచనలు దిన వార్తా పత్రికలలోనే వచ్చినా అవి సృజనాత్మక సాహిత్యంలో చేరుతాయి.

### 10.4.2 రేడియో

రేడియో శ్రవ్య ప్రధానమైందని చెప్పుకున్నాం. రేడియోలో వార్తా ప్రసారం, విద్యా, వైజ్ఞానిక, సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాలకు సంబంధించిన ప్రయోగాలు, చర్చలు ప్రమాణ భాషలో ఉండడం సహజం. శ్రవ్యం కాబట్టి విద్యావంతులు కాని వాళ్ళు, గ్రామీణులు, కర్షక, కార్మికులు కూడా శ్రోతలుగా ఉండవచ్చు. వీరికోసం ప్రసారం చేసే ప్రత్యేక కార్యక్రమాలలో మాండలికాలను వాడడం జరుగుతుంది. అందువల్ల పఠన ప్రధానమైన పత్రికలతో పోలిస్తే రేడియో ప్రసారాలలో మాండలికాల వాడకానికి ఎక్కువగా అవకాశం ఉంది. వ్యవసాయ కార్యక్రమాలు, గ్రామీణ కార్యక్రమాలు, వయోజన విద్యా కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేసే కార్యక్రమాలు రేడియో ప్రసారాలలో ఉంటాయి. ఉద్దేశించిన ప్రాంతాలను బట్టి తగిన మాండలికాలను ఈ కార్యక్రమాలతో వాడుతూ ఉంటారు.

1950లలో, 60లలో రేడియో విజయవాడ కేంద్రం గ్రామసీమ కార్యక్రమాలను ప్రసారం చేసేది. ఈ కార్యక్రమాలలో 'బావగారి కబుర్లు' పేరిట ప్రయాగ నరసింహ శాస్త్రి, గాడేపల్లి సూర్యనారాయణ శాస్త్రుల చమత్కార సంభాషణలుండేవి. ఇవి కోస్తా జిల్లా మాండలికంలో ఉండేవి. ప్రతీ రోజు వచ్చే వార్తలు, జరిగే సంఘటనలను మామూలు సంభాషణలలో సామాన్య శ్రోతలకు తెలియజేయడం ఈ కార్యక్రమానికి ప్రయోజనంగా ఉండేది. 1970లలో 'ముచ్చట్లు' పేరుతో హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారమయిన కార్యక్రమంలో పూర్తిగా తెలంగాణా మాండలికం ఉండేది. ఎల్లయ్యమామ పేరుతో సమకాలీన సమస్యలను గురించిన చర్చ ఈ కార్యక్రమంలో ప్రధానాంశం. ఎల్లయ్య మామగా ఈ కార్యక్రమం నడిపిన ఆర్.సి.వి. రెడ్డి తెలంగాణా మాండలికానికి రేడియో ద్వారా బహుళ ప్రచారం తీసికొని వచ్చారు.

BRAOU

హైదరాబాదు కేంద్రంనుంచే మధ్యాహ్నాలు ప్రసారం అయిన కార్యక్రమాలలో కార్మిక సమస్యలు, యజమాని, కార్మిక సంబంధాలు మొదలైన విషయాలు సంభాషణ రూపంలో చర్చించడం ఉంటుంది. ఇందులో ఏకాంబరం, బాలయ్య, చిన్నక్క ప్రధాన పాత్రలు. చిన్నక్క పాత్రలో రతన్ ప్రసాద్ చక్కని తెలంగాణా మాండలికాన్ని ఉపయోగించేది. మధ్యాహ్నం ప్రసారం అవుతున్న మరో కార్యక్రమం 'పాడి – పంట'. ఇది వ్యవసాయ కార్యక్రమం. ఇందులో చిన్నమ్మ తెలంగాణా మాండలికంలో మాట్లాడుతుంది. గీత చిన్నమ్మి పాత్ర వేసేది. 'మహలచ్మి ముచ్చట్లు' పేరుతో స్వగతంగా డా. యశోదా తిరుమల రెడ్డి తెలంగాణా మాండలికంలో చేసిన ప్రసారాలు చాల ప్రచారం పొందాయి.

'ఇల్లు – వాకిలి', 'పాడి – పంట', 'మాటా – మంతి' పేర్లతో రాయలసీమ మాండలికంలో కూడా ప్రత్యేక ప్రసారాలు వచ్చాయి. ఇల్లు – వాకిలి, పాడి – పంట కార్యక్రమాలలో చిన్నమ్మగా నిర్మలా వసంత్ రాయలసీమ మాండలికంలో సంభాషణలు నిర్వహించింది. కోస్తా జిల్లాలకు సంబంధించి కళింగాంధ్ర తూర్పు మాండలికంలో ఎక్కువగా కార్యక్రమాలు వచ్చాయి. పౌర జీవితాన్ని గురించి, పౌర బాధ్యతలను గురించి చర్చించిన 'అప్పలకొండ స్వగతం', కుటుంబ సంక్షేమానికి సంబంధించి వ్యాఖ్యాన రూపంలో వచ్చిన కార్యక్రమాలు తూర్పు మాండలికంలో ఉన్నాయి.

### 10.4.3 టెలివిజన్

దృశ్య ప్రధాన మైన టెలివిజన్‌లో మాండలిక భాషా ప్రయోగం తక్కువే. గ్రామీణ కార్యక్రమాల, కార్మిక కార్యక్రమాల వంటివి టెలివిజన్ ప్రసారాలలో తక్కువ. రేడియోతో పోలిస్తే టెలివిజన్ వాణిజ్య ప్రధానంగా కనిపిస్తుంది. హాస్య కార్యక్రమాలు, నాటకాలు, సంభాషణలలో అక్కడక్కడా మాండలికాలు కనిపిస్తాయి. ధర్మవరపు సుబ్రహ్మణ్యం, నూతన ప్రసాద్, తనికెళ్ళ భరణి వివిధ మాండలికాలలో హాస్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.

**అభ్యాసం – 3**

ప్రసార సాధనాల్లో మాండలిక భాషా ప్రయోగాన్ని గురించి సమీక్షించండి.

_______________

_______________

_______________

_______________

_______________

## 10.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక యుగంలో ప్రసార సాధనాలకు ప్రజల జీవితంలో ప్రధానమైన స్థానం ఉంది.
- ప్రజలకి సమాచారాన్ని అందించడంలో భిన్న ప్రసార సాధనాలు ప్రయోజనాత్మకంగా భిన్న పాత్రల్ని



BRAOU

నిర్వహిస్తాయి. ఇందులో భాగంగానే ప్రసార సాధనాలు అవసరాన్ని బట్టి కొన్ని భాషా రూపాలను అనుకరించగలుగుతాయి.

- సృజనాత్మక సాహిత్యంలో భాషా ప్రయోగానికి ఉన్న స్వేచ్ఛ విషయ ప్రధాన రచనలలో ఉండడం కష్టం.
- ప్రసార సాధనాలలో కూడా మాండలికాల వాడుకకు కొన్ని పరిమితులున్నాయి.
- ప్రసార సాధనాల, విధానాల స్వరూప స్వభావాలు మాండలికాలు వాడడంలో పరిమితులను నిర్ణయిస్తాయి.

## 10.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. సృజనాత్మక సాహిత్యంలో మాండలిక భాషా ప్రయోగాన్ని గురించి మీకు తెలిసింది రాయండి.
2. వివిధ ప్రసార సాధనాల స్వరూప, స్వభావాలను వివరించండి.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. పత్రికలలో మాండలికాలను గురించి రాయండి.
2. రేడియోలో మాండలికాలలో ప్రసారం అయ్యే కార్యక్రమాలను పరిచయం చేయండి.

BRAOU

## 10.7 ప్రత్యేక అధ్యయనం కోసం

1. పత్రికలలో మాండలికంలో వచ్చిన ప్రత్యేక శీర్షికల నమూనాలు కొన్ని సేకరించండి.
2. రేడియోలో ప్రసారమైన కార్యక్రమాలకు సంబంధించి మాండలికాలలో వచ్చిన కొన్ని సంభాషణలను సేకరించండి.

# భాగం : 11 తెలుగు పత్రికలలో భాషా శైలి: క్రమ పరిణామం (ప్రత్యేక అధ్యయనం)

## విషయ క్రమం


11.0 ఉద్దేశం

11.1 ప్రవేశిక

11.2 తెలుగు పత్రికా రచన, భాష, పరిణామ క్రమం

11.2.1 మొదటి దశ

11.2.2 రెండవ దశ

11.2.3 మూడవ దశ

అభ్యాసం -1

11.3 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

11.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 11.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

- తెలుగు పత్రికలలో భాషా శైలి క్రమంగా ఎలా పరిణామానికి లోనవుతూ వస్తోం( సోదాహరణంగా వివరించగలుగుతారు.

## 11.1 ప్రవేశిక

ఇంతకు ముందు ఈ ఖండంలో తెలుగు భాష అభివృద్ధికి ప్రయత్నాలు, భాషాయోజన, ప్రమాణ షనిర్వచనాలు, ఆవశ్యకత, ప్రమాణ భాష ఏర్పడే విధానం, మాండలిక భేదాలు తెలుగు ప్రమాణ భాషగా రూ డంలో పత్రికల పాత్ర, ప్రసార సాధనాలలో భాషా ప్రయోగరీతులు మొదలైన అంశాలను తెలుసుకున్నారు. ఇప్పుడు ు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు తెలుగు పత్రికల భాషా శైలిలో వచ్చిన క్రమ పరిణామాన్ని సోదాహ రిశీలిద్దాం.

తెలుగులో తొలి పత్రికలు ఏవి అనే విషయంలో అభిప్రాయ భేదాలున్నాయి. బళ్లారి ( ం 1835లో వెలువరించిన 'సత్యదూత' తెలుగులో తొలి పత్రిక అని చాలామంది అభిప్రాయం. 1833లో ు క్రానికల్'

పేరుతో వెలువడిన పత్రిక తమిళ, తెలుగు భాషలలో ఉండేదని కూడా ఒక అభిప్రాయం ఉంది. 1831లోనే 'తెలుగు జర్నల్' పేరుతో తొలి తెలుగు పత్రిక వచ్చిందని కొందరు పరిశోధకులు పరోక్ష ఆధారాలతో ఊహించారు. 1833లోనే ఇంగ్లీషు, తమిళ, తెలుగు భాషలలో 'ది కర్నాటిక్ క్రానికల్' అనే పత్రిక మొదలయిందనటానికి తగిన ఆధారాలున్నాయి. లండన్ నుంచి వెలువడే 'ఏసియాటిక్ జర్నల్' నవంబరు 1833 సంచికలో 'ది కర్నాటిక్ క్రానికల్' పత్రిక మీద సమీక్ష వచ్చింది. ఈ పత్రికలో తమిళ, తెలుగు వ్యాసాలు ఇంగ్లీషులోకి, ఇంగ్లీషు వ్యాసాలు తమిళ, తెలుగులలోకి చేసిన అనువాదాలు ఉన్నాయని ఈ సమీక్ష పేర్కొంది. కాని ఈ పత్రికలేవీ లభ్యం కావడం లేదు.

ప్రస్తుతం లభ్యం అయ్యే తొలి తెలుగు వార్త లేక ప్రకటన 27 ఆగస్టు 1834 నాటి 'ఫోర్ట్ సైంట్ జార్జి గెజిట్'లో ఉంది. ఒక ఇంగ్లీషు ప్రకటనకు తెలుగు అనువాదం కింది విధంగా ఉంది. ఇది రెండు విషయాలను తెలియజేస్తుంది. ఒకటి: తెలుగు వార్తారచన. ఇంగ్లీషు నుంచి అనువాదం చేసుకోవడంగా మొదలైంది. ఈ రోజుకీ ఈ పద్ధతి కొనసాగుతున్నది. రెండు: తొలినాటి తెలుగు పత్రికా రచన సమకాలీన వ్యావహారిక భాషలో జరిగేది.

1. 'గవర్నమెంటు వారి ప్రకటన పత్రిక: యిందువల్ల తెలియజేసేది యేమంటే అడ్డెషనాల్ గవర్నమెంటు కమిషనరు గారి వల్ల పరిష్కరించబడిన నన్నూరు రూపాయిల కంటే అధికముగా వుండే కొద్దిపాటి దావాలకు గవర్నమెంటు ప్రామిసరీ నోట్లు అనే పత్రములను యివ్వడానికి బదులుగా ఈ తారీఖు మొదలుకొని సదరహి కమిసనరు యొక్క సరి తాలూకు అయివజు నన్నూరు రూపాయిలకు యెక్కువగా వున్నా తక్కువగా వున్నా ఆ ఆయివజును రొక్కముగానే యివ్వడమవుతున్నది.

   ఫోరటు సైంటు జార్జి 1834 అగస్టు నెల 15వ తేదీ ఆలోచన సభలో గవర్నరు వారి వుత్తరవు ప్రకారం.

   ఇందులో పరోక్ష్య – అరబిక్, ఇంగ్లీషు పదాలను స్వేచ్ఛగా వాడడం కనిపిస్తుంది.

## 11.2 తెలుగు పత్రికా రచన, భాష: పరిణామ క్రమం

1830లలో ప్రారంభమైన తెలుగు పత్రికా రచనలో, పత్రికలలోని భాషా స్వరూపంలో వచ్చిన పరిణామాలు ఒక పద్ధతిలో కనిపించవు. వ్యావహారిక భాషలో ప్రారంభమైన పత్రికా రచన 1858 తరువాత గ్రాంధికం / అర్ధ గ్రాంధికం / సరళ గ్రాంధికంలోకి మారింది. 1930ల నుంచి మళ్లీ వ్యావహారికంలోకి ప్రవేశించి క్రమంగా పత్రికా భాష ఆధునిక రూపాన్ని సంతరించుకుంది. విద్యారంగంలో, బోధన రంగంలో భాషా దృక్పథంలో వచ్చిన మార్పులు, ఘర్షణలు ప్రభావం పత్రికా రచనలో కూడా కనిపిస్తుంది. పత్రికా రచనలో, భాషలో కనిపించే పరిణామ క్రమాన్ని మూడు దశలుగా విభజించవచ్చు.

### 11.2.1 మొదటి దశ

ఈ దశలో వృత్తాంతి, వర్తమాన తరంగిణి, హితవాది, దిన వర్తమాని మొదలైన పత్రికలు వచ్చాయి. ఈ పత్రికలలోని భాష సమకాలీన వ్యావహారిక భాష. ఇప్పటి వచన శైలితో పోలిస్తే అప్పటి వచన శైలి కొంత భిన్నంగాను, ప్రత్యేకంగాను కనిపిస్తుంది. భాషలో పాత రూపాలు, సమ కాలీన రూపాలు కలసిపోయి కనిపిస్తాయి. ఆనాటి పత్రికలలోని వచనానికి కింది భాగం ఒక మచ్చు తునక:

**2. 'యింగిలీషు వారు... తమకుల విద్యయైన యింగిలీషు విద్యను కొద్ది కొద్దిగా వ్యాపింప జేయుచూ**



BRAOU

రావడము మాత్రమే గాక అనేక స్థలముల యందు విశేషమైన యింగిలీషు పాఠశాలల నేర్పరచి యీ దేశస్థులకు ఆ విద్య యందు మిక్కిలి అభిలాషను గలగజేసి యుండుట వలన ప్రకృతియందు సదరహి యింగ్లీషు విద్య యీ దేశమందు ప్రబలముగా వ్యాపించియున్నది. ముఖ్యముగా యీ రాజధానిలో సమస్తమైన వారి గృహముల యందున్న యింగిలీషు విద్య పారాయణముగానున్నది. కదాపట పంచాంగములు చెప్పేభొట్లు యనే పేరుగల వారి చిన్న వాండ్రు కూడా అధ్యయన పారాయణము జేయడమునకు బదులుగా నింగిలీషు విద్యనే పారాయణము చేయుచున్నారు.

– వర్తమాన తరంగిణి – 29.7.1847

### 11.2.2 రెండవ దశ

ఈ దశలో పాశ్చాత్య సంస్కృతి వ్యాపించడానికి వ్యతిరేకంగా కొన్ని సంప్రదాయ పునరుద్ధరణ ధోరణులు బయలు దేరాయి. మద్రాసులో 'హిందూ శ్రేయోభి వర్దనీ సభ', విశాఖపట్టణంలో 'ఆర్యయత సభ' మొదలైన సంస్థలెన్నో ఈ ధ్యేయంతో ప్రారంభమైనాయి. దాని కనుగుణంగానే భాషా దృక్పథం కనిపిస్తుంది. కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో ప్రారంభించిన 'ఆంధ్ర భాషా సంజీవని'లో మనకు పూర్తిగా గ్రాంధిక భాషే కనిపిస్తుంది. ఈ పత్రికలోని వార్తా రచనకు కింది భాగం ఒక ఉదాహరణ:

**3. 'వాలాజీ వంతెన నుండి వచ్చే యప్పు మొదలారి గారి ప్రధాన పాఠశాల వరకు రథ్య కిరుగడల కాడికదంబులు బాదు కాలుపబడెను. తోరణంబులు బెట్టు గట్టబడెను అది యటుండ ఆ పాఠశాలా సౌధమువ కెదుర పూల పందిరి యొకటి పొందుపరుపబడెను. వివిధ వాంయిద్యములు మ్రోయుచుండెను. మత్తాబులు, చిచ్చుబుడ్లు మొదలగునవియు నెచ్చుగా బిచ్చలించుచుండెను.**

**– ఆంధ్ర భాషా సంజీవని – డిసెంబరు 1871.**

అయితే వార్తా పత్రికల లక్షణాలను గురించి మొదటి రోజులలో వివరించిన వాడు కొక్కొండ వేంకట రత్నమే. సంపాదకుడు, విలేఖకుడు, పాఠకుడు మొదలైన పత్రికా నిర్వహణకు సంబంధించిన వివరాలను, వివరణలను ఆయన అందించాడు. 1856–75 మధ్య వచ్చిన పత్రికలలో 'సుజన రంజని', 'తత్త్వ బోధిని', 'పురుషార్థ ప్రదాయిని', 'వ్యవహార తరంగిణి', 'లోక రంజని' పేర్లను పేర్కొనాలి.

'పురుషార్థ ప్రదాయిని' పత్రికను సంస్కరణవాదులు నిర్వహించారు. సంస్కరణ వాదులు భాషా విషయంలో కూడా సంస్కరణ దృష్టినే ప్రదర్శించారు. దాని ఫలితమే సరళ గ్రాంధికం. 1875 తరువాత కందుకూరి వీరేశలింగం మొదలైన సంస్కర్తలు నిర్వహించిన 'వివేక వర్ధని' వంటి పత్రికలు మొదలుకొని, ఇరవయ్యవ శతాబ్దం తొలి దశాబ్దాలలో 'ఆంధ్ర పత్రిక' వంటి పత్రికల ప్రారంభకాలంలోను, కృష్ణాపత్రిక మొదలైన వాటిల్లోను సరళ గ్రాంధికమే కనిపిస్తుంది. 'పురుషార్థ ప్రదాయిని' లోని భాషా శైలి మిశ్రరూపంలో కనిపిస్తుంది:

**4. 'మెట్రిక్యులేషన్, ఎఫ్.ఎ. పరీక్షలు రివరెండు జె. షార్పు దొరగారి అధికారము నందు యిచ్చుట బహు క్రమముగా జరిగినవి. మొత్తము మీద ప్రశ్నలన్ని కఠినముగా నున్నట్లు పరీక్ష యిచ్చు వారనుకొనిరి. ఆల్ జీబ్రా (Algebra paper) బహు కఠినముగా నున్నదనియు అనుకొనిరి. పరీక్షలు యిచ్చే వారి కష్ట నష్టములు పరీక్షలు చేసే వారికి బాగా తెలియదని తోచుచున్నది. అడిగెడు వారికి చెప్పెడు వారు లోకువ గనుక నెంత కఠినముగా నైన నడుగవచ్చును.**

**పురుషార్థ ప్రదాయిని. డిసెంబరు 1972.**

కందుకూరి వీరేశలింగం గ్రాంధిక భాషలో మొదలై పత్రికా నిర్వహణ కాలం నాటికి సరళ గ్రాంధికంలోకి మారాడు. 'వార్తా పత్రికలో విలేఖకులు కూడా సాధ్యమైనంత వరకు తమ పత్రికల యందు విషయములను సకల జనులకు



BRAOU

సుబోధకముగా నుండునట్లు ప్రచురించు చుండుట యావశ్యకము' అని వివేక వర్ధినిలో కందుకూరి వీరేశలింగం అంటారు. కందుకూరి పత్రికా రచనలో ఉపయోగించిన భాషా శైలి ఈ విధంగా ఉంటుంది:

**5. 'రాజ్యాంగ విషయమున కొన్ని స్వాతంత్ర్యములు వచ్చినంత మాత్రము చేత దేశమంతయు బాగుపడునని స్వప్నా వస్థయందును తలపబోకుడు. ఇట్లు బాగుపడిన గాని దేశము బాగుపడదు. కులాచారము లందలి దోషములు పోయిన గాని ఐకమత్యము రాదు. ఐకమత్యము వచ్చిన గాని యే స్వాతంత్ర్యము వలనను జనులకు ప్రయోజనము కలుగదు.'.**

**– వివేక వర్ధని – ఏప్రిల్ 1887**

### 11.2.3 మూడవ దశ

పందొమ్మిదవ శతాబ్దం చివరి వరకు పత్రికలలో రాజకీయాలకు అంత ప్రాధాన్యం లేదు. ఆ కాలపు పత్రికలలో సాహిత్యం, సామాజిక విషయాలు, పరిపాలన విషయాలు, ప్రపంచంలో జరిగే సంఘటనలకు సంబంధించిన సమాచారాన్ని సంక్షిప్తంగా అందజేయడం ఉండేది. బందరు నుంచి వెలువడిన కృష్ణాపత్రిక, ఆ తరువాత ఆంధ్ర పత్రికలలో రాజకీయాలకు పత్రికలలో ప్రధాన స్థానం వచ్చింది. స్వాతంత్ర్యోద్యమం తీవ్రం కావడం కూడా దీనికి దోహదం చేసింది. దిన పత్రికలు ప్రారంభం కావడంతో రాజకీయాలతో పాటు, ప్రపంచ యుద్ధాలు మొదలైన ఇతర సమాచారాలు వార్తల రూపంలో ఎక్కువగా పాఠకులకు అందడం మొదలు పెట్టాయి. కృష్ణాపత్రిక కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణ రావుల సంయుక్త సంపాదకత్వంలో 1902లో ప్రారంభం అయింది. 'ఆంధ్రపత్రిక' 1908లో వారపత్రికగా మొదలైంది. 'ఆంధ్ర పత్రిక' దిన పత్రిక 1914లో ప్రారంభమయింది. కాశీనాధుని నాగేశ్వర రావు దీని వ్యవస్థాపకులు. తరువాత 'ఆంధ్ర ప్రభ', 'ఆంధ్ర జ్యోతి' మొదలైన దినపత్రికలు వచ్చాయి. తొలి దశలో ఆంధ్రపత్రికలో సరళ గ్రాంధికమే ఉండేది. క్రమంగా ఆధునిక భాషను ఉపయోగించడం మొదలైంది. కృష్ణాపత్రికలో కూడా చాలాకాలం సరళ గ్రాంధికమే కొనసాగింది. ఆంధ్ర పత్రిక దిన పత్రిక ప్రారంభ సంచిక (1.4.1914) లోని లక్ష్య ప్రకటనలోని కింది భాగం ఆ పత్రిక తొలి దశలోని భాష శైలికి నిదర్శనం:

BRAOU

**6. 'విచారణీయంబులైన విషయంబు లనేకములు గలవు. జనాభిప్రాయముల కను గూలముగ విషయ వివర్ణనమును జేయుచు ననుదినమును నాంధ్ర దేశ వృత్తాంతాదులను ప్రచురించుటకు దినపత్రికను ప్రచురించుట కేర్పాటులు చేయబడినవి. కాని యనివార్యంబులైన యాటంకముల వలన విలంబునమేర్పడి నందులకు జింతించుచున్నాము.**

**దేశీయ మహా సభా దర్శములును, రాష్ట్రీయ సభా దర్శములను నాంధ్ర పత్రికా దర్శములు. హైందవ జాతీయాభ్యుదయములకు నాంధ్ర జాతీయాభ్యుదయమును ప్రసాదించుట పత్రికా నిర్వాహకుల ముఖ్యోద్దేశము....'**

తెలంగాణా ప్రాంతంలో 1926లో అర్ధ వారపత్రికగా ప్రారంభమైన 'గోలకొండ పత్రిక' 1947లో దినపత్రికగా మారింది. దీని వ్యవస్థాపక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి. ఈ పత్రికలో ఉపయోగించిన భాష అర్ధ గ్రాంధికంగా కనిపించినా చాలా సరళంగా ఉంటుంది. ఆంధ్రపత్రికలోని పై వచన ఖండంతో పోలిస్తే సురవరం ప్రతాపరెడ్డి సంపాదకీయ వ్యాసంలోని కింది భాగం మరింత సరళంగా కనిపిస్తుంది:

**7. 'ఆంధ్ర మహాసభలోని తీర్మానాల సంగ్రహము ప్రకటింపబడినది. దాని వల్ల ఆంధ్ర మహాసభ వారి దృక్పథం స్పష్టమయినది. వారు గాంధీ మహాత్మునిపై విశ్వాస ప్రకటన చేసినారు. కాంగ్రెసుపై కూడా విశ్వాసము ప్రకటించినారు. ఈ రెండున్నూ చాలా ముఖ్యమైనట్టివి. దీనివల్ల జాతీయ వాదులు మహాత్ముని**

**'సత్య – అహింస' అను సూత్ర ద్వయమును పాలించుటకు సంసిద్ధులై యున్నారనియు స్పష్టం.**

**– గోలకొండ పత్రిక సంపాదకీయం –5.4.1945**

1938లో 'ఆంధ్ర ప్రభ' దినపత్రిక ప్రారంభం అయింది. ప్రసిద్ధ పాత్రికేయుడు ఖాసా సుబ్బారావు దీనికి మొదటి సంపాదకుడు. 1938లో ఈ పత్రికలో 'న్యూస్ ఎడిటర్'గా చేరిన నార్ల వెంకటేశ్వర రావుతో పత్రికా రచన పూర్తిగా ఆధునిక రూపాన్ని పొందింది. ఆయన పత్రికా రచనలో ఎన్నో కొత్త పద్ధతులకు మొదటి వాడైనాడు. ఆయనతో పత్రికలలో వార్తలకు ప్రాధాన్యం పెరిగింది. అనేక పారిభాషిక పదాలను పత్రికా రచనలో ఆయన ప్రవేశ పెట్టాడు. తెలుగు పత్రికల భాషకు ఒరవడి పెట్టారు. తరువాత ఆయన 'ఆంధ్ర జ్యోతి' దినపత్రికకు సంపాదకుడైనాడు. ఆయన భాషా శైలికి ఒక ఉదాహరణ:

**8. 'అష్టగ్రహ కూటములు', అందువల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు తప్పవట, జల ప్రళయమే రావచ్చునట, ప్రపంచాన్నే అది తుడిచి పెట్టవచ్చునట; ఇట్టి పరమ మూఢ విశ్వాసాలతో భయవిహ్వాలు లౌతున్న వారి ప్రపంచం నిజంగానే సర్వనాశనమై పోతే, అంతకంటె వాంఛించదగు శుభ పరిణామాన్ని మా మట్టుకు మేము ఊహించలేము...**

**...పాత పంచాంగాలనే ప్రామాణిక శాస్త్రాలుగా పరిగణించే వారున్నారు; మంత్రాలతో చింతకాయలు రాలగలవని విశ్వసించే వారున్నారు. వారే అష్టగ్రహ శాంతులను చేయిస్తున్నారు; ముప్పొద్దుల కడుపు నిండుగ కూటికైనా నోచుకొనని పేద దేశంలో ఎంతో డబ్బును హోమ గుండాలలో మసి చేస్తున్నారు. ఇందువల్ల అష్టగ్రహ శాంతి జరిగినా, జరగక పోయినా, ప్రజామౌఢ్యాల పరిపోషణనే వృత్తిగా చేసుకున్న దుష్ట గ్రహ శాంతి జరగడం మాత్రం ముమ్మాటికీ నిజం'.**

**– ఆంధ్రజ్యోతి – 30.1.1962**

BRAOU

**అభ్యాసం –1**

తెలుగు పత్రికా రచనలో భాష పొందుతూ వచ్చిన మార్పుల్ని సమీక్షించండి.

## 11.3 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- తెలుగులో తొలి పత్రికలేవి అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి.
- తెలుగులో పత్రికా రచన మొదట వ్యావహారిక భాషలో ప్రారంభమై 1858 తర్వాత గ్రాంథికంలోకి మళ్ళింది. తర్వాత అర్థ గ్రాంథికం, సరళ గ్రాంథికంలోకి మారింది. 1930 తర్వాత మళ్లీ వ్యావహారికంలోకి వచ్చింది.
- పత్రికా రచనలలో కన్పించే భాషను మూడు దశలుగా మనం గుర్తించవచ్చు.

## 11.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. పత్రికా భాషలో వచ్చిన పరిణామాన్ని సోదాహరణంగా వివరించండి.

2. గ్రాంథికం, సరళ గ్రాంథికం, వ్యావహారికం – ఈ భాషా భేదాలను మీరు ఎలా గుర్తిస్తారు.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. ప్రస్తుతం వస్తున్న దినపత్రికలు, వార్తలను అందించడంలో అవి అవలంబిస్తున్న పద్ధతులను వివరించండి?

2. కింది పదాలను, వ్యాకరణ రూపాలను అధునిక ప్రామాణిక భాషలో రాయండి.

   అధికము, ఇవ్వడానకు, చేయుచూ, చిన్న వాండ్రు, చేయుడమునకు, చేయుచున్నారు. ఇరుగడల, పొందుపరపబడెను, వాయిధ్యములు, అధికారమునందు, ఇచ్చట, క్రమముగా, అనుకొనిరి, ఉన్నదనియు, తలపబోకుడు, బాగుపడినగాని, వచ్చిన గాని, విషయంబులు, చింతిలుచున్నాము, చేసినారు.

BRAOU

BRAOU

# ఖండం - 3 రచనాభాష : సమస్యలు, పరిష్కారాలు

రాసే భాషలో, మాట్లాడే భాషలో లిపి సంబంధమైన సమస్యలు, ఊనిక, లయ మొదలైన ఉచ్చారణ సంబంధమైన సమస్యలు మనకు ఎదురవుతాయి. కొత్త సామాజిక సందర్భాలు పుట్టుకొస్తున్న నేపథ్యంలో కొత్త భావనలు, భాషలో వాటికి సంకేతాలుగా కొన్ని పారి భాషికపదాలు, పదకల్పనలు ఏర్పడుతూ వస్తాయి. భాషను ఉపయోగించేటప్పుడు వాక్యప్రయోగాల్లో, శైలీభేదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలూ కొన్ని ఉంటాయి. వీటన్నిటినీ చర్చిస్తూ ఈ ఖండంలో ఆరు భాగాలను సమకూర్చాం. అవి :

12. లేఖన, ఉచ్చారణ సమస్యలు
13. కొత్త భావనలు, పదకల్పనలు, ప్రత్యేక పదాలు, ఉచిత పదప్రయోగాలు
14. వాక్య ప్రయోగ విధానం
15. విరామచిహ్నాలు
16. శైలి – విశేషపదాలు, మాండలికత
17. పత్రికా భాషలో మార్పులు 'జమీన్ రైతు' భాష పరిశీలన (ప్రత్యేక అధ్యయనం)

BRAOU

BRAOU

# భాగం : 12 లేఖన - ఉచ్చారణ సమస్యలు

**విషయ క్రమం**

12.0 ఉద్దేశం

12.1 ప్రవేశిక

12.2 తెలుగు మాటలు : రాత రూపాలు

12.2.1 ఇ ఈ ఎఏ, ఉఊ ఒఓ రాతలో భేదాలు

12.2.2 అచ్చుతో మొదలయ్యే పదాలు, రాతలో సౌకర్యాలు

12.2.3 మాటల కలయికలో ఉచ్చారణ : రాత

12.2.4 తెలుగు మాటలు : రాతలో వదలివేయదగ్గ పాత అలవాట్లు

**అభ్యాసం - 1**

12.3. సంస్కృత పదాలు : రాత రూపాలు

12.3.1 పదం చివర ము వచ్చే మాటలను సున్నాతో రాయడం

12.3.2 ఋ – రు

12.3.3 శ.స,ల మధ్య ఉండే భేదం

12.3.4 ఒత్తు అక్షరాలు రాసే పద్ధతి

12.3.5 విసర్గ అనబడే ః గుర్తు

12.3.6 మాటల్లో వచ్చే త్య, ద్య

**అభ్యాసం - 2**

12.4. ఇంగ్లీషు మాటలు : రాత రూపాలు

12.4.1 ఇంగ్లీషు మాటల ఉచ్చారణ

12.4.2 హల్లు చివర ఉండే మాటలు

12.4.3 తెలుగులో గుర్తులు లేని ఇంగ్లీషులోని అచ్చులు, హల్లులు

BRAOU

BRAOU

**అభ్యాసం – 3**

12.5. తప్పొప్పులు

12.6. మాండలిక భేదాలు: ప్రామాణిక భాష

**అభ్యాసం – 4**

12.7. ఉచ్చారణలో మాటల కలయిక వల్ల వచ్చే మార్పులు: సంధి

12.7.1. సంస్కృత సంధులు

12.7.2. తెలుగు సంధి

12.7.3. బహువచన నామాల్లో సంధి

12.7.4. ఏకాక్షర ప్రత్యేయాలు చేర్చేటప్పుడు సంధి

12.7.5. క్రియారూపాల్లో సంధి

**అభ్యాసం – 5**

12.8. ఉచ్చారణలో సమస్యలు

12.8.1. శ్రవ్య, దృశ్య, మాధ్యమాలు

12.8.2. ఉచ్చారణ – లయ – ధ్వని

**అభ్యాసం – 6**

12.9. ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

12.10. మాదిరి పరీక్షా ప్ర శ్నలు

BRAOU

## 12.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు కింది అంశాలను తెలుసుకోగలుగుతారు :

- తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్ని రాయడంలో ఎదురయ్యే రాతరూపాలకి సంబంధించిన చిక్కులు.
- మాండలిక భేదాలు,
- ప్రామాణిక భాష,
- మాటల కలయిక వల్ల వచ్చే సంధి మార్పులు
- ఉచ్చారణలో ఎదురయ్యే లయ, ధ్వని సంబంధ సమస్యలు,

## 12.1. ప్రవేశిక

భాష ప్రధానంగా మనం నోటితో చేసే ధ్వనుల రూపంలో ఉంటుంది. మనుష్యులందరూ మాట్లాడుతారు కాబట్టి మానవ సమాజాలన్నింటికీ భాష ఉంది. వాటిల్లో కొన్ని సమాజాలకు అంటే కొన్ని భాషలకు మాత్రమే లిపి ఉంది. కొన్ని సమాజాల వారు మాత్రమే నోటితో చేసే ధ్వనుల రూపంలో ఉన్న భాషకు చేత్తోగీసే, లేదా చేత్తో రాసే గుర్తులు కల్పించారు. ధ్వనుల రూపంలో ఉన్న భాషకు కల్పించిన గుర్తులనే లిపి అంటారు.

ధ్వనుల రూపంలో మాత్రమే భాషను వినియోగించుకోవటాన్ని మౌఖిక భాష అంటాము. లిపి బద్ధమైన ధ్వనుల రూపాన్ని లిఖిత భాష అంటారు.

మౌఖిక భాష వాడకం శ్రవ్య, దృశ్య మాధ్యమాలలో ఉంటుంది. లిఖిత భాష ఇప్పుడు ప్రధానంగా ముద్రణ మాధ్యమంలో ఉంటుంది. ( దృశ్య మాధ్యమంలో సందర్భాన్ని బట్టి ఒకటి రెండు మాటలు బోర్డుల రూపంలో ఉండవచ్చు) లిఖిత సంప్రదాయం ఉన్న ఏ భాషలో అయినా ఉచ్చారణలో ఉన్న అన్ని రకాల ధ్వనులకు గుర్తులుండవు. ప్రధాన ధ్వనులకు మాత్రమే గుర్తులుంటాయి. అయితే భాషకన్నా లిపి ఆలస్యంగా మారుతుంది. అందువల్ల లిపికి, ధ్వనికి ఉన్న సంబంధం కాలక్రమేణా దూరమౌతుంది. భారతీయ భాషా లిపుల్లో ఈ వ్యత్యాసం చాలా తక్కువ. అసలు వ్యత్యాసం లేకపోలేదు. ఇంగ్లీషు వంటి భాషల్లో లాగా ప్రతిమాటకి అక్షరక్రమం నేర్చుకోవాల్సినంత విపరీతంగా భారతీయ భాషలకీ, వాటి లిపులకీ వ్యత్యాసం ఏర్పడలేదు. ఇంగ్లీషు భాషలో ఒక కొత్త మాటను నేర్చుకోవడం అంటే ఆ మాటలో ఏ అక్షరాలుంటాయో కూడా నేర్చుకోవాలి. దీన్నే ఇంగ్లీషులో స్పెల్లింగ్స్ (spelling) అంటారు.

తెలుగులో అక్షర క్రమం ఒకసారి నేర్చుకుంటే దాదాపు ఏ కొత్త మాటనైనా రాయడం నేర్చుకున్నట్టే. అయినా దాదాపు అనడం వలన తెలుగు రాతలో కూడా కొద్దికొద్దిగా చిన్న చిన్న చిక్కులున్నట్లు గుర్తించ వచ్చు.
మాటల్ని రాయడంలో తెలుగు మాటలకు కొన్ని చిక్కులు, సంస్కృతం మాటలకు ఇంకోరకపు చిక్కులు, ఇంగ్లీషు మాటలకు మరోరకమైన చిక్కులు ఉన్నాయి.

## 12.2. తెలుగు మాటలు - రాత రూపాలు

ఈ విభాగంలో తెలుగు మాటలు రాయడంలో ఉన్న చిక్కులను వాటి పరిష్కారాలను చర్చించుకుందాం. తెలుగు మాటలను దేశ్య పదాలని కూడా అంటారు. మాటల కలయికలో ఏర్పడే సంధి రూపాలు కొన్ని ఉన్నాయి. సంస్కృతం, తెలుగు సంధి రూపాలు ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అలాగే ఉచ్చారణలో ఎదురయ్యే సమస్యలు కొన్ని ఉన్నాయి. ఇవి ముఖ్యంగా ప్రసార మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ మాధ్యమానికి ప్రత్యేకించినవి. వీటిని మనం పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముందుగా లేఖన రూపాల్లో సమస్యల్ని పరామర్శిద్దాం.

### 12.2.1 ఇ ఈ ఎ ఏ ఉ ఊ ఒ ఓ రాతలో భేదాలు

తెలుగులో ఇ, ఈ, ఎ, ఏలు ఒకరకం అచ్చులు. ఉ, ఊ, ఒ, ఓలు ఇంకోరకం అచ్చులు. ఈ రెండు రకాల అచ్చులకు ఉచ్చారణలో భేదం ఉంది. ఇ, ఈ, ఎ, ఏలను పలికేటప్పుడు నాలుక ముందు భాగం పైకి కదులుతుంది. ఉ,

ఊ, ఒ, ఓలను పలికేటప్పుడు నాలుక వెనక భాగం అంగిలివైపు కదులుతుంది. కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే కాని ఈ తేడా అందరూ గుర్తించలేరు. ఇంతకన్నా తేలికగా గుర్తించే తేడా ఒకటుంది. ఉ, ఊ, ఒ, ఓలు ఉచ్చరించినప్పుడు పెదవులు గుండ్రంగా, ముందుకు కదులుతాయి. ఇ, ఈ, ఎ, ఏ, లు ఉచ్చరించినప్పుడు పెదవులు అట్లా ముందుకు రావు. వ్యాకరణంలో ఇ, ఈ, ఒ, ఓ, లను ఓష్ఠ్యాచ్చులని అంటారు. వాటి ఉచ్చారణను బట్టే ఈ పేర్లు పెట్టారు. ''తాలువు'' అంటే నోటిలో పైన గట్టిగా తగిలే భాగం. తాలువు దగ్గర ఏర్పడే ధ్వని కాబట్టి తాలవ్యం అనే పేరు వచ్చింది. ''ఓష్ఠం'' అంటే పెదవి. పెదవుల కదలికను ప్రధానంగా గుర్తించటం వల్ల ఉ, ఊ, ఒ, ఓలకు ఓష్ఠ్యాచ్చులని గుర్తించటం వచ్చింది.

ఇ, ఈ, ఎ, ఏలతో మొదలయ్యే పదాలకు ముందు ఉచ్చారణలో 'య' కారం చేరుతుంది. ఉ, ఊ, ఒ, ఓ, లతో మొదలయ్యే పదాలకు ముందు ఉచ్చారణలో 'వ' కారం చేరుతుంది. (పూర్వ వ్యాకరణాలు యకారాన్ని తాలవ్యమనీ, వకారాన్ని ఓష్ఠ్యమనీ గుర్తించాయి). దాన్నే రాతలో సూచిస్తే ఇట్లా ఉంటుంది :

ఇల్లు – యిల్లు, ఈత–యీత, ఎక్కడ – యెక్కడ, ఏరు–యేరు, ఉంది–వుంది, ఊరు–వూరు, ఒకటి – వొకటి, ఓడ – వోడ.

మొదటి వరస కన్నా రెండో వరస ఉచ్చారణకు ఎక్కువ దగ్గర అని ఎక్కువ మంది అనుకుంటారు. మొదటి వరస ఉచ్చారణకు దూరం కాదు. రాత గుర్తులకు ఉచ్చారణ మనం ఇచ్చుకున్నదే. అచ్చులతో రాసినా హల్లులతో పలకటానికి అభ్యంతరం ఏమీలేదు. అంటే ఇల్లు, ఊరు అని రాసినా, చదివేటప్పుడు యిల్లు, వూరు అని చదవటానికి అడ్డు వచ్చేదేమీ లేదు.

### 12.2.2 అచ్చుతో మొదలయ్యే పదాలు : రాతలో సౌకర్యాలు

అచ్చుతో మొదలయ్యే పదాన్ని అచ్చుతోనే రాయటం వల్ల కింద తెల్పిన సౌకర్యాలున్నాయి:

i) తెలుగులో ఇప్పుడు దొరికే నిఘంటువులలో ఈ మాటలు అచ్చుతోనే దొరుకుతాయి. కొన్ని తెలియని మాటలకు నిఘంటువులు ఉపయోగించటం భాష నేర్చుకునే వారికి అవసరం. నిఘంటువుల్లోనే ఈ మాటల్ని హల్లుతో ఎక్కించకూడదా? అని అడిగే వీలుంది. అట్లాంటి నిఘంటువు తయారయ్యేదాకా నిఘంటువులు చూడడం మానుకోము. పైగా మాటకున్న ప్రధాన రూపాన్ని నిఘంటువులో ఒక చోట ఇచ్చి, వాటిని పలికే తీరులో భేదాన్ని అక్కడే సూచించడం ఒక సంప్రదాయం. అన్ని ఉచ్చారణ భేదాల్ని ప్రధాన భేదాలుగా ఇస్తే నిఘంటువుల పరిమాణం పెరిగి పోతుంది.

ii) సంధి అంటే రెండు పదాలను కలిపేసి కొన్ని మార్పుల్ని చేసి పలకడం. పలికినట్లు రాయడం. తెలుగు సంధిలో అచ్చుల మధ్య సంధి చాలా ముఖ్యమైంది. అచ్చుతో ముగిసే మాట తర్వాత, అచ్చుతో మొదలయ్యే మాట వచ్చినపుడు వెనుకటి మాటలో చివరి అచ్చుపోతుంది. వాడు +ఎక్కడ అన్నప్పుడు ఉచ్చారణలో పూర్వపు మాటలో చివరి ఉత్వం జారిపోయి 'వాడెక్కడ' అని పలుకుతారు, రాస్తారు. ఇట్లాంటి సంధిలో యెక్కడ అని రాస్తే యకారం పోతుందని కూడా అధికంగా చెప్పుకోవాలి. యకారంతో మొదలయ్యే మాటలకు మాత్రం యకారం పోదు. కనీసం రాతలో అట్లా పోయినట్లు చూపించరు. అతడు + యోగ్యుడు అన్నచోట యకారాన్ని ఉంచాలి. సాధారణంగా ఉచ్చారణ అనుసరించి రాస్తున్నారు. కొన్నిసార్లు అచ్చుతోనూ, కొన్నిసార్లు హల్లుతోనూ రాస్తున్నారు. చలంగారి 'మ్యూజింగ్స్'

BRAOU

నుంచి కొన్ని వాక్యాలను గమనిద్దాం :

'అందుకనే అంటాను యెన్ని మతాలు, యెన్ని సోషలిజములు మానవ జాతి సమానత్వాన్ని బోధించినా, సరేకాని, మీరే తెలివి వొప్పుకోవలసి వచ్చినా సరేకాని, మీరే మనుషులయితే, నేను కాను' (పేజీ 110)

''ఇంతకీ లేని సౌందర్యాన్ని నేను చూస్తున్నానా? వున్న సౌందర్యానికి మీరు అంధులైనారా? ఎవరు తేల్చగలరు? వుంటే ఆ ఈశ్వరుడు తప్ప?'' (పేజీ 111)

ఈ ఉదాహరణలో యి,యీ, యె, యే-ల కన్నా వు, వూ, వొ, వోలు ఎక్కువ వాడారని మీరు గమనించారు. కొన్ని చోట్ల అచ్చుతోనూ, కొన్ని చోట్ల హల్లుతోనూ రాసేకన్నా అన్నిచోట్ల అచ్చులు రాస్తే రచనలో క్రమత్వం ఉంటుంది. క్రమత్వం అంటే అన్ని చోట్ల ఒకే పద్ధతిని పాటించటం

### 12.2.3 మాటల కలయికకు ఉదాహరణ

తెలుగులో తాటి + ఆకు అనేది కలిపితే వచ్చే మాటను తాటాకు అని రాస్తున్నారు. కాని నిజానికి ఉచ్చారణ 'ఆ' కాదు. అయితే ఈ రెంటినీ కలిపితే వచ్చే ధ్వనిని సూచించటానికి తెలుగులో గుర్తులేదు. క(రి+ఆవు అనేది కలిపితే వచ్చే మాటను క(రావు అని రాస్తున్నారు. ఇది కూడా తాటాకు వంటిదే. గుర్తు ఉంటే మంచిదే. కాని గుర్తులేనప్పుడు ఆ ధ్వనిని ఆ మాటల వాడకాన్ని బట్టి గుర్తించాల్సిందే కాని వేరే మార్గం లేదు. తెలుగు క్రియల్లో కూడా ఈ రకపు చిక్కు ఉంది. చెప్పు అనే క్రియకు, జరిగిన కాలాన్ని సూచించేటప్పుడు కొందరు చెప్పాడు అనీ, మరికొందరు చెప్పేడు అని రాస్తున్నారు. రెంటికీ ఉచ్చారణ దాదాపు ఒకటే. గోదావరి, ఆపైన విశాఖజిల్లాల రచయితలు చెప్పేడు అని రాస్తే, కృష్ణా, గుంటూరు, ఇంకా ఇతర జిల్లాల వాళ్ళు చెప్పాడు అని రాస్తున్నారు. ఈ రెండిట్లో ఏది రాసినా అదనపు సౌకర్యమూ లేదు. నష్టమూ లేదు.

### 12.2.4 తెలుగు మాటలు : రాతలో వదిలివేయదగ్గ పాత అలవాట్లు

i) వచ్చు, వద్దు, వరస వంటి మాటలు, ఉచ్చారణలో వొచ్చు, వొద్దు, వొరసగా వినిపిస్తాయి. కొంతమంది వీటిని ఒచ్చాడు, ఒద్దు అని అచ్చుతో కూడా రాస్తున్నారు. వచ్చాడు, వద్దు, వరస అనే రూపాల్నే రాసి ఉచ్చారణలో తమకు వీలైన విధంగా ఉచ్చరించుకోవచ్చు.

ii) వాడు అనే మాటకు ఉచ్చారణలో ఆడు, ఓడు, వోడు అనే భేదాలు కన్పిస్తున్నాయి. కొంతమంది మంచాడు అంటే మరికొంతమంది మంచోడు అంటారు. మావాడు అనే రూపానికి మావోడు అని కూడా అంటారు. ఇక్కడ కూడా ఆ మండలికాన్ని సూచించడానికి రచనలో అవసరమైతే తప్ప వాడు అని రాయడమే ఒక పద్ధతిగా ఉంటుంది.

iii) వెనకటి భాషలో క్రింద, క్రొత్త, త్రాగు, త్రోవ, ప్రక్క, బ్రతుకు వంటి మాటల్లో క్రావడి సూచించే ధ్వని పోయింది. ఉచ్చారణలోనూ, రాతలోనూ దీన్ని వదిలివేయవచ్చు. కాని కొందరు తమ ఉన్నత స్థానాన్ని నిరూపించుకునే ఉద్దేశంతో వాడుతుంటారు. అట్లాంటి సంభాషణను సూచించటానికి తప్ప దీనికి వేరే ప్రయోజనం లేదు. వ్రాయు, వ్రాత అనే మాటల్లో రకారం పోలేదు. వకారమే పోయింది. వ్రాశాడు అని రాస్తే శిష్ట వ్యావహారికమనీ, రాశాడు అని రాస్తే గ్రామ్యమనీ మనలో ఇలా కొందరు అనుకుంటారు. పూర్వులు అంటే సుమారు ఏభై ఏళ్ళ కిందట రాశాడు అని ఉచ్చరించినా వ్రాశారు అనే రాసేవాళ్ళు. ఇటీవలి కాలంలో చాలామంది రాశాడు అనే రాస్తున్నారు. నిఘంటువులో

వ్రాయి రూపమే ఉన్నా, వ్రాయు అని రాసి రాయు అని చదవడం చాలా కష్టం. రాశాడు, రాత అని రాయడమే ఎక్కువ ఆమోదాన్ని పొందిన పద్ధతి. అయితే చేవ్రాలు అనే మాట చేరాలు అని కాదు.

**అభ్యాసం – 1**

A. తెలుగులో అచ్చులో మొదలయ్యే మాటలను రాయడంలో ఉన్న చిక్కులేవో తెల్పి, వాటికి పరిష్కారాలను సూచించండి

B. తెలుగులో రాయటంలో వదలివేయదగ్గ పాత అలవాట్లు ఏవో తెల్పండి?

BRAOU

## 12.3 సంస్కృత పదాలు: రాతరూపాలు

ఈ విభాగంలో పదం చివర యు వచ్చే వాటిని ఈనాటి రాతలో ఏరకంగా రాస్తున్నామో, సంస్కృత భాషలో నుంచి తెలుగులోకి వచ్చిన మాటను రాయడంలో ఏ ఇబ్బందులను ఎదుర్కొంటున్నామో, వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలో పరిశీలిద్దాం.

### 12.3.1. పదం చివర ము వచ్చే మాటలను సున్నతో రాయడం

పూర్వపు తెలుగులో అంటే గ్రాంధికం అనే కావ్య భాషలో పదం చివర వచ్చే ములో ఈనాడు ఉకారం పోయి మకారం మాత్రమే మిగిలింది. దాన్ని సున్నతో సూచిస్తున్నారు. చాలాకొద్ది మంది మాత్రం ఇంకా పదం చివరలో ము రాస్తున్నారు. మేము, మనము వంటి మాటలలోనూ, ము కు పూర్వం దీర్ఘం ఉండే మాటల్లో అంటే గులాము వంటి మాటల్లోనూ, నడుము, ఉడుము వంటి మూడక్షరాల మాటల్లోనూ నడిమి అచ్చు ఉ అంటే ము రాస్తున్నారు. ఒకవేళ సున్నా రాసినా, బహువచనంతో గులాములు, నడుములు, ఉడుములు అనే ము ఉన్న ఉచ్చారణ వినిపిస్తుంది. చివర సున్నతో రాసిన మాటలు తెలుగైనా, సంస్కృతమైనా ఇప్పుడు మనకున్న నిఘంటువుల్లో అది చివర ముతో కనిపిస్తాయి. అందరి ఉచ్చారణలోనూ, దాదాపు అందరి రాతలోనూ సున్న కనిపిస్తుంది. సున్నతో రాయడం సౌకర్యం.

### 12.3.2 ఋ, ౠ

ఋ, ౠ లు తెలుగులో సంస్కృతం నుంచి తెలుగులోకి వచ్చిన మాటల్లో కన్పిస్తాయి. సంస్కృతం నుంచి తెలుగులోకి వచ్చిన మాటల్లో తప్ప మరెక్కడా కన్పించవు. ఒక్క క్లుప్తం అనే మాటల్లో తప్ప ఎక్కడా కనిపించదు. కాని దీన్నందరూ క్లుప్తం అనే రాస్తున్నారు. ఋ ౠలతో వచ్చిన మాటలు మాత్రం చాలా ఉన్నాయి. ఋషి, ఋతువు, కృష్ణుడు, దృష్టి, తృష్ణ వంటి చాలా మాటల్లో ఈ ఋత్వం కన్పిస్తుంది. కొంతమంది మాత్రం రుషి, రుతువు అని రాస్తున్నారు. చాలామంది హల్లుమీద రాసే ఋత్వాన్ని, అంటే కృష్ణుడు, దృష్టి, కృషివంటి మాటల్లో ఋత్వం రాస్తున్నారు. వీటిల్లో కూడా ఉచ్చారణని అనుసరించి ఋత్వం తీసేసి క్రుష్ణుడు, ద్రుష్టి, క్రుషి అని రాస్తున్నారు. ఉదాహరణకు వుప్పల లక్ష్మణ రావుగారి బతుకు పుస్తకంలో ఈ ధోరణి కనిపిస్తుంది. (విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుస్, విజయవాడ 1983) తెలియని సంస్కృతం మాటలకు నిఘంటువుల్లో అర్థాలు వెతుక్కోవలసిన అవసరం చాలా ఉంటుంది. అందువల్ల సంస్కృతం మాటల వర్ణక్రమం మార్చకుండా ఉండటమే మంచిది. ఋత్వం లేనిచోట కొందరు ఋత్వం పెడుతున్నారు. ఉదాహరణకి శత్రువు, ధ్రువతార అనే మాటల్లో 'ృ' త్వంబదులు క్రావడే ఉండాలి. సంస్కృతం మాటల్లో ఆజ్ఞ, జ్ఞాపకం, ప్రజ్ఞ, యజ్ఞం, విజ్ఞానం అనే మాటలను అగ్న్య, గ్నాపకం ( గ్యాపకం), ప్రగ్న, యగ్నం, విగ్నానం అని ఉచ్చరించే వారున్నారు. అయినా చాలామంది ఈ మాటలను సంస్కృత పద్ధతిలో మొదటి విధంగా రాస్తున్నారు. ఒకరూ, అలా పలికే పద్ధతిలో రాయాలి అనుకున్నా అన్ని మాటలనూ ఇట్లా రాయడంలేదు. ఇప్పుడు కూడా సంస్కృతంలో అక్షరక్రమమే రాసి మన పద్ధతిని ఉచ్చరించుకోవచ్చు.

### 12.3.3. శ,ష,స మధ్య ఉండే భేదం

ఈ శ,ష,స భేదం ఉచ్చారణలో చాలా మందిలో కనబడదు. అయినా, తెలుగులో ఉదాహరణకి దురాశ, శీతాకాలం, ఆశీస్సు, వశంలో వచ్చిన శ వర్ణానికి బదులుగా సవర్ణం రాయడం నేర్చుకునే విద్యార్థులకు కొంత ఇబ్బంది

BRAOU

పెట్టే సమస్య. దీన్ని జాగ్రత్తగా పరిశీలించడం ద్వారా సందేహం వచ్చినపుడు నిఘంటువులు చూడడం ద్వారా, అభ్యాసం చేసుకోవాల్సిందే. ఇది కష్టపడి చేర్చుకోవాల్సిన ఒక అంశం.

### 12.3.4. ఒత్తు అక్షరాలు రాసే పద్ధతి

తెలుగు వర్ణమాలలో ఒత్తు అక్షరాల పేరుతో ఖ, ఘ, ఛ, ఝ, ఢ, థ, ధ, ఫ, భ అనేవి ఉన్నాయి. ఇవి సంస్కృతం నుంచి వచ్చిన మాటల్లోనే ఎక్కువగా ఉంటాయి. వీటిలో భ, ధ అనేవి ఎక్కువ మాటల్లో వస్తాయి. ఝ తక్కువ మాటల్లో వస్తుంది. వీటి ఉచ్ఛారణ ఈ తరంలో సన్నగిలి పోతోంది. అయినా తెలుగు రాసేటప్పుడు ఈ మాటల్ని సరిగ్గా చూపించక పోతే వాటిని తప్పులుగానే చాలామంది పరిగణిస్తున్నారు. వాటిని కొంచెం కష్టపడే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ అక్షరాలను అవసరం లేనిచోట ఉపయోగించడం కూడా తప్పే అవుతుంది. ఉదాహరణకు బేదం, బారం, ధారం, భావి వంటివి మొదటి రెండు మాటల్లోను పొల్లు ఉండవలసిన చోట లేదు. తరవాత అన్ని చోట్లను అవసరం లేని చోట పొల్లుంది. సంస్కృత మాటలను తెలుగులో రాసేటప్పుడు థ, ధలకు తెలుగువారి ఉచ్ఛారణ లో భేదం తక్కువ. రాతలోనూ, భేదం తక్కువే. మొదటి దానికి పొట్టలో చుక్క ఉంది అంటారు. ఉదాహరణకు అతిథి, గ్రంథం, రథం, ప్రథమం, కథ వంటి దానికి పొట్టలో ఉన్నటువంటి థకారానికి పొట్టలో చుక్క పెట్టడం మరచి పోకూడదు. ఇది నేర్చుకోడానికి కూడా నిఘంటువు సాయపడుతుంది.

### 12.3.5 విసర్గ అనబడే ః గుర్తు

సంస్కృతంలో 'ః' అనే గుర్తును విసర్గ అంటారు. ఇది దుఃఖం, ప్రాతఃకాలం, అంతఃకరణ వంటి మాటల్లో ఉంది. దుఃఖం అనే మాటను కొందరు విసర్గ తీసివేసి దుక్ఖం, దుఖ్ఖం అని రాస్తున్నారు. ఒక పద్ధతి ప్రకారం విసర్గ ఉన్న అన్ని మాటల్లోనూ విసర్గ రాయడమే మంచిది.

### 12.3.6 సంస్కృతం మాటల్లో వచ్చే త్య, ద్య

సంస్కృత మాటల్లో వచ్చే 'త్య' అనే వర్ణాల కూర్పుకు తెలుగులో 'త్తె' అని 'చ్చె' అనీ ఉచ్ఛారణ భేదాలు వేరు వేరు ప్రాంతాలలో ఉన్నాయి. అట్లాగే 'ద్య ' అనే కూర్పుకు 'ద్దె' అనీ 'జ్జ' అనీ 'జ్య' అనీ ఉన్నాయి. ఈ కింది మాటల్లో భేదాలను గుర్తు పట్టవచ్చు.

సత్యం, సత్తం, సచ్చెం...పద్యం, పద్దెం, పజ్జెం పజ్యం తెలుగులో ఈ రకాల త్య, ద్య సంస్కృతం నుంచి విరివిగా వచ్చినందున వాటిని అట్లాగే మార్చకుండా ఉండడం మంచిది. బాగా అలవాటయిన సత్యం, పద్యం వంటి మాటలకు ఎట్లా రాసినా అర్థం చేసుకోవచ్చు గాని ఇతర చోట్ల వెంటనే పద స్వరూపాన్ని గుర్తు తెచ్చుకొని అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. అజ్యతనాంధ్ర అని రాస్తే అద్యతనాంధ్ర అని ఉద్దేశించినట్లు చప్పున బోధపడదు. త్స అనే సంస్కృత వర్ణాల కూర్పుకు తెలుగులో 'చ్ఛ' అనేఉచ్చారణ ఉంది. సంవత్సరం అనే మాటకు సంవచ్ఛరం అని ఉచ్ఛరిస్తారు. రాతలో మొదటిదే కనిపిస్తుంది.

**అభ్యాసం - 2**

i) ఈ కింది సంస్కృతం మాటలను సాంప్రదాయక పద్ధతిలో తిరగరాయండి. అవసరమైతే నిఘంటువును సంప్రదించండి.

| | |
|---|---|
| ద్రుష్టి | ప్రసంశ |
| ఋణం | సెరీరం |
| సిక్ష | అద్రుష్టం |



BRAOU

| | |
|---|---|
| గ్యాపకం | వాంగ్మయం |
| విగ్నానం | |

ii) ఈ కింది సంస్కృతం మాటల్లో ఒత్తులు సరైనచోట పెట్టండి. అవసరమైన అక్షరాలు మార్చి ఒత్తు అక్షరాలు రాయండి

| | |
|---|---|
| ప్రారంబం | శిదిలం |
| గమ్యస్తానం | శుబోదయం |
| మాదుర్యం | ఆంద్ర |
| బేధం | పలితం |
| గంధకం | సంస్తానం |
| భోద | కాష్టం |
| భాద | |

iii) ఈ కింది మాటలను సాంప్రదాయక పద్ధతిలో రాయండి

| | |
|---|---|
| యచ్చరం | సంవచ్చరం |
| యజ్ఞాన్నం | పజ్ఞనిమిది |

BRAOU

## 12.4 ఇంగ్లీషు మాటలు: రాత రూపాలు

ఇంగ్లీషు భాషలోనుంచి తెలుగులోనికి చాలా ఇంగ్లీషు మాటలు వచ్చాయి. వాటిని తెలుగులో రాసేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలను ఈ విభాగంలో తెలుసుకుందాం.

### 12.4.1. ఇంగ్లీషు మాటల ఉచ్చారణ

ఇంగ్లీషు మాటలు తెలుగులోకి రాసేటప్పుడు కొన్ని చిక్కులు వస్తాయి. తెలుగు రాతలో సూచించడానికి వీల్లేని ధ్వనులు కొన్ని ఇంగ్లీషులో ఉన్నాయి.

map, bat, cap అనే మాటల్లో అచ్చును తెలుగులో సూచించడం కష్టం. కొందరు మేప్, బేట్, కేప్ అని రాస్తున్నారు. మరికొందరు మాప్, బాట్, కాప్ అని రాస్తున్నారు. మొదటి అక్షరానికి యావత్తు ఇచ్చి మ్యాట్, బ్యాట్, క్యాప్ అని మరికొందరు రాస్తున్నారు. న్యాయం, వాక్యం, సన్యాసి, సూర్యం వంటి చోట్ల వచ్చే యావత్తులాగా ఈ ఇంగ్లీషు మాటలలో రాసే యావత్తును ఉచ్చరించకూడదు. ఒకటి కన్నా ఎక్కువ హల్లుల కూర్పుతో వచ్చే మాటల్లో అచ్చును సూచించడానికి యావత్తును రాసే అలవాటు తెలుగులో లేదు. class, glall మాటలను క్లాసు, గ్లాసు అనే రాస్తారు. క్ల్యాసు, గ్ల్యాసు అని ఎవరూ రాయరు. అయినా ఇక్కడి అచ్చు ఉచ్చారణ map, bat వంటి మాటల్లో ఉచ్చారణ లాంటిదే.

## 12.4.2. హల్లు చివర ఉండే మాటలు

ఇంకో విషయం గుర్తుంచుకోవాలి. ఇంగ్లీషు, హిందీ వంటి భాషలలో హలంతమైన మాటలు ఎక్కువ. వాటిని తెలుగులో పొల్లు అక్షరాలతో చూపించవచ్చు. క్లాస్, గ్లాస్, పెన్, పెన్సిల్, టేప్, నోట్ పేపర్, మ్యాట్, హ్యాట్ పై మాటల అజంతంగా (పదం చివర అచ్చును చేర్చి) క్లాసు, గ్లాసు, టేపు, పేపరు, మ్యాటు, హ్యాటు, నోటు, పెన్సిలు అని కూడా రాయవచ్చు.

మరికొన్ని మాటల్లో చివర అచ్చు చేరే ముందు చివరి హల్లుకు ద్విత్వం వస్తుంది. పెన్ను, రోడ్డు, గన్ను, బన్ను మొదలైనవి.

చాలా మాటలకు పదం చివర ఉ అనే అచ్చు చేరిస్తే రాతలో అక్షరానికి కొమ్ము చేర్చి చూపించవచ్చు.

ఇది తెలుగువారి ఉచ్చారణలో సహజంగా కనిపించే విషయం. అసలు మూల భాషలో వారి అలవాటుననుసరించి అజంతంగానూ ఉచ్చరించ వచ్చు. రెండు పద్ధతులనూ రాతలో చూపించవచ్చు. లేదా రాతలో ఒకే పద్ధతిని అనుసరించి, ఉచ్చారణ వారి ఇష్టాను సారం చెయ్యవచ్చు.

శాస్త్ర విషయాలను గురించి రాసేటప్పుడు వివిధ భాషల్లోని పదాలను వాడాల్సిన అవసరం వస్తుంది. పదాల ఉచ్చారణలోనూ, రాతలోనూ, ఏక సూత్రత (Uniformity) నిర్దిష్టత (Exactness) కావాలని ఆయా శాస్త్రాల్లో ఆరితేరిన వాళ్ళు కోరుకుంటారు. ఆ సందర్భాల్లో ఉపయోగించిన మాటలను మూల పదాలను ఉచ్చారణకు సాధ్యమైనంత దగ్గరగా ఉండేటట్లు రాయడం మంచిది.

BRAOU

ఇంగ్లీషు వంటి భాషలో నుంచి హలంత శబ్దాలను తెలుగులోకి తెచ్చుకునేటప్పుడు తెలుగులో ఉ అనే అచ్చును చివర చేరుస్తామని చెప్పుకున్నాం. కాని అన్ని మాటలకీ చివర ఉ చేరదు. కొన్నిటికి ఇ చేరుతుంది. ఉదాహరణకు ఈ కింది ఇంగ్లీషు మాటలను ఇంగ్లీషు, తెలుగు రాతల్లో క్రమంగా చూడండి. చర్చ్ – చర్చి, వాచ్ – వాచి, కోచ్ – కోచి, మాచ్ – మేచి, మార్చ్ – మార్చి, జార్జ్ – జార్జి, బ్రిడ్జ్ – బ్రిడ్జి, జడ్జ్ – జడ్జి.

చ్ – జ్‌లు అంతంలో వచ్చిన మాటలకు ఉ బదులు ఇ చేరడం ఇందులో గమనించ వచ్చు. పైన ఇచ్చిన మాటల్లో బ్రిడ్జి, జడ్జి అనే మాటలను గమనించండి. ఇంగ్లీషు స్పెల్లింగ్‌లో d అనే అక్షరం ఉన్న దానికి ఉచ్చారణ లేదు. కానీ తెలుగులో అదే అక్షరానికి సమానంగా డ అనే అక్షరాన్ని ఈ మాటల్లో వాడుతున్నాం. ఈ మాటల్ని డ అనే అక్షరం లేకుండా రాస్తే, ఆ మాటలుగా గుర్తించడం కష్టం కూడా. అంటే బ్రిజ్ అని రాస్తే బ్రిజ్జి అనిగానీ, జజ్ అని రాస్తే జజ్జి అనిగాని చప్పున గుర్తించడం కష్టం.

ఇట్లాంటి వాటిని తెలుగు రాత ప్రకారం ఉచ్చరిస్తే ఇంగ్లీషులో spelling Pronouciation అంటారు. రాసినట్టు ఉచ్చరించే పద్ధతి అని అర్థం. ఉచ్చారణకు రాతకు తేడా ఎక్కువ వుండే ఈ పద్ధతి విచిత్రంగా వుంటుంది. దాదాపు ఉచ్చరించినట్లు రాసే తెలుగువాళ్ళకి రాసినట్లు ఉచ్చరించడంలో విచిత్రం ఏమీ కనబడదు. కానీ ఇంగ్లీషు ఉచ్చారణకు రాతకు ఉన్న విపరీతమైన తేడా వల్ల వారికి విచిత్రంగా కనిపిస్తుంది.

## 12.4.3 తెలుగులో గుర్తులు లేని ఇంగ్లీషులోని అచ్చులు, హల్లులు

ఇంగ్లీషు మాటలను తెలుగులో రాసేటప్పుడు ఎన్నో చిక్కులు ఎదురౌతాయి. కొన్ని రకాల అచ్చులకు, హల్లులకు తెలుగులో గుర్తులు లేవు. ఉదాహరణకు ఈ మాటలు గుర్తించండి. బోటిల్, బాటిల్, జూఆలజీ.

తెలుగులో రాసే అలవాట్లను బట్టి వీటిని నేర్చుకోవాల్సిందేకానీ, అన్నిటికి కలిపి ఒక ప్రయోజనకరమైన లక్షణం చెప్పడం కష్టం.

**అభ్యాసం – 3**

i) ఈ క్రింది ఇంగ్లీషు మాటలను తెలుగులో రాయండి.

| | |
|---|---|
| college, | Astronomy, |
| University, | Whistle, |
| budget, | Biology, |
| Parliment, | Gas, |
| Assembly, | Chemistry, |
| Psychology, | Physics, |
| Sociology, | Therapy, |

## 12.5. తప్పొప్పులు

BRAOU

భాష రాస్తున్నప్పుడు ఏం తప్పు చేస్తున్నామో అని భయపడడం సరైన పద్ధతి కాదు. మనం చెప్పదల్చుకున్నది సమర్థంగా చెప్పుతున్నామా లేదా అని చూసుకోవడమే సరైన పద్ధతి. నలుగురు ఒప్పుకునేది ఒప్పు. ఎవ్వరూ ఒప్పనిది తప్పు. మనం రాసే వాటిలో కొన్నింటిని గురించే పూర్తి తప్పు అని పూర్తి ఒప్పుఅని చెప్పగలుగుతాం. చాలా వాటి విషయంలో అట్లా చెప్పలేం. ఇది తప్పు అని నిర్ణయించేకన్నా ఈ విధంగా రాస్తే ఇంతకన్నా బాగుంటుంది అని చెప్పడం మంచి పద్ధతి. తెలుగులో కొంతమంది మంచి రచయితలురాసిన రచనలు చదివితే మంచి భాష రాయడం అలవాటవుతుంది. అందువల్ల మంచి రచనలు ఎక్కువ చదవాలి. శ్రీరంగం శ్రీనివాస రావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, గుడిపాటి వెంకటచలం, కొడవటి గంటి కుటుంబరావు, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి, త్రిపురనేని గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి, నాయని కృష్ణకుమారి, రంగనాయకమ్మ, సీతాదేవి , ఓల్గా, సత్యవతి, మొదలైన రచయితలు ఈ కాలపు తెలుగును సమర్థంగా రాశారు. వాళ్ళ రచనలు చదివితే మంచి తెలుగు రాయడం నేర్చుకోవచ్చు.

## 12.6 మాండలిక భేదాలు - ప్రామాణిక భాష

ఒక భాషను చాలామంది మాట్లాడేటప్పుడు అందరూ మాట్లాడేది ఒకేరకంగా ఉండదు. కొందరు మాట్లాడే భాష మరికొందరు మాట్లాడే భాషకన్నా వేరుగా ఉంటుంది. ఉదాహరణకు ఉభయగోదావరి మండలాలలోనూ, విశాఖ, విజయనగరప్రాంతాలలోనూ అలా, ఇలా, ఎలా అంటారు. గుంటూరు, కృష్ణాలో అట్లా, ఇట్లా, ఎట్లా అనీ తెలంగాణాలో గట్ల, గిట్ల, ఎట్ల అనీ అంటారు.

**తెలంగాణా జిల్లాల్లో** వచ్చిండు అంటే, రాయలసీమ జిల్లాల్లో వచ్చినాడు అని, మిగతా చోట్ల వచ్చాడు అని అంటారు.

ఇట్లాంటి తేడాలను మాండలిక భేదాలు అంటారు. రాసేటప్పుడు వీటిలో ఏది రాయాలి? అని అడుగుతుంటారు. దీనికి చప్పున సమాధానం చెప్పడం కష్టం. మనం రాసే విషయాన్ని బట్టి, ఎవరికి కోసం ఉద్దేశించాం అనే దాన్ని బట్టి, సమాధానం ఉంటుంది. కవిత్వంలో ప్రాచీన భాష, మాండలిక భేదాలు ఇంకా ఇతరమైన భేదాలు చాలా వాడుతారు. కల్పనా సాహిత్యంలో అంటే కథల్లో, నవలలో సందర్భాన్ని బట్టి మాండలిక భేదాలు వాడుతారు. కానీ అన్ని రకాల ప్రజల్ని ఉద్దేశించి చేసిన రచనల్లో అందరికి అర్థమయ్యే భాష వాడుతారు. అట్లాంటి భాషని ప్రామాణిక భాష అని అంటారు. అందరికీ అర్థమయ్యే సామాన్య భాషను కొన్ని మార్పులతో రాస్తే ప్రామాణిక భాష అంటారు. రాసే అవసరాలున్న సమాజంలో అందరూ రాయడానికి ఒప్పుకున్న ఒక భాష ఉంటుంది. ఈ భాషకు కొన్ని మండలాల భాషతో దగ్గరి సంబంధం ఉన్నా ఇది ఏ ఒక్కరి సొంతం కాదు. ప్రామాణిక రచనా భాష అనేది మాట్లాడే భాష నుంచే ఏర్పడుతుంది. ఎవరి వాడుక భాషను వారు పూర్తిగా రాయడం వల్ల ఆ భాష వాడని వారికి అభిప్రాయ గ్రహణం కష్టం అవుతుంది. సాహిత్య రచన వేరు, సాహిత్యేతర రచన ఎక్కువ ప్రాంతాల వారికి అర్థం కావాల్సిన అవసరం ఉంటుంది. అట్లా అందరికీ అందుబాటులో ఉన్న భాషను ప్రామాణిక భాష అంటారు. అందరూ రాయటానికి ఒప్పుకున్న భాష కాబట్టి ఆ భాషలో ఏకత్వం ఉంటుంది. అందరికీ అందుబాటులో ఉంటుంది. వారి వారి అలవాట్లు చేరడం వల్ల భిన్నత్వం కూడా ఉంటుంది.

ఒక్కోసారి రెండు మాటల్ని – అవి నామాలు కావచ్చు, క్రియలు కావచ్చు–చూపించి ఇందులో ఏది ప్రామాణికం అని అడుగుతుంటారు. ఏదో ఒకటే ప్రామాణికమై ఉండాలన్నట్లు. రెండూ ప్రామాణికం కావచ్చు. కొందరు చెప్పాడు అని రాస్తే కొందరు చెప్పినాడు అని రాస్తారు. రెండూ ప్రామాణికమే.

సమాజంలో తలెత్తిన కొన్ని పరిస్థితుల వల్ల పరస్పరాంగీకారంలో నిర్ణయించుకునేది, అందరూ రాయడానికి ఇష్టపడేది, ఇతరులు రాస్తే ఒప్పుకునేది ప్రామాణిక భాష.

**అభ్యాసం – 4**

అధునిక ప్రామాణిక భాషను ఎవరు నిర్ణయిస్తారో, అది ఏరకంగా ఏర్పడుతుందో వివరించండి?

BRAOU

## 12.7 ఉచ్చారణలో మాటల కలయిక వల్ల వచ్చే మార్పులు:సంధి

కింద ఇచ్చిన మాటలను ముందుగా గమనిద్దాం, మొదటి వరసలోని ప్రతిమాటకు ఎదురుగా మరొక మాట ఉంది చూడండి.

| | |
|---|---|
| పాలు | |
| ఆవు | ఎవరు |
| | ఎందుకు |
| కారు | లేదు |
| వారు | లేవు |
| డబ్బు | ఉంది |

ఈ మాటల్లో కొన్నింటిని అర్థవంతంగా కలిపిరాస్తే పాల్లేవు, ఆవుంది, డబ్బుంది, వారెవరు, కారెందుకు, ఆవుపాల్లేవు మొదలైన వాక్యాలు తయారు అవుతాయి. విడదీసిన మాటలను వాక్యంలోని కలిపిన మాటలతో పోల్చి చూడండి.

| 1 | 2 | 3 |
|---|---|---|
| పాలు+లేవు | పాల్+లేవు | పాల్లేవు |
| ఆవు+వుంది | ఆవ్+ఉంది | ఆవుంది |
| డబ్బు+వుంది | డబ్బ్+ఉంది | డబ్బుంది |
| వారు+ఎవరు | వార్+ఎవరు | వారెవరు |
| కారు+ఎందుకు | కార్+ఎందుకు | కారెందుకు |
| ఆవుపాలు+లేవు | ఆవుపాల్+లేవు | ఆవుపాల్లేవు |

BRAOU

పై పట్టికలో 1–2 వరసల కింద మాటల క్రమాన్ని జాగ్రత్తగా చూస్తే జరిగిన మార్పేమిటో తెలుస్తుంది. మొదటి మాటలో చివరి అచ్చు ఇంకోమాట వచ్చినప్పుడు ఎగిరి పోయింది. మొదటి వరుసలో మాటల చివర ఉన్న కొమ్ము ఉ అనే అచ్చును సూచిస్తుంది. పాల్ అనే అక్షరం పైన ఇచ్చిన పొల్లు అచ్చులు లేకపోవడాన్ని చూపిస్తుంది. అచ్చులేకుండా ఇట్లా పొల్లుతో రాసేకన్నా తరువాత అక్షరంతో కలిపిరాస్తే చోటు కలిసి వస్తుంది. అట్లా కలిపి రాయడం చాలామందికి అలవాటు. అందుకు కారణం తెలుగులో హల్లుతో ముగిసే (హలంతమైన) మాటలు తక్కువ. ఉన్నవాటికైనా రాతలో చూపించకుండా ఉచ్చారణలో చూపిస్తారు. మకారాంతమైన అందం, చందం, కంచెం, మంచం వంటి మాటలను చివర సున్నతో రాస్తాము గనుక పొల్లు అక్షరాలు ఇక్కడ అవసరం లేదు. అందువల్ల హల్లు – అచ్చులు క్రమంగా వచ్చినప్పుడుగానీ రెండుమూడు హల్లులు వరుసగా వచ్చినప్పుడుగానీ వాటిని కలిపి రాయడం అలవాటయింది.

పైన పట్టికలో రెండో వరసలో జరిగిన మార్పులు సంధి అంటారు. పూర్వం మీరు చదివిన వ్యాకరణాల్లో పూర్వ పర స్వరంబులకు పరస్వరం బేకాదేశంబగుట సంధి అని గాని, ఆ అర్థం వచ్చేటట్లు రాసిన ఇంకో నిర్వచనం కాని చదివే ఉంటారు. ఆ సూత్రాలు అవసరం లేకుండానే మనం మాట్లాడే భాషలోనూ, ఈ కాలపు రాసే భాషలోనూ జరిగే మార్పులను సంధిపేరుతో గుర్తించ వచ్చు.

రెండు అర్థవంతమైన శబ్దాలు ఉచ్చారణలో దగ్గరగా వచ్చినప్పుడు ఆ భాష మాట్లాడే వారి అలవాట్లను బట్టి జరిగే మార్పులను సంధి అంటారు. ఈ మార్పులు అన్ని ప్రాంతాలలోనూ ఒకటిగా ఉండక పోవచ్చు. అయితే ఇట్లాంటి భేదాలు

స్వల్పంగా ఉంటాయి. వాటివల్ల వ్యవహారంలో వచ్చే చిక్కులు ఏమీ ఉండవు. ఒక భాష మాట్లాడే వారి అలవాట్లలో గుర్తించదగిన సామ్యం (ఏకత్వం పోలిక) ఉంటుంది. భాషల మధ్య ఈ అలవాట్లలో భేదం ఉంటుంది. అంటే సంధి అన్ని భాషల్లోనూ ఒకటిగా ఉండదని అర్థం.

సాంప్రదాయక వ్యాకరణాల్లో సంధిని గురించి వివరంగా విశదీకరించారు. కానీ అది ఆధునిక రచనా భాషకు అంతగా సరిపడదు. ప్రాచీన కావ్య భాషను దృష్టిలో పెట్టుకుని రాశారు వాళ్ళు. ప్రాచీన కావ్య భాషాప్రభావం ఈనాటి రచనా భాష మీద చాలా తక్కువ. ఈ శతాబ్ది మొదటి అర్ధభాగంలో రాసిన కొందరు రచయితల మీద ఆ భాషా ప్రభావం ఉంది. కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీ నరసింహా రావు, విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహ శాస్త్రి, కోరాడ రామకృష్ణయ్య మొదలైన రచయితల వచన, రచనల మీద ప్రాచీన భాషా ప్రభావం ఉంది. ఇటీవలి కాలంలో వచన రచయితలుగా పేరుపొందిన వారి రచనల మీద ఈ ప్రభావం తక్కువ. ఉదాహరణకు గుడిపాటి వెంకట చలం, కొడవటి గంటి కుటుంబ రావు, త్రిపురనేని గోపిచంద్, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, నార్ల వెంకటేశ్వర రావు, గోరాశాస్త్రి, రాచమల్లు రామచంద్రారెడ్డి, రంగనాయకమ్మ వంటి రచయితల మీద ఈ ప్రభావం చాలా తక్కువ. ఈకాలపు తెలుగు రచన ఈ కాలపు భాషలోనే ఉండాలి. కాబట్టి ఈ కాలపు భాష రాసేవాళ్ళే ఈనాటి వచన రచనకు ఆదర్శం. అంతేకాదు, ఈ భాగంలో పేరుపేరునా చెప్పని రచయితలు చాలామంది ఉన్నారు. వాళ్ళంతా ఈనాటి తెలుగు వచనాన్ని తీర్చి దిద్దడంలో భాగస్వాములే. వీళ్ళందరి వచన, రచనలు దృష్టిలో ఉంచుకుని కొన్ని విషయాలను నేర్చుకుందాం.

సంధి అనే మాటకు ప్రాచీన వ్యాకరణాల్లోనూ, ఆధునిక భాషా శాస్త్రంలోనూ వేరువేరు అర్థాలున్నాయి. వాటి గురించి సమగ్రంగా వివరించడానికిది సమయం కాదు. తెలుగు భాషా సాహిత్యాలను ప్రత్యేక విషయంగా తీసుకుంటే అక్కడ కూలంకషంగా తెలుసుకోవచ్చు. ఇప్పుడుమనకావాల్సింది : ఈనాటి రచనా భాషలో సంధిప్రవర్తన ఏమిటి? రాసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలేమిటి? అనేవే.

BRAOU

### 12.7.1. సంస్కృత సంధులు

తెలుగులో అనేక చారిత్రక, సాంస్కృతిక కారణాల వల్ల సంస్కృతం మాటలు విరివిగా ప్రవేశించాయి. సంస్కృతం ఎప్పుడో చాలాకాలం క్రిందట మాట్లాడే వాళ్ళు. ఉత్తర భారతంలో హింది,పంజాబి, బెంగాలి, ఒరియా, మరాఠి వంటి భాషలకు అది మూలం. వేరు వేరు భాషలుగా చీలిపోయిన తరువాత కూడా సంస్కృతం సాంస్కృతిక విజ్ఞాన భాషగా రాతలో మిగిలిఉంది. ఆ భాషలో గొప్పగొప్ప కావ్యాలు, శాస్త్రాలు వచ్చినాయి. దేశంలోని అన్ని ప్రాంతాల పండితులు ఈ గ్రంథాలు రచించారు. వారి ద్వారా సంస్కృత భాష నుంచి ఎన్నో మాటలు దేశ భాషల్లోకి వ్యాపించినాయి. అందువల్ల తెలుగురాసే వాళ్ళు కాస్తోకూస్తో సంస్కృత సంధిని గురించి కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది. వీటిని చూడండి.

### సవర్ణదీర్ఘ సంధి

అ–ఆ–ఇ–ఈ–ఉ–ఊ–ఋ– ౠ అనేవి హ్రస్వదీర్ఘ భేదాలతో ఉన్న అచ్చుల జంటలు. ఉచ్చారణలో ఎక్కువ కాలం ఉచ్చరించేది దీర్ఘం. తక్కువ కాలం ఉచ్చరించేది హ్రస్వం. తెలుగు మాటల్లో చెప్పుకుంటే పొట్టి అచ్చు, పొడుగు అచ్చు అని చెప్పుకోవచ్చు. ఈ పొట్టి, పొడుగు అచ్చులకు ఉచ్చారణ చాలా వరకు ఒకేరకంగా ఉంటుంది కనుక వీటిని సవర్ణాలన్నారు.

సవర్ణాలైన అచ్చులు రెండు ఏ క్రమంలో అయినా (అంటే రెండు పొట్టివిగానీ, రెండు పొడుగువిగాని, పొట్టి పొడుగుకాని, పొడుగుపొట్టికానీ) వస్తే దీర్ఘాచ్చు అవుతుంది. రెండింట్లో దీర్ఘాచ్చు అయితే ఇదే మిగులుతుంది.

| | | |
|---|---|---|
| దేశ+అటనం | = | దేశాటనం |
| ద్రాక్షా+ఆసవం | = | ద్రాక్షాసవం |
| కవి+ఈశ్వరుడు | = | కవీశ్వరుడు |
| భాను+ఉదయం | = | భానోదయం |
| పితృ+రుణం | = | పిత్రూణం |

సవరదీర్ఘ సంధి తెలియక పోవడం వలన భానోదయ అనే రాస్తున్నారు. రాస్తే తప్పేమిటనికొందరు అడగ వచ్చు. తప్పుఏమీ లేదు. అందరూ అట్లాగే రాస్తే తప్పుని ఒప్పుగా అందరూ అంగీకరిస్తున్నారు గనుక అది తప్పుకాదు. కానీ, కొందరు రాస్తే అది ఎక్కువ మంది పద్ధతికి విరుద్ధం కనుక తప్పు అవుతుంది. తప్పు అంటే నేరం అని కాదు. అందరూ ఒప్పుకున్న పద్ధతికి భిన్నం మాత్రమే.

**గుణసంధి**

సంస్కృతంలో ఏ, ఓ, అర్ (అల్ అక్కర్లేదు) అనే వాటిని గుణాలు అంటారు. ఈ సంధి జరిగే పద్ధతి కింది విధంగా చూపించ వచ్చు.

| | | | |
|---|---|---|---|
| అ, ఆ + | ఇ, ఈ | ఏ | రమా+ఈశ = రమేశ |
| | ఉ, ఊ | ఓ | మధుర+ఊహ = మధురోహ |
| | ఋ ఋ | అర్ | వసంత+ ఋతువు = వసంతర్తువు |

ఋకారంతో మొదలైన మాటలను సంధి చేయకుండానే రాస్తారు. వసంత ఋతువు, గ్రీష్మ ఋతువు అనే రాస్తుంటారు. (ఋతువు, ఋణం, ఋషి అనే మాటలను రుతువు, రుణం, రుషి అనే విధంగా కొంత మంది, బహుశా చాలామంది రాస్తున్నారు. ముఖ్యంగా పత్రికల్లో ఋకారాన్ని వదిలేస్తుంటారు.

**వృద్ధి సంధి**

| | | | |
|---|---|---|---|
| అ, ఆ + | ఏ, ఐ | ఐ | దేశ+ఏకత = దైశైక్యత |
| | ఓ, ఔ | ఔ | వన+ఓషధి= వనౌషధి |
| | | | దేశ+ఔన్నత్యం = దేశౌన్నత్యం |
| | | | మహా+ఐశ్వర్యం = మహైశ్వర్యం |



BRAOU

(ఏకత అనే మాటకు తెలుగులో ఐక్యత అనే రూపమే ఎక్కువ ప్రచారంలో ఉంది. పత్రికలలో, రాజకీయ గ్రంథాల్లో ఐక్యత అనే రూపమే కనిపిస్తుంది. సంస్కృత వ్యాకరణం ఒప్పుకోక పోయినా ఎక్కువ వ్యాప్తిలో ఉన్న ఈ రూపం రాయడం వల్ల నష్టం లేదు)

### యణాదేశ సంధి

ఇ,ఉ,ఋ,ల తరువాత సవర్ణంకాని అచ్చువస్తే య,వ,ర,లుగా మారతాయి. ఇ,ఉ,ఋ,లు అచ్చులు. వీటితో దగ్గర సంబంధం ఉన్న హల్లులు య,వ,రలు ఋ అనేది సంస్కృతంలో అచ్చు, అది ఎట్లా ఉచ్చరించేవారో తెలియదు ఇప్పుడు సంస్కృతం ఉచ్చరించే వారెవరూ దాన్ని అచ్చుగా ఉచ్చరించడం లేదు. అచ్చుగా ఉచ్చరించడం అంటే ఉచ్చారణావయవాలు ఒకదానికొకటి తాకకుండా ఉచ్చరించడం. ఇప్పటి తెలుగులో ఋకు రుకు భేదం రాతలో చూపించేది మాత్రమే.

| | | |
|---|---|---|
| అతి+అంత | = | అత్యంత |
| అతి+ఉక్తి | = | అత్యుక్తి |
| లఘు+అంతం | = | లఘ్వంతం |
| తరు+అగ్రం | = | తర్వగ్రం |
| పితృ+అర్జితం | = | పిత్రార్జితం |

సంస్కృత అచ్చు సంధుల్లో ప్రధానంగా తెలుసుకోవాల్సింది చాలా ఉన్నాయి. వాటిని సూత్రాల ద్వారా తెలుసుకోవడం కన్నా అభ్యాసం ద్వారా నేర్చుకోవడం ఎక్కువ సులువు.

### విసర్గ సంధి

సంస్కృతంలో వయస్, మనస్, తపస్ వంటి మాటలున్నాయి. వీటికి సంధిలో కొన్ని చోట్ల విసర్గ వస్తుంది. కొన్ని చోట్ల విసర్గకు ఉ వచ్చి అది ఓగా మారుతుంది. ఉదాహరణకు ఈ కింది మాటలు చూడండి.

| | | |
|---|---|---|
| వయస్+భేదం | = | వయోభేదం |
| మనస్+గతి | = | మనోగతి |
| తపస్+ధనం | = | తపోధనం |

కకార, పకారాది పదాలు వచ్చినప్పుడు ఈ చివరి స కారం విసర్గగా (ః) మారుతుంది. దాని ఉచ్చారణ కకారం ముందు హ కారంగాను, పకారం ముందు ఫ (ఉఫ్) అని ఊదినప్పుడు చేసే ధ్వని వంటిది గాను ఉంటుందని సంస్కృత వ్యాకరణాలలో చెబుతారు. మొదట ఉచ్చారణను జిహ్వామూలీయం అని రెండో ఉచ్చారణను ఉపధ్మానీయం అని అంటారు. అయితే తెలుగు వారి ఉచ్చారణలో ఈ భేదం కనబడదు. అన్నిటికీ హ కారాన్నే జిహ్వామూలీయ ధ్వనినే వాడుతారు. రాతలో విసర్గనే రాస్తారు. ఈ కింది ఉదాహరణలు చూడండి :

| | | |
|---|---|---|
| వయస్+పరిమితి | = | వయఃపరిమితి |
| మనస్+ఫలకం | = | మనఃఫలకం |
| తపస్+ఫలం | = | తపఃఫలం |

BRAOU

ఇంతకు ముందు చూపించిన వయోభేదం, మనోగతి, తపోధనం వంటి మాటల ప్రభావంలో వయోపరిమితి, మనో ఫలకం, తపోఫలం అని కొందరు రాస్తున్నారు. అట్లాగే తపశ్శక్తి, మనశ్శక్తి అని రాయాల్సిన చోట తపోశక్తి, మనోశక్తి అని రాస్తున్నారు. ఈ రకమైన రూపాలు ప్రసిద్ధమైన రచయితలు కూడా రాస్తున్నారు. చలం మ్యూజింగ్సులోను, రంగనాయకమ్మ రామాయణ విషవృక్షంలోనూ ఇట్లాంటివి కనిపిస్తాయి. వీలును బట్టి ఒకసారి వెతికి చూడండి. పత్రికలలో కూడా గుణం రూపాలే ఓత్ వచ్చే రూపాలు కనిపిస్తున్నాయి. ఇటువంటి రూపాల విషయంలో దొరికితే సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు రచించిన తత్సమ చంద్రిక అనే పుస్తకం ఉపయోగిస్తుంది. వెతికితే ఇట్లాంటి పుస్తకాలు ఇంకా మార్కెట్లో దొరక వచ్చు.

కొన్ని సంస్కృత సంధులు ఉన్నవి ఉన్నట్లుగా రాస్తే అవి తప్పులేమో అనిపించేంతగా వేరే సంధి రూపాలు వ్యాప్తికి వచ్చినాయి. ఉదాహరణకు అంతర్ + రాష్ట్రీయ సంస్కృత మ. ్యదను అనుసరించి అంతరాష్ట్రీయ అని కావాలి. ఆ సంధిరూపం రాస్తే అసలే అర్థం కాకుండా పోయే ప్రమాదం ఉంది.

అంతర్ రాష్ట్రీయ అని సంధిలేకుండా రాయడమే శ్రేయస్కరం. తెలుగులో కనిపించే సంస్కృత శబ్దాలు సంధిలో రకరకాలుగా కనిపిస్తున్నాయి. సంస్కృత పద్ధతికి విరుద్ధంగా తెలుగులో వ్యాప్తి చెందిన రాత రూపాలను మంచిదా కాదా అనే విషయం ఆయా రూపాలను బట్టి నిర్ణయించుకోవాల్సిందే కానీ అన్నిటికీ కలిపి ఒకే నిర్ణయం చేయడం కష్టం. మార్గదర్శకంగా ఈ సూత్రాలు పాటించ వచ్చు.

### 12.7.2 తెలుగు సంధులు

భాషలో కొన్ని మాటలకు కొన్ని అర్థాల్లో కొన్ని చిన్న చిన్న శబ్దాలు చేరతాయి. అట్లాంటి వాటిని ప్రత్యయాలు అంటారు. బహువచన ప్రత్యయం, కాలబోధక ప్రత్యయం, పురుష బోధక ప్రత్యయం అనే మాటలను వినే ఉంటారు. ఇవి చేరే మాటలను ప్రకృతులని, ధాతువులని అంటారు. ప్రస్తుతం ఈ మాటలకు అర్థాలు వెంటనే తెలియక పోయినా ఫర్వాలేదు. ఇట్లా ప్రకృతులకు అంటే అసలు మాటలకు ప్రత్యయాలు చేరినప్పుడు కొన్ని మార్పులు జరుగుతాయి. ఆ మార్పులను గురించి ముందు తెలుసుకుందాం. అయినా అన్నీ అక్కర్లేదు. రాతలో వచ్చే చిక్కులు తెలుసుకోవటానికే పరిమిత మవుదాం.

### 12.7.3 బహువచన నామాల్లో సంధి

లు అనే శబ్దాన్ని నామ పదాలకు చేరిస్తే బహువచన నామాలు ఏర్పడతాయి. ఇట్లా లు చేరిస్తే వచ్చే మార్పులు చాలా వరకు రాతలో చూపించడానికి అడ్డంకులేవీ లేవు. ఉదా:-చేతులు, గదులు, పుస్తకాలు, గేదెలు మొదలైనవి కాని, కొన్నింటిని రాసేటప్పుడు చిక్కులు వస్తాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని తెలుసుకుందాం.

i) కోడు+లు, కోడి+లు అని అక్షర క్రమంలో అచ్చుపోయి డ్లు అనే క్రమం వస్తుంది. అట్లా వచ్చిన క్రమం వెంటనే ఉచ్చారణలో ళ్లుగా మారుతుంది. దాన్ని కోళ్లు అని గాని రాయవచ్చు. ఎట్లా రాసినా ఉచ్చారణ ఒకటే. అయితే చాలా మంది కోళ్ళు అనే విధంగా రాస్తున్నారు. అదే సరిపోతుంది.

ii) గుడ్డు +లు అనే శబ్దాలు వరస క్రమంగా గుడ్డ్+లు గుడ్+లు అని మారుతుంది. ఇది ఉచ్చారణలో గుడ్లుఅని అవుతుంది. రాతలో గుడ్లు అని మాత్రమే రాస్తున్నారు. ఇక్కడ గుడ్లు అనే విధంగా రాసిన లకారాన్ని ళకారంగా తప్ప ఇంకో విధంగా ఉచ్చరించడం సాధ్యం కాదు. కాబట్టి గుడ్లు అని రాసినా గుడ్డు అని రాసినా ఉచ్చారణ ఒకటే. అందుకే



BRAOU

చాలా మంది రాస్తున్న విధంగా మొదటిదే రాయవచ్చు.

iii) కొన్ని మాటలకు మాండలిక బేధాలను బట్టి రెండు రకాల బహువచన రూపాలుంటాయి. కింది మాటలను చూడండి.

ఇల్లు - ఇండ్లు, ఇళ్ళు

కన్ను - కండ్లు, కళ్ళు

పల్లు

పన్ను - పండ్లు, పళ్ళు

పండు - పండ్లు, పళ్ళు

బండి - బండ్లు, బళ్ళు

రోకలి - రోకండ్లు, రోకళ్ళు

వాకిలి - వాకిండ్లు, వాకిళ్ళు

తిరగలి - తిరగండ్లు, తిరగళ్ళు

నాగలి - నాగండ్లు, నాగళ్ళు

కొడవలి - కొడవండ్లు, కొడవళ్ళు

BRAOU

ఈ రెండు రకాల బహువచన రూపాల్లో మొదట రాసినవి పూర్వకాలపువి. అయినా ఇంకా నేటి భాషలో ఉన్నాయి. రెండవ వరసవి ఈనాటివి. రెండు రకాల రూపాలను మాటల్లోను, రాతల్లోనూ చాలా మంది వాడుతున్నారు. వీటిలో ఏది రాసినా ఒక్కటే. అయితే ఒకచోట ఒకటి, మరొక చోట ఇంకొకటి రాసేకన్నా అన్ని చోట్ల ఒకే రకపు రూపాలు వాడటం బాగుంటుంది.

i) రెండక్షరాల మాటల్లో కొన్ని అరుదుగానైనా కనిపిస్తున్నవి.

గుడి - గుడులు గుళ్ళు

బడి - బడులు బళ్ళు

ఇక్కడ గుళ్ళు, బళ్ళు అనే రూపాలు ఎక్కువగా కనిపిస్తున్నా గుడులు, బడులు అనే మాటలు తప్పనటానికి వీల్లేదు.

ii) కారు, దారి–వంటి వాటిలో కూడా అచ్చుపోవచ్చు, పోకపోవచ్చు.

కారులు, కార్లు

దారులు, దార్లు

ఈ పైన ఉదహరించిన మాటల చివర ఇ కాని, ఉ కాని ఉంది. చాలా చోట్ల అచ్చుపోవడం తప్పనిసరి. అట్లాపోని ఘట్టాలు కూడా చూశాం. కాని ఇతర అచ్చులు పోవచ్చు, పోకపోవచ్చు. అచ్చు ఉచ్చారణలో పోయినప్పటికీ, పోని రూపం రాయటమే మంచిది. కోటలు, గోడలు, గుడ్డలు, బిడ్డలు, కండలు, బండలు, కలలు, వలలు, పులులు, ఉలులు వంటిమాటల్లో చివరికి లుకి పూర్వం ఉన్న అచ్చును ఉచ్చారణలో వదిలేయవచ్చు. రాతలో వదిలేయకూడదు. వదిలేస్తే అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. ఉదాహరణకు చూడండి. కల+లు అనే మాటకు సంధి రాస్తే కల్లు అని రాయాలి. అప్పుడది కలకు బహువచనమైనా కావచ్చు. తాటి చెట్టు నుంచి తీసిన మధురసమైనా కావచ్చు, అట్లాగే గుడ్డలు అనే మాటకు సంధిచేస్తే గుడ్లు అని రాయాల్సి ఉంటుంది. అప్పుడది కోడిగుడ్లు అనే అర్థమూ కావచ్చు. బట్టలు అనే అర్థమూ కావచ్చు. అందువల్ల ఉచ్చారణలో సంధి చేసినా, రాతలో సంధి చేయడం వల్ల కొన్ని చోట్లఅర్థం గ్రహించడం కష్టం అవుతుంది.

ఇక్కడో ప్రశ్న అడగటానికి వీలుంది. ఉచ్చారణలో సంధి చేయవచ్చుగానీ రాతలో ఎందుకు చెయ్యకూడదు? అని. పలికేటప్పుడు పోయిన అచ్చు పోగా, ఉన్న అచ్చులలో ఉచ్చారణ భేదం చూపిస్తాము. మీరే కల+లు, కల్లు అనే మాటల్ని గుడ్డ +లు గుడ్లు అనే మాటల్ని వేగంగా ఉచ్చరించి చూడండి. ఎదుటి వాళ్ళను అడగండి. భేదం వినిపిస్తుందా అని తప్పకుండా భేదాన్ని వినగలుగుతారు. ఎప్పుడు ఏమాట అన్నదీ చెప్పగలుగుతారు. ఇంతకుముందే చెప్పినట్లుగా అచ్చుల ఉచ్చారణలోని భేదం వల్ల ఈ మాటలు వేరు మాటలని గుర్తించగలుగుతారు. కాని తెలుగులో ఈ భేదాలన్నిటినీ రాయడానికి గుర్తులు లేవు. అందువల్ల వేగంగా ఉచ్చరించేటప్పుడు జరిగే మార్పులన్నిటికీ రాతలో చూపించలేం. చూపించక పోతే కొంపమునిగేదేమీ లేదు.

నామ పదాల్లో (Nouns) సున్నాతో అంతమయ్యే మాటలకు పూర్వ భాషలో ము రాసేవాళ్ళు. మంచం అని మనం ఇప్పుడు రాసే మాటను పూర్వపు వారు మంచము అని రాసేవారు. పదం చివరి ము అక్షరంలో చివరి అచ్చుపోతే (మ్) మిగులుతుంది. దాన్ని సున్నతో చూపించడం అలవాటయింది. ఇప్పుడున్న నిఘంటువుల్లో చూడాలంటే ము అనే అక్షరంతోనే చూడవలసి ఉంటుంది. నిజానికి కంచము, మంచము, అందము, చందము, కొంచెము, కళ్ళెము, పళ్ళెము, అని రాయవచ్చు. పదం చివర ఉన్న ముకు ఉచ్చారణలో మకారం (మ్) మాత్రమే అని చెప్పుకోవచ్చు. అందులో నష్టం ఏమీ లేదు. కాని ఈ కాలంలో ఎక్కువ మంది సున్నతో రాయడం అలవాటు చేసుకున్నారు. సున్నా అనే గుర్తు రాయడంలో ఉన్న సౌలభ్యం అందుకు కారణం కావచ్చు. సున్నా రాయడానికి భాషా తర్కం (LINGUISTIC LOGIC)కారణం కాదు. రాయడంలో ఉన్న సులువే కారణం కావచ్చు. ఈ కింది బహువచన రూపాలు రాయడంలో కొంతకష్టం ఉంది. మంచం – మంచాలు, కంచం – కంచాలు అని సులభంగా రాయవచ్చు. కాని పందెం+లు అనే దాన్ని పందేలు అని రాయాలా? పందాలు అని రాయాలా? అట్లాగే పళ్ళెం+లు, కళ్ళెం+లు అనే రూపాలు ఎట్లా రాయాలి? రెండు పద్ధతుల్లో ఏది రాసినా ఒకటే. ఉచ్చారణను సరిగ్గా సూచించవు. ఇంకో మూడోమార్గం లేదు. ఏకవచనంలో ఏ అనే పొట్టి అచ్చు (హ్రస్వాచ్చు) ఉంది. కాబట్టి అది దీర్ఘమైనదనడం సులువు . కాబట్టి పందేలు, కళ్ళేలు, పళ్ళేలు అని రాయడం కొంత హేతుబద్ధమైన పని. దీని ఉచ్చారణ రాసినట్టు కాదు అని చూపించడానికి కింది గీతలో చూపించుకోవచ్చు. ఉదాహరణకు

పందేలు

కళ్ళేలు

పళ్ళేలు

BRAOU

### 12.7.4 ఏకాక్షర ప్రత్యయాలు చేర్చేటప్పుడు సంధి

ను – ని, కు – కి, తో,లో వంటి ఏకాక్షర ప్రత్యయాలు చేర్చినప్పుడు సంధి జరుగుతుంది. రాసేటప్పుడు సంధి చేసి రాస్తారు కూడా. అయితే చెయ్యకుండా రాయవచ్చు. పద స్వరూపం గురించిగానీ, అర్థం గురించిగానీ సందేహం వచ్చేటట్టుంటే సంధి చెయ్యకుండా ఉండడమే మంచిది.

| | |
|---|---|
| అతనిని | అతన్ని |
| పిడుగుకి | పిడుక్కి |
| చేతితో | చేత్తో |
| తలలో | తల్లో |

పాల్లో అని రాస్తే పాలులో (భాగంగా) అని కావచ్చు. పాలలో అని కావచ్చు. అటువంటి చోట్ల సంధి చెయ్యకుండా రాయడం మంచిది.

అచ్చుతో కూడిన ట, డ, లకు ని, నులు కాని, లో కాని చేరితే ఉచ్చారణలో సంధి జరుగుతుంది. సంధిలో అచ్చు లోపించి ఈ కింది మార్పులు జరుగుతాయి.

| | | | |
|---|---|---|---|
| (అ) | ట్+ని | | ట్ని – ట్ణి |
| | ట్+లో | | ట్లో – ట్ళో |
| (ఆ) | డ్+ని | డ్ని | డ్ణి |
| | డ్+లో | డ్లో | డ్ళో |

ఇక్కడ సంధి జరిగిన రూపాలు రాయడం తప్పనిసరి కాదు. వాటిని అనే చోట సంధి చేసి వాట్ని అని రాయవచ్చు. చెయ్యకుండా వాటిని తో రాయవచ్చు. (వాట్ణి అని రాసినా తప్పులేదు. కాని ఎవరూ రాయడం లేదు) అట్లాగే వాకిటిలో అనే దాన్ని వాకిట్లో అని రాయవచ్చు. వాడిని అనేదాన్ని సంధి చేసి వాడ్ని, వాణ్ణి అని రెండు రకాలుగానూ రాస్తున్నారు. రెంటికీ ఉచ్చారణ ఒకటే. సంధి చేసి రాయడం తప్పనిసరి కాదు. వాడిలా, ఒడిలో అనే మాటలను వాళ్ళా, ఒళ్ళో అని సంధి చేసి రాయవచ్చు. పైన చెప్పినట్లు సందర్భాన్ని బట్టి, సందేహం వచ్చినప్పుడు సంధి మానివెయ్యడం మంచిది.

కు, ను, ని, తో, లో ప్రత్యయాలకు ముందు ద్విత్వాక్షరం ఉన్నప్పుడు కూడా వేగంగా మాట్లాడేటప్పుడు సంధి జరగవచ్చు. రాతలో దాన్ని పాటించకుండా ఉంటే స్పష్టత ఉంటుంది.

గిన్నెను, పక్కకు, కత్తితో, పల్లెలో వంటి మాటల్లో సంధి చెయ్యకుండా ఉంటే పదస్వరూపంస్పష్టంగా తెలుస్తుంది. ఆ, ఏ, ఓ అనే ప్రత్యయాలు కొన్ని అర్థాల్లో పదాలకు చేరుస్తాం. అప్పుడు సంధి తప్పకుండా జరుగుతుంది. రాతలో కూడా అది చూపించాల్సి ఉంటుంది. తెలుగులో ఈ ప్రత్యయాల్ని సంధి చెయ్యకుండా పలకడం సాధ్యంకాదు. పద మధ్యంలో రెండచ్చులు వరసగా ఉండవు. కాబట్టి రాయడం కూడా సాధ్యంకాదు. అందువల్ల సంధి చేసే రాయాలి. పద స్వరూపంలో కానీ, అర్థంలో కానీ, సందేహం వచ్చినా సరే, నిజానికి ఉచ్చారణలో కొన్ని చిక్కులు వస్తాయి కూడా . అయినా ఇంకో మార్గం లేదు. అయితే తెలుగు భాష వచ్చిన వారికి అంతకష్టం కలగదు. ఉదాహరణకు:

భోజనానికి రమ్మంటే అన్నంతినా (తిని+ఆ) వచ్చేది?

ఇంటి దగ్గర చెప్పే (చెప్పి+ఏ) వస్తున్నావా?



BRAOU

తెలిసో (తెలిసి+ఓ) తెలియకో (తెలియక+ఓ) తప్పుచేశాడు?

బంది + ఆ? బంది+ఏ, బంది+ఓ, అనే మాటల్ని,

బండ+ఆ?, బండ+ఏ, బడ+ఓ అనే మాటల్ని ఒకదాని సరసన ఒకటి పలికి చూస్తే ఉచ్చారణ భేదం తెలుస్తుంది. ఉచ్చారణలో చూపించే భేదాలన్నీ రాతలో చూపించలేం. సంధి చేయకుండానూ రాయలేం. (ఆ సంప్రదాయం లేదు) అటువంటప్పుడు సందేహాలు వస్తే సందర్భాన్ని బట్టి గ్రహించాల్సిందే కాని ఇంకో మార్గం లేదు.

### 12.7.5 క్రియారూపాల్లో సంధి

జరిగి పోయిన కాలాన్ని సూచించే క్రియల్లో కూడా కొన్ని లిపి సమస్యలున్నాయి. రాయలసీమ ప్రాంతంలో అడిగినాడు, చెప్పినాడు, అనే రకంగా ఉంటే, తెలంగాణాలో అడిగిండు, చెప్పిండు అనే విధంగా ఉంటాయి. ఈ రెండు పద్ధతులను రాయడంలోనూ, పలకడంలోనూ చిక్కులు ఏమీ లేవు. కాని కోస్తా జిల్లాల్లో అడిగాడు, చెప్పాడు అంటారు. నిజానికి ఈ రాసినట్టు కూడా కాదు. పై మాటల్లో ''గా, ప్పా'' అని రాసిన చోట ఏ పలుకుతారు. దీన్నే కొందరు అడిగాడు, చెప్పేడు అని కూడా రాస్తారు. ముఖ్యంగా రాజమండ్రి ఆపై ప్రాంతపు రచయితల్లో కొందరు అల్లా రాస్తున్నారు. (మహీధర రామమోహన రావు, ద్వివేదుల విశాలాక్షి గార్ల నవలలను చూడండి) ఈ రెండు రకాల రాతల్లోనూ మొదటి రకమే (అడిగాడు, చెప్పాడు అనేవి) అచ్చులో ఎక్కువ కనిపిస్తున్నాయి. దిన పత్రికలన్నీ ఇవే వాడుతున్నాయి. ఎక్కువ వాడుకలో ఉన్న ఈ పద్ధతి అనుసరిస్తే చదివే వారికి తేలిక. రెండో పద్ధతి అలవాటయిన వారు అల్లాగే రాయవచ్చు. అయితే ఏదో ఒక రూపాన్నే క్రమబద్ధంగా రాస్తే రచనలో ఏకత, నియతి (Unity and consistency)ఉంటాయి. పైన చెప్పిన అడిగినాడు, అడిగిండు, అడిగాడు అనే మాండలిక భేదాల విషయమైనా అంతే. రచనలోఅడిగినాడు, చెప్పినాడు వంటి రాయలసీమ మాండలిక రూపాలను రాచమల్లు రామచంద్రారెడ్డిగారి వంటి రచయితలు ఒకరిద్దరు మాత్రమే క్రమబద్ధంగా వాడారు. అడిగిండు, అడిగిన్రు, చెప్పిండు, చెప్పిన్రు వంటి రూపాలు తెలంగాణా మాండలిక వాతావరణం చూపవలసిన ఘట్టాల్లో తప్ప ఇతర రచనల్లో కనబడవు. కొందరు తెలంగాణా ప్రాంత రచయితలు తమ వచనంలో ఈ రకం క్రియలు వాడుతున్నారు.

తెలుగులో వచ్చు, వద్దు వంటి క్రియారూపాలను ఇంకో ప్రధాన క్రియకు అనుబంధంగా కొన్ని అర్థాల్లో వాడతారు. ఉదాహరణకు: చెప్పవచ్చు, చెప్పవద్దు. అయితే ఉచ్చారణలో చెప్పొచ్చు,చెప్పద్దు, చెప్పొద్దు అనే విధంగా వినిపిస్తాయి. అల్లా వకారంతో మొదలయ్యే మాటలకు సంధి కలిసిన చోటల్లా 'వ' 'ఒ'గా మారి పోతున్నది. ఉదాహరణకు 'రేపొస్తున్నాడు, ఇప్పుడొద్దన్నాడు' అనే చోట వచ్చు, వద్దురూపాలు ''ఒచ్చు, ఒద్దు'' అనే రూపాలుగా మారినాయి. నిజానికి ''రేపు వస్తానన్నాడు, ఇప్పుడు వద్దన్నాడు'' అని రాసి పలకడంలో సంధి చెయ్యవచ్చు. (ఇక్కడ చెయ్యవచ్చు అనే దాన్ని చెయ్యొచ్చు అని పలుకుతారు) కాని సంధి చేసి రాసే రూపాలు చాలా మందికి బాగా అలవాటు అయ్యాయి. అంతేకాదు ఒకే వ్యాసంలో సంధి చేసిన రూపాలూ, చెయ్యని రూపాలూ కలగా పులగంగా కలిసిపోయి కూడా కనిపిస్తాయి. ఇందువల్ల జరిగే నష్టం ఏమీ లేదుగాని, రచనలో క్రమబద్ధత ఉండదు. ఈ పాఠాల్లో క్రమపద్ధతి ఒక పాటించదగిన విలువగా భావిస్తున్నామని మీరీపాటికి గ్రహించే ఉంటారు.

క్రియల్లో చెప్ప, చేయ, అనే రకంగా ఉన్న వాటికి వచ్చు, వద్దు లాగే ఇంకా కొన్ని రకాల అనుబంధ క్రియలు చేరతాయి. కలను, కూడదు, అనేవి చేర్చివాడతాం. అప్పుడవి చెప్పగలడు, చెప్పగూడదు అనే విధంగా పలుకుతాం. కాని అరుదుగా 'చెప్పకూడదు' అని అనే వారున్నారు. ఇక్కడ క కారం రాసినా, గ కారమే ఉచ్చరించవచ్చు. కాని ఎక్కువ మంది గ కారమే రాస్తున్నారు. అందువల్ల 'గ' కారం రాయడమే ఎక్కువ సమ్మతం.

BRAOU

సాంప్రదాయిక వ్యాకరణాల్లో ఉత్తునకు సంధి నిత్యము అనీ , ఇ కారమునకు సంధి వైకల్పికము అనీ, అకారమునకు సంధి బహుళము అనీ మీరు చదువుకొని ఉంటారు. అది కావ్యభాష సంగతి. ప్రాచీన కాలంలో సంధి చేసి మాట్లాడేవారో చెయ్యకుండా మాట్లాడే వారో తెలియదు. చెయ్యకుండా మాట్లాడేవారిని అనుకోలేము. కాకపోతే రచనా భాషలో కొన్ని సౌకర్యాల కోసం ఏర్పరచుకున్న నియమాలివి.

ఆధునిక భాషలో సాధారణ వ్యవహారంలో మాటల మధ్య సంధి అవుతుంది. రాతలో రెండు మాటల మధ్య ఏ అచ్చుకూ సంధిని చూపించక్కర్లేదు. అర్థభంగం కానంత వరకు సంధి చెయ్యవచ్చు. పైన చెప్పిన పద్ధతులను గమనించి తప్పని మార్పులు చెయ్యవలసిన చోట ( బహువచనం మొ.. ) చేసి మిగతా చోట్ల సంధి మానివేసినా దోషంకాదు. చేసినా తప్పులేదు. ప్రధాన సూత్రం ఒకటే. నేటి రచనా సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకొని అర్థస్పష్టత చెడనంత వరకు సంధి చేసుకోవచ్చు. లేకపోతే మానివేయవచ్చు.

**అభ్యాసం – 5**

కింది మాటలకు సంధిలేని రూపాలను రాయండి

i

| సంధిరూపం | సంధిలేని రూపం |
|---|---|
| అడగొచ్చు | |
| చేయొద్దు | |
| మాపటేళొస్తా | |
| తిరగొద్దు | |
| తాగొద్దు | |
| రావద్దన్నాడు | |
| ఇచ్చెయ్యొచ్చు | |
| ముగించొచ్చు | |
| ఇవ్వొద్దన్నాడు | |
| చెప్పొద్దన్నాడు | |
| చేయొద్దన్నాడు | |

ii ఈ కింది మాటలను కలిపిరాసి చూడండి.

| | |
|---|---|
| పాట | ఇష్టం |
| చెరువు | ఎక్కడ |
| డబ్బులు | లేవు |
| ఆమె | ఎవర |

BRAOU

iii కింది మాటలను కలిపి రాయండి.

మనస్+ భావం

తమస్+ గుణం

తపస్+ శక్తి

పునర్+ సృష్టి

మనస్+ బలం

పయస్+ ధరం

మహా+ ఉదయం

iv ఈ క్రింది మాటలను బహువచనంలో రాయండి.

| ఏక వచనం | బహువచనం |
|---|---|
| ఓటు | |
| మడి | |
| పోటు | |
| మాట | |
| డోలు | |
| మొసలి | |
| అల | |
| గడి | |

BRAOU

v కింది మాటలకు కు, ను, ని, తో, లో, ప్రత్యయాలు చేర్చి రాయండి

| మాట | కు | ను | ని | తో | లో |
|---|---|---|---|---|---|
| మీరు | | | | | |
| వారు | | | | | |
| వీరు | | | | | |

## 12.8. ఉచ్చారణలో సమస్యలు

దృశ్య, శ్రవ్య, మాధ్యమాల్లో అక్షరాల బదులు ధ్వనులు వినిపిస్తాయి. దూరదర్శన్ లాంటి చోట్ల కంటికి కనిపించే భాషలో వార్త పత్రికల్లాంటి లిఖిత మాధ్యమాల్లో రాసే భాషకు వర్తించే నియమాలే వర్తిస్తాయి. అయితే ఈ మాధ్యమాల్లో మాట్లాడే భాషకొద్ది తేడాలతో ఉంటుంది. రేడియో, దూరదర్శన్ ప్రసంగాలలోనూ, వార్తలలోనూ, వార్తా పత్రికల్లో వాడే భాషే వాడతారు. ప్రామాణిక రచనా భాష వాడే సందర్భాల్లాంటివే రేడియో, టెలివిజన్లలో ప్రసంగాలూ, వార్తా ప్రసారాలూ. నాటకాలూ, మొదలైన వాటి చిత్రణల్లో పాత్రోచిత భాష ఉంటుంది.

### 12.8. 1. శ్రవ్య, దృశ్య మాధ్యమాలు

రేడియో, టెలివిజన్లలో భాషకు ఉచ్చారణ ప్రాధాన్యం ఉంటుంది. రాతలో చూపించనిదీ, ఉచ్చారణలో వదలరానిదీ ఊనిక, దీనికి ధ్వని సంబంధమైన శిక్షణ ఇయ్యవచ్చు. ఆ సందర్భంగా గుర్తుంచుకోవలసింది ఉచ్చారణలో ఊనిక స్థానాన్ని గురించి. ఊనిక భేదాలు చూపించకపోతే కొన్నిచోట్ల అర్థవైపరీత్యాలు రావచ్చు. లేక సాధారణ భాషలో అలవాటయిన పద్ధతికి విరుద్ధంగా ఉండి కర్ణకఠోరంగా ఉండవచ్చు. ఊనిక ప్రవర్తన అర్థభేదం కలిగించే ఉదాహరణ గిడుగు సీతాపతి గారు ఒకటి చూపించారు.

రెండెడ్ల బండ్లు = రెండు + ఎడ్లబండ్లు అంటే ఎడ్లతో నడిచే బండ్లు రెండు. రెండెడ్ల బండ్లు = + రెండడ్ల + బండ్లు రెండు ఎడ్లతో నడిచే బండ్లు. ఒంటెద్దు బండ్లుకాదు. అని తెలుగులో ప్రతి పదానికి కొంత ఊనిక ఉంటుంది. ఇక్కడ ఎడ్లబండ్లు అనే మాటల్లో ఎ అనే అచ్చుమీద ఎక్కువ ఊనిక వల్ల అర్థ విశేషం వచ్చింది.

ఆ రామం అనే మాటను రా అనే అక్షరంపై ఎక్కువ ఊనిక ఇచ్చిపలికితే రామం అనేది వేరే పదం అవుతుంది. మామూలుగా పలికే తెలుగులో ఇలాంటివి చాలా దొరుకుతాయి.

### 12.8. 2. ఉచ్చారణ – లయ, ధ్వని

ప్రతి భాషకు ఒక లయ ఉంటుంది. ఇంగ్లీషు వాళ్ళు తెలుగు మాట్లాడినా, తెలుగువాళ్ళు ఇంగ్లీషు మాట్లాడినా ఈ లయను పూర్తిగా అనుసరించడం కష్టం. అభ్యాసం వల్లనే అది సాధ్యం. ఈ లయకు అనుబంధంగా ఉచ్చారణ వేగం కూడా గ్రహించాల్సి ఉంటుంది. తెలుగువారి ఇంగ్లీషు వేగంగా ఉంటుందంటారు. అంటే తెలుగు వారి ఇంగ్లీషులో ఒక సెకనుకు ఉచ్చరించే ధ్వనుల సంఖ్య ఇంగ్లీషు వారి ఉచ్చారణ కన్నా ఎక్కువ ఉంటుందని అర్థం. భాషలో మాండలికాల మధ్య కూడా లయ భేదాలూ, ఊనిక భేదాలూ ఉంటాయి. స్వర భేదాలూ ఉంటాయి. వీటిని కూడా అభ్యాసం ద్వారా నేర్చుకోవాల్సిందే. దీన్నే కొందరు యాస అంటారు. ఒక మాండలికం నుంచి మరో మాండలికాన్ని వేరు చేసే ఒక ప్రధానాంశం ఈ యాస. అంటే ఊనిక, స్వరం, వేగం, లయ అన్నీ కలిసిన ఉచ్చారణ పద్ధతి యాస.

ప్రామాణిక భాషలో లయ ఈ 'యాస'లకు అతీతంగా ఉంటుంది. అంటే, స్వరాదులు, లయ ఉండవని కాదు. వేరుగా ఉంటాయని. ప్రామాణిక భాషలో, ముఖ్యంగా రేడియో, టెలివిజన్ల వార్తా ప్రసారాల్లో తగిన చోట్ల ఊనిక పెడుతూ, వేగం తగ్గించి మాట్లాడటం మంచిది. ఈ ఊనిక పద విభాగం తెలిసేట్టుండాలి. ప్రతి పదానికి కొంత ఊనిక ఉంటుంది.

చిన్న చిన్న వాక్యాల ఉచ్చారణలో స్వర (intonation) సమస్య ఉండదు. ప్రశ్నలో స్వరం ఊర్ధ్వ ముఖంగానూ,

BRAOU

నిశ్చయార్థకంలో అధోముఖంగానూ సహజంగానే ఉంటుంది. సంశ్లిష్ట వాక్యాల్లో ఉపవాక్యాంతాల్లో రాతలో కామా పెట్టినట్టుగా ఉచ్చారణలో కొంత విరామం ఇచ్చి మాట్లాడితే, (లేక చదివితే) స్పష్టత ఉంటుంది.

ధ్వనుల ఉచ్చారణలో కొన్ని సమస్యలున్నాయి అవి:

1. ప్రామాణిక భాషలో భూతకాల క్రియల్లో వచ్చే ఏ అనే ధ్వని. అన్ని మండలాల్లోనూ లేదు. చెప్పారు అనే క్రియను కొందరు రాసినట్టు ఉచ్చరించే ప్రమాదం ఉంది. ఆ ధ్వని ఉచ్చారణ కొంత అభ్యాసం చెయ్యాల్సి ఉంటుంది. ఈ ధ్వని సమస్య అయితే 'చెప్పినారు' వంటి రూపాలు వాడుకోవచ్చు.

2. ఇటీవలి కాలంలో చాలామంది మహాప్రాణధ్వనులు పలకడం లేదు. కాని దృశ్య, శ్రవణ ప్రసారాల్లో పనిచేసే వారు ఉచ్చారణను అభ్యాసం చెయ్యాల్సి ఉంటుంది. అల్ప ప్రాణంకన్నా మహాప్రాణం ఉచ్చరించేటప్పుడు ఎక్కువ గాలి ఎక్కువ వత్తిడితో ఉచ్చరిస్తే మహాప్రాణం వినిపిస్తుంది. అల్పప్రాణ ధ్వనికి 'హ' కారాన్ని కలిపి అభ్యసించ వచ్చు. 'ఫ'కారాన్ని కాఫీ, ఫసలీ వంటి ఇంగ్లీషు, పార్శీ మాటల్లో f లాగా ఉచ్చరించాలి. కొందరు ఈ ఉచ్చారణను సంస్కృతం మాటలకు కూడా విస్తరిస్తుంటారు. ఫణి, ఫలితం అనే మాటల్లో f అని పలకకూడదు. ph అనే పలకాలి.

3. శ.ష.స ధ్వనులను సాధ్యమైనంత వరకు వేరు చేసి ఉచ్చరించటం అవసరం.

4. థ, ధ అనే గుర్తులతో సూచించే ధ్వనులను వేరుగా ఉచ్చరించాలి.

5. కొందరి ఉచ్చారణలో ల – ళలకు, న – ణలకు భేదం ఉండదు. ప్రామాణిక భాషలో ఈ భేదం చూపించాల్సి ఉంటుంది. కళ్ళు అనాల్సిన చోట కల్లు అంటే మాదకద్రవ్యం అనే అర్థం రావచ్చు. ఈ భేదం త – ట ల మధ్య భేదం లాంటిదే. నాలుకను కొంచెం వెనక్కి వంచగలిగితే ఈ భేదాన్ని సూచించవచ్చు.

6. హ కారాది పదాలను కూడా కొందరు హ కారం వదిలి ఉచ్చరిస్తుంటారు. ప్రామాణిక భాషలో దానికి ఉచ్చారణ ఉంటుంది. హద్దును అద్దుగా ఉచ్చరించకుండా ఉండటం మంచిది.

7. కొందరు మ వర్ణాన్ని అచ్చుల మధ్య అనునాసిక వ కారంగా ఉచ్చరిస్తుంటారు. ఈ ఉచ్చారణ సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ వంటి ఇతర భాషా పదాలకు వర్తించకుండా చూసుకోవాలి. ప్రమాదం అనే మాటను పెవాద్రం అనే విధంగా ఉచ్చరించకుండా జాగ్రత్త పడాలి.

8. తెలుగులో పదాది రావడితో ఉన్న క్రొత్త, ప్రాత అనే మాటల్ని కొత్త, పాత అని ఉచ్చరిస్తారు. ఇవి, ఇతర భాషా పదాలకు విస్తరించకుండా చూసుకోవాలి. ప్రసాదం అనే మాటను పెసాదం అనకుండా జాగ్రత్త పడాలి.

9. సంస్కృతం మాటల్లో కృష్ణుడు, దృష్టి అనే మాటలలో క్రుష్ణుడు – క్రిష్ణుడు, ద్రుష్టి – ద్రిష్టి అనే విధంగా ఉచ్చరిస్తున్నారు. ఇంతకన్నా ఇంకోమార్గం లేదు. ఆజ్ఞ, ప్రజ్ఞ వంటి మాటలను రాసినట్టు ఉచ్చరించటానికి ప్రయత్నించాలి.

10. ఇతర భాషా పదాల ఉచ్చారణ తెలుగు ధ్వనులలోకి మార్చకుండా ఉండటం ఎప్పుడూ గుర్తుంచుకోవలసిన పద్ధతి. పూర్వమే మారి స్థిరపడితే అది వేరు.
ఖబర్ అనే ఉర్దూ మాట తెలుగులో కబురు అయింది. ఖరార్ అనే మాట ఇంకా అట్లా కాలేదు.

BRAOU

**అభ్యాసం – 6**

i దృశ్య శ్రవ్య ప్రసారాల్లో వాడే భాషలో సామ్య భేదాలేమిటి?

ii ఉచ్చారణలో ఊనిక అవసరమా? ఊనిక తప్పు వల్ల తప్పుగా వినిపించిన కొన్ని కొత్త ఉదాహరణలు వెదకండి,

## 12.9. ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ధ్వని రూపంలో భాషను వినియోగించుకోవటాన్ని మౌఖిక భాష అంటాం. లిపిబద్ధమైన ధ్వనుల రూపాన్ని లిఖిత భాష అంటాం.
- మాటల్ని రాయటంలో తెలుగు మాటలకు ఒకరకం చిక్కులూ, సంస్కృతం మాటలకు ఒకరకం చిక్కులూ, ఇంగ్లీషు మాటలకు మరొకరకం చిక్కులూ ఉన్నాయి.
- తెలుగులో కొందరు మంచి రచయితలు రాసిన వచనాన్ని చదివితే మంచి తెలుగు రాయటం నేర్చుకోవచ్చు.



BRAOU

- అన్ని రకాల ప్రజల్ని ఉద్దేశించి చేసిన రచనల్లో అందరికీ అర్థమయ్యే భాషనే వాడుతారు. దీనిని ప్రామాణిక భాష అంటారు.

- ఉచ్చారణలో మాటల కలయికల వల్ల కొన్ని మార్పులు వస్తాయి. రెండు అర్థవంతమైన శబ్దాలు ఉచ్చారణలో దగ్గరగా వచ్చినప్పుడు ఆ భాష మాట్లాడే వారి అలవాట్లను బట్టి జరిగే మార్పులను సంధి అంటారు.

- శ్రవ్య, దృశ్య, మాధ్యమాలకు వాడే భాషలోనూ, వార్తా పత్రికల్లాంటి లిఖిత మాధ్యమాల్లో రాసే భాషకు వర్తించే నియమాలే వర్తిస్తాయి. మాధ్యమాల్లో మాట్లాడే భాష కొద్ది తేడాలతో ఉంటుంది.

- తెలుగువాళ్ళు ఇంగ్లీషు మాట్లాడినా, ఇంగ్లీషు వాళ్ళు తెలుగు మాట్లాడినా ఆ భాష లయను పూర్తిగా అనుసరించడం కష్టం.

- ఊనిక, స్వరం, వేగం, లయ అన్నీ కలిసిన ఉచ్చారణ పద్ధతిని యాస అంటారు.

- ప్రామాణిక భాషలో లయ యాసలకు అతీతంగా ఉంటుంది. అంటే పద విభాగం తెలిసే విధంగా దానికి, వేగం ఉంటాయని అర్థం.

## 12.10. మాదిరి పరీక్షాప్రశ్నలు

BRAOU

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. తెలుగు, సంస్కృతం మాటల్ని రాయటంలో చిక్కుల్ని సోదాహరణంగా వివరించండి
2. ఉచ్చారణలో సమస్యల్ని చర్చించండి

**II 15 పంక్తుల్లో జవాబు రాయండి**

1. తెలుగు లో సంధి రూపాలను పేర్కొని వివరించండి
2. ప్రామాణిక మాండలిక భాషల గురించి రాయండి

# భాగం : 13 కొత్త భావనలు, పదకల్పనలు, ప్రత్యేక పదాలు, ఉచిత పదప్రయోగం

**విషయ క్రమం**


13.0 ఉద్దేశం

13.1 ప్రవేశిక

13.2 భావన - పదరూపం

13.2.1 కొత్త భావనలు - పదకల్పనలు

13.2.2 పాత పదాలు - కొత్త భావనలు

**అభ్యాసం -1**

13.3 ప్రత్యేక పదాలు - భాషా వైవిధ్యం

13.3.1 పరిభాష, రీతి, శైలి

13.3.2 పారిభాషిక పదాలు

**అభ్యాసం - 2**

13.4 ఉచిత పదప్రయోగం

13.4.1 పాఠకులు / శ్రోతలు/ ప్రేక్షకులు

13.4.2 విషయం

13.4.3 దృక్పథం

**అభ్యాసం -3**

13.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

13.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 13.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు:

- భావం – పదం
- కొత్త భావన – పదకల్పన
- ప్రత్యేక పదాలు
- పద ప్రయోగంలో ఔచిత్యం

## 13.1 ప్రవేశిక

మనిషి మాటల ద్వారా తన భావనలు వ్యక్తం చేస్తాడన్నది మీకు తెలిసిన విషయమే. మనం సాధారణంగా మాట్లాడుకునేటప్పుడు అంతా సహజంగా జరిగిపోతుంది. భావన వేరని, పదరూపం వేరని మనకు అనిపించదు. కాని కొత్త భావనలు మన స్పృహలోకి ప్రవేశించినపుడు ఆ భావనలను మన భాషలోని మాటలతో ఎలా వ్యక్తం చేయాలో అని ఆలోచించుకున్నప్పుడు భావనలకు పదరూపాలకు ఉన్న సంబంధం విదితమౌతుంది. ఈ భాగంలో ఈ సంబంధం గురించి విపులంగా చర్చించుకుందాం.

BRAOU

## 13.2 భావన - పదరూపం

'భావన' లేని శబ్ద బంధం పదమనిపించుకోదు. 'పుటికిటి' అని మనం అన్నామనుకోండి. దానికి ఏమీ అర్థం లేదనుకోండి. అప్పుడు అది తెలుగు భాషలోని పదం కాదు. అలాగే 'రూపం' లేని భావన పదాన్ని ఇవ్వలేదు. ఉదాహరణకు ఇంగ్లీషులో కదిలే వస్తువులను పట్టుకోవడానికి (catch) నిలకడగా ఉండే వస్తువులను పట్టుకోవడానికి (hold) వేరే వేరే పదాలున్నాయి. మనకు రెంటికీ ఒకే పదం 'పట్టుకోవడం' ఉంది. అంటే మన భావ నిర్మాణానికీ, ఇంగ్లీషు భావ నిర్మాణానికీ తేడా ఉందన్న మాట. అరబిక్ భాషలో విభిన్న రకాల ఒంటెలకు వేరే వేరే పదాలున్నాయట గాని 'ఒంటె' అంటూ అన్నిటినీ తెలియపరచే పదం లేదట. భాషలోని పదనిర్మాణం ప్రజల భావ నిర్మాణానికి ప్రతీక అవుతుందన్న మాట.

### 13.2.1 కొత్త భావనలు – పదకల్పనలు

సాధారణంగా కొత్త వస్తువుగాని, కొత్త భావన గాని మన జీవితంలో ప్రవేశించినప్పుడు కొత్త పదాలను కూడా వాడడం జరుగుతుంటుంది. 'aeroplane' కు సంస్కృతంలో ఉన్న 'విమానం' వాడుతున్నాం గాని, 'train'కు ట్రెయిన్ అని రైలు అని ధ్వని మార్పులతో పరాయి పదాలు వాడుతున్నాం. 'పొగబండి' లాంటి పదాలు కొందరు సృష్టించినా వాడుకలో నిలవలేకపోతున్నాయి.

అంటే ప్రతిసారీ పరాయి పదాలనే అరువుతెచ్చుకుంటామని కాదు. 'విమానం' అనే దానికి హైదరాబాదులో

'గాలిమోటారు' అనే పదం ఎక్కడైనా వినిపించవచ్చు. ఇక్కడ 'మోటారు' అనే ఇంగ్లీషు మాటకు 'గాలి' తోడు చేసి 'aeroplane' లోని గాలి భావాన్ని వ్యక్తం చెయ్యడం జరిగిందని చెప్పవచ్చు.

కొన్ని సందర్భాలలో రోడ్డు, బస్సు, బెల్టు, రైలు, కరెంటు లాంటి అన్యదేశ్యాలు వాడతారు. రైలు, కరెంటు అనేవి మూల భాషలో ఉన్న పట్టా (రైలు), ప్రవాహం అన్న భావనలతో గాక, (రైలు) బండి, విద్యుచ్ఛక్తి అన్న భావనలతో వాడతాం.

మరికొన్ని సందర్భాలలో ఇంగ్లీషు మాటలను మార్చి వాడతాం. ఉదాహరణకు హోటలు, లాంద్రి మిషను. ఇంగ్లీషులో ఉండే 'హోటల్' అనే పదంలో ఊనిక రెండవ అక్షరం మీద ఉంటుంది. తెలుగులో దాన్ని ఊనిక లేకుండా 'అ' గా ('ఎ' కు బదులు) పలుకుతాం. 'ల్' కు 'ఉ' తగిలించి 'లు' అంటాం. 'లాంటర్న్' అనే పదం నుంచి ఉద్భవించింది 'లాంద్రి' 'మిషన్' అనే పదం నుంచి 'మిషను' పుట్టి మిషన్‌కు 'మిషను' సమాన రూపంగా తయారైంది.

ఒక్కొక్క సారి అందరికీ అర్థమయ్యే తెలుగుపదాల్ని వాడలేక పోవడానికి కారణం అది మూలంలో ఉన్న ఇంగ్లీషు పదంలోని భాగాలను అభివ్యక్తీకరించక పోవడం. 'ఆక్సిజను' అన్న అన్య భాషా పదాన్ని వాడడం ఇష్టం లేకపోతే 'ప్రాణ వాయువు', 'ఆమ్లజని' అని వాడవచ్చు. రెండవ పదం శాస్త్రీయంగా 'ఆక్సిజన్' లోని రెండు భాగాలను 'ఆమ్ల+జని' అని రెండు పదభాగాలతో అభివ్యక్తీకరించడం వల్ల కొందరు దానిని వాడడమే సమంజసమని భావించవచ్చు.

### 13.2.2 పాత పదాలు– కొత్త భావనలు

పైన అనుకున్నట్లు కొత్త భావనలు మన జీవితంలో ప్రవేశించినప్పుడు పరభాషా పదాలను వాడడం, కొత్త పదాలను కల్పించుకోవడం జరుగుతుంది. పర భాషా పదాలను మారని రూపాల్లో గాని, మార్చుకొని గాని వాడతాం. కొన్ని చోట్ల పాత పదాలు కొత్త భావాలను తెలియజెయ్యడానికి వాడడం జరుగుతుంది. 'విమానం' అన్న పదాన్ని నేటి 'ఏరోప్లేన్' కు సమానంగా స్వీకరించడం దీనికి ఉదాహరణ. అలాగే 'పౌరుడు' అన్న పదాన్ని 'సిటిజన్' కు సమానంగా వాడుతున్నాం. 'పురం' లో నివసించే వాడు 'పౌరుడు'. కాని ఒక దేశపు నివాసిగా గుర్తింపు పొందిన వ్యక్తిని 'పౌరుడు' అనడం కొత్త భావనకు పాతపదాన్ని వాడడమే. అయితే ఇంగ్లీషు మాటకిప్పుడున్న అర్థం అల్లా విస్తృతి చెందిందే.

**అభ్యాసం –1**

పాత మాటలకు కొత్త భావనలను కూర్చిన కొన్ని మాటలను చర్చించండి. (తెలుగు విశ్వవిద్యాలయం వారి పత్రికాభాషా నిఘంటువునుంచి గాని, బూదరాజు రాధాకృష్ణ కూర్చిన వ్యవహార పదకోశం గాని సంప్రదించండి.)

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

BRAOU

## 13.3 ప్రత్యేక పదాలు

ఈ విభాగంలో విషయాన్ని బట్టి వాడే ప్రత్యేక పదాల గురించి తెలుసుకుందాం. ఈ సందర్భంలో భాషా వైవిధ్యం గురించి ముందు ప్రస్తావించుకుంటే మనకు అసలు విషయం బాగా ఆకళింపుకు వస్తుంది.

ఒకే భాషా సమాజంలో ప్రాంతాలను బట్టి, సాంఘిక వర్గాలను బట్టి, వృత్తులను బట్టి, దృక్పథాలను బట్టి వాళ్ళ భాషలో వ్యత్యాసాలు కన్పిస్తాయి. ప్రాంతీయ పరమైన వైవిధ్యాన్ని మాండలికత అనీ, సమాజ పరమైన వైవిధ్యాన్ని 'తీరు' (variety) అనీ అంటారు. ఈ రెండు వైవిధ్యాలు వక్తను ఆధారం చేసుకొని ఏర్పడ్డ వైవిధ్యాలు. అలాకాకుండా ప్రయోగం (function) ఆధారంగా ఏర్పడ్డ వైవిధ్యాలు వేరే ఉన్నాయి. వక్తకు శ్రోత పట్ల గాని, విషయం పట్లగాని ఉన్న దృక్పథం (attitute)వల్ల ఏర్పడే వైవిధ్యాన్ని 'రీతి' అంటారు. వృత్తులను బట్టి కేవలం విషయం కారణంగా ఏర్పడ్డ వైవిధ్యాన్ని 'పరిభాష' (register) అంటారు. కొందరు 'భాషను వాడుకునే శక్తినీ, నేర్పునూ, ప్రత్యేకతనూ శైలి' అని నిర్వచిస్తారు. అంటే ఒక వ్యక్తి తన మాండలికత, తీరు, రీతి పరిభాష వైవిధ్యాలను రచనలో ప్రత్యేకంగా తనదైన శైలి (style)గా మలచుకుంటాడన్న మాట.

### 13.3.1 పరిభాష, రీతి, శైలి

ఇప్పుడు 'పరిభాష', 'రీతి', 'శైలి' అన్న వాటిని వివరంగా పరిశీలిద్దాం. విషయ గతమైన భాషా వైవిధ్యం 'పరిభాష'. మనం ఏ విషయం గురించి మాట్లాడతామో దానిని బట్టి మన మాటలలో కొన్ని ప్రత్యేకమైన పదాలు, కొన్ని వ్యాకరణ రూపాలు ఎక్కువగా వాడడం జరుగుతుంది. అంతే కాదు, పరిభాషను బట్టి ఒక్కొక్కసారి ఒకే పదానికి విభిన్న అర్థాలు ఉండవచ్చు.

ఉపయోగం అనే మాటకు వాడుక అని సాధారణార్థం. కాని వ్యాకరణంలో నియమ పూర్వక విద్యాస్వీకారం అని నిర్దేశించారు. ఉపయోగము నందాఖ్యాతకు తోడ వర్ణకంబగు – అని బాల వ్యాకరణ సూత్రం. (కారక పరిచ్ఛేదం)

ఇంకొక మాట 'సమత' ఈ పదానికి ఇంకొక మాట రాజకీయ పరిభాషలో సామాజిక ఆర్థిక 'సమానత' అన్న అర్థం ఉంది. సాహిత్య పరిభాషలో ఒక (సాహిత్య) 'గుణం' గా పరిగణిస్తారు.

ఒక సాహిత్య గ్రంథాన్ని, ఒక శాస్త్ర విజ్ఞాన గ్రంథాన్ని పోల్చి చూస్తే సాహిత్య పరిభాషకు, శాస్త్ర విజ్ఞాన పరిభాషకు ఉన్న తేడా బాగా అర్థమౌతుంది. సాహిత్య గ్రంథాల్లో విశేషణ పదాలు, దీర్ఘసమాసాలు, అతిశయోక్తులు, అలంకార శబ్ద ప్రయోగాలు కన్పిస్తాయి. శాస్త్ర విజ్ఞాన గ్రంథాల్లో వీటిని వాడడం సంప్రదాయం కాదు. అంతే కాదు, పారిభాషిక పదాలు ఎక్కువ కన్పిస్తాయి.

పదాల్లో 'రీతి' అంటే ఏమిటి?

రీతిలో కనబడే వైవిధ్యం వక్త దృక్పథానికి చెందినదని ముందే అనుకున్నాం.

కింది వాక్యాలు గమనించండి:

అ) అలాంటి పనులు చెయ్యకూడదమ్మా!

BRAOU

ఆ) అలా చేస్తే కొడతానని చెప్పలా!

ఇ) అలా చేస్తే నాన్నగారు అరుస్తారు బాబూ!

ఈ) అలా చేస్తే పదిమందీ చెడ్డవాడంటారు.

ఉ) ఎన్నిసార్లు చెప్పాలి అలా చెయ్యకూడదని?

ఈ ఐదు వాక్యాలూ మనం ఏ తల్లినయినా తన బిడ్డతో అంటుంటే వినవచ్చు. ఇక్కడ చెప్పేది దాదాపు ఒకటే అయినా చెప్పే విధానంలోనే భేదం అంతా.

వామనుడు అనే ప్రాచీన సాహిత్య సిద్ధాంత కారుడు 'రీతి' అనే సిద్ధాంతం ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం 'గుణ సహితమైన పదరచన రీతి'. శారదా తనయుడు కవినిబట్టి, కావ్యాన్ని బట్టి రీతులు మారుతుంటాయని సిద్ధాంతీకరించాడు. పైన అనుకున్నట్లు ఆధునికులు కొందరు శైలి అనే పదాన్ని 'రీతి' అర్థంలో వాడతారు. నిజానికి ఒక్కొక్క కవి శైలిలో అతని మాండలికత, తీరు, పరిభాష, రీతి వైవిధ్యాలన్నీ పెనవేసుకుని అతని ప్రత్యేకతను స్పష్టం చేస్తాయి.

### 13.3.2 పారిభాషిక పదాలు

BRAOU

ఒక్కొక్క పరిభాషకు కొన్ని ప్రత్యేక పదాలు ఏర్పడుతుంటాయి. వీటినే పారిభాషిక పదాలు అంటారు. ప్రచార సాధనాలుగా మనం మన భాషలు వాడుకునేటప్పుడు కొన్ని కొత్త పారిభాషిక పదాలు ఏర్పరచుకోవలసి వస్తుంది. ఈ సందర్భంలో మనం ఇప్పటికే వాడుకలో ఉన్న అరబ్బీ పారసీ పదాలు, సంస్కృత పదాలు, ఇంగ్లీషు పదాలు భావ ప్రకటన నిర్దుష్టంగా చేస్తున్నాయో లేదో గమనించాలి. సూచనాత్మకంగా కాక భావాత్మకంగా సబబుగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఇది వరలో మనం 'ప్రాణ వాయువు', 'ఆమ్లజని', 'ఆక్సిజను' అన్న పదాల గురించి చూశాం. ఆంగ్ల పదమైన 'ఆక్సిజను' బోధ పడుతుంది కాని అందులోని 'ఆక్సి' అన్న భాగానికి 'ఆమ్లం' అనే అర్థం ఉందన్న సంగతి తెలియక పోవచ్చు. 'ఆమ్లజని'లో అస్పష్టత గోచరిస్తుంది. 'ప్రాణవాయువు' అనే మాట ఆక్సిజను మనకెంత అవసరమో తెలుపుతుంది గాని 'ఆమ్లజని'లోని పారిభాషికతకు దూరమవుతుంది. ప్రసార సాధనాల్లో తెలుగు వాడేటప్పుడు పారిభాషిక పదాలను పదిమందికి అర్థమయ్యేటట్లు వివరించగల వీలుండాలి.

పట్టా, వీలునామా, రాజీనామా, జమాబంది, జిల్లా, మునసబు, పట్వారీ, వకీలు, తహశీలు, సరిహద్దు, రస్తా మొదలైన పదాలన్నీ హిందుస్తానీ ద్వారా తెలుగులో ప్రవేశించినవే. రెవెన్యూకు సంబంధించిన పదాలు చాలా వరకు ఇలాంటివే. ఇప్పుడు బ్రిటిషు వారి పరిపాలన కారణంగా మనకు చాలా ఇంగ్లీషు పదాలు పరిభాషలోను, సాధారణ భాషలోను కన్పిస్తాయి. కలెక్టరు, మెజిస్ట్రేటు, జడ్జి, గవర్నరు, ఏజంటు, కమిషను, డిగ్రీ, డాక్టరు, లాయరు లాంటి పదాలు మనకు చాలా వరకు నిత్య వాడుకలో ఉన్నవే. అనువాదం చెయ్యదల్చుకొన్నప్పుడు సంస్కృత పదాల సహాయం తీసుకోవలసి వస్తుంది. న్యాయమూర్తి, న్యాయవాది, ప్రధాన న్యాయమూర్తి, రాజ్యమంత్రి, సహాయ మంత్రి, ఉపమంత్రి మొదలైన పదాలన్నీ సంస్కృత పదాలే.

కొన్ని సంస్కృత పదాలు పరిమిత పరిధిలోనే ఉపయోగించబడతాయి. 'ఆకాశవాణి' అన్న పాత పదాన్ని రేడియోకు వాడాలని చూసినా అది కేవలం కార్యక్రమాలు నిర్వహించే సంస్థకు పరిమితమైంది గాని 'రేడియో'కు

సమానంగా కుదరటం లేదు. అలాగే 'దూరదర్శన్' కూడా 'టెలివిజన్' (టి.వి)కి సమానార్థకంగా కాక ప్రభుత్వం వారు నిర్వహించే సంస్థకు పరిమితమైంది. 'న్యూస్ పేపర్' కు మనం 'వార్తాపత్రిక' అన్న పదాన్ని సమానార్థకంగా వాడతాం. వార్తా పత్రికల్లో వాడే భాష గురించి చెప్పాల్సినప్పుడు 'పత్రిక భాష' అనో పత్రికల భాష అనో అంటాం గాని 'వార్తాపత్రికల భాష' అని అనం. ఒక్కొక్క రంగంలో పదాలు తమ కేదో ప్రత్యేకమైన చైతన్యమున్నట్లు కన్పిస్తాయి. 'ప్రోగ్రాం' అనే పదానికి కార్యక్రమం అంటాం. ఈ పదంలో ఉన్న రెండు పదాలకు (కార్యం + క్రమం) పదగత భావానికి సంబంధం లేదు. 'ఫంక్షన్ అన్న పదానికి కూడా కార్యక్రమం అని వాడతాం.

'జాతి మైదు' అనే పదాన్ని ఒక పల్లెటూరి మహిళ ఒకసారి 'తెల్లజాతి వారి నూదైవచ్చి గొనపంగా తయారయ్యే విధానం' గురించి తెలుపుతూ వాడింది. ఈ పదాన్ని సామాజిక శాస్త్రవేత్త ఎవరన్నా తన పరిభాషకు పరిమితం చేసి నిర్వచిస్తే అది పారిభాషిక పదమౌతుంది. సీమ, జాతి అనే పదాలు ఇంగ్లండుకు (తద్వారా యూరప్‌కు) ఇంగ్లీషు వారికి (తద్వారా తెల్లవారందరికీ) వాడబడడం ఒక రకంగా పారిభాషికతను సంతరించుకోవడమే.

**అభ్యాసం - 2**

ఏదైనా రెండు పరిభాషలను ప్రస్తావిస్తూ, వాటిలో వాడబడే పారిభాషిక పదాలను రెండేసి వివరించండి?

______________________________

______________________________

______________________________

______________________________

పత్రికల ద్వారా ప్రచారమైన పారిభాషిక పదాలను నిఘంటువులనుంచి గాని, పత్రికల నుంచి గాని గ్రహించి వివరించండి.

______________________________

______________________________

______________________________

______________________________

## 13.4 ఉచిత పద ప్రయోగం

క్షేమేంద్రుడు అన్న ప్రాచీన సాహిత్య సిద్ధాంతకారుడు కావ్యానికి ఔచిత్యమే ప్రాణమని నిర్ధారించాడు. ఒక కావ్యానికే గాదు నేటి వచన రచనలో కూడా ఔచిత్యమనేది చాలా విలువైనది. ఇది సాధించడానికి మనం ముఖ్యంగా పద ప్రయోగంలో ఔచిత్యాన్ని పాటించాల్సి ఉంటుంది. ప్రసార సాధనాల్లో వాడే భాషలో ఉచిత పద ప్రయోగమనే అంశాల్ని మూడు కోణాలనుంచి చూడాల్సి ఉంటుంది.

అ) పాఠకులు / శ్రోతలు/ ప్రేక్షకులు



BRAOU

ఆ) విషయం

ఇ) దృక్పథం

ఈ మూడు దృష్టి కోణాలనుంచి ఉచిత పద ప్రయోగాన్ని వివరంగా చర్చించుకుందాం.

### 13.4.1 పాఠకులు / శ్రోతలు/ ప్రేక్షకులు

రాసిన వ్యాసాన్నో, వార్తనో, పుస్తకాన్నో చదివే వారు పాఠకులు. టేపు ద్వారా, రేడియో ద్వారా, టి.వీ. ద్వారా లేక ఏదో కార్యక్రమంలోనో వినిపిస్తున్న పాటనో, మాటనో వినేవారు శ్రోతలు. నాటికల ద్వారా, సినిమాల ద్వారా, టి.వీ. ద్వారా చూపిస్తున్న కార్యక్రమాన్ని చూసేవారు ప్రేక్షకులు. మనం ఎవరి కోసం ఒక కార్యక్రమాన్ని తయారు చేస్తున్నామో ముందు నిర్ణయించుకోవాలి. తదనుగుణంగా మాండలికత, తీరులను మనసులో ఉంచుకొని భాషను వాడాలి. ఉదాహరణకు ఒక దినపత్రిక జిల్లాల వారీగా అనుబంధాన్ని ఇచ్చేటప్పుడు ఆ జిల్లాలకు సంబంధించిన మాండలికాన్ని వాడడం ఉచితం. నెల్లూరు అనుబంధంలో బర్రె అని, గుంటూరు అనుబంధంలో గేదె అని, కర్నూలు అనుబంధంలో యెనుము అని రాయడం ఉచితం. నిజామాబాదు అనుబంధంలో 'పుంటికూర' అని, గుంటూరు అనుబంధంలో 'గోంగూర' అని వాడడం ఉచితం. అగెత్తు, పరుగెత్తు, ఉరుకు అనే పదాలు విభిన్న మాండలికాల్లో వాడం కాని పరుగెత్తు అనే పదం ఎక్కువ మందికి అర్థమయ్యే అవకాశముంది. కాబటి ఆ పదాన్ని ముఖ్య పత్రికలలో వాడుతూ, పరిమిత ఉపయోగం ఉండే పదాలను అనుబంధాల్లో వాడడం ఉచితం. అలాగే మనం ఏ శ్రేణికి చెందిన వారి కోసం కార్యక్రమం తయారు చేస్తున్నామో నిర్ణయించుకొని పదరూపం, వాక్యరూపం తయారు చేసుకోవచ్చు. కింది వాక్యాలు ఒకటే భావాన్ని సూచించినా వాటిని మాండలికాల్లో విభిన్న 'తీరు'లలో వాడతాం.

అ) ఏందయ్యో అట్లంటవు

ఆ) ఏమిటండీ అలా అంటారు

ఇ) ఏందబ్బా అట్లంటవు

వినే వారి మనసుకు చేరాలనుకుంటే భాషను సరిగ్గా ఉపయోగించడం చాలా అవసరం. ఉదాహరణకు నీవు, మీరు, తమరు అన్న మధ్యమ పురుష సర్వనామాలు వాడేటప్పుడు మాండలిక, తీరువైవిధ్యాలను మనసులో ఉంచుకోవాలి. నాటక ప్రక్రియలో వాడే భాష విషయంలో పాత్రోచితంగా ఉండాలి. భాష ప్రేక్షకులకు అర్థం కూడా కావాలి. ఇక్కడే రచయిత తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి పదిమంది మన్ననలను పొందాలి.

### 13.4.2 విషయం

పరిభాష అనేది విషయగత భాషా వైవిధ్యమని ముందే అనుకున్నాం. సాహిత్యం, వార్తాపత్రికలు, శాస్త్ర విజ్ఞానం మతం, సంస్కృతి, గణితం, విభిన్న వృత్తులు, న్యాయవృత్తి, పరిపాలన, రాజకీయాలు మొదలైన వాటిలో వాడే భాషలో మనకు వైవిధ్యం కన్పిస్తుంది. ప్రసాదం, ఉభయం, సంతర్పణ, బ్రహ్మోత్సవం, అర్చన, అభిషేకం అనే పదాలు మత సంబంధమైన పరిభాషలో వినిపిస్తాయి. అభిషేకం అనేది విగ్రహానికి చేసే స్నానం. కొడుకు పదకొండు గంటలకు స్నానం చేయడం చూసిన తండ్రి 'అభిషేకం అయిందా?' అంటే పరిభాషవైవిధ్యాన్ని పాటించకుండా వ్యంగ్యం సూచిస్తున్నాడని తెలుస్తుంది.

అలాగే ఎవరన్నా కాఫీయో, టీయో మనమీద పొరపాటు గానో, కావాలనో కుమ్మరిస్తే 'అభిషేకం' చేశాడని వాడితే వ్యంగ్యం, నిస్పృహ, కోపం ద్యోతకమౌతాయి.

BRAOU

మనం ఏ విషయం గురించి రాస్తున్నామో తదనుగుణంగా పదప్రయోగం చేయాలి. దుర్ఘటనలో పదిమంది మృతులైన సంగతి చెప్పడానికి దివంగతులైనారు, పరమపదించారు అని అంటే అది అనౌచిత్యమే. ఆ దుర్ఘటనను వివరించేటప్పుడు సాహిత్య పరిభాషను వాడడం సముచితం కాదు. ''ఆ దుర్ఘటన చూసిన మహిళల చెక్కిళ్ళపై అశ్రు ప్రవాహాలు కనిపించాయి'' అనే వాక్యం అక్కడ వాడడం అనౌచిత్యమే.

### 13.4.3 దృక్పథం

దృక్పథం సూచించే భాషా వైవిధ్యాన్ని 'రీతి' అనుకున్నాం. మనం కొనసాగించే రచన ముఖ్యోద్దేశ్యం ఏమిటో నిర్ణయించుకోవాలి. హాస్యం కోసమా, అవహాస్యం కోసమా అని నిర్ణయించుకొని తదనుగుణంగా పదప్రయోగం చెయ్యాలి. 'తాగుబోతు' లను తాగవద్దని చెప్పడానికి తయారు చేసే కార్యక్రమంలో విభిన్న దృక్పథాలు ద్యోతకం కావచ్చు. తాగుబోతుకు సమాజంలో ఉండే స్థానాన్ని సూచించేటప్పుడు అపహాస్యం జుగుప్స కనిపించవచ్చు. తాగడం వల్ల వచ్చే ఆరోగ్య సంబంధమైన హాని ఆర్థిక సామాజిక నష్టాలను గురించి మాట్లాడేటప్పుడు గంభీరత అవసరం.

పద ప్రయోగంలో కేవలం విషయం పట్లే గాకుండా, వినేవాళ్ళ పట్ల, రచనలో ఉన్న పాత్రల పట్ల మనకున్న దృక్పథం వెల్లడవుతుంది. వార్తాపత్రికల్లో రాజకీయ పార్టీల గురించి, నాయకుల గురించి పత్రికా నిర్వాహకుల కున్న దృక్పథం బట్టి భాష మారుతుంది. ఉదాహరణకు, ఎన్నికల ఫలితాలను గురించి చెప్పేటప్పుడు ఒక పార్టీ అభ్యర్థి గెలుపు, ఇంకొక పార్టీ అభ్యర్థి ఓటమి ఖాయమే గదా. కాని పత్రికలు తమ దృక్పథానికి అనుగుణంగా శీర్షికలు తయారు చేస్తారు. కింది వాక్యాలు గమనించండి.

అ) వింజమూరులో రంగారావు విజయం.

ఆ) వింజమూరులో వెంకట్రావు అపజయం

ఇ) స్వల్ప మెజారిటీతో రంగారావు గెలుపు

ఈ) కొత్త పార్టీ ప్రభంజనంలో వెంకట్రావు ఓటమి

అపజయం, విజయం, ఓటమి, గెలుపు లాంటి పదాల భావ ప్రకటనలో తేడా మనకు తెలిసిందే. 'స్వల్ప మెజారిటీ' తో అనడంలో గెలుపు యొక్క విలువను తగ్గించాలన్న తాపత్రయం వెల్లడవుతోంది. అలాగే ఓటమిలోని బాధను తేలిక చెయ్యడానికి 'కొత్త పార్టీ ప్రభంజనం' అనే మాటలు వాడడం జరిగింది. వెంకట్రావుతో పోటీ చేసిన వ్యక్తి ఘనతా కాదు, వెంకట్రావు లోపమూ గాదు. కేవలం కొత్త పార్టీ ఊపు మాత్రమే అని చెప్పదలచుకున్న సంపాదకుడు అలాంటి శీర్షిక ఇస్తాడు.

**అభ్యాసం – 3**

ఔచిత్య మీమాంస ఎన్ని కోణాలనుంచి చూడాల్సి ఉంటుంది? సరియైన ఉదాహరణలిచ్చి చర్చించండి?

______________________________

______________________________

______________________________

______________________________



BRAOU

కనీసం రెండు తెలుగు పత్రికలలో శీర్షికలను ఎంచుకుని, వాటి ప్రయోగంలో పత్రికల వారి దృక్పథం ఎంతవరకు కనిపిస్తుందో పరిశీలించండి.

ఒక ప్రమాదాన్ని గాని, విషాద సంఘటన గాని ఏదైనా ఒక పత్రిక రిపోర్టు చేసిన పద్ధతి ఔచిత్య దృష్టితో చర్చించండి.

BRAOU

## 13.5 ముఖ్య విషయాలను గుర్తించుకుందాం

- ☞ భావనకు పదరూపానికి అవినాభావ సంబంధముంది.
- ☞ కొత్త భావనల్ని పాత పదాలతో, పదకల్పనలతో వ్యక్తీకరించడం ఉంది.
- ☞ భాషా వైవిధ్యం - మాండలిక తీరు, పరిభాష, రీతి అని కొన్ని విధాలుగా ఉంటుంది.
- ☞ శైలిలో భాషా వైవిధ్యాలను ప్రత్యేక సరళిలో రచయిత వాడుకుంటాడు.
- ☞ పరిభాషలో వాడే ప్రత్యేక పదాలు పారిభాషిక పదాలు.
- ☞ ఎవరి కోసం, దేన్ని గురించి, ఎందుకోసం అన్న వాటిని బట్టి ఔచిత్యాన్ని నిర్ణయించాల్సి ఉంటుంది.

## 13.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో సమాధానాలు రాయండి.**

1. భావనకు పదానికి ఉన్న సంబంధం వివరించండి.

2. భాషా వైవిధ్యాన్ని చర్చించండి.

**II. కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. పారిభాషిక పదాలకు సామాన్య వ్యవహారంలో ఉన్న పదాలకు తేడా ఏమిటి?

2. ద్రుక్పథం భాషా వైవిధ్యానికి ఎలా దారి తీస్తుందో సోదాహరణంగా వివరించండి?

BRAOU

# భాగం : 14 వాక్య ప్రయోగ విధానం

## విషయ క్రమం

14.0 ఉద్దేశం

14.1 ప్రవేశిక

14.2 పదం – సమాసం (పదబంధం) – వాక్యం

14.2.1 వాక్యం, ఉపవాక్యం

14.2.2 సంయుక్త వాక్యం, సంక్లిష్ట వాక్యం

14.2.3 శీర్షిక వాక్యం

అభ్యాసం –1

14.3 అనుక్రమణిక

14.3.1 భావంలో మార్పు

14.3.2 వివక్షలో మార్పు

అభ్యాసం –2

14.4 సంయోగత

14.4.1 సంయోగ పదాలు

14.4.2 ప్రతిరూపాలు

14.4.3 లుప్తత

అభ్యాసం –3

14.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

14.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 14.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు :

- పదం – సమాసం (పదబంధం) – వాక్యం
- వాక్య భేదాలు – భావ నిర్మాణంలో తేడాలు
- అనుక్రమణిక భావ వివక్షలకు ఉన్న సంబంధం
- వాక్యాలలో ఉన్న సంయోగత

## 14.1 ప్రవేశిక

మనం మాట్లాడేటప్పుడు పదాలను వాడతాం. కాని వాక్యాలలో భాగంగా వాడతాం. మనం మాట్లాడేదీ రాసేదీ వాక్యాలలో (వాటిలో కొన్ని అసంపూర్ణం కావటం వేరే విషయం) వాటిలో భాగంగానే పదాలను వాడతామన్న మాట. ఈ భాగంలో పదాలు ఏ విధంగా సమాస నిర్మాణంలోనూ, సమాసాలు వాక్య నిర్మాణంలోనూ వాక్యాలు పాఠంలోను ఎలా వాడతారో చూద్దాం. ఇక్కడ 'పాఠం' అనే పదాన్ని పారిభాషిక పదంగా పరిగణించాలి. వ్యాసం, కవిత్వం, నాటకం, ఉపన్యాసం, సంభాషణ మొదలైన వాటిలో మనకు కనిపించే వాక్యసముదాయం 'పాఠం'.

## 14.2 పదం - సమాసం (పదబంధం) - వాక్యం

పదాలు కలిసి ఒకే భావ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నప్పుడు సమాసం ఏర్పడుతుంది. ఈ అర్థంలో 'సమాసం' అంటే 'పదబంధం' అన్నమాట. 'గులాబి' అనే నామ వాచకానికి 'ఎర్ర' అనే విశేషణాన్ని జత చేర్చితే వచ్చే నామబంధం 'ఎర్ర గులాబి'. అలాగే త్రికశబ్దాన్ని (అ, ఈ ఎ) సంఖ్యా వాచకాన్ని, విశేషణాన్ని, వర్గీకరణ పదాన్ని జత చేరిస్తే నామ బంధాలు ఏర్పడవచ్చు.

ఉదాహరణకు:

| ఆ | మూడు | కొత్త | వ్యాకరణ | గ్రంధాలు |
|---|---|---|---|---|
| త్రిక | సంఖ్య | విశే | వర్గీకరణ | ప్రధాననామం |

ఇక్కడ వర్గీకరణ శబ్దం అనే దాన్ని గురించి రెండు మాటలు చెప్పాలి. విశేషణం గాని, నామవాచకం గాని ప్రధాన నామం ముందు వచ్చి ప్రధాన నామంలో సూచించబడ్డ విషయాన్ని వర్గీకరించినప్పుడు మనం ఆ పదాన్ని వర్గీకరణ పదం అంటాం. 'వ్యాకరణ 'గ్రంథం'లో 'గ్రంథం ఏ వర్గానికి చెందినదో తెలిసే పదం 'వ్యాకరణ' – 'బంగారు నగలు'లో బంగారు అనే నామాన్ని వర్గీకరణ పదంగా వాడామన్న మాట. 'మంచి నగలు'లో మంచి గుణవాచక విశేషణం. 'చిన్న బొమ్మ', 'చెక్క బొమ్మ' అనే నామ బంధాల్లో 'చిన్న' గుణవాచక విశేషణ పదం. 'చెక్క' వర్గీకరణ పదం. రెండూ



BRAOU

వచ్చినప్పుడు 'చిన్న చెక్కబొమ్మ' అనగలం గాని 'చెక్క చిన్న బొమ్మ 'అనలేం. అంటే గుణవాచక విశేషణం వర్గీకరణ పదానికి ముందుగానే ఉండాలన్న మాట. ఈ వివరాలు కొన్ని 14.3.3లో చర్చించుకుందాం.

నామబంధాలు (నాబం) క్రియాబంధాలు (క్రిబం) విశేషణ బంధాలు (విబం) క్రియా విశ్లేషణ బంధాలు (క్రివిబం) కలిపి మనం వాక్యాలుగా వాడతాం.

ఉదాహరణకు:

| | | | |
|---|---|---|---|
| ఆ ఇద్దరబ్బాయిలు | మూడురోజుల కిందట | వాళ్ళ సొంత | ఊరికి వెళ్ళిపోయారు. |
| నాబం | విబం | క్రివిబం | క్రిబం |

వాక్యం అనేది భావ పూర్ణత ఉన్న 'క్రిబం' భాషా ప్రయోగం.

సంపూర్ణ వాక్యం వాడినప్పుడు వినే వ్యక్తికి భావం పూర్తిగా తెలుస్తుంది. అసంపూర్ణ వాక్యం వాడినప్పుడు భావం పూర్తిగా వ్యక్తం కాదు. అప్పుడు సందర్భం సహాయంతోనో, ఊహ సహాయంతోనో భావాన్ని గ్రహించుకోవాలి. పై వాక్యానికి బదులు కేవలం – వెళ్ళిపోయారు – అని వాడితే ఎవరు, ఎప్పుడు, ఎక్కడికి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

### 14.2.1 వాక్యం – ఉపవాక్యం

రెండు పూర్ణ విరామాల మధ్య (. .) రాసే దాన్ని వాక్యం అంటాం. వాక్య నిర్మాణంలో మనం మూడు విభిన్న విషయాలను గుర్తించాలి. వక్త దృష్టితో చూస్తే మనకు వాక్యంలో (అ) విషయి – విషయం (Topic-comment) అన్న నిర్మాణం కన్పిస్తుంది. వక్త తను దేని గురించి చెప్తున్నాడో సూచించేది ఈ నిర్మాణం. 'విషయి' వక్త భాషా ప్రయోగానికి కారణభూతమై సాధారణంగా వాక్యాదిని కనిపించే పదబంధం. 'విషయం' అనేది మిగిలినది. శ్రోత దృష్టితో చూస్తే మనకు వాక్యంలో (అ) ఉద్దేశ్యం – విధేయం (Given - New) అన్న నిర్మాణం కన్పిస్తుంది. వక్తకూ, శ్రోతకూ తెలిసింది 'ఉద్దేశ్యం'. శ్రోతకు కొత్తగా తెలిసి వచ్చేది 'విధేయం'. సాధారణంగా 'విషయి' ఉద్దేశ్యం గాను 'విషయం' విధేయంగాను ఉంటాయి. ఒక్కొక్కసారి అవి వేరుగా ఉంటాయి. ఉదాహరణకు

1) నాకు / వీటితో అవసరం లేదు (వేరే వస్తువులతో ఉండొచ్చు)

విషయి/ విషయం

ఉద్దేశ్యం/ విధేయం

2) నాకు / వీటితో అవసరం లేదు (వేరే వాళ్ళకుండవచ్చు)

విషయి/ విషయం

విధేయం / ఉద్దేశ్యం

ఇక్కడ 'విధేయం' శ్రోతకు కొత్త కావడం వల్లనో వక్తకు ప్రధాన మని తోచడం వల్లనో ప్రాధాన్యం లభిస్తుంది. అసంపూర్ణ వాక్యాలు వాడేటప్పుడు 'విధేయం' మాత్రమే వాడతాం. ఉదాహరణకు

ప్ర. (3) అతనెవరండీ?

BRAOU

ఇ. (4) అతను మా తమ్ముడండీ.

(5) మా తమ్ముడు

(6) మా తమ్ముడండీ అతను

(7) మా తమ్ముడతను

అలా కాకుండా విధేయ ప్రాధాన్యం అతను

(8) మా తమ్ముడు 'అతను' అని వాడితే అది

(9) మీ తమ్ముడెవరు?

అన్న ప్రశ్నకు జవాబవు తుంది. అంటే సాధారణంగా 'విధేయం' వాక్యాంతంలో వచ్చినా ఒక్కొక్క చోట వాక్యాదిన గూడ రావచ్చన్న మాట. 'అట' 'అండి' కదా, ఏ, 'రా' లాంటివి విధేయ పదాలకే చేరుస్తాం.

వక్త దృష్టి, శ్రోత దృష్టి కాకుండా వ్యాకరణ దృష్టితో చూస్తే వాక్యంలో కర్త – కర్మ – క్రియా విశేషణం – క్రియ అన్న తేడాలున్న నిర్మాణం కన్పిస్తుంది.

క్రింది వాక్యాన్ని గమనించండి:

| | | | | |
|---|---|---|---|---|
| (10) | <u>ఆమె</u> | <u>నిన్న</u> | <u>పక్కింటావిడను</u> | <u>కొట్టింది</u> |
| | కర్త | క్రియావిశేషణం | కర్మ | క్రియ |

అవసరాన్ని బట్టి అనుక్రమణిక మారవచ్చు. అనుక్రమణికలో మార్పు వల్ల భావంలో మార్పు రావచ్చు. ఈ వివరాలు 14.3.3లో చూడవచ్చు.

పైన చెప్పిన నిర్మాణాలుండి పెద్ద వాక్యంలో భాగమైన నిర్మాణాన్ని ఉపవాక్యం అంటారు. ఉదాహరణకు కింది వాక్యంలో రెండు ఉప వాక్యాలున్నాయి.

(11) రామకృష్ణ గారికి బజ్జీలంటే ఇష్టమైనా ఆయన భార్య (బజ్జీలు) ఎప్పుడూ చెయ్యదు.

(11-i) రామకృష్ణగారికి బజ్జీలంటే ఇష్టం.

(11-ii) రామకృష్ణగారి భార్య బజ్జీలు ఎప్పుడూ చెయ్యదు

ఈ రెంటిని కలిపి కొన్ని మార్పులు చేస్తేనే 11 వ వాక్యం ఏర్పడింది.

### 14.2.2 సంయుక్త వాక్యం, సంక్లిష్ట వాక్యం

ఉప వాక్యాల రూపం ఆధారంతో వాక్యాలను రెండు విధాలుగా విభజించవచ్చు.

(అ) సంయుక్త వాక్యాలు

(ఆ) సంక్లిష్ట వాక్యాలు

సంయుక్త వాక్యాలలో ఉన్న ఉప వాక్యాలు సమ విలువ కలవై ఉంటాయి. ఒక దాని మీద ఇంకొకటి ఆధారపడదు. కింది ఉదాహరణలను పరిశీలించండి.

1) సీత వెళ్ళిందే రాముడూ వెళ్ళాడు

2) సీత వెళ్ళిన తర్వాత రాముడు వెళ్ళాడు

1వ వాక్యంలో రెండు ఉపవాక్యాలున్నాయి. రెంటినీ కలిపాం గాని ఒక దానిని ఇంకొక దానికి అధీనం చెయ్యలేదు.

2వ వాక్యంలో ఉన్న రెండు వాక్యాలలో మొదటిది అధీన ఉప వాక్యం గాను రెండవది ప్రధాన ఉపవాక్యం గానూ చెప్పవచ్చు. అధీన ఉపవాక్యం, ప్రధాన ఉపవాక్యం సహాయంతోనే వాడబడుతుంది. 'సీత వెళ్ళిన తర్వాత' అనే ఉప వాక్యాన్ని ఒక్కొక్కసారి ప్రధాన ఉపవాక్యం లేకుండా వాడవచ్చు. అప్పుడు అది అసంపూర్ణ వాక్యాన్నిస్తుంది. ప్రధాన ఉప వాక్యాన్ని సామాన్య వాక్యంగా వాడగలం.

3) రాముడెప్పుడు వెళ్ళాడు?

4) సీత వెళ్ళిన తర్వాత...

4వ వాక్యం అసంపూర్ణం. దాని పూర్తి రూపం (5)

5) రాముడు వెళ్ళింది సీత వెళ్ళిన తర్వాత

5వ వాక్య నిర్మాణం ఆసక్తి కరమైంది. ఇక్కడ వెళ్ళింది 'వెళ్ళినది' అన్న నామ్నీకరణ రూపం. దాని అర్థం 'వెళ్ళిన వ్యక్తి' / జీవం/ బండి మొ. నామ్నీకరణ రూపం ఉద్దేశ్యం గాను, అధీన ఉప వాక్యం విధేయంగాను వాడబడ్డాయి. ఇటువంటి వాక్యాల్లో కర్త, కర్మ, విభజన ఉండదు. ఇటువంటి వాక్యాలు సమీకరణ వాక్యాలు. ఇందులో ఉండేవి పదబంధాలుగా వ్యవహరిస్తున్న ఉపవాక్యాలు. ఇలాంటి ఉప వాక్యాలను బంధ వాక్యాలు అనవచ్చు. క్రియా రహిత వాక్యాలు మనకు తెలుగులో సర్వసాధారణంగా కన్పిస్తాయి.

6) అతను టీచరు

7) అతను మా అన్నయ్య

8) అతను టీచరు గాదు

9) అతను మా అన్నయ్య గాదు

10) అతను టీచరైతే (మాకేం?)

11) అతను టీచరైనా (అద్దె తగ్గించం)

ఈ వాక్యాల్లో 'అగు' క్రియ మీద ఆధారపడ్డ రూపాలే ఉన్నాయి గదా! 'పాడు' అన్న క్రియ వాడి చూద్దాం.

12) అతను పాటలు పాడుతాడు

13) అతను పాటలు పాడితే (మాకేం?)

14) అతను పాటలు పాడినా (అద్దె తగ్గించం)

ఒక్కొక్క సారి ఒక ఉప వాక్యం అధీన ఉప వాక్యమా కాదా నిర్ణయించడం కష్టమవుతుంది. ఉదాహరణకు

15) అతనెప్పుడొస్తాడు?

16) అతనెప్పుడొస్తాడో?

17) అతనెప్పుడొస్తాడో నాకు తెలియదు.

15వ వాక్యం ప్రశ్న వేస్తున్న ఉప వాక్యం. ఇక్కడది సామాన్య వాక్యంగా వ్యవహరిస్తోంది. 16వ వాక్యం గూడ



BRAOU

సందేహాల్ని సూచిస్తున్న ప్రశ్నగా భావించవచ్చు. 17వ వాక్యంలో ఉన్న 'అతనెప్పుడొస్తాడో' అన్న ఉప వాక్యం అధీన ఉప వాక్యంగా భావించవచ్చు. 16వ వాక్య ఉచ్చారణ 17వ వాక్యంలో అదే రూపానికొచ్చే ఉచ్చారణ మధ్య స్వర భేదం ఉంది. ఆ స్వర భేదం దానికి 17వ వాక్యంలో అధీనతను సూచిస్తోంది.

ఉప వాక్యపు అధీనత పలు రకాలుగా ఉండవచ్చు. కింది వాక్యాలను గమనించండి.

18) అతను మంచివాడైతే...

19) అతనే అడిగినా...

20) అక్కడికి వెళ్ళి

21) పోతూ పోతూ

22) ఆ ఊరికి వెళ్ళక ముందు

23) దారిలో కనిపించిన (వాడినల్లా)

అప్పు అడిగే (మనస్తత్వం). (అయి) తే, ఇ, నా, ఇ, ఊ, అక, ముందు అనేవి క్రియాధాతువులు. అసమాపకా (18–22) క్రియా రూప కారణంగా అధీన ఉప వాక్యాలు 23లో రెండు ఉప వాక్యాలున్నాయని అనవచ్చు. కాని ఆ రెండు కూడా విశేషణాలుగా పనిచేస్తున్నాయి తప్ప వాక్యంలో భాగంగా ఏం చెయ్యడం లేదు. కనిపించిన అడిగే అనే పదాలు క్రియా జన్య విశేషణాలు. ఈ విశేషణాలున్న ఉప వాక్యాలు పదాలులా వ్యవహరిస్తున్నాయని చెప్పవచ్చు. మరికొన్ని వాక్యాలను చూద్దాం.

24) అతను రాలేదని వాళ్ళమ్మ చెప్పింది.

25) అతను అలా చేస్తాడంటే మీరు నమ్ముతారా?

అని, అంటే అంటూ అనేవి 'అను' ధాతువు మీద ఏర్పడ్డ రూపాలే కాని వీటిలో 24లోని 'అని' మాత్రమే ఉపవాక్యాలను పరోక్ష కథనంలో అధీనం చేసే అనుకృతాంశం. ఈ రూపం అను ధాతు నిష్పన్నమైనా ప్రస్తుతం కేవలం అనుకృతాంశంగా భావించాలి.

### 14.2.3 శీర్షిక వాక్యం

పైన సమీకరణ వాక్యాలు క్రియా రహితాలని గమనించాం. ఉదాహరణకు

| | | |
|---|---|---|
| 1) | కమల | మంచి నర్తకి |
| | ఉద్దేశ్యం | విధేయం |
| 2) | కమల మంచి నర్తకి కావడం | మన అదృష్టం |
| | ఉద్దేశ్యం | విధేయం |

1) రెండు నామ బంధాలున్న సమీకరణ వాక్యం. (2)లో మొదటి నామ బంధం నా మీకరించబడ్డ సమీకరణ వాక్యం. ఈ విధంగా పదబంధాలు గాను, పదబంధంలో భాగంగాను ఏర్పడ్డ ఉపవాక్యాలు బంధ వాక్యాలు.

పత్రికల్లో కనిపించే శీర్షిక వాక్యాలు చాలా వరకు అసంపూర్ణ వాక్యాలు. కొన్ని మటుకు సంపూర్ణ వాక్యాలుంటాయి. ఇప్పుడు కొన్ని ఉదాహరణలు తీసుకుందాం.

3) అధికారం ఉందన్న భయమే అవినీతికి కారణం

BRAOU

| | ఉద్దేశ్యం | | విధేయం |
|---|---|---|---|

(జమీన్ రైతు 30-6-1995)

| | | | |
|---|---|---|---|
| 4) | అమ్మకంపన్ను చట్టం సవరణ<br>నామ బంధం | | |

(ఆంధ్రప్రభ 1-1-1995)

| | | | |
|---|---|---|---|
| 5) | పట్టాలుతప్పిన రైలు<br>(బంధవాక్యం) నామబంధం | 8మంది మృతి<br>నామబంధం | |

(ఆంధ్రప్రభ 1-1-1995)

| | | | |
|---|---|---|---|
| 6) | రాపూరు గంజాయి<br>కర్త | జోరు<br>విశేషణం | |

(జమీన్ రైతు 30-6-1995)

| | | | |
|---|---|---|---|
| 7) | ఎవరికి దొరికింది<br>(బంధవాక్యం) కర్మ | వారు<br>కర్త | దోచుకుంటున్నారు<br>క్రియ |

(జమీన్ రైతు 30-6-1995)

| | | | |
|---|---|---|---|
| 8) | మా వాటా విద్యుత్తును<br>కర్మ | కబళించకండి<br>క్రియ | |

(ఆంధ్రప్రభ 1-1-1995)

| | | | |
|---|---|---|---|
| 9) | నీటి పథకాల టెండర్లలో<br>క్రియా విశేషణం | అవకతవకలు<br>కర్మ | లేవు<br>క్రియ |

(ఆంధ్రప్రభ 1-1-1995)

| | | | |
|---|---|---|---|
| 10) | ఎ.సి. స్టేడియంను<br>కర్మ | ఎందుకు కొరగాకుండా<br>క్రియావిశేషణం | చేసేశారు<br>క్రియ |

(జమీన్ రైతు 4-8-1995)

BRAOU

ఈ వాక్యాలు (7-10) క్రియా సహిత వాక్యాలు. ఒక్క 7వ వాక్యంలో మాత్రమే మనకు కర్మ - కర్త - క్రియ ఉన్నాయి. మిగతా వాక్యాల్లో కర్మ, కర్తల్లో ఒక్కటే ఉంది. శీర్షిక వాక్యాలు సాధారణంగా క్లుప్తంగా ఉంటాయి. ఈ క్లుప్తత సాధించడానికి శీర్షిక వాక్య రచయితలు లుప్తతను బాగా వాడుకుంటారు. వివరాలు 14.4.2లో చర్చించుకుందాం.

**గమనిక:** ఈ భాగంలో కర్త అనే మాట ఇంగ్లీషులో subject అనే అర్థంలో వాడాము.

**అభ్యాసం -1**

ప్రధాన ఉప వాక్యం, అధీన ఉప వాక్యం, బంధవాక్యం అంటే ఏమిటో నిర్వచించి కింది వాక్యంలో వాటిని గుర్తించండి. 'నిన్న మీరు పంపిన సీసా పగిలి పోయిందని మీ చెల్లెలు ఫోను చేసింది'.

## 14.3 అనుక్రమణిక

పదబంధాలలో పదాలు, వాక్యాలలో పద బంధాలు ఉండే అనుక్రమణికను బట్టి భావంలో, వివక్షలో మార్పు రావచ్చు. ఈ సందర్భంలో అభిహిత, అనభిహిత రూపాల గురించి చర్చించుకోవడం అవసరం. సర్వసాధారణంగా వాడే రూపం గాక ఏదో ప్రత్యేకత స్ఫురించే రూపమే అభిహిత రూపం. ఉదాహరణకు మనం ఎవర్నైనా మంచి వాడని అనదలుచుకుంటే వాడే అభిహిత వాక్యం:

1) కల్యాణ్ మంచి వాడు

(గుర్తింపబడ్డ) విశేష్యం (గుర్తించే) విశేషణం

2) మంచివాడంటే కల్యాణ్ (అతనికి సాటి లేదండీ)

(గుర్తించే) విశేషణం (గుర్తింపబడ్డ) విశేష్యం

'విశేష్యం – విశేషణం' అన్న నిర్మాణం అనభిహితం, అలా కాకుండా 'విశేషణం – విశేష్యం' అన్న నిర్మాణం వాడితే అది అభిహిత వాక్యం. ఇక్కడ మనం కల్యాణ్‌ను మూర్తీభవించిన మంచితనంగా వర్ణిస్తున్నాం.

### 14.3.1 భావంలో మార్పు

కింది వాక్యాలను గమనించండి.

1) మా టీచరు / ఆ పొట్టి వాడు

విషయి విషయం

2) ఆ పొట్టివాడు / మా టీచరు

విషయి విషయం

1)లో 'మా టీచరు' గుర్తింపబడ్డ నామబంధం. గుర్తించే నామ బంధం 'ఆ పొట్టి వాడు' (2)లో పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నం. ఇక్కడ వాక్యంలో పదబంధానికున్న భావంలో మార్పు అనుక్రమణికలో మార్పు వల్ల జరిగింది.

1వ వాక్యం కింది ప్రశ్నలకు జవాబుగా వాడగలం.

3) మీ టీచరు ఎవరు?

2వ వాక్యం (4)కు జవాబుగా వాడగలం

4) ఆ పొట్టి వాడు ఎవరు?

అలాగే కింది వాక్యాలలోని పద బంధాలను పరిశీలించండి.

5) ఆ తలుపు వెనుక ఎవరో ఉన్నారు.

6) ఆ వెనుక తలుపు పగిలిపోయింది.

5లో 'వెనుక' అనేది విభక్తి పని చేస్తోంది. (6)లో 'వెనుక' విశేషణం పని చేస్తోంది. ఈ మార్పు అనుక్రమణిక కారణంగానే సంభవించింది.

BRAOU

### 14.3.2 వివక్షలో మార్పు

అనుక్రమణిక వల్ల భావంలో స్పష్టమైన మార్పు కనిపించక పోయినా (వక్త) వివక్షలో మార్పు రావచ్చు. ఇక్కడ వివక్షంటే దృక్పథం. కింది వాక్యాలను పరిశీలించండి.

1) అతను నిన్న మోటారు సైకిలు కొన్నాడు

2) నిన్న అతను మోటారు సైకిలు కొన్నాడు.

1)వ వాక్యం 'అతను' గురించి చెప్తే, 2)వ వాక్యం 'నిన్న' గురించి చెప్తుంది. నిన్న ఏం జరిగింది? అనే దానికి 2వ వాక్యం జవాబైతే 'అతను నిన్న ఏం చేశాడు? అనే దానికి (1)వ వాక్యం జవాబు, అలా కాకుండా 'అతను మోటారు సైకిలు ఎప్పుడు కొన్నాడు? అన్న ప్రశ్న వేస్తే జవాబు కింది విధంగా ఉంటుంది.

3) అతను మోటారు సైకిల్ నిన్న కొన్నాడు. తెలుగులో కొత్తదైన విషయాన్ని సాధారణంగా క్రియకు ముందుంచుతాము. ఆ పద బంధ ప్రత్యేక ఊనిక గూడ ఉంటుంది. కింది వాక్యాలు చూడండి.

4) అతనింట్లో నిన్న బాంబు దొరికింది.

5) బాంబు అతనింట్లో నిన్న దొరికింది.

6) నిన్న బాంబు అతనింట్లో దొరికింది

సమీకరణ వాక్యాలలో ఆఖరున ఉండే పదబంధం కొత్త విషయాన్ని సూచించే విధేయం.

7) అతనింట్లో బాంబు దొరికింది నిన్న

8) నిన్న బాంబు దొరికింది అతనింట్లో

9) నిన్న అతనింట్లో దొరికింది బాంబు

BRAOU

తెలుగులో అనుక్రమణికకు పెద్ద ప్రాముఖ్యత లేదని కొందరు అంటారు. కాని భావ వివక్షలను గమనిస్తే వారి వాదన నిలవదు.

**అభ్యాసం -2**

కింది పదాలతో విభిన్న అనుక్రమణికల్లో ఎన్ని వాక్యాలు నిర్మించగలరో చూడండి. వాటిలో ఉన్న తేడాలు సూచించండి

పిల్లి, పాప, పాలు, తాగింది

## 14.4 సంయోగత

ఏ భాషలోనైనా సరే వాక్యాలు ఒక వ్యాసంలో కలిపి రాసేటప్పుడు వాటిలో సంయోగత ఉండాలి. లేకపోతే అవి కేవలం వాక్యాల కూడలి మాత్రమే అవుతుంది. ఈ సంయోగతను సాధించేది సంయోగ పదాలు, ప్రతి రూపాలు, లుప్తత. ప్రస్తుతం వీటి గురించి వివరంగా తెలుసుకుందాం.

### 14.4.1 సంయోగ పదాలు

ఉప వాక్యాల మధ్య, వాక్యాల మధ్య సంయోగత చేకూర్చే పదాలు – సంయోగ పదాలు. కింది ఉదాహరణలను గమనించండి.

1) అతను మంచి వాడే అయినా ఎందుకో నాకు అతని మీద నమ్మకం కుదరడం లేదు.

2) పాతదయినా 50,000 రూపాయలకన్నా ఎక్కువ ఖర్చవుతుంది. కాబట్టి ప్రస్తుతానికి కారు మాట వదిలేద్దాం.

3) అంతేగాకుండా ఆయనకు ఇంకెవ్వరూ లేరు.

4) ఈ వరకే చాలా మాట్లు చెప్పిచూచా. అందుకని ఇక ఆ ప్రస్తావన తేదలచుకోలేదు.

పై వాక్యాలలో *అయినా, కాబట్టి, అంతే కాకుండా, అందుకని* అనేవి సంయోగ పదాలు. ఇవి వాక్యాల మధ్య భావ సంబంధాన్ని తెలియజేస్తాయి. కింది వాక్యాలలో ఉపవాక్యాల మధ్య సంయోగతను ఏర్పరచే సంయోగ పదాలను గమనించండి.

5) అతను చెప్పాడు గాని, నాకెందుకో అనుమానం ఉంది.

6) అతనో లేక (పోతే) అతని తమ్ముడో ఈ బాధ్యత తీసుకోక తప్పదు.

ఈ వాక్యాలలో *గాని* *లేక* ఉప వాక్యాల మధ్య, పదబంధాల మధ్య సంబంధాన్ని సూచిస్తాయి.

### 14.4.2 ప్రతిరూపాలు

మళ్లీ మళ్లీ వాడిన పదాన్నే వాడకుండా దానికి బదులు వేరే పదాన్ని వాడతాం. ఆ విధంగా వాడిన దాన్ని ప్రతిరూపం అంటాం. సర్వనామాలు – నామాలకు (నామబంధాలకు) ప్రతిరూపాలు. కింది వాక్యాలను గమనించండి.

1) వెంకట్రావు గారికి ఇటువంటివి నచ్చవు. అందుకనే ఆయన సమావేశం మధ్యలోనే లేచిపోయినాడు.

2) స్టూడెంట్స్ ఏవేవో అంటారు. వాళ్ళ మాటలకు నొచ్చుకొని ఆత్మహత్య చేసుకుంటావటయ్యా.

3) సుజాతకు అన్యాయం జరిగింది. అందుకే ఆమెకు దేవుడి మీద నమ్మకం తగ్గింది.

పై వాక్యాలలో అందుకనే, అందుకే అనేవి సంయోగ పదాలు. ఇటువంటివి, ఆయన, ఏవేవో, ఆమె అనేవి ప్రతిరూపాలు. ఈ ప్రతిరూపాలు గూడ వాక్యాల మధ్య సయోధ్యను సాధిస్తాయి. విభిన్న క్రియలకు ప్రతిరూపం చేయి అనే ధాతువు

4) రంగారావు అబద్ధాలు చాలా సునాయాసంగా చెప్తాడు. అలా చెయ్యబట్టే అతని మాటలకు ఏమీ విలువ లేదు.

BRAOU

ఇక్కడ 'చెయ్యబట్టే'లో 'చెయ్య' – అబద్ధాలు చెప్పడానికి ప్రతిరూపం 'రంగారావు'కు ప్రతిరూపం 'అతని'.

### 14.4.3 లుప్తత

సందర్భంలో సూచించబడడం వల్లనో ముందు వచ్చిన వాక్యాలలో వచ్చిందనో మనం కొన్ని మాటలను లోపింపచేస్తాం. దానినే లుప్తత అనవచ్చు. కింది సంభాషణను గమనించండి.

1) ప్ర: మీరు ఆలుగడ్డలు ఎన్ని కిలోలు తెచ్చారేం?

2) జ: రెండు కిలోలు

3) ప్ర: ఎందుకు?

4) జ: ధర తక్కువని తెచ్చాలేవోయ్.

2లో రెండు కిలోలు అనే లుప్తవాక్యం దాని పూర్తిరూపం (5) నేను ఆలుగడ్డలు రెండు కిలోలు తెచ్చాను.

నేను, ఆలుగడ్డలు, తెచ్చాను అనేవి ప్రశ్న ద్వారా బోధకం అవుతాయి. కనుక వక్త తన జవాబులో వాటిని ప్రస్తావించలేదు. అలాగే (3) కు పూర్తి రూపం (6).

(6) మీరు ఆలు గడ్డలు రెండు కిలోలు ధర తక్కువని తెచ్చానులేవోయ్.

పూర్తి రూపాలు వాడితే అవి వేరు వేరు వాక్యాలను కలిపి రాయడం అవుతుంది గాని, సంయోగత ఉన్న సంభాషణ ఏర్పడదు.

**అభ్యాసం –3**

కింది వాక్యాలలోని సంయోగ పదాలను ప్రతిరూపాలను గుర్తించండి. లుప్తత ఉన్న చోట పూర్తి రూపమేదో సూచించండి.

1) అతను అలా అన్నాడని మనం ఊరుకుంటామా?

2) ఊరుకోక?

B R A O U

## 14.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- పదానికి, వాక్యానికి, నిర్మాణ అనుబంధం ఉంది.
- ఉప వాక్యం, బంధవాక్యం అనేవి వాక్యాలలో, పదబంధాలలో ఎలా ప్రయోగించబడేది తెలుసుకున్నాం.
- శీర్షికలో లుప్తతను వాడుకునే, సమీకరణ వాక్యాలను వాడుకునే విధానం ఉంది.
- అనుక్రమణిక అనేది తెలుగులో కూడా విలువైన విషయమే.
- వాక్యాలు వ్యాసంలో అంతర్భాగంగా ఉండడానికి సంయోగత అవసరం.
- ఆ సంయోగతను సాధించే సంయోగ పదాలు, ప్రతిరూపాలు, లుప్తతలు మనం గుర్తించాలి.

## 14.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో సమాధానాలు రాయండి.**

1. బంధవాక్యం, ఉపవాక్యం, వాక్యం - వీటిని వివరంగా చర్చించండి.
2. సంయోగతను సాధించే విధానాలేమిటో సోదాహరణంగా విశదీకరించండి.

**II. కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. అనుక్రమణికకు భావ వివక్షలకున్న సంబంధమేమిటి?
2. శీర్షిక వాక్యాల ప్రత్యేకతలేమిటి?

BRAOU

# భాగం : 15 విరామ చిహ్నాలు

## విషయ క్రమం

15.0 ఉద్దేశం

15.1 ప్రవేశిక

15.2 ఉచ్చారణ – రచన

15.2.1 విరామం – చిహ్నం

15.2.2 విరామచిహ్నం – భావ సంకేతం

**అభ్యాసం – 1**

15.3 విరామ చిహ్నాలు

15.3.1 వాక్య మధ్య విరామ చిహ్నాలు

15.3.2 వాక్యాంతపు విరామ చిహ్నాలు

15.3.3 మరికొన్ని చిహ్నాలు

**అభ్యాసం –2**

15.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

15.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 15.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు:

☞ విరామ చిహ్నాల ప్రయోజనం

☞ విరామ చిహ్నాల ప్రయోగం

BRAOU

## 15.1 ప్రవేశిక

సంప్రదాయాన్ని గమనిస్తే తెలుగులో వాక్యాంతపు విరామం తప్ప మరేమీ కన్పించదు. ఇంగ్లీషులో వాడే విరామ చిహ్నాలను తెలుగుకు కూడా వర్తింపచెయ్యడంలో కొన్ని సమస్యలు ఎదురవుతాయి. అయినా సమన్వయం సాధ్యం. ఆ విషయాలే ఈ భాగంలో చర్చించుకుందాం.

## 15.2 ఉచ్చారణ - రచన

ఈ విభాగంలో ఉచ్చారణకు రచనకు ఉన్న సంబంధం గురించి తెలుసుకుందాం.

### 15.2.1 విరామం – చిహ్నం

మాట్లాడేటప్పుడు వాక్యం మధ్యలో మనం విరామం ఇస్తుంటాం. ఈ విరామాన్ని రచనలో సూచించే చిహ్నాలే విరామ చిహ్నాలు. తెలుగులో సంధి గూడ రచనలో చూపే అలవాటుంది. కనుక విరామాన్ని సూచించే చిహ్నాలు వాడడం కష్టమౌతుంది.

కింది వాక్యాలను గమనించండి :

(1) రాముడు, లక్ష్మణుడు వచ్చారు.

(2) రామలక్ష్మణులు వచ్చారు.

(1)వ వాక్యంలో పలికేటప్పుడు వినిపించే విరామమే కామా (,) రూపంలో రాయడం జరుగుతుంది. (2)వ వాక్యంలో ద్వంద్వ సమాసం వాడినందు వల్ల 'రామ లక్ష్మణులు' అనే సమాసం మధ్య 'కామా' గాని చూపనక్కర్లేదు.

కింది వాక్యాలను గమనించండి :

(3) బలరామ, శ్రీదామ వృషభుల జట్టు గెలిచెను.

దేవాధి దేవుడు – శ్రీకృష్ణభగవానుడు (ప్రథమ భాగం) పే (67)

బలరాముడు, శ్రీ దాముడు, వృషభుడు, ముగ్గురూ కలిసి ఉన్న జట్టును గురించి చెప్పటం వల్లనే బహు వచన 'ల' వాడబడింది. 'బలరామ' తర్వాత 'కామా' అనవసరం. శుద్ధ విరామం 'బలరామ' తర్వాత సూచిస్తే 'శ్రీదామ' తర్వాత గూడ అవసరం.

(4) (అ) బలరామ శ్రీదామ వృషభుల

(అ) బలరామ శ్రీదామ వృషభుల...

4లో సూచించిన రెండు పద్ధతులూ సబబుగా ఉన్నాయి.

### 15.2.2 విరామ చిహ్నం – భావ సంకేతం

విరామ చిహ్నాల వాడుక ఉచ్చారణను ప్రతిబింబిస్తే ఈ రెండు భావ నిర్మాణాన్ని సూచిస్తాయి. రెండు ఉప వాక్యాలను కలిపేటప్పుడు 'కామా' గాని, సెమికాలన్ గాని వాడవచ్చు. భావ నిర్మాణంలో తేడా కన్పిస్తుంది.

(5) రాముడు ఇంటికెళ్ళాడు, శంకరయ్య ఊరికెళ్ళాడు.

BRAOU

(6) రాముడు ఇంటికెళ్ళాడు; ఊరికెళ్ళాడు

(7) రాముడు ఇంటికెళ్ళాడు. శంకరయ్య లైటార్పేసి పడుకున్నాడు.

5వ వాక్యంలో రాముడు శంకరయ్యలు చేసిన పనుల్లో ఉన్న నిర్ణయ సామీప్యత, 6వ వాక్యంలో కనిపించదు. 7వ ఉదాహరణలో మనకు వేర్వేరు వాక్యాలున్నాయి. ఇక్కడ జరిగిన ఘటనలు ఒకదాని తర్వాత ఒకటి జరిగాయి గాని ఒకే కాలంలో గాదు.

**అభ్యాసం –1**

పోతన వాడని విరామ చిహ్నాలు వాడి ముద్రించిన భాగవతంలోని కింది పాదం గమనించండి

కమనీయ భూమి భాగములు లేకున్నవే? పడియుండుటకు దూది పరుపులేల?

ఇక్కడ ప్రశ్నార్థ చిహ్నం (?) వాడడం అవసరమా?

BRAOU

## 15.3 విరామ చిహ్నాలు

ఈ విభాగంలో మనం తెలుగు రచనలో వాడే ముఖ్యమైన విరామ చిహ్నాలను వివరంగా పరిశీలిద్దాం.

### 15.3.1 వాక్య మధ్య విరామ చిహ్నాలు

వాక్యంలో వాడే విరామ చిహ్నాలు పూర్ణ విరామాన్ని సూచించవు. భావాన్ని సూచించే ఉచ్చారణను ఆధారం చేసుకొని ఈ చిహ్నాలు వాడతారు. ఇలా వాడే వాక్య మధ్య విరామ చిహ్నాలివి:

| | | |
|---|---|---|
| , | : | కామా |
| ; | : | సెమికాలన్ |
| : | : | కోలన్ |
| - | : | హైఫన్ (చిన్న గీత) |
| — | : | డాష్ (అడ్డగీత) |

పదాల మధ్య కనిపించే శుద్ధ విరామం space కూడా ఒక రకమైన చిహ్నమే. కామా (,) అనేది వేరు వేరు పేర్లు, విశేషణాలు, క్రియలు వరసగా వచ్చినపుడు వాడే విరామ చిహ్నం.

(8) రోహిణీ మాత, యశోద మాత విడిగా ఒక బండిలో కూర్చుండి యుండిరి.

(9) గ్రామవృద్ధులకును, శిశువులకును, స్త్రీలకును బండ్లలో కూర్చుండుటకు ఏర్పాట్లు జరిగెను.

(10) వెంటనే తిరిగి రమ్ము, స్నానము చేయుము, చక్కగా మంచి దుస్తులు ధరింపుము.

(11) కాలము, దేశము, విశ్వసృష్టి, పునరుజ్జీవనము, కామము, కర్మ, సత్త్వ రజస్తమో గుణములు ఆయనను పూజింపసాగెను.

8.11లలో ఇచ్చిన వాక్యాలు గ్రాంధిక శైలిలో ఉన్న వాక్యాలు. ఇవి దేవాది దేవుడు శ్రీకృష్ణ భగవానుడు అన్న గ్రంథంలోనివి. వ్యావహారిక భాషలో వాడే వాక్యాల్లో కామాలను గమనించండి.

(12) మార్పులేని మానవ పదార్థాలు – సత్యం – సౌందర్యం, ధర్మం వంటివి వున్నాయనీ, వాటిని ప్రవచించడమే కవిత్వం పని అనీ కవీ, విమర్శకుడూ భ్రమపడడం సాధ్యమైనంత కాలం ఈ వాదం నిలిచింది.

(నారాయణ రావు 1978: 226)

(13) ఈస్ట్ డివిజన్‌లో అయితే ప్రముఖ తీవ్రవాదులు కొంతమంది పోలీసులకు లొంగిపోవడం, అరెస్టులు కావడం, చాలామంది ఎన్‌కౌంటర్లలో చనిపోవడం వంటి సంఘటనలు జరిగాయి.

(జమీన్ రైతు 21.7.1995)

(14) మద్య నిషేధం విధించిన రోజే, రాష్ట్రంలో విస్కీ, బ్రాందీ, బీరు తదితర ఉత్పత్తి చేసే డిస్టిలరీలు బ్రూవరీలను మూసివేయించింది ప్రభుత్వం. (జమీన్ రైతు 30.6.1995)

(15) వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెసు, తెలుగుదేశం, ఉభయ కమ్యూనిస్టులు, భారతీయ జనతాపార్టీలతో పాటు తెలుగు దేశం చీలిక పక్షమైన బాబు దేశం కూడా రంగంలో ఉంటుంది.

(జమీన్ రైతు 10.11.1995)

బూదరాజు రాధాకృష్ణ కామా వాడుక గురించి చెప్పిన మాటలివి:

'' ఒక ఉపవాక్యం పూర్తి అయిన తరువాత గానీ, భిన్న వ్యక్తుల, వస్తువుల, బిరుదుల పేర్లు వరుస వరుసగా వచ్చినపుడు గాని కామా తప్పక వాడాలి. (1981:74)

ఎన్. శివ రామ మూర్తి కామా ఎక్కడెక్కడ వస్తుందో వివరించారు: సంచలనాత్మక పదబంధాలతో ఒక్కో పదాన్ని విడదీసి చూపించడానికి, పర్యాయ పదబంధాలను వేరు చేయడానికి, చౌదర్థక, క్వ్యర్థక ప్రత్యయాల తర్వాత, అవ్యయ ప్రత్యయమైన 'గా' తర్వాత, అప్పుడప్పుడు సంబోధక ప్రథమ తర్వాత సంకలనాత్మక ప్రత్యయం తర్వాత, ప్రత్యేకించి ఒక పదబంధాన్ని గాని, పదాన్ని గాని, మిగతా వాక్యంతో విడదీసి చూపినప్పుడు కామా వస్తుంది.
(1981:169)

ఉప వాక్యాల మధ్యలో గూడ కామా వస్తుందన్నది నిజం. ఇప్పుడు కొన్ని ఉదాహరణలను చూద్దాం.



BRAOU

(15) ''దీనంతటికి మూల విరాట్టు తానే గనుక, అడంబరాలకు అడ్డుకట్టవేసి కార్యక్రమాలు నిర్వహించాలి రమేష్‌రెడ్డి'' (నెల్లూరు పాలిటిక్స్ 15.1.95, పక్ష పత్రిక)

(16) తను ఆలోచిస్తున్నది, తెరపై జరుగుతున్నది ఒకటే కాబట్టి, అందున చంద్రం చేసుకునే అమ్మాయి చాలా అదృష్టవంతురాలండి (ఆంధ్రభూమి మాసపత్రిక జూన్1993:209)

(17) నిన్నటి సంవత్సరం భార్యా కొడుకులు బళ్ళారికి పోతే, మల్లన్న ఇంటి దగ్గరే ఉండె.

(అన్వేషణ 20.10.95:11 వారపత్రిక)

ఉప వాక్యాల మధ్య కామా కన్న ఎక్కువ విరామాన్ని సూచించాలంటే వాడే చిహ్నం సెమికోలన్ (;) ''చిన్న చిన్న వాక్యాలు (ఉపవాక్యాలు) వరుసగా చెప్పేటప్పుడు ఒక్కొక్క వాక్యం (ఉప వాక్యం) తర్వాత సెమికోలన్ వస్తుంది. (శివరామమూర్తి) కొన్ని ఉదాహరణలను గమనిద్దాం:

(18) అభ్యుదయ కవిత్వ ప్రభావాన, సాహిత్య రంగంలో ఈ చర్యలు తీవ్రంగా జరిగినా, అవి సాహిత్య విమర్శలో అంతర్భాగాలు ఏనాడూ కాలేదు. సాహిత్యం రాజకీయాలలో భాగంగానే ఉండిపోయాయి.

(నారాయణ రావు 1978:225)

(19) మీ భోజనమును వదిలి పెట్టి పోవలదు; సంతృప్తిగా భోజనం చేయుడు, దూడలున్న చోటుకి నేను స్వయముగా వెళ్లెదను. (దేవాది దేవుడు శ్రీ కృష్ణ భగవానుడు (ప్రథమ భాగం):116)

19లో మొదట వాడిన సెమికోలన్‌కు బదులు కామా వాడి, తర్వాత వచ్చిన కామాకు బదులు సెమికోలన్ వాడితే సబబుగా ఉండేది. ఎందుకంటే మొదటి రెండు ఉప వాక్యాలకు ఎక్కువ భావ సంబంధముంది.

(20) కాశ్మీర్ పరిస్థితి చాలా ప్రత్యేకమైనది; విలక్షణమైనది. సత్వరం రక్షించుకోవడం భారతీయుల కర్తవ్యం; అందుకు కావలసింది ప్రధానంగా ఆ రాష్ట్ర ప్రజల మద్దతు; ఆ ప్రజాభిప్రాయం వ్యక్తం కావడానికి వున్న ఏకైక మార్గం ఎన్నికలు. (జమీన్ రైతు 10.11.1995)

(20)లో మొదట వాడిన సెమికోలన్ బదులు కామా తర్వాతి సెమికోలన్‌కు బదులు పూర్ణ విరామ చిహ్నం (.) కూడ వాడవచ్చు. అలా చేస్తే భావం పొందికలో కొంచెం తేడా రావచ్చు.

ఇంకొక ఉదాహరణ గమనించండి :

(21) ఈ పని నన్నయ గారు చేశారు; పాల్కురికి సోమనాథుడు చేశాడు; పెద్దన్నగారు చేశారు; భావకవులు చేశారు; అభ్యుదయ కవులు చేశారు; దిగంబర కవులు చేశారు. ఈ రకమైన కవిత్వాన్ని అధికవిత్వం అనొచ్చు. (నారాయణ రావు 1978:49)

కొన్ని చోట్ల కామా సెమికోలన్లను ప్రాచీన కావ్యాల పద్యాల విషయంలో నిర్హేతుకంగా వాడడం జరుగుతుంది. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన భాగవతంలో ఆటవెలదులు కందాలు నాలుగు పంక్తులుగా కాక రెండు పంక్తులుగా ముద్రించారు. మధ్యలో పంక్తి హద్దు సూచనకు కామా వాడారు.

(22) పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట నే

బలికిన భవకరమగునట, పలికెద నేడు గాథ బలుకగ నేలా (1/16)



BRAOU

ఇదే పద్యాన్ని మందార మకరందాలు అన్న సంకలనంలో ఎలా ముద్రించారో చూడండి.

(23) పలికెడిది భాగవతమంట;

పలికించు విభుండు రామభద్రుండట; నే

బలికిన భవహర మగునట;

పలికెద వేరొండు గాథ బలుకగ నేలా (నారాయణ రెడ్డి 1974:16)

22లో 'భవహర మగునట' శుద్ధ విరామం లేకుండా 'బలుకగ నేలా' శుద్ధ విరామం తోను ముద్రించారు. 23లో 'భవహర మగునట' లో కన్పించిన విరామం 'బలుకగ నేలా' లో కన్పించదు. పదాల మధ్య విరామం, విరామ చిహ్నాలు అరువు సొమ్ము లైనందు వల్ల ఇంకా ప్రామాణికత ఏర్పడలేదు. మనం ప్రాచీన గ్రంథాల విషయంలో ఈ చిహ్నాలు వాడకుండా పదబంధాల మధ్య సంధిలేని చోట్ల శుద్ధ విరామం వాడితే చాలు.

కోలన్ అనేది ప్రత్యక్ష కథనాన్ని సూచించే వాక్యంగాని వివరాలు సూచించే గాని, వరుస చెప్పబడే పదాలు గాని చెప్పబోయే ముందు వాడతారు.

(24) కృష్ణుడు తన తండ్రికి ఇంకను ఇట్లు వివరించెను: 'ఈ విశ్వము సత్త్వ రజస్త మస్సులు అను మూడు భౌతిక గుణముల ప్రభావం వలన ప్రవర్తించుచున్నది... మనకు ఇంద్రునితో ఎట్టి సంబంధమును లేదు''

(దేవాధి దేవుడు శ్రీ కృష్ణ భగవానుడు – ప్రథమ భాగం: 209)

(25) కథనం రెండు రకాలు:

(అ) ప్రత్యక్ష కథనం

(ఆ) పరోక్ష కథనం

(26) గుణాలు మూడు:

(అ) సత్త్వ గుణం

(ఆ) రజో గుణం

(ఇ) తమోగుణం

25, 26లో కోలన్ (:)కు బదులు డాష్ (–) గాని కోలన్ డాష్ (:_____) గాని వాడడం గూడ కనిపిస్తుంది. డాష్ కన్న చిన్నది 'హైఫన్' (-) ముద్రణ సమస్యల వల్ల డాష్ వాడవలసిన చోట హైఫన్ తరచుగా కనిపిస్తుంది. తెలుగులో పదాల, ఉపవాక్యాల గొలుసును సూచించడానికి హైఫన్ ఉపయోగించే వాళ్ళున్నారు. గాని ఆ పని కామాగాని, సెమికోలన్ గాని చెయ్యగలవు.

(27) అడుసు తొక్క నేల – కాలు కడగ నేల

(28) వాగేనోరు – నడిచే కాళ్ళు ఊరుకోలేవు. ఇంగ్లీషులో పూర్తిగా కలిసి పోని పద బంధాల మధ్య హైఫన్ వాడటారు

(29) అ) Ice-cream

ఆ) Ice-box

BRAOU

### 15.3.2 వాక్యాంతపు విరామ చిహ్నాలు

వాక్యాంతపు విరామ చిహ్నాలు వాక్యానికి సందర్భోచిత భావనను వ్యక్తం చేస్తాయి. ప్రశ్న అడగడం, సమాచారం అందివ్వడం, ఆశ్చర్యం ప్రకటించడం లాంటి సందర్భోచిత భావనలకు కింది చిహ్నాలు వాడతారు.

? – ప్రశ్నార్థకం

. – పూర్ణ విరామం

! – ఆశ్చర్యార్థక చిహ్నం

ఈ చిహ్నాలు వాడడంలో కొన్ని విషయాలు గమనించారు. ఇవి ఉపవాక్యాలతో ముడివడ్డ చిహ్నాలు కావు. పూర్తి వాక్యం తర్వాతనే వాడాలి. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన భాగవతంలో అనవసరంగా వాడిన ప్రశ్న చిహ్నం సంధిని కూడ తిరస్కరించడం గమనించండి.

(30) అగణితమైన వైభవుండగు మురాలతకు కెక్కడికి బోయె? నంచునె
వ్వగల నశించి నేత్రముల వారి కణంబులు దేకు మమ్ము (భాగవతం 1/419)

31లో వాక్యాంతంలో గాకుండా వాక్య మధ్యంలో వాడడం జరిగింది.

31 కంజా క్షునకు గాని కాయంబు కాయమే?
పవన గుంభిత చర్మ భస్త్రి గాక (7–170)

ఇక్కడ ప్రశ్న చిహ్నాల్ని వాడవలసిన పని లేదు. ఇక్కడ అసలు ప్రశ్న లేదు. 'కాయమ్' అన్న దాని అర్థం కాయము కాదు అని గాని 'కాయమా' అని గాదు ఇలాంటి పద్యాల్లో విరామ చిహ్నాల అగత్యం లేదు.

ప్రశ్న(ల)ను వాక్యంలో భాగంగా వాడేటప్పుడు '?' గుర్తు వాడనక్కర్లేదు.

(32) అధికారాలు ఒకే కుటుంబానికి కేంద్రీకరించబడితే పార్టీలో ప్రకంపనలు మొదలవుతాయా? ప్రతీకారంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తాయా? అన్నది ఆనందరెడ్డికి టికెట్ వచ్చిన తర్వాత ఆలోచించదగ్గ విషయాలు. (నెల్లూరు పాలిటిక్స్ 15.1.75)

ఈ వాక్యంలో ప్రశ్న గుర్తులక్కర్లేదు. ఒక వేళ వాడితే 'అన్నది'కి బదులు 'ఈ ప్రశ్నలు' అని గాని 'ఈ విషయాలు' అని గాని వాడి తదనుగుణంగా వాక్యాన్ని మార్చుకోవాలి.

ఆశ్చర్యార్థ చిహ్నాల్ని (!) ఆశ్చర్యాన్ని ప్రకటించడానికి సంబోధనకు వాడతారు. అంతేగాక నిశ్చయార్థక వాక్యాల్లో గూడ ప్రత్యేక ఉనికి ఉన్నప్పుడు ఈ చిహ్నాల్ని వాడతారు.

ఉదాహరణకు:

(33) ప్రభూ! కృష్ణా!

(34) కృష్ణుని విభిన్న శక్తులు, కార్యకలాపములు కొనసాగు పద్ధతి ఇదియే!

(దేవాది దేవుడు శ్రీకృష్ణ భగవానుడు (ప్రథమ భాగం): 140)

(35) 65మందిని సన్మానిస్తున్నట్లు కరపత్రంలో ప్రకటించినా సన్మానితులు 20 మందికి మించి రాలేదు!

(జమీన్ రైతు 30.6.1995)

BRAOU

### 15.3.3 మరి కొన్ని చిహ్నలు

పైన చూపబడిన చిహ్నలు కాక రచనలో మరికొన్ని కనిపిస్తాయి. 'కుండలీకరణం' అనేది ఒక పదాన్ని గాని పద బంధాన్ని గాని వేరే భాషలో గాని వేరే మాటలో గాని వివరించడానికి లేదా ప్రత్యేక సంబంధిత సమాచారం ఇవ్వడానికి వాడతారు.

(36) సమాజ సంఘటనలలో ప్రత్యక్ష భాగస్వామ్యం లేకపోవడానికి మరో పేరు ఎడబాటు

(నారాయణ రావు 1978:189)

(37) టౌన్‌లో ప్రైవేటుగా బిఇడి కోచింగ్ నిర్వహిస్తుండిన శ్రీ బట్టారం రామసుబ్బయ్య (78) 21వ తేదీ మరణించారు. (జమీన్ రైతు 21.7.1995)

(38) నేను జిల్లా నుండి తిరిగి వచ్చే వరకు (1932 నవంబరు) తాలూకా బోర్డు యెన్నికలు వస్తున్నవి.

(39) .... తిరుపతి వెంకట కవులతో ఆరంభమైన ఆశు (అవధాన) కవిత్వం

(నారాయణ రావు 1978:107)

ప్రత్యక్ష కథనం సూచించే గుర్తులు ''     '' వీటిని కథన సూచిక ద్వయాలనవచ్చు.

(39) ''సాహిత్య రంగంలో ఇప్పుడు నేను కావిస్తున్న కృషికి సమతుల్యమైన కృషి భారతదేశంలో మరెక్కడా కనిపించదు'' అని రాసుకున్న కవికి ఆయన భాషలోనే అనుసరణ లేకపోయింది.

(నారాయణ రావు 1978:106)

(40) ''నన్ను వెలుగులోకి తెచ్చింది మద్రాసు నగరం'' అన్నారు ఎన్.టి.ఆర్. కొంత కాలం 'తెలుగు గంగ' గురించి పాత్రికేయులతో ముచ్చటిస్తూ, ''నన్ను పెంచి పెద్దచేసింది, ఫోకస్‌లోకి తెచ్చింది విజయా సంస్థ'' అని కూడా అన్నారు. (జమీన్ రైతు 21.7.1995)

40లో ''తెలుగు గంగ'' అనే పదబంధాన్ని జంట కథన సూచిక ద్వయంలో చూపడం గమనించండి. ఈ సూచికలను పేరును సూచించడానికి గూడ వాడతారని తెలుస్తుంది. కాని కొందరు ఇక్కడ ఏక కథన సూచికల ('   ')ను వాడతారు. ఈ సూచికలను వాడేటప్పుడు సంధి పరిస్థితిని విస్మరించడం మాత్రమే అసమంజసమని తోస్తుంది.

(41) నిజానికి 'ప్రభావం' అన్న మాట మరికొంత బాధ్యతాయుతంగా వాడవలసిన అవసరం ఉంది.

(నారాయణ రావు 1978:99)

(42) ''ఆ చీకటిని లోనికి తీసుకొని పో మ్మని చెప్పింది. (శివరామమూర్తి 1981:173)

దీనికి బదులు (43)లో ఉన్నట్లు రాయడం సమంజసం:

(43) ''ఆ చీకటిని లోనికి దీసుకొని పో'' అని చెప్పింది. కొన్ని చోట్ల కథన సూచిక ద్వయం బదులు ఏక కథన సూచికలతోనే ప్రత్యక్ష కథనం సూచిస్తారు.

(44) 'మంజరీ'! ఏంతంటా తెచ్చి పెట్టావమ్మా!' శాంతంగా అన్నాడు వామన రావు.

(మరాఠీ కథా సంగ్రహం 1981:197)

BRAOU

పదాల మధ్య కనిపించే ఖాళీని శుద్ధ విరామం అన్నాం. దీని వాడుక చాలా క్లిష్టమని తోస్తోంది. ఇంగ్లీషులో పదానికిచ్చే నిర్దిష్ట రూపం తెలుగులో ఇవ్వలేమేమో. ఉచ్చారణలోని సంధిని రచనలో సైతం సూచించే సంప్రదాయమున్న తెలుగులో సంధి చేస్తూ శుద్ధ విరామం చూపడానికి ప్రయత్నించడం లాభదాయకం కాదు. అంతే గాక దీంట్లో సౌకర్యం కూడా లేదు. కింది ఉదాహరణలు గమనించండి.

(45) దేశ సమైక్యత, సమగ్రతలను చాటి చెప్పే 'రోజా, బొంబాయి' వంటి చిత్రాల్లో వివాదాస్పద సంఘటనలను సైతం సందేశాత్మకంగా, సున్నితంగా ప్రజా హృదయాలను హత్తుకునేలా రూపొందించిన డైరెక్టర్ మణిరత్నం ఇంటి మీద ఈనెల 9వ తేదీన బాంబులతో దాడి జరగడం అతి శోచనీయం.

(జమీన్ రైతు 21.7.1995)

వివాదాస్పద, సందేశాత్మకంగా అనే సంధి ఉన్న పదబంధాలలో ఒక చోట విరామం సూచించడం, ఇంకొక చోట సూచించక పోవడం గమనించాలి.

ఇంకొక ఉదాహరణ:

(46) ఆయన కవితా మార్గం వస్తుతః ఆశుసంప్రదాయంలోది. తాను ఆశు సంప్రదాయం లోంచి వచ్చిన వాడైనా లిఖిత సంప్రదాయాన్ని అనుకరించిన వాడు వేమన్న (నారాయణ రావు 1978:211)

ఇక్కడ 'ఆశు సంప్రదాయం' మధ్య ఒక చోట విరామం ఉండడం మరొక చోట లేకపోవడం.. రచయితల్లోనూ, ముద్రాపకుల్లోనూ పదహద్దులను సూచించడమా అనే విషయంలో స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోవడం వల్ల జరుగుతుంది.

అభ్యాసం -2

కింది వాక్యాలకు అనువైన విరామ చిహ్నాలు వాడండి.

ఈ పని ఎంత చిత్తశుద్ధితో చేసినా ఎంత ఆదర్శభావాలతో చేసినా ఆయన రచన లేవీ రచనలుగా నిలవక పోవడానికీ తరవాత సాహిత్య రంగంలో చెప్పుకోదగిన మార్పు కలిగించక పోవడానికీ కారణం కవిగా ఆయన స్థాయి గొప్పది కాకపోవడం ఆయన చైతన్యం వస్తుతః సాహిత్య చైతన్యం కాకపోవడం

BRAOU

## 15.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

విరామాల విషయంలో కింది విషయాలను గుర్తుంచుకోవడం అవసరం:

- పదాల మధ్య శుద్ధ విరామం పాటించాలనుకుంటే వీలు చూసుకోవాలి.
- పదబంధాల మధ్య శుద్ధ విరామం పాటించడం సులభం.
- సంధి చేసిన చోట విరామం పాటించకూడదు.
- కథన సూచిక ద్వయం సంధి పరిస్థితిని అతిక్రమించకూడదు.
- ఏక కథన సూచికలైనా జంట కథన సూచికలైనా వాడేటప్పుడు వీలు చూసుకోవాలి.
- వాక్యాంతపు చిహ్నాలు వాక్యాంతంలోనే పాటించాలి.
- ప్రాచీన రచనలను మార్పు లేకుండా చూసేటప్పుడు విరామ చిహ్నాల వాడుక కష్టం గనుక వాటిని వాడకుండా ఉండడమే మంచిది.

## 15.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో సమాధానం రాయండి.**

1. రచనలో విరామ చిహ్నాల ఆవశ్యకత ఏమిటి?
2. కామా, సెమికోలన్‌ల విషయంలో తేడాలు, సమానతలు ఉదాహరణలతో చర్చించండి?

**II కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి**

1. ప్రశ్నార్థక చిహ్నం వాడవలసిన సందర్భాలు ఏమిటో వివరించండి?
2. కథన సూచిక లెన్ని విధాలు? వాటిని ఉపయోగించే సందర్భాలేమిటి?

BRAOU

# భాగం : 16 శైలి: విశేష పదాలు, మాండలికత

**విషయ క్రమం**


16.0 ఉద్దేశం

16.1 ప్రవేశిక

16.2 భాషా వైవిధ్యం

16.2.1 విశేష పదాలు

16.2.2 మాండలికత

**అభ్యాసం –1**

16.3 శైలి, రీతి

16.3.1 విషయ ప్రాధాన్యత, ఉక్తి ప్రాధాన్యత

16.3.2 పదాలు, వ్యాకరణం

**అభ్యాసం –2**

16.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 16.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు:

- భాషా వైవిధ్యం
- శైలికి, రీతికి ఉన్న తేడా

## 16.1 ప్రవేశిక

ప్రసార సాధనాల్లో తెలుగు నవీకరణ చర్చలో మీరు రచనా భాష గురించి తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా పదాలకు భావనలకు ఉండే సంబంధం గురించి, వాక్య ప్రయోగ విధానం గురించి, విరామ చిహ్నాల గురించి తెలుసుకున్నారు. ఈ భాగంలో శైలి గురించి ముఖ్యంగా విశేష పదాలు, మాండలికత గురించి తెలుసుకుంటారు.

## 16.2 భాషా వైవిధ్యం

భాష మానవ జాతికున్న సంక్లిష్ట సంఘీ భావానికి ఆధారమైనది. అంతే గాక చరిత్ర సంస్కృతులకు కూడా ఈ భాషే ఆధారం. ఒకే భాష మాట్లాడే వాళ్ళ భాషలో గూడ ప్రాంతాలను బట్టి, సాంఘిక వర్గాలను బట్టి, వృత్తులను బట్టి, దృక్పథాలను బట్టి తేడాలు కన్పిస్తాయి. ఈ ఉపభాగంలో ఈ వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

భాషలో సమాజ పరమైన వైవిధ్యాన్ని తీరు అని, ప్రాంతీయ పరమైన వైవిధ్యాన్ని మాండలికత అని అందాం. కొందరు ఈ రెండు రకాల వైవిధ్యాన్ని సామాజిక మాండలికత, ప్రాంతీయ మాండలికత అని వ్యవహరిస్తారు.

వృత్తులను బట్టి ఏర్పడే వైవిధ్యాన్ని శైలి అందాం. అలాగే వక్తకు శ్రోత పట్ల గాని విషయం పట్ల గాని ఉన్న దృక్పథం వల్ల ఏర్పడే వైవిధ్యాన్ని రీతి అందాం. మాండలికత, తీరు వక్తను ఆధారం చేసుకొని ఏర్పడ్డ వైవిధ్యాలు. శైలి, రీతి భాష ఉపయోగాన్ని బట్టి ఏర్పడ్డ వైవిధ్యాలు.

### 16.2.1 విశేష పదాలు

ఒక్కొక్క శైలి, రీతి ననుసరించి విశేష పదాలు ఉపయోగిస్తాం. రెండవ భాగంలో ప్రత్యేక పదాలు అన్న శీర్షిక కింద విశేష పదాల గురించి ప్రస్తావించడం జరిగింది. ఇప్పుడు కాస్త వివరంగా చర్చించుకుందాం.

మనం ఏ విషయం గురించి మాట్లాడుతామో దానిని బట్టి మన మాటల్లో కొన్ని ప్రత్యేకమైన పదాలు, కొన్ని వ్యాకరణ రూపాలు ఎక్కువగా వాడడం జరుగుతుంది. అంతే కాదు, శైలిని బట్టి ఒక్కొక్క సారి ఒకే పదానికి విభిన్న అర్థాలు ఉండవచ్చు. ఉదాహరణకు 'పరివర్తన' అన్న పదాన్ని తీసుకుందాం. సాధారణంగా మనం మాట్లాడుకునే టప్పుడు దాని అర్థం కేవలం 'మార్పు'. భాషా శాస్త్రంలో పరివర్తనా వ్యాకరణ (Transformational Grammer) సిద్ధాంతం ప్రకారం గుప్త నిర్మాణం (Deep structure) నుంచి వ్యక్త నిర్మాణం (Surface structure) గా రూపొందడం పరివర్తన. ఇక్కడ ఇది 'మార్పు' గాదు 'పరిణామం'. జ్యోతిష్య శాస్త్రజ్ఞులు 'పరివర్తన'ను ఒక ప్రత్యేక అర్థంలో వాడతారు. వాళ్ళు తమ జాతక చక్రాల్లో ఒక్కొక్క ఇంటికి (రాశికి) ఒక్కొక్క గ్రహాన్ని అధినేతగా చేస్తారు. ఆ అధినేతలు ఒకరి ఇళ్ళలో ఒకరు ఉండడాన్ని 'పరివర్తన' అంటారు. ఈ మూడు అర్థాల్లో ఉన్న వైవిధ్యంతో పాటు కొంతవరకు సాదృశ్యం లేకపోలేదు. అది ఉండబట్టే దానిని ఒకే పదంగా పరిగణిస్తున్నాం. ఇంకొక ఉదాహరణ 'సమత' అనే దానికి సాహిత్య శాస్త్రంలో ఒక (సాహిత్య) గుణం చెప్తారు. సాధారణ వాడుకలో దాని అర్థం 'సామాజిక ఆర్థిక సమానత'. అలాగే 'రసం', 'ధ్వని', 'వక్రత' మొదలైన పదాలు సాహిత్య శాస్త్రంలో ప్రత్యేక అర్థాలతో విశేషపదాలుగా పరిగణింపబడతాయి.

BRAOU

సినిమా పంపిణీ దార్లు మనం ఫిల్మ్ అని, సినిమా అని అంటున్నట్లే 'బొమ్మ' అనే పదాన్ని వాడతారు. సాధారణ వాడుకలో బొమ్మకు సినిమా అనే అర్థం లేదు. ఈ విధంగా ప్రతి వృత్తి మీద ఆధారిత భాషలో విశేషపదాలు ఎదురౌతాయి. మరికొన్ని వివరాలు 16.3లో చూద్దాం.

### 16.2.2 మాండలికత

పైన ప్రస్తావించిన సామాజిక, ప్రాంతీయ వైవిధ్యాల గురించి ఇప్పుడు వివరంగా పరిశీలిద్దాం. ప్రాంతీయ మాండలికాలను పరిశీలించినప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను ఎనిమిది ప్రాంతాలుగా విభజించవచ్చు.

(అ) నెల్లూరు, ప్రకాశం జిల్లాలు

(ఆ) కృష్ణా, గుంటూరు జిల్లాలు          సర్కారు జిల్లాలు

(ఇ) పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు

(ఈ) విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు

(ఉ) జంట నగరాలు

(ఊ) ఉత్తర తెలంగాణా జిల్లాలు

(ఎ) దక్షిణ తెలంగాణా జిల్లాలు

(ఏ) రాయలసీమ

ఏదో స్థూలంగా ఎనిమిది ప్రాంతాలన్నాం గాని సూక్ష్మంగా పరిశీలిస్తే ఇంకా చాలా ఉప ప్రాంతాలను గుర్తించవలసి రావచ్చు. మనం ప్రాంతీయ వైవిధ్యాన్ని పదాలలోనూ, వ్యాకరణంలోనూ గమనించవచ్చు. నెల్లూరు జిల్లాలోనూ, కొంతవరకు ప్రకాశం జిల్లాలోనూ ఈ కింది వాక్యం మనం వినవచ్చు:

(1) ఈ హోటల్లో కాఫీ బాగుండవు

కాని కృష్ణా జిల్లాలో గాని, మిగతా ఉత్తర జిల్లాల్లో గాని అదే వాక్యాన్ని కాస్త తేడాతో వింటాం:

(2) ఈ హోటల్లో కాఫీ బాగుండదు

(1)వ వాక్యంలో కాఫీకి బహువచన క్రియాన్వయం. (2)వ వాక్యంలో ఏకవచన క్రియాన్వయం ఉండడం విదితమే గదా. ఈ రెండింటిలో ఏది ప్రామాణికం అన్నది వేరే ప్రశ్న.

నెల్లూరు జిల్లాలో గాని, తెలంగాణా ప్రాంతంలో గాని 'బర్రె' అనే మాట వాడకంలో ఉంటే రాయలసీమలో 'యెనుము' సర్కారు జిల్లాల్లో 'గేదె' అనే మాటలు వాడుకలో ఉన్న సంగతి మనకు తెలుసు. అలాగే తెలంగాణాలో వాడబడే 'పుంటికూర' లోను, మిగతా చోట్ల వినబడే 'గోంగూర' లో ఉన్న వైవిధ్యం పదగతమే గాని పదార్థగతం కాదు.

'ఉండు' క్రియా రూపాల విషయంలో సర్కారు ప్రాంత వాడుకకు, మిగతా ప్రాంతాల వాడుకకు చాలా ముఖ్యమైన తేడా ఉంది. కింది వాక్యాలను గమనించండి:

(3) నేను నిన్న బొంబాయిలో ఉన్నాను

ఉణ్ణాను

ఉండినాను

ఉంటిని

(4) ఈ రోజు హైదరాబాదులో ఉన్నాను.

ఒకటవ వాక్యంలో ఉన్న భూత కాలం, రెండవ వాక్యంలో ఉన్న వర్తమాన కాలం ఒకటి గానే (ఉన్నాను) చూపించే వాడుక సర్కారు ప్రాంతీయతకు చిహ్నం. అలా కాకుండా విభిన్న రూపాలను వాడడం మిగతా ప్రాంతీయ మాండలికాల్లో గమనించవచ్చు.

మాండలికాలను అపహసించే ధోరణి అనుచితమైనది. 'పిల్చుకు రావడం' అనే మాటకు బదులు 'తీసుకురావడం', 'తోలుకు రావడం' అనే మాటలు మాండలికాల్లో వినిపిస్తాయి. తీసుకురావడానికి వస్తువా, తోలుకు రావడానికి పశువా అని పరిహసించడం భాష ప్రకృతి గురించి జ్ఞానం లేదని నిరూపించుకోవడమే. అలాగే తెలంగాణా తెలుగులో ఉర్దూ

BRAOU

పదాలున్నాయని విమర్శించబోయ్యే ముందు సర్కారు వాడుకలో ఇంగ్లీషు పదాలు (మేష్టారు మొదలగునవి) మార్పుతోనో, మారకుండానో ఎక్కువ గాను, కొన్ని ఉర్దూ పదాలు గూడ ఉన్నాయని మరచిపోకూడదు.

(5) నిన్న ఇంజను చాలా ట్రబులిచ్చిందండీ.

(6) వాడు తనకన్నా పెద్దవాళ్ళను కూడ దబాయిస్తాడు.

(7) పెత్తనం చలాయించమంటే రెడీ, పని చెయ్యమంటే కష్టం.

(8) పార్టీ ఫిరాయింపనేది కొత్త సమస్యేమీ గాదు

(9) అతనికిచ్చే మామూలు ఇవ్వకపోతే ఏ నిర్ణయమూ అమలు చెయ్యడు.

ఇప్పుడు సామాజిక మాండలికత (తీరు) గురించి చర్చిద్దాం. 'కూడు', 'అన్నం', 'బువ్వ', 'వణ్ణం' అనే మాటలు ఒకే అర్థంలో వాడతారన్నది తెలిసిందే గదా! 'వణ్ణం' ఉదాహరణకు ఒకే కులానికి చెందిన ఐదారు కుటుంబాలకు పరిమితం. 'బువ్వ' అనేది పిల్లలకు అన్నం పెట్టేటప్పుడు ఎక్కువగా వినిపించినా అన్య సందర్భాలలో వాడతారు. పెండిండ్ల సందర్భాల్లో 'హరిబువ్వం', 'బువ్వబంతి' అనే పదబంధాలు వినిపిస్తాయి. ఇక్కడ అది 'శైలి' కి సంబంధించిన వైవిధ్యం. 'కూడు' అనే మాట కొన్ని కుటుంబాలకు సర్వ సాధారణమైనదిగా వినిపించినా, కొందరికది వ్యంగ్య ధోరణిని సూచిస్తుంది. కొందరు ఎక్కడ, అక్కడ, ఇక్కడకు బదులు యాడ, ఆడ, ఈడ అని వాడతారు. ఇది 'తీరు' (సామాజిక మాండలికత) కు సంబంధించిన వైవిధ్యం.

**అభ్యాసం -1**

కింది వాక్యాల్లోని ముఖ్య పదాలు పదబంధాలు ఏ శైలికి సంబంధించినవో తెలియజెయ్యండి.

(భాషా శాస్త్ర శైలి, సాహిత్య విమర్శ శైలి, పరిపాలన శైలి)

1) మనలో మనం సంప్రదించుకోవడానికి ఒక నిర్ణీత పద్ధతిలో వాడుకునే శబ్ద రూప విధానమే భాష.

2) కౌన్సిలు చేసిన నిర్ణయాలను అమలు పరిచేందుకు ప్రతి పురపాలక సంఘంలో ఒక కార్యనిర్వాహక విభాగం ఉంటుంది.

3) భావకవులు ఆశు వాఙ్మయంలోని ఛందో రీతులు తీసుకున్నా వారు రాసింది భావకవిత్వమే.

BRAOU

## 16.3 శైలి, రీతి

శైలికీ, రీతికీ ఉన్న భేదాలను పైన చర్చించాము. ఇక్కడ ఇంకా కొన్ని వివరాలు చూద్దాం. అంతేగాక శైలికీ, రీతికీ ఉన్న సారూప్యత కూడా చూద్దాం.

### 16.3.1 విషయ ప్రాధాన్యత, ఉక్తి ప్రాధాన్యత

మనం మాట్లాడేటప్పుడు అటు విషయానికీ , ఇటు మాట్లాడే పద్ధతికీ రెంటికీ ప్రాధాన్యత ఇస్తాం. మాట్లాడే పద్ధతిని ఉక్తి అందాం. కింది ఉదాహరణలోని విషయాన్ని, ఉక్తిని గమనించండి.

(10) ఆధునికతలో భాగస్వాములుగా, భావకవులకి గురజాడతో సమాన ధర్మం వుంది. ఉభయులూ సాంప్రదాయక సాహిత్యంపై తిరుగుబాటు చేస్తున్నవారే. ఆ కారణం చేత భావకవులు గురజాడలో తమ వాణ్ణి చూశారు. కాని గురజాడ మార్గమే కొనసాగివుంటే నిజానికి భావ కవితాదశ తెలుగు సాహిత్యంలో ఉండేది కాదు.

(నారాయణ రావు 1978: 8)

(10) విషయ గతంగా చూస్తే సాహిత్యానికి సంబంధించిన రచన భావకవులు, సాంప్రదాయిక సాహిత్యం, భావ కవితాదశ, తెలుగు సాహిత్యం మొదలైన పదబంధాలు సాహిత్య శైలికి సంబంధించినవి. ఇవి సాహిత్య భావనను వ్యక్తం చేస్తున్నవి కనుక ఇవి సాహిత్య శైలిలో భాగాలన్నాం. 'వుంది', 'వుండేది' 'తమవాణ్ణి' 'వుంటే' మొదలైన పదాలను గమనిస్తే 'ఉక్తి' దృష్ట్యా ఇది 'వ్యావహారిక రీతి' కి చెందిన రచనగా స్వీకరిస్తాం గాని గ్రాంథిక రీతిగా స్వీకరించం. గ్రాంథిక రీతిలో 'యుండిరి', 'యుండెడిది', తమ వానివి' 'యుండిన' మొదలైన ప్రయోగాలు కన్పించేవి.

కొందరు రచయితలు ఇక్కడ వాడిన 'రీతి' కి శైలి అనే పదాన్నే వాడతారు. 'సాహిత్యశైలి' అనే మాటను సాహిత్య విషయాన్ని సాహితీ భాషలో వ్యక్తీకరించిన రచనకు వాడడం సహజం. కొన్ని చోట్ల 'కల్పన' అనే మాటకు 'ఊహ' అనే మాట వాడవచ్చు. 'కల్పన' సాహితీ భాషకు చెందగా 'ఊహ' సాధారణ భాషకో, మనో వైజ్ఞానిక భాషకో చెందవచ్చు. అలాగే గ్రాంథిక శైలి, వ్యావహారిక శైలి అంటారు. నిర్దుష్టంగా రాయదల్చుకొన్న వాళ్ళు శైలి, రీతి అనే పదాలను భిన్న భావాలకు వాడడం మంచిది.

BRAOU

### 16.3.2 పదాలు, వ్యాకరణం

మాండలికం తీరు, శైలి, రీతి అన్న భాషా వైవిధ్యం ఉచ్చారణలోను, పదాలవాడుకలోను, వ్యాకరణ ప్రయోగాల్లోను వ్యక్తమౌతుంది. ఉచ్చారణ విషయంలోనే 'పస' అనే మాట వాడతాం. పత్రికల భాష గురించి ఆలోచించేటప్పుడు మనకు ముఖ్యంగా శీర్షికలు గుర్తొస్తాయి. వీటిలో క్రియారహిత వాక్యాలు ఎక్కువగా కనిపించడం సహజం. ఉదాహరణకు

(11) సడలిన నిషేధంతో పెరిగిన నక్సలైట్ల ప్రాబల్యం (జమీన్ రైతు 21.7.1995)

''నక్సలైట్లపై'' నిషేధం సడలించారు. అందువల్ల వాళ్ళ ప్రాబల్యం పెరిగింది ''అనే రెండు వాక్యాల భావనను నామబంధాలలో కుదించడం ఈ శీర్షికలో జరిగిన పని. అలాంటివి కింది శీర్షికలు:

(12) ఆర్‌టిసి అమ్మకానికి తెరచాటు ప్రయత్నం (జమీన్ రైతు 21.7.1995)

(13) ఏ సందు చూసినా పందులు, కుక్కలు, నిలువునా రక్తం తాగేస్తున్న దోమలు!

(నెల్లూరు పాలిటిక్స్ 15.1.95)

(14) మాదాల జానకిరాం 'కాంగీ' సమైక్యతారాగం (నెల్లూరు పాలిటిక్స్ 15.1.95)

(15) ఇక ఇంటివద్దకే చౌక బియ్యం (ఈనాడు 19.11.1995)

కొన్ని చోట్ల మనకు 'కలశైలి' ( శైలి మిశ్రణం) సందర్భాలు కన్పిస్తాయి. ఈనాడు దినపత్రికలో 'టూకీగా' అన్న శీర్షిక కింద సాహిత్య శైలి పత్రికా శైలి కలిసి కనిపిస్తాయి.

(16) పేరు వేరొక టింటియె గాక
పందెము చందములన్నియు
నొక్కటెగదా – అంటున్నారీ
సంగతి విన్న వాళ్ళు (ఈనాడు 19.11.95)

(17) పగలు పందుల విహారం
రాత్రి దోమల సంగీతం
ప్రతి సందులో శునక సమూహం
వీటి మధ్యనే పౌరుల సహజీవనం

గూడూరులో పట్టణంలో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను హడలుగొడ్తున్నాయి.

(నెల్లూరు పాలిటిక్స్, 15.4.95)

సాహిత్య శోభ వెదజల్లే భాగం చాలామందికి ఒక పట్టాన అంతు బట్టకపోవచ్చు. దినపత్రికల్లో ఇలాంటి కలశైలి అవసరమా, అసమంజసమా అన్నది ఇక్కడ చర్చనీయాంశం గాదు.

**అభ్యాసం –2**

కింద ఇచ్చిన ఉదాహరణలో గ్రాంధిక వ్యావహారిక రీతులను కలిపి వాడడం జరిగింది. వాటిని గుర్తించి ఏకశైలికి మార్చండి:

''అయితే, వచనం అంత కన్నను గాఢమైన స్థానము పొందినది. పూర్వపు కవిత్వంలో''

## 16.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- భాషలో చాలా వైవిధ్యం ఉంది. ప్రాంతీయమైన వైవిధ్యాన్ని మాండలికం అనీ, వ్యక్తుల్ని బట్టి ఏర్పడే వైవిధ్యాన్ని శైలీ వైవిధ్యమనీ పేర్కొనవచ్చు.
- శైలిని బట్టి ఒక్కొక్కసారి ఒకే పదానికి భిన్నమైన అర్థాలు వస్తాయి.
- మాండలికాలను అపహసించే ధోరణి చాలా అనుచితమైంది.

BRAOU

- శైలికి రీతికి తేడాలున్నట్లే సారూప్యత కూడా ఉంది.

- పత్రికల్లో శైలీ మిశ్రమం జరిగే సందర్భాలను మనం సులభంగా గుర్తించవచ్చు.

## 16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో సమాధానాలు రాయండి.**

1. భాష – భాషా వైవిధ్యం గురించి రాయండి?

2. వృత్తి మీద ఆధారపడే భాషారూపాలు ఎలా ఉంటాయో వివరించండి?

**II. కింది ప్రశ్నలకు పదిహేను పంక్తులలో జవాబు రాయండి**

1. రీతి తీరు గురించి వివరంగా చర్చించండి.

2. మాండలికత గురించి ఉదాహరణలతో వివరంగా రాయండి.

BRAOU

# భాగం : 17 పత్రికా భాషలో మార్పులు 'జమీన్ రైతు' భాష పరిశీలన (ప్రత్యేక అధ్యయనం)

**విషయ క్రమం**


17.0 ఉద్దేశం

17.1 ప్రవేశిక

17.2 పత్రికల భాష

**అభ్యాసం - 1**

17.3 జమీన్ రైతు

**అభ్యాసం - 2**

17.4 ఐదు దశాబ్దాలలో భాషలో మార్పులు

17.4.1 తొలి రిపోర్టింగ్, చివరి వ్రాత

17.4.2 ఇంకా కొన్ని ఉదాహరణలు

17.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

17.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 17.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- ఏదైనా ఒక అంశాన్ని ప్రత్యేక అధ్యయనానికి ఎన్నుకొన్నప్పుడు ఏం చేయాలో తెలుసుకుంటారు.

## 17.1 ప్రవేశిక

ముందుగా చదివిన భాగాల్లో భావనలు పద కల్పనల గురించి తెలుసుకున్నారు. అలాగే వాక్య ప్రయోగ విధానం, విరామ చిహ్నాలు, శైలి, రీతి, మాండలికతలు గురించి తెలుసుకున్నారు. ఈ భాగంలో ఒకే పత్రికలో దశాబ్దాల వెంబడి భాష ఏ విధంగా మారుతుందో పరిశోధనా దృక్పథంతో పరిశీలిద్దాం.

## 17.2 పత్రికల భాష

పత్రికలలో వాడే భాషలో మాండలికాల ప్రభావం కన్పిస్తుంది. అలాగే రీతి, తీరు, శైలుల ప్రభావం కన్పిస్తుంది. రచయిత కాలం, ఆదర్శాలు, వయస్సు, విద్యాస్థాయి మొదలయినవన్నీ రచనల్లో కన్పిస్తాయి. పదజాలం వాడుకలోనూ, వ్యాకరణ స్వరూపంలోనూ సంధి నిర్మాణం లోనూ, పరిభాషా పదాల వాడుకలోనూ పత్రికల జీవన స్రవంతిలోనూ తేడాలొస్తాయి. ఇవన్నీ ఇప్పుడు జమీన్ రైతు అనే వారపత్రికలో ఎలా కన్పిస్తున్నాయో పరిశీలిద్దాం.

**అభ్యాసం - 1**

భాషలో తేడాలను ఎలా గుర్తిస్తాం?

## 17.3 జమీన్ రైతు

నెల్లూరు జిల్లా పోట్లపూరి గ్రామ కాపురస్తుడు శ్రీ నెల్లూరు బసివి నాయుడు గారు విద్యాభిమాని, పద్యాభిమాని, భాషాభిమాని. తన గ్రామంలో వివేకానంద గ్రంథాలయాన్ని స్థాపించిన దీర్ఘదర్శి. ఆయన కుమారుడు నెల్లూరు వెంకట్రామ నాయుడు 1930లో నెల్లూరులో జమీన్ రైతు ప్రారంభించారు. బ్రిటిషు పాలనకు, జమీందారులకు వ్యతిరేకంగా జరిగింది నాటి సంపాదకీయ సరళి.

శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి గారు తన తండ్రి తదనంతరం సంపాదక బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శ్రీ నెల్లూరు ప్రసాద్ సంపాదక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నిరంకుశత్వాన్ని, సంకుచిత భావాలను, మోసాలను వ్యతిరేకించడం జమీన్ రైతుకున్న ప్రత్యేక పంథా. నెల్లూరు ప్రజలకు, నెల్లూరు మాండలికానికి కుల మత ప్రమేయాలు లేకుండా సేవ చేసే పత్రిక ఇది. ఈ పత్రికలో వాడే భాషలో అక్కడక్కడ సాహిత్య సొంపులు కనిపించినా సహజత్వం చెడకుండా ఉండడం, అందరికీ బోధపడేటట్లు ఉండడం విశేషం.

**అభ్యాసం -2**

జమీన్ రైతులో కనిపించే మాండలికం ఏమిటి?

BRAOU

## 17.4 ఐదు దశాబ్దాలలో భాషలో మార్పు

1993 జూలై 19న దివంగతుడైన శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తిగారు 1925 అక్టోబరు 17న జన్మించారు. 1946 జూలై 6వ తేదీ సంచికలో 'తొలి రిపోర్టింగ్' చేశారు. 1993 మే 21వ తేదీ సంచికలో 'చివరి వ్రాత'. ఈ మధ్యలో ఉన్న అంతరం 47 సంవత్సరాలు. శ్రీరామమూర్తి గారి తొలి, తుది రచనలలోని భాగాలను మొదట చదివి తర్వాత తులనాత్మక అధ్యయనం చేద్దాం. ఈ రెండు కూడా జమీన్ రైతు 23.7.1993 వెలువడిన జమీన్ రైతు శ్రీరామమూర్తి స్మారకానుబంధం-1లో ప్రచురించబడ్డాయి.

### 17.4.1 తొలి రిపోర్టింగ్, చివరి వ్రాత

**మంత్రి భక్తవత్సలం పర్యటన - కండ్లేరు**

కండ్లేరు వంతెన ప్రారంభోత్సవం - కనుపూరు కాల్వ ఆద్యంతాల దర్శనం - వెంకటాచర సత్రం వద్ద కనుపూరు కాల్వ రైతుల సభ, నెల్లూరు పౌరుల సభ, ఇవీ కార్యక్రమాలు..

''నన్ను మంత్రిగా గాక కాంగ్రెస్ వాదిగానే ప్రజలు గౌరవిస్తున్నారని నా నమ్మకం. ఈ మంత్రి పదవులలో వుండీ రానున్న అంతిమ స్వాతంత్ర్య పోరాట విజయ సాధనకు చేయదగిన కృషినంతా చేస్తాము.

ప్రజలలో ప్రజ్వలమైన నూతనోత్సాహము, తమ ప్రభుత్వం పట్ల వారు చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయం.

- మంత్రి భక్తవత్సలం

1946 జూలై 6వ తేదీ సంచికలో శ్రీరామ మూర్తి గారు జమీన్ రైతుకు చేసిన తొలి రిపోర్టింగ్ ఇది, అక్షరాభ్యాసంలోనే ఆయన కలం ఎన్ని పోయగాలు తిరిగిందో చూడండి :

వంతెన వద్ద చక్కని పందిలి నిర్మించి, ఖద్దరు - అలంకరణాల మర్చబడినవి. ఆ తాలూకాలో ముఖ్య రైతాంగమే గాక, మైకా గనుల సంబంధీకులు గూడా వచ్చారు.

ఉదయం 9 గంటలకు వస్తాడనుకొన్న మంత్రి 12 గంటలకు గాని రాలేక పోయాడు. ఉదయం లేచి 107 మైళ్ళు రావద్దా మరి.

ప్రథమంలో బాలుడు పి. వెంకటేశ్వర్లు ప్రార్థన చేశాడు. కాంగ్రేసు గీతావళితో కరవు భీతావళితో తర్వాత రాళ్ళు గుండ్లు దూకిస్తూ మహాభీకర వేగంతో ప్రవహించు కండ్లేటి నదీమతల్లింబోలె వేప కొమ్మ వారి కవితా స్రవంతిని, మన కామరాజు గడ్డ దుష్యంతుడు సంగీతంతో ఆలపించాడు మధుర రసోల్బణంగా.

మంత్రిగారు లాంఛన ప్రాయమైన త్రాడు దెంపి ప్రవేశోత్సవం జరిపిరి. తర్వాత ఛుంజనీరు గారు బ్రిడ్జి రూపనామ క్రియల స్వరూప నివేదిక తడవినంతట మంత్రిగారు యి విధంగా ఉపన్యసించిరి.

"యీ వంతెన యిది వరకు షైపన్ ప్రణాళికతో ప్రారంభమైంది. యుద్ధకాలం వల్ల వంతెన నిర్మాణం వెనుకబడ్డది. దీని అంచనా 12 వేలయినా దాదాపు 66,300 రూపాయలు యుద్ధకాలపు వస్తువుల ప్రియం వల్ల వెచ్చింపబడ్డది. వంతెన పని ఆలశ్యంగావడం గూడా ఒక శుభసూచకమే అయింది. ఏమంటే 44 సం. ప్రవాహాల వల్ల యింజనీర్లకు యేర్పడిన నూతన అనుభవముల వల్ల ఈ వంతెనకు మొదట - 13 గండ్లు అంచనాకు బదులు యిప్పుడు 18 గండ్లు పెట్టి పెంచవలసి వచ్చింది. యీ రహదారి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మైకా పరిశ్రమ రాక పోకలకు అత్యంతోపకారి కాగలదు. ఒక ప్రక్క కంట్రాక్టర్లు ప్రజాసేవను మరచి, ప్రజోపయోగ కార్యాలకు కంట్రాక్టు తీసుకొని స్వార్థపరత్వంతో అధిక లాభాలను సంపాయిస్తుంటే ఇంత పెద్ద వంతెనను - శ్రమకోర్చి స్వార్థం లేకుండా ప్రజా సేవ ప్రధానోద్దేశముగా పెట్టుకొని పని జేసిన అక్కిన వెంకయ్యకు, సాయపడ్డ ఇంజనీర్ వర్గానికి నా ధన్యవాదాలు.

అక్కిన వెంకయ్య గారు జవాబు చెప్తూ తన శ్రమను, జరిగిన కార్యకలాపాన్ని వివరంగా నివేదించి మంత్రిగారికి, వచ్చిన పెద్దలకు ధన్యవాదాలర్పించారు.

చివరి వ్రాత

## పినాకినీ తీరం (శీర్షిక)

BRAOU

జిల్లా రాజకీయాలు, ఇతర సమస్యల పట్ల తన భావాలను పినాకినీ తీరం శీర్షికలో నిర్మొగమాటంగా, నిర్భీతిగా వ్యక్తం చేసే వారు శ్రీ రామమూర్తి గారు. జమీన్ రైతు చేతికందగానే పినాకినీ తీరం చదవడం ఎందరో పాఠకులకలవాటు. ఆయన చివరిసారిగా కోవూరు ఎన్నికల ఫలితంపై వ్రాసినదిది. (1993 మే 21వ తేదీ సంచిక) ఆ తర్వాత అనారోగ్యం కారణంతో పత్రికకు ఏదీ వ్రాయలేక పోయారు.

<u>ఏమవుతుందో !</u>

ఈ పత్రిక పాఠకుల చేతికందగానే, కోవూరు ఎన్నిక ఫలితం చెవిన పడిపోతుంది. అటువంటప్పుడు ఏమవుతుందో అని ఆదుర్దాగా వ్రాయడం వ్యర్థం గదూ! కలం వుబలాటం అటువంటిది; ఏమి చేయమంటారు!

నలుగురిలో ఎవరో ఒకరు గెలవాలి. ఆ ఒకరు ఎవరు? ఆ రహస్యాన్ని బ్యాలెట్ బాక్సులు భద్రంగా దాచివున్నాయి. శుక్రవారం సాయంత్రానికి బయట పెట్టేస్తాయి. పొట్ట వుబ్బరం - అంత ఓపిక పట్టేదెట్లా?

పోలింగు పూర్తయి తిరిగి వచ్చిన వారి నుండి బుధవారం సాయంత్రం కబుర్లు వింటూంటే తియ్యగా నోరూరింది. అటువంటిది గురువారం ఉదయానికల్లా నీరు గారడం మొదలైంది. సాయంత్రానికి నిరాశ మిగిలింది. గెల్చే వారి సంబరం, ఓడే వారి అవమాన విచారాలు వుండనే ఉంటాయి. శుక్రవారం సాయంత్రం ఏం కబుర్లు తెస్తుందోని టెన్షన్‌తో మనలను తినేస్తుంది? తప్పదు.

నలుగురు పోటీలో వుండి ఈ ఎన్నికల వలె వూహాకందని పరిస్థితి నెలకొన్న ఎన్నిక మన జిల్లాల్లో వున్నట్లు నా స్మృతికి రావడం లేదు. మజరాల్లో కాలనీలతో సహా ప్రతి గ్రామాన్ని ప్రతి ఇంటిని, ప్రతి

ఓటరును ఇంతగా ముట్టడింపబడిన ఎన్నికల కూడా కనపడడం లేదు. నాయకులు, కార్యకర్తలు, నిష్పాక్షిక పోలింగుకు జరిగిన కఠినమైన ఏర్పాట్లు ఎంత ముఖ్యులనైనా విలదీయు గలిగిన అధికార్ల నిర్భీక వర్తన, వాగ్దానాల జల్లు, ధన ప్రవాహం, పసికట్టడానికి బ్రహ్మతరం కూడా కాని ఓటరు మహాశయుల నిగూఢ గంభీర మనోగతం ఒక్కటేమిటి, అన్ని విషయాల్లో ఇంత భారీగా కేంద్రీకృతంగా, గుంభనంగా జరిగిన ఉప ఎన్నికల గూడా ఎరుగము. ఈ ఎన్నికల ఫలితం నిజమైన ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా తీసుకోదగివుంటుందేమో!

బిజెపికి ఆశ లేదు; ఎంత నీలిగినా సిపిఎంకు గెలిచే అవకాశం లేదు. ఇక మిగిలింది కాంగ్రెస్, తెలుగుదేశాలు. కాంగ్రెస్ అభ్యర్థి పాతవాడు. పెద్దవాడు. పెద్ద పదవిలో వున్నవాడు. దేశ ప్రధాని అంతటి ప్రధానుని అభిమాన ఆశీర్వాదాలున్నవాడు. సమైక్యమైన పార్టీయే కాకుండా, మాటకు ఎదురు లేని మాగుంట సుబ్బరామరెడ్డి గారి అండగలిగిన వాడు కొరతలేని వాడు; తెలుగు దేశం అభ్యర్థి యువకుడు పరాయి ప్రాంతం వాడు, ప్రత్యక్ష రాజకీయాలకు కొత్త వాడు, తండ్రి పేరు – తల్లి సానుభూతి – పార్టీ సర్వస్వపు అండ, మార్గదర్శకత్వం గలవాడు. సహజంగా అయితే కాంగ్రెస్ అభ్యర్థి బలసమోహితుడు. విజయఢంకా మ్రోగించవలసిన వాడు. తెలుగుదేశం అభ్యర్థి బలహీనుడు. గెలుస్తానని ధైర్యంగా చెప్పలేని బలహీనుడు. రేపు ఫలితం ఎట్లా వుండబోతుంది? సహజంగానా, అసహజంగానా ? ఎటు జరిగినా ఆశ్చర్యం లేదు; అటువంటి అయోమయ స్థితి.

..........

1946లో చేసిన మొదటి రచనలో భాషాపరంగా శ్రీరామమూర్తి గారింకా వ్యవహారికశైలిని పూర్తిగా మొదలు పెట్ట లేదని తెలుస్తుంది. గ్రాంధిక శైలితో కలిపి వాడిన కల శైలి కన్పిస్తుంది.

| | |
|---|---|
| అలంకరణాలమర్చబడినవి | రాలేకపోయారు. |
| నదీమ తల్లిం బోలె | ప్రార్థన జేశాడు |
| మధుర రసోల్బణంగా | ధన్యవాదాలర్పించారు |
| త్రాడు దెంపి జరిపిరి | ప్రకటించారు |

పినాకినీతీరం శీర్షిక కింద రాసింది 'చివరి వ్రాత'. ఈ రచనలో వ్యావహారిక శైలి స్పష్టంగా గోచరిస్తుంది. అంతేగాక 1946లో లేని విరామ చిహ్నాల ప్రయోగం కన్పిస్తుంది. అంతేగాకుండా ఈ రచన కొంతవరకు సంభాషణ పద్ధతిలో జరుగుతుంది . ఇది రిపోర్టింగ్ కాకపోవడం, వ్యక్తిగత శీర్షిక కావడం గూడ గమనించాల్సిన విషయం.

### 17.4.2 ఇంకా కొన్ని ఉదాహరణలు

జమీన్ రైతులో దాదాపు 50 సంవత్సరాల క్రితం వాడిన భాషను ఇప్పటి భాషను పోలిస్తే పైన కన్పించిన తేడాలే కన్పిస్తాయి. ఇక్కడ రిపోర్టర్లు వేరే, వేరే అన్న సంగతి గమనించాలి. ఇప్పుడు కొన్ని ఉదాహరణలను చూద్దాం.

(1) '' ఓ కమ్యూనిస్టు పార్టీమ తల్లీ; ఈ నాటికి నీకెంత అధోగతి దాపరించిందమ్మా! జాతీయతా మహావృక్షానికెంతో అండగా నుండిన నీవు నేడు బండగా మారినావు.

BRAOU

''చెట్టు చెడేటప్పటికి కుక్కమూతి పిందెలు పుట్టిన''ట్లు ఈ కమ్యూనిస్టు మహావృక్షానికి తెగులు దాపరించింది. ఈశ్వరేచ్ఛ!! (13.8.1943)

ఇక్కడ కథన సూచిక ద్వయాన్ని సంధి మధ్యలో వాడడం గమనార్హం. ఈ సూచికలు వాడక పోయినా ఏమీ నష్టముండక పోయేది. కింది పద్యములో కనిపించే సాహిత్య సొంపును గమనించండి.

(2) యుద్ధ పురాణం

''లావొక్కింతయు లేదు, ధైర్యము
　　విలోలంబయ్యె, రష్యన్లచే
చావా తప్పదు, వేరు
　　మార్గమిక లేదీ విశ్వమందెన్నగా
నీదే తప్పు యితః పరం బెరుగ
　　మన్నింప పదగున్ మా ప్రజన్
రావే 'టోజో' కావవే
　　'జర్మనిన్' రక్షించు 'పొట్టాంగకా''
　　పొట్టి + అంగకా = పొట్టంగకా　　హిట్లర్ (13.8.48)

జపానీయులకు 'పొట్టంగకా' అని పేరివ్వడం మళ్లీ ''పొట్ట + అంగకా'' అనుకోకుండా ''పొట్టి + అంగకా'' అని స్పష్టం చెయ్యడం ముఖ్యమైన విషయాలు.

(3) '' శ్రీ వేణుగోపాలస్వామి కాలేజీ భవన నిర్మాణాలు ప్రారంభమైనాయి. ఎ.సి.నగర్ అవతల, దేవాలయం స్వంత స్థలంలో కోటి రూపాయల ఖర్చుతో కొత్త భవన సముదాయం నిర్మిస్తున్నారు – ఆనం వివేకానంద రెడ్డి భాగీరథ ప్రయత్న ఫలితమిది''. (13.8.1993)

1993 వార్తలో మనకు వ్యావహారిక భాష పట్టును స్పష్టం చేస్తుంది.

(4) ''ఆంధ్ర సభా రాణిగారైన సినిమా తార శ్రీ సుబ్రహ్మణ్య కుమారీ దేవి గారికి జన్మస్థలమైన జన్నవాడ పురమున ప్రాచీన సుప్రసిద్ధ చారిత్రాత్మకమైన దేవాలయంబొండు గలదు. అదే జొన్నవాడ కామాక్షీ తాయికి నిలయమైన పినాకినీ పుణ్య తీరాన దివ్యాలయం'' (27.8.1943)

ఈ ఉదాహరణలోని గ్రాంథిక భాష కేవలం 'ఒండు' లాంటి పదంలోనే గాకుండా మొదటి వాక్యపు సంక్లిష్టతలో గూడా కన్పిస్తోంది.

(5) ''స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేవీలు, వసతి లేకున్నా విద్యను అభ్యసించాలనే ఆకాంక్షను వదలు కోలేని వారి కోసం ప్రత్యామ్నాయ పద్ధతులలో చదువు నేర్పించే ప్రయత్నాలు ప్రాచీన కాలం నుంచి వున్నాయి. దీనిని దూరపు విద్యావిధానం అంటారు.'' (జి. హనుమంత రావు 27.8.1993)

జమీన్ రైతులో అప్పుడూ, ఇప్పుడూ నిర్మొహమాటంగా హాస్య ధోరణిలో రాయడం పరిపాటి:

(6) జిల్లా బోర్డు మీటింగు మహోత్స వాహ్వాన పత్రిక

ఆర్యా,

మార్గశిర శుద్ధ విదిత సోమవారమునకు సరియగు 29.11.43 తేదీ సాయంత్రం

3 గం.లకు 'బత్తాల' లగ్న పుష్కరాంశమున హెచ్చు ధరకు కొన్న జిల్లా బోర్డు భవనమున జిల్లా బోర్డు మీటింగు మహోత్సవం జరుగును. సభ్యులెల్లరు విచ్చేసి అధ్యక్షుల వారి యిష్ట ప్రకారం తలలాడించి, బత్తాల సత్కారమును స్వీకరించి, తమకు ప్రభుత్వం వారు అనుమతించిన దినభత్యాలు వగయిరాల హెచ్చించు తీర్మానము పట్ల తమ అవ్యాజానురాగమును కనుపరచి, ప్రజాభ్యుదయ కార్యాలయం పట్ల తమ సహజ ఉదాసీన భావమును వెల్లడించి, కళ్లు మూసుకొని తీర్మానములకు తల ఎగరవేసి అధ్యక్షులను ఆనందింప జేయవలెనని కోరుచున్నాను.

ఇట్లు
భవదీయ
'జమీన్ రైతు'

తమ రాకకెదురుజూచు -
- మిలిటరి హోటల్ రామమూర్తి
- కోమల విలాస్ నారాయణ నాయర్
- కిల్లీ దుకాణం పణీకర్ (26.11.1943)

ఆహార సదుపాయాల గురించి బత్తాల గురించి, అవ్యాజానురాగ ఉదాసీన భావాల గురించి, 'బత్తాల లగ్నం గురించి ప్రస్తావించడం కాకుండా తెలుగు పంచాగపు ప్రకారం చూచే తిథులను ప్రస్తావిస్తూ సభ్యులను ఎత్తి పొడవడం ఇక్కడ గమనించవలసిన విషయం. అదే వ్యంగ్య ధోరణి కన్పిస్తుంది ఇంకొక వార్తలో

(7) ''తంతే బూరెల బుట్టలో పడ్డట్టుంది జిల్లాలో బ్రాందీ షాపు యజమానుల అదృష్టం. సారా నిషేధం వారి పాలిట కనకాభిషేకంగా మారింది. ఒక్కసారిగా ప్రభుత్వ సారా దుకాణాలన్నీ మూతపడడంతో మందు ప్రియులకు ఇప్పుడు బ్రాందీ అంగళ్ళే దిక్కు'' (26.11.1993)

ఒక్కొక్కసారి మనకు పాతకాలపు వార్తలు ఆశ్చర్యకరమైన సంగతులు తెలియజేస్తాయి. 1944 నాటి కింది వార్తలోని విషయం, భాష రెండూ గమనించండి.

(8) ''ఘనత వహించిన గవర్నరు శ్రీమాన్ హోప్ దొరగారు సపత్నీకంగా విచ్చేసి స్వస్తిశ్రీ తారణ, చైత్ర బహుళ విదియ సోమవారము స్వాతీ నక్షత్ర యుక్త పుష్కరాంశమున అంటే ఏప్రిలు 10వ తేదీన యీరస్తా ప్రారంభోత్సవమును తన బంగారు క్రైస్తవ హస్తంతో జరిపి హిందూ దేముణ్ణి హిందూ మతాన్ని పునీతం జేసి చరితార్థుడైనాడు. అంతేగాదు తన స్వంత కారులో గవర్నరు వధూవరులు కొత్త రోడ్డు మీద కొండమీద దేముని సన్నిధికి ప్రథమ యాత్ర జేసి దేవుని మన్ననలందారు. వీరు తలనీలాలివ్వలేదు. పంగ నామాలు బెట్టలేదు. తొలిసి పూసలు ధరించలేదు. డబ్బిచ్చి ఫలాని పని చేయించుకోలేదు, కాని భక్త కోటిలో మాత్రం జమ పడ్డారు.'' (14.4.1994)

(9) ''ఇందుకూరు పేట ఖాదర్ బేబి అను ముస్లిం యువతి ఆర్య సమాజం ద్వారా సుమతిగా మారి, వైశ్యశ్రీ పులిచి సుబ్రహ్మణ్య గారిని 20వ తేదీ వివాహమాడెను'' (27.4.1945)

పాత కాలపు వార్తలు కుల, మత ప్రస్తావన ఏ అన్యార్థం లేకుండా సమాచారం కోసం మాత్రమే వేసేవాళ్ళు.



BRAOU

(10) ''రెడ్డి మహాసభ రెడ్డి మహాసభ, సిల్వర్ జూబిలీ మహోత్సవం సెప్టెంబరు 9, 10 తేదీ లందు నెల్లూరులో బ్రహ్మాండముగా జరుప నిర్ణయించినట్లు సిమ్లా నుండి మా రాచకీయ విలేకరి వ్రాస్తున్నాడు. గద్వాల మహారాణి, వనపర్తి రాజా, మునగాల జమీందారు, కట్టమంచి వైస్ చాన్సులరు మున్నగు రెడ్డి ప్రకాండులు వస్తారట. ఆ రాత్రి కవికోకిల దువ్వూరు రామిరెడ్డిగారి మీరాబాయి నాటకాన్ని ప్రదర్శిస్తారనీ కూడా తెలుస్తుంది. ఈ సందర్భంలో మన జ్ఞాపక బ్రహ్మ అన్నారెడ్డి బలరామిరెడ్డి గారిని గూడా తగిన విధంగా పరీక్షించి, ఉచిత విధంగా సన్మానించడం గూడా అవసరమని మా మనవి'' (3.8.1945)

(11) ''పెద్దచెరుకూరు కరణం శ్రీ కంతం సుబ్బరామయ్యగారి వద్ద రెండు తెల్ల యెద్దులు ఎక్కడివో తెప్పించుకొని వచ్చినవున్నవట. కరణీకం లెక్క నేర్చుకోవడానికి వచ్చినవి కాబోలు''. (11.5.1945)

(12) ''స్త్రీ రోగులను పరీక్షించడంలో ఎవరో ఒక ఆయుర్వేద డాక్టరు బేవకూఫీ పనిజేస్తున్నాడని గంగ పట్నాన్నుండి ఒకరు వ్రాస్తున్నారు. తంత్రిగా దేవతగా వుండవలసిన వైద్యులు అసభ్యంగా ప్రవర్తించడం ఆ వృత్తికే తలవంపులు'' (18.5.1945)

బేవకూఫీ లాంటి ఉర్దూ పదాలతో చెప్పదలచుకున్న దాన్ని సున్నితంగా చెప్పడం ఇక్కడ విశేషం.

(13) ''కొందరు యువకులు గల్బా చేయడంలో చాలాముందు కొస్తున్నందుకు విచారం. మనకు సభ్యత తెలియదని పరాయివారు నవ్వి పోతారేమోనని నా బెంగ? అది ప్రాగల్భ్యమని మన మనుకుంటే, అది అరసికత అని పరాయి వారనుకొంటున్నారు. (18.5.1945)

పిల్లకాయలు అనే పదం నెల్లూరులో, రాయలసీమలో మనకు సాధారణంగా వినిపించేమాట.

(14) ''పొగతోట పిల్లకాయలకు, కాపు వీధి - కామాటి వీధి చిన్న కాయలకు యీ మధ్య కొంచెం ప్రణయ కలహం! 22 రాత్రి 10 గంటల ప్రాంతంలో పొగతోట మీద బడి దారిన పొయ్యే వారినంతా దరిచారు. కొందరికి తలలు పగిలినవి'' (27.7.1945)

నెల్లూరు మాండలికాన్ని చక్కగా పోషించిన పత్రిక జమీన్ రైతు.

(15) 'మీ పేనా తీసుకోండి. 13.8.45 తేదీ నెల్లూరు పెద్ద పోస్టాఫీసు వద్ద వుత్తరం వ్రాసి కునేందుకు నాకు పేనాలిచ్చి మరచి వెళ్ళారు. ఆ పేనాను టవున్ పోలీసు స్టేషనులో యిచ్చివచ్చాను. వెళ్ళి తీసుకోండి. దాని వాళ్లు'' (24.8.1945)

నెల్లూరుకు ముందున్న పేరు విక్రమ సింహపురి. అప్పుడప్పుడు ఆ పేరు వాడడం జరుగుతుంది.

(16) ''విక్రమ సింహపురిలో ఆంధ్రకేసరి గర్జన... తూములూరు శివరామయ్య గారింట్లో బస చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు బయలు దేరి 1923లో ఆయనచే ప్రాథమిక పాఠశాలగా ప్రారంభింపబడి, యీనాడు హైస్కూలై వర్ధిల్లుచున్న శ్రీ కస్తూరి దేవి బాలికల హైస్కూలును, అనాథ శిశు శరణాలయమును సందర్శించి, న్యాయవాదుల సన్మానం, విద్యార్థుల సన్మానం, వర్తకుల, వర్తక గుమాస్తాల సన్మానాలను హోటలు యజమానుల టీపార్టీ, విద్యార్థి కాంగ్రెస్ సన్మానం అన్నీ పూర్తి చేసుకొని సాయంత్రం టౌన్ హాలులో జరిగిన జిల్లా కాంగ్రెస్ అసెంబ్లీ కార్యవర్గంతో 'భావ కార్యక్రమం గురించి సూచన లొసంగిన మీదట, టౌను హాలు ఆవరణలోనే బ్రహ్మాండమైన బహిరంగ సభలో నేటి రాజకీయ పరిస్థితులపై ఉపన్యసించారు. ఆ సభకు శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య గారు అధ్యక్షత వహించారు.''

(31.8.1945)

పైన మనం చర్చించుకొన్న సాహిత్యపు సొంపుకు ఇంకొక మచ్చు తునక:



BRAOU

(17) ''జిల్లా బోర్డు సెంట్రల్ మెడికల్ స్టోరుకు డాక్టరుగా అక్కాపంతుల కొండయ్య గారిని నియోగించారు. మహితజ్ఞాన యశంబున మంచుకొండ ప్రదిత వైద్య గుణంబున పసిడి కొండ కొండయా మాత్యుడనగ అల్పుండె చెపుమా.

అధ్యక్షా! మహాశయా! తమరెంత ప్రజ్ఞా చక్షువులండి!'' (19.10.1945)

## 17.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- కాలక్రమంలో భాష ఎలా మారుతూ వస్తుందో ఒక పత్రికను పరిశీలించినపుడు గమనించవచ్చు.
- జమీన్ రైతు అనే వారపత్రికలో భాషా స్వరూపం మారుతూ రావటాన్ని గుర్తించవచ్చు. 1946లో 'తొలి రిపోర్టింగ్' ను 1993లో 'చివరి వ్రాత' ను తులనాత్మక అధ్యయనం చేస్తే ఈ విషయమే తెలుస్తుంది.
- జమీన్ రైతులోనే మరికొన్ని ఉదాహరణలను పరిశీలించడం ద్వారా భాష ఎలా క్రమంగా మారుతూ వచ్చిందో గుర్తించగలిగాం.

## 17.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. జమీన్ రైతు పత్రిక ఆధారంగా భాషలో కాలక్రమంలో వచ్చే మార్పులను ఎలా గుర్తించారు?
2. జమీన్ రైతులో వాడిన కొన్ని శీర్షికలు, ఉపశీర్షికలను కింద యిస్తున్నాం. వాటి గురించి మీ వ్యాఖ్య ఏమిటో రాయండి.

   (i) తెలుగు ముప్పు ముంచు కొస్తూంది (25.11.1994)

   (ii) పసుపు చీకటి
   ఇది తెలుగు గాలి కాదు – తుఫానే (9.12.1994)

   (iii) తెలుగు సైకిల్ బరస్ట్ (25.8.1995)

ఇక్కడ వాడిన 'రంగు' 'భాష' శబ్దాలను గమనించండి. అంతేగాక ముప్పు ముంచుకొస్తుంది. చీకటి, తుఫాను అన్న పదాలు పత్రికకున్న అభిప్రాయాలను ఏ విధంగా ప్రస్ఫుటం చేస్తుందో గమనించండి. 'సైకిల్ బరస్ట్' ను ఎంత చక్కగా దేనికి వాడుకున్నారో గమనించండి.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. పత్రికల భాషలో స్వరూపాన్ని ఏఏ అంశాల కింద గుర్తించవచ్చు.?
2. నెల్లూరు జిల్లా రాజకీయ నాయకుడు శ్రీ ఆనం వెంకట రెడ్డి గారు 5.6.1995న కన్ను మూశారు. 9.6.1995 పత్రికలో ముఖ్య శీర్షికను అధ్యయనం చేసి పత్రికా సంపాదకుని దృక్పథమేమిటో వివరించండి.

   తలవంచని రాజకీయయోధుడు ఆనం వెంకట రెడ్డి!
   ఆనం వంశంలో ఒక శకం సమాప్తం!
   ఎప్పుడూ ఎవర్నీ అనుసరించలేదు.
   ఎప్పుడూ ఎవరికీ భయపడలేదు.



BRAOU

# ఖండం 4 అనువాద సమస్యలు

ప్రసార సాధనాలలో అనువాదం అవశ్యకత రోజురోజుకీ పెరుగుతోంది. అనువాద విధానాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయడం వల్ల అనువాద ప్రక్రియ పట్ల ఒక సమగ్ర అవగాహన ఏర్పడుతుంది. ఇది అనువాదంలో సామర్థ్యం పెంపుకు దోహదం చేస్తుంది కూడా. కేవలం సిద్ధాంతాల పరిచయం మాత్రమే కాకుండా ఉదాహరణల వివరణ ద్వారా ఈ విషయాలను మరింత సులువుగా గ్రహించగలుగుతాం. ప్రత్యేక అధ్యయనం కింద ఇచ్చిన సమాచారం అలాంటి ప్రయోజనాన్ని ఉద్దేశించిందే. ఈ ఖండంలో అయిదు భాగాలున్నాయి. అవి:

18. అనువాదం: నిర్వచనాలు, సిద్ధాంతాలు, పద్ధతులు.

19. అనువాదం: భాషా సాంస్కృతిక సమస్యలు.

20. వైజ్ఞానిక సాహిత్య న్యాయ మత తాత్విక పత్రికా రచనలు: అనువాదం, అనువర్తన.

21. విశేష వార్తలు, అనువాద సమస్యలు.

22. భిన్నరంగాల్లో అనువాదం (ప్రత్యేక అధ్యయనం).

BRAOU

BRAOU

# భాగం : 18 అనువాదం: నిర్వచనాలు, సిద్ధాంతాలు, పద్ధతులు

**విషయ క్రమం**


18.0 ఉద్దేశం

18.1 ప్రవేశిక

18.2 అనువాదం – నిర్వచనాలు

**అభ్యాసం -1**

18.3 అనువాద సిద్ధాంతాలు

18.3.1 శైలీ ప్రధానానువాద సిద్ధాంతాలు (Philological theories of translations)

18.3.2 భాషా ప్రధానానువాద సిద్ధాంతాలు (Linguistic theories of translation)

18.3.3 సామాజిక భాషానువాద సిద్ధాంతాలు (Sociolinguistic theories of translation)

18.4 అనువాద పద్ధతులు

18.4.1 పద పదానువాదం

18.4.2 మూలభాషా విధేయానువాదం

18.4.3 మూల భావ విధేయానువాదం

18.4.4 అర్థానువాదం

18.4.5 అనుసరణం

18.4.6 సమాచారానువాదం

**అభ్యాసం -2**

18.5 అనువాదకుని లక్షణాలు

**అభ్యాసం - 3**

18.6 అనువాదంలో కొన్ని మెలకువలు


BRAOU

BRAOU

18.7 యంత్రానువాదం

**అభ్యాసం – 4**

18.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

18.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 18.0 ఉద్దేశం

ఈ భాగాన్ని చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు గ్రహించగలుగుతారు:

- అనువాదం అంటే ఏమిటో తెలుసుకోగలుగుతారు.
- అనువాదానికి వివిధ పండితులచే ప్రతిపాదింపబడిన నిర్వచనాలను విశ్లేషించగలుగుతారు.
- అనువాద శాస్త్రంలో రూపొందించిన సిద్ధాంతాలను , అనువాదంలో ఆచరిస్తున్న పద్ధతులను గూర్చి తెలుసుకోగలుగుతారు.
- అనువాదంలో అనుసరించవలసిన కొన్ని మెళకువలను గుర్తించగలుగుతారు.

BRAOU

## 18.1 ప్రేశిక

విజ్ఞానసాహిత్యాలు సార్వజనీనమైనవి. మానవజాతి గమనానికి ఉపకరించే ఏ గ్రంథమైనా దేశ, భాషా భేదాలతో నిమిత్తం లేకుం సర్వత్రా, సర్వకాలాలందూ హర్షింపబడుతూ ఆదరించబడుతుంది. మానవుని మేధాసంపత్తి మరింత వికసించి, అభివృద్ధి చెందాలంటే తన చుట్టూ ఉన్న సమాజంలోనే కాకుండా, ఇతర దేశాలలో శాస్త్రీయ, సాంకేతిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో జరుగుతున్న కృషి పట్ల ఆసక్తి, అవగాహన చాల అవసరం. ముఖ్యంగా త్వరిత గతిన మారుతున్న ఆధునిక యుగంలో సమాచార వినిమయం (exchange of information) అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

కాని ప్రపంచంలో వివిధ భాషలు, విభిన్న జాతులు ఉన్నాయి. ఇన్ని రకాల భాషలను నేర్చుకొని వాటిలో వివిధ రంగాలలో సాధిస్తున్న జ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడం ఏ ఒక్క వ్యక్తికీ సాధ్యమైన పని కాదు. అందుచేత అనువాదం ద్వారా ప్రతి వ్యక్తీ తనకి ఆసక్తి ఉన్న రంగంలో వివిధ దేశాలలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, జరుగుతున్న పరిశోధనా ఫలితాల వివరాల గురించి తెలుసుకోగలుగుతాడు. తద్వారా ఆ రంగంలో తన పరిజ్ఞానాన్ని పెంచుకొని, నూతన ఆలోచనల వైపు మళ్ళడానికి అవకాశం కేవలం అనువాదం ద్వారానే కలుగుతుంది. నేటి ఎలక్ట్రానిక్ యుగంలో అనువాదాల ఆవశ్యకత మరింత అధికమైంది. ఉదాహరణకు నేడు ఆంగ్లంనుంచి చేయబడుతున్న అనువాదాలు కేవలం శాస్త్రీయ – సాంస్కృతిక గ్రంథాలకే పరిమితం కాకుండా, పత్రికల్లో వెలువడే వ్యాపార ప్రకటనలు సైతం తెలుగులోకి అనువదించబడుతున్నాయి. అనువాదం ప్రాముఖ్యం, పాత్ర మన నిత్య జీవితంలో ఎంతగా పెరిగిందో వేరే చెప్పనవసరం లేదు.

అనువాదాలు పూర్వకాలంనుంచీ ఉన్నా, ఆధునిక యుగంలో, ఇది శాస్త్రంగా రూపొందింది. ఆంగ్లంలో Theory of Translation అనీ, Translation Theory అనీ, Translation Studies అనీ అంటున్నారు. తెలుగులో ఇది అనువాద సిద్ధాంతంగా, అనువాద పరిశోధనగా ప్రాచు[illegible] ఉంది. అనువాద సిద్ధాంతం లేక అనువాద శాస్త్రం అంటే వివిధ అనువాదాలను విశ్లేషించడం ద్వారా అనువాద ప్రక్రియలో (Translation process) అనుసరిస్తున్న పద్ధతులనూ, మెళకువలనూ శాస్త్రీయ దృక్పథంతో వివరించడంతో పాటు, సరియైన అనువాదానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తూ, నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించడం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని, అనేక మంది అనువాద శాస్త్రవేత్తలు (Scientists of translation) వివిధ రకాలుగా అనువాదాన్ని నిర్వచించారు. ఇక్కడ చెప్పుకోవలసిన మరొక విషయమేమిటంటే, అనువాదంలో ఎదురయ్యే వివిధ సమస్యల వివరణకు, పరిష్కారానికి అనువాద సిద్ధాంతం వివిధ శాస్త్రాల, అంటే, సాహిత్య, భాషా, మనస్తత్వ, కంప్యూటర్ మొదలైన న శాస్త్రాల సహాయం తీసుకుంటుంది.

## 18.2 అనువాదం - నిర్వచనాలు

అనువాదం శాస్త్రీయ, సాంకేతిక, సాహిత్య పరిజ్ఞాన అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పైన చెప్పుకున్నాం. అయితే అసలు ఇంతకీ అనువాదం అంటే ఏమిటి? క్లుప్తంగా చెప్పమంటే ఒక భాషలోని ఏదైనా గ్రంథాన్ని (Text) వేరే భాషలో చెప్పడమే అనువాదం. ఏ భాష నుండి అనువదిస్తామో, దానిని మూల భాష అనీ (source language), ఏ భాషలోకి అనువదిస్తామో, దానిని ఆధార భాష అనీ లేక లక్ష్య భాష అనీ (target language, receptor language) పిలుస్తారు. అనువాద క్రియను నిర్వర్తించే వ్యక్తిని అనువాదకుడు అంటారు. తెలుగులోకి ఎక్కువ అనువాదాలు ఆంగ్ల భాషనుంచే జరుగుతాయి. అందువలన మనకు ఆంగ్లం మూల భాషా, తెలుగు ఆ[illegible]భాషా అవుతుంది. అలాగే అనువాదకుడు ఏదైనా గ్రంథాన్ని మూలభాషనుంచి ఆదాన భాషలోకి లిఖిత పూర్వంగా చేస్తే[illegible] దుబాసీ (interpreter) కేవలం వాగ్రూపంలో (oral) మాత్రమే చెపుతాడు. అయితే మూల భాష [illegible]డి ఆదాన భాషలోకి అనువదించేటప్పుడు, ఆదాన భాషా వ్యాకరణ సూత్రాల కనుగుణంగా, మూల గ్రంథ[illegible]న అర్థాన్ని సాధ్యమైనంత వరకూ కోల్పోకుండా ఆదాన భాషలో చెప్పాలి. ఇక్కడే అనువాదకుని నైపుణ్యం తెలుస్తుం[illegible]ందువలననే అనువాదానికి రెండు రకాల స్వభావాలు ఉన్నాయని ప్రముఖ సిద్ధాంత వేత్త నైడా చెప్పారు. వీటిలో [illegible]టిది, మూల భాషలో విషయాన్ని ఆకళింపు చేసుకోవడం (decoding), ఇక రెండవది, అర్థం చేసుకున్న విషయ[illegible] తిరిగి ఆదాన భాషలో చెప్పడం (recoding) ఈ విషయాన్ని ఆయన ఈ క్రింది పటంలో చూపెట్టారు:




పటం-1 నైడా ప్రతిపాదించిన అనువాద ప్రక్రి

అయితే అనువాద వ్యాపారం (translation activity) సృజనాత్మకమైనదా కాదా అనే ప్రశ్న ఉదయిస్తుంది. అట్లాగే ఆదాన, లక్ష్య భావనలకి సంబంధించి, ఏఏ సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది? ఈ సమస్యలు కేవలం భాషా పరమైనవేనా లేక ఇంకేమైనా ఉన్నాయా? ఇటువంటి వివిధ ప్రశ్నలకు అనువాద వేత్తలు అనేక రకాలుగా సమాధానమిచ్చారు.

పండితులు అనువాదానికి వివిధ నిర్వచనాలు ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యమైనవి చూద్దాం. అనువాదాన్ని మూలభాషనుంచి ''పున సృజన'' (reproducing) (Nida, 1947, 76) '' ప్రత్యామ్నాయం/ ఆదేశం (substituting / replacement) ''మార్పిడి'' (transfer) (Brislin, 1976:1) ''పరివర్తనం'' (conversion) (Tweney & Hoemann, 1976: 138), తెలియజేయడం (rendering) (Newmark, 1988:5). కాని ఒక భాషనుంచి మరొక భాషలోకి దీనిని తెలియజేయడం అనే అంశం మీద విషయం (message) (Nida), గ్రంథం (Text) (Catford), ఆలోచనలు/ భావాలు (Thoughts/ ideas) (Brislin), పదాలు/ అర్థాలు అనీ చెప్పారు.

అనువాదం అంటే కేవలం ఏదైనా గ్రంథాన్ని ఒక భాషనుంచి వేరొక భాషలోకి మార్చి చెప్పడం అనుకుంటే అనువాద క్రియ సమాజంతో సంబంధం లేని ఒక శాస్త్రీయ వ్యాపారంగా (Scientific activity) మిగిలిపోతుందని బాపూజీ (Bapuji, 1993) అభిప్రాయ పడ్డారు. ఆయన దృష్టిలో ఏ అనువాదం యొక్క ప్రభావమైనా ఇటు మూల గ్రంథకర్త, అనువాదకులతో బాటు, అటు సమాజంపై కూడా పూర్తిగా ఉంటుంది. అందువలన అనువాదం నిర్వచనానికి సామాజిక అర్థాన్ని (social meaning) జోడించాలని ఆయన ప్రతిపాదించారు. అందువలన, బాపూజీ ప్రకారం అనువాదమంటే ఒక సామాజిక దశలో కొన్ని వర్గాలు లేక కొంత మంది వ్యక్తులచే రూపొందించబడిన లక్ష్యాలను సాధించడం కోసం లక్ష్య భాష నుండి ఆదాన భాషకు గ్రంథాన్ని మార్చి చెప్పే సామాజికంగా అర్థవంతమైన క్రియ. ఆయన అనువాద చరిత్రను వర్గ దృక్పథంతో విశ్లేషించి ఏఏ అనువాదాలు ఆయా సామాజిక పరిస్థితులలో ఏ వర్గం యొక్క లక్ష్యాలను కాపాడినాయో సవివరంగా చూపించారు.

నిర్వచనాలు ఏవైనా, పదజాలం ఏదైనా, దాదాపు అందరూ అనువాదంలో అనుసరించవలసిన పద్ధతులపైనా, మెళకువలపైనా, సూత్రాలపైనా తమ పరిశోధనలను సాగించారు. వీరి నిరంతర కృషి ఫలితంగానే అను వాద పరిశోధన అనే నూతన శాస్త్రం ఆవిర్భవించింది. సిద్ధాంతం, అనువర్తన, ఆచరణ – ఇవన్నీ అనువాద పరిశోధనా పరిధిలోకి వస్తాయి.

BRAOU

కొన్ని శాస్త్రా లలో లాగా కాకుండా, అనువాదంలో సిద్ధాంతం, ఆచరణ కలిసి మసలుతూ వుంటాయి. ఎందువలనంటే అనువాద సిద్ధాంతం (లేక అనువాద శాస్త్రం) వివిధ అనువాదాలను పరిశీలించి, విశ్లేషించిన పిమ్మట రూపొందింపబడింది. కాబట్టి ముఖ్యంగా దీనిలో ఈ రెండూ విడదీయరానివి. అంటే గ్రంథకర్త – గ్రంథం – చదువరి (పఠిత) అనువాదకుడు – గ్రంథం – చదువరి (పఠిత)

ఇక చివరిగా ఏ అనువాదమైనా ఒక ఆవిష్కరణ లాంటిది. ఎందుకంటే కొత్త ప్రజలు, కొత్త సాహిత్యాన్ని, కొత్త సంస్కృతిని, కొత్త పరిజ్ఞానాన్ని అనువాదం ద్వారా పొందవచ్చు.

**అభ్యాసం – 1**

అనువాదం అంటే ఏమిటో నిర్వచించండి.

## 18.3 అనువాద సిద్ధాంతాలు

అనువాద సిద్ధాంత అభివృద్ధిలో సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా ఈ అంశాలు పరిశీలించబడ్డాయి: (1) అనువదనీయత పరిధి (Limits of translatability) (2) అనువాద పరిణామం (Evolution of translation) (3) అనువాదం - ఒక కళగా, శాస్త్రంగా, కౌశల్యంగా (Translation as an art, science and skill).

అనువాద ప్రక్రియలో భాష ప్రధాన పాత్ర వహిస్తుంది. కాబట్టి సామాన్యంగా అనువాద సిద్ధాంతాలన్నీ భాషాపరమైన (Lingustic) విగా భావిస్తూ ఉంటారు. కాని అనువాద సూత్రాలనూ, విధానాలనూ తయారు చేయడానికి మూడు రకాల మార్గాలున్నాయి. ఒక వేళ అనువాదం ఏదైనా ఒక ప్రత్యేకమైన గ్రంథాలమీదైతే (ముఖ్యంగా సాహిత్య సంబంధమైన) దానిని శైలీ ప్రధాన అనువాదం (Philological translation) అంటాం. అలా కాకుండా భాషలోని రూపం మరియు భావన (form and content)లో గల సారూప్యంపై అంటే లక్ష్య, ఆదాన భాషల లోని నిర్మాణ భేదాలపై అయితే, దానిని భాషాపరమైన అనువాదం (Linguistic translation) అనవచ్చు. ఇక చివరిగా అనువాదం నిజమైన సమాచార ప్రక్రియ (actual communication process)లో భాగమైనట్లైతే, దానిని సామాజిక భాషా పరమైన అనువాదంగా (Sociolinguistic translation) పిలువవచ్చును.

### 18.3.1 శైలీ ప్రధానానువాద సిద్ధాంతాలు (Philological theories of translation)

BRAOU

ఇవి ప్రధానంగా సాహిత్య గ్రంథాల అనువాదాలు. ఈ అనువాదాలు సాధారణంగా శైలీ ప్రధానమైన సాహిత్య విశ్లేషణ పై ఆధారపడి ఉంటాయి. కాకపోతే సాహిత్య గ్రంథం రూపాన్ని కాకుండా ఒక్క అడుగు ముందుకు వెళ్ళి లక్ష్య, ఆదాన భాషలో ఉన్న నిర్మాణాలను (Structures) విశ్లేషించి, వాటి మధ్యగల సామ్యాలను వెలికి తీయడానికి ప్రయత్నిస్తాయి. సిద్ధాంతాలన్నీ గ్రంథాలలోని శైలీ లక్షణాలను (Stylistic features), అలంకారిక లక్షణాలను (Rhetorical devices) పరిశీలిస్తాయి. అలాగే ఇవి అంతర్నిర్మాణాలను (deep structures) కూడా పరిశీలిస్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు అను వాద సిద్ధాంతాన్ని రూపొందించడానికి జరిగిన ప్రయత్నాలన్నీ శైలీ సాదృశ్యాల పరిశీలన మీదే ఆధారపడ్డాయి. మార్గదర్శక సూత్రాలన్నీ శైలీ ప్రధాన దృష్టి పై ఆధారపడ్డాయి.

### 18.3.2 భాషా ప్రధానానువాద సిద్ధాంతాలు (Linguistic theories of translation)

ఈ సిద్ధాంతాలు ముఖ్యంగా మూల, ఆదాన భాషా గ్రంథాలలోని భాషా నిర్మాణంపై ఆధారపడి ఉంటాయి. భాషా శాస్త్ర పరిశోధనలు ఇతర శాస్త్రాలలో ఉపయోగించడం వలనా, యంత్రానువాదం అభివృద్ధి చెందడం వలనా ఈ రకమైన అనువాద సిద్ధాంతాలు మొదలైనాయి. దీనితో పాటు అర్థం యొక్క ప్రకృతిని తెలుసుకోవడానికి భాషా శాస్త్రజ్ఞులు జరిపిన అవిరళ కృషి ఫలితంగా అనువాదం పట్ల భాషా పరమైన అవగాహన సాధ్యమైంది. లక్ష్య, ఆదాన భాషలను లోతుగా వివరించడానికీ, తద్వారా అనువాద పద్ధతులను మార్చడానికీ యంత్రానువాదం ఎంతగానో ఉపకరించింది. భాషా పరమైన అనువాద సిద్ధాంతాల మధ్య వ్యత్యాసం గుప్త వ్యక్త నిర్మాణాలను (surface structure and corresponding deep structureని) ఎంత లోతుగా పరిశీలిస్తాం అనే అంశంపై ఆధారపడి ఉంటాయి. అంటే ఉదాహరణకు "A" భాషలో కర్త. "B" నిర్మాణాలు (active constructions) సమానంగా 13 భాషల్లో కర్మణి (Passive constructions) నిర్మాణాలకు ఏ విధంగా సరిపోతాయి అనేది ఒక విచారణాంశం.

మూల నిర్మాణాలు (underlying structures) అనే భావన అనువాదంలో సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా

చాలా అవసరం. ప్రముఖ అమెరికన్ భాషా శాస్త్రజ్ఞులుఛామ్స్కీ ప్రతిపాదించిన పరివర్తన సిద్ధాంతం (Transformational theory) అనువాద సిద్ధాంత అభివృద్ధిలో ప్రముఖ పాత్ర నిర్వహించింది. దీనిలో ఉన్న కొన్ని లోపాలు అనువాద సిద్ధాంతంలోకి కూడా చొరబడ్డాయి. ఉదాహరణకు ప్రథమ దశలో పరివర్తన సిద్ధాంతం (Transformational theory) అర్థానికి తక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. అందువలన అనువాదకులు ఈ సిద్ధాంతాన్ని కొంత మేరకే అనువాదానికి అన్వయించగలిగారు. ఆ తరువాత పరివర్తన సిద్ధాంతం ideal speaker and hearer పై ఆధారపడి తయారు చేయబడింది కాని అనువాదకుని దృష్టిలో అటువంటి వాళ్ళు లేరు. ఎందుచేతనంటే అనువాదకుడు ఏ గ్రంథాన్నైనా అనువదించేది ప్రత్యేక పాఠకులని దృష్టిలో ఉంచుకునే.

### 18.3.3 సామాజిక భాషానువాద సిద్ధాంతాలు (Sociolinguistic theories of translation)

ఈ సిద్ధాంతాలు భాషా నిర్మాణాన్ని ఉపేక్షించకుండా భావ ప్రసారాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందింపబడినవి. ఎందుకంటే ఒక వ్యంగ్యాన్ని కాని (irony), అతిశయోక్తిని (hyperbole) గాని అనువదించేటప్పుడు భాషాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోనక్కర లేదు. ఇవి ఎక్కువగా భాషేతరాంశాలపై ఆధారపడి ఉంటాయి. ఈ సిద్ధాంతాలలో అనువాదకుడు భాషా ప్రయోగాన్నీ (Language performance) భాషా ప్రతిభనూ (Language competence) కూడా పరిగణనలోకి తీసుకుంటాడు. సామాజిక భాషాపరమైన సిద్ధాంతాలలో భావ ప్రసారం (Communication) ప్రధాన నమూనా. ఈ భావ ప్రసారం (కమ్యూనికేషన్)లో ఎటువంటి సంకేతాన్ని (code) ఉపయోగించుకొన్నారన్న విషయంపై ఇది ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. ఈ సంకేతాల నమూనాయే భాష. అనువాదం సమాచార సిద్ధాంతం (Information theory) యొక్క కొన్ని లక్షణాలను ప్రతిబింబిస్తుంది.

ఆచరణలో అనువాదం ఏ ఒక్క సిద్ధాంతానికీ లోబడి ఉండదు. ఏదైనా ఒక ప్రత్యేక చరిత్ర గలిగిన సాహిత్య గ్రంథాన్ని అనువదించేటప్పుడు, సాధారణంగా శైలీ ప్రాధాన్య దృష్టితో మొదలుపెడతారు. ఒక వేళ సాహిత్య గ్రంథం కాకుండా లక్ష్య ఆదాన భాషలకు తుల్య వ్యాకరణ, సాంస్కృతిక లక్షణాలు ఉంటే భాషా పరమైన పద్ధతిని అనుసరిస్తాడు. అలా కాకుండా భిన్న భాషలు, వేర్వేరు సంస్కృతులతో బాటు, గ్రంథం కష్టతరమైనది అయినప్పుడు, చదువరులు వివిధ కాలాలకు చెందిన వ్యక్తులు అయినప్పుడు సామాజిక భాషా పరమైన దృష్టితో ఆలోచిస్తాడు. కాబట్టి అన్నిటికంటె ముఖ్యమైంది ఈ అంశాలన్నీ పొందుపరిచే ఒక సమగ్ర అనువాద సిద్ధాంతం.

BRAOU

## 18.4 అనువాద పద్ధతులు

పూర్వకాలంనుంచీ మూల భాషా విధేయానువాదం (Literal translation) చేయాలా లేక స్వేచ్ఛానువాదం (Free translation) చేయాలా అనే అంశంపై చర్చ సాగుతోంది. 19వ శతాబ్దం ముందు వరకూ ఎక్కువగా స్వేచ్ఛానువాదాన్నే ఎంచుకున్నారు. అంటే గ్రంథంలోని అర్థానికి ప్రాధాన్యం ఇచ్చారన్న మాట! అంతేగాని అనువాద లక్ష్యాన్ని గాని, ఉద్దిష్ట పాఠకుల్ని గాని, గ్రంథ స్వభావాన్ని గాని పరిగణనలోకి తీసుకోలేదు. కాని ఆధునిక యుగంలో విజ్ఞానం మరింత వేగంగా అభివృద్ధి చెందడం వలన అనువాదంలో వివిధ పద్ధతులను అవలంబిస్తున్నారు.

### 18.4.1 పదపదానువాదం (Word for word translation)

సాంస్కృతిక పదాలకు స్వతంత్రానువాదం చేస్తూ, మూల భాషలోని ప్రతిపదాన్ని లక్ష్య భాషలోకి అనువదించడం. ఈ విధమైన అనువాదం తుల్య లక్షణాలున్న (Typological featurs) భాషల మధ్య సాధ్యమౌతుంది. ఉదాహరణకు

ఆధునిక ప్రామాణిక ఆర్య, ద్రావిడ భాషలు భిన్న కుటుంబ భాషలైనా, వాటి మధ్య నిర్మాణ సామ్యాలున్నాయి. ఈ రెండు కుటుంబాల భాషలు సంయోగాత్మక భాషలు. వివిధ కారణాల వల్ల పరిణామ క్రమంలో లక్షణాత్మకంగా కొన్ని సామ్యాలు ఏర్పడ్డాయి. అందువలన ఈ భాషల మధ్య అనువాదం చేసేటప్పుడు, పదాలను బదలాయిస్తే (Substitution of words) చేస్తే చాలు.

### 18.4.2 మూల భాషా విధేయానువాదం (Literal translation)

మూల భాషలోని వ్యాకరణ నిర్మాణాలను (grammatical structures) లక్ష్య భాషలో వాటికి సమానమైన, అతి దగ్గరైన నిర్మాణాలతో మార్చడం, కొన్ని పదాలను ప్రకరణ (context) బద్ధుడై అనువదించడం.

### 18.4.3 మూల భావ విధేయానువాదం (Faithful translation)

లక్ష్య భాషా వ్యాకరణ సూత్రాలకు లోబడి మూలగ్రంథం యొక్క అర్థాన్ని చెప్పడం. అవసరమైతే సాంస్కృతిక పదాలను 'మార్చి' చెపుతూ, తద్వారా వ్యాకరణ పదనిర్మాణంలో వచ్చే 'అసాధారణత' ( abnormality)ను చూపుతుంది. ఇది మూలగ్రంథం పట్ల, గ్రంథకర్త పట్ల పూర్తి విధేయతను చూపుతుంది.

### 18.4.4 అర్థానువాదం (Semantic translation)

విధేయతానువాదానికి, అర్థానువాదానికి తేడా ఉంది. అర్థానువాదం మూలగ్రంథం యొక్క అందాన్ని, స్వభావాన్ని కాపాడుతుంది. సాంస్కృతికంగా తక్కువ ప్రాధాన్యత గలిగిన పదాలు సామాన్య పదాల ద్వారా అనువదించబడతాయి. భావ విధేయానువాదంలో మూల గ్రంథం పట్ల సంపూర్ణ విశ్వాసంతో అనువదిస్తే అర్థానువాదం వెసులుబాటుగా ఉంటూ, సృజనాత్మకంగా ఉంటుంది.

BRAOU

### 18.4.5 అనుసరణం (Adaptation)

ఇది అతి స్వేచ్ఛానువాద పద్ధతి. సాధారణంగా హాస్య నాటిక లాంటి ప్రక్రియల అనువాదానికి ఉపయోగపడుతుంది. ఇది నుడికార రక్షితానువాదం (Idiomatic translation). ఇది విషయాన్ని పూర్తిగా పునః స్థాపితం చేస్తుంది. కాని మూలగ్రంథంలోని పదాలూ లక్ష్య భాషలోని వాడుక పదాల (colloqualisms), నుడికారాల (idioms) ద్వారా అనువదించబడతాయి.

### 18.4.6 గ్రహణ సుకరానువాదం (Communications translation)

మూల గ్రంథం యొక్క రూపాన్ని, భావాన్ని లక్ష్య భాషలో పూర్తిగా ప్రతిబింబించేలా అనువాదం చేసే పద్ధతి. ఇది లక్ష్య భాషలో కూడా ఆమోదయోగ్యంగా ఉంటుంది.

ఈ అనువాద పద్ధతులన్నీ పరిశీలిస్తే, అర్థానువాదం నిర్దిష్టమైంది; భాషా సంబంధ మైందిగా భావించవచ్చు. గ్రహణసుకరానువాదం పొదుపైనది, పాఠకుని దృష్టిలో ఉంచుకుని చేసేది. అర్థానువాదం భావాత్మక (expressive) గ్రంథాలకు ఉపయోగపడితే, గ్రహణ సుకరానువాదం విషయాత్మక (informative) గ్రంథాలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

పైన పేర్కొన్న అనువాదాలు కాక సేవాత్మకానువాదం (service translation) (ఏదైనా వ్యక్తి యొక్క వాడుక భాషను అనువదించడం), విషయాత్మకానువాదం (Information translation) (సాహిత్య సంబంధం కాని గ్రంథంలోని మొత్తం విషయాన్ని తార్కికంగా క్లుప్తంగా వివరించడం), శాస్త్రీయానువాదం (Academic translation) (మూల గ్రంథాన్ని క్లుప్తంగా, అందంగా లక్ష్య భాషలో చెప్పడం) మొదలైన పద్ధతులు ప్రాచుర్యంలో ఉన్నాయి.

**అభ్యాసం - 2**

అనువాద పద్ధతుల్లో ఏది మేలైందో సహేతుకంగా తెలపండి.

## 18.5 అనువాదకుని లక్షణాలు

BRAOU

అనువాదం ఒక సృజనాత్మక క్రియ. ఇది యాంత్రికంగా చేసే పని కాదు. అనువాద క్రియ జరిగే విధానం, దానిలో ఎదురౌతున్న సమస్యలకు పరిష్కారం కనుగొనడం ద్వారా కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించడం అనువాద సిద్ధాంతం యొక్క ముఖ్యోద్దేశంగా పైన చెప్పుకున్నాం. ఈ సూత్రాలు సరియైన, ఖచ్చితమైన అనువాదం చేయడానికి తోడ్పడాలి. ఇది అంత తేలికైన పని కాదు. ఒక సవాలుతో కూడుకున్న ప్రక్రియ.

అనువాదకుడు అనువదించబోయే గ్రంథంలోని విషయాన్ని పూర్తిగా ఆకలింపు చేసుకోవాలి. లక్ష్య భాష క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. ఆదానభాష మాతృభాష అయితే మంచిది. ఎందువలనంటే ఏ వ్యక్తి అయినా, ముఖ్యంగా అనువాదకుని మాతృభాషలో ఉన్న పాండిత్యం ఇతర భాషలో సహజంగా ఉండదు. ఒకవేళ అలా కాకపోతే ఏ రెండు భాషలలోనైనా సమాన, సంపూర్ణ పాండిత్యం కలిగి ఉండాలి. మూల గ్రంథాన్ని లోతుగా, క్షుణ్ణంగా విశ్లేషించి పిమ్మట దానిని ఆదాన భాషలో వ్యక్తీకరించగలగాలి. మూల లేదా లక్ష్య భాషలోని వ్యాకరణ, అర్థానికి సంబంధించిన అంశాలను అవసరమైతే అయా పండితులతో చర్చించాలి. ఈ చర్చలు తన అనువాదానికి తోడ్పడతాయని తోచినట్లైతే సహృదయంతో వాటిని స్వీకరించాలి.

అనువాదకుడు ఇటు మూల భాషా గ్రంథం పట్లా, అటు ఆదాన భాషా గ్రంథం పట్ల సమాన దృష్టితో వ్యవహరించాలి. మూలగ్రంథం పట్ల విధేయతను చూపుతూనే అంటే దాని స్వరూపాన్ని కాపాడుతూనే, అనువదించిన గ్రంథం ఆ భాషలో చదవడానికి యోగ్యంగా ఉండేటట్లు చూడాలి. అంటే ఆదాన భాషా సంప్రదాయాన్ని ప్రతిబింబించేదిలా ఉండాలి. ఇది అత్యంత క్లిష్టతరమైన పని. ఎందుచేతనంటే అనువదించే గ్రంథ స్వరూపాన్ని మార్చడానికి వీలు లేదు. అట్లాగే ఆదాన భాషలో సృష్టించిన గ్రంథం ఎప్పుడూ విమర్శకు గురౌతుంది. దీనికి కారణం అనువదించిన గ్రంథాన్ని మూలగ్రంథంతో పోల్చడమే. సృష్టించిన గ్రంథం ఆదాన భాషలో అతి సులభంగా చదవడానికి అనువైనదిగా

ఉండాలి. దీని కోసం అనువాదకుడు అక్కడ కూడా రాజీ పడక తప్పదు. ఈ రాజీ పదాలలోనో, వాక్య నిర్మాణంలోనో, భావనలో సైతం జరుగవచ్చు.

పైన చెప్పినట్లు మూలగ్రంథం యొక్క స్వభావాన్ని కాపాడుతూ, ఆదాన భాషలో చదవడానికి వీలుగా అనువదించాలంటే అనువాదకుడు కొంత త్యాగం చేయవలసి ఉంటుంది. అదేమిటంటే, సందర్భాన్ని బట్టి అనువాదకుడు ప్రతి పదాన్ని అనువదించకూడదు. ఎందుకంటే మూల భాషలో ప్రతి పదం ప్రతి వాక్యం ఆదాన భాషలో సరిపడకపోవచ్చు. అటువంటి పదాలను అవసరమైతే వదలి వేయాలి. ఒకవేళ అతి కష్టం మీద వాటిని అనువదించినా, ఆదాన భాషలో అవి తిరస్కరింపబడతాయి. ఉదాహరణకు ఆంగ్లంనుంచి తెలుగులోకి అనువదించేటప్పుడు "It is a cat" అనే వాక్యానికి సంపూర్ణ అనువాదం (Literal translation) చేస్తే 'అది పిల్లి అయి ఉన్నది' అని చెప్పాల్సి వస్తుంది. ఈ వాక్యం ఈ రూపంలో ఆధునిక ప్రామాణికాంధ్రంలో తిరస్కరింపబడుతుంది. అట్లా కాకుండా 'ఇది పిల్లి' అని చెబితే చాలు, అందువల్ల అనువాదకుడు మూలగ్రంథాన్ని ఉన్నదున్నట్లు అనువాదం చేయక, అర్థాన్ని చెప్పడానికి ప్రయత్నం చేయాలి. ఇది మూలగ్రంథ విషయ స్వభావంపై కూడా ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఏదైనా శాస్త్ర సంబంధమైన గ్రంథమైతే సంపూర్ణ అనువాదం తప్పని సరి.

ఇదీ కాక అనువాదకుడు లక్ష్య భాషలో గ్రంథం ఎలా సహజ సిద్ధంగా ఉంటుందో, ఆదాన భాషలో కూడా అలాగే ఉండేట్టుగా అనువదించగలగాలి. ఎందుకంటే (1) గ్రంథ రచయితతో సంబంధం లేకుండా, ఆ సందర్భంలో అతను ఏమనుకొని ఒక పదాన్ని ప్రయోగించాడో అనువాదకుడు ఊహించగలగాలి. (2) అనువాదకుడు రచయిత అనుభవాన్ని వేరే భాషలో చెప్పేటప్పుడు, ఆ భాషలోని వ్యాకరణం, అర్థానికి సంబంధించిన సూత్రాలు, ఆ సమాజంలో సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు వేరుగా ఉండడంతో ఆదాన భాషలో చెప్పడానికి అనువుగా ఉండకపోవచ్చు. అటువంటి పరిస్థితులలో, అలాంటి పదాలకి గాని, పద ప్రయోగాలకి గాని పాద పీఠికల ద్వారా (foot - notes) లేక వ్యాఖ్యల ద్వారా గాని (glossaries) వివరణ ఇవ్వాలి. ఒక్కొక్కప్పుడు లక్ష్య భాషలోని ఒక పదానికి ఆదాన భాషలో అనేక అర్థాలు ఉంటాయి. అప్పుడు అనువాదకుడు సందర్భాన్ని బట్టి సరియైన పదాన్ని ఎంచుకోగలగాలి. మూలగ్రంథ విషయాన్ని తెలుపడానికి సాధ్యమైనంత వరకు భాషలో ఉన్న పదాలనే ఉపయోగించాలి గాని కొత్త పదాలను సృష్టించరాదు.

మూల గ్రంథాన్ని చదివేటప్పుడు ఒక అనువాదకుడిగా కాకుండా, మామూలు వ్యక్తిగా చదవాలి. అలా చేయడం వల్ల దానిలో ఎన్నో కొత్త విషయాలు కనుక్కోవచ్చు. ఈ విధంగా మూలగ్రంథాన్ని పదే పదే చదవడం వలన, అవసరాన్ని బట్టి మూలగ్రంథం స్వభావం చెడకుండా అనువాదంలో కొన్ని మార్పులు చేయవచ్చు.

ఒక రకంగా చెప్పాలంటే అనువాదకుడు రెండు రకాల పాత్రలను పోషిస్తాడు. ఒకటి, పాఠకుడు (reader) గా, రెండు దుబాసీ (interpreter) గా, తాను అనువదించిన గ్రంథాన్ని సాధారణ వ్యక్తి కన్నా భిన్నంగా చదువుతాడు. మామూలుగా గ్రంథాన్ని చదివే ఏ వ్యక్తీ, దానిలో ఏదో కొత్త దనాన్ని కనుగొనాలని ప్రయత్నించడు. ఎందుకంటే అనువాదకుడు గ్రంథాన్ని రెండు భాషలలో చదివితే, పాఠకుడు ఒక భాషలోనే చదువుతాడు. దీని వలన అనువాదకుడు గ్రంథాన్ని తులనాత్మక (comparative) దృష్టితో పరిశీలించగలుగుతాడు. ఈ అధ్యయనం భాషా పరంగానే కాకుండా, సామాజిక, సాంస్కృతిక పరంగా కూడా ఉంటుంది. ఈ విధంగా అనువాదకుడు తన పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ, సమాజానికి సేవ చేయగలుగుతాడు.

BRAOU

**అభ్యాసం – 3**

అనువాదకుడికి ఉండవలసిన లక్షణాలను గురించి క్లుప్తంగా తెలపండి.

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 18.6 అనువాదంలో కొన్ని మెలకువలు

అనువాదకుడు మూల ఆదాన భాషల పట్ల సమాన దృష్టితో వ్యవహరిస్తూ, ఆ భాషల స్వభావాన్ని గుర్తించి అనువాదం చేయడం మంచిది. దీనితో బాటు అనువదించేటప్పుడు కొన్ని పదాలు ఆదాన భాషా పాఠకునికి తెలిసినట్లైతే అనువదించనక్కర్లేదు. ఆ పదాల్ని అదే రూపంలో ఇచ్చేయవచ్చు. ఎందుకంటే కొన్ని కొన్ని పదాలు పూర్తిగా ఆ జాతి యొక్క సాంస్కృతిక, మానసిక లక్షణాలను ప్రతిబింబిస్తాయి.

ఏవైనా పదాలు మూల భాషలోని రెండు వాక్యాలలో వెంట వెంటనే వస్తుంటే అవి ఆదాన భాషశైలి అనుమతిస్తే యథాతథంగా అనువదించవచ్చు. మూల భాషలోని వివిధ పదాలకు ఆదాన భాషలో ఒకే పదం ఉంటే, దానినే పలుమార్లు ఉపయోగించాలి. అనువాదకుడు కొత్త పదాలను సృష్టించరాదు. ఒక పదాన్ని ఒక ప్రత్యేక మైన అర్థంలో వాడినప్పుడు ముందు ఆ పదాన్ని సంపూర్ణంగా అనువదించి (literally translate) అటు పిమ్మట వివరణ ఇవ్వాలి.

ఏవైన కంపెనీల పేర్లు, చిరునామాలు, పబ్లిక్ సంస్థలు మొదలైన వాటిని ఆదాన భాషలోకి మార్చేటప్పుడు కొన్ని మెలకువలు తెలుసుకోవడం అవసరం.

మూల ఆదాన భాషలలో సమానార్థకాలు దొరికినప్పుడు అనువాదం సులువు అవుతుంది. ఒక్కొక్కప్పుడు పద సముదాయంలోని ఏదో ఒక పదం ఆ మొత్తం పద సముదాయం యొక్క అర్థాన్ని గురించి సూచిస్తుంది. ఉదాహరణకు తెలుగులో 'పచ్చని కాపురం' అనే పద సముదాయంలో 'పచ్చ' అనే పదం ఆ కాపురం యొక్క లక్షణాన్ని వివరిస్తుంది. ఇటువంటప్పుడు అనువాదం చేయడం సులభం. ఆదాన భాషలో ఒకే పదానికి లక్ష్య భాషలో రెండు పదాలున్నప్పుడు అనువాదం చేయకూడదు.

మూల భాషలో ఒకే పదానికి ఆదాన భాషలో అనేక పదాలున్నప్పుడు శైలి దృష్ట్యా ఏ పదం సరిపోతే దానిని ఎంచుకోవాలి. కొన్ని పదాలు అసలు అనువదించలేము. ఆ పదాలు లిప్యంతీకరించాలి. మూల, ఆదాన భాషా గ్రంథాలలోని ప్రతి పదానికి అనువాదకుడు బాధ్యత వహించవలసి ఉంటుంది. అవసరమైతే మూల గ్రంథంలోని విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవడం కోసం ఆ విషయంపై ఇతర గ్రంథాలను సంప్రదించాలి.

BRAOU

మొత్తం గ్రంథాన్ని అనువదించే వరకు గ్రంథం పేరును అనువదించకపోవడం మంచిది. సాహిత్య పరమైన గ్రంథాల పేర్లు అనువాదంలో మార్చినా, మిగిలిన గ్రంథాల పేర్లు యథావిధిగా అనువదించాలి.

## 18.7 యంత్రానువాదం

అనూహ్యమైన శాస్త్రీయ, సాంకేతిక పరిణామాలు సహజంగానే సమాజ స్థితి గతులను మార్చివేస్తాయి. ఆధునిక యుగం ఎలక్ట్రానిక్ యుగమని అందరూ చెపుతున్నారు. మనం ఇప్పటి వరకు చర్చించిన విషయాలన్నీ మానవానువాదానికి (manual translation) సంబంధించినవి. అన్ని రంగాలతో బాటు భాషను కూడ కంప్యూటర్ ద్వారా విశ్లేషించడమే కాక, కంప్యూటర్ ద్వారా అనువదించడం ఏనాడో మొదలైంది. యూరప్, ముఖ్యంగా రష్యా ఇంకా అమెరికా దేశాలలో ఒక భాషనుండి వేరొక భాషను అనువదించే యంత్రానువాద వ్యవస్థను (Machine translation system) రూపొందించారు. ఉదాహరణకు"SYSTRAN" అనే యంత్రానువాద వ్యవస్థ ద్వారా రష్యన్ భాషనుంచి ఇంగ్లీషులోకి అనువదించారు. దీనిని అమెరికన్ ఎయిర్ ఫోర్స్‌లో 1970 నుంచి ఉపయోగించారు. అలాగే అమెరికన్ ఎయిర్‌క్రాఫ్ట్ మాన్యువల్స్‌ని వియత్నాం భాషలోకి అనువదించడానికి Logos అనే వ్యవస్థను ఉపయోగించేవారు.

1954లో యంత్రానువాదానికి సంబంధించిన పత్రిక మొదలు కాగా, 1960 కల్లా యంత్రానువాదపు ఇంటర్ నేషనల్ అసోసియేషన్ మొదలైంది. ఈ కాలంలో యంత్రాను వాద వ్యవస్థలలో మొదటి తరం వ్యవస్థలు (First generation systems) రెండవ తరం వ్యవస్థలు (Second generation systems), మూడవ తరం వ్యవస్థలు (Third generation systems) అని ఉన్నాయి. మొదటి తరం వ్యవస్థలలో అర్థాన్ని కంప్యూటరైజ్ చేయలేదు. అవి కేవలం మూల భాషలో ఉన్న పదాలని సరాసరి ఆదాన భాషలోకి అనువదించగలవు. ఇక రెండవ తరం వ్యవస్థలలో వాక్యాలను మాత్రమే వ్యాకరణ బద్ధంగా కంప్యూటరైజ్ చేయడం జరిగింది. ఇవి మూల భాషలోని వాక్యాల్ని ఆదాన భాషలోకి మార్చగలవు. మూడవతరం వ్యవస్థలలో బాహ్య ప్రపంచానికి సంబంధించిన సమాచారాన్ని కొంత వరకు నిలువ చేయగలిగారు. ఈ రకమైన వ్యవస్థలు తయారు చేయడంలో ఏవో కొన్ని విజయాలు సాధించినప్పటికీ, ఈ పరిశోధన ఇంకా ప్రథమ దశలోనే ఉందని చెప్పాలి. ఎందుకంటే బాహ్య ప్రపంచపు సమాచారాన్ని నిలువ చేయడమనేది ఒక్క సాంకేతిక పరిజ్ఞానంతోనే కాకుండా అనేక ఇతర విషయాలతో ముడిపడి ఉంది.

BRAOU

కంప్యూటర్ ఏదైనా విషయాన్ని 'అర్థం చేసుకోవడం' అంటే మనం ఇచ్చిన విషయాన్ని గ్రహించడం జరగాలి. గ్రంథంలో ఉన్న సమాచారంతో పాటు కంప్యూటర్ మెమొరీలో బాహ్య ప్రపంచం గూర్చి ఉన్న సమాచారం జోడించుకుని, అంటే , దానిని కంప్యూటర్ గ్రహించి, గ్రంథంలో ఉన్న విషయాన్నీ, ఈ సమాచారాన్ని కలిపి అర్థం చేసుకోవాలి. అయితే ఏ యంత్రానువాద వ్యవస్థ అయినా ఈ పనులు ఎంతవరకు నిర్వర్తించగలిగింది అనేది మనకు అది చేసిన అనువాదాన్ని బట్టి తెలుసుకోవచ్చు. అంటే అనువాదం ఒప్పుకోదగ్గదైతే యంత్రం సరిగ్గా విషయాన్ని గ్రహించినట్లు, ఒప్పుకోదగినదిగా లేకపోతే సరిగ్గా అర్థం చేసుకోనట్లు అనుకోవాలి. మరొక విషయమేమిటంటే శాస్త్రీయ, సాంకేతిక గ్రంథాలైతే (scientific and technical texts) ప్రకరణ (context) సంబంధం ఉండదు. కాబట్టి పదం యొక్క అర్థాన్ని ఎంచుకోవడం, యంత్రానికి సులభం. ఇదే సాహిత్య గ్రంథాలైతే (Literary texts) అర్థాన్ని గుర్తించేటప్పుడు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఈ పనిని ప్రస్తుతానికి ఏ యంత్రానువాద వ్యవస్థా చేయలేదు.

అయితే ప్రస్తుతానికి మనకి వివిధ యంత్రానువాద వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు వ్యాపార (commercial) వ్యవస్థలు ఇంకా ACPS, LOGOS, CULT ఈ కోవకు చెందినవే. అల్లాగే రష్యాలోAMPAR, NERPA, FRAP అనే యంత్రాను వాద వ్యవస్థలు శాస్త్రీయ, సాంకేతిక గ్రంథాలను అనువదించడానికి ఉపయోగ పడుతున్నాయి.

అభ్యాసం – 4

యంత్రానువాదం అంటే ఏమిటి?

## 18.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ప్రధానమైన అనువాద సిద్ధాంతాలు:

  1) శైలీ ప్రధానువాద సిద్ధాంతం (2) భాషా ప్రధానానువాద సిద్ధాంతం (3) సామాజిక భాషానువాద సిద్ధాంతాలు.

- అనువాదకుడు మూల లక్ష్య గ్రంథాల పట్ల సమాన దృష్టి కలిగి ఉండాలి.
- అనువాదకుడు అనువదించే విషయం క్షుణ్ణంగా తెలియాలి. రెండు భాషల లోను పాండిత్యం కలిగి ఉండాలి. రెండు భాషల స్వభావాన్ని అర్థం చేసుకొని అనువదించాలి.
- గ్రంథంపై విమర్శను అనువాదకుడు సహృదయంతో స్వీకరించాలి.
- అనువాదకుడు క్రొత్త పదాలను సృష్టించరాదు.
- ఇటు మూల గ్రంథానికి అటు లక్ష్య గ్రంథానికి అనువాదకుడే బాధ్యుడు.
- అనువాదంలో పద పదానువాదం, మూలభాషా విధేయానువాదం, మూల భావ విధేయతాను వాదం, అర్థానువాదం, గ్రహణ సుకరానువాదం, అనుసరణం, నుడికార రక్షితానువాదం అనేవి కొన్ని రకాలు.

## 18.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I 30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. అనువాద సిద్ధాంతాలను వివరించండి?
2. అనువాద పద్ధతులను పేర్కొని సోదాహరణంగా చర్చించండి?

II 15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. అనువాదకుని లక్షణాలేమిటి?
2. అనువాదకుడు అవలంబించాల్సిన మెలకువలు పేర్కొనండి?

BRAOU

# భాగం : 19 అనువాదం : భాషా సాంస్కృతిక సమస్యలు

## విషయ క్రమం


19.0 ఉద్దేశం

19.1 ప్రవేశిక

19.2 భాషా సమస్యలు

19.3 నిర్మాణాత్మక సమస్యలు

19.3.1 వర్ణ ఉపవ్యవస్థ – అనువాదం

19.3.2 పదాంశ ఉపవ్యవస్థ – అనువాదం

19.3.3 పదోత్పత్తి

19.3.4 పద తరగతులు

19.3.5 పద వర్గాలు

19.3.6 వచనం

19.3.7 కాలం

19.3.8 కాలాంశం

19.3.9 వాచ్యం

19.3.10 రీతి

19.3.11 లింగం

19.3.12 విభక్తి

19.3.13 పురుష


BRAOU

19.3.15 పదబంధం

19.3.16 ఉపవాక్య నిర్మాణం

19.3.17 మహావాక్య నిర్మాణం

19.3.18 శైలి అనువాదంలో సమస్యలు

19.3.19 చలనాత్మక సమస్యలు

**అభ్యాసం – 1**

19.4 సాంస్కృతిక సమస్యలు

**అభ్యాసం – 2**

19.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

19.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 19.0 ఉద్దేశం

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు:

- భాషా సమస్యలలో పలు రకాలు
- వర్ణ ఉపవ్యవస్థ, పదాంశ ఉప వ్యవస్థ, వాక్య నిర్మాణం, శైలిలో ఎదురయ్యే సమస్యలు
- విభిన్న సంస్కృతుల అనువాదంలో ఉత్పన్నమయ్యే సమస్యలు, పరిష్కారం

## 19.1 ప్రవేశిక

ఏ రెండు భాషలూ ఒకే విధంగా ఉండవు. వాటి రూపంలోనూ, అర్థంలోనూ భేదం ఉంటుంది. అంటే అవి ఉచ్చారణలోనూ, పదక్రమంలోనూ, పదోత్పత్తిలోనూ, పదజాలంలోనూ, వాక్య నిర్మాణంలోనూ, అర్థంలోనూ వేరు వేరుగా ఉంటాయి. దీనిని బట్టి సంపూర్ణానువాదం (Absolute translation) సాధ్యం కాదని చెప్పవచ్చు. అయితే ఏదైనా గ్రంథం యొక్క మొత్తం అనువాదాన్ని తీసుకొన్నప్పుడు, అది మూలగ్రంథానికి దగ్గరగా ఉండవచ్చు కాని, సూక్ష్మంగా పరిశీలించినపుడు ఈరెండు గ్రంథాలూ సమంగా ఉండవు.

అందువలన అనువాద ప్రక్రియలో సాధారణంగా రెండు రకాల సమస్యలు ఎదురౌతూ ఉంటాయి: 1) భాషా సమస్యలు 2) సాంస్కృతిక సమస్యలు. మొదటగా భాషా సమస్యల గూర్చి చర్చిద్దాం.



BRAOU

## 19.2 భాషా సమస్యలు

మూల, లక్ష్య భాషల మధ్య సారూప్యం భేదాలు నిర్మాణాత్మకంగా (structural) గాని, చలనాత్మకంగా (dynamic) గాని ఉంటాయి. నిర్మాణాత్మక సమస్యలు రూప సంబంధమైనవి. ఇవి భాష వ్యవస్థ (language system) యొక్క అన్ని ఉప వ్యవస్థలు (subsystems) అంటే వర్ణ ఉప వ్యవస్థ (phonological subsystems) పదాంశ ఉప వ్యవస్థ (morphological subsystems), వాక్య నిర్మాణ ఉప వ్యవస్థ (syntactic subsystems) మొదలైన వాటిలో ఎదురౌతూ ఉంటాయి. వీటికి తోడు అనువాదకుడు పద దశలో అంటే ఏక పదాలు, ఏక పదాలుగా కలిగిన వాక్యాల విషయంలో జాగ్రత్త వహించవలసి ఉంటుంది. చలనాత్మక లక్షణాలు రూపాత్మక (formal) మైనవీ, పదాత్మకమైనవీ (lexical) గా ఉంటాయి. ఇప్పుడు భాషల నిర్మాణాత్మక లక్షణాలు, అనువదించేటప్పుడు ఎదురయ్యే సమస్యలు, పరిష్కారాలు గూర్చి విశ్లేషిద్దాం.

## 19.3 నిర్మాణాత్మక సమస్యలు

అనువాదకులు అనువాదం చేసేటప్పుడు చాలా రకాల సమస్యలను ఎదుర్కొంటారు. అవి భాషా సాంస్కృతిక విషయాలకి సంబంధించి ఉంటాయి. భాషకి సంబంధించి ప్రధానంగా కొన్ని నిర్మాణాత్మక సమస్యలు మనకు ఎదురవుతాయి. వాటిని గురించి వివరంగా చర్చిద్దాం.

### 19.3.1 వర్ణ ఉప వ్యవస్థ – అనువాదం

అనువాదకులు ఎదుర్కొనే వర్ణాత్మక (ధ్వని) సమస్యలలో (phonological problems) ప్రతిలేఖనం (transliteration) సర్వసాధారణమైంది. ప్రతి లేఖనమంటే ఒక భాషలోని అక్షర క్రమాన్ని వేరొక భాషలోని అక్షర క్రమంలో రాయడం. దీనిని సంజ్ఞానామాలలో చూస్తాం. ఆ పదాలను అనువదించడానికి ఒక్కొక్కప్పుడు కొన్ని వర్ణాలను అరువైనా తెచ్చుకోవాలి. లేదా భాషలో ఉన్న వర్ణాలతోనే సరిపెట్టాలి. ఉదాహరణకు ఆంగ్ల పదాలైన (bank (bxnk), glass (glxss), మొదలైన వాటిని తెలుగులో బ్యాంకు, బేంకు, బాంకు, గ్లాసు, గ్లేసు అని వివిధ రకాలుగా ఉచ్చరిస్తూ, రాస్తున్నాం. ఎందుకంటే ఆంగ్ల వర్ణమైన x కి సమానవర్ణం తెలుగు భాషలో లేదు. కాబట్టి 'ఆ' వర్ణం కాని, 'ఏ' వర్ణం కాని ఉపయోగిస్తున్నాం. అదే ఉర్దూ పదాలను రాయడానికి 'f' వర్ణాన్ని అరువు తెచ్చుకున్నాం. ఉదాహరణకు ఫైసలా, ఫసలా మొదలైనవి సంజ్ఞానామాలు. ఆదాన భాషా పాఠకునికి బాగా పరిచయం ఉన్నవైతే, మూల భాషలో ఏ విధంగా రాస్తారో, అదే విధంగా ఆదాన భాషలోకి అనువదించవచ్చు. ఒకవేళ తెలియని పక్షంలో ఆదాన భాషా వర్ణాలకి సరిపడేటట్లు అనువదించవలసి ఉంటుంది.

### 19.3.2 పదాంశ ఉప వ్యవస్థ – అనువాదం

పద నిర్మాణంలోని సారూప్యం, భేదాలు ముఖ్యంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటాయి. అవి:

1) పదోత్పత్తి (word formation)లో ఉండే సంక్లిష్టత

2) పద తరగతుల (word classes) మధ్య ఉండే వ్యత్యాసం

3) వివిధ పదాలచే వ్యక్తీకరింపబడే వర్గాలు (catogories)



BRAOU

### 19.3.3 పదోత్పత్తి

పూర్తి విరుద్ధమైన వ్యాకరణ లక్షణాలు కలిగిన భాషల మధ్య అనువాదం చేసేటప్పుడు పదోత్పత్తి సమస్య ఎదురౌతుంది. ఉదాహరణకు సంయోగాత్మక భాషయైన తెలుగు నుండి ఏకాత్మక (isolated) భాషయైన చైనా భాషకు అనువదించేటప్పుడు పదోత్పత్తిలో ఉండే సంక్లిష్టతను దృష్టిలో ఉంచుకోవాలి. తెలుగు క్రియ (verb) ఒక్క చర్య (action)ను మాత్రమే కాక చర్యలో పాల్గొనే వ్యక్తులు, వారి సంఖ్య (number) లింగం (gender)తో పాటు, లక్షణాలను కాలాంశాలను కూడా సూచిస్తుంది. అదే చైనా భాషలో ఈ వ్యాకరణ వర్గాల (grammatical catogories) న్నింటినీ వేర్వేరు పదాల ద్వారా వ్యక్తీకరిస్తారు. అంటే క్రియ, నామం, సర్వనామాల సహాయంతో చెపుతారు. అదే ఎస్కిమో భాషలో ప్రత్యయాత్మక (inflectional), సంయోగాత్మక (agglutiatiative) భాషలలోని క్రియలో ఉండే సమాచారం కంటె ఎక్కువ సమాచారం ఉంటుంది. ఒక రూప సంబంధ గుణాంశాలనే (formal features) కాక ఎస్కిమో భాషా క్రియ అర్థమూలకాల (semantic elements)కు సంబంధించిన సమాచారం దాగి ఉంటుంది. అంటే వచ్చుట, వెళ్ళుట, క్రింద, పైన, కొద్దిగా, ఇప్పుడే, తప్పనిసరి మొదలైన అర్థాలు క్రియలో ఇమిడి ఉంటాయి. ఇటువంటి భాషల మధ్య అనువాదం చేసేటప్పుడు మొత్తం పదాల సంఖ్యలో హెచ్చు తగ్గులు ప్రస్ఫుటంగా కనపడతాయి.

### 19.3.4 పద వర్గాలు

ఏ భాషలోనైనా మూడు నుంచి ఎనిమిది వరకు పద వర్గాలుంటాయి. అయితే భాషల మధ్య వ్యత్యాసం ఒక్క సంఖ్యకే పరిమితం కాదు. ఆయా పద తరగతులచే వ్యక్తీకరించబడే అర్థంలో కూడా తేడా ఉంటుంది. అందువల్ల అనువాదకుడు ఆదాన భాషా రూపాత్మక లక్షణాలతో బాటు అర్థ నిర్మాణానికి అనుగుణంగా విషయాన్ని (message) మార్చవలసి ఉంటుంది.

BRAOU

### 19.3.5 పదాంశ వర్గాలు

భాషలో ఇవి పదోత్పత్తి, పద తరగతుల కన్నా కష్టమైనవి. అందువలన వచనం (number), పురుష (person), కాలం (tense), రీతి (mode), లింగం (gender), వాచ్యం (voice) మొదలైన వర్గాలలో ఎదురయ్యే సమస్యలు మూడు అంశాలపై ఆధారపడి ఉంటాయి అవి: (1) వాటి నిత్య (obligatory) లేక వైకల్పిక (optic:ıal) సైజం. (2) వాటిని ప్రయోగించే పరిధి (range of occurence), (3) వాటిని ఎంపిక చేసుకోవాల్సిన అవసరం (frequency of selection).

నిత్య లక్షణాలకన్నా, వైకల్పిక లక్షణాలే అనువాదకునికి సమస్యల్ని తెచ్చిపెడతాయి. ఒకవేళ ఆదాన భాషలో కర్మ ప్రయోగాలు (passive construction) లేకపోతే, మూల భాషలో ఉన్న కర్మ ప్రయోగాలనీ ఆదాన భాషలో కర్తృ ప్రయోగాలు (active construction)గా మార్చాలి. నిజమైన సమస్య ఉత్పన్నమయ్యేది ఏదైనా వ్యాకరణ వర్గం వైకల్పికమైతేనే. ఎందుకంటే, ఏ వర్గాన్ని ఏ సందర్భంలో ఉపయోగించాలో అనువాదకునికి స్పష్టమైన అవగాహన, అనుభవం ఉండాలి. ఒకవేళ ఏదైనా వర్గం దాదాపు ప్రతి పదానికి వర్తించినట్లైతే అనువాదకుని పని సులభతరమౌతుంది. ఉదాహరణకు: తెలుగులో ఏక, బహు వచనాలు ప్రతి నామానికి వర్తిస్తాయి. కాబట్టి అనువాదకునికి వచన విషయంలో తెలుగులో పెద్ద సమస్యలు రావు.

ఇక ఏదైనా వర్గాన్ని ఎప్పుడు ఎంపిక చేసుకోవాలి అనే విషయానికొస్తే, ఉదాహరణకు తెలుగులో సాధారణంగా కర్తృవాచ్యాన్నే (active voice) ఉపయోగిస్తాం. కర్మ ప్రయోగాలు అంత ప్రాచుర్యంలో లేవు. అందువలన ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదిస్తున్నప్పుడు ఆంగ్లంలో కర్మ నిర్మాణాలను తెలుగులో సాధ్యమైనంత వరకు కర్తృ ప్రయోగాలుగా మార్చాలి.

### 19.3.6 వచనం

కొన్ని భాషలలో వచనం వైకల్పికం, హిబ్రూ, ఇండో - యూరోపియన్, ద్రావిడ భాషలలో ఇది నిత్యమైతే, మిగిలిన భాషలలో వ్యాకరణ వర్గం వైకల్పికం.

### 19.3.7 కాలం

ఈ వర్గం ఏదైనా విషయం గాని, చర్య గాని ఎప్పుడు జరిగిందీ తెలుపుతుంది. తెలుగు భాషలో వర్తమాన (present), భూత (past), భవిష్యత్ (future) కాలాలు క్రియా ప్రత్యామ్నాయాల ద్వారా వ్యక్తీకరించబడతాయి. కాని కొన్ని కొన్ని భాషలలో కాలాన్ని గుర్తించడం కష్టం. ఉదాహరణకు లోమా (loma) భాషలో భూతకాలం నుంచి వర్తమానంలోకి రావడం, వర్తమానం నుంచి భవిష్యత్‌లోకి వెళ్ళడం లాంటి మెలికలు ఉన్నాయి. అందువల్ల ఒక భాషనుండి మరొక భాషలోకి అనువదించేటప్పుడు ఈ వ్యాకరణ వర్గాన్ని అత్యంత జాగ్రత్తలో అన్వయింప జేయాలి. కొన్ని భాషలు నామాల ద్వారా తెల్పుతాయి. అందువలన కాలం రూపాత్మకమైనా (లేక వ్యాకరణాత్మకమైన), అర్థాత్మకమైనా ఏ రెండు భాషలలోనూ ఒకే విధంగా ఉండదు. అతి దగ్గరి భాషలైన ఫ్రెంచ్, స్పానిష్‌లలో ఈ వర్గం వేరు వేరుగా ఉంటుంది.

### 19.3.8 కాలాంశం

ఈ వ్యాకరణ వర్గం చర్య యొక్క తీజాన్ని చెపుతుంది. ఒకప్పుడు ఇండో - యూరోపియన్ భాషలలో ఇది ప్రధాన పాత్ర వహించింది. ఏ చర్య తీజాన్నైనా అనేక విధాలుగా తెలుపవచ్చు.

1) పూర్తి - అసంపూర్తి (2) ఒకసారి - అనేకసార్లు (3) ఆరోహణం - అవరోహణం (4) ఆది - అంతం; (5) తరచూ - అప్పుడప్పుడు మొదలైనవి. అందువలన అనువాదకుడు మెలకువతో వ్యవహరించాలి. ఆదాన భాషలోని ఏ రూపం మూల భాషా పదానికి సరిపోతుందో చూడాలి.

### 19.3.9 వాచ్యం

వాచ్యం అనే వ్యాకరణ వర్గం చర్యలో పాల్గొనే వ్యక్తులు, విషయం (event) మధ్య సంబంధాన్ని చెపుతుంది. కర్తృ, కర్మ, క్రియలతోనూ, హేత్వర్థక (causiative) ప్రయోగాలలోనూ అనువాద సమస్య వస్తుంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు కొన్ని భాషలలో కర్మణి రూపాలు (passive forms) లేవు. అయితే ఆధునిక తెలుగులో 'బడు' ప్రయోగం ద్వారా ఈ రకం వాక్యాల వాడకం కనిపిస్తోంది. సాధారణ భాషలో వీటి ఉనికి అంతగా కనిపించదు. శాస్త్రీయ, సాంకేతిక గ్రంథాలలో కర్మ రూపాలు ఎక్కువగా కనపడతాయి. కనుక అనువాదకుడు గ్రంథ విషయాన్ని బట్టి ఈ రూపాలు వాడాలి. అయితే ఆంగ్లంలో ఉన్న కర్మ రూపాలను తెలుగులో చాలా వరకు కర్తృ రూపాలుగా మారిస్తే పాఠకుల వ్యవహారానికి సన్నిహితంగా ఉంటాయి.

BRAOU

### 19.3.10 రీతి

ఈ వ్యాకరణ వర్గం ఏదైనా చర్య వెనుకగల మానసిక స్థితిని తెలియజేస్తుంది. ఇది అనేక రకాలుగా ఉండవచ్చు. సంభావ్యత (ప్రాయుక్తత, సంభావ్యత, సాపేక్షత), అనివార్యత (విద్యాద్యర్థకత, ప్రబోధకత, నిత్యత) మొదలైనవి. వివిధ మానసిక స్థితులను తెలిపే ఈ భావనలు (concepts) మానవ ప్రకృతి (subjective nature) పై ఆధారపడి ఉంటాయి. కాబట్టి వీటిని అనువదించడం అంత తేలిక కాదు. చాలా భాషలలో పరిభావ్యతా భావనలు ప్రకటించడానికి వ్యాకరణ రూపాలు లేవు. తెలుగులో ఈ సమస్య ఉత్పన్నం కాదు. మనకి ఈ భావనలు వ్యక్తీకరించడానికి ప్రత్యేకమైన ప్రత్యయాలు, పదాలు ఉన్నాయి. ఉదాహరణకు, సామర్థ్యార్థం (కల – రాగలడు, పాడగలడు, ఆడగలుగుతాడు), అనుమత్యాద్యర్థం (వచ్చు – పాడవచ్చు, ఆడవచ్చు, రావచ్చు) నిషేధార్థకం (కూడదు – రాకూడదు, ఆడకూడదు, పాడకూడదు) మొదలైనవి.

### 19.3.11 లింగం

ఇది మూడురకాలుగా ఉంటుంది. పుం (masculine), స్త్రీ (feminine), నపుంసక (neutex). ఇది ఇండో – యూరోపియన్, బాంటూ (bantu), ద్రావిడ భాషలలో ఎక్కువగా కనబడుతుంది. మిగిలిన వ్యాకరణ వర్గాలతో పోల్చి చూచినప్పుడు లింగం అనువదించడం సులభమే. ఎందుకంటే దీనికి సంబంధించిన వ్యాకరణ నిర్మాణ సూత్రాలు ఏ భాషలోనైనా సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంటాయి. ఈ వర్గం విషయంలో ఇండో – యూరోపియన్ భాషలకీ ద్రావిడ భాషలకీ ఒక మౌలిక భేదం ఉంది. అదేమిటంటే, ఇండో – యూరోపియన్ భాషలలో లింగం వ్యాకరణ బద్ధమైతే అంటే ధాతువు తరువాత వచ్చే పదాంశ ప్రత్యయాల ద్వారా వ్యక్తీకరించబడితే తెలుగుతో సహా మిగిలిన ద్రావిడ భాషలలో ఈ వర్గం అర్థబద్ధమైనది అంటే రూపాత్మక ప్రత్యయాల ద్వారా కాకుండా పదం యొక్క అర్థాన్ని బట్టి లింగ నిర్ణయం చేయబడుతుంది. అనువాదకుడు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

BRAOU

### 19.3.12 విభక్తి

వాక్యంలో వివిధ పదాల మధ్య సంబంధాన్ని తెలియజేసేదే విభక్తి. ప్రత్యయాత్మక భాషలలో, కొన్ని సంయోగాత్మక భాషల్లో వ్యాకరణాత్మకమై ప్రత్యయాల ద్వారా వ్యక్తీకరించబడితే మిగిలిన భాషలలో పదక్రమం ద్వారానో, స్వరం ద్వారానో వివరించబడుతుంది. తెలుగులో విభక్తి ప్రత్యయాలు ఉన్నాయి. ఆంగ్లం నుంచి అనువదించేటప్పుడు సమానమైన విభక్తిని ఎంచుకోవడమే కాకుండా, అది తెలుగు భాషలో సరిపోతుందో లేదో చూసుకోవాలి.

### 19.3.13 పురుష

ప్రథమ (first), మధ్యమ (second), ఉత్తమ అని మూడు (third) రకాల పురుష సంబోధనలున్నాయి. వీటికి ఏక (singular), బహు (plural) వచనాలు వర్తిస్తాయి. ఒక్కొక్కప్పుడు కొన్ని భాషలలో ఇది సందిగ్ధంగా ఉంటుంది. ఆంగ్లంలో 'you' అంటే 'మీరు' కావచ్చు. 'నువ్వు' కావచ్చు. అందువలన తెలుగులోకి అనువదించేటప్పుడు ప్రకరణం బట్టి గాని, క్రియకు ఉన్న వచనం ప్రత్యయాన్ని బట్టిగాని నిర్ణయించవలసి ఉంటుంది.

### 19.3.14 పదబంధం

మూల భాషలో ఏదైనా పదబంధ ప్రయోగం రూపాత్మకంగా సజాతీయమైనప్పటికీ, అర్థాత్మకంగా పరస్పర విరుద్ధంగానూ, ఆశ్రితం గాను ఉండవచ్చు. అందువలన ఆదాన భాషలోకి జాగ్రత్తగా అనువదించాలి. ఉదాహరణకు

ఆంగ్లంలో 'sat and begged' అనే ప్రయోగాన్ని తెలుగులోకి అనువదించే టప్పుడు 'కూర్చున్నాడు మరియు అడుక్కున్నాడు' అంటే ఈరెండు చర్యలలో ఒకటి ప్రధాన మైనదిగానూ, రెండవది అనుషంగిక (secondary) మైన చర్యగానూ భావించవలసి వస్తుంది. కాని ఈ రెండు చర్యలూ ఏక కాలంలో నిర్వహించబడుతున్నాయి. కాబట్టి అతను కూర్చుని అడుక్కుంటున్నాడు కావచ్చు లేక అతను అడుక్కుంటున్నప్పుడు కూర్చున్నాడు కావచ్చు.

### 19.3.15 ఉపవాక్య నిర్మాణం

ఉప వాక్యాలు మూడు రకాలు: (1) సమీకరణ (equational) (అతను బలవంతుడు), (2) సమాపక (transitive) (అతను తిరుగుతున్నాడు), (3) అసమాపక (intransitive) (అతనిని నేను ఆపాను). అయితే మూల భాషలో ఉన్న ఉప వాక్య నమూనా ఆదాన భాషలో లేనప్పుడు అనువాదం కష్టమౌతుంది.

### 19.3.16 మహావాక్య నిర్మాణం

మూలభాషా విధేయత పద్ధతి (literal translation) అనువాదంలో అనేక సమస్యలను సృష్టిస్తుంది. వీటిని ప్రతి అనువాదకుడు గుర్తించడు. చాలమంది మూల భాషా నిర్మాణాల కనుగుణంగా ఆదాన భాషలో ప్రయోగాలు చేస్తూ ఉంటారు. ఇది ప్రమాదకరమైన పని. దేశ్య (indigenous) పదాన్నుపయోగించడం కంటే విదేశీ భాషా పదాలను స్వీకరించడమే మేలుగా భావిస్తారు. ఇటువంటప్పుడు దేశ్యేతర (non-indigenous) పదాలు ఆదాన భాషలో అంగీకరింపబడి, విస్తృతంగా భాషలో ఉపయోగింప బడాలి. మూల భాషలోని కొన్ని ప్రయోగాలు అనువాదకుడికి అర్థరహితంగా (meaningless) కనపడవచ్చు. ఉదాహరణకు ఆఫ్రికాలో కియాకా భాషలో కుడి చేతిని 'తండ్రి చెయ్యి' (father's hand) అనీ, ఎడమ చేతిని 'తల్లి చెయ్యి' (mother's hand) అనీ అంటారు. అదే వెస్ట్ ఆఫ్రికాలో ఒక భాషలో 'మగచెయ్యి' అనీ, 'ఆడచెయ్యి' అనీ అంటారు. ఒక్కొక్కప్పుడు ఆదాన భాషలోని కొన్ని ప్రయోగాలు సందర్భానికి సరిపోయేటట్లు ఉండవు. కాని చారిత్రక అభివృద్ధిలో సాంస్కృతిక పరిస్థితులు మారినప్పుడు అవే ప్రయోగాలు మళ్ళీ అంగీకరింపబడతాయి. అట్లాగే ఒక్కొక్కప్పుడు కొన్ని కొన్ని ప్రయోగాలు తిరస్కరింపబడతాయి కూడా.

అందువలన అనువాదంలో పదాల ఎంపికలోనూ, అర్థాలలోనూ క్లుప్తంగా చెప్పాలంటే ఏ దశ (level) లోనైనా సమస్య రావచ్చు. కాబట్టి వీటిని అత్యంత నైపుణ్యంతో పరిష్కరించాలి.

### 19.3.17 శైలి అనువాదంలో సమస్యలు

ఇప్పటి వరకు వ్యాకరణ, పద సంబంధమైన సారూప్యం, భేదాలు అనువాదంపై ఎటువంటి ప్రభావం చూపుతుందో సవివరంగా చర్చించాం. ఏ భాషలోనైనా వివిధ రకాల శైలి ఉంటుంది. అవి శాస్త్రీయ, మత, తాత్విక, సాహిత్య, వ్యాపార, అధికార, ప్రచార మొదలైనవి. ఏ శైలితో ఆదాన భాషలోకి అనువదించాలి అనే విషయం మూలగ్రంథంపై ఆధారపడి ఉంటుంది. ఒక్కో పద్ధతిలో ఒక్కో విధమైన సమస్యలుంటాయి. ఎందుకంటే అన్ని భాషలలో ఒక్కో విధమైన శైలి పూర్తిగా లేకపోనూ వచ్చు, లేక వివిధ కారణాల వల్ల అభివృద్ధి చెందకపోవచ్చు. అట్లాగే, ఉదాహరణకు మతపరమైన విషయాలకి ఒక ప్రత్యేక శైలి ఉంటుంది. దానిలో ఎక్కువ ప్రాచీన పదాలు ఉపయోగిస్తారు. అభివృద్ధి చెందిన దేశాలలో శాస్త్రీయ, సాంకేతిక భాషకు తనదైన శైలి ఉంది. అందువలననే యూరప్ భాషల మధ్య అనువాదం సులభం. ఈ భాషల నుంచి ఇతర భాషలలోకి అనువదించాలంటే పదజాలం (vocabulary)తో పాటు శైలి సమస్య కూడా వస్తుంది.

BRAOU

### 19.3.18 చలనాత్మక సమస్యలు

పైన చర్చించుకొన్న కొన్ని సమస్యలు, ఉదాహరణలు చలనాత్మ సారూప్యతా సమస్యలకూ వర్తిస్తాయి. మరికొన్నింటిని ఇక్కడ చూద్దాం.

ప్రతి భాషకు ఒక అక్షర క్రమం (alphabet) ఉంటుంది. ఇది అన్యభాషా ధ్వనులను ఎంతవరకు తనలో ఇముడ్చుకుంటుంది అనే అంశంపై ఆధారపడి ఉంటుంది. ఎందువలనంటే అన్ని భాషలు ఒకే విధంగా ఇతర వర్ణాలను అంగీకరించవు. ఆంగ్లం ఏ వర్ణాన్నైనా, ఏ పదాన్నైనా త్వరగా తనలో కలుపుకుంటుంది. తమిళం దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తుంది. అందువలన మూల భాష నుండి ఏ వర్ణమైనా ఆదాన భాషలోకి తీసుకొచ్చేటప్పుడు, ఆ భాష యొక్క వర్ణ ఉప వ్యవస్థ లక్షణాలు లోతుగా తెలిసి ఉండాలి. మహా ప్రాణోచ్చారణ ధ్వనులు (aspirated sounds) తెలుగులోకి సంస్కృతం నుంచి వచ్చినవే.

రెండు భాషలు ఒకే విధమైన వ్యాకరణ వ్యవస్థ కలిగి ఉండి పదాంశ లక్షణాలు (morphological features) దాదాపు ఒకే రకంగా ఉంటే అనువాదకుని పని సులభమౌతుంది. ఒకవేళ అట్లా కాకపోతే మూల భాషలోని ఏ పదాంశ వర్గానికి, ఆదాన భాషలోని ఏ వర్గం సరిపోతుందో అనువాదకుడు జాగ్రత్తగా విశ్లేషించాలి.

మూల భాషలోని వాక్య నిర్మాణం ఆదాన భాషలో సరిపోతే ఎటువంటి సమస్య లేదు. లేకపోతే అనువాదకుడు సరిపడని వాక్యాలను ఆదాన భాషా వాక్య నిర్మాణ సూత్రాల కనుగుణంగా మార్చవలసి వస్తుంది. ఉదాహరణకు తెలుగులో సామాన్య వాక్యాలను (simple sentences) ఎక్కువగా వాడతాం. ఆంగ్లంలో వీటితో బాటు, సంశ్లిష్ట, సంయుక్త (complex and compound) వాక్యాలను కూడ వాడతారు. ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించేటప్పుడు సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను సాధ్యమైనంత వరకూ సామాన్య వాక్యాలుగా మారిస్తే పాఠకునికి అనువుగా ఉంటుంది.

**అభ్యాసం – 1**

I వివిధ మానసిక స్థితులను వివరించే భావనలను అనువదించడం ఎందుకు కష్టమో తెలపండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

II శైలీ అనువాదంలోని సమస్యలను పేర్కొనండి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

BRAOU

## 19.4 సాంస్కృతిక సమస్యలు

ఏ సంస్కృతి అయినా ఆ ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వారి జీవన విధానానికి అద్దం పడుతుంది. అన్ని భాషలలోనూ కొన్ని సర్వ సాధారణమైన పదాలు ఉంటాయి. ఉదాహరణకు చంద్రుడు, నక్షత్రాలు, ఈత, జీవనం లాంటివి. అట్లాగే కొన్ని వైయుక్తిక పదాలు(idiolect words) కూడా ఉంటాయి. వీటితో బాటు ప్రజల సంస్కృతిని ప్రతిబింబించే పదాలు ఉంటాయి. ఉదాహరణకు, ఆత్మ, ప్రాణం, పంచె, బొట్టు లాంటివి. ఇటువంటి పదాలు ఏ భాషలోనైనా కోకొల్లలు. రెండు భాషల సంస్కృతులు వేరైనప్పుడు ఇటువంటి పదాలను అనువదించడంలో అనేక సమస్యలు వస్తాయి.

వివిధ సంస్కృతులు కలవారు ఒకే భాషను ఉపయోగించవచ్చు. అయితే ప్రజలు ఏదైనా ఒక అంశంపై కేంద్రీకరించినపుడు, సహజంగా ఆ భాషలో ఆ అంశంపై మిగిలిన భాషల కన్నా ఎక్కువ పదాలుంటాయి. దీనినే సాంస్కృతిక కేంద్రీకరణ (cultural focus) అంటారు. ఉదాహరణకు ఫ్రెంచి వాళ్ళు వైన్, అరబ్బులు ఒంటె, ఎస్కిమోలు మంచుమీద, స్పానిష్ ప్రజలు ఎద్దుల పోట్లాట మీద అనేక పదాలు సృష్టించారు. అంటే ఎక్కడైతే సాంస్కృతిక కేంద్రీకరణ ఉంటుందో అక్కడ అనువాద సమస్య ఉత్పన్నమౌతుంది. దీనికి కారణం మూల, ఆదాన భాషల మధ్య సాంస్కృతికంగా దూరం పెరగడమే. ఎందుకంటే ప్రజల సాంస్కృతిక లక్షణాలు భాషా వ్యాకరణంలోనూ, పదజాలంలోనూ ప్రస్ఫుటంగా కనబడతాయి. అందువలన ప్రజలు తమ ప్రత్యేకమైన సంస్కృతిని ఎంతగా అభివృద్ధి చేసుకుంటే అంతగా అనువాద సమస్యలు పెరుగుతాయి.

BRAOU

ఏ భాషలోనైనా సాంస్కృతిక పదాలను గుర్తించడం సులభమే. అవి సామాన్యంగా ఆ భాషలోనే ఉంటాయి. కాబట్టి వాటికి శబ్ద క్రమానువాదం (literal translation) చేయలేము. అయితే చాలా పదాలు వాడుక భాషలో ఉపయోగింపబడతాయి. ఉదాహరణకు తెలుగులో 'గారు' అనే పదం. వీటికి శబ్ద క్రమానువాదం చేస్తే అర్థం మారిపోయే అవకాశం ఉంది.

అనువాదకుడు మూల భాషా గ్రంథంలో వెలువరించిన సంస్కృతిని గుర్తించి, దాని పట్ల గౌరవభావంతో వ్యవహరించినప్పుడు, సరిగా అనువదించగలుగుతాడు. సాంస్కృతిక పదాలను అనువదించడానికి రెండు రకాల పద్ధతులున్నాయి.

1) ప్రతి లేఖనం (transference or transliteration)

2) ఆంశిక విశ్లేషణం (componential analysis)

ప్రతి లేఖనం గూర్చి ఇంతకు ముందు చర్చించుకున్నాం. ప్రతి లేఖనం ద్వారా అనువదించబడిన పదం ఆదాన భాషలో పారిభాషిక (loan word) పదంగా ఉంటుంది. ఈ విధంగా చేయడం వల్ల అనువాదకుడు మూల భాషా సంస్కృతిని పాఠకునికి చూపగలుగుతాడు. వ్యక్తుల పేర్లను, భౌగోళిక నామాలను, పత్రికలు, వార్తా పత్రికల పేర్లను, సాహిత్య గ్రంథాలు, నాటకాలు, సినిమా పేర్లను, సంస్థల పేర్లను, వీధుల పేర్లు, చిరునామా మొదలైన వాటిని ప్రతిలేఖనం చేయవచ్చు. అయితే కొన్ని ప్రాంతీయ వ్యాసాలలో, ప్రకటనలలో సాంస్కృతిక పదాలకు ప్రాంతీయ రంగుపూసి అనువదిస్తారు. ఇది పాఠకుని ఆకర్షించడానికి చేసే పని.

పాక్షిక సాంస్కృతిక (semicultural) పదాలలో కొన్ని సమస్యలు వస్తాయి. ఇవి ఏదో ఒక దేశం, ఒకానొక దశలో ఏర్పడ్డ పదాలు. (ఉదా: maximalism, enlightenment, nothingness మొదలైనవి). ఈ పదాలను అనువదించి, కుండలీకరణంలో ప్రతిలేఖనం చేసి వివరణ ఇవ్వాలి. ఈ వివరణ పాఠకునికి అర్థమయ్యే రీతిలో ఉండాలి. అన్యదేశ పదం కదా! మనం అనువదించలేమనుకోకూడదు. అనువాదకుడు పాఠకునికి అన్య దేశ సంస్కృతిని గూర్చి సాధ్యమైనంత వరకూ వివరించడానికి ప్రయత్నించాలే తప్ప మూల భాషా పదాలను యథాతథంగా అనువదించి పాఠకుని తికమక పెట్టకూడదు. అందుకే ప్రతిలేఖనం మూల భాషా సంస్కృతి పట్ల గౌరవం చూపెట్టినా, ఆదాన భాషపట్ల మెతక వైఖరి అవలంబిస్తుంది.

అంశిక విశ్లేషణ (componential analysis) మూల, ఆదాన భాషలలో ఒకటిగా భాగాన్ని (component) తీసుకుంటుంది. ఇది ఆమోదయోగ్యమైన పద్ధతి కాదు.

శరీర భాగాలను తెలియజేసే పదాలు అన్ని భాషలలో ఒకటిగా లేవు. అసలు 'శరీరం' అనే పదానికి సమానార్థాన్నిచ్చే పదాలు చాలా భాషలలో లేవు. కొన్ని భాషలలో corpse (శవం) "my my self(నేను) meat and bones(నామాంసం, ఎముకలు) మొదలైన విధాలుగా మాట్లాడుతారు. కాబట్టి ఒకవేళ మూల గ్రంథంలో శరీరం అంటే భౌతిక రూపం అనే అర్థంలో వాడితే ఆయా భాషలలో శవం గానూ లేక నా మాంసం, ఎముకలుగా అనువదించాలి. ఇది ప్రకరణం (context)పై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ శరీరం అంటే మూలగ్రంథంలో 'వ్యక్తిత్వం' అనే అర్థంలో వాడితే 'నేను' గా అనువదించాలి. ఇదే విధంగా తెలుగులో 'ప్రాణం' అనే పదానికి ఆంగ్లంలో ప్రకరణాన్ని బట్టి body అనీ life అనీ అనువదిస్తూ ఉంటారు.

మనస్సుకు సంబంధించిన పదాలలో తెలుగులో 'ఆత్మ' అనే పదానికి ఆంగ్లంలోsoul అనీ spirit స్పిరిట్ అనీ వాడతాం. అట్లాగే మనస్సు, హృదయం అనే పదాలకు ఆంగ్లంలో heart అనే పదం అనువదిస్తాం.

రోగాలకి సంబంధించిన పదాలలో ఉదాహరణకు మనం వేడి, వాతం అనే పదాలు వాడతాం. వీటికి సమాన పదాలు ఆంగ్లంలో లేవు. అనువాదకుడు ఇటువంటి పదాలకు ఆ జబ్బు యొక్క లక్షణాలు తెలుపుతూ వివరణ మాత్రమే ఇవ్వగలడు.

ఇక భౌగోళిక పదాల విషయానికొస్తే చాలా భాషలలో 'భూమి' అనే పదానికి మొత్తం భూగోళం అనే అర్థంలో పదం లేదు. ఇదే ప్రపంచం అనే పదం విషయంలో కూడా వర్తిస్తుంది. అయితే ఆంగ్ల పదాలు"earth", "world" తెలుగులో భూమి, ప్రపంచం అని అనువాదం చేస్తున్నాం. కొన్ని భాషలలో 'గాలి' అనే పదం కనబడదు. ఆంగ్ల పదానికి "snow" అంటే 'మంచు' అంటున్నాం. కాని యూరప్ దేశాలలో 'మంచు' అంటే ఉష్ణోగ్రత సున్నా కన్నా తగ్గి, మంచు పడడం. కాని మన దేశంలో ఏవో కొన్ని ప్రాంతాలలో తప్ప ఇటువంటి వాతావరణం ఉండదు. కాని మనం చలి కాలంలో ప్రొద్దున్నే 'మంచు పడుతోంది' అంటాం. అందువలన అర్థంలో చాలా తేడా ఉంది. ప్రపంచంలో కొన్ని దేశాలలో ఆయా దేశాల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా పదాలు లేవు. అందుకనే కొన్ని కొన్ని భాషలలో 'నది' అంటే 'ప్రవహిస్తున్న నీరు' గా అనువదించాలి. తెలుగులో సరస్సుకి సమాన పదం లేదు. ఆంగ్లంలో 'చెఱువు' కి సమాన పదంలేదు. అందువలన 'చెఱువు' 'సరస్సు' కలిపి lake గానే అనువదిస్తాం.

కాలాలను అనువదించడం చాలా కష్టం. ఉష్ణ మండలాలలో నివసించే ప్రజలకు ముఖ్యంగా రెండే కాలాలు: (1) వర్షాకాలం (2) వేసవి కాలం. అదే శీతల ప్రాంతాలలో నివసించే ప్రజలకు చలి కాలం కూడా ఉంటుంది. ఇదే ఎస్కిమోలకైతే

BRAOU

'చలికాలం'లో కూడా మళ్ళీ ఉపదశలు చాలా ఉన్నాయి. అనువాదకుడు కాలాన్ని చెప్పడానికి సామాన్య జాతీయ ప్రయోగాలను వాడాలి.

పశు పక్ష్యాదులు, వృక్షాలకు సంబంధించి ప్రపంచంలో కొన్ని వేల రకాలున్నాయి. కొన్ని దేశాలలో ఒకే విధమైనవి ఉన్నా, చాలా రకాలు ఒక ప్రాంతంలో ఉన్నవి మరొక ప్రాంతంలో లేవు. ఇటువంటప్పుడు అనువాదకుడు ప్రతిలేఖనం ద్వారా అనువదించవలసి ఉంటుంది. ఆ తరువాత ఆదాన భాషా పాఠకునికి అర్థమవడం కోసం ఆ జంతువుకో, వృక్షానికో దగ్గరిగా ఉంది, పాఠకునికి తెలిసిన దానితో పోల్చి చెప్పాలి.

ఆహార పదార్థాలు, దుస్తులు జాతి సాంస్కృతిక లక్షణాలకు అద్దం పడతాయి. వీటిని అనేక విధాలుగా అనువదిస్తున్నారు. ప్రతిలేఖనం, సమానార్థకాలు (neutral) పదాల ద్వారా అనువాదం చేస్తున్నారు. ఉదాహరణకు 'చీర' (సారీ) అనే పదాన్ని ఆంగ్లంలో హిందీ ద్వారా sari గానూ,, ఆంగ్ల పదం ని pantని తెలుగులో ప్యాంటుగా మార్చుకున్నాం. అదే shirt విషయంలో సమానార్థక పదమైన చొక్కా అని వాడుతున్నాం. అట్లాగే soup అనే పదాన్ని ప్రతిలేఖనం ద్వారా 'సూప్' అనే అంటున్నాం. యూరప్ దేశాలలో వివిధ రకాల వైన్స్ వాడుకలో ఉన్నాయి. వీటంతటికి సమాన పదాలు మన భాషలలో లేవు. ఇటువంటి సమయాల్లో ప్రతిలేఖనం ద్వారానే అనువదించాలి.

ఇల్లు నిర్మాణం ఆయా దేశ వాతావరణ పరిస్థితుల కనుగుణంగా ఉంటుంది. ఇంట్లో వస్తువులు ఆయా ప్రజల సాంస్కృతిక జీవనానికి ప్రతీకలు. ఇవి ఒక్కో ప్రజలకు ఒక్కో విధంగా ఉంటాయి. ఉదాహరణకు ఆంగ్లంలో 'CHAIR' 'TABLE' పదాలకు 'కుర్చీ' 'బల్ల' అని అనువదిస్తున్నాం. అదే 'dressing table', 'dining table'లకు ప్రతి లేఖనం ద్వారా అనువదిస్తున్నాం. ఇంకా dining hallకి భోజనాల గది లేక 'భోజన శాల' అని వాడుతున్నాం. ఎందువలనంటే ఇవి మనం బ్రిటిష్‌వాళ్ళ దగ్గరనుండి అరువు తెచ్చిన సంస్కృతి కాబట్టి సహజంగా మన భాషలలో వీటికి సమాన పదాలు కనబడవు.

ఒక్కో ప్రజల సామాజిక నిర్మాణం, కుటుంబం, దానిలో ఉండే వ్యక్తుల మధ్య సంబంధాలు తెలిపే పదాలు ఒక్క విధంగా ఉంటాయి. కొన్ని భాషలలో 'parents' అని ఒకే పదం ద్వారా చెప్పలేం. తెలుగులో కూడ ద్వంద్వ సమాసం ద్వారా రెండు పదాలను 'తల్లి' 'తండ్రి' కలిపి 'తల్లిదండ్రులు' అంటున్నాం. అలాగే ఆంగ్లంలో 'మామ' అని సంబోధించడానికి మూడు పదాల ద్వారా అంటే father in law ఒకే పదం father - in - law చేసి వాడాలి. అట్లాగే తమ్ముడు – younger brother అన్న - elder brother మొదలైనవి. తెలుగులో brother అనే మాటకీ sister అనే మాటకీ తెలుగు లేదు. విశాఖమండలంలో ఈ అర్థాల్లో అన్నదమ్ముడు, అప్పచెల్లెలు అనే మాటలు వాడుకలో ఉన్నాయి. సమాజంలో వివిధ వర్గాలను సంబోధించడానికి వివిధ పదాలున్నాయి. ఉదాహరణకు ఆంగ్ల పదం'sir కి 'అయ్యా' అని వాడుతున్నాం. కాని lord అనే పదానికి అనువాదం లేదు. అయితే మత గ్రంథాలలో ' ఓ మహాత్మా' అని తరచు సంబోధిస్తూ ఉంటారు. తెలుగు బైబిలులో ప్రభువు అనే మాట వాడుకలో ఉంది. ఇక మత, తాత్విక, పెళ్ళి, పుట్టిన రోజు, మరణం మొదలైన విషయాలకొస్తే భారత దేశ సంస్కృతి ఇతర సంస్కృతుల కన్నా ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతుల కన్నా భిన్నంగా ఉంటుంది. వీటికి సంబంధించిన గ్రంథాల అనువాదంలో అనేక సమస్యలు ఎదురౌతూ ఉంటాయి. ఇటువంటప్పుడు చాలా పదాలు, పద ప్రయోగాలను ప్రతి లేఖనం ద్వారా అనువదించి వివరణ ఇస్తే గాని ఆదాన భాషలో అది అర్థమవదు.

పరిపాలనా వ్యవహారాలలో, న్యాయ సంబంధ విషయాలలో తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు ఎక్కువ ఇంగ్లీషు, ఉర్దూ, పర్షియన్ పదాలనే వాడుతున్నాం. ఉదాహరణకు విల్లు, కోర్టు, జడ్జి, మేజిస్ట్రేటు, మునసబు, దర్యాప్తు,

BRAOU

తాకీదు, అదాలతు, లూటీ, దస్కతు, జప్తు మొదలైనవి పదాలు.

మత సంస్కృతి మిగిలిన వాటికన్నా సంకీర్ణంగా ఉంటుంది. దీనిలో అతి కష్టమైన పదజాలం ఉంటుంది. అందువలన ఒక ప్రజల మత నియమాలు, ఆచారాలు వేరే ప్రజలకు వింతగా కనబడతాయి. అవసరమైతే అనువాదకుడు ప్రజలతో వారి మతాచారాలపై చర్చించాలి. వాటి భావాలను విమర్శనాత్మక దృష్టితో చూడకూడదు. ఎందుకంటే ఒకవేళ అనువాదకుడు మత గ్రంథాలలో సరియైన పదజాలాన్ని ఉపయోగించకపోతే, అతనిని ఆ మతం గూర్చి ఏమి తెలియదని లేక దానిని అర్థం చేసుకోలేదని భావించవలసి వస్తుంది. అందువల్ల ప్రాంతీయ మతమైతే ప్రాంతీయ పదాలను, జాతీయ పదమైతే జాతీయ పదాలను అనువాదకుడు ఉపయోగించాలి. పదాలను వాడడానికి ప్రత్యేకమైన పద్ధతంటూ ఏమీ లేదు. ఏ పదం గ్రంథంలో ఎక్కడ ఇముడుతుందో, ఆదాన భాషా పాఠకునిచే అంగీకరింపబడుతుందో అనువాదకుడు నిర్ణయించుకోవాలి. మత గ్రంథాలలో ఎక్కువగా ఆధునిక పదాలకంటే, పాత పదాలే వాడతారు.

**అభ్యాసం – 2**

వ్యక్తుల మధ్య సంబంధ బోధకాలను అనువదించేటప్పుడు ఎదురయ్యే సమస్యలను వివరించండి?

BRAOU

## 19.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- అనువాదంలో ఎదురయ్యే సమస్యలు భాషా పరమైనవి, మరియు సాంస్కృతిక పరమైనవి.
- ఒకే వ్యాకరణ, అర్థ లక్షణాల మధ్యగల భాషల మధ్య అనువాదంలో ఈ సమస్యలు ఉత్పన్నం కావు. వేర్వేరు లక్షణాలు గల భాషల మధ్యలో వివిధ స్థాయిలలో అనువాదకుడు చాకచక్యంతో వ్యవహరించవలసి ఉంటుంది.
- ఇరు భాషా లక్షణాలను అనువాదకుడు వర్ణనాత్మక, తులనాత్మక దృష్టితో పరిశీలించి విశ్లేషించాలి.
- అనువాదకుడు ఉపయోగించిన భాషా ప్రయోగాలు ఆదాన భాషా పాఠకునికి ఆమోద యోగ్యంగా ఉండాలి. అప్పుడే అనువాద లక్ష్యం నెరవేరుతుంది.
- విభిన్న సంస్కృతుల మధ్య అనువదించేటప్పుడు అనువాదకుడు అనుసంధానకర్తగా వ్యవహరించాలి.

- రెండు సంస్కృతుల పట్ల సమదృష్టి ఉండాలి. వాటి పట్ల లోతైన అవగాహన ఉండాలి. కొన్ని కొన్ని సాంస్కృతిక విషయాలపై అవసరమైతే పాఠకులతో చర్చించి, క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

- మూల భాషా సంస్కృతిని ఆదాన భాషా పాఠకుని సాధ్యమైనంత వరకూ విపులంగా అందించాలి. దీనివలన పాఠకునికి అన్యదేశ సంస్కృతుల పట్ల ఆసక్తి పెరిగి అతని వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది.

## 19.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. అనువాదంలో ఎదురయ్యే భాషా సమస్యలను క్లుప్తంగా తెలపండి.

2. అనువాదంలో సాంస్కృతిక సమస్యలను సోదాహరణంగా చర్చించండి.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. అనువాదంలో వాక్య నిర్మాణానికి సంబంధించిన సమస్యలు ఎలా ఉంటాయో తెలపండి.

2. సాంస్కృతీ సంబంధమైన అనువాద సమస్యలను రెండింటిని పేర్కొని వివరించండి.

BRAOU

# భాగం : 20 వైజ్ఞానిక , సాహిత్య, న్యాయ, మత, తాత్విక పత్రికా రచనల అనువాదం, అనువర్తన

## విషయ క్రమం

20.0 ఉద్దేశం

20.1 ప్రవేశిక

20.2 వైజ్ఞానికానువాద ఆవశ్యకత

20.2.1 వైజ్ఞానికానువాదకుని లక్షణాలు - అనువర్తన

20.2.2 వైజ్ఞానికానువాదంలో సమస్యలు, మెలకువలు

20.3 సాంకేతికానువాద పద్ధతి

అభ్యాసం - 1

20.4 మత, తాత్విక రచనల అనువాదం

20.5 న్యాయ గ్రంథాల అనువాదం

అభ్యాసం - 2

20.6 వార్తాపత్రికా రచనల అనువాదం

20.7 సాహిత్య, వైజ్ఞానిక గ్రంథాల మధ్యగల తారతమ్యత

20.7.1 సాహిత్య అనువాదం ప్రత్యేకత

20.7.2 పద్యం - అనువాదం

20.7.3 పద్యానువాద పద్ధతులు

20.7.4 వచనం - అనువాదం

20.7.5 నాటకం - అనువాదం

అభ్యాసం - 3

20.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

20.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 20.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు:

- వైజ్ఞానికానువాదం ప్రాముఖ్యం.
- వైజ్ఞానిక గ్రంథాలను అనువదించడానికి అనువాదకుడు ఏఏ లక్షణాలను కలిగి ఉండాలి
- శాస్త్రీయ రచనల అనువాదంలో ఉత్పన్నమయ్యే సమస్యలు, పరిష్కారం
- సాంకేతిక గ్రంథాల అనువాదం ఏ విధంగా చేయాలి.
- మత, తాత్విక రచనల అనువాదం యొక్క లక్షణాలు
- న్యాయ గ్రంథాలు, వార్తా పత్రికలు, ప్రకటనలు, సాహిత్యానువాదంలో పద్ధతులు, సమస్యలు

## 20.1 ప్రవేశిక

BRAOU

అనువాద ప్రకియకు సంబంధించి కొన్ని మెలకువలను గ్రహించాం. అలాగే అనువాదంలో పద్ధతులనూ తెలుసుకున్నాం కూడా. ప్రత్యేకమైన విషయాలను అనువాదం చేసేటప్పుడు చాలా కొత్త సమస్యలు వస్తాయి. విషయ స్వభావం, సందర్భం బట్టి ఆ సమస్యలు మారుతుంటాయి. రకరకాల సామాజిక సందర్భాలకు అనువుగా మనం అనువాదానికి విషయాన్ని ఎన్నుకుంటుంటాం.

## 20.2 వైజ్ఞానికానువాద ఆవశ్యకత

ప్రతి శాస్త్రజ్ఞుడు లేదా సాంకేతిక నిపుణుడు ఒక భాషలో రాసేటప్పుడు, చదివేటప్పుడు అతను ఇతర భాషలలో జరుగుతున్న పరిశోధన పట్ల, వాటి ఫలితాల పట్ల సహజంగానే ఆసక్తి కనబరుస్తాడు. ఇది ఒక రకంగా తన పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి చాలా అవసరం కూడా. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న నేటి సామాజిక పరిస్థితులలో తనకు తెలిసిన వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని నలుగురితో పంచుకోవడం, అలాగే ఇతరుల దగ్గర ఉన్న దానిని తాను గ్రహించడం, అంటే క్లుప్తంగా చెప్పాలంటే, పరస్పర భావ వినిమయం ఎంతైనా అవసరం. ఈ ప్రక్రియలో వైజ్ఞానికానువాదం ప్రధాన పాత్ర వహిస్తుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా సమాచారాన్ని వెదజల్లడానికి దోహదపడుతుంది. ఇక్కడ వైజ్ఞానికాను వాదం అంటే శాస్త్ర (Scientific) సాంకేతిక (Technical) గ్రంథాల అనువాదం అనే అర్థంలో వాడుతున్నాం.

శాస్త్ర మనేది ఒక అపురూపమైన సృజనాత్మకత. ఏ సమాజ వైజ్ఞానిక సంస్కృతి (scientific culture) అయినా ఆ సమాజ ప్రవర్తనకు ఆయువు పట్టు. ఇది ఇతర సమాచారాలలో వివిధ స్థాయిలలో, వివిధ రూపాలలో ఏ మేరకు జ్ఞాన వినిమయం జరుగుతుంది అనే అంశంపై ఆధారపడి ఉంటుంది. అయితే సాంకేతిక రంగంలో ఈ ప్రవాహం శాస్త్రవేత్తలతో మొదలై కర్మాగారంలో ఉత్పత్తితో అంతమౌతుంది. అందువలన సమాచారమనేది ఎల్లప్పుడూ రాత రూపంలోనో, ముద్రించినదో కానవసరం లేదు.

సమాచార వినిమయం సాధారణంగా వివిధ దేశాల శాస్త్రజ్ఞుల మధ్య జరుగుతుంది. అందువలన వైజ్ఞానికానువాదకుడు వేర్వేరు భాషల మధ్య వంతెన లాంటి వాడు.

### 20.2.1 వైజ్ఞానికానువాదకుని లక్షణాలు, అనువర్తన

ఇంతకు ముందు భాగంలో వివరించిన కొన్ని ముఖ్యమైన అనువాదకుని లక్షణాలతో పాటు వైజ్ఞానిక, సాంకేతిక గ్రంథాలను అనువదించడానికి అనువాదకునికి ఈ కింది లక్షణాలు ఉండాలి:

ఏ అనువాదకుడికైనా అనువదించే రెండు భాషలు క్షుణ్ణంగా తెలియడంతో పాటు శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉండాలి. తాను అనువదించే అంశం గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. అందుకనే సాంకేతికానువాదంలో ఒక్కొక్కప్పుడు భాషా పరిజ్ఞానం కంటె విషయ పరిజ్ఞానం చాలా ముఖ్యం.

ప్రతి భాష వ్యవహర్తల అవసరాల కనుగుణంగా అభివృద్ధి చెందుతూ ఉంటుంది. అవసరాలు మారినప్పుడు, భాష కూడా మారుతుంది. ఇటీవల స్వాతంత్ర్యం సంపాదించుకున్న కొన్ని వ్యవసాయిక దేశాలలో కొత్తగా న్యాయ, రాజకీయ, వైజ్ఞానిక విషయాలకు ఉపయోగ పడేలా భాషలు మారుతున్నాయి. ఇటువంటి సందర్భాలలో వైజ్ఞానికాను వాదకుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఎందుకంటే ఇతర భాషల నుంచి ఆదానాలు విరివిగా ఉంటాయి. కాబట్టి వైజ్ఞానిక పదాలను సృష్టించడం అనువాదకుని చేతిలో ఉంది. ఇది చాలా ముందు చూపుతో చేయవలసిన పని. భాషకు 'కొత్త' దైన అంశాన్ని అనువదిస్తున్నప్పుడు సరైన సమానార్థకాలను కనుక్కొని, అవి ఆ 'కొత్త' భాషలో ఇమిడేటట్లు చూడాలి.

గ్రంథకర్తతో పాటు, వైజ్ఞానికానువాదకునికి కూడా భావ ప్రకటనలో స్పష్టత ఉండాలి. ఎందుకంటే ఈ గ్రంథాలను చదివేవారు అనువదింపబడిన గ్రంథంపై విషయంలో లోతైన అవగాహన కలిగిన వారూ అయివుండవచ్చు. లేదా కొద్ది పాటి పరిజ్ఞానం వున్న వాళ్ళూ కావచ్చు. లేదా అసలు ఏమీ తెలియని వారై ఉండవచ్చు. అందువల్ల అందరు పాఠకులను అలరించేలా భావ వ్యక్తీకరణలో ఒకే విధమైన స్పష్టత కావాలి.

BRAOU

శాస్త్రీయ, సాంకేతిక రంగాలకు సంబంధించి వివిధ రకాల పత్రాలు (documents) ఉంటాయి. ఉదాహరణకు డిసర్టేషన్ (dissertation), థీసిస్ (thesis), మాన్యువల్ (manual), పామ్ప్లెట్ (pomplet) మోనో గ్రాఫ్ (monograph), కాన్ఫరెన్స్ పేపర్ (conference paper), కాటలాగ్ (catalogue) సేల్స్ బ్రోచర్ (sales brocher), ప్రకటన (advertisement) మొదలైనవి. వీటిలో ప్రతి దానికి భాషలోను భావంలోను తనదంటూ ప్రత్యేక గుణాలుంటాయి. ఈ గుణాలపై అధారపడిన శైలి ఉంటుంది. వైజ్ఞానికానువాదకుడు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని గ్రంథాన్ని (text) అనువదించాలి.

వైజ్ఞానిక, సాంకేతిక సమాచారం ఎక్కువ భాగం ఆంగ్లంలో ప్రచురించబడుతోంది. ఇది ప్రధానంగా అమెరికా, ఇంగ్లండు దేశాలలో ఉంది. దీనితో బాటు కామన్‌వెల్త్ దేశాలలో కూడా ఆంగ్లంలో శాస్త్రీయ సమాచారం వెలువడుతోంది. అందువలన ఆంగ్లంనుంచి ఇతర భాషలలోకి అనువదించడంలోని అనుసరించవలసిన మెలకువలు, ఉత్పన్నమయ్యే సమస్యలు ఏ వైజ్ఞానికానువాదకునికైనా ముఖ్యమైనవి. అయితే ఈ మధ్యనే రష్యన్ భాష కూడా ప్రధాన శాస్త్రీయ భాష అయింది. చైనా భాష త్వరలో కావచ్చు. అందువల్ల శాస్త్రీయ, సాంకేతికానువాదాల అవసరం పెరుగుతూనే ఉంది. అయితే వీటినుంచి ఏ భాషలోకి అనువదించాలనే ప్రశ్న చాలా కాలంగా శాస్త్రజ్ఞులను వెంటాడుతూ ఉంది. దీనికి ఒక మార్గాన్ని సూచించారు. ఎక్కువ మందికి తెలిసిన అంతర్జాతీయ భాషలోకి లేదా కృత్రిమ (artificial) భాషయైన ఎస్పరాంటో (esperanto) లోకి గాని అనువాదం చేయవచ్చునని భావించారు. వివిధ రాజకీయ కారణాల వల్ల మొదటిది

ఫలించలేదు. అలాగని కృత్రిమ భాషలోకి అనువాదం అంత సానుకూలంగా అనిపించలేదు. అందువల్ల యంత్రానువాదం (machine translation) ఒక్కటే శరణ్యమని భావించినా, ఈ దిశగా ఇంకా జరుగవలసింది చాలా ఉంది.

### 20.2.2 వైజ్ఞానికానువాదంలో సమస్యలు, మెలకువలు

వైజ్ఞానికానువాదంలో ప్రధాన సమస్య పదజాలం (terminology)తో వస్తుంది. ఏవో కొద్ది పదాలు తప్పించి, ప్రతి సారి వైజ్ఞానిక సాహిత్యంలో నూతన పదాల సృష్టి జరుగుతుంది. ఉదాహరణకు 'box', 'train' లాంటి తరచూ వాడే పదాలే ఉపయోగించిన ప్రతి సారి కొత్త అర్థాలను కూర్చుకుంటాయి. అందునా శాస్త్రీయ విషయాలు ప్రపంచంలో ఏ భాషలోనైనా ఒకే విధంగా ఉంటాయి. ఉదాహరణకు$(a^2 + b^2) = a^2 + 2ab + b^2$ అనే సూత్రం ఏ భాషలోనైనా ఒక్కటే: శాస్త్రీయ ప్రమాణాలు ఏ విధంగా ఎదిగిపోయాయంటే, ఏదైనా శాస్త్రీయ గ్రంథాన్ని చదవాలంటే, ఆ శాస్త్రంలోని నిపుణులకి తప్ప వేరే వారికి అర్థం కాదు.

సాంకేతిక భాష అనేది ఏ భాషలోనైనా ఒక భాగమే. దీని పదజాలం, వ్యాకరణ రూపం ప్రామాణిక భాషవే. ఒకొక్కప్పుడు దీనిని సాంకేతిక మాండలికం (technical dialect) గా వర్ణిస్తారు. జాలర్ల భాష, వడ్రంగి భాష మొదలైనవి సాంకేతిక భాషా రూపాలే. సాంకేతిక భాషను శైలి బట్టి గుర్తించవచ్చును. దీనిలో సాధారణంగా వీటిలో కర్మ ప్రధాన వాక్యాల (passive forms) వాడకం ఎక్కువ.

శాస్త్ర భాషలో ఉన్నతమైన ప్రామాణికత కల్గిన పదజాలాన్ని వాడతారు. ఇవి సాధారణ భాషలో కనిపించవు. వీటిని యూరప్ భాషలలోకి గ్రీకు, లాటిన్ భాషలనుంచి తీసుకుంటే, భారతీయ భాషలలో సంస్కృత, ఆంగ్ల, ఉర్దూ పదాలను స్వీకరిస్తారు.

సాంకేతిక భాషలోకి పదాలు వచ్చే మార్గాలు: నిష్పాదకాలు (derivatives), సమాసాలు (compounds), పాత పదానికి కొత్త అర్థం జోడించడం వల్ల, నూతన పదాలు, ఆదానాల (ముఖ్యంగా classical భాషలనుండి) ద్వారా ఏర్పడతాయి. ఆదానాల ద్వారా అన్య భాషా పదాలని సరాసరి తమ భాషలోనికి తెచ్చుకోవచ్చు. ఉదాహరణకు స్టేషన్, స్పుత్నిక్, బ్యాంకు మొదలైనవి. ఆగతానువాదాల (loan translation) ద్వారా కూడా సాంకేతిక ( శిఖరాగ్ర చర్చలు (summit talks), శ్వేత పత్రం (white paper) వంటి ఇందుకు ఉదాహరణలు) పదజాలాన్ని సృష్టించవచ్చును.

ఏదైనా సాంకేతిక గ్రంథాన్ని చదివేటప్పుడు ముఖ్యమైన పదజాలాన్ని ఎంచుకొని, అవసరాన్ని బట్టి విశ్వకోశాన్ని (Encyclopedia) సంప్రదించాలి. సాధారణంగా భాషలోకి సందర్భానిబద్ధ (context - free) పదాలతో సమస్య వస్తుంది. ఒకవేళ సందర్భ నిబద్ధ పదాలు (context - bound) అయితే అర్థం చేసుకోవడం సులభమౌతుంది.British standards institution (BSI)అనే సంస్థ సాంకేతిక పదజాలాన్ని ప్రమాణీకరించింది. అయినా కొన్ని కొన్ని పదాలకు ఒకే శాస్త్రంలో ఒకటి కంటె ఎక్కువ అర్థాలు ఉండడం లేదా ఒకే పదానికి రెండు మూల శాస్త్రాలలో వేరే వేరే ఉపయోగించడం జరుగుతోంది. కాని ఈ సంస్థ యొక్క ముఖ్యోద్దేశ్యం ఏమిటంటే ఒక పదానికి ఒకే అర్థం ఉండేలా చూడడం.

వైజ్ఞానిక పదాలు మూడు రకాలుగా ఉంటాయి: (1)Academic అంటే గ్రీకు, లాటిన్ సంబంధించిన పదాలు కల్గిన పరిశోధనా పత్రాలు; (2) Proffessional అంటే నిపుణులచే ఉపయోగింపబడే సాధారణ పదాలు; (3) Popular అంటే వ్యక్తి వాడే పదజాలం (ఉదా: ఆట్లమ్మ, విషజ్వరం మొదలైనవి) అయితే కొన్ని కొన్ని సందర్భాలలో మాండలిక పదాలు కూడా తటస్థ పడతాయి.

BRAOU

సాంకేతిక, వర్ణనాత్మక (descriptive) పదాల మధ్య తారతమ్యం ఒక సమస్య. గ్రంథకర్త వర్ణనాత్మక పదాన్ని సాంకేతిక పదంగా ఈ క్రింది కారణాల వల్ల వాడతారు:

1) వస్తువు కొత్తదై, ఇప్పటి వరకు పేరు లేకపోతే;

2) ప్రత్యామ్నాయ పదం అవసరమైనప్పుడు దీనివల్ల ఒకే పదాన్ని పదే పదే వాడి విసుగు కలిగించకుండా ఉండొచ్చు.

3) మరొక పదంతో తారతమ్యం చూపవలసిన అవసరం ఏర్పడ్డప్పుడు.

అయితే ఈ రెంటిని ఒక దాని బదులు మరొకటి కాకుండా, వాటి వాటి సమాన పదాలతోనే అనువదించడం మంచిది. అనువాదకుడు ఏదో తన పరిజ్ఞానాన్ని చాటి చెప్పడం కోసం వర్ణాత్మక పదాన్ని సాంకేతిక పదంతో అనువదిస్తే, వర్ణనాత్మక పదానికి మూల భాషలో ఉన్న భాషాపరమైన శక్తి పోతుంది. అలా కాక గ్రంథ కర్త అజ్ఞానం (ignorance) వల్ల కూడా వాడవచ్చు. లేదా సరియైన పదం (సాంకేతిక) మూల భాషలో లభ్యం కానందువలన కూడా వర్ణనాత్మక పదాన్ని ఉపయోగించవచ్చు. ఏదైనా వస్తువు ఆదాన భాషా సంస్కృతికి తెలియనప్పుడు మాత్రమే వర్ణనాత్మక పదాన్ని సాంకేతిక పదంతో అనువదించాలి.

నైపుణ్యం కలిగిన సాంకేతికానువాదకులు సాంకేతిక పదం అందుబాటులో ఉంటే వర్ణనాత్మక పదాల్ని తిరస్కరిస్తారు. అర్థ పరిమాణంలో ప్రామాణిక భాషలోకి సాంకేతిక పదం, వర్ణనాత్మక పదం కంటే సంగ్రహంగా ఉంటుంది. మూల భాషా సాంకేతిక పదానికి ఆదాన భాషలో సమానార్థకం లేనప్పుడు, వర్ణనాత్మక పదాన్నే వాడాలి.

సాంకేతిక అనువాదకుడు మొదట్లోనే ఏదో ఒక శాఖలో నైపుణ్యం సంపాదించడానికి ప్రయత్నించక సాధ్యమైనంత వరకు ఎక్కువ శాఖలపై దృష్టి కేంద్రీకరించాలి. అందునా ఈనాడు ముఖ్య పాత్ర వహిస్తున్న కంప్యూటర్ అప్లికేషన్స్‌లో నైపుణ్యం చాలా అవసరం. అనువదించేటప్పుడు వాక్యంలోని భావంతో పాటు, భాషా పరంగా కూడా వాక్య నిర్మాణం సరిగా ఉండేలా జాగ్రత్త పడాలి. ఈనాటి శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో ఎక్కువ అంతర్జాతీయ పదాలే వాడుతున్నారు. కాబట్టి అనువాదకుడు విధిగా వాటినే ఉపయోగించాలి. లేకుంటే గ్రంథం బోధపడదు. కొత్త కొత్త రంగాలలో అయితే ఉపయోగిస్తున్న పదాలు ఆదాన భాషలో స్థిరపడినవా లేదా అని అనువాదకుడు ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి. అందువలన గ్రంథాన్ని అనువదించడానికి సాంకేతిక పరిజ్ఞానమో లేదా విషయంలో లోతైన అవగాహనో అవసరం లేదు. కాకపోతే గ్రంథం మొత్తంగా అర్థమై, దానిలో వాడుతున్న పదజాలం తెలిస్తే సరిపోతుంది. ఇంజనీరింగ్‌లో అనువాదంతో పాటు ప్రధాన పదజాలం (basic vocabulary) తెలియాలి. (ఉదా: bolt, clamp, clutch, crank వంటివి)

## 20.3 సాంకేతిక అనువాద పద్ధతి

సాంకేతిక గ్రంథాన్ని అనువదించేటప్పుడు మొదటగా దానిని క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకోవాలి. ఆ తరువాత గ్రంథ స్వభావాన్ని పరిశీలించాలి. అంటే గ్రంథం ఏ ఉద్దేశ్యంతో రాయబడింది, అనువాదకునికి, గ్రంథానికి మధ్య గల సాంస్కృతిక, వృత్తి (professional) తారతమ్యాలను పరిశీలించాలి. అటు పిమ్మట అనువాదకుడు తన అనువాదపు శైలిని నిర్ణయించుకోవాలి. ఎందుకంటే అనువదించేది వ్యాసమో, పత్రమో అయితే దానికి సంబంధించిన పత్రికకు ఒక శైలి ఉంటుంది. దాని ప్రకారమే అనువాదకుడు అనువదించాలి. గ్రంథంలోని ప్రతి పదాన్ని, ప్రతి విరామ చిహ్నాన్నీ (punctuation mark) అనువాదం చేయాలి. పత్రిక పేరును, పత్రికకు సంబంధించిన వివరాలను అంటే సంపుటి, తారీఖు,

సంవత్సరం మొదలైనవి అనువదించాలి. ఉదాహరణకు 'తెలుగు' వైజ్ఞానిక మాస పత్రిక, సంపుటి 6, సంచిక 9, సెప్టెంబరు 1992, తెలుగు అకాడమి, హైదరాబాద్ అనే వివరాలన్ని అనువదించాలి. అట్లాగే గ్రంథకర్త (లు) ఎక్కడ పనిచేస్తున్నదీ, అర్హతలు, పూర్తి పేర్లు, అడ్రసు కూడా అనువాదం చేయాలి. ఎందుకంటే పాఠకుడు అవసరమైతే గ్రంథకర్తకు రాసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఏదైనా పదం ఉపయోగపడుతుందని భావిస్తే ఆ పదాన్ని ఫుట్‌నోట్ (foot - note)లో ఇచ్చి మరింత వివరణ ఇవ్వవచ్చు).

అనువాదకుడిగా గ్రంథం పేరును 'మార్చడానికి' అధికారం, అవకాశం ఉంది, సాంకేతిక గ్రంథాల పేర్లు వర్ణనాత్మకంగా ఉండి, గ్రంథంలోని విషయం, ఉద్దేశ్యం దానిలో ప్రతిబింబించబడతాయి. గ్రంథకర్త పదవి (designation), ఉదాహరణకు శాఖాధిపతి, అలాగే పని చేస్తున్న సంస్థ, ఉదాహరణకు, ఉస్మానియా మెడికల్ కాలేజీ, ఏ దేశంలో పని చేస్తున్నదీ కూడా అనువదించాలి. దీనివల్ల పాఠకునికి గ్రంథకర్త విద్యాస్థాయి పట్ల అవగాహన కలుగుతుంది.

గ్రంథం చదివి తెలియని పదాలను, నిర్మాణాలను గుర్తు పెట్టుకోవాలి. మనం ముఖ్యంగా ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువదిస్తాం. కాబట్టి ఈ కింది విషయాలను గమనించాలి:

- తెలియని పదాలు, ముఖ్యంగా అవి సాంకేతిక గ్రంథాలలో ఎక్కువగా గ్రీకు, లాటిన్, భాష నుంచి వచ్చిన పదాలే ఉంటాయి. ఉదాహరణకు radio elements, liucine, photomulticaturs లాంటివి. ఎందుకంటే అనువాదకుడు వీటి సమాన పదాలను ఆదాన భాషలో (తెలుగులో) సృష్టించాలి. లేదా ఫుట్‌నోట్‌లో గాని, ఉల్లేఖన చిహ్నాల మధ్యగాని ఇవ్వాలి.

- గ్రంథంలో పటాలు, గుర్తులు ఉంటే ఆదాన భాషలో రాయాలి. ఇక్కడ అవసరమైతే అనువాదకులు సాంకేతిక నిపుణుల సహాయం తీసుకోవాలి.

- represent, can be said, is to be said, refferred to call, designate, define లాంటి పదాలకు తెలుగులో సరియైన క్రియతో అనువదించాలి. సాంకేతిక భాషలో ఇవన్నీ అతి దగ్గరలో ఒకే అర్థాన్ని సూచిస్తాయి. ఏదైనా భావన (concept)ని నిర్వచించేటప్పుడు ఆంగ్లంలో పై క్రియలు వాడతాం, తెలుగులో 'పిలుచు' 'చెప్పు', 'నిర్వచించు' మొదలైన క్రియలను ఉపయోగిస్తాం.

- కొన్ని పదసమూహాలు, ఉదాహరణకు, a great deal of ----, ambitious attempts, take it for granted లాంటివి వ్యాకరణ రూపాన్ని ప్రతి వాక్యాన్ని అనువదించాలి. ఎందుకంటే సాంకేతికానువాదంలో అనువాదకుడు ధైర్యంగా, ఉదారంగా వాక్యాలను అవసరాన్ని బట్టి విభజించవచ్చు. అప్పుడే అనువాదకుడు ఒక నైపుణ్యం గల గ్రంథకర్తగా, మూలగ్రంథం కంటే మంచి గ్రంథాన్ని అందించగలడు. అయితే సాంకేతిక పద జాలానికి సంబంధించి ఎటువంటి శ్రమ ( risk ) తీసుకోకూడదు.

ఒక సాంకేతిక అనువాదకుడి పాఠకుని బట్టి గ్రంథం యొక్క రూపం మారుతుంది. ఒకవేళ పాఠకుడు పద పదానువాదం కావాలంటే, అనువాదకుడు మూల గ్రంథం యొక్క శైలిని మార్చకుండా అనువదించాలి. అట్లాకాక, ఏదైనా ముద్రణ కోసమైతే, ఆ పత్రిక (journal), నిర్దేశించిన శైలి ప్రకారం అనువదించాలి. ఉదాహరణకు British medical journalలో కర్మణి ప్రయోగాలు (examinations are done, a decision was required), ద్వినామ వాచక సమాసాలు (endoscopy plan), తత్ధర్మక ప్రయోగాలను (all purpose verbe) (the answer is, to take action have effect), అలాగే we (మేము) ఎక్కువగా వాడతారు.

BRAOU

సాంకేతిక భాషకున్న ప్రధాన లక్షణం - అనంతమైన పదాలు. ఎప్పుడూ ఏదో ఒక కొత్త వస్తువునో, దాని గుణాన్నో, దానికి ఇతర వస్తువులతో గల సంబంధాన్నో పిలవవలసి వస్తుంది. అప్పుడు కొత్త పదాలను సృష్టించక తప్పదు. అందువల్ల యూరప్ భాషలలో లాటిన్ నుంచి, గ్రీకు నుంచి, భారతీయ భాషలలో సంస్కృతం నుంచి, ఆంగ్లం నుంచి స్వీకరిస్తారు. లాటిన్ నుంచి స్వీకరించిన పదాలు వివిధ కారణాల వల్ల అంతర్జాతీయ పదాలుగా మారతాయి.

ఇక చివరిగా, సాంకేతిక పదజాలం ఏ గ్రంథంలోనైనా 5% - 10% ఉంటుంది. మిగిలినదంతా సాధారణ భాషే. అందువల్ల అనువాదకుడు పాఠకునికి అనువైన, ఆమోదయోగ్యమైన భాషలో రాయాలి.

**అభ్యాసం - 1**

శాస్త్రీయ, సాంకేతికానువాదాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 20.4 మత, తాత్విక రచనల అనువాదం

BRAOU

మత తాత్విక గ్రంథాల అనువాదంలో ఉత్పన్నమయ్యే అంశాల గూర్చి ఈ ఖండంలోనే అనువాదం: భాషా, సాంస్కృతిక సమస్యలలో విశదీకరించడం జరిగింది. తత్వ మనేది ఒక శాస్త్రం కాబట్టి ఈ భాగంలో చర్చించిన వైజ్ఞానికానువాద అంశాలు ఇక్కడ వర్తిస్తాయి. అందువల్ల ఈ రెంటిలోనూ అంటే మత, తాత్వికాను వాదంలో తారసపడే మరికొన్ని ఇతర విషయాల గూర్చి ఇక్కడ ముచ్చటించుకుందాం.

మొదటగా చెప్పుకోవాల్సింది - మత, తాత్విక గ్రంథాల మధ్య, వాటి అనువాదాల మధ్య అనేక సర్వసాధారణ అంశాలున్నాయి. అయితే ఈ రెంటి మధ్య ఒక ముఖ్యమైన తేడా కూడా ఉంది. తత్వం శాస్త్రమవుతుంది, కాని మతం శాస్త్రం కాదు.

ఏ మత సంస్కృతియైనా అతి కఠినమైన పదజాలంతో ఉంటుంది. మతమనేది ఒక వ్యవస్థ. ఇదీ సంస్కృతిలో భాగమేనని చాలామంది అంటూ ఉంటారు. సంస్కృతిలో మిగిలిన భాగాలకంటే, వివిధ మతాల మధ్య ఉండే తారతమ్యం ఎక్కువగా కనిపిస్తుంది. మానవుడి ఊహలకు అంతం లేదు. మానవాతీత విషయాలను ఊహించడానికి కూడా అంతం లేదు. ఏ మత వ్యవస్థలోనైనా సూక్ష్మమైన మలుపులు, పొసగని విషయాలు, నమ్మే వారి వైపు నుంచి అనేక రకాల ప్రతిస్పందనలు ఉండవచ్చు. ప్రతి వ్యక్తి తన మతాన్ని పూర్తిగా విశ్వసించడమే కాకుండా, దాని గొప్పతనాన్ని గూర్చి ఇతరులకు చెపుతాడు.

మత గ్రంథాన్ని అనువదించదల్చుకున్నప్పుడు, అనువాదకుడు ఆ మతస్థులతో సంబంధాలు కల్గి, దానిని గూర్చి వారితో చర్చించడం మంచిది. మతస్థుడు, తాను నమ్మిన దానిని గూర్చి చెప్పినపుడు, ప్రాంతీయ దేవుళ్ళ గూర్చి విన్నప్పుడు

అనువాదకుడు కొన్ని విషయాలను నమ్మకపోవచ్చు. ఒక్కొక్కప్పుడు నవ్వు కూడా రావచ్చు. కాని ఆ మతాన్ని విశ్వసించే ప్రజలతో సంబంధం, దానిని లోతుగా అర్థం చేసుకోవడానికే కాక, అనువాదంలో ఎంతో ఉపయోగపడుతుంది. అనువాదంలో సరియైన మత పదజాలాన్ని ఉపయోగించకపోతే పాఠకుడికి అర్థం కాదు. ఉదాహరణకు, హిందూ మతం అనువదించే వారికి వేద భాష, సంస్కృతం, క్రిస్టియన్ మతాన్ని అనువదించే వారికి లాటిన్ భాష తెలియవచ్చు. కాని మత గ్రంథాలలో వాడే ప్రత్యేక పదజాలం తెలియక పోతే సమగ్రమైన అనువాదం చేయలేడు.

పద అర్థాన్ని ఆధారంగా చేసుకొని, మత పదజాలాన్ని ఈ విధంగా విభజించవచ్చు. (1) మానవతాతీత శక్తులు 2) దివ్య జ్ఞానం. 3) మతం, ధర్మం, నీతికి సంబంధించిన విషయాలు (4) పరలోక సంబంధమైనవి, 5) ప్రత్యేక మత కార్యక్రమాలు 6) మత సంబంధిత వ్యక్తులు 7) మత కట్టడాలు, 8) మత సమూహాలు.

మత మనేది ప్రజల సంస్కృతిలో భాగమని ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఒక ప్రజల సంస్కృతిని అంటే ప్రకృతి పట్ల వారి విశ్వాసాలు, జీవితం పట్ల వారి అవగాహన, మరణానంతరం వారి నమ్మకాలను ప్రతిబింబించే అనేక పదాలు మతగ్రంథంలో ఉంటాయి. వీటికి సమాన పదాలు కాదు కదా, కనీసం దగ్గర అర్థాన్ని చెప్పే పదాలు ఒక్కొక్కప్పుడు ఆదాన భాషలో దొరకవు. ఆ మాట కొస్తే పురాతన గ్రంథాలను అదే భాషలోకి ఆధునిక భాషలో చెప్పాలంటే పాత పదాలను వాడాలే తప్ప 'ఆధునిక' పదాలేవీ దొరకవు. అందువల్ల మూల భాష నుంచి పదాలను గ్రహించడం ద్వారా కాని, పదాలను అరువు తెచ్చుకోవడం ద్వారా కాని అనువాదం చేయాలి. ఈ సమస్య 'అభివృద్ధి చెందిన' భాష నుంచి 'అభివృద్ధి చెందని' లేదా 'తక్కువ అభివృద్ధి చెందిన' భాషలలోకి అనువదించేటప్పుడు ఎదురౌతుంది. ఒకే సంస్కృతి కలిగిన భాషల మధ్య, ఉదాహరణకు భారతీయ భాషల మధ్య లేదా యూరోపియన్ భాషల మధ్య ఇది ఉత్పన్నం కాదు. మత గ్రంథాలలో ఉపయోగించే పదాలలో ఎక్కువ పదాలు పాత పదాలై ఉంటాయి. అనువాదకుడు, ఆదాన భాషలో వాటికి సమానమైన పాత పదాలను ఉపయోగించాలి.

మత గ్రంథాలలో ఎక్కువ పాత వ్యాకరణ రూపాలనే వాడతారు. ఇవి ఆయా భాషల ప్రాచీన మాతృక నుంచి లేదా ఆయా భాషలకు వివిధ కారణాల వల్ల దగ్గరగా ఉన్న ప్రాచీన భాష (ఉదాహరణకు ద్రావిడ భాషలకు సంస్కృతం) నుంచి తీసుకోవడం జరుగుతుంది. భారతీయ భాషలలోని హిందూ మత గ్రంథాలలో సంస్కృత పదాలు, సంస్కృతాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించిన వ్యాకరణ నిర్మాణాలు విరివిగా కనబడతాయి. ఈ గ్రంథాలలో సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలనే ఎక్కువగా వాడతారు. శైలి కూడా కఠినంగా ఉంటుంది. ఆదాన భాషలో అనువాదకుడు అదే విధమైన శైలిని, వాక్యాలను పునర్నిర్మించాలి. ఇది ఒక్కొక్కప్పుడు ఆదాన భాషా పాఠకుడికి ఆమోదయోగ్యం కాకపోవచ్చు. తెలుగులోనికి అనువదించిన క్రిస్టియన్ మత గ్రంథాలు ఇందుకు చక్కని ఉదాహరణ.

తత్వమనేది ఒక శాస్త్రం. పైగా ఇది శాస్త్రాలకు శాస్త్రమని చెప్పవచ్చు. దీని అర్థం, అన్ని శాస్త్రాల పదజాలం, శైలి, వాక్య నిర్మాణాలు దీనిలో ఉంటాయని కాదు. అన్ని శాస్త్రాల సారాంశమే తత్వ శాస్త్రం. ఎందువల్లంటే, ప్రతి శాస్త్రం ఏదో ఒక వస్తువునో, వస్తువులోని భాగాన్నో, కోణాన్నో తన పరిశోధనకు ఎంచుకుంటే, తత్వ శాస్త్రం ఈ ప్రపంచం అంటే బాహ్య, అంతః ప్రపంచాల గూర్చి సిద్ధాంతీకరిస్తుంది.

మానవుడు తన జీవిత విధానపు స్థాయిని బట్టి తన చుట్టూ ఉండే ప్రపంచం గూర్చి, దానిలో తన పాత్ర గూర్చి చర్చిస్తాడు. అందువల్ల విభిన్న సంస్కృతులున్న ఈ ప్రపంచంలో వివిధ తత్వ సిద్ధాంతాలున్నాయి. అయితే ఈ సిద్ధాంతాలు కాల, మాన పరిస్థితుల బట్టి మారుతూ ఉంటాయి. అందుకనే ప్రతి దేశపు తత్వ శాస్త్రంలోనూ వివిధ ధోరణులున్నాయి. వీటినే శాఖలు అంటున్నారు. ప్రతి శాఖ మరొక శాఖతో కొన్ని అంశాలలో అంగీకరిస్తూ, కొన్ని విషయాలలో


BRAOU

తిరస్కరిస్తుంది. అందువల్ల తత్వ శాస్త్రం మొత్తానికి సర్వసాధారణమైన పదజాలంతో పాటు, ప్రతి శాఖకూ తన సొంత పదాలుంటాయి. అట్లాగే ఒకే పదం వివిధ శాఖలలో వేర్వేరు అర్థాన్ని ఇస్తుంది. అనువాదకుడు తాత్విక గ్రంథాలను అనువదించేటప్పుడు ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలి.

తాత్విక రచనలలో భావం అమూర్తం (abstract) గా ఉండి, భాష జటిలంగా ఉంటుంది. అందువల్ల గ్రంథం పూర్తిగా అర్థమవడానికి అనేక సార్లు చదవవలసి వస్తుంది. ఒక శాఖలోని గ్రంథాన్ని అనువదించడానికి ఒక్కొక్కప్పుడు దాని సంబంధిత ఇతర శాఖల రచనలను కూడా చూడవలసి వస్తుంది. అర్థం కాని భావన (concept) లకు విశ్వకోశాన్ని, తాత్విక నిఘంటువులను సంప్రదించాలి. ప్రత్యేక పదజాలమనేది ఏదో ఒక తాత్విక ధోరణికి సంబంధించినదే కానక్కరలేదు. ఒక్కొక్కప్పుడు తత్వవేత్తను బట్టి కూడా మారుతూ ఉంటుంది. అనువాదంలో ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. వేర్వేరు సంస్కృతులైనప్పుడు, కొన్ని కొన్ని భావనలను అనువదించడం సాధ్యం కాదు. అంటే వాటి సమాన అర్థాన్ని వ్యక్తీకరించే పదాలు ఆదాన భాషలో ఉండవు. ఉదాహరణకు భారతీయ తాత్విక చింతనకు సంబంధించిన 'ధర్మం', 'ఆత్మ', 'పరమాత్మ', 'ప్రాణం' మొదలైన పదాలు. ఇటువంటి పదాలను వివరణం ఇవ్వడం ద్వారా అనువదించాలి.

తాత్విక భావం జటిలంగా ఉంటుంది కాబట్టి, వ్యాకరణ నిర్మాణాలు సంక్లిష్టంగా ఉంటాయి. పురాతన తాత్విక గ్రంథాలు పద్యరూపంలో ఉండవచ్చు. పాఠకుడిని బట్టి ఆధునిక ఆదాన భాషలో పద్యరూపంలోనూ, వచన రూపంలోనూ, అనువదించవచ్చు.

సాహిత్యంలో లాగాకొన్ని కొన్ని అనువాదాలు ఆదాన భాషలో నూతన తాత్విక పోకడలకు ఆజ్యం పోస్తాయి. ఇది ఆదాన భాషా సంస్కృతికి ఎంతగానో తోడ్పడుతుంది.

BRAOU

## 20.5 న్యాయ గ్రంథాల అనువాదం

తత్వ శాస్త్రం లాగానే శాస్త్రీయ గ్రంథాల అనువాదపు అన్ని అంశాలు న్యాయ శాస్త్రాల గ్రంథాల అనువాదానికి వర్తిస్తాయి.

మన దేశంలో ప్రస్తుత న్యాయ వ్యవస్థ బ్రిటిషు వారు పెట్టింది. అంతకు ముందు మహమ్మదీయుల పరిపాలనా కాలంలో అరబిక్, పర్షియన్ భాషా పదాలు తెలుగు ప్రజల రాజకీయ, సాంఘిక రంగాలలో వ్యవహారంలోకి వచ్చాయి. ఈ పదాల వల్ల తెలుగు వర్ణాల వ్యాప్తి (phonemic distribution) లో మార్పువచ్చింది. 15వ శతాబ్దం నుంచి పరిపాలన, సైనిక, న్యాయ వ్యవస్థలకు సంబంధించిన సుమారు 200 పదాలు పర్షియన్, అరబిక్ భాషలకు సంబంధించినవి పేర్కొనడం జరిగింది. ప్రాచీన కావ్యాలలో సైతం న్యాయ శాఖకు సంబంధించిన దివాను, నకలు మొదలైన పదాలు కనిపిస్తాయి.

తరువాత వరుసగా పోర్చుగీసు, ఇంగ్లీషు వారి పాలన మొదలవడంతో, వారి భాషల (ముఖ్యంగా ఆంగ్ల) ప్రభావం తెలుగుపై పడసాగింది. బ్రిటిషు వారు ఈ న్యాయవ్యవస్థ నారంభించిన సమయానికే ఉర్దూ, పర్షియన్ భాషల ప్రభావం అధికంగా ఉండడం వల్ల న్యాయ సంబంధిత రచనలను అనువదించేటప్పుడు ఎక్కువ ఈ భాషల పదాలనే ఉపయోగించారు.

ఈ భాషల పదాలే కాక, సంస్కృత, ఆంగ్ల పదాలు న్యాయ గ్రంథాలలో విరివిగా దొర్లుతాయి. (ఉదా: న్యాయమూర్తి, వాది, ప్రతివాది, లాయరు మొదలైనవి). వీటిలో చాలా పదాలు తెలుగు భాషలో భాగమైపోయాయి. ఉదాహరణకు 'వీలు' "will" అనే పదం ఇంగ్లీషు పదమే అంటే ఈనాడు చాలామంది నమ్మక పోవచ్చు. అందువల్ల

ఇంగ్లీషు నుంచి తెలుగులోనికి అనువదించేటప్పుడు సంస్కృతంతో పాటు పర్షియన్, ఉర్దూ భాషల పరిజ్ఞానం ఉండడం మంచిది. ఇది న్యాయ పదజాలాన్ని సృష్టించడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.

న్యాయ భాష శైలి శాస్త్రీయ శైలికి సమీపంగా ఉంటుంది. న్యాయ గ్రంథాలన్నింటిలోనూ ప్రామాణిక భాషనే వాడతారు. మాండలిక భాషకు వీటిలో తావు లేదు.

న్యాయ గ్రంథాలలో వాక్య నిర్మాణం జటిలంగా ఉంటుంది. సామాన్య వాక్యాల ప్రయోగం అతి తక్కువగా ఉండి, మహా వాక్యాలనే ఎక్కువ వాడతారు. అందువల్ల మహావాక్యాన్ని సామాన్య వాక్యం కింద విడగొట్టకుండా అనువాదకుడు ఆదాన భాషలోకి అనువదించాలి. అలాగే కర్మణి ప్రయోగాలను వీటిలో ఎక్కువగా వాడతారు.

భాషను ఆధునీకరణ చేయకపోతే ఏ శాస్త్ర గ్రంథాలనైనా అనువదించడం చాలా కష్టం.

శాస్త్రీయ గ్రంథాలకు విరుద్ధంగా సాహిత్య రచనలుంటాయి. ఏ ప్రజలకైనా శాస్త్రీయ, సాంకేతిక పదజాలం లేకపోవచ్చును గాని, సాహిత్యం మాత్రం తప్పని సరిగా ఉంటుంది.

**అభ్యాసం – 2**

న్యాయ గ్రంథాల అనువాదంలో ఉత్పన్నమయ్యే సమస్యలేమిటి? వాటి పరిష్కారానికి మార్గాలేమిటి?

BRAOU

## 20.6 వార్తాపత్రికా రచనల అనువాదం

వైజ్ఞానిక, సాహిత్య గ్రంథాల కంటే, పత్రికా రచనల అనువాదం కొద్దిగా భిన్నంగా ఉంటుంది. ఒకే వైజ్ఞానిక విషయంపై వ్యాసం సంబంధిత శాస్త్రీయ పత్రిక (scientific journal)లో రాయడానికి, ఒక వార్తా పత్రికలో రాయడానికి చాలా తేడా ఉంటుంది.

సమాచారం ఎంతగానో అభివృద్ధి చెందిన నేటి సమాజంలో వార్తా పత్రికలకు ప్రధాన పాత్ర ఉంది. పాఠకులకు కేవలం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాల గూర్చి తెలియపర్చడమే కాకుండా, వారి అభిప్రాయాలను మలచే శక్తి పత్రికలకుంది. వివిధ దేశాల ఆధునిక చరిత్ర చూసినట్లైతే ఒక వ్యక్తికి (నాయకుడు) ఆ దేశ చరిత్రలో ఎంత ప్రాముఖ్యం ఉందో, ఒక పత్రికకు అంతే ప్రాధాన్యత (కొన్ని సమయాల్లో వ్యక్తి కంటే ఎక్కువ) గోచరిస్తుంది.

వార్తా పత్రికలలో సమాచారాన్ని వివిధ పద్ధతుల ద్వారా, వివిధ మూలాలు (sources) ద్వారా స్వీకరిస్తారు. అంతేగాక ఒకే పత్రికలో వివిధ అంశాలు అంటే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలను గూర్చిన సమాచారం

ఉంటుంది. వీటికి తోడు వివిధ సంస్థల వ్యాపార ప్రకటనలు ఉంటాయి. ఇన్ని విషయాల గూర్చి అందరికీ అర్థమయ్యే రీతిలో రాయాలి.

ఏ వార్తా పత్రికయైనా ఆధునిక ప్రామాణిక భాషలో ఉంటుంది. ప్రతి పత్రికకూ తనదైన భాష, శైలి ఉంటాయి. సాధారణంగా ప్రతి వార్తా పత్రికలో సమాచారం, సంపాదకీయం, వివిధ విషయాలపై నిపుణుల వ్యాసాలు మొదలైన అంశాలు ఉంటాయి. సమాచారం ప్రాంతీయమైనదైతే అదే భాషలో (ఉదా: తెలుగు)నే ఉంటుంది. ఒకవేళ ఇతర రాష్ట్రాలకు, దేశాలకు సంబంధించినదైతే వేరే భాషలో (ఉదా: ఆంగ్లం) లో ఉంటుంది. ఈ ఆంగ్ల సమాచారాన్ని ఆధునిక ప్రామాణిక భాషా సంప్రదాయాల కనుగుణంగా తెలుగులోకి అనువదించవలసి ఉంటుంది.

ఆంగ్ల భాషలో వచ్చే సమాచారం సంయుక్త, సంక్లిష్ట వాక్యాలలో ఉంటుంది. కాబట్టి తెలుగు భాషా లక్షణాల ప్రకారం వీలు బట్టి సామాన్య వాక్యాలలోకి అనువదించవలసి ఉంటుంది. కర్మణి ప్రయోగాలను కర్తరి ప్రయోగాలుగా మార్చాలి. ఆదాన భాషయైన తెలుగులో సమానమైన పదం లేకపోతే ఆంగ్ల పదాన్నే వాడి వివరణ ఇవ్వాలి. నేటి తెలుగు పత్రికా భాషలో సమాన పదాలున్నా వివిధ కారణాల వల్ల ఇంగ్లీషు పదాలనే వాడుతున్నారు. ఉదాహరణకు వర్సిటీ, నో కామెంట్ లాంటివి. సంపాదకీయ భాషకూ, సమాచార భాషకూ కొద్దిగా తేడా ఉంటుంది. సంపాదకీయంలో ఎక్కువ ప్రామాణికంగా ఉండే భాషను వాడతారు. అందువల్ల సంపాదకీయ పదాలలో సంస్కృత పదాలు ఎక్కువగా దొర్లుతూ ఉంటాయి.

సమాచారాన్ని అనువదించడంలో కాలానికి, పాఠకుడికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. సమాచారం చివరి నిముషంలో అందితే దానిని తొందరగా అనువదించవలసి ఉంటుంది. ఇటువంటి సమాచారాన్ని క్లుప్తీకరించడం అవసరమవుతుంది.

వ్యాసాలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాలకు సంబంధించినవి కావు. ఆయా శాస్త్రాలకు సంబంధించిన భాషతో పాటు, సాధారణ భాషను కూడా వాడవలసి ఉంటుంది. ఆటలకు సంబంధించిన సమాచారంలో ఎక్కువ ఆంగ్ల పదాలే కనిపిస్తాయి. వాక్య నిర్మాణంలో తెలుగు భాషా ప్రయోగాలనే వాడతారు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఇంతకు ముందు భాగాలలో చర్చించుకున్న అనేక అనువాద అంశాలు వార్తా పత్రికా రచనాను వాదంలో పనికి వస్తాయి.

అన్ని భారతీయ భాషలలో ప్రకటనలలో ఎక్కువ భాగం ఆంగ్లానువాదాలే. కాబట్టి ప్రకటనల అనువాదాన్ని ఔపచారిక సాహిత్యానువాద ప్రక్రియగా పరిగణించవచ్చు.

ఏదైనా విషయాన్ని తెలియజేయడం ద్వారా తమ వస్తువును లేదా సేవలను అందించడం, ప్రజాభిప్రాయాన్ని మల్చడం, రాజకీయ మద్దతు పొందడం, ఏదైనా కర్తవ్యాన్ని ముందుకు తీసుకుని పోవడం, ప్రకటనల ముఖ్యోద్దేశం. అంటే పాఠకుడిని, కొనుగోలు దారుడిని తమవైపు ఆకర్షించడం, కాబట్టి ప్రకటనల రూపం, భావం మిగిలిన వాటికన్నా భిన్నంగా ఉంటుంది.

ప్రకటనలు వార్తాపత్రికలు, పోస్టర్లు, రేడియో, టెలివిజన్, సినిమా థియేటర్ల ద్వారా ప్రజలలోకి వస్తాయి. ఎక్కువ మంది కొనుగోలు దార్లకు దేని ద్వారా చేరుతుందో, ఆ మార్గాన్ని ప్రకటనదారుడు ఎంచుకుంటాడు.

BRAOU

ప్రకటనల భాష తేలికగా ఉండి, ప్రజలపై ప్రభావం చూపేది గానూ, వారిని ఒప్పించేదిగానూ ఉండాలి. దీని ఆధారంగానే ప్రకటనలలో భాషా, శైలి భాగాలు ఉంటాయి. ప్రకటనల భాషలో ఈ కింది లక్షణాలు ఉంటాయి:

1) ఉద్దేశాన్ని చిగురింపచేసేది

2) కోరిక ప్రబలింప జేసేది

3) నమ్మకాన్ని కలిగించేది

4) కొనాలనే ఆలోచన పెంచేది

వీటిని కొన్ని భాషా, శైలి రూపాల ద్వారా పొందవచ్చును. దీనికోసం చాలాసార్లు భాషా సంప్రదాయాలను అతిక్రమిస్తూ ఉంటారు. ఈ అతిక్రమణ భాషలో ఏ స్థాయిలోనైనా జరుగవచ్చు. విశేషణాలు,ఉపమానాలు, ఉత్ప్రేక్షలు, ధ్వనిసామ్యం (assonance), వృత్త్యనుప్రాసం (alliteration), లయ, రూపకాలు చిన్న వాక్యాలు మొదలైనవి పాఠకునిపై ఒప్పించే విధమైన ప్రభావాన్ని కలుగజేస్తాయి.

అందువల్ల వ్యాపార ప్రకటనలు అతిజాగ్రత్తగా రూపొందించబడతాయి. ప్రకటనను ముద్రించే ముందు మూలగ్రంథాన్ని సమీక్షించి, దాని ప్రభావాన్ని పరీక్షిస్తారు. రచయిత పాఠకుడు / కొనుగోలు దారుడిపై సాధ్యమైనంత ఎక్కువ ప్రభావాన్ని కలుగజేసే విధంగా ప్రకటనను రూపొందిస్తాడు. అందువలన 'అసాధారణ' భాషా, శైలీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇవి భాషను బట్టి మారుతూ ఉంటాయి. ఏదైనా భాషా లేదా శైలి ప్రయోగం మూలభాషా పాఠకునిపై చూపిన ప్రభావం ఆదానభాషలో ఉండకపోవచ్చు. ఇది భాషల వైవిధ్యం పెరిగిన కొద్దీ ఎక్కువౌతుంది. ప్రకటనల అనువాదంలో ఈ విషయాలను అనువాదకుడు గుర్తుంచుకోవాలి.

ఒక్కొక్కప్పుడు అనువాదకులు తప్పని సరియై మూల భాషా రూపాలనే ఆదానభాషలో వాడతారు. దీని వలన ఆదానభాషా నిర్మాణాలను అతిక్రమించినట్లు అవుతుంది. ఆధునిక అనువాద సిద్ధాంతం ప్రకారం మూలగ్రంథం ఏ ప్రభావాన్నైతే చూపిందో, అనువాదం కూడా ఆదాన భాషా పాఠకుడిపై అదే ప్రభావాన్ని చూపాలి.

పై విషయాలన్నింటినీ అనువాదకుడు పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే సమర్థమైన అనువాదాన్ని అందించగలడు.

## 20.7 సాహిత్య, వైజ్ఞానిక గ్రంథాల మధ్యగల తారతమ్యం

సాహిత్యానువాదాన్ని శాస్త్రీయ, సాంకేతికానువాదాలతో పోల్చి చూస్తే అర్థం చేసుకోవడం చాలా సులభం: (1) వైజ్ఞానిక (శాస్త్రీయ, సాంకేతిక) గ్రంథాలు శాస్త్రజ్ఞులచే, నిపుణులచే రాయబడతాయి. సాహిత్యమనేది కవులచే, రచయితలచే సృష్టించబడుతుంది. (2) వైజ్ఞానిక గ్రంథం సాధారణంగా కొత్త గ్రంథమై సత్వరం చదవవలసిన అవసరం కలిగి ఉంటుంది. సాహిత్య గ్రంథం పాతదైనా కావచ్చు. లేక కొత్తదై ఉండవచ్చు. (3) వైజ్ఞానిక గ్రంథ భాషా లక్షణం – దాని పదజాలం, ప్రతి శాస్త్రానికీ ప్రత్యేకమైన పదాలుంటాయి. సాహిత్యంలో లయ (rhythm), శ్రుతి (intonation), ఛందస్సు (metre), స్వరం (pitch), నియతి (pattern) మొదలైన అంశాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఇవి వైజ్ఞానిక సాహిత్యంలో అసలు ఉండవు. (4) వైజ్ఞానిక గ్రంథంలో విషయం, ఉద్దేశ్యం, భాషారూపం ఉంటాయి.



BRAOU

విషయం ఎప్పుడూ శాస్త్రీయ, సాంకేతిక పరమైనదే అయివుంటుంది. సాహిత్యానికి ఈ హద్దులు లేవు. కవి లేదా రచయిత దేనినైనా తన వస్తువుగా ఎంచుకొనవచ్చు. (5) సాధారణ భాషతో పోలిస్తే, శాస్త్రీయ గ్రంథాలలో సాంకేతిక పదాలు ఎక్కువగా ఉంటాయి. ఎంచుకున్న వస్తువు బట్టి, సాహిత్య రూపాన్ని బట్టి కవి భాష మారుతూ ఉంటుంది. (6) ఎప్పుడో తప్పితే, వైజ్ఞానికానువాదంలో ఒకే గ్రంథంపై రెండు అనువాదాలుండవు. అదే సాహిత్యంలో అయితే ఒకటి కంటె ఎక్కువ అనువాదాలు ఆదాన భాషలో ఉండవచ్చు. (7) ఏ శాస్త్రజ్ఞుడికైనా తన పరిశోధనలు తన రంగంలో పని చేస్తున్న ఇతర శాస్త్రజ్ఞులకు తెలియడం కోసం, అలాగే ఇతరుల పరిశోధనలు గూర్చి తాను తెలుసుకోవడం కోసం అనువాదం అవసరమవుతుంది. సాహిత్యానువాదం సంఘంలోని ప్రజల మానసిక వికాసానికి తోడ్పడుతుంది. (8) శాస్త్రీయ గ్రంథం యొక్క పేరును యథావిధిగా అనువదిస్తాం. సాహిత్యగ్రంథం పేరును అవసరమైతే మార్చవచ్చు.

### 20.7.1 సాహిత్య అనువాదం ప్రత్యేకత

సాహిత్యాన్ని అనువదించేటప్పుడు, అనువాదకుడు మూలగ్రంథంలోని ఏ విషయాన్ని లేక నిర్మాణాన్ని ఆదాన భాషలో ఉంచాలి, లేదా తీసివేయాలి అని ఆలోచించకూడదు. మొట్టమొదటగా అనువాదకుడు అనువదింపబడే గ్రంథం పద్యమా లేక గద్యమా అనేది చూడాలి. ఎందుకంటే ఈ రెండు సాహిత్య రూపాలు తమవంటూ ప్రత్యేకమైన భాషా గుణాలనూ, స్థాయిలనూ కలిగి ఉన్నాయి. అందువల్ల ఏ సాహిత్య రూపాన్ని అనువదించాలన్నా సరియైన, సమగ్రమైన సాహిత్య అనువాద సిద్ధాంతం అవసరం.

నిర్మాణాత్మక సిద్ధాంతం యొక్క కోణం నుంచి పరిశీలించినట్లైతే ప్రతి సాహిత్య అంశం అంటే వాక్యం దగ్గర నుంచి పదబంధం వరకు, ఒక వ్యవస్థ (system). మొత్తం సాహిత్య వ్యవస్థ మానవ సంస్కృతి అనే వ్యవస్థలో ఒక భాగం. చాలా మంది అనువాదకులు సాహిత్య గ్రంథమనేది ఒక సంక్లిష్ట (complex) వ్యవస్థలసమూహమనీ, వీటి మధ్యనే కాక, ఇతర వ్యవస్థలతో దానికి (సాహిత్య గ్రంథం) గతితార్కిక (dialectical) సంబంధం ఉంటుందనే విషయాన్ని గుర్తించడం లేదు. దీనివల్ల గ్రంథంలోని ఏవో కొన్ని అంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, మిగిలిన ఇతర ముఖ్యమైన అంశాలను సైతం త్రోసిపుచ్చడం జరుగుతోంది.

BRAOU

ఏది ఏమైనప్పటికీ ప్రతి అనువాదకుడు ముందుగా పాఠకుడు, ఆ తరువాతే గ్రంథకర్త. అందువలన గ్రంథాన్ని చదివేటప్పుడే, దానిని ఏ విధంగా అనువదిస్తే బాగుంటుందో ఆలోచించాలి. దీనికోసం సాహిత్య గ్రంథాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి. అనువాదకుడు మూల గ్రంథాన్ని కేవలం ఒక పాఠకుడిలా మాత్రమే చదవకూడదు.

భాషాంతరీకరణం మూలగ్రంథాన్ని చెప్పడంలో సృజనాత్మకతను చూపుతుంది. అనువాదకుడు రూపం, లయ, ఛందస్సు, స్వరం మొదలైన వాటిని ఏ మేరకు పునరుత్పత్తి చేయగలుగుతాడనే విషయం కేవలం మూల, ఆదానభాషలపైనే కాక, అనువాద ప్రయోజనం (function)పై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఆదాన భాషా పాఠకులకు మూల భాష గూర్చి ఏమీ తెలియకపోయినా లేక దానిలోని సాంఘిక - సాహిత్య ధోరణుల పట్ల ఎటువంటి అవగాహన లేని పక్షంలో, అనువాదాన్ని భాషాంతరీకరణంలా కాకుండా, వేరే విధంగా చేయవలసి వస్తుంది.

### 20.7.2 పద్యం – అనువాదం

సాహిత్యానువాదంలో ఇతర సాహిత్య రూపాల అనువాదాల కంటే, పద్యానువాదాన్ని పరిశీలించడానికి ఎక్కువ సమయాన్ని వెచ్చించారు. దీని సంబంధిత సమస్యలను తెలుసుకోవడానికి, ఏదైనా ఒక కవి యొక్క వివిధ అనువాదాలను విశ్లేషించడం గాని, వివిధ అనువాదకులు ఏఏ సమస్యలను ఏ విధంగా పరిష్కరించారో పరిశీలించడం గాని చేయాలి.

పద్యంలో మిగిలిన సాహిత్య రూపాలలో కంటె పదానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆ తరువాత పంక్తికి ఉంది. ఒకవేళ పంక్తిలో ఏదైనా విరామ చిహ్నానికి ప్రాముఖ్యం ఉంది. ప్రపంచంలో విభిన్న సంస్కృతులున్నప్పటికీ, వాటి సారాంశం ఒక్కటే. అందువల్ల పద్యాన్ని అనువదించడం ద్వారా మూలభాషలో కవి తన పాఠకులపై ఎటువంటి ప్రభావాన్ని కలుగజేయదలచుకున్నాడో, అనువాదకుడు కూడా ఆదానభాషలో అటువంటిదే సృష్టిస్తాడనే వాదన కొంతమేరకే సమంజసమైంది. అందువల్ల అనువాదకుడు కనీసం సమానమైన (parallel) ప్రభావాన్ని పద్యంలో చూపగలిగితే అది అతని గొప్పదనమే అవుతుంది. రెండు పూర్తిగా విరుద్ధమైన భాషలలో ఇది అసాధ్యమనే చెప్పవచ్చు. ఒకవేళ భాషల వాక్య నిర్మాణం, పదాలు, ధ్వనులు, సంస్కృతి ఒక్కటే అయినా, కవి భావన, అనువాదకుని భావన ఒక్కటి కావు కదా.

అసలు ఇంతకీ పద్యం అంటే ఏమిటి? ఒక చిత్రకారుడు తన చిత్రంలో రంగుల ద్వారా ఏం చెబుతాడో, ఒక కవి పదాల ద్వారా అదే చేస్తాడు. పద్యంలో లయ, ఛందస్సు, ఆగ్రహం, ఆవేశం వంటివి ఉంటాయి. ఒక్కొక్కప్పుడు సాంప్రదాయక పద్ధతిలో పదాల పొందిక ఉండదు. ఊహ ఉంటుంది. అన్నిటికంటే ముఖ్యమైనది ఏదైనా ఒక వస్తువులో ఏ ఇతర వ్యక్తి చూడలేని గుణాలను కవి చూస్తాడు. అయితే ఇదంతా ఏ ఒక్క భాష సొత్తూ కాదు. భావయుక్తత, లయ మొదలైనవి అన్ని భాషలలోనూ ఉంటాయి. ఒక ఆంగ్లేయుడో, జర్మనుడో, భారతీయుడో ఒకే రకమైన ప్రేరేపణ (inspiration) వేరు వేరు విధాలుగా చెబుతాడు. అందుకే సరియైన అనువాదం కష్టమౌతుంది.

పద్యాన్ని అనువదించేటప్పుడు, అనువాదకుడు పద్యం యొక్క స్వరూపాన్ని (viz, sonnet, ballad, quatrain, blank verse etc.) నిర్ణయించాలి. అదే రూపం లేదా దాని దగ్గర రూపం ఆదానభాషలో ఉందో లేదో చూడాలి. లయ పద్య రూపంలో భాగం కాబట్టి, మూల భాషలో ఉన్న లయబద్ధత, ఆదానభాషలో అదే విధంగా రాకపోవచ్చు. అందువల్ల లయబద్ధతలో ఆదానభాషలో కొన్ని మార్పులు అవసరం కావచ్చు. అనువాదకుడు అలంకారిక అర్థాన్నే (figurative mearing) పునరుత్పత్తి చేయగలడు. పద్యంలో ఆలోచనలు ప్రేరేపించే పదాలు వివిధ ధ్వనుల రూపంలో ఉండవచ్చు. ఇవి పాఠకునిపై విశేష ప్రభావాన్ని చూపుతాయి. ఇటువంటి అంశాలను ప్రధాన అనువాదం అయిన తరువాత చూడాలి. భావ వ్యక్తీకరణలో ఒక్కో రకమైన ధ్వనులు ఒక్కో రకమైన అర్థాన్ని సూచిస్తాయి. అనువాదకుడు మూల భాషలో ఈ ధ్వనుల అర్థాన్ని జాగ్రత్తగా గమనించి, ఆదాన భాషలో సాధ్యమైనంతవరకు వాటి అర్థాన్ని ప్రతిబింబించే సమాన ధ్వనుల ద్వారా కాని, అదే విధమైన ధ్వనుల ద్వారా గాని అనువదించాలి.

BRAOU

అనువాదకుడు భావానికి గాని, రూపానికి గాని ప్రాధాన్యం ఇచ్చినా, ఏ కోణానికి అంటే ఛందస్సు, లయ, ధ్వని నిర్మాణానికి ప్రాముఖ్యం ఇచ్చినా, అది ఆ పద్యం యొక్క విలువలపైనే గాక, అనువాదకుడి పద్య సిద్ధాంత (theory of poetry)పై కూడా ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఒక సర్వ సాధారణ పద్యానువాద సిద్ధాంతం (universal theory of poetry) సాధ్యం కాదు. కాబట్టి అనువాదకుడు పద్యాన్ని మరింత సమర్థంగా అనువదించడానికి ఏవీ మార్గాలున్నాయో వెదికి, వాటిలో ఏవి ఆచరణ సాధ్యమైనవో తానే బేరీజు వేసుకుంటూ, తన అనువాద సిద్ధాంతాన్ని పద్యానువాదంలో జొప్పించాలి. భావ వ్యక్తీకరణ సరిగ్గా ఉండేటట్లు చూడాలి. అలాగే భావ వ్యక్తీకరణకు, భాషా సౌందర్యానికి మధ్య సమానత ఉండేలా అనువాదకుడు జాగ్రత్త పడాలి. ఎందుకంటే భావ వ్యక్తీకరణలో కవి ఒక్కొక్కప్పుడు మూల భాషా సంప్రదాయాలకు దూరంగా వెళ్ళవచ్చు. అది అనువాదంలో ఆదాన భాషలో మరింత దూరం కావడానికి అవకాశం ఉంది.

ఒకవేళ ఆదాన భాషా సంస్కృతిలో మూల అలంకార భావం (original metaphor's image) కొత్తగా ఉన్నప్పటికీ, వాటి అర్థాన్ని ఊహించుకోవలసి వచ్చినప్పటికీ మూల అలంకారాలను ఉన్నవి ఉన్నట్లుగా అనువదించాలి. పద్యంలో ధ్వని (sound) గూర్చి మొదటినుంచీ ఆలోచించకూడదు.

పద్యానువాదంలో ఉండే ఇబ్బందులను ఎక్కువగా అంచనా వేయకూడదు. ఒక కవి చూసింది గాని, అనుభూతి చెందింది గాని, మనకి ఎవ్వరికి తెలియనిది కవిత్వం ద్వారా తెలుసుకొనవచ్చు. అందువలన వీటిని ఇతర భాషలలోకి చాకచక్యంగా అనుపదించాలి.

### 20.7.3 పద్యానువాద పద్ధతులు

వివిధ పద్యానువాదాలను పరిశీలించిన పిమ్మట పద్యాన్ని అనువదించడానికి అనుసరిస్తున్న పద్ధతుల్ని ఈ కింది విధంగా విభజించాలి:

(1) వర్ణానువాదం (Phonemic translation)

ఈ పద్ధతిలో మూల భాషలోని వర్ణాలు అర్థం చెడకుండా ఆదాన భాషలో పునరుత్పత్తి చేయబడతాయి.

(2) మూల భాషా విధేయానువాదం (Literal translation)

దీనిలో పద పదానువాదం మీదే దృష్టిని కేంద్రీకరిస్తారు. ఈ విధంగా చేయడం వలన అర్థమే కాక, వాక్య నిర్మాణం కూడా దెబ్బతింటుంది.

(3) ఛందో బద్ధానువాదం (Metrical translation)

మూల భాషలోని ఛందస్సు ఆదాన భాషలో పునరుత్పత్తి చేయడం. మూల విధేయానువాదంలో లాగానే, ఈ పద్ధతిలో గ్రంథంలోని ఏదో ఒక అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, మిగిలిన ఇతర అంశాలు తిరస్కరించడం జరుగుతుంది..

(4) పద్యాన్ని గద్యంలోకి (Poetry into verse)

స్వతంత్ర, ఛందో నిబద్ధానువాద పద్ధతులలో వలె కాకపోయినా, దీనిలో కూడా విషయ ప్రాధాన్యం అర్థం, మూల భాషా వాక్య నిర్మాణం దెబ్బతింటాయి.

(5) లయబద్ధానువాదం (Rhythemic translation)

దీనిలో అనువాదకుడు మూల భాషా ఛందస్సునూ, లయనూ కాపాడతాడు.

(6) సంపూర్ణ గద్యానువాదం (Blank verse translation)

ఈ పద్ధతిలో అనువాదకుడు సరియైన నిర్మాణాలను ఎంచుకోవాలి. దీనివల్ల సరియైన సాహిత్య పరమైన గ్రంథం తయారౌతుంది.

(7) వివరణ (Interpretation)

దీనిలో మూల గ్రంథం యొక్క అర్థం పోకపోయినా, రూపం మారుతుంది. ఒక్క పద్యం పేరు, పద్యంలో వస్తువు మాత్రమే ఉంటాయి. వీటిని ఆధారంగా చేసుకొని అనువాదకుడు తన సొంత కవిత్వాన్ని అల్లుతాడు.

సాధారణంగా అనువాదాన్ని, వివరణను రెండు వేర్వేరు వ్యాపారాలుగా భావిస్తారు. అనువాదకుడు గ్రంథాన్ని అనువదించాలే తప్ప వివరణ ఇవ్వకూడదనే వాదన లేకపోలేదు. ఈ వాదన పరీక్షకు నిలవదు. ఎందుకంటే ఏదైనా గ్రంథాన్ని



BRAOU

చదవడమంటే దానికి వివరణ ఇవ్వడమే కదా. అందువలన ఈ రెంటికీ అవినాభావ సంబంధముంది. విమర్శనాత్మక వివరణకూ, అనువాదానికీ మధ్యగల సంబంధాన్ని జేమ్స్ హోలెమ్స్ ఈ కింది పటం ద్వారా చూపించారు.

**పద్యం (Poem)**

| | | |
|---|---|---|
| పద్యభాషలో విమర్శనాత్మక (Critical) | | పద్యంచే ప్రేరేపించబడిన పద్యం (Poem inspired by poem) |
| పద్య భాషలో వ్యాసం essay in language of poem | | |
| వేరే భాషలో విమర్శనాత్మక వ్యాసం (Critical esaay in another language) | | పద్యం 'గూర్చి' పద్యం (Poem about poem) |
| వచనానువాదం (Prose translation) | గద్యానువాదం (Verse translation) | అనుకరణ (Imitation) |
| వివరణ (Interpretation) | | పద్యం (Poetry) |

వచనానువాదం వివరణలోని అనుకరణ (imitation) తోనూ, నిష్పాదకత (derivation) తోనూ ముడి పడి ఉంటుంది. అనువాదకుడు గ్రంథం యొక్క నూతన రూపాలను సృష్టిస్తాడు.

ఒక వేళ మూల, ఆదాన భాషా సంస్కృతుల మధ్య తారతమ్యం ఎక్కువగా ఉంటే, పద్యానువాదంలో ఉత్పన్నమయ్యే సమస్యలు వేరుగా ఉంటాయి. భాషల ఆధునీకరణ కూడా పద్యానువాదంపై ప్రభావం చూపుతుంది. అందువలన ఈ అనువాదాన్ని ఒకే విధంగా చేయాలనే సూత్రీకరణ చేయలేము.

ఇక చివరిగా, ఏదైనా పూర్వకాలపు కవిత్వాన్ని అనువదించాలంటే చాల శ్రమతో కూడిన పని. ఎందుకంటే, కవి, అతని సమకాలికులు ఉండరు. అంతేకాక, ఆ పద్యం ప్రాముఖ్యం ఈనాడు కనబడదు.

### 20.7.4 వచనం – అనువాదం

చాలామంది అనువాద శాస్త్రజ్ఞులు పద్యానువాదంపైనే తన పరిశోధనలు సాగించినా, వచనానువాదానికి ఏమీ తక్కువ ప్రాధాన్యం ఇవ్వలేదు. అయితే పద్యానువాద సమస్యలపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించడానికి గల కారణం – సంఘంలో పద్య కవిత్వానికి ఉన్న ప్రాధాన్యం. నవలల్లోగాని, చిన్న కథల్లో గాని భాషా నిర్మాణం సాదా సీదాగా ఉంటుంది గనుక, వీటిని అనువదించడం తేలికైనవిగా భావించడం మరొక కారణం కావచ్చు.

ఏది ఏమైనా పద్యం తరువాత చిన్న కథలను అనువదించడం కష్టమైన పని. అయితే వీటిలో ఛందస్సు, లయ, శ్రుతి, ధ్వని మొదలైనవి ఉండవు. ఇక్కడ ఒక పంక్తి (line) అర్థానికి అంశిక (unit) కాదు. గేయ కవిత్వం, నాటకంలో లాగా కాకుండా, సాంస్కృతిక విశేషాలు అన్నీ కూడా ఒకే గ్రంథ పరిధిలో చూపవచ్చు.

గ్రంథంలోని మూల పదాలను (words) అనువాదకుడు నిర్ణయించాలి. అంటే ఏఏ పదాలు ప్రధానమైనవి. ఏఏ పదాలు ఔపచారిక మైనవో అనువాదకుడు గుర్తించాలి. దీనివల్ల అనువాదంలో భాష రీత్యా వచ్చే లాభనష్టాలను బేరీజు

వేసుకోవచ్చు.

ఏదైనా ఒక ముఖ్యమైన నవల నుంచి సర్వసాధారణమైన నిర్ణయాలను (general coclusions)ను చేస్తే ఉపయోగం లేదు. మూల సంస్కృతి యొక్క ప్రాముఖ్యం పాఠకుని పట్ల గ్రంథకర్త బాధ్యత – ఇవి నామవాచకాల అనువాదంలో తెలుసుకొనవచ్చును. గ్రంథకర్త శైలికి, ఆ కాలంలోని సాహిత్య పద్ధతికి మధ్య తేడాలను, మూల భాషా లక్షణాలను ప్రతి గ్రంథంలోనూ పరిశీలించాలి.

కొన్ని కొన్ని నవలల అనువాదంలో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమిటంటే వీటి అనువాదం వలన వేరే భాషా సంస్కృతిలో నూతన సాహిత్య ప్రక్రియకు అంకురం ఏర్పడుతుంది. కాని ఒక్కొక్కప్పుడు కొన్ని కొన్ని అనువాదాలు సాహిత్యతత్త్వాన్ని (Philosophy of literature)ని ప్రతిబింబించవు.

వచన కవిత్వాన్ని అనువదించడానికి హిల్లరీ బిలోక్ (Hilaire Beloc) ఈ కింది మార్గదర్శక సూత్రాలను రూపొందించారు:

(1) అనువాదకుడు ప్రతి పదాన్ని, ప్రతి వాక్యాన్ని అనువదించకూడదు. మొత్తం గ్రంథాన్ని (ఖండికను) ఒక సమగ్ర అంశిక (integral unit)గా పరిగణించాలి. ముందుగా అర్థాన్ని ఏ విధంగా చెప్పాలి అని ప్రశ్నించుకుంటూ, ప్రతి భాగాన్ని అనువదించాలి.

(2) జాతీయాల (idioms)ను వదిలి పెట్టకుండా అనువదించాలి. కాని మూలం (original) నుంచి జాతీయాలను అనువదించేటప్పుడు, అవి రూపాంతరం చెందవచ్చు.

(3) మూల భాషలో ఒక ప్రకరణ (context)లో ఉపయోగించిన వాక్యం, దానిని స్వతంత్రానువాదం చేస్తే, ఆదాన భాషలో దాని విలువ తగ్గిపోవచ్చు.

(4) ఒక్కొక్కప్పుడు మూల, ఆదాన భాషలలోని పదాలు, వాక్యాలు ఒకే రకంగా ఉంటాయి. అలాగని వాటిని ఉన్నదున్నట్లుగా ఆదాన భాషలోకి మారిస్తే తప్పు అర్థాన్ని ఇస్తాయి.

(5) అనువాదకుడు అసంబంధిత విషయాలను గ్రంథంలో చేర్చకూడదు.

(6) మూల గ్రంథం పట్ల పూర్తి విధేయతను చూపుతూ, ఆదాన భాషా పాఠకుడి అభిరుచికి అనుగుణంగా గ్రంథాన్ని అనువదించాలి.

పద్యాన్ని అయితే తేలికగా భాగాలుగా విడగొట్టవచ్చు. ఎందుకంటే పద్యంలో పంక్తులు ఉంటాయి. ఆదే వచనంలో అయితే భాగాలు లేదా పర్వాలు ఉంటాయి. అలా లేని పక్షంలో ముఖ్యమైన భాగాలను గ్రంథంలో ఎంపిక చేసుకోవడం కష్టమౌతుంది.

### 20.7.5 నాటకం – అనువాదం

నాటక సాహిత్య అనువాదంలో అతి తక్కువ పరిశోధన జరిగింది. వచన కవిత్వంలా నాటకాన్ని అనువదించలేమనే వాదన ఒకటుంది. నాటకాన్ని వేరే విధంగా (కథలా కాకుండా) చదువుతాం. దీనిని చదవడం ఎప్పటికీ అసంపూర్తిగానే ఉంటుంది. ఎందుకంటే పూర్తిగా నాటకాన్ని స్టేజీ మీదే చూడగలం. అందువలన నాటకాన్ని ఒక సాహిత్య గ్రంథంలా అనువదించాలా లేదా దాని ప్రయోజనాన్ని (function) దృష్టిలో ఉంచుకుని అనువదించాలా అనేది ప్రతి అనువాదకుడికి

BRAOU

ఎదురయ్యే సమస్య.

నాటకాన్ని అనువదించడంలో సాధారణమైన ఉద్దేశ్యం – అది ప్రదర్శనకు యోగ్యంగా ఉండడం. అందువల్ల దానిని రాసేటప్పుడూ, అనువదించేటప్పుడూ ప్రేక్షకుడిని దృష్టిలో ఉంచుకోవాలి. మంచి గ్రంథం కోసం, ప్రేక్షకుడి అభిరుచికి అనుగుణంగా అవసరమైతే కొంత రాజీ పడాలి. కల్పిత కథా సాహిత్యానువాదంలా కాకుండా నాటకం అనువాదంలో సాంస్కృతిక మరియు ఇతర సంబంధిత అంశాలను లేక పదాలను వివరించడానికి అవకాశం ఉండదు. ప్రాంతీయ వ్యవహారాన్ని దృష్టిలో ఉంచుకుని పదాలను మార్చడానికి వీలులేదు. గ్రంథం నాటకానికి సంబంధించింది కాబట్టి దృష్టి వాచికం పైనే కేంద్రీకరించబడుతుంది. అంటే గ్రంథం వివరణాత్మకంగా కాకుండా వర్ణనాత్మకంగా ఉంటుంది.

పాత్రలు 'జీవించాలంటే' ఆధునిక భాషలోకి అనువదించాలి. ఒకవేళ ఏదైనా పాత్ర పాత భాషలో మాట్లాడుతుంటే దానికి సమానమైన పాత అదాన భాషనే వాడాలి. అప్పుడే ఆ పాత్ర ప్రాముఖ్యం ప్రత్యేకత ప్రేక్షకుడు/ పాఠకుడికి అర్థమౌతుంది.

కాబట్టి నాటకాన్ని ఆనందంగా చదవడానికి, ప్రత్యేకంగా పరిశీలించడానికి, ఇక చివరిగా స్టేజీ మీద ప్రదర్శించడానికి అనువదించవచ్చును. వీటి అన్నింటిలోనూ చిట్ట చివరిదీ ప్రధానమైందని అనువాదకుడు గుర్తుంచుకోవాలి. ప్రదర్శనకూ చదవడానికి వీలుగా అనువదించగలిగితే మరీ మంచిది.

అయితే నాటకాన్ని ప్రదర్శనకు వీలుగా అనువదించాలంటే, గ్రంథానికి, ప్రదర్శనకి మధ్య సంబంధం ఉండాలి. సంభాషణ రాసేటప్పుడు లయ, శ్రుతి, నియతి, స్థాయి మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. చదివేటప్పుడు ఇవేవీ అక్కర్లేదు. నాటకాన్ని ప్రదర్శనకు యోగ్యమైనదిగా రాయడం ఒక ఎత్తు, కేవలం చదవడానికి వీలుగా అనువదించడం మరో ఎత్తు. ఈ రెంటి మధ్యగల వైవిధ్యాన్ని అనువాదకుడు గుర్తించాలి. అంటే నాటకాన్ని ప్రదర్శనకు వీలుగా తయారు చేయాలంటే కొన్ని నిర్మాణాత్మక లక్షణాలు అవసరం. అనువాదకుడు ఆ లక్షణాలను నిర్వచించుకొని, వాటికి అనుగుణంగా అదాన భాషలో రాయాలి. దీని మూలంగా గ్రంథంలో భాషా పరమైన, శైలీ పరమైన అనేక మార్పులు రావచ్చు. అందువల్ల ఏ విధంగా ప్రదర్శనకు అనుగుణంగా ఉంటుందో, ప్రేక్షకుల మన్ననలు పొందవచ్చో అనువాదకుడు ఊహించాలి.

BRAOU

నాటకాన్ని మూల భాషనుంచి అదాన భాషలోకి అనువదించినప్పుడు అది అనువాదం కాదు. అనుసరణం (adaptation) అవుతుంది.

**అభ్యాసం – 3**

వైజ్ఞానిక, సాహిత్య గ్రంథాల అనువాదంలో తేడా ఏమిటి?

## 20.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ప్రతి శాస్త్రజ్ఞుడికీ తన పరిశోధనలను తోటి సహచరులకు తెలియపర్చడం ఎంత ముఖ్యమో, ఇతరుల పరిశోధనా ఫలితాలను తామూ తెలుసుకోవలసిన అవసరం అంతే ఉంది. అందువల్ల శాస్త్రీయ గ్రంథాల అనువాదానికి అత్యంత ప్రాధాన్యం ఉంది.

- ఈ గ్రంథాల అనువాదానికి ఇరు భాషలు తెలియడంతో పాటు, శాస్త్రీయ సాంకేతిక విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి.

- గ్రంథకర్తతో పాటు, అనువాదకుడికి భావ ప్రకటనలో స్పష్టత ఉండాలి. ఈ గ్రంథాల అనువాదంలో ప్రతి సారి నూతన పదజాలాన్ని సృష్టించడం జరుగుతుంది.

- ఇది ఉన్నతమైన ప్రామాణికతను కలిగి ఉండాలి.

- సాంకేతికానువాదంలో వ్యాకరణ నిర్మాణం సరిగా ఉండేలా చూడాలి.

- ఆధునిక శాస్త్రీయ గ్రంథాల అనువాదంలో కంప్యూటర్ల పరిజ్ఞానం చాలా అవసరం

- మత గ్రంథాలను అనువదించేటప్పుడు అనువాదకుడు ఆ మతస్థులతో సంబంధాలు కలిగి, దానిని లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఇది అనువాదంలో ఎంతగానో ఉపకరిస్తుంది.

- వివిధ మతాల ప్రాపంచిక దృష్టి (world outlook) భిన్నంగా ఉంటుంది. కాబట్టి అనువాదానికి లొంగని పదాలుంటాయి. వీటిని ప్రతిలేఖనం ద్వారా అనువదించి, వివరణ ఇవ్వాలి.

- మత గ్రంథాలలో పురాతన పదాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఆదాన భాషలో వాటికి సమాన పదాలనే వాడాలి.

- తాత్విక రచనలలో భావం అమూర్తంగా ఉండడం వల్ల, భాష జటిలంగా ఉంటుంది. కాబట్టి అనువాదకుడు గ్రంథాన్ని అనేకసార్లు చదవవలసి వస్తుంది. అందునా ప్రతి దేశపు తాత్విక వ్యవస్థలో అనేక శాఖలుంటాయి, ఒక శాఖకు సంబంధించిన గ్రంథాన్ని అనువదించాలన్నా వేరే శాఖల గూర్చి తెలియాలి. దీనితో బాటు ఒకే పదం వివిధ శాఖలలో వేర్వేరు అర్థాలని ఇస్తుంది.

- యూరపియన్ భాషల వాక్య నిర్మాణంలో సంశ్లిష్ట వాక్యాలనే ఎక్కువ ఉపయోగిస్తారు. అందువల్ల అనువాదకుడు ఆదాన భాషా లక్షణాలను దృష్టిలో ఉంచుకుని, గ్రంథం భావం చెడకుండా జాగ్రత్త వహించాలి.

- కొన్ని తాత్విక గ్రంథాల అనువాదం ఆదాన భాషలో నూతన పోకడలకు అంకురార్పణ చేస్తాయి.

- త్వరిత గతిన సమాచార పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో వార్తా పత్రికల భాషకూ, శైలికీ

BRAOU

ప్రాముఖ్యత ఉంది.

- ప్రతి పత్రికకూ తనదైన భాష, శైలి ఉంటాయి. అందువల్ల అనువాదకుడు వాటినే అనుసరించాలి.

- సమాచారాన్ని ఆంగ్లంనుంచి తెలుగులోకి అనువదించాలి. కాబట్టి ఆంగ్ల భాషా ప్రభావం తన అనువాదంపై పడకుండా చూసుకోవాలి.

- వార్తా పత్రికలలో ఆధునిక ప్రామాణిక భాషను వాడతారు. కాని ప్రకటన భాషలో అన్య దేశ పదాలు, ఒక్కొక్కప్పుడు ప్రాంతీయ మాండలికాలను కూడా ఉపయోగిస్తారు. ఎందుకంటే, పాఠకుడు/ కొనుగోలు దారుడి మనస్సుకి హత్తుకుపోయేలా ఉండాలి. అందుకోసం ఒక్కొక్కప్పుడు ఆదాన భాషా సంప్రదాయాలను అతిక్రమించడం జరుగుతుంది.

- ప్రకటనల భాషలో నూతన పదాలను, నూతన పద బంధాలను అనువాదకుడు ఆదాన భాషలో సృష్టిస్తాడు.

- సాహిత్య భాష, శాస్త్రీయ – సాంకేతిక భాషకు భిన్నంగా ఉంటుంది. దీనిలో లయ, శ్రుతి, ఛందస్సు, స్వరం మొదలైన అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది.

- సాహిత్య ప్రక్రియను బట్టి వీటి ప్రాముఖ్యం మారుతూ ఉంటుంది. అట్లాగే పాఠకుడిని బట్టి, గ్రంథాన్ని బట్టి, గ్రంథంలోని పాత్రలను బట్టి భాష, శైలి మారుతూ ఉంటాయి.

- మూల భాషలో సాహిత్య గ్రంథంలో భాష, శైలి ఏ రూపంలో ఉంటే, ఆదాన భాషలో కూడా అదే విధంగా ఉండాలి. అప్పుడే పాత్ర విశిష్టత పాఠకుడికి బోధపడుతుంది.

- ఒకే గ్రంథానికి ఒకటి కంటే ఎక్కువ అనువాదాలు ఉండవచ్చు కాబట్టి, సాహిత్యానువాదంలో అనువాదకుడికి పోటీ ఉంటుంది.

BRAOU

## 20.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. శాస్త్రీయ రచనల అనువాదంలో ఎదురయ్యే సమస్యలను వివరించండి?

2. సాహిత్యానువాదంలో పాటించాల్సిన మెలకువలను విశదీకరించండి?

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. వార్తాపత్రికల అనువాదంలో పాటించాల్సిన మెలకువలేమిటో రాయండి?

2. వైజ్ఞానిక, సాహిత్య గ్రంథాల అనువాదాలకు మధ్య తేడాలను కొన్నింటిని పేర్కొనండి?

# భాగం : 21 విశేష వార్తలు: అనువాద సమస్యలు

విషయ క్రమం


21.0 ఉద్దేశం

21.1 ప్రవేశిక

21.2 అనువాదం ఎవరి కోసం?

21.3 అనువదించేది ఎందుకు?

21.4 విశేష వార్తలంటే ఏమిటి?

21.4.1 ప్రకటనలు

21.4.2 వాణిజ్య వార్తలు

21.4.3 క్రీడారంగ వార్తలు, తదితరాలు

అభ్యాసం -1

21.5 రేడియో, టివీల కోసం విశేష వార్తల అనువాదం

అభ్యాసం -2

21.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

21.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

21.8 అదనపు సమాచారం


BRAOU

## 21.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు:

- విశేష వార్తానువాదంలో సమస్యలు: ఇంగ్లీషునుంచి తెలుగు
- ఇంగ్లీషులోని ప్రచార భాషను అనువదించేటప్పుడు గమనించవలసిన సూచనలు.

## 21.1 ప్రవేశిక

అనువాదం అంటే ఒక భాషలో ఉన్న విషయాన్ని, భావనలను మరో భాషలోకి తీసుకురావడం అని ముందు చదివిన భాగాలలో తెలుసుకున్నాం. అనువాదాలలోని రకాలు, సాహిత్య ప్రక్రియ, విషయం, అనువాద స్వభావం అనే అంశాలపై ఆధారపడి ఉంటాయి. వార్తలు, పత్రికా రచన, విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రం, ప్రభుత్వ రికార్డులు, ప్రకటనలు, మొదలైనవి విషయ ప్రధానమైన రచనలు. అటువంటి విషయ ప్రధాన రచనలను అనువదించేటప్పుడు అనువాదకుడు కొన్ని ప్రత్యేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ భాగంలోని విషయ వస్తువుగా విశేష వార్తల అనువాదంలో వచ్చే కొన్ని సమస్యలు, అనువాదకులు పాటించవలసిన సూత్రాలూ, మన్నించవలసిన సూచనలూ చర్చిస్తున్నాం. ప్రత్యేకంగా ఇంగ్లీషునుంచి తెలుగులోకి అనువాదంచేసేటప్పుడు ఎదురయ్యే సమస్యలను విశదీకరిస్తున్నాం.

## 21.2 అనువాదం ఎవరికోసం?

ఇంగ్లీషు వార్తలను తెలుగులోకి అనువదించడం వల్ల ఇంగ్లీషు భాషరాని (వార్తలపై ఆసక్తి ఉన్న) తెలుగు వారికి సమాచారాన్నందించే వీలు కలుగుతుంది. అయితే ఈ రెండు భాషలూ తెలిసిన వారికి కూడా దీనివల్ల ఉపయోగముంటుందనే చెప్పాలి. రేడియో, టీవీలకు కూడా ఇది వర్తిస్తుంది.

ఇంగ్లీషులో వార్తలు దేశమంతటా ఉన్న ప్రజలని ఉద్దేశించినా తెలుగులోకి అనువదించిన వార్తలు రాష్ట్రంలోని గ్రామ ప్రజలనూ, పట్టణాల్లో నివసించే వారినీ, వివిధ ప్రాంతాల్లో ఉన్న వారినీ కూడా ఆకర్షించాలి. అందరికీ బోధ పడేట్లు ఉండాలి. అందుచేత అనువాదకులకు మూల భాషకు అంటే ఇంగ్లీషుకూ, లక్ష్య భాషకూ అంటే తెలుగుకూ సంబంధించిన భాషా నిర్మాణం స్వభావం బాగా తెలిసి ఉండాలి. ధ్వనులూ, వర్ణాలూ, పదాలూ, పదబంధాలూ, వాక్య నిర్మాణం, వ్యాకరణం, జాతీయాలూ, సామెతలూ మొదలైనవి బాగా తెలిసి ఉండాలి. ఉదాహరణకు 'పోయారు' అన్న పదానికి వేరు వేరు అర్థాలు ఉన్నాయి. తెలంగాణా ప్రాంతానికి చెందిన వారికి 'పోయారు' అంటే వెళ్ళారు అన్న అర్థం స్ఫురిస్తుంది. అయితే ఆంధ్రలో కొన్ని ప్రదేశాల్లో 'పోయారు' అంటే చనిపోయారు అని అర్థం. అందుకే ఇటువంటి పదాలు వాడేటప్పుడు అపార్థాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

## 21.3 అనువదించేది ఎందుకు?

ప్రచార వార్తల ఉద్దేశం సమాచారాన్ని ఉన్నదున్నట్లుగా అందించడమే. ఇందులో విలేకరికి గాని అనువాదకులకు గాని తమ స్వంత వ్యాఖ్యలు జోడించే స్వతంత్రం లేదు. ఉదాహరణకు, 'ఆత్మహత్య' వార్తను పాఠకులకు అందించేటప్పుడు ఫలానా చోట ఫలానా వ్యక్తి ఫలానా విధంగా ఆత్మ హత్యకు పాల్పడ్డారని రాయాలే గాని అతని మానసికావస్థ గురించి గాని ఇతర విషయాల గురించి గాని వ్యాఖ్యకు ఇక్కడ తావు లేదు.

సాహిత్యానువాదంలోనూ, వార్తానువాదంలోనూ కూడా సహజత్వం అత్యావశ్యకం. అయితే ముఖ్యంగా వార్తానువాదంలో విషయాన్ని సూటిగా సరళంగా రాయాలి. వార్తానువాదంలో విషయం ప్రధానం. సృజనాత్మక సాహిత్యంలో ఇంగ్లీషు రచనలోని సాంస్కృతికాంశాలను తెలుగులో తీసుకువచ్చే ప్రయత్నముంటుంది. అయితే వార్తానువాదంలో 'వార్త' ముఖ్యం గనుక పదపదానువాదం, సారాంశానువాదం కావలసి ఉంటుంది.

BRAOU

## 21.4 విశేష వార్తలంటే ఏమిటి?

పత్రికల్లో, రేడియో, టివీలలో సాధారణ ప్రజలందరికీ ఆసక్తి కలిగించే విషయాలు కాక ప్రత్యేకంగా కొంత మందిని మాత్రమే ఆకర్షించే విషయాలు కొన్ని ఉంటాయి. ఇవి కొంతమందికి మాత్రమే ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి కాక ప్రత్యేకమైన విషయాలు అందరికీ తెలియజేయాల్సిన విషయాలు కూడా ఉంటాయి. వీటిని విశేష వార్తలని అనవచ్చు. వివిధ రకాలైన ప్రకటనలు, వాణిజ్య వార్తలు, క్రీడా రంగానికి సంబంధించిన వార్తలు, ఆరోగ్యానికి సంబంధించిన వార్తలు, నినాదాలు తదితరాలు ఈ కోవకు చెందుతాయి.

### 21.4.1 ప్రకటనలు

మనం నిత్య జీవితంలో వివిధ రకాలైన ప్రకటనల్ని చదువుతుంటాం. రేడియో, టివీలలో వింటుంటాం. చూస్తుంటాం. ఇటువంటి సమాచారాల ఉద్దేశం పాఠకులకు విషయాన్ని అందజేసి వారి ప్రతిస్పందనలను అందుకోవడమే. అందుకే వీటి భాష సూటిగా, సరళంగా, సహజంగా ఉండాలి. ఉదాహరణకు ఉద్యోగపరమైన ప్రకటనలు, ఉద్యోగ సూచనలు, కావలసిన అర్హతలు, జీతం, దరఖాస్తు చేసుకొనవలసిన రీతి మొదలైన వాటిని స్పష్టంగా వివరించాలి. ఉదాహరణకు ఈ కింది ప్రకటనలు గమనించండి.

BRAOU

కావలెను

★ టెంపో డ్రైవర్లు కావలెను. కనీస అనుభవం 5 సంవత్సరాలు. జీతం నెలకు రూ. 1175 + రోజాకు రూ. 15/– బత్తా డీజిల్ ఫియట్ కొరకు కారు డ్రైవర్ కావలెను. కనీస అనుభవం 15 సంవత్సరాలు. అనుభవం గల టైపిస్ట్ – కమ్ – క్లర్క్, సూపర్‌వైజర్స్. సంప్రదించండి: 21-6-721, T.C.I, ట్రాన్స్‌పోర్ట్ దగ్గర, చేలాపుర, హైదరాబాద్.

**కావలెను**

ఏక వ్యక్తిగల కుటుంబీకునికి ఏ బాదరబందీ లేని నడివయస్సుగల ఆడ వంట మనిషి, శాఖ, మాంసాహారాలు, టిఫిన్‌లు బాగా చేయడం రావాలి. ఉచిత భోజనం. వసతి, ఆకర్షణీయమైన జీతం.

సంప్రదించండి: **సామ ప్రతాపరెడ్డి**
1-15, ఎస్.ఎస్.రెడ్డి పార్క్, చంపాపేట,
హైదరాబాద్ – 500060 ఫోన్స్: 4069009, 4068013

(1)లో ఏ విధమైన సందేహాలు తలెత్తవు. కావలసిన అనుభవం, ఉద్దేశం, జీతం వగైరా విషయాలు స్పష్టంగా పేర్కొన్నారు. అయితే (2)వ ప్రకటనలోని మొదటి పదాలు 'ఏక వ్యక్తిగల కుటుంబీకునికి' అస్పష్టంగా అసహజంగా ఉన్నాయి. తెలుగులో 'కుటుంబీకుడు' అంటే గృహస్థు, కుటుంబం గలవారు అని అర్థం. ఏక వ్యక్తిగల కుటుంబీకుడు అన్నది తప్పకుండా ఇంగ్లీషు నుంచి అనువదించడం వలన వచ్చిన ఇబ్బంది.

ఇంతకు ముందు 'వార్త'ను అనువదించేటప్పుడు పదపదానువాదం చేయవచ్చు అన్నాం. అయితే కొన్ని సందర్భాల్లో సమస్యలు తలయెత్తవచ్చు.

ఇంకో రెండు ఉదాహరణలు చూద్దాం. వీటిని గురించి రాచమల్లు రామచంద్రారెడ్డి గారు తమ పుస్తకం 'అనువాద సమస్యలు'లో విశదీకరించారు. 1982 మధ్యలో వచ్చిన పత్రికా ప్రకటనలు ఒక స్కూటర్‌కి సంబంధించింది.

| We interrupt this paper to bring you an announcement of great interest | మీకు గొప్ప ఆసక్తి కలిగించే ఒక ప్రకటన తీసుకు రావడానికి ఈ కాగితాన్ని మేము అడ్డగిస్తున్నాము. |
|---|---|

(అనువాద సమస్యలు: అనుబంధం)

కాగితాన్ని అడ్డగించడమనేది కనరాని విషయం. ఇంగ్లీషులో "interrupting this paper" అన్న నుడికారం విస్తృతార్థంలో వాడబడింది. ఈ విషయం అనువాదకునికి తెలియక పోవడం, పదపదానువాదం చేయడం వలన తెలుగు అనువాదం కృత్రిమంగా ఉంది. ఇక రెండో ఉదాహరణ:

| | |
|---|---|
| First Name: | Cento |
| Family Name: | Lambretta |
| Origin: | Italian |

| | |
|---|---|
| మొదటి పేరు: | సెన్టో |
| కుటుంబం పేరు: | లాంబ్రెట్టా |
| మూలము: | ఇటాలియన్ |

(అనువాద సమస్యలు: అనుబంధం 5)

ఇంగ్లీషులో **first name, personal name** లేక **christian name** అన్నవి యూరోపియన్ల సాంస్కృతిక మత సంప్రదాయాల వలన వచ్చిన మాట. తెలుగు సంప్రదాయం వేరు గనుక ఈ మాటలు తెలుగులో లేవు. తెలుగులో 'వ్యక్తి పేరు' 'ఇంటి పేరు' అని అనువదించవలసింది.

ఇప్పుడు 1996లో వచ్చిన ఒక పత్రికా ప్రకటన పరిశీలిద్దాం. ఇది కూడా ఒక మోటార్ సైకిల్‌కి సంబంధించినది.

"They said 87 Kms Per litre.

*I said, 'you guys must be kidding ' But that's what got me interested at first. So I borrowed it from one of the boys for a day. Now I've had one for almost a year. And you bet, my champion runs on a low fuel diet.* It eats more road and drinks less petrol"

*This is an authentic customer statement.*

**''రాకేష్ అన్నాడు లీటర్‌కి 87 కి.మీ. అని.** నేనన్నాను, హాస్యాలాడకు గురూ అని. అయినా నాలో కుతూహలం మాత్రం పోలేదు. నడిపి చూస్తే తెలుస్తుందిగా అనుకున్నా. ఒక్క రోజుకి 4s ఇవ్వమని అతన్నడిగాను. అంతే, ఇప్పుడు రెండేళ్ల నుంచీ, 4s నడుపుతున్నాను. నిజంగానే బజాజ్ 4s ఓ సాటిలేని మేటి ఛాంపియన్! ఈ ఛాంపియన్‌కి తెలుసు...

**ఎక్కువ దూరం పరిగెత్తాలంటే పెట్రోలు తాగేయక్కర్లేదు అని.''**

4s ఛాంపియన్ నడుపుతున్న ఓ వ్యక్తి నిజంగా చెప్పినది.

BRAOU

ఇక్కడ అనువాదకుడు పదపదానువాదం చేయకుండా భావానికీ విషయానికీ ప్రాముఖ్యం ఇచ్చి స్వేచ్ఛానువాదం చేయడం వల్ల భాషలోని సహజత్వం దెబ్బతినలేదు. అయితే ఇంగ్లీషు eat, drink అనే క్రియలను వాడడంలో చమత్కారం తెలుగులో రాలేదనుకోండి. ఇక ఈ కింది ఇంగ్లీషు, తెలుగు వాక్యాలను సమీక్షించండి. ఇది హైదరాబాద్‌లో రైలు నిలయం దగ్గర బ్రిడ్జి వద్ద బోర్డు మీద ఉంది.

> For the wages of Sin is death But the gift of God is eternal through Jesus christ our Lord.
>
> *Holy Bible (Rom 6:23)*

> ఏలననగా పాపము వలన వచ్చు జీతము మరణము అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసు నందు నిత్య జీవము.
>
> *పరిశుద్ధ గ్రంథము ( రోమ్ 6:23)*

ఇంగ్లీషులో For ..... అని వాక్యం ఆరంభించడం సహజం. అయితే తెలుగులో 'ఏలననగా' అని ప్రారంభించడం అర్థాంతరంగా ఉంది. భాషలో సహజత్వం పోయింది.

### 21.4.2 వాణిజ్య వార్తలు

వాణిజ్య వార్తలు కొంతమందినే ఆకర్షిస్తాయి. వాణిజ్య రంగంలో ప్రవేశమున్నవారు ఈ వార్తలను సాధారణంగా చదువుతారు. వారు ఈ రంగంలో ఉపయోగించే విశేష పదాలతో (register) పరిచితులై ఉంటారు. అటువంటప్పుడు అనువాదకులు ఇంగ్లీషులోని పదాలనే అనువాదంలో కూడా వాడడం సముచితం. వాడుకలో లేని తెలుగు పదాలను వాడడం వలన కొత్త సమస్యలు ఏర్పడవచ్చు. పాఠకులకు వార్త అర్థం కాకపోవచ్చు.transliterate చేయడం, పదపదానువాదం చేయక వాక్యానువాదం చేసి పాఠకులకు విషయాన్ని సహజమైన తెలుగులో అందించడం చేయాలి. ఇందువలన పాఠకులు తుదివరకు ఆసక్తి కోల్పోకుండా చదువుతారు. ఆసక్తిగా చదివించే గుణం దెబ్బతినక పోవడం ఇక్కడి విశేషం.

BRAOU

### 21.4.3 క్రీడారంగ వార్తలు, తదితరాలు

క్రీడారంగానికి సంబంధించిన వార్తలు ముఖ్యంగా యువతను, క్రీడాకారులను ఆకర్షిస్తుంది. వారు ఈ రంగంతో పరిచితులు గనుక ఆయా ఆటల్లో ఉపయోగించే ప్రత్యేక పదజాలంతో వారికి పరిచయముంటుంది. ఈ వాడుక పదాలను అనువదించే ఆవశ్యకత లేదు. అయితే విషయాన్ని మాత్రం యథ-తథంగా సూటిగా చెప్పాలి. ఉదాహరణకు క్రికెట్టుకు సంబంధించిన ఈ వార్తను చూద్దాం:

ఉదాహరణకు:

## Nagarjuna Agri Tech to tap capital market

***Newstoday***

Hyderabad: City - based Nagarujuna Agri -Tech Limited will be tapping the capital market with a public issue of 46,20,000 eq-

uity shares of Rs. 10 each for cash at par aggregating Rs. 462 lakh. The issue, opening for subscription on April 15, 1996, is to part finance the capital cost of setting up a 100 per cent export oriented unit (EOU) for cultivation and growth of 11.25 million cut rose flowers per annum in five green houses of one hectare each at Arula Maligi village, about 50 kms away from Bangalore. The total project cost is Rs. 1,375 lakh.

Company managing director Dr KVLN Raju told Newstoday of Friday that the project which is to commence commercial production in April this year, has an equity participation by Karnataka State Industrial Investment and Development Corporation Ltd (KSIIDC) to an extent of Rs. 25 lakh. The project has been appraised and part financed by way of a foreign currency loan equivalent to Rs. 363 lakh and rupee term loan of Rs. 137 lakh by Industrial Development Bank of India (IDBI).

Raju pointed out that Stock-horst BV Holland was providing technical assistance in areas of greenhouses erection, irrigation, disease control, water, soil treatment, fertilisation, packaging and post - harvest techniques. Anton Verbeek Rozen BV of Holand was supplying different varieties of plant materials and specialised green houses had been imported from Serres - De-France. Nagarjuna Agri Tech has entered into a marketing agreement with Florimex B V of Holland for a minimum period of two years.

BRAOU

## నాగార్జున అగ్రిటెక్
## ఫ్లోరికల్చర్ ప్రాజెక్ట్

హైదరాబాద్, మార్చి 29 (న్యూస్ టుడే): గులాబీ పూల (కట్ ఫ్లవర్స్) ఉత్పత్తికి కర్నాటకలోని దొడ్డబళ్లపూర్ వద్ద రూ. 13.75 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును నెలకొల్పిన నాగార్జున అగ్రిటెక్ లిమిటెడ్ రూ. 4.62 కోట్లు సమీకరించేందుకు ఏప్రిల్ 15న పబ్లిక్ ఇష్యూ చేయనుంది. నూరు శాతం ఎగుమతి ప్రధానంగా ఈ ఫ్లోరికల్చర్ ప్రాజెక్టును 40 ఎకరాల స్థలంలో ఏడాదికి 1.12 కోట్ల కాడల ఉత్పత్తి సామర్థ్యంతో నెలకొల్పినట్లు మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎల్.ఎన్. రాజు చెప్పారు. ప్రాజెక్టు అమలు పూర్తయి, ఇప్పటికి 28 కన్‌సైన్‌మెంట్‌లు ఎగుమతి చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 13.75 కోట్లు. దీనిలో ఐడిబిఐ రూ. 5 కోట్లు రుణంగా ఇస్తోంది. ప్రమోటర్లు రూ. 3.80 కోట్లు ఈక్విటీగా సమకూర్చగా కెఎస్ఐడిసి ఈక్విటీలో రూ. 25 లక్షలు సమకూరుస్తోంది. మిగిలిన రూ. 4.62 కోట్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించనుంది.

గులాబిపూల ఎగుమతికి చక్కని అవకాశాలుండడంతో, స్లాక్ హార్స్ట్ బివి (హాలెండ్) సాంకేతిక సహకారంతో ఈ ఫ్లోరికల్చర్ ప్రాజెక్టును చేపట్టినట్లు రాజు చెప్పారు. మార్చి 97తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో రూ. 10.02 కోట్ల టర్నోవర్ మీద కంపెనీ రూ. 2.09 కోట్ల నికర లాభం ఆర్జించగలదని అంచనాల్లో పేర్కొన్నారు.

ఇక్కడ ఉదాహరణలో మనం గమనించవలసినది అనువాదకుడు విశేష పదాలను తెలుగులోకి అనువదించలేదు.

## సెంచరీ చేజారిన సోమసుందర్

### *తమిళనాడుతో రంజీ ఫైనల్: కర్ణాటక 171/2*

మద్రాసు, మార్చి 27: ఓపెనర్లు సుజిత్ సోమసుందర్, అవినాశ్ వైద్యలు మొదటి వికెట్‌కి రికార్డు భాగస్వామ్యం నెలకొల్పడంతో తమిళనాడుతో బుధవారం ప్రారంభమైన రంజీట్రోఫీ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో తొలి రోజు కర్ణాటకదే పైచెయిగా నిలిచింది. సోమసుందర్ (99) సెంచరీ సాధించకుండానే దురదృష్టవశాత్తు అవుటయ్యాడు. వికెట్‌కీపర్ అవినాశ్ వైద్య మందకొడిగా ఆడి 42 పరుగులు చేశాడు. మొదటిరోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఆర్. విజయ్ 19 పరుగులతోనూ, వైస్ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ 2 పరుగులతోనూ ఆడుతున్నారు. తమిళనాడు స్పిన్నర్ డబ్ల్యు.డి. బాలాజీరావు 60 పరుగులిచ్చి 2 వికెట్లు సాధించాడు.

అంతకు ముందు రెండు సౌత్‌జోన్ జట్లు జాతీయ క్రికెట్ కిరీటం కోసం పోటీ పడుతున్న ఈ మ్యాచ్‌లో 'టాస్' కర్ణాటకను వరించింది. ఓపెనర్లు సుజిత్ సోమసుందర్, అవినాశ్ వైద్యలు 52.3 ఓవర్లలో సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తి చేశారు. గతంలో కార్ల్‌టక్ సల్దానా, పి.వి. శశికాంత్‌లు తొలి వికెట్‌కి 109 పరుగులు జోడించి నెలకొల్పిన రికార్డును సోమసుందరం, అవినాశ్ వైద్యలు అధిగమించారు. అవినాశ్ వైద్య (300 నిముషాల్లో 42 పరుగులు), సోమసుందర్ (342 నిముషాల్లో 10ఫోర్లు, 2 సిక్సర్లతో 99 పరుగులు)లు నిష్క్రమించారు. సోమసుందర్ ఈ సీజన్లో 700 పరుగులు అధిగమించడం విశేషం.

కర్ణాటక తొలి ఇన్నింగ్స్: సుజిత్ సోమసుందర్ (సి) కె.శ్రీనాథ్ (బి బాలాజీ 99); అవినాశ్ వైద్య (సి) రామన్ (బి) బాలాజీ 42; ఆర్.విజయ్ బ్యాటింగ్ 19, రాహుల్ ద్రవిడ్ బ్యాటింగ్ 2; ఎక్స్‌ట్రాలు: 9, మొత్తం (90 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి):171

వికెట్ల పతనం: 1-133, 2-161

బౌలింగ్: వాసు 18-6-31-0; మహేశ్ 16-4-34-0; రాబిన్ సింగ్:8-0-19-0; సుబ్రమణ్యం 20-12-10-0; బాలాజీరావు 25-3-60-0; కె. శ్రీనాథ్3-0-17-0

BRAOU

ఇక్కడ అనువాదకుడు ప్రత్యేక పదజాలాన్ని అనువదించే అనవసరపు శ్రమ తీసుకోకుండా క్రికెట్టులో ఉపయోగించే ఇంగ్లీషు పదాల్నే వాడి వార్తను సహజ రూపంలో పాఠకులకు అందించారు.

ఇదే విధంగా ఆరోగ్య విషయాలు, చట్టానికి సంబంధించిన వార్తలు, ప్రకటనలు, ఆయా రంగాలలో వాడుక మాటలనే అనువాదంలో కూడా వాడడం శ్రేయస్కరం. అయితే చట్టపరమైన వార్తల ప్రకటనల పద్ధతి ప్రత్యేకంగా ఉంటుంది.

ఉదాహరణకు:

## ఉన్నత న్యాయస్థానం సమక్షంలో

ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వద్ద రిట్ అప్పీల్ నెం: 1090/1988

దిగువ వారి మధ్యన,

1. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
   దాని ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్,
   శకుంతల అపార్ట్‌మెంట్స్,
   59, నెహ్రూ ప్యాలస్, న్యూఢిల్లీ వారు
   ప్రతినిధిగా మరియు మరొక వ్యక్తి ..అప్పీలుదారులు/ప్రతివాదులు

**Vs.**

S.K. జైన్, S/o. కాశీరామ్ జైన్,
మేనేజర్ (క్వారీ) ఆదిలాబాద్ సిమెంట్ ప్రాజెక్టు,
R/o. ఆదిలాబాద్. ..ప్రతివాది/అర్జీదారు

To.
శ్రీ S.K. జైన్, S/o. కాశీరామ్ జైన్
మాజీ మేనేజర్ (క్వారీ)
ఆదిలాబాద్ సిమెంట్ ప్రాజెక్టు, ఆదిలాబాద్.

సుప్రీంకోర్టు నందలి ట్రాన్స్‌ఫర్ పిటిషన్ (సివిల్) నెం. 716/93లోని పై విషయంలో హైకోర్టు ఎదుట మీరు స్వయంగా హాజరై మీ వాదనను తెలుపుకోవాలనే మీ అభీష్టం వ్యక్తపరిచారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిట్ అప్పీల్ నెం. 1090/1988ను విచారణ కొరకై 1996, ఏప్రిల్ 23వ తేదీ, మంగళవారం మ. 2.15 గం.కు వాయిదా వేయబడినదని మీకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

మీరు హాజరుకావడంలో విఫలమైతే మీ పరోక్షంలో సదరు రిట్ అప్పీలు తీర్మానించబడుతుందని కూడా మీకు తెలియజేయడమైనది.

(ఉత్తర్వు మేరకు)

సం/-, **రిజిస్ట్రార్ (జుడిషియల్)**

ఇక్కడ పేర్ల క్రమాన్ని గాని,పద్ధతిని (format) ని గాని మార్చడానికి వీలు లేదు.

ఇక కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన వార్తా ప్రకటనలను తీసుకుందాం. ఇటువంటి అంశాలు (items) అన్ని వివరాలు స్పష్టంగా తెలిపేటట్లు ఉండాలి. భాష సరళంగా, అందరికీ బోధపడేటట్లు ఉండాలి.

BRAOU

**కార్పొరేట్ కార్యాలయాల**
**ఆవరణ అమ్మకం కొరకు**

అవసరానికి తగినట్లు షాపులు మరియు కార్యాలయాలకు మొదటి అంతస్తులో 20000 చ.అ. వాణిజ్య ప్రయోజనాల ఆవరణను మేము కలిగియున్నాము. తక్షణం స్వాధీనతకు కలదు. షాపుల కొరకు గ్రౌండ్ ఫ్లోర్ 6000 చ.అ.

సైట్ వద్ద సంప్రదించండి: **M/s. సిటి టవర్**
నల్గొండ క్రాస్ రోడ్, మలక్‌పేట, హైదరాబాద్ – 500036.
ఫోన్: 565281, ఉ.గం:11.00 నుంచి మ.గం. 2.00మధ్య.

పై ప్రకటనలో అనువాదకుడు 'we have' ను మేము కలిగియున్నాము అని అనువదించారు. మాకు ఉంది అంటే తెలుగు పద్ధతిలో ఉండేది. 'ready occupationను స్వాధీనతకు కలదు అని అనువదించినట్లు కనిపిస్తుంది. స్వాధీనం చేస్తాం అంటే సహజంగా ఉండేది. అనువాదం చేసేటప్పుడు ఆదాన భాషలో వాక్య నిర్మాణం సహజంగా ఉండేటట్లు జాగ్రత్త వహించాలి.

BRAOU

**అభ్యాసం –1**

i విశేష వార్తలంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలను పేర్కొనండి?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

ii క్రీడారంగానికి సంబంధించిన వార్తకు భాగంలో ఇచ్చిన ఉదాహరణలో యథాతథంగా తెలుగులో అనువాదంలోకి వచ్చిన 5 పదాలను రాయండి.

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 21.5 రేడియో, టివీల కోసం విశేష వార్తల అనువాదం

మునుపు పత్రికాముఖంగా మాత్రమే ప్రకటనలు వస్తుండేవి. అయితే సాంకేతికంగా మార్పులు రావడంతో ఇప్పుడు అగ్గిపెట్టె నుంచి కంప్యూటర్ల వరకూ అన్ని వస్తువుల ప్రకటనలూ రేడియో, టీవిలలో వస్తున్నాయి. వివిధ భాషల్లోకి ఒకే ప్రకటనను అనువదించాల్సిన అవసరం ఉంది.

అయితే ప్రతీ మాధ్యమానికీ (medium) దాని ప్రత్యేకత ఉండడం వల్ల భాషను మాధ్యమానికి అనుగుణంగా మార్చవలసి ఉంది. పత్రికలలో ఇచ్చే వివరాలు టివీలో దృశ్యాల ద్వారా చూపవచ్చు కాబట్టి పాఠ్యంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది.

రేడియోలో వచ్చే వార్తలు క్లుప్తంగా సూటిగా, సరళంగా, సహజంగా ఉండాలి. టీవీ కోసం అనువదించేటప్పుడు పెదాల – శబ్దాల మధ్య సహజ ఉచ్చారణ స్వరూపంఉండాలి. అంటే దృశ్య శ్రవ్య భాగాలను పొందుపరచాలి. ముఖ్యంగా ఓష్ఠ్యాలను, ఉదాహరణకు ఇంగ్లీషులోని 'papa' అన్న పదాన్ని నాన్న లేక అయ్య అని అనువదించే వీలు లేదు.

రేడియో, టివీల కోసం అనువదించేటప్పుడు దృష్టిలో పెట్టుకోవాల్సిన ఇంకొక విషయం పదోచ్చారణ. సర్వ నామాలను యథాతథంగా లిప్యంతరీకరణం చేయాలి. ఉదాహరణకు విదేశీ పేర్లMitterand, Jean Paul Sartre మొదలైనవి. నిఘంటువు చూసి ఇటువంటి పేర్ల ఉచ్చారణ తెలుసుకోవచ్చు.

BRAOU

**అభ్యాసం –2**

i రేడియో, టీవీల కోసం అనువదించేటప్పుడు తీసుకోవలసిన రెండు జాగ్రత్తలను పేర్కొనండి.

ii ఏదైనా రెండు విదేశీ పేర్లను సేకరించి వాటిని నిఘంటు సహాయంతో తెలుగులో రాయండి.

## 21.6 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ☞ అనువాదమనేది ఒక భాషలో ఉన్న విషయాన్ని, భావనలను ఇంకో భాషలోనికి తీసుకురావడం.
- ☞ విశేష వార్తలంటే ప్రకటనలు, వాణిజ్య క్రీడారంగ, ఆరోగ్య సంబంధ వార్తలు తదితరాలు.
- ☞ రేడియో, టీవీల కోసం అనువదించేటప్పుడు కొన్ని ప్రత్యేక విషయాలు గమనించాల్సి ఉంటుంది.

## 21.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు.

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. ప్రచార భాషా రచనలను, ముఖ్యంగా విశేష వార్తలను అనువదించేటప్పుడు ఎదురయ్యే సమస్యలను వివరించండి.
2. ఇంగ్లీషులోని విషయ ప్రధానమైన రచనలు రేడియో, టీవీల కోసం అనువదించేటప్పుడు అనువాదకులు గమనించవలసిన విషయాలు ఏవి? ఉదాహరణలతో వివరించండి.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. విశేష వార్తలంటే ఏమిటి?
2. క్రీడారంగ వార్తల అనువాదంలో సాంకేతిక పదాల విషయంలో అనువాదకులు పాటించాల్సిన జాగ్రత్తలను పేర్కొనండి.

## 21.8 అదనపు సమాచారం

1. తెలుగు సాహిత్యం అనువాదంతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. మన ఆదికావ్యం సంస్కృత భారతానికి అనువాదమే గదా. తరువాత చాలాకాలం వరకు కూడా సంస్కృతం నుంచి అనువదించడమే మన కవులు యెక్కువగా చేసిన పని. అయితే యీనాడు జరిగే అనువాదం దాదాపు అంతా యింగ్లీషు నుండి జరుగుతున్నది. తెలుగు దిన పత్రికల్లో మనం చదివే దానిలో అత్యధిక భాగం యింగ్లీషుకు అనువాదమే. వార్తలైనా, వ్యాసాలైనా, చివరకు వ్యాపార ప్రకటనలైనా, యీ అనువాదం మన జీవితంలో యింతగా పెనవేసుకొని పోయింది. గనుక యీనాడు అనువాదమంటే సాధారణంగా యింగ్లీషు నుండి అనువాదమనే అందరూ అనుకుంటారు.

   యీ విధంగా అనువాదం మన నిత్య జీవితంలో విడదీయరాని భాగమైంది గనుక అనువాద కళలో తెలుగువాళ్ళు ఆరితేరి వుంటారని యెవరైనా అనుకోవచ్చు. దురదృష్టవశాత్తు అది నిజం కాదు. తెలుగు దినపత్రికలు జాగ్రత్తగా చదివితే యెంత ఘోరమైన తప్పులూ, యెంత కడుపుబ్బ నవ్వించే దోషాలూ కనిపిస్తాయో చెప్పలేము. అయితే, మరొక మాట కూడా చెప్పాలి. అనువాదంలో తప్పులు చేయడంలో ఆంధ్రులు అగ్రగణ్యులనడం న్యాయం కాదు. అన్ని భాషల వాళ్ళు తప్పులు చేస్తారు. మనకంటే ఘోరమైన తప్పులు చేస్తారు. మనకంటే ఘోరమైన తప్పులు చేసేవాళ్ళు కూడా ఉండవచ్చు. యెందుకంటే, అనువాదమనేదే కష్టమైన పని. ప్రపంచంలో యెక్కడైనా సరే, యే భాషనుండి మరే భాషలోకి అనువాదమైనా సరే, అది మహా కష్టమైన పని. యీ కష్టం భాష అనే దానిలోనే ఉంది. భాషా స్వభావంలోనే ఉంది. అంటే

BRAOU

యే భాషైనా సరే – దాని స్వభావంలోనే ఉంది.

పే. 11

(రాచమల్లు రామచంద్రారెడ్డి, అనువాద సమస్యలు, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 1987)

2. Telugu journalism has played a crucial role both in the evolution of standard Telugu and its modernisation. It was the newspapers that gave a bad in employing the educated spoken style in writing, nearly fifty years ago, as opposed to the classical and neo-classical styles which enjoyed the patronage and favour of the poets, the department of education, the universities, and a large number of writers in those days. The controversy in the choice of style to be used in Telugu language textbooks and in answering language examinations had ended as early as 1915 in favour, of the **graanthika** (classical) style (Krishnamurthy, 1978). The newspapers, in order to efficiently serve their role as mass media, had no alternative but to adopt the educated coloquial language. The establishment of **Navyasaahitya Parishad**, in 1936 with its own journal **Pratibha** gave an institutional boost to the modern language. It is said that the late Tapi Dharma Rao was the first to introduce educated spoken Telugu as the vehicle of Telugu journalism in his daily newspaper, Janavaani in 1937. *(B. Radhakrishna 1974:278)*

3. It would be rewarding to make sample comprehension survey of the language and style used in various newspapers in Indian languages to see if these is any correlation between the degree of comprehension and readability of a paper by semi-literate population and its popularity and pattern of circulation. Such studies will serve as a feedback to news writers to reflect, modify, and revise their style and idiom to increase the appeal of their writing as well as the circulation of the paper. Linguists have an important role to play in designing such research studies and also in the preparation of dictionaries and translation mannuals for language journalism in India.

*(Bh. Krishnamurti, 1984)*

(2 and 3 are excerpts from the article "Modernization of South Indian Languages: Lexical Innovations in Newspaper Language" by Bh. Krishnamurthy in the book Modernization of Indian Languages in News Media. Edited by Bh. Krishnamurthy and Aditi Mukherjee, Dept of Linguistics, Osmania University, Hyderabad, 1981)

BRAOU

# భాగం : 22 భిన్నరంగాల్లో అనువాదం (ప్రత్యేక అధ్యయనం)

**విషయ క్రమం**

22.0 ఉద్దేశం

22.1 ప్రవేశిక

22.2 అనువాదం – సృజన, సృజనేతర రంగాలు

22.2.1 సృజన రంగం

22.2.2 సృజనేతర రంగం

**అభ్యాసం – 1**

22.3 అనువాదం – ఆవశ్యక రంగాలు

**అభ్యాసం – 2**

22.4 ముఖ్య విషయాలనుగుర్తుంచుకుందాం

22.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు.

BRAOU

## 22.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది అంశాలను చర్చించగలుగుతారు:

- సాహిత్యానువాదంలో ఎదురయ్యే సమస్యలు.
- శాస్త్ర సాంకేతిక రచనల అనువాదంలో పాటించాల్సిన జాగ్రత్తలు
- ప్రసార సాధనాల్లో అనువాదం – ప్రత్యేక సమస్యలు
- అనువాదం ఆవశ్యకత పెరుగుతున్న రంగాలు

## 22.1 ప్రవేశిక

అనువాదం చేయడానికి రెండు భాషలకు సంబంధించిన పరిజ్ఞానం ఒక్కటే చాలదు. అనువాదంలో నైపుణ్యానికి దోహదం చేసే ప్రధానమైన అంశాలు : అనువాదం చేసే వ్యక్తి ఊహాశక్తి, అభిరుచి, భాషా పాండిత్యం, ప్రాపంచిక దృష్టి.

సామాజిక సందర్భాలు కొత్తవి ఏర్పడుతున్న కొద్దీ భావనలను, ఆలోచనలను, మన భాషలోకి తీసుకురావలసిన అవసరాలు పెరుగుతాయి. గడచిన రెండు దశాబ్దాల్లో ఈ అవసరాలే పెరిగాయి. ప్రసార సాధనాల వ్యాప్తి, విస్తృతి అందుకు ప్రధాన కారణం. ఈనాడు అనువాదం కేవలం సాహిత్యానువాదం మాత్రమే కాదు. అది భాషను ప్రయోగించే వివిధ రంగాలకు సంబంధించిన రచనల అనువాదం.

ఇంతకు ముందు భాగాల్లో అనువాద సిద్ధాంతాన్ని, వివిధ రకాల అనువాదాల్ని, ప్రసార సాధనాల్లో ముఖ్యంగా పత్రికారంగంలో విశేష వార్తల అనువాదంలో ఎదురయ్యే కొన్ని సమస్యల్ని గురించి తెలుసుకున్నాం. ఈనాడు సృజన, సృజనేతర రంగాల్లో పెరుగుతున్న అనువాదం ఆవశ్యకత, అనువాద ప్రాముఖ్యాన్ని తెలియజేస్తోంది.

## 22.2 అనువాదం - సృజన, సృజనేతర రంగాలు

ఇప్పుడు బాగా ప్రాచుర్యమున్న అనువాద విధానం స్వేచ్ఛానువాదం. సృజనరంగంలోనూ, సృజనేతర రంగంలోనూ ఈ అనువాద విధానమే ఆదరణీయమైందిగా అపేక్షణీయంగా కనిపిస్తోంది. అనుసరణనూ స్వేచ్ఛానువాదం అనే పదంతోనే ఈనాడు కొందరు సూచిస్తున్నారు. అయితే మూలంలో విషయానికి మార్పులు, చేర్పులు చేసి స్వతంత్రంగా అనువదించడాన్నే అనుసరణ అంటారని మనం గుర్తుంచుకోవాలి. స్వేచ్ఛానువాదం అంటే పదపదానువాదం కాదు.

"It is raining cats and dogs"

''ఆకాశం పిల్లులు కుక్కలు కురుస్తోంది''

ఇది పదపదానువాదం. దీనికి భాషలోని మర్యాదలతో, కొన్ని పదబంధాలకుండే ప్రత్యేక భావంతో సంబంధం లేదు. ఆకాశం అనే పదాన్ని ఊహించి చేర్చిందే.

BRAOU

''కుండ పోతగా కురుస్తోంది''

– ఇది పై ఇంగ్లీషు వాక్యానికి సరైన తెలుగు అనువాదం. రెండు భాషలలోని జాతీయాలు, పలుకుబళ్ళు, నుడికారాలు, భావనా పద్ధతులు, సాంస్కృతిక విషయాలు, భాషా వ్యాకరణ సంప్రదాయాలు, శైలీ తారతమ్యాలు తెలియకపోతే అనువాదకుడు సమర్థంగా తన పనిని నిర్వహించటం అసాధ్యం.

కింది బైబిలు అనువాదాన్ని పరిశీలిస్తే మెరుగైన, నేటి వ్యవహారిక శైలికి సన్నిహితమైన పద్ధతిని మీరు గుర్తించగలుగుతారు.

మూలం

"Beware of false prophets, which come to you in sheeps clothing, but inwardly they are radening wolves.

Ye shall know them by their fruits. Do men gather grapes of thorns, or figs of thistle?

Even so every good tree bringeth forthe good fruit; but a corrupt tree bringeth forth evil fruit.

A good tree cannot bring forth evil fruit, neither can a corrupt tree bring forthe good fruit.

Every tree that bringeth not good fruit is hewn down, and cast into the fire.

Where fore by their fruits ye shall know them (New Testament 7.15-20)

ప్రాచీన శైలి అనువాదం:

''అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు గాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు. వారి ఫలముల వలన మీరు తెలుసుకొందురు. ముండ్ల పొదలలో ద్రాక్ష పండ్లనైనను, పల్లేరు చెట్లకు అంజూరపు పండ్లనైనను కోయుదురా? అలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును. పనికి మాలిన చెట్లు కాని ఫలములు ఫలించును. మంచి చెట్లు కాని ఫలముల ఫలించనేరదు; పనికి మాలిన చెట్టు మంచి ఫలముల ఫలింపనేరదు. మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. కాబట్టి మీరు వారి ఫలమువలన వారిని తెలిసికొందురు.

(పరిశుద్ధ గ్రంథము. మత్తయి శుభవార్త 7.21)

ఆధునిక శైలిలోని అనువాదం:

''కపట ప్రవక్తల విషయం జాగ్రత్త! వాళ్ళు గొర్రెతోలు కప్పుకొని మీ దగ్గరకు వస్తారు. కాని అంతర్యంలో వాళ్ల క్రూర స్వభావం గల తోడేళ్ళు సుమా! వాళ్ళ పనులను బట్టి వాళ్ళ నిజస్వరూపం తెలుసుకుంటారు. ముళ్ళ పొదలలో ద్రాక్షపళ్ళూ, పల్లేరు చెట్లలో అంగూరపళ్ళూ దొరుకుతాయా? దొరకవు. మంచి చెట్టుకే మంచి పళ్ళు కాస్తాయి, పనికిమాలిన చెట్టుకు పనికి మాలిన పళ్ళు కాస్తాయి. మంచి చెట్టుకు పనికిమాలిన పళ్ళు కాయవు. పనికి మాలిన చెట్టుకు మంచిపళ్ళు కాయవు. మంచి పళ్ళు కాయని ప్రతి చెట్టును నరికి అగ్నిలో పారవేస్తారు. ఈ విధంగా వాళ్ళ పనుల వల్ల వాళ్ళను గుర్తించగలుగుతారు.

(క్రీస్తు జీవితం, సందేశం, బైబిలు రెండవ భాగం, వాడుక శైలిలో: చెట్టూ ఫలమూ)

ఆధునిక శైలిలో మరొకటి:

15. అసత్య ప్రవక్తల నించి తప్పుకోండి. వాళ్ళు గొర్రెతోలు కప్పుకొన్న తోడేళ్ళు.

16. వాళ్ళ కార్యాల వల్ల వాళ్ళని తెలుసుకోండి. ముళ్ళపొదలకి ద్రాక్షపళ్ళూ, తుప్పలకి అంజూరపళ్ళో పండుతాయా.

17. మంచి చెట్టుకు మంచి పళ్ళు పండుతాయి. పనికిమాలిన చెట్టుకి మంచి పళ్ళు పండవు.

18. మంచి చెట్టుకి విషపు పళ్ళు పండవు. చెడ్డ చెట్టుకు మంచి పళ్ళు పండవు.

19. మంచి పళ్ళు పండని ప్రతి చెట్టునీ నరికి నిప్పులో పెడతారు.

20. అందుకనే పళ్ళు వలనే చెట్టు ఎటువంటిదో తెలుసుకోవచ్చు.

శుభవార్తలు - చలం; అధ్యాయం 7



BRAOU

అబద్ధ ప్రవక్తలు, గొర్రె చర్మములు, కాని ఫలములు తెలుగు నుడికారానికి సహజమైనవి కావు.

Wherefore అనే పదానికి 'ఈ విధంగా' కన్నా 'అందుకనే' అనే అర్థం కొంత సన్నిహితమైందేమో ఆలోచించండి.

Evil fruit అంటే పాపిష్టి పళ్ళు అనే అర్థం మరెంతో సన్నిహితంగా ఉండవచ్చు.

మూలంలోని భావాలను సాధ్యమైనంత పూర్తిగా అందించడానికే ఈ అనువాదకులు ప్రయత్నించారు అనే విషయం స్పష్టం. అయితే కొన్ని పదాలకు అర్థం ఇవ్వడంలో, నుడికారాలను వాడడంలో తేడాలున్నాయి.

స్వతంత్ర రచనలా అనిపించడం స్వేచ్ఛానువాదంలో కనిపించే మౌలిక లక్షణం. తెలుగు వాక్య మర్యాదను, నుడికారం సొంపును ప్రదర్శిస్తూ, మూల భావం చెడనీయకుండా అర్థస్ఫూర్తికి భంగం ఉన్న చోట్ల అనువాదాన్ని వదిలేస్తూ, అర్థ సుబోధకతకు అనువుగా మార్పులు చేస్తూ సాగే అనువాద పద్ధతి ఇది. ఈనాడు సృజన, సృజనేతర రంగాలలో ఈ పద్ధతి ఎక్కువగా కన్పిస్తుంది.

ఈ కింది భాగాన్ని గమనించండి:

లూసన్ రాసిన "The Wise Man. The Fool And The Slave" అనే కథలో కొంత భాగాన్ని ఇస్తున్నాం. ఈ కింద ప్రచురితమైన ఒక తెలుగు అనువాదం కూడా ఇస్తున్నాం. చదవండి.

BRAOU

ఇంగ్లీషు మూలం

A slave did nothing but look for people to whom to pour out his woes. This was all he would and all he could go. One day he met a wise man.

"Sir! he cried sadly, tears pouring down his cheeks. "you know, I lead a dog's life. I may not have a single meal all day, and if I do it is only husks of sorghum which not even a pig would eat. Not to say there is one smal bowl of it..."

"That's really too bad." the wise man commiserated. "Isn't it"? His spirits rose. Then I work all day and all night. At dawn I carry water, at dusk I cook the dinner; in the morning I run errands, in the evening I grind wheat; when it's fine I wash the cloths, when it's wet I hold the umbrealla; in winter I mind the furnance, in summer I wave the fan. At midnight I boil white fungus, and wait on our master at his gambling parties; but never a tip do I get, only some times the strap..."

తెలుగు అనువాదం

ఓ బానిస కష్టాలతో కాపురం చేస్తున్నాడు. అయినా వాటిని వదిలించుకునేందుకు అతగాడు చేసేదేమీ లేదు.

కానీ, తమ బాధలన్నీ విని సానుభూతి చూపే తీరికా, ఓపికా గలవారెవరేనా దొరుకుతారేమోనని మాత్రం చూస్తుండేవాడు.

ఓ సుప్రభాతాన అతగాడికో ''పెద్ద మనిషి'' ఎదురయ్యేడు. ఆయన గారు చాల తెలివైనవాడనీ, మేధావి అనీ అందరూ అంటుంటారు.

బానిస తన దీనస్థితినంతా అతనితో మొర పెట్టుకున్నాడు. ''చూడండయ్యగారూ! నాదో కుక్క బ్రతుకనుకోండి. రోజుకోపూట తిండిక్కూడా గతి లేదు నాకు. పందులు కూడా ముట్టనిదేదో ఇంత నా మొహాన్న కొడుతుంటాడు మా యజమాని. అది మాత్రం ఎంతుందనుకున్నారూ'' అంటూ దోసిలివిప్పి చూపించేడు.

మేధావిగారు చాలా బాధపడిపోయేరు. బానిస వాలకం చూసి ''నిజంగానా ఐతే చాలా అన్యాయం అన్న మాటే!'' అంటూనే ఆయన యజమానుల దాక్షిణ్యరాహిత్యానికి ఆగ్రహపడి పోయేరు. ఆయన మొహం ఎర్రబడింది, కనుబొమలు ముడిపడ్డాయి.

దాంతో బానిసకు ఉత్సాహం వచ్చింది. ''కాదటండీ! రాత్రింబవళ్ళూ గొడ్డుకన్న మిన్నగా చాకిరి చేస్తుంటాన్నేను. కోడికూత కన్నా చాలాముందే లేచి నీళ్ళు తోడి మోస్తుంటాను. ధాన్యం దంచుతాను, పిండి రుబ్బుతాను. కట్టెలు కొడతాను, అయ్యగారికి విందు భోజనాలు తయారు చేస్తుంటాను. బట్టలుతుకుతాను. వేసవిలో రెక్క లాడేలా పంకా విసురుతుంటాను. చలికాలంలో నెగడు ఆరిపోకుండా అక్కడే కాపలా ఉంటాను; వర్షాకాలంలో అయ్యగారికి గొడుగు పట్టేది కూడా నేనే. అయ్యగారు జూదంలో కూర్చుంటే అర్ధరాత్రిళ్ళు కూడా టిఫిన్లు తయారు చేసి కనిపెట్టుకుంటాను. కానీ... కానీ.. ఇంత చేసినా నన్నెవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఏనాడు ఎర్రని ఏగానీ కూడా ఎవరూ నా ఎదాన వేసిన జాడలేదు. ఎప్పుడైనా దయదలిస్తే పీక్కుతినలేక వదిలేసిన ఓ బొమికె ముక్క మాత్రం...''

ఈ అనువాద కథపేరు **'మేధావి'**. పేరులో ఇంగ్లీషు మూలంలోని The Fool The Slave రాలేదు. ఇంగ్లీషులోని వాక్యాలకు ఇందులో మూల విధేయమైన అనువాదం కొన్ని చోట్ల ఉంది. కొన్ని చోట్ల లేదు. అనువాదకుడు స్వతంత్రంగా కొన్ని మాటలు వదిలివేశాడు, కొన్ని మార్పులు చేర్పులు చేశాడు.

ఇంగ్లీషు మూలంలోని రెండవ పేరాలో యజమాని ప్రస్తావన లేదు. తెలుగు అనువాదంలో వచ్చింది. చైనా సాంస్కృతిక జీవితాన్ని తెలిపే"husks of sorghum.." అనే మాటలకు తర్జుమా లేదు. ఇందులో ఇంగ్లీషు మూలానికి యథాతథమైన అనువాదం కొన్ని వాక్యాల్లో అన్పిస్తుంది. కొన్ని వాక్యాల్లో కన్పించదు. One day we met a wise man అనే వాక్యానికి వివరణాత్మకంగా రెండు వాక్యాలు మనకు అన్పిస్తాయి. ''ఓ సుప్రభాతాన అతగాడికో పెద్దమనిషి ఎదురయ్యేడు. ఆయనగారు చాలా తెలివైనవాడనీ, మేధావి అని అందరూ అంటుంటారు''At down I dcarry watter అనే వాక్యానికి తెలుగు వ్యాకరణం ఉట్టిపడేట్లు 'కోడి కూతకన్నా ముందేలేచి' అని చేర్చాడు. అలాగే పరాయి దేశపు సంస్కృతి జీవితాన్ని తెలిపే husks of sorghum అనే మాటలను అనువదించకుండా వదిలివేశారు. మొత్తం మీద తెలుగు అనువాదాన్ని ప్రత్యేకంగా చదివితే తెలుగులోనే రాసిన ఓ వచన భాగంలా కన్పిస్తుంది. అట్లాగని మూల భావాన్ని మార్చి ప్రధాన అంశాల్ని మార్చి కొత్త విషయాన్ని చెప్పలేదు. ఉన్న భావాన్నే మరెంతో స్పష్టం చేసేందుకు సుబోధకం చేసేందుకు అనువాదకు లు ప్రయత్నించారు. ఇలాంటి తరహా అనువాదాలు ప్రస్తుతం అన్ని రంగాల్లో కనిపిస్తున్నాయి. అయితే సృజన ప్రక్రియల్లో ఈ అనువాద పద్ధతి ఎక్కువ. విషయ ప్రధాన మైన శాస్త్ర, సాంకేతిక విషయాలను అనువదించేప్పుడు అనువాదకునికి ఇలాంటి స్వేచ్ఛ తక్కువ ఉంటుంది.

BRAOU

### 22.2.1 సృజన రంగం – అనువాదం

సృజన రంగంలో స్వేచ్ఛానువాద పద్ధతి ఎక్కువ అనుసరణీయంగా అనువాదకులు భావిస్తారు. సాహిత్యానువాదంలో భావానుసరణంతో బాటు అనువాదకుడు జాగ్రత్తగా చేయవలసిన పని మరొకటుంది. అది శైలి అనుకరణ. బహుశా అనువాదకునికి కొన్ని రచనల్లో ఇలాంటి సమస్య రాకపోవచ్చు. సాదాసీదా సాధారణ శైలిని అనువాదంలోకి తీసుకురావడం కష్టం అన్పించక పోవచ్చు. కాని సుప్రసిద్ధులైన రచయితలకు శైలి అనేది ఒకటి ఉంటుంది. వారి రచనలోని తీవ్రతను సూటిదనాన్ని, స్పష్టతను అనువాదంలోకి తేవాలన్నప్పుడు ఆ శైలిని తెలుగులో తీసుకురావడానికి ప్రయత్నించక తప్పదు. ఇక్కడ శైలి స్ఫూర్తిని వదిలిపెట్టి అనువాదం చేస్తే రచయితకు, అందుకునే పాఠకులకు అనువాదకుడు పూర్తి న్యాయం చేకూర్చలేదనే అర్థం. ఇది అనువాదకునికి నిజంగా ఒక పరీక్ష వంటిది.

కింది ఉదాహరణ గమనించాలి: గోర్కీ కథల్లో Song of the falcon అనే కథకు రాచమల్లు రామచంద్రారెడ్డి అనువాదం ఇది:

A tremor passed over the falcon. It gave a proud cry and crawled out on the cliff, seeking a hold in the slime.

And on reaching the edge it spread wide its wings, drew a deep breath, and with a flash of its eyes, plunged into space.

Swift as a stone fell the falcon, scattering feathers tearing its wings as it fell.

A wave caught it up, washed it of blood, wrapped it in foam, and carried it down to the sea.

Mournful the cry of the waves as they broke on the face of the cliff. And gone was the bird - lost to sight in the vast expanse of the sea.

దీనికి తెలుగు అనువాదం ఈ క్రిందిది:

''ఒళ్ళు జలదరించింది డేగకు, సగర్వంగా కూతవేసి అది కొండ కొమ్ము మీద ప్రాకుతూ పోయింది, పాచిమీద పట్టు సంపాయించుకుంటూ

అంచుకు చేరి అది పూర్తిగా రెక్కలు సాచింది – రొమ్మునిండి వూపిరి తీసుకొని మెరుపు చూపుతో, కిందికి దూకింది.

వేగంగా – రాయిలాగ పడిపోయింది డేగ. పతన వేగానికి యీకలు రాలి పడినాయి – రెక్కలు కోసుకుపోయినాయి.

ఒక అల చేతులెత్తి పట్టుకుంది డేగను – దాని నెత్తురు కడిగింది – నురుగు పొత్తిళ్ళలో చుట్టింది – సముద్ర గర్భంలోకి మోసుకుపోయింది.



BRAOU

కొండ దరికి కొట్టుకొని ముక్కలయే అలల కంఠంలో విషాదం పలికింది. పోయింది పక్షి కంటికి కనపడకుండా – అపార విస్తార సముద్రంలో అదృశ్యమై.

ఇది ఒక కవితామయ ఖండిక. ఈ కవితా శైలిని తెలుగులోకి అలాగే తీసుకురావడానికి అనువాదకులు ప్రయత్నించారు. ఇంగ్లీషులోలేని కొన్ని పదాలు తెలుగులో వచ్చి చేరాయి. చేతులెత్తి, పొత్తిళ్ళు అనేవి ఇంగ్లీషులో లేవు. అలంకారికంగా చెప్పడం వల్ల down to the sea అనేది సముద్ర గర్భం అని అనువాదమైంది. ఇందులో మార్పులూ చేర్పుల్నీ గమనిస్తే ఇంగ్లీషులో శైలిని పూర్తిగా తేవడానికి అనువాదకులు పడిన శ్రమ అర్థమవుతుంది. ఇది సృజనరంగంలో అనువాదకుడు తప్పనిసరిగా ఎదుర్కొనే సమస్య. దీనికి పరిష్కారం అనువాదకుని ప్రతిభపైనే ఆధారపడి ఉంటుంది.

కవిత్వ అనువాదం సంగతికి వచ్చే సరికి అనువాదకుడు ఎదుర్కొనే సమస్యలు అనేకం ఉంటాయి. కవిత్వ భాష సాధారణ భాషకన్నా భిన్నమైంది. సౌందర్య దృష్టి కవిత్వంలో అదనంగా ప్రవేశిస్తుంది. సౌందర్య దృష్టి అనేది కొన్ని అంశాల ద్వారా వ్యక్తమవుతుంది. అవి: ధ్వనుల కూర్పు, పదాల ఎన్నిక, వాక్యాల యోజన, అర్థస్ఫూర్తి, ధ్వని, భావోద్వేగం మొదలైనవి. అయితే ఒక భాషలో సౌందర్య రచనకు పనికొచ్చే సామాగ్రి మరో భాషలో అదే పద్ధతిలో ఉండదు. మూలంలో కవి పొందిన ఆవేశం, అనుభూతే అనువాదంలో తీసుకురావడమూ కష్టమే. ఈ సమస్యలన్నిటినీ ఎదుర్కొని అనువాదకుడు కవిత్వ అనువాదాన్ని నెరవేర్చాల్సి వుంటుంది.

సృజన లేదా సాహిత్య అనువాదంలో, మరీ ముఖ్యంగా కవిత్వ అనువాదంలో కొంత నష్టం (భావపరమైన) కలుగుతుంది. అనువాదకుడు దానిని పూడ్చడానికి ప్రయత్నించాలి. ఈ పూరణ – లుప్తతల సమ్మేళనంగా అనువాదం అనుభవంలోకి వస్తుంది.

భాషకు సంబంధించి ప్రాంతీయ, వర్గ, వ్యక్తి మాండలికాలు. సాహిత్య రచనల్లో అనువదించేటప్పుడు కొత్త సమస్యల్ని ఎప్పటికప్పుడు తెచ్చి పెడతాయి. వీటిని అనువాదకుడు జాగ్రత్తగా ఆలోచించి లక్ష్య భాషలోకి తేగలిగినంత మేరకు భావ, అర్థస్ఫూర్తిని తేవడానికి ప్రయత్నించాలి.

పద పదానువాదం చేయనక్కర్లేని సందర్భాలుంటాయి. సాధారణంగా స్వేచ్ఛానువాదంలో వాక్య భావాన్ని, పేరా భావాన్ని తీసుకురావడానికి ప్రయత్నించడం అనువాదకులు చేసే పని. నుడికారాలు, జాతీయాలు, సామెతలు, భాషకు ప్రత్యేకమైన కొన్ని వ్యక్తీకరణ పద్ధతులు వచ్చిన సందర్భంలో పదపదానువాదం పనికిరాదు. అనువాదకుడు జాగ్రత్త పడక పోతే చాలా తప్పులు దొర్లుతాయి. ఎంత అనుభవజ్ఞులకైనా ఇలాంటి చోట పొరబాట్లు పోవడం కూడా సాధారణంగా జరిగే విషయమే. ఈ ఉదాహరణ చూడండి :

"The barbed wire of deferential respect is old and rusty. Questions are pincers. The University, factory of knowledge, has its first wild cat stikes"

(P-18, రెక్క విప్పిన రివల్యూషన్, ఎంజెలో కాట్రొచ్చి, అనువాదం శ్రీశ్రీ)

''మర్యాద, మప్పెతాల ముళ్ళ తీగ పాత బడి తుప్పుపట్టి పోయింది. అడ్డు సవాళ్ళు అడ్డకత్తెరలు జ్ఞానాన్ని తయారు చేసే కార్ఖానా అయిన విశ్వవిద్యాలయం మొట్ట మొదటి అడవి పిల్లి సమ్మెల్ని చవి చూసింది''

"Wild cat strikes" అనే దాన్ని పదపదానువాదం చేయటం వల్ల అది 'అడివి పిల్లి సమ్మె' అయ్యింది. అప్రకటిత సమ్మె, మెరుపు సమ్మె అనే అర్థంలో అనువదించడం సరైన పద్ధతి. అయితే భాషనుడికారాన్ని జాగ్రత్తగా పరిశీలించకపోతే ఇలాంటి పొరబాట్లు జరుగుతాయి.

BRAOU

మూలంలో సాధారణ శైలి ఉంటే లక్ష్య భాషలో కూడా అంతే సాధారణమైన సరళమైన శైలి ఉండాలి. నార్ల వారి 'గురజాడ' ఆంగ్లంలోనించీ కేతు విశ్వనాథ రెడ్డి తెలుగు అనువాదం ఇది:

## 2. Blithe Spirit

'Hail to thee, blithe spirit'

*- Shelley*

Ahead of his time as an intellectual, as a linguist, as a poet and plyawright and, above all, as a visionary, Gurazada Venkata Appa Rao was ahead, too, in his physical entry into the world; he entered it on September 21, 1862, fully two months ahead of the normal period of gestation. For this haste, this impetuosity, he had to pay a heavy price, indeed. Voltaire in his old age, it has been said, was very 'lean and bony', and looked more like 'a plucked fowl than a human being'. Neither as a child, nor as a boy, nor even as a young man, did he enjoy robust health, and thorughout his adult life he was more or less an invalid.

తెలుగు అనువాదం:

## 2. ఉల్లాస జీవి

'స్వాగతం నీకు ఉల్లాస జీవీ'

– ఎ.బి. షెల్లీ

మేధావిగా, భాషా విజ్ఞానవేత్తగా, కవిగా, నాటక రచయితగా, అన్నిటికి మించి ఒక ద్రష్టగా గురజాడ అప్పారావు పంతులు తన కాలానికంటే ముందుండడమే కాదు; పుట్టడం కూడా ముందే. నెలలు నిండకుండానే, యేడో నెలలో 1862 సెప్టెంబరు 21వ తేదీ ఆయన జన్మించారు. యీ తొందర పాటుకు, యీ పురవడికి ఆయన నిజంగానే అధికమూల్యం చెల్లింపవలసి వచ్చింది. వోల్టైర్ వృద్ధాప్యంలో ''చాలా పీలగా యెముకల గూడులా'' ''మనిషిలాగా కన్నా యీకలు పీకిన కోడిలా'' కన్పించేవాడట! అప్పారావు తన జీవితంలోని యే దశలోనూ అంతకంటే మెరుగ్గాలేరు. పసిబిడ్డగా వున్నప్పుడుగానీ, కుర్రవాడుగా వున్నప్పుడు కానీ, యువకుడుగా కూడా వున్నప్పుడు కానీ ఆయనది దిట్టమయిన ఆరోగ్యం కాదు. వయోజన జీవిత పర్యంతం ఆయన దాదాపు జబ్బు మనిషే.

"throughout his adult life" అనే ఇంగ్లీషు మాటకు అనువాదంగా కన్పించే ''వయోజన జీవిత పర్యంతం'' అనే పదఖంధం గురించి ఆలోచించాలి. ఈ పదబంధంకంటే వేరే మాటలు ఉపయోగించవచ్చునేమో కూడా పరిశీలించండి.

దృశ్య శ్రవణ మాధ్యమాల్లో సృజన ప్రక్రియల అనువాదం, అనుసరణ మనం గమనిస్తూనే ఉంటాం. ముఖ్యంగా నాటకాల్ని, కథా చిత్రాల్ని మరో భాషలోకి తీసుకుని వచ్చేటప్పుడు అనువాదకులు మరో కొత్త ఇబ్బందిని ఎదుర్కొంటారు.



BRAOU

అది ఉచ్చారణ. భాషల్లో ఉచ్చారణ పద్ధతి తేడాలు గుర్తుంచుకోకపోతే, పాత్రలు పెదవులు కదిల్చే పద్ధతికి, వినిపించే మాటలకి పొంతన లేకుండా పోయే అవకాశం ఉంది. అలాగే వాక్యం ప్రారంభమై ముగిసే సమయం సరిగ్గా అనువాదంలో పాటించకపోతే పాత్రలు పెదవులు కదపడం ఆగిన తర్వాత కూడా మాటలు పూర్తి కాని పరిస్థితి ఎదురవుతుంది. సినిమాలలో ఈ మాటలు పూర్తికాని పరిస్థితి మనకు ఎదురవుతుంది. సినిమాలకి సంబంధించి ఈ అనువాద ప్రక్రియను 'డబ్బింగ్' పేరుతో వ్యవహరిస్తారు. రెండు భాషలకి సంబంధించిన ఉచ్చారణ, పరిజ్ఞానం లేకుంటే ఈ అనువాద ప్రక్రియ మాత్రం విజయవంతం కాదు. భారతీయ భాషల్లో కన్నా ఇంగ్లిషులోనుంచి తెలుగులోకి, మరో భాషకి డబ్బింగ్ చేయడం చాలా కష్టమైన ప్రక్రియ. ఈనాడు ప్రసార మాధ్యమాల్లో ముఖ్యంగా టీవీలో ఈ అవసరం ఎక్కువగా ఉంది. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఇంగ్లీషు చిత్ర సంస్థలు తమ సినిమాలను హిందీ భాషలోకి విడుదల చేయటం ఇటీవల మనం గమనిస్తున్న పరిణామం. వీడియోలు కూడా రెండు మూడు భాషల్లో ఒకేసారి విడుదల అవుతున్న రోజులివి. ఈ నేపథ్యంలో ఈ అనువాద ప్రక్రియ అవశ్యకత ఎలక్ట్రానిక్ రంగంలో ఇంకా ఎంత పెరగబోతుందో మనం గుర్తించవచ్చు.

### 22.2.2 సృజనేతర రంగం

సృజనేతర రంగంలో అంటే సామాజిక, శాస్త్ర సాంకేతిక, తాత్విక విషయాలున్న సమాచారాన్ని అనువాదం చేయటంలో పాటించాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి. ఇవి విషయ ప్రధానమైన రచనలు. స్పష్టత, క్లుప్తత, బిగి ఉన్న వాక్య సంయోజన ఈ రకమైన రచనల్లో కనిపిస్తాయి. అనువాదకుడు చాలా జాగ్రత్తగా పదాల్ని, వాక్యాల్ని వాటి సంపూర్ణ భావాన్ని ఏ మాత్రం భంగం లేకుండా, లుప్తం కాకుండా అనువదించాలి. కొన్ని వ్యక్తీకరణాలు, పదాల అర్థాలు వదిలివేసి అనువాదం చేయటానికి ఇక్కడ స్వేచ్ఛ లేదు. ఆ భావన కొత్తదైనప్పుడు దాని వివరణ ఇవ్వాలి. మూలంలోకన్నా లక్ష్యభాషలో కొన్ని పదాలకు భావాన్ని విపులీకరించి చెప్పాల్సిన అవసరం కూడా ఏర్పడవచ్చు. పదాలు వాటి అర్థాలు కాలక్రమంలో పొందే (అర్థ సంకోచం, అర్థ వ్యాకోచం) మార్పుల్ని ఎప్పటికప్పుడు అనువాదకుడు గుర్తుంచుకోవాలి. ఖచ్చితమైన భావ ప్రకటన లక్ష్యంగా సాగిన రచనల్ని అనువాదం చేసేటప్పుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

కింది భాగాన్ని పరిశీలించండి:

While social reform was linked with religious reform in some cases during the 19th century, in later years it was increasingly secular in approach. Moreover, many people who were orthodox in their religious approach participated in it. Similarly, in the begining social reform had largely been the effort of newly educated Indians belonging to higher castes to *adjust their social behaviour to the requirements of modern culture and values*. But gradually it penetrated down to the lower strata of society and began to revolutionise and reconstruct the social sphere. In time the ideas and ideals of reforms won almost universal acceptance and are today enshrined the Indian Constitution.

The social reform movements tried in the main to achieve two objectives: (a) emancipation of women and extension of equal rights to them;

BRAOU

and (b) removal of caste rigidities and in particular the abolition of untouchablity.

(Bipin Chandra, Modern India, NCERT, New Delhi, 1971)

19వ శతాబ్దంలో కొన్ని సందర్భాల్లో సంఘ సంస్కరణ మత సంస్కరణతో జత పడ్డప్పటికీ, తరువాతి కాలంలో అది ఇతోధికంగా లౌకిక వైఖరిని సంతరించుకొంది. పైగా మతానికి సంబంధించి సనాతనులుగా ఉన్న వ్యక్తులు కూడా సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. అట్లాగే మొట్ట మొదట్లో సంఘ సంస్కరణ కృషి కొత్తగా విద్యావంతులైన అగ్రవర్ణాల భారతీయులకే పరిమితమైంది. రానురాను అది సమాజంలోని కింది తరగతులకు పాకింది; సామాజిక రంగాన్ని పునర్నిర్మింపసాగింది; విప్లవాత్మకం చెయ్యసాగింది. సంఘ సంస్కరణ భావాలు ఆదర్శాలు సకాలంలో సర్వత్రా ఆమోదం పొందాయి. ఈనాడు భారత రాజ్యాంగంలో పొందుపర్చబడ్డాయి.

సంఘ సంస్కరణోద్యమాలు ప్రధానంగా రెండు లక్ష్యాలను సాధించి పూనుకున్నాయి: (1) స్త్రీ విముక్తి; పురుషులతో పాటు స్త్రీలకు సమానహక్కులు (2) కులం యొక్క కాఠిన్యాన్ని తగ్గించటం ముఖ్యంగా అస్పృశ్యతా నిర్మూలనం.

(ఆధునిక భారత చరిత్ర, తెలుగు అనువాదం: సహవాసి, హైదరాబాదు బుక్ ట్రస్టు, 1983, పేజీలు 212-213)

మూలంలో "to adjust their social behaviour to the requirements of modern culture of values" అన్నది Italicsలో ఇవ్వడం దాని ప్రాధాన్యతను తెలియజేస్తుంది. అయితే అనువాదకుడు దానిని వదిలివేయడం జరిగింది. 'అట్లాగే మొట్టమొదట్లో సంఘ సంస్కరణ కృషి కొత్తగా విద్యావంతులైన అగ్రవర్ణాల భారతీయులకే పరిమితమైంది అన్న వాక్యం తర్వాత 'ఆధునిక సంస్కృతీ విలువలకు అనుగుణంగా, తమ సామాజిక ప్రవర్తనల్ని మార్చుకునే క్రమంలో జరిగిన ఈ సంఘ సంస్కరణ... అని మూలంలో రచయిత ఉద్దేశించిన భావం దెబ్బతింది. ఈ విషయంలో అనువాదకుడు ఎప్పటికప్పుడు జాగ్రత్త వహిస్తూ ఉండాలి.

శాస్త్ర సాంకేతిక సంబంధితమైన సమాచారాన్ని అనువదించేటప్పుడు అనువాదకుడు పారిభాషిక పదజాలాన్ని తెలుసుకుని ఉండాలి. ఈ పదబంధం అప్పటికే ప్రాచుర్యంలో ఉంటే సరి. తాను కొత్తగా సృష్టిస్తే దానికి వివరణ, పాదసూచిక ఇచ్చితీరాలి. భౌతిక, వృక్ష, రసాయన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు మొదలైన వాటిని అనువదించడానికి అప్పటికే సిద్ధంగా ఉన్న పారిభాషిక పదజాలం అనువాదకుడు అందుబాటులో ఉంచుకోవడం చాలా అవసరం.

ఉదాహరణకు ఈ కింది వాక్యం చూడండి:

"Scientific statements have a hierarclical structure" - దాని అనువాదం ఇలా ఉంది: ''విజ్ఞాన శాస్త్రంలోని మెట్లులను స్థూలంగా ఒక అనువంశిక క్రమంలో వ్రాయవచ్చు.''

'hierarchical' అనే మాటను తప్పుగా అర్థం చేసుకొని, దాని అనుగుణమైన పారిభాషిక పదజాలాన్ని ఒకసారి తిరగేయక పోవడం వల్ల అనువాదంలో పొరబాటు తప్పలేదు. ఆ వాక్యం ఇలా ఉండాలి: ''విజ్ఞాన శాస్త్ర ప్రకటనలను తరతమ శ్రేణిలో ఏర్పరచవచ్చు''.

BRAOU

శాస్త్ర విషయాలకు సంబంధించినంతవరకు అన్ని వేళలా అన్ని పదాలనూ తప్పనిసరి అనువాదమే చేసి వాడడం కూడా కుదరకపోవచ్చు. యథాతథంగా మూల భాషలోని పదాలు లక్ష్య భాషలో వ్యవహారంలో వుండవచ్చు. అలాంటి సందర్భాలలో అనువాదకుడు ఎలాంటి వ్యర్థ ప్రయత్నాలు చేయకుండా అలాంటి పదాలను యథాతథంగా వాడుతూ అనువాదాన్ని పూర్తి చేయడమే మంచి పద్ధతి.

ఈ కింది ఉదాహరణ చూడండి (P-88)

The importance of electricity in agriculture and industrial development need hardly be stressed. With this in view a thermal power station with an ultimate capacity of 1080 MW has been established at new palvancha. In the first stage two units of 60 MW each were commissioned during 1966-67. In the second stage also another two units of 60 MW eachwere commissioned 1967-68. During 1974-75 two units of 110 MW each were commissioned as part of the III stage of development. On the 7th October, 1977 the first unit of the IVth stage with a capacity of 110 MW was commissioned. With in a few months the second unit of this stage would also be commissioned thus rising the total installed capacity of the station to 680 MW. It may not be long before the Thermal Power station at Palvancha achieves the distinction of beeing a super Thermal station. With the easy availability of coal it is also expected that another pit-head thermal station would be established at Manugur coal mines in the near future.

(An article published in 1977)

BRAOU

వ్యవసాయరంగంలోనూ, పారిశ్రామికాభివృద్ధిలోనూ విద్యుచ్ఛక్తి ఎంత ప్రాముఖ్యం వహిస్తుందో చెప్పవలసిన పనేలేదు. అందువల్ల కొత్త పాల్వంచలో పూర్తిగా ముగిసేటప్పటికి 1080 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యం ఉ,డేటట్లు ఒక థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడం జరిగింది. మొదటి దశగా 1966-67లో ఒక్కొక్కటి 60 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను ప్రారంభింపజేశారు. రెండవ దశలో 1967-68లో అరవయ్యేసి మెగావాట్ల సామర్థ్యంగల మరో రెండు యూనిట్లను పని ప్రారంభింప చేశారు. 1974-75లో మూవడ దశగా 110 మెగావాట్ల సమర్థతగల యూనిట్లను రెండింటిని ప్రారంభించటం ద్వారా ఈ కేంద్రాన్ని మరింత విస్తరించటం జరిగింది. 1977 అక్టోబరు 7న 110 మెగావాట్ల సామర్థ్యము గల ఒక యూనిట్‌ను తెరవడంతో నాల్గవ దశకు చెందిన పని ఆరంభమైంది. కొద్ది నెలలలోనే ఈ దశకింద రెండవ యూనిట్ పని ప్రారంభిస్తుంది. దీనితో మొత్తం 680 మెగావాట్ల సామర్థ్యం నెలకొల్పడం జరిగినట్లే. పాల్వంచలోని ఈ విద్యుత్ కేంద్రం సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం కావటానికి ఎక్కువ కాలం పట్టకపోవచ్చు. ఇక్కడ బొగ్గు సులభంగా లభిస్తున్న కారణం చేత మణుగూరు బొగ్గు గనుల వద్ద అచిరకాలంలోనే

మరొక పిట్‌హెడ్ థర్మల్ విద్యుత్ కేంద్రం నెలకొల్పటం కూడా జరగవచ్చునని ఆశించవచ్చు.

ఈ అనువాదంలో కొన్ని ఇంగ్లీషు పదాలను, పద బంధాలను తర్జుమా చేయటానికి అనువాదకుడు ప్రయత్నించలేదు. అలాంటి పదాలను అలానే వాడడం వల్ల భావం స్పష్టంగా అందుతోంది. ఈ పదాలన్నీ ప్రసార సాధనాల ద్వారా పాఠకులకు బాగా పరిచయమైనవే.

ప్రసార సాధనాల్లో ముఖ్యంగా పత్రికల్లో వార్తా సంస్థలనుంచి వచ్చే వార్తల్ని ఎప్పటికప్పుడు అనువాదం చేసుకొని సిద్ధంగా ఉంచుకుంటారు. పత్రికల్లో కంప్యూటర్ యూనిట్ల వాడకం ఇటీవల ఎక్కువైంది. ఈ నేపథ్యంలో కలం పుచ్చుకొని తీరిగ్గా అనువాదం చేయడం చాలా అరుదయిన దృశ్యం అయింది. ఫాక్స్ ద్వారా వచ్చే సమాచారాన్ని కంప్యూటర్ల ముందు కూర్చుని తెలుగు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తూ అప్పటికప్పుడు అనువాదం చేసి భద్రపరచుకునే సౌకర్యాన్ని ఈనాడు మనం సాధారణంగా చూస్తున్నాం. ఇలాంటి అనువాదాల్ని కింద ఇస్తున్నాం - గమనించండి.

ZCZC
PRI INT ESPL
LOSANG FES13
LAMOUR
ACTRESS DOROTHY LAMOUR DEAD AT 81

Los Angeles, Sept 23 (Reuter) Actress Dorothy Lamour, best known for her role as the sultry, romantic sidekick in the string of "Road" movies starring bob hope and bing crosby, died yesterday. She was 81 years old.

Lamour died at her home in North Hollywood with her assistant, Donna Matsook, at her bedside, said Frank Liberman, her friend and former publicist.

The image of Lamour that endures from movies of the 1930s and 1940s is of a Breezy, seductive heroine clad in a colourful sarong. She first Donned one of the sexy wraparound skirts in her film debut in "Jungle Princess" in 1936, and she would find herself in similar attire in many movies to come.

Lamour's big break came with her first role in a hope - crosby film, "The road to Singapore" in 1940, and she went on to make a series of "Road" pictures with the legendary comic due.

Apart from her "Road" movie roles, her career as a Hollywood star was relatively shortlived. But her seductive beauty and lively, self-mocking humour brought her continued popularity in nightclubs and on stage and television.

Bob hope and his wife dolores paid tribute to lamour in a statement, calling her "one of the grandest ladies on or off the screen".

BRAOU

In 1931, she was voted Miss New orleans and moved to Chicago. A show at New York's stork club led to singing contract with NBC Radio and, eventually, her own radio programme in Los Angeles. She caught the attention of Paramount studios which, because of her dark, somewhat exotic looks, cast her in 1936 as "The Jungle Princess" reuter ub Sre.

09230957 H

NNNN

# హాలీవుడ్ నటీమణి కన్నుమూత

లాస్ ఏంజెల్స్, సెప్టెంబర్ 23: ప్రఖ్యాత హాలీవుడ్ నటీమణి డోర్‌తీ లామర్ ఆదివారం మరణించారు. ఆమె యసు 81 సంవత్సరాలు. 'రోడ్' సంస్థవారు చిత్రీకరించిన అనేక సిరీస్ చిత్రాలలో నటుడు బాబ్‌హోప్, బింగ్ క్రాస్బీల రసన నటించిన డోర్‌తీ లామర్‌కు హాలీవుడ్ చిత్ర పరిశ్రమలో మంచి పేరుంది. లామర్ హాలీవుడ్‌లోని ఆమె స్వగృహంలో ఏన అసిస్టెంట్ డొన్నామాట్సూక్ పక్కనే ఉండగా మంచంపై మరణించి ఉండటాన్ని గమనించామని ఆమె స్నేహితుడొకరు తెలిపారు. 1930 నుండి 1940వ సంవత్సరం మధ్యకాలంలో చిత్ర అభిమానులను మత్తెక్కించే పలు పాత్రలలో ఆమె నటించారు. జంగిల్ ప్రిన్సెస్ చిత్రంలో ఆమె శృంగారరసాన్ని బాగా పోషించారు. 1940వ సంవత్సరంలో బాబ్‌హోప్, బింగ్ క్రాస్బీల కాంబినేషన్‌లో ది రోడ్ టు సింగపూర్ అన్న చిత్రంలో లామర్ నటించినది మొదలు వరుసగా అనేక రోడ్ వారి సిరీస్ సినిమాలలో కామిడీతో కూడిన పాత్రలు పోషించారు. చిత్ర ప్రపంచంలో లామర్ ఎక్కువ కాలం ఇమడలేకపోయినా, సహజమైన అందం, మంచి శరీర సౌష్టవం కలిగి ఉండడం, హాస్యరసాన్ని బాగా పోషించగలగడంతో నైట్‌క్లబ్‌లలోనూ, పలు స్టేజిల మీద, టెలివిజన్‌లోనూ ప్రదర్శనలు ఇవ్వగలిగారు. నటుడు బాబ్ హోప్, అతని భార్య డోలోరెస్‌లు లామర్‌కు నివాళులర్పించారు. లామర్ తెరపైనా, వ్యక్తిగతంగానూ కూడా మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిందని వారు వ్యాఖ్యానించారు. 1931లో మిస్ న్యూ ఆర్లీన్స్‌గా ఎంపికైన లామర్ ఆ తర్వాత చికాగోకి వెళ్ళిపోయారు. న్యూయార్క్ స్టార్క్ క్లబ్‌లో ఆమె ఇచ్చిన ఒక ప్రదర్శన వల్ల ఆమెకు ఎన్‌బిసి రేడియో, లాస్ ఏంజెల్స్ రేడియోలోనూ పాటలు పాడే అవకాశాలు వచ్చాయి. అందమైన కళ్ళు, మత్తెక్కించే చూపుగల లామర్‌కు ఆ తర్వాత పలు చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. 1936లో ఆమెకు 'ది జంగిల్ ప్రిన్సెస్' అనే సినిమాలో ముఖ్య పాత్రధారిగా అవకాశం వచ్చింది.

BRAOU

SYDNEY FES7

DALAI

DALAI LAMA DONATES 650000 AUS DOLLARS FOR TIBETAN PROJECT

Sydney, Sept 23 (AFP) - The Dalai Lama today donated 650,000 Ausaustralian dollars (513,000 Us), raised from his Australian visit, to establish health and education projects for tibetans in exile and other disadvantaged groups.

Most of the funds would go to non-government organisations such as save the children fund, community aid abroad, world vision and the red cross, the Dalai Lama's spokesman Paul Bourke said.

"Because of the overwhelming response to his holiness visit in Australia, he has decided to redirect donations into a number of worthy organisation," he said.

Bourke said at least 100,000 dolars would be given to the foundation for universal responsibility, established by Tibet's spiritual leader from funds he received when he was awarded the nobel peace prize in 1989.

The foundation promotes non-violence, world peace, harmony between different religious traditions and protection of the environment.

Many of the charities to receive donations were helping Tibetan refugees trying to establish their lives in exile, Bourke said.

"The funding has largely come from benefactors of the visit and generous donations from the public".

The response has been fantastic. It's beyond what we expected, pepple have really warmed to the Dalai Lama and his philosophies, he said.

About 4,000 people saw the Dalai Lama open a nine-day Lakachakra, or wheel of time, ceremony here yesterday.

The exiled Tibetan leader is expected to meet Australian Prime Minister John Howard later this week, before the Dalai Lama leaves the country on Sunday. AFP STN VKS.
09230825 H
NNNN

BRAOU

## టిబెట్ ప్రాజెక్టులకు దలైలామా విరాళం

సిడ్నీ, సెప్టెంబర్ 23: బహిష్కరణకు గురైన టిబెటన్లు, ఇంకా ఇతర సమస్యలతో బాధపడుతున్న టిబెట్ దేశస్థుల సహాయార్థం నెలకొల్పనున్న పలు ప్రాజెక్టుల కోసం దలైలామా సోమవారం 513,000ల అమెరికా డాలర్లను విడుదల చేశారు. దలైలాలా ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా ఆయనకు అందిన విరాళంలోనుంచి ఈ మొత్తాన్ని విడుదల చేశారు. ఈ మొత్తాన్ని ఆరోగ్యం, విద్యలకు సంబంధించిన పలు ప్రాజెక్టులను చేపట్టడానికి వినియోగిస్తారు. ఈ నిధులలో ఎక్కువ శాతం ప్రభుత్వేతర సంస్థలైన సేవ్ ది చిల్డ్రన్స్ ఫండ్, కమ్యూనిటీ ఎయిడ్ ఎబ్రాడ్, వరల్డ్ విజన్, రెడ్‌క్రాస్‌లకు చెందుతాయని దలైలామా తరపు ప్రతినిధి పాల్ బోర్క్ తెలిపారు. ఆస్ట్రేలియా

పర్యటనలో ఊహించని రీతిలో ఆయనకు చందాలు, విరాళాలు అందడంతో ఆ మొత్తాన్ని ఈ ప్రాజెక్టులను చేపట్టడానికి ఆ స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించారని ఆ ప్రతినిధి తెలిపారు. 1989లో దలైలామా నోబెల్ శాంతి బహుమతి అందుకున్నప్పుడు ఈ శాంతిదూతకు ప్రపంచం నలుమూలలనుంచి పెద్దమొత్తంలో విరాళాలు అందాయని వాటితోనే ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో వచ్చిన మొత్తంలో లక్ష డాలర్లను ఆ ఫౌండేషన్‌కు ఇస్తున్నట్లు బోర్క్ వివరించారు. అహింస, ప్రపంచ శాంతి, భిన్న మతాల మధ్యన సామరస్యం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణలు ఈ ఫౌండేషన్ ధ్యేయాలని ఆ ప్రతినిధి పేర్కొన్నారు. 'దలైలామాకు అందిన నిధులలో ఎక్కువ భాగం ప్రజలనుంచి స్వచ్ఛందంగా అందిన విరాళాలే. దలైలామా సిద్ధాంతాలకి ప్రజలనుండి అనూహ్యమైన స్పందన లభించింది. మేం ఊహించిన దానికన్నా ఎక్కువగా వచ్చిన ఈ స్పందన మమ్మల్ని ఆనందానికి గురిచేసిందని ఆ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఆదివారం ఆస్ట్రేలియాలో వీల్ ఆఫ్ టైం (కాలచక్రం)ని ప్రారంభించినపుడు నాలుగు వేల మంది జనం హాజరయ్యారు. దేశ బహిష్కరణకు గురైన దలైలామా ఈ వారాంతంలో ఆస్ట్రేలియా ప్రధాని జాన్ హొవార్డ్‌ను కలుసుకోనున్నారు. అనంతరం ఆదివారం అక్కడనుండి బయలు దేరనున్నారు.

ప్రసార సాధనాల కోసం వార్తల్ని సేకరించి పంపే సంస్థలు వార్తను అందించడంలోనూ చాలా స్పష్టమైన, సరళమైన, సాధారణమైన భాష, శైలి ఉండేలా జాగ్రత్త పడతాయి. వాటి అనువాదం కూడా అంతే సాఫీగా, సరళంగా జరగడం మనం గమనించవచ్చు. ఎక్కడా మూలంలోని భావం లోపించకుండా కొత్తగా తనదైన భావాన్ని చొప్పించకుండా అతి వ్యాప్తి, అవ్యాప్తి లేకుండా అనువాదం చేసే పద్ధతి ఇక్కడ చాలా ప్రధానం.

పత్రికలో పరిమితమైన చోటుని బట్టి అనువాదకుడు మూలాన్ని సంక్షేపించి అనువదించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అంటే సంక్షేపం, అనువాదం ఒక్కసారే జరగడం అన్నమాట. కింది ఉదాహరణ గమనిస్తే అనువాదకుడు మూలభావం, సారాంశం చెడకుండా సంక్షేపించి తెలుగు పత్రిక వార్తా రచనకు అనువుగా తయారు చేయడం గుర్తించవచ్చు.

BRAOU

23 IANS 1 (News Analysis)

Pak - Mutaza

Murtaza's dangerous politics may have lasting impact

by Tariq Butt, India Abroad News Service

Islamabad, Sept 23 - Mr Murtaza Bhutto died the way he lived - dangerously - but his brand of politics may have long- leading repercussions on the Pakistani political scene.

His death in Karachi, following a police shoot - out on September 20, came as a shock to the entire nation specially since he was the scion of Pakistan's most prominent family.

The incident is expected to have serious repercussions on the political

situation as it comes at a time when all is not well for Prime Minister Benazir Bhutto, the News editorial said.

She will be most affected as inevitably the finger of guilt will be pointed at her, even though the accusation will be difficult to believe, as not only was Murtaza her brother, regardless of their political differences, but that he posed no threat to her. He had yet to make his impact in field, for which his only credential was his lineage, a legacy already inherited by his elder sister.

The way the Karachi police sprayed Murtaza and six of his body-guards with bullets showed the immense power given to the force to crush militants and the government's opponents in Pakistan's most important port city which has been wracked by endemic violence.

Murtaza was a politically ambitious young man who resolutely opposed his sister Benazir Bhutto's government but was never a major threat to her Pakistan People's Party (PPP). His consistent blistering attacks on his sister, her husband Asif Ali Zardari and her government were a source of embarrassment for Ms Bhutto, but she never responded to his tirade.

Murtaza had founded the PPP (Shaheed Bhutto) faction about a year ago but it hardly divided the mainstream PPP. He had a though small following among those who felt he was former Prime Zulfikar Ali Bhutto's real heir or those who were disenchanted by Ms Bhutto's politics.

Since its founding in the late sixties, the PPP has the distinction of not having split into factions unlike other political parties of Pakistan. Any-one who rebelled against the PPP became irrelevant politically and many political heavyweights, who left the party for different reasons, had to come back to its fold to regain their political importance.

Murtaza's followers, being left leaderless, appear now to have lost their claim to mainstream politics. Begum Nusrat Bhutto considered closer to her son, could hardly be the rallying point for his supporters or hold his party together.

Most of the support for Murtaza was confined to the Bhutto's traditional stronghold of Sindh where the reaction to his ?? death has been most vociferous. Murtaza had mostly concentrated his activities in

BRAOU

Sindh, trying to get into the main PPP's support.

The Country's opposition has, as expected, tried to score a few points by attacking the government for the "poor law and order situation". Former Prime Minister and leader of the Pakistan Muslim League (PML) Nawaz Sharif described Murtaza's killing as a "blatant act of state terrorism" in his address to the National Assembly.

Murtaza, who celebrated his 42nd birthday on September 18, lived a tumultuous life. After the overthrouw of his father's government in 1977 and the imposition of martial law, he and his brother Shahnawaz along with several PPP activists fled the country to wage an armed struggle against the military regime. He then founded the militant organisation, Al-Zulfikar, which allegedly sponsored many terrorist activities in Pakistan.

Murtaza had more than 80 criminal cases pending against him including charges of murder, terrorism and hijacking of a Pakistan International Airlines (PIA) plane in 1981, all of which were registered during the martial law period.

Even before coming to Pakistan in 1993, after a 15-years long self - exile in Afghanistan, Syria, Libya, the United States and Britain, Murtaza and his sister were politically estranged. Murtaza wanted to take over his father's mantle by leading the PPP but his sister refused to agree.

The two met for the first time in about five years, two months ago at the Ms Bhutto's house in Islamabad. The meeting was marked by the usual bickering and Murtaza continued his harangue against the government.

Public opinion about Ms Bhutto's political position in the aftermath of her brother's death is vastly polarised. "According to them (some people), she (Benazir) is now confronted with the worst crisis, both in the private as well as in the public realm. But there are others who believe that with the death of Murtaza, the split in the her party will become a thing of the past." The Frontier Post said in an editorial.

His killing marked the third unnatural death of male members of the Bhutto family - Zulfikar Ali Bhutto was hanged in 1979 and his other

BRAOU

son Shahnawaz died in 1985 in Cannes, southern France, under suspicious circumstances.

- India Abroad News Service (Credit Mandatory)

ends/ 23.9.96

nnnn

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 23: గత శుక్రవారం పోలీసు కాల్పుల్లో పాక్ ప్రధాని సోదరుడు ముర్తజా అలీ భుట్టో మరణించడం పాక్ రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపెడుతుంది. ముర్తజా పాక్ ప్రధాని బెనజీర్ భుట్టోకు స్వయానా సోదరుడు, పాక్ రాజకీయాల్లో కీలక పాత్ర వహించిన మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో కుమారుడు. ఇప్పటికే రాజకీయంలో పలు చిక్కుల్లో చిక్కుకున్న బెనజీర్‌కు సోదరుడి దుర్మరణం రాజకీయంగా ఒక పెద్ద అఘాతం. ఆమెకీ, ముర్తజాకీ చాలా కాలంగా తీవ్రవివాదాలు ఉన్నందున, బెనజీర్‌ను పదవీచ్యుతి గావించడమే తన లక్ష్యమని ముర్తజా పదే పదే చెప్పడం వల్ల ముర్తజా మృతిలో పాక్ ప్రధాని హస్తం ఉందని బలీయమైన వదంతులు వినవస్తున్నా అవి నమ్మశక్యం కాదు. ముర్తజా ఆమెకి స్వయానా సోదరుడు. వారి మధ్య రాజకీయ వైరం ఉన్నప్పటికీ ఆయన ఏనాడూ భుట్టో ఆధిపత్యానికి సవాలుగా పరిణమించలేదు. కేవలం తండ్రి జుల్ఫికర్ అలీ భుట్టో పేరు తప్ప మరో పరపతి, ప్రభావం లేని నాయకుడు ఆయన. అటువంటి వ్యక్తిని బెనజీర్ చంపించి ఉంటుందని అనుమానించడానికి ఆస్కారం లేదు.

అయితే ఆయనపై, ఆయన బాడీగార్డులు ఆరుగురిపై పోలీసులు నిర్దాక్షిణ్యంగా కురిపించిన బుల్లెట్ల వాన కరాచీలో తీవ్రవాదాన్ని అణచివేసేందుకు పోలీసులకు ఎంతటి స్వేచ్ఛనిచ్చారో వెల్లడిస్తున్నాయి. ముర్తజా ఒక సంవత్సరం క్రితమే పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (షహీద్ భుట్టో) వర్గాన్ని ప్రారంభించాడు. తండ్రి భుట్టోకి తానే అసలైన వారసుడినని ఆయన గట్టిగా నమ్మేవారు. సోదరి బెనజీర్, ఆమె భర్త ఆసిఫ్ అలీ జర్దారీలపై ఆయన కఠోర విమర్శలు కురిపించేవారు. అయితే ఆయన రాజకీయ ప్రభావం మాత్రం పరిమితమే. బెనజీర్ కూడా ముర్తజా విమర్శలను ఏనాడూ పెద్దగా పట్టించుకోలేదు. ముర్తజాకు ఉన్న కొద్దిపాటి మద్దతు కూడా సింధ్ ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉంది. ఇక ఆయన మరణం తరువాత ఆయన స్థాపించిన పార్టీ కూడా చుక్కాని లేని నావలా మిగిలిపోయింది. బెనజీర్ తల్లి బేగమ్ సుత్రత్ భుట్టో ఆ పార్టీ నేతృత్వం చేపట్టేందుకు నిరాకరించడంతో ఇక ఆ పార్టీ రాజకీయ చిత్రపటంనుంచి అంతర్ధానమైనట్టే. ముర్తజా ఆకస్మిక మృతితో భుట్టో పరివారంలో ఇప్పటికి ముగ్గురు అసహజ మరణం పాలైనట్లవుతుంది. జుల్ఫికర్ అలీ భుట్టోను జియా హయాంలో 1979లో ఉరితీశారు. ముర్తజా సోదరుడు షానవాజ్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఇప్పుడు ముర్తజా కూడా సొంత సోదరి ఏలుబడిలోనే తూటాలకు బలైపోయాడు.

ముర్తజాపై దాదాపు 80 క్రిమినల్ కేసులున్నాయి. హత్య, టెర్రరిజం, 1981 నాటి పాక్ ఎయిర్ లైన్స్ విమానం దారి మళ్ళింపు వంటి కేసులు కూడా ఆయనపై నమోదయ్యాయి. మాజీ అధ్యక్షుడు జియావుల్ హక్ తన తండ్రి జుల్ఫికల్ అలీ భుట్టోని ఉరి తీసిన తరువాత ఆయన దాదాపు 15

ఏళ్ళపాటు సిరియా, లిబియా, ఆఫ్ఘనిస్తాన్, అమెరికా, బ్రిటన్ మొదలైన దేశాల్లో తలదాచుకుని, జియా హయాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి సన్నాహాలు సాగించారు. అయితే అప్పటినుంచే ఆయనకూ, బెనజీర్‌కు మధ్య సంబంధాలు బెడిసి పోయాయి. గత నెల సోదరీసోదరులిద్దరూ దాదాపు అయిదేళ్ళ ఎడబాటు తరువాత తొలిసారి కలుసుకున్నా అక్కడ కలహాలే తప్ప చెలిమి కానరాలేదు.

ఏతా వాతా ప్రధాన మంత్రి బెనజీర్ భుట్టోపై ఈ సంఘటన ప్రభావం ఎలా వుంటుందన్న విషయంలో మాత్రం ప్రజల్లో విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ముర్తజా మృత్యువుకి బెనజీరే కారణమని గట్టిగా విమర్శిస్తున్నారు. కొందరు బహిరంగంగానే ఈ మాట అంటున్నారు. అయితే ముర్తజా నిష్క్రమణ అనంతరం పాకిస్తాన్ పీపుల్స్ పార్టీలో చీలిక మాయమై ఇరు వర్గాలు కలిసిపోతాయని కూడా కొందరు భావిస్తున్నట్లు ఫ్రాంటియర్ పోస్ట్ పత్రిక వ్యాఖ్యానించింది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి పాకిస్తాన్‌లోని మిగతా పార్టీల్లాగా చీలికల చరిత్ర లేదు. ఒకరిద్దరు వేరు పడినా వారు పార్టీకి హాని చేయలేకపోయారు సరికదా వారి రాజకీయ జీవితమే ముగిసిపోయింది.

ప్రభుత్వ కార్యాలయాల్లో అనువాదం చేసిన మెమోరాండం మొదలైన వాటిని పరిశీలిస్తే అందులో భాష, పదజాలం ప్రత్యేకమైనవిగా కన్పిస్తాయి. సాధారణంగా ఆ రంగంలో పరిచితమైన పదజాలాన్ని, పదబంధాల్ని వాడకపోతే అది అర్థం కాకపోయే ప్రమాదం ఉంది. నిర్దుష్టత కూడా కొరవడవచ్చు. కింది ఉదాహరణను గమనించండి.

BRAOU

**OFFICE OF THE AUTHORITY**
**UNDER PAYMENT OF WAGES ACT,**
**GOVERNMENT OF ANDHRA PRADESH**
**HYDERABAD.**

No. Dated.........

**MEMORANDUM**

Sub: Payment of Wages Act, 1963 ___

An application under section 15 (2) of the Payment of Wages Act should be Presented with this Court within six months from the date on which wages become payable. The application cited includes wages for periods prior to the period of six months. The petitioner is required to explain the delay in respect of the time barred claim and show cause why it should not be dismissed as time barred. This statement should be in duplicate and in the form of an affidavit.

Authority under Payment of Wages Act,
Andhra Pradesh.

వేతనాల చెల్లింపు చట్టాధికారి కార్యాలయము,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, హైదరాబాదు.
తేదీ.............................

**మెమోరాండం**

విషయం: 1936, వేతనాల చెల్లింపు చట్టము.

వేతనాల చెల్లింపు చట్టము యొక్క 15 (2)వ విధానము విభాగము కింద ఒక అర్జీని వేతనాలు చెల్లించవలసిన తేదీ నుండి ఆరు నెలల లోపల ఈ కోర్టుకు సమర్పించుకొనవలెను. పైన పేర్కొన్న అర్జీ నిర్ణయించబడిన ఆరు నెలల గడువుకు పూర్వపు గడువు వేతనాలు కూడా చేర్చబడినవి. అర్జీ కాలదుష్టమైనది కావున ఆలస్యము జరుగుటకు కారణములను వివరించుచు కాలదుష్టమైనదిగా దానిని ఎందుకు త్రోసి పుచ్చరాదో సంజాయిషీ చెప్పుకొనవలెను. ఈ వివరణ రెండు ప్రతులు గాను, ఎఫిడవిట్టు రూపములోను ఉండవలెను.

వేతనాల చెల్లింపు అధికారి.
ఆంధ్రప్రదేశ్.

న్యాయ, చట్ట సంబంధమైన వ్యవహారాలు, లావాదేవీలు అనువాదం చేయటంలో చాలా చిక్కులున్నాయి. మొదట న్యాయబద్ధ పరిభాష తెలియాలి. వీటికి సంబంధించిన కోర్టు పత్రాలు కానీ, తీర్పులు గాని పాత వాటిని పరిశీలిస్తే అందులో వాడిన భాష, పదజాలం మనకు ఇప్పుడు వింతగానూ అనిపిస్తుంది. కానీ ఆ రంగంలో భాషలో వ్యవహార శైలిలో పెద్ద మార్పులు వచ్చిన దాఖలాలు ఏవీ లేవు. కింద ఇచ్చిన భాగాన్ని మీరు శ్రద్ధగా చదవండి. అందులో పదజాలం, భావనలు, వాక్యాల తీరు పరిశీలించండి.

(a) I think that the safeguards against possible abuses are as strong as they well can be. Every conviction and sentence will run the gauntlet of appeal and revision. Though the Government can mitigate or remit punishments it is power-less to inflict them; in this respect the influence of the courts is paramount. No prosecution under section 124A can now lie without the sanction of Government and in the amended Criminal Procedure Code presented this day it will be found that due provision of the same kind is proposed. Attempts are, it is true, being made to minimize the effect of this provision. The Honourable Member in his minute of dissent says that the value of the guarantee will mostly depend on the strength with which the case is urged by the District Officer; he fears that in the face of a strong representation by such an official, 'the Government would naturally and, perhaps, not improperly, hesitate to take upon itself the responsibility of withholding sanction.' I venture in concurrence, with the Honourable Mr _____________ to think that this apprehension has no foundation whatever, either in experience or in probability. The Government will

BRAOU

never make its sanction depend on the urgency of any subordinate officer.

(b) It is cotended in appeals 19 and 25 that the properties in dispute were Kannamma's self-aqquisitions and that Chengalamma is not therefore at liberty to impeach their alienation. If this contention were to prevail, all the appeals should be allowed, and it is necessary to consider the grounds on which it rests, though at some length. It is not denied that the villages and hamlets sold and mortgaged are portions of the ancestral palayam, but it is asserted that the tenure of an unsettled palayam is such that there can be no proprietary estate in it, that on the death of each incumbent there is a lapse to the Crown, that if the palayam is still permitted to descend the heir at law such heir takes it not in continuation of the antecedent title (for there was none) but as a fresh grant from the paramount power and that the enfranchisement which changed the tenure into permanent and heritable property was an act of the State or an event which occurred during Kannamma's incumbency as a guarantee. A tenure like this came under the consideration of the Privy Council in *The Collector of Trichinopoly v. The Zamindar of Marangapuri and* (his predecessor's widow) *Lakkamani. The de facto* zamindar was the brother of the former palayagar, and was recognized by Government as entitled to the palayam or appointed to it in preference to the widow. She alleged that the nominee of Government was an illegitimate brother of her husband, that the palayam was an ancestral and heriditary tenure and that the succession to it was governed by the Hindu Law and not liable to be changed by the appointment made by Government. On behalf of the Crown, the Collector pleaded among other matters that the estate was an unsettled palayam, that the right to nominate a successor to the former palayagar was vested in Government, that in the exercise of its right, the Government granted the palayam to the late palayagar's brother, and that the grant being an act of State was not liable to be impugned in any Municipal Court. The matter in contest in that case was mainly the character of the tenure as heritable property though with this difference, viz, that the contest was then between the Crown and the heir at law, and that there was an express appointment made by Government to divert the estate from the ordinary course of descent, where as in the case before us, the Crown did not at all interfere with the ordinary course of succession, and the contest is between a person claiming under a Hindu widow and her husband's reversioner.

BRAOU

After considering the history of the palayam tenures in the Presidency, and the distinction between the palayams which were permanently settled and those which were not, the Judicial Committee observed, that a palayam might be hereditary though it was not permanently settled, and that the existence of a proprietary estate in such palayam and the tenure on which it is held are questions of fact which ought to be judicially determined in each case by legal evidence. There is thus no boubt that we cannot support the contention that because the palayam now in dispute was an unsettled palayam when the late palayagar died there was no heritable property in it. Again, it may well be that when the Crown does not step in and supersede the heir at law, the tenure is an ancestral estate as between that heir and the reversioner, though not as between them and the Crown. *In Sree Raja Yanumala Venkayama v. Stree Raja Yanumala Boochia vankondora,* the Privy Council considered what circumstances would support a plea of self-acquisition in regard to an estate originally granted by Government. They held that unless there was a confiscation of the antecedent estate and a fresh grant by a person competent to confer a legal title, the new occupant must be considered to take the estate, not as self - acquisition, but in continuation of the former title. Considerable stress was next laid on the words in inam title deed C, 'Confirmed to you in freehold or as your absolute property, &c, In construing these words regard must be had to the other parts of the document and to the parties between whom they were intended to have operation. The document commences with the words, 'On behalf of the Governor in Council of Madras, I acknowledge your title to the Mokhasa village of Chittetivar Palayam.' What was then the title which was acknowledged as the basis of enfranchisement? Was it not Kannamma's title as the widow of the late palayagar or the descendant of the original grantee of an ancient palayam? If it was, is not the enfranchisement in the nature of a mere accretion to what was undoubtedly an ancestral and hereditary tenure? Nor is there reason to doubt that the words were intended to be operative only as between the Crown and the inamdar and not as between the latter and his heir. *In Cherukuri venkanna v. Mantravathi Lakshminarayana Sastrulu,* it was decided that enfranchisement of a personal inam was no bar to an inquiry into the title to that inam, and that the title - deed granted by the Inam Commissioner might be set aside by Civil Courts without prejudice to its effect as enfranchisement of the inam tenure.

BRAOU

## Telugu Translation.

(ఎ) కాగల దుర్వి నియోగముల నివారింపుటకైన ఆపుదోళ్లు ఎంత బలమైయుండదగినవో అంత బలముగయున్నవని నేదలచెదను. ఒక్కొక్క నేరస్థాపనయు, శిక్షయు అప్పీలుకు, పునర్విమర్శకును లోబరచబడియున్నవి. శిక్షల తక్కువ పరచుటకును క్షమించుటకును రాజ్యాంగపువారు అధికారము పొందియున్నను వాటిని విధింప శక్తిలేనివారైయున్నారు; ఈ విషయమున న్యాయ స్థలముల ప్రభావము అసమానమై యున్నది. రాజ్యాంగపు వారి అనుమతి పొందక 124ఎ సెక్షను ప్రకారము ఏర్పడు నేరముకైన విచారణజేయబడగూడదు; ఆరీతిగనే నేడు సమర్పింపబడు సవరించబడిన నేరముల విచారణ చట్టములో యుక్తమైన నిర్ణయము యత్నింపబడుచున్నదని కనబడును. ఈ నిర్ణయము యొక్క ఫలమును తక్కువ పరచుయత్నములు జేయబడుచున్నవనుట నిజమే. ''జిల్లాధికారి వ్యవహారమును నిరూపణ జేయురీతికి'' తగినట్టు అభయ ప్రయోజనము చెల్లునని భిన్నాభిప్రాయము వ్రాసిన ఘనత వహించిన సభికుడు చెప్పుచున్నారు; అటువంటి ఉద్యోగస్థుని బలమైన నిరూపణకు విరోధముగ, రాజ్యాంగపు వారు సహజముగను, ఒక వేళ అనుచితము లేకయు, అనుమతిని బిగపట్టుటకైన భారమును తామే వహించ శంకించుదురని అతడు భయపడుచున్నాడు. అనుభవములోగాని, సంభావ్యతలోగాని, ఈ అనుమానమునకు ఏ ఆధారము లేదని ఘనత వహించిన – వారితో ఐకమత్యముగ ఆలోచింప నే తెగించెదను. క్రింది ఉద్యోగస్తుని అవసరమును బట్టి దొరతనపువారు ఎప్పటికి అనుమతి నివ్వరు.

(బి) 1925 నెంబర్ల అప్పీళ్లలో, వివాదమునకు సంబంధించిన ఆస్తిలు కణ్ణమ్మ యొక్క స్వార్జితములనియు, గనుక ఆ ఆస్తిలు పరాధీనమగుటను గురించి ఆక్షేపణ చేయను చెంగాళమ్మకు స్వతంత్రము లేదనియు వాదించబడుచున్నది. ఈ వాదము చెల్లదగినదైతే, అప్పీళ్లన్నిటికిని అంగీకరించవలెను; ఆ వాదమునకు ఆధారమైన మూలకారణములు, విస్తారముగయున్నను, ఆలోచింపవలసియున్నవి. విక్రయించబడినవియు కుదువబెట్టబడినవియునైన గ్రామములును పల్లెలును పితురార్జిత పాళయములోని భాగములు కాదనబడలేదు; అయితే, శాశ్వత పైసలాయతి కానట్టి పాళయము యొక్క ఒడంబడికను బట్టి దానియందు భూస్వామిత్వము కలుగ నేరదనుటయును, ప్రతి అనుభవదారు తాను మృతిబొందినపుడు భూమి సర్కారుకు మళ్లీ చేరుననియు, మరియు పాళయము జ్ఞాతిని చేరవలయునని ఉత్తరవైనయెడల అటువంటి వారస్సు మునుపటి హక్కునుబట్టి (ఏమియులేదు గనుక) దానిని పొందక సర్వాధికారినుండి నవీన ప్రదానముగ కైకొనుచున్నాడనియు, ఒడంబడికను శాశ్వతముగను వంశపారంపర్యముగను అనుభవించదగిన స్వాస్త్యముగ దానత్వవిమోచనము రాచకార్యము లేక కణ్ణమ్మ భరవసా అనుభవ కాలములోని సంభవమనియు స్థిరముగా చెప్పబడుచున్నది. తిరిచినాపల్లి కలెక్టరు వారికిని మరంగపురి జమీందారు వారి ముందుండి చనిపోయిననాతని భార్యయగు లక్కమణి వీరిద్దరికిని జరిగిన వ్యాజ్యములో ఈ తరహా ఒడంబడిక ప్రివికౌన్సిల్ పరిశీలనకు వచ్చెను. క్రియఃగ జమీందారి తొలిపాళే గారుని సహోదరుడు, పాళయమునకు బాధ్యతగలిగియున్నట్టు లేక భర్తవిహీనురాలికన్న మేలుగ దానికి నేనుకము చేయబడినట్టు దొరతనపు వారివల్ల ఆమోదించబడెను. దొరతనపు వారిచే నియమింపబడ్డ నాతడు తన పెనిమిటికి జారజభ్రాతయనియు, పాళయము తన పెద్దల పారంపర్య ఒడంబడికయనియు దాని పారంపర్య బాధ్యత హిందూచట్ట విధాయకమునకు లోబడినదనియు, దొరతనపు వారిచే జేయబడిన

BRAOU

నియామకము వల్ల మార్చదగినది కాదనియు ఆపెచెప్పెను. ఆసొత్తు అమానిపాళయమనియు, తొలిపాళెగారికి వెంబడివచ్చు వానిని నేమకము చేయవలసిన అధికారము చెలాయించుటలో లోగడిపాళేగారుని సహోదరునికి పాళయమును దొరతనపు వారు యిచ్చియున్నట్టుగను, మరియు ప్రధానము రాచకార్యముగనుక ప్రదేశ న్యాయసభవల్ల ఆక్షేపింప తగినదికాదనియు సర్కారు వారికై కలెక్టరు పెక్కు విషయముల వాదించెను. వివాదము దొరతనపు వారికిని జ్ఞాతికిని యనుటయు స్థితికైన సాధారణ వంశ పారంపర్య పద్ధతిని మార్చుటకొరకు దొరతనపు వారిచే చేయబడిన విశేష(ప్రత్యేక) నేమకము ఇందుండినది యనుటయు, ఈ భేదము మాత్రము గలగి కర్తృత్వము వల్ల పొందదగినదనుటలోని ఒడంబడిక స్వభావమే ముఖ్యముగ ఆ దావాలో వివాందింపబడెను; అటుగాక, ఇప్పుడు మా పరిశీలనలో వ్యాజ్యములో సాధారణవంశ పారంపర్య పద్ధతిని దొరతనపు వారు ఆటంకపరచలేదు; ఒక హిందూభర్తవిహీనురాలి బాధ్యతను బట్టి వ్యాజ్యము తెచ్చిన వానికిని, ఆపెనిమిటి యొక్క వెనకటి కర్తకును ఈ దావా యేర్పడినది.

ఈరాజధానిలోని పాళయఒడంబడికల చరిత్రమును, శాశ్వత పట్టాలు యివ్వబడిన పాళయములకును యివ్వబడిన వాటికినిగల భేదమును ఆలోచించి ఒక పాళయములో శాశ్వతముగ పట్టాలు యివ్వబడి యుండినను యది వంశపారంపర్యమైనదై యుండవచ్చుననియు అటువంటి పాళయములో భూస్వామిత్వ మంటయు, దాని అనుభవించగలందులకైన ఒడంబడికయు శాస్త్రోక్తమైన సాక్ష్యమును బట్టి ఒక్కొక్క సంభవములోను న్యాయవిచారణవల్ల నిర్ణయించదగిన వివాదాంశములనియు జుడిషల్ కమిటీవారు చెప్పిరి. కడపటి పాళేగారుడు మృతినొందినపుడు ప్రస్తుత వ్యాజ్యములోని పాళయములో శాశ్వత పట్టాలు యివ్వబడలేదు గనుక దానియందు పారంపర్య బాధ్యతగల స్వాస్త్యము లేదనే వాదమును మేము ఆదరించమనుటలో సందియము లేదు. మరియు జ్ఞాతిని నిషేధించి దొర తరపు వారులోనికి వచ్చినపుడు, వార్సుకు వెనుకటి కర్తకు యిరువురకును దొరతనపు వారికిని గల వ్యవహారములో లేకున్నను వార్సుకును కర్తకునుగల వ్యవహారములో ఒడంబడిక పెద్దలాస్తిగయున్నది. మొట్టమొదట ప్రభుత్వము వారిచే యివ్వబడిన సొత్తును బట్టి ఏ సందర్భములు స్వయార్జితమను హేతువును ఆదరించగలవనే విషయము శ్రీరాజయముల వెంకయామకును శ్రీ రాజయనుముల బుచ్చయ్య సంకొందొరకును జరిగిన వ్యాజ్యములో ప్రివీకౌన్సెల్ వారు ఆలోచించిరి. ముందటి యాస్తి సర్కారులో చేర్చియు న్యాయసంబంధమై అధికారపత్రికను యిచ్చుటకు అర్హతగల యొకరిచే నవీనముగ ప్రదానము చేసియుంటేను గాని, క్రొత్త అనుభవదారుడు స్వయార్జితముగ గాక ముందటి బాధ్యతను బట్టి ఆస్తిని పొందుచున్నాడని వారు నిర్ణయించిరి. సి గుర్తుగల సన్నదులోని ''నీవు సర్వస్వతంత్రముతో అనుభవించగలందులకు లేక స్వంతాస్తిగ కాయపరచబడినది'' యనుమాటలమీద ఎక్కువలక్ష్యముంచబడెను. ఈ పదముల అర్థము చేయుటలో, ఆ దస్తావేజులో ఇతర భాగములయు ఏ వ్యాజ్యదార్ల విషయములో వ్యాపించ అది ఎంచబడినదో వార్లయు గణించవలయును, ''మదరాసుకోస్తా' సభలోని గవర్నరువారికై చిట్టేతి వార్పాలెమను మొఖాసా గ్రామమునకు తమకు గల బాధ్యతను నేను అంగీకరించినాను'' అనుమాటలతో ఆ దస్తావేజు ప్రారంభించుచున్నది. అధికారమిచ్చుటకు ఆధారముగ అంగీకరింపబడిన బాధ్యతఏది? అది మృతి బొందిన మునుపటి పాళేగారుని భార్య లేక పురాతన పాలెమను మొట్టమొదట దానముదీసుకొన్న వానివంశస్థురాలైన కన్నమ్మ బాధ్యతగాదా?



BRAOU

అదిఅలాగయితే, విడిపించబడడము, నిస్సందేహముగ పెద్దలపారంపర్య ఒడంబడికనుండి పెరిగిన వైఖరిగ యుండలేదా? ఇనాందారు అతని వార్సు వీరి విషయములోగాక, దొరతనపు వారికిని ఇనాం దారునికినిగల వ్యవహారములో మట్టుకు మాటలు అన్వయించ గలందులకై అనుకోబడినవని అనుమానించుటకు కారణమున్నదా? స్వకీయానుభవములకు యివ్వబడిన ఇనామును విడుదలచేయడము, ఆ యినాముకైన బాధ్యతను గురించిన దర్యాప్తునకు ఆటంకము కానేరదనియు, ఇనాం ఒడంబడికను విడుదలచేయడమనే ప్రయోజనమునకు హానిలేక ఇనాం కమిషనరువల్ల యివ్వబడిన అధికారపత్రిక సివిల్ కోర్ట్లవల్ల రద్దుపరచబడ వచ్చునినియు చెరుకూరి వెంకన్నను మంత్రవాది లక్ష్మీనారాయణ శాస్త్రులకును గలిగిన వ్యాజ్యములో తీర్మానించబడినది.

ప్రసార సాధనాల్లో దృశ్య శ్రవణ మాధ్యమాల్లో సృజనేతరమైన విషయాల అనువాదంలోనూ అనువాదకుడు కచ్చితమైన భావానువాద పద్ధతినే పాటించాలి. విద్యాకార్యక్రమాలు, ఇతర సామాజిక విషయాలపై చర్చకు సంబంధించి అనువాదం చేయాల్సిన సందర్భంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న పారిభాషిక పదజాలం ఉపయోగించాలి. మూల, లక్ష్య భాషల్లో ఉచ్చారణ పద్ధతిని, సంప్రదాయాన్ని, లయ, ఊనికల్ని దృష్టిలో ఉంచుకొని అనువాదం చేయాలి.

**అభ్యాసం – 1**

సృజనరంగ అనువాదానికి, సృజనేతర రంగ అనువాదానికి తేడాలేమిటి?

శాస్త్ర విషయాలను అనువదించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి?

## 22.3 అనువాదం - ఆవశ్యకరంగాలు

ఇంతకు ముందు అనువాదం అంటే మత గ్రంథాలు, సాహిత్య గ్రంథాలు అనువాదం వరకే పరిమితమైన విషయంగా మనకు తెలుసు. అయితే సమాజంలో మార్పులు రకరకాల సామాజిక సందర్భాలకు దారి తీశాయి. వచన వాఙ్మయం వికాసం, విస్తృతి, వైవిధ్యం విరివిగా రచనలకు దోహదం చేసింది. సాహిత్యానువాదయుగం నుండి మనం సామాజిక,

BRAOU

శాస్త్ర సాంకేతిక విషయాల అనువాద యుగంలోకి ప్రవేశించాం. పత్రికల వ్యాప్తి అనువాదాల అవసరాన్ని పెంచడం కాకుండా సాహిత్యేతర అనువాద విధానానికి ఒక ప్రాముఖ్యతను కూడా ఏర్పరచింది. దృశ్య శ్రవణ మాధ్యమాల ప్రవేశంతో అనువాదం అవసరమైన రంగాలు మరింత విస్తృతం కాక తప్పలేదు. వీటికి ప్రత్యేకమైన అనువాద విధానం అవసరమైంది. అచ్చుమాధ్యమంలో అనువాదానికీ, దృశ్య మాధ్యమంలో అనువాదానికి కొంత తేడా ఉంది. దృశ్య మాధ్యమంలో అనువాదకుని బాధ్యత మరింత క్లిష్టతరమవుతుంది. ఉచ్చారణ వేగం, లయ, పెదవుల కదలిక పద్ధతి మొదలైన సూక్ష్మమైన అంశాలని దృష్టిలో ఉంచుకొని అనువాదకుడు జాగ్రత్త పడాల్సి ఉంటుంది. ఇది అచ్చు మాధ్యమంలో అనువాదకుడు ఎదుర్కొనే అదనపు బాధ్యత. అనువాదం ఆవశ్యకత నానాటికీ పెరుగుతూనే ఉండడం గమనించదగ్గ విషయం. అదే సమయంలో అనువాద పద్ధతిలోనూ ప్రామాణికత, ప్రయోగాలు పెరుగుతున్న విషయాన్ని మనం మరచిపోకూడదు.

**అభ్యాసం - 2**

అచ్చు మాధ్యమం - దృశ్య మాధ్యమం మధ్య అనువాదంలో వచ్చే తేడా ఏమిటి?

## 22.4 ముఖ్య విషయాలను గుర్తించుకుందాం

- సృజన, సృజనేతర రంగాల్లో అనువాద ఆవశ్యకత నానాటికీ పెరుగుతోంది.
- రెండు భాషలకి సంబంధించిన వ్యాకరణ సంప్రదాయాలు, మర్యాదలు, సంస్కృతీ విశేషాలు తెలియకపోతే అనువాదకుడు తన పనిని సమర్థంగా నిర్వహించలేడు.
- అనువాదంలో మూలవిధేయానువాదం, స్వేచ్ఛానువాదం అనే పద్ధతులున్నాయి. ఎక్కువగా స్వేచ్ఛానువాదమే ప్రాచుర్యంలో ఉండడం గమనించాల్సిన అంశం.
- సుప్రసిద్ధ రచయితల శైలిని లక్ష్య భాషలోకి తీసుకురావడం అనువాదకునికి ఒక సవాలుగా పరిణమించే అంశం.
- సాహిత్యానువాదంలో పూరణ - లుప్తతలు రెండూ కలసి ఉంటాయి. పూర్తి భావం యథాతథంగా అనువాదంలోకి తీసుకురావడం కష్టం. కవిత్వంలో ఇది స్పష్టంగా కన్పించే విషయం.
- సినిమాలకి సంబంధించిన అనువాద ప్రక్రియను డబ్బింగ్ అని పిలుస్తారు. ఇక్కడ అనువాదకుడు ఉచ్చారణ సంబంధమైన విషయాల్ని సదా గుర్తు చేసుకోవాలి.

BRAOU

☞ సృజనేతర రంగాల్లో అనువాదం చేసేప్పుడు పదాల్ని, వాక్యాలని, వాటి సంపూర్ణ భావాన్ని యథాశక్తి లక్ష్య భాషలోకి తీసుకురావడానికి ప్రయత్నించాలి. శాస్త్ర సాంకేతిక పారిభాషిక పదాల్ని సార్థకంగా ఉపయోగించాలి.

☞ ప్రసార సాధనాల అనువాదంలో సరళమైన, స్పష్టమైన భాష, పదజాలం ఉంటుంది. అనువాదంలో అతి వ్యాప్తి, అవ్యాప్తి ఉండదు.

☞ అనువాదం ఆవశ్యకతతో బాటు, అనువాద పద్ధతుల్లో ప్రామాణికత, ప్రయోగాలు పెరుగుతున్న విషయం గమనార్హం.

## 22.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. సాహిత్యానువాదంలో అనువాదకుడు ఎదుర్కొనే సమస్యల్ని చర్చించండి
2. సృజనేతర రంగంలో అనువాదంలో పాటించాల్సిన జాగ్రత్తలు ఏమిటి

BRAOU

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. దృశ్య మాధ్యమంలో అనువాదం, అచ్చు మాధ్యమంలో అనువాదం – వీటిలో ఏది క్లిష్టతరమైంది
2. పత్రికల్లో వార్తానువాదాల సరళిని పరిచయం చేయండి.

BRAOU

# ఖండం 5 రచనా రీతులు

ప్రసార సాధనాల కోసం రచన చేసేటప్పుడు ఎవరి కోసం, ఎందుకోసం, అనే రెండు అంశాలు శైలిలో, రూపంలో తేడాలను నిర్ణయించడంలో ప్రధాన పాత్రను వహిస్తాయి. భావ వ్యక్తీకరణలో భాష రెండు ప్రధాన ధోరణుల్లో మనకు కనిపిస్తుంది. సృజన, సృజనేతర రంగాల్లో వినియోగించే భాష స్వరూప స్వభావాలను అధ్యయనం చేయటం ద్వారా రచనలో పాటించాల్సిన మెలకువలను జాగ్రత్తలను గుర్తించేందుకు వీలవుతుంది. ప్రత్యేకమైన వ్యక్తులు, సమూహాలు, వారి అవసరాలకోసం చేసే రచనల్లో కొన్ని ప్రత్యేకమైన మెలకువలు పాటించాల్సి వస్తుంది. ఈ విషయాలను వివరించేందుకు అనువుగా ఈ ఖండంలో అయిదు భాగాలున్నాయి. అవి:

23) సృజనాత్మక రచన; విషయ ప్రధాన రచన

24) పిల్లలకోసం రాయడం.

25) మహిళలకోసం రాయడం.

26) నిరక్షరాస్యులకోసం రాయడం.

27) కొత్తగా అక్షరాస్యులైన వారి కోసం రాయడం.

BRAOU

BRAOU

# భాగం : 23 సృజనాత్మక రచన - విషయ ప్రధాన రచన

## విషయ క్రమం

23.0 ఉద్దేశం

23.1 ప్రవేశిక

23.2 సృజనాత్మక రచన

**అభ్యాసం - 1**

23.3 విషయప్రధాన రచన

**అభ్యాసం - 2**

23.4 భావవినిమయ మాధ్యమంగా పరిణతి చెందుతున్న వచనం

**అభ్యాసం - 3**

23.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

23.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 23.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది విషయాలను వివరించగలుగుతారు:

- సృజనాత్మక రచన – విషయ ప్రధాన రచన లక్షణాలు
- ప్రసార సాధనాల్లో వచనం – స్వరూప స్వభావాలు

## 23.1 ప్రవేశిక

భావ వినిమయానికి భాషను ఒక పనిముట్టుగా మనిషి ఉపయోగించుకుంటూ వస్తున్నాడు. మానవ జీవన విధానంలో పరిణామం భాషలో పరిణామానికీ దారి తీసింది. బాగా అభివృద్ధి చెందిన సమాజానికి సంకేతం ఆ సమాజం వాడే భాష. అభివృద్ధి చెందిన సమాజాల్లో వచనం పరిణత రూపంలో కనిపిస్తుంది. ఆధునిక వచనం, సకల సామాజిక సందర్భాలకూ తగిన విధంగా ఈనాడు మార్పు చెందుతూ ఉంది.

BRAOU

ఆధునిక సమాజ భావ చైతన్యాన్ని సమర్థంగా వ్యక్తం చేయగలిగిన స్థితి భారతీయ భాషల్లో ఈనాడు ఉంది. సామాజిక మార్పులకు అనుగుణంగా భాష ప్రజాస్వామికం అవుతున్న క్రమాన్ని, శైలీ భేదాలతో సహా ఇంతకు ముందు భాగాలలో మనం పరిశీలించాం. ముఖ్యంగా వచనంలో భిన్న సందర్భాలకు అనుగుణంగా భావ వ్యక్తీకరణలో భాష రెండు ప్రధాన మార్గాలుగా కన్పిస్తుంది. అవి: 1. సృజనాత్మక రచన. 2. విషయ ప్రధాన రచన. అయితే విషయ ప్రధాన రచనలో సృజనాత్మకత, సృజనాత్మక రచనలో విషయ ప్రాధాన్యం లేదని దీని అర్థం కాదు. ఈ రచనల్లో తేడాలు ప్రధానంగా ఎవరి కోసం? ఎందుకోసం? అనే నిర్ణయాత్మక అంశాలపై ఆధారపడి ఏర్పడేవే. కేవలం సమాచారాన్ని అందించేందుకు విషయ ప్రధాన రచనా పద్ధతి పనికి వస్తుంది. అలా కాకుండా ఆహ్లాదకరంగా, మనసుకు హత్తుకునేట్లుగా రచయిత అంతరంగాన్ని ఆవిష్కరించేట్లుగా, ఆవేశాలను, ఆలోచనలను ప్రదర్శించేట్లుగా ఆసక్తికరంగా రాసే వచనాన్ని మనం సృజనాత్మక రచన అని పిలుస్తాం.

## 23.2 సృజనాత్మక రచన

ఆధునిక వచనాన్ని సాహిత్య, సాహిత్యేతర వచనంగా మనం పరిశీలించవచ్చు. సాహిత్యపరంగా ఆధునిక ప్రక్రియల ద్వారా అభివృద్ధి చెందుతున్న వచనాన్ని సృజనాత్మక రచన అంటున్నాం. వివిధ ప్రక్రియలు అంటే – నవల, కథానిక, గల్పిక, స్వీయ చరిత్ర, లేఖలు, మ్యూజింగ్స్, జీవిత చరిత్ర, యాత్రాచరిత్ర, నాటకం, నాటిక, శ్రవ్య, దృశ్య రూపకాలు మొదలైనవి అని అర్థం. రేడియో, టెలివిజన్ ప్రసారాలలో వివిధ కార్యక్రమాలలో సృజనాత్మక వచనం శ్రవ్య దృశ్య నాటక రూపంలో, కథా చిత్రాల రూపంలో విస్తృత ఉపయోగంలో కన్పిస్తుంది.

సృజనాత్మక రచనలో భాషకీ, విషయ ప్రధాన రచనలో భాషకీ తేడా శైలిలో కన్పిస్తుంది. సృజనాత్మక రచనలో చెప్పే పద్ధతికి ప్రాధాన్యం. అంటే భాషను ఉపయోగించే పద్ధతికి, కూర్పుకు ప్రాధాన్యం. భిన్నమైన ఆధునిక వచన ప్రక్రియల్ని పరిశీలిస్తే ఈ విషయమే మనకు బాగా అర్థమవుతుంది. చెబుతున్న విషయాన్ని కళాత్మకంగా చెప్పే తీరునే సృజనాత్మక రచన అని మనం అంటున్నాం. పాఠకుల్ని బట్టి (లేదా శ్రోతల్ని బట్టి లేదా ప్రేక్షకుల్ని బట్టి), విషయాన్ని బట్టి, రచయిత కంఠస్వరాన్ని బట్టి, ప్రాపంచిక దృక్పథాన్ని బట్టి రకరకాల శైలీ భేదాలు ఏర్పడుతుంటాయి. పదాల కూర్పు, వాక్య సంయోజనం, వివిధ రకాల వాక్యాల ప్రయోగం శైలిలో భేదాలకు నిర్మితపరంగా కనిపించే కారణాలు. ఇంకా సూక్ష్మమైన కారణాలు చాలా ఉన్నాయి. కాని ఇప్పటికి ఈ పరిమితిలో వీటిని మనం గ్రహిస్తే సరిపోతుంది.

ఆత్మీయంగా పాఠకుని పట్ల ఆర్ద్రతతో, స్నేహంతో చెప్పటం, పాఠకునికి ఒక విషయాన్ని ఎలాగైనా బోధపరచాలని, మనసుకు పట్టేలా చేయాలని ఒక విధమైన ఉద్వేగంతో, ఆవేశంతో, నిజాయితీతో చెప్పటం, సృజనాత్మక రచనలో మనం గమనించవచ్చు. కేవలం విషయం లేదా సమాచారం అందించటం కాకుండా ఆ విషయం పట్ల తన దృక్పథం, వైఖరి, తాను పాఠకునిలో లేదా ప్రేక్షకునిలో కల్గించదలచిన ఉద్వేగం, స్పందన, భావ పరివర్తన అన్నీ శైలీ రూపంలో ఇమిడ్చి భాషను శక్తిమంతంగా, ప్రభావవంతంగా మలచుకోవడం సృజనాత్మక రంగంలో సాధారణంగా కనిపించే అంశం.

''పాత పదాలూ, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవీ, జీవితంలోవీ ఇంకా మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ''

(చలం – యోగ్యతాపత్రం – శ్రీశ్రీ మహాప్రస్థానం)

– ఈ వచనంలో చెబుతున్న విషయాన్ని మరోలా సాదాసీదాగా చెప్పగలిగే అవకాశం ఉంది. ఎలాంటి ఉద్వేగం



BRAOU

లేకుండా కూడా చెప్పవచ్చు. అలా చెప్పటం విషయ ప్రధాన రచన లక్షణం. కాని ఈ వాక్యంలో దూకుడూ, ఉద్వేగం పాఠకుల్ని చాలా ప్రభావితం చేస్తాయి. పాఠకుల్ని నిలేసి, చెవులు మెలేసి చెబుతున్న విషయాన్ని మనసు కెక్కించే ఈ వచనశైలి సృజనాత్మక రచనకు సంబంధించింది. పదాల ప్రయోగం వల్లా, వాక్యాలను ఉపయోగించే తీరువల్లా వచనానికి ఈ లక్షణం అబ్బింది. ఈ విషయాన్ని ఇంతకు ముందు భాగాల్లో (ఖండం-1) మీరు చదివే ఉన్నారు.

"style! Style! Style! ని పొగిడి style ని ప్రోత్సహించే నా బాధని, నా బాధ వెనక మండుతో యీ సిరాలోంచి మీ హృదయాలలోకి పలకాలని చూసే మూగ కంఠాల క్షోభ వినబడక పోతే, మూల మూలల అణిగి నలిగి నశించే ధీర వనితల ఆర్యత్వం మీకు తట్టకపోతే నేను వ్రాసి యేం లాభం, మీరు చదివి యేం లాభం?''

(మ్యూజింగ్స్ - పుట -145)

పైన పేర్కొన్న వచనంలో తీవ్రత ఉంది. ఆవేశం ఉంది. చలానికి మాత్రమే ప్రత్యేకమైన ఒక విశిష్టమైన శైలి ఉంది. ఇది చలం ముద్ర ఉన్న సృజనాత్మక వచన శైలి. చలం కంఠంలో అసహనం, ఆవేదన, చెబుతున్న విషయం కన్నా చెప్పే పద్ధతిని మెచ్చుకునే మనుషుల పట్ల కోపం, విసుగు చప్పున మన హృదయానికి హత్తుకుంటాయి. చదువుతున్న పాఠకుడు కూడా ఒక ఉద్విగ్నతకు లోనవుతాడు. ఇది సృజనాత్మక రచనలోని ప్రత్యేక లక్షణం.

ఒక్కో రచయితకి ఒక్కో శైలి ఉంటుంది. సృజనాత్మక రచనల్లో ఈ శైలి ముద్ర స్పష్టంగా కన్పిస్తుంది. ప్రాపంచిక దృక్పథాల్లో తేడా కూడా ఈ శైలి భిన్నతకు ఒక కారణంగా పేర్కొనడం తరచూ జరుగుతుంటుంది. రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు స్థూలంగా ఒకే ప్రాపంచిక దృక్పథానికి, రచనాపరమైన నిబద్ధతకు కట్టుబడిన రచయితలు. అయితే వారి వచన శైలిలో తేడా కొట్టొచ్చినట్లు మనకు కన్పిస్తుంది –

''నేను వాణ్ణి పెళ్ళాడలేదు
నేను వాడి పెళ్ళాన్ని కాను
వాడెవడో నాకు తెలియదు
నేను వాడి దగ్గరికి వెళ్ళనవసరం లేదు
వెళ్ళను''
అంటుంది ఆమె
అదీ ఆమె జవాబు
ఆవిడే ప్రతివాది ఆ కేసులో
తెల్లగా, లావుగా, పొట్టిగా ఉన్నదావిడ
యవ్వనంతో, అందంతో పొగరెక్కిన ముఖం ఆమెది
నల్లగా వంకులు తిరిగినది ఆమె జుట్టు
కట్టుకున్నది తెల్లటి చీర

BRAOU

వేసుకున్నది నల్లటి రవిక

కొప్పులో పెట్టుకున్నది మందార పువ్వు

వాది ప్రతివాదులిద్దరూ చెరో వైపూ నిల్చున్నారు''

(కోర్టుకు రాని సాక్షులు – రా.వి. శాస్త్రి)

''ఒక సిద్ధాంతానికి నిలబడిన వాడు తన సిద్ధాంతం ద్వారా లోకానికి మహోపకారం చెయ్యలేని వాడు అనేక మందికి హాని మాత్రమే చేస్తాడు. కాని అందుకు లక్ష్య పెట్టడు. పట్టుదల అన్నది కేవలము వ్యక్తిపరంగా ఉన్నప్పుడది లోకానికి చెయ్యగల మహోపకారమేమీ ఉండదు.

పార్వతీశం తన దగ్గిర వాళ్ళలో ఏ ఒకరికీ ఏనాడూ ఆవగింజంత సుఖాన్ని తన పట్టుదల ద్వారా కలిగించలేదు కాని కష్టాలూ, మనక్లేశమూ పుష్కలంగా కలిగించాడు''.

(చెడిపోయిన మనిషి – కొ.కు)

పై రెండు భాగాల్ని పరిశీలిస్తే వచన రచనల్లో తేడా స్పష్టంగా కన్పిస్తుంది. మొదటిది కవితాత్మకంగా కన్పిస్తుంది. రెండవది విషయ ప్రధానంగా కన్పిస్తుంది. అంటే సృజనాత్మక రచనలో ప్రత్యేకతల్నీ, విశిష్టతల్నీ నిర్ణయించే అంశాల్లో ప్రాపంచిక దృక్పథం ఒకటి మాత్రమే కావచ్చు. రచయిత మూర్తిమత్వంలోని చాలా అంశాలు అతని సృజనాత్మక శైలిలోని ప్రత్యేకతకు కారణాలౌతాయి.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో సృజనాత్మక వచనం ఇలాంటి చాలా ప్రత్యేకతలతో, వైవిధ్యాలతో కనిపిస్తుంది. ఇది సృజనాత్మక రచనల్లోని భాషాభివ్యక్తి లక్షణం.

ప్రసార సాధనాల్లో ప్రత్యేకించి పత్రికా రచనల్లో సృజనాత్మక వచనం ప్రత్యేక శీర్షికల్లో భావికల్లో కనిపిస్తుంది. (మాణిక్యవీణ, ఇల్లాలి ముచ్చట్లు, పుణ్యభూమి, కబుర్లు, ఫెమినిజాలు, మైదానం లాంటివి పరిశీలించండి)

సంపాదకీయాల్లో కనిపించే వచనం చాలా సందర్భాల్లో సృజనాత్మకంగానే కన్పిస్తుంది. సంపాదకీయాల్లో కొన్ని సాహిత్య ప్రకర్షను ప్రదర్శించేవి. కొన్ని తెలుగు నుడికారంతో, చమత్కారంతో నిండినవి. కొన్ని విషయ ప్రతిపాదనను ఆత్మీయ శైలితో చేసేవి. కొన్ని పూర్తిగా విషయ ప్రధానమైనవి, తర్కబద్ధమైనవి. కొన్ని విషయాలమీదే కాకుండా ప్రత్యేకించి కొందరు వ్యక్తులమీద కూడా రాసేవి – కింద కొన్ని సంపాదకీయాల్లోని భాగాలను ఇస్తున్నాం. పరిశీలించండి:

> ''రాజ్య తంత్రజ్ఞులు ఒక వైపున రాయబారాలు, జరుపుకుంటూనే ఉన్నారు. ఒడంబడికలు రాసుకుంటూనే ఉన్నారు. ఇంకొక ప్రక్కనుండి యుద్ధాల తంతులు పాశాలలాగే పెనవేసుకుంటున్నాయి. ఇంత ఆయుధ సామాగ్రి ఉత్పత్తి అవుతుంటే, అది ఎప్పుడో ప్రేలకుండా ఎలా ఉంటుంది? ఒక అగ్నికణం ఎప్పుడో రగిల్తే చాలు, లోకమంతా ఒక్కమారుగా భగ్గుమనేటట్లు ఉంది. ఈ రాయబారాలు, ఈ ఒడంబడికలు, ఈ లీగులు, ఈ కవినెంటులూ, ఈ ప్రళయం ముందర నిలిచేటట్లు లేవు. యుద్ధం ఫెళఫెళా విరుచుకుని పడిందా ఇక దాని నాపగలిగేదెవరు?

(జగత్తులో యుద్ధపరిణామం 1936, జూన్ – కృష్ణాపత్రిక)



BRAOU

''మహోపన్యాసం''

''పత్రికా సంపాదకులు జీవితంలో వెలుగులనే కాదు, నీడల్ని కూడా చూస్తారు; శిఖరాలనే కాదు. లోయల్ని కూడా చూస్తారు; అందువల్ల వారిని పదజాలం కదిలించలేదు. ఉద్బోధనలు ఉత్సహింప చేయలేవు. కాని నిన్న మాత్రం ప్రతి పత్రికా సంపాదకుడు కేవలం సమ్మోహితుడై రైట్ అనరబ్‌లో శ్రీనివాస శాస్త్రి గంభీరోపన్యాసాన్ని విన్నాడు...

వాస్తవానికి అది ఒక ఉపన్యాసం కాదు, కేవలం ఒక మహానది ప్రవాహం. మహోన్నత శిఖరంనుంచి దూకుతున్నట్లు కొన్ని సందర్భాలలో అది దిక్కులను ప్రతిధ్వనింపచేసింది; సమతలాన్ని చేరి, విశాలమై గంభీరమై ప్రవహిస్తున్నట్లు మరికొన్ని సందర్భాలలో అది కనబడింది. ఇంతేకాదు. కొన్ని చోట్ల కోడె దూడవలె త్రుళ్ళింతలాడింది; కొన్ని చోట్ల కృష్ణ సర్పంవలె బుసలు కొట్టింది; కొన్ని చోట్ల నర్తకివలె నాట్యం చేసింది. నిన్నటి ఉపన్యాసం విన్నవారు నిజంగా ధన్యులు!''

(జనవరి 12, 1944 - ఆంధ్రజ్యోతి)

''స్వాతంత్ర్య భానూదయ వేళ''

దాస్యాంధకారం తొలగింది. స్వాతంత్ర్య భానూదయం జరిగింది. మన పారతంత్ర్య శృంఖలాలు ఘల్లుమని తెగిపోయాయి. తిరిగి మనం స్వతంత్ర ప్రజలమైనాము. ఘోర జాతీయ కళంకం తొలగింది. ఇక మనం దివ్య ప్రభలతో వెలుగొందవచ్చు.

పంజరం తలుపులు తెరచుకున్నవి. ఇక దివ్యాంబర పథాలలోకి ఎగసిపోయి, స్వేచ్ఛా విహారం చెయ్యకపోతే తప్పుమనదే.

ఎంత శుభ దినమిది! ఎంత సంతోషదినమిది! ఎంత పర్వదినమిది! ఎంతటి చరిత్రాత్మక దినమిది! మరి మన చరిత్రలోనే కాదు. ప్రపంచ చరిత్రలోనే ఇది చరిత్రాత్మకమైన దినం! నలభైకోట్ల ప్రజ – మానవ జాతిలో అయిదవవంతు – నేడు స్వాతంత్ర్యాన్ని పొందింది; ఇక ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగు మహత్తర దినం కాకపోతే మరియేది కాగలదు. ఈ దినాన్ని చూడగలగడం మన అదృష్టం! ఇట్టి అదృష్టం అందరికీ పట్టదు!

(ఆగస్టు 15, 1947 – ఆంధ్రజ్యోతి)

**కల్లుకాంపౌండ్‌లో కేబినెట్!**

కిరీటాలకోసం కాదు, కేవలం

కల్లుపాకలకోసం నీతిని తాకట్టు పెట్టి

నోట్లో గడ్డి కుక్కుకునే మంత్రుల

కథలు దినపత్రికల తొలిపుటల్లో

BRAOU

చదువుకోవలసిన దుర్గతి పట్టింది

ఆంధ్రజనావళికి.

నోట్లకట్టల కోసం ప్రభుత్వాలు వేశ్యావాటికల్ని సైతం వేలం వేయించే రోజులు వచ్చినప్పుడు ముందుముందు మంత్రుల చేతులమీదుగా ఇంకెంతటి మహత్తరకార్యాల కథలు చదవాలో ఇదే జనావళి!

ముప్పై ఆరుగంటలు చూశాం, కల్లుదుకాణం అనబడే ఒక మహాసంస్థను స్థాపించడానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చేసిన తీవ్రవ్యాఖ్యలు చూసి ఆ వాతలు వేయించుకున్న మంత్రి మహోదయుడు తనంతతానుగా రాజీనామా చేసి తప్పు కడుక్కుంటారేమోనని, లేదా అటువంటి వ్యక్తిని తన మంత్రివర్గంలో చేర్చుకున్న ఈ రాష్ట్ర ముఖ్య సచివుడు అయనను మెడపట్టి నెట్టి తన తప్పు కడుక్కుంటారేమోనని. అదీ జరగలేదు. ఇదీ జరగలేదు. ఈ సంపాదకీయం రాసే వేళవరకు ఆ రెండూ జరగలేదు. పదిమందికి ఇంత గంజిపోసే కేంద్రంకోసం కాదు, ఇంత అన్నం పెట్టే కేంద్రంకోసం అసలే కాదు మంత్రి రహదారి విడిచి గడ్డిదారి పట్టింది! కేవలం తనను గడ్డిదారి పట్టించిన వాళ్ళకు ఒక కల్లుకాంపౌండ్ అనుగ్రహించడానికి!

అమధ్య ఎప్పుడో మద్యనిషేధాన్ని అమలు జరపడానికి సంబంధించి కొన్ని నియమాలు నిబంధనలు రాసుకున్నారట. అటువంటి నిబంధనల ప్రకారం ఎక్సైజు సంవత్సరం మధ్యలో కల్లుదుకాణాలకు లైసెన్సులు ఇవ్వకూడదట. ఒక గ్రామం పరిధిలో రెండు దుకాణాలు ఉండకూడదన్న మరో నియమం ఉన్నదట. ఈ రెండు నియమాల్ని అవతలకు నెట్టి ఒక మంత్రివర్యులు, రాష్ట్ర రాజధానిలోనే కూకట్‌పల్లి అనే ప్రాంతంలో ఒక కల్లుదుకాణానికి లైసెన్సు ఇప్పించారట. అలా సంవత్సరం మధ్యలో లైసెన్సు ఇవ్వడంకోసం, ఒక గ్రామాన్ని ఒక మునిసిపాలిటీ పరిధినుంచి తప్పించి, ఆ గ్రామాన్ని ప్రత్యేక రెవిన్యూ గ్రామంగా సృష్టించారట. కూకట్‌పల్లి కల్లుగీత కార్మికుల సహకార సంఘం, మంత్రిగారి నిర్ణయాన్ని హైకోర్టులో సవాలు చేసింది. ఈ కల్లుపాక స్థాపన వ్యవహారంలో భారీఎత్తున కరెన్సీకట్టలు వెళ్ళవలసిన చోటుకు వెళ్ళినట్లు, మంత్రికీ సీనియర్ అధికారులకు ఇందులో ప్రమేయం ఉన్నట్లు ఆ సహకార సంఘం ఆరోపించింది.

(13.9.96 - ఆంధ్రప్రభ)

## ''ఆర్థిక వ్యవస్థను మలచవలసిన తీరు''

''ద్రవ్యోల్బణం దేశాన్ని పట్టి పీడిస్తున్నది. జీవనావసర వస్తువుల ధరలు చంద్రమండలం చేరుకుంటున్నాయి. నిరుద్యోగ సమస్య దారుణ స్థాయికి వచ్చింది. పెట్టుబడిదారీ వర్గాలకు అక్రమంగానైనా సరే అధిక లాభాలు కావాలి. సంఘటిత కార్మిక వర్గాలు అధిక వేతనాల కోసం ఆందోళన చేస్తుంటాయి. వేతనాలు పెరుగుతాయి కాని, బాధలు తీరవు. ఎంచేతంటే రూపాయి కొనుగోలు శక్తి క్షయ రోగివలె రోజురోజుకూ క్షీణిస్తున్నది. భారీ పరిశ్రమలు ఎన్నిటిని నెలకొల్పినా నిరుద్యోగ సమస్య తీరదు. భారీ పరిశ్రమలకు విపరీతమైన పెట్టుబడి కావాలి. నిష్పత్తిలో ఎక్కువ మందికి ఉపాధి కల్పించనేరవు. వాటితో చిక్కు అదే. పెట్టుబడి అంతులేకుండా కావాలనే సరికి ప్రభుత్వాలు లోటుబడ్జెట్టు విధానాన్ని అనుసరిస్తాయి. మళ్ళీ ద్రవ్యోల్బణం విజృంభణ. ఈ విషయ



BRAOU

చక్రాన్ని ఛేదించేవారెవరు? జాతీయార్థిక వ్యవస్థ ఎవరికీ అంతుచిక్కని పద్మవ్యూహంవలె తయారయ్యింది. జీవనావసర వస్తువుల ఉత్పత్తి ఉధృతి హెచ్చింది. ధరలను కఠోరంగా శాసించి, ఆదాయాలకు వేతనాలకు ధరలకు ఒక సమన్వయం సాధిస్తే కాని ఆర్థిక ప్రగతి అసాధ్యం. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం అంతకంటే అసాధ్యం. ఉపాధి కల్పన దానితో పాటు జీవనావసర వస్తువుల ఇతోధికోత్పత్తి, రెండింటినీ సాధించే విధంగా పారిశ్రామిక రంగం 'ప్రయారిటీ'లను ఆద్యంతం సమర్పించాలి.

(12 డిసెంబరు 1972 – ఆంధ్రభూమి)

### దారి చూపే కార్లు

ఆమడ నడిచి అల్లుడొస్తే మనుగుడుపుల సంగతి మళ్ళీ చూసుకుందాం ముందు ఉపోషం వుండు అల్లుడా అందిట ఓ అత్తగారు. ప్రయాణ సాధనాలు అంతగా లేక ఇంతగా అభివృద్ధి చెందని రోజుల్లో ఎంత అత్తగారి ఇంటికయినా ఎంత కొత్త అల్లుళ్ళకయినా పాదయాత్రలు తప్పేవి కావు. ఏ నాటు బండిలోనో ప్రయాణం చేసినా డొంక మార్గంలో గతుకుల దారిలో అడంగు చేరేసరికి ఒళ్ళు హూనమైపోయేది. ''ఓ యనగ నోహోహోయన బోయవాండ్రు'' ప్రియుడు పంపిన పల్లకిలో ప్రణయవల్లకి పల్లకీ మధు స్వప్న శాఖ పల్లకీ అని మురిసిపోతూ కూర్చున్న ముగ్ధ కూడా తోట పొలిమేరలు దాటి కాలువగట్లు గడిచి ప్రేమ నివాసం చేరే సరికి వడిలిన వకుళమాలికే అయిపోయేది. వెనకటి రోజులలో ఎక్కడికి వెళ్ళాలన్నా ప్రయాణాలు బహు కష్టసాధ్యంగా ఉండేవి. అందుకే మొహంలో పసితనం తొణుకాడు తున్నా – ''తీర్థయాత్రాచణ శీలినై జనపదంబులు పుణ్యనదీ నదంబులున్ జూచితి – అంటూ చెప్పటం మొదలుట్టి – నందు నందు గల చోద్యములున్ గనుగొంటి నా పటీరాంచల పశ్చిమాచల హిమాచల పూర్వదిశాచలంబుగన్ – '' అని సిద్ధుడు శలవిస్తే మనుచరిత్ర హీరో ప్రవరాఖ్యుడు ఆశ్చర్యపోతాడు. కన్యాకుమారినుంచి కాశ్మీరం దాకా విస్తరించుకొనివున్న ఇన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించాలంటే – ''నెరకలు గట్టుకొన్న మరి యేండ్లను బూండ్లను పట్టు'' మీరెలా చూచి వచ్చారు అని అడుగుతాడు. ఆ తర్వాత సిద్ధుడు పాదలేపనం విషయం చెప్పి దాన్ని కొంచెం ప్రవరునికి కూడా ప్రసాదించి మనుచరిత్ర కావ్యం రసవత్తరమైన మలుపులు తిరగటానికి కారణమౌతాడు. వెనక ప్రయాణాలనగానే ఇన్ని వింతలూ జరుగుతూ ఉండేవి. కాని కాలం మారిపోయింది. ముందుకెళ్ళిపోయింది. అన్నిట్లో మార్పులొచ్చినట్లే ప్రయాణ రంగంలో కూడా విప్లవాత్మకమైన మార్పులొచ్చాయి. కార్లు, బస్సులు, రైళ్ళ వంటి ప్రయాణ సాధనాలు పుట్టుకొచ్చాయి. దూరాలు తగ్గి దేశాలు దగ్గిరకొచ్చేశాయి.

(సెప్టెంబరు 15, 1996 – ఈనాడు)

రచయితల అభిరుచుల్ని బట్టి, దృక్పథాల్ని బట్టి, వ్యక్తిత్వాల్ని బట్టి, సృజనాత్మక వచనంలో శైలీ భేదాలు ఏర్పడుతాయి. శ్రవ్య, దృశ్య మాధ్యమాల్లో వాడే 'మాట్లాడే భాష' కూడా సృజనాత్మక వచనంలోని ప్రత్యేక లక్షణాల్ని ప్రదర్శిస్తుంది.

BRAOU

**అభ్యాసం – 1**

సృజనాత్మక వచనంలో కన్పించే మౌలిక లక్షణాల్ని నాల్గింటిని పేర్కొనండి?

## 23.3 విషయ ప్రధాన రచన

ఆధునిక సామాజిక అవసరాలకు అనుగుణంగా వచన వికాసం జరుగుతున్న దశ ఇది. సామాజిక రంగాలూ, సందర్భాలూ, విస్తృతమవుతున్న కొద్దీ భాష కూడా మార్పులు పొందుతూ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటూ వస్తుంది. ప్రసార సాధనాలు భాషకి ఈ సామర్థ్యాన్ని కల్పించటంలో చాలా తోడ్పడుతూ వస్తున్నాయి. ఇంతకు ముందు భాగాల్లో భాష ప్రామాణికతకు ప్రసార సాధనాలు ఎలా దోహదం చేసాయో తెలుసుకున్నారు. ఆధునిక వచనం ప్రధానంగా సమాచార ప్రసారం కోసం వాడుతున్నప్పుడు విషయ ప్రధానమైన శైలి కన్పిస్తుంది. సృజనేతర రంగాల్లో ఈ విషయ ప్రధాన వచన రచన ప్రధానంగా వ్యాప్తి చెందింది. విషయ ప్రతిపాదనలో తర్కక్రమం, భాషా ప్రయోగంలో అనాసక్త ధోరణీ ఏ అలంకారాలూ, పదాడంబరాలూ విశేష వాక్య విన్యాసాలూ లేని శైలి – విషయ ప్రధాన రచనలో ప్రధాన లక్షణాలు. అనాసక్త ధోరణికి అనువుగా ఈ రచనల్లో వాక్యాలెప్పుడూ ఎక్కువగా ప్రథమ పురుషలోనే కన్పిస్తాయి. విషయ ప్రతిపాదనలో అవ్యాప్తి, అతి వ్యాప్తి ఉండదు. విషయ కాఠిన్యాన్ని తగ్గించే తేలికైన సరళశైలి ఈ రకమైన రచనల్లో ఎక్కువ కన్పిస్తుంది. స్పష్టత, విషయ ప్రధాన శైలికి ప్రాణం లాంటిది.

BRAOU

విమర్శలూ, శాస్త్రీయ విషయాలూ, రాజకీయ, తాత్విక, సామాజిక, రంగానికి సంబంధించిన రచనలూ, వార్తా రచనలూ సాధారణంగా విషయ ప్రధాన శైలిలోనే ఉంటాయి.

''పరిసరాలలో కలిగే ప్రతి చిన్న మార్పుకూ అనుగుణంగా మార్పులు చేసుకునే శక్తి ఉండబట్టే, శరీరాలు మనగలుగుతున్నాయి. శరీరంలో కలిగే మార్పులను 'ప్రతిక్రియలు' అందాం. పరిసరాల నుంచి 'ప్రేరణలు' కలిగినపుడు దేహంలో ప్రతిక్రియలు జరుగుతాయి. ప్రతిక్రియ అన్నది ప్రేరణకు గురి అయిన శరీర భాగంలోనే కాక, శరీర మంతటా కూడా జరుగుతుంది. ఉదాహరణకు, వెనుక నుంచి అకస్మాత్తుగా కారుహారన్ వినిపిస్తే ప్రేరణ పొందేది శ్రవణేంద్రియాలైన చెవులు మాత్రమే అయినప్పటికీ, శరీరంలో కలిగే ప్రతిక్రియ యెంతో గొడవగా ఉంటుంది. శరీరాంగాలలో రకరకాల చైతన్యం కనిపిస్తుంది; ధ్వని వినిపించిన దిక్కుకు తిరుగుతాం; గుండె వేగంగా కొట్టుకుంటుంది. జఠర రసాల స్రవణం మందగిస్తుంది ఇలా అనేక రకాల పరిణామాలు కలుగుతాయి''.

(మెదడు – కొ.కు)

– ఇది శాస్త్రీయ విషయ వ్యాసం. స్పష్టతా, సరళశైలీ, చెబుతున్న విషయంలో ఒక క్రమం ఇందులో మనకు కన్పిస్తాయి. ఇలాంటి రచనలకి ప్రధాన లక్ష్యం సమాచారాన్ని అందించటం. ఇందులో రచయిత ఆత్మీయత కన్పించదు. రచయిత కంఠంలో ఆవేశం, కోపం మొదలైనవి విన్పించవు. రచయిత వ్యక్తిత్వంలోని ప్రత్యేక లక్షణాలు ఇందులో

ప్రతిబింబించవు. చెబుతున్న విషయానికే ఇందులో ప్రాధాన్యం. చెబుతున్న విషయం పట్ల రచయితకి నిబద్ధత ఉన్నా ధోరణి అనాసక్తంగా ఉండటం వల్ల స్పష్టతకి, అది ఎలాంటి పరిమితి గానూ పర్యవసించదు. కింది భాగాలు పరిశీలించండి:

''నిజానికి వ్యవహార భాష అంటే మాట్లాడినట్లే రాసింది కాదు – రాసినట్లే మాట్లాడింది కాదు. మాటకూ, రాతకూ, సన్నిహితంగా ఉండి వ్యక్త భావాన్ని శ్రోత సులభంగా స్పష్టంగా గ్రహించడానికి వీలుపడే భాషా విశేషమే వ్యవహార భాష. దానిలో పాత మాటలకు చోటు లేదు. పాత పద్ధతులకు తావు లేదు. ఆధునిక పరిస్థితులకూ నేటి ఆలోచనలకూ అవసరాలకూ అనుగుణమైన శబ్దజాలం, వాక్య రచనా పద్ధతి వ్యవహార భాషకు ప్రధాన లక్షణాలు.''

(సాహిత్య భాష – వ్యవహార భాష – బూదరాజు రాధాకృష్ణ)

''ఆస్తికి సంబంధించిన విషయాలను సివిల్‌కోర్టులు విచారణ జరుపుతాయి. కార్మికుల పనికి సంబంధించిన విషయాలను లేబరు కోర్టు, లేబరు కమీషనరు విచారణ చేస్తారు. చట్టం నేరంగా పరిగణించే విషయాలను క్రిమినల్ కేసులుగా (మేజిస్ట్రేట్ కోర్టు, సెషన్సు కోర్టులు) విచారణ చేస్తాయి. మన ప్రాథమిక హక్కుల కోసం నేరుగా హైకోర్టులోనో, లేక సుప్రీంకోర్టులోనో కేసు పెట్టవచ్చును. ప్రాథమిక హక్కులంటే చట్టం ముందు అందరూ సమానమే. అందరూ స్వేచ్ఛా, వాక్ స్వాతంత్ర్యం మొదలైనవి కలిగి ఉండే హక్కు.''

(ప్రజలు – చట్టాలు)

''ఒంటరి స్త్రీ పట్ల సాంఘికంగా అపోహలున్నా, ఉద్యోగం, ఆరోగ్యం, సెక్సువాలిటీ, నివాసం – జీవితానికి సంబంధించి వాళ్ళెదుర్కొనే సమస్యలన్నీ దాదాపు ఒకే రకం.''

(స్వతంత్రంగా బతికే స్త్రీలు)

''మొదట్లో భౌతిక మానవుడు. ఆదిమ కాలంలో మనిషి భౌతిక మానవుడుగా, జంతు ప్రాయుడుగానే వుండేవాడు. జంతువుల వలె, అతడు ఆహార నిద్రాభయ మైథునాలకే పరిమితుడై వుండేవాడు. అతనిది కేవలం భౌతిక మనస్సు. ఆ తర్వాత అతడు ప్రాణిక మానవుడు అయ్యాడు. అతనిది ప్రాణిక మనస్సు(Vital mind) అంటే పరిసరాలపై ఆధిపత్యానికి ప్రయత్నించే మనస్సు. తర్వాత ఇంద్రియ మనస్సు (sensational mind) అది ఇంద్రియాల ద్వారా పని చేస్తుంది. దానిపైన ఇంద్రియ సంవేదనలను విలువ కట్టడానికి వివేచనను ఉపయోగించే మనస్సు (reasoning mind). ఆ తర్వాత ఆలోచించే మనస్సు (thinking mind). ఇప్పటి వరకు మానవుడు ఈ మనోదశ వరకు మాత్రమే ఎదిగాడు. దీని తర్వాత అతడు అందుకోవలసింది ఆధ్యాత్మిక మనస్సు (spiritual mind). ఆ పిదప అతి మనస్సు (super mind).

(విశ్వదర్శనం – నండూరి రామమోహన రావు)

ఈ ఖండికలన్నీ అనాసక్తశైలిలో విషయ ప్రధాన రచనకు ఉదాహరణలు

వార్తా రచన విషయ ప్రధాన శైలిలోనే ఉంటుంది. అనాసక్త ధోరణిలోనే ఉంటుంది. ప్రామాణిక వచనంలోనే ఉంటుంది. కింది వార్త రచనలను పరిశీలించండి.

BRAOU

# బాలికల సంరక్షణ పథకం నేటి నుంచే

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 10: రాష్ట్రంలోని 60 వేల మంది ఆడపిల్లలకు ప్రయోజనం చేకూర్చే సంరక్షణ పథకం రేపటి (బుధవారం) నుంచే అమలులోకి వస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు ప్రకటించారు. పేదాతి పేద కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పథకం కోసం 25 కోట్ల రూపాయలు కేటాయించామని, జాతీయ బ్యాంకుల ద్వారా అమలు జరుగుతుందని, పథకం వర్తించే ప్రతి బాలికకు 20 ఏళ్ళు నిండేనాటికి మొత్తం మీద 29,500 రూపాయలు లభిస్తాయని ఆయన వెల్లడించారు.

శాసనసభలో మంగళవారంనాడు ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేస్తూ, కొద్ది నెలల క్రితం చేపట్టిన ఈ ప్రతిపాదన ఇప్పుడు కార్యరూపం దాల్చుతున్నదని, ఈరోజే సవరించిన నిబంధనలతో ఉత్తర్వు జారీ అవుతున్నదని తెలియజేశారు. అనాథలు, బసవినులు, జోగినులు, అత్యాచార బాధితులు, వితంతువుల బిడ్డలకు ప్రాధాన్యం ఇస్తామని, 11 వేల రూపాయల వార్షిక ఆదాయం లోపు కుటుంబాల వారికే ఈ పథకాన్ని పరిమితం చేస్తామని ఆయన చెప్పారు. షెడ్యూల్ కులాల వారికి 15 శాతం, షెడ్యూలు తెగల వారికి 6 శాతం, వెనుకబడిన తరగతుల వారికి 25 శాతం, మైనారిటీలకు 10 శాతం, వికలాంగులైన పిల్లలకు 3 శాతం కేటాయించడం ద్వారా బలహీన వర్గాల వారికి ఈ పథకాన్ని వర్తింప చేస్తామని ఆయన వివరించారు.

ఆడబిడ్డను భారంగా భావించే ప్రస్తుత వైఖరిలో మౌలికమైన మార్పు తీసుకుని వచ్చేందుకు, ఒక ఆడబిడ్డ ఆత్మ విశ్వాసం గల మహిళగా ఎదగడానికి ఈ పథకం దోహదపడుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళల్లో దాగివున్న ప్రతిభా పాటవాలు వెలుగులోకి వచ్చేందుకు ఇప్పటికే తన ప్రభుత్వం చేపట్టిన పథకాల పరంపరలో భాగంగా ఈ కొత్త పథకానికి తుది రూపు ఇచ్చామని, ప్రభుత్వ ట్రెజరీల ద్వారా అమలు చేయడం వల్ల తరచు ఉత్పన్నమయ్యే అంశాల వల్ల ప్రతిబంధకం ఏర్పడకుండా ఉండేందుకు జాతీయ బ్యాంకుల ద్వారా మాత్రమే అమలు పరచాలని తాము తీసుకున్న నిర్ణయానికి సానుకూలంగా ఆ సంస్థలు కూడా ఆమోదం తెలియజేశాయని ముఖ్యమంత్రి వివరించారు.

ఆర్థిక ప్రయోజనం కల్పించే అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరుమీదనే అమలు చేయదలచామని, ఉద్యోగాల్లో మూడవ వంతు స్థానాలను కేటాయించామని, ఇతర రిజర్వేషన్ల మాదిరి గానే వారికే ఆ పోస్టులు చెందేలా బ్యాక్‌లాగ్ విధానం వర్తింపజేస్తామని ఆయన ప్రకటించారు.

అదే విధంగా జిల్లాకు ఒక బాలికల రెసిడెన్షియల్ స్కూలు నెలకొల్పదలచామని ఆయన చెప్పారు. కళాశాలల్లో రిజర్వేషన్ విధానం అమలు పరచడంతో బాలికల శాతం గణనీయంగా పెరిగిందని ఆయన అన్నారు. మహిళా కోర్టుల కోసం 10 మంది మహిళా న్యాయమూర్తుల పదవులను ఏర్పాటు చేశామని చెప్పారు.

BRAOU

# మక్బూల్ దార్! వెనక్కు వచ్చేయ్!
## ఎలక్షన్ కమిషన్ హుకుం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మక్బూల్‌దార్ కాశ్మీర్‌లోని అనంతనాగ్‌లో సుదీర్ఘకాలం మకాం వేయడంపై ఎలక్షన్ కమిషన్ తీవ్రంగా ప్రతిస్పందించింది. తక్షణం ఢిల్లీ తిరిగి రావాల్సిందిగా దార్‌ను శనివారం ఆదేశించింది. కాశ్మీర్ అసెంబ్లీకి రెండో విడత పోలింగ్ జరిగే సోమవారంనాడు లేదా ఓట్ల లెక్కింపు రోజున రాష్ట్రంలో ఉండరాదని హుకుం జారీ చేసింది. దార్ ఇద్దరు కుమారులు అనంతనాగ్‌నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తుండడం విదితమే.

పోలింగ్ జరిగే సోమవారంనాడు (16వ తేదీ) లేదా కౌంటింగ్ రోజున మంత్రి ఎంతమాత్రం అనంతనాగ్‌లో ఉండరాదు. ఆయన తక్షణం ఢిల్లీ రావాలని అభిలషిస్తున్నట్లు కాశ్మీర్ ప్రభుత్వానికి పంపిన సందేశంలో కమిషన్ పేర్కొంది. ఏదో ఒకరోజు మినహాయిస్తే ఆగస్టు 28 నుంచి అనంతనాగ్‌లోనే మకాం వేసిన దార్‌కు కమిషన్ అభిప్రాయాలు తెలపాల్సిందిగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టి.ఎన్. శేషన్ అధ్యక్షతన పూర్తి స్థాయిలో సమావేశమైన ఎన్నికల సంఘం కేంద్ర హోంశాఖ కార్యదర్శి కె. పద్మనాభయ్యను ఆదేశించింది. ఎలక్షన్ కమిషనర్ ఎం.ఎస్. గిల్ కాశ్మీర్‌లో పర్యటించినపుడు పలు రాజకీయ పార్టీలు ఆయనకు దార్ గురించి ఫిర్యాదు చేశాయి.

పై భాగాల్ని పరిశీలించినప్పుడు భిన్న సామాజిక రంగాలకి సంబంధించి విషయ ప్రధాన రచన ఎలా ఉందో తెలుస్తుంది. సరళ వాక్యాలూ, స్పష్టతా, తర్కం, కచ్చితమైన విషయ ప్రతిపాదనా, విషయ ప్రధాన రచనల్లో ప్రముఖంగా కన్పించే అంశాలు.

శ్రవ్య, దృశ్య మాధ్యమాల్లో ముఖ్యంగా వార్తా ప్రసారాల్లో విద్య తదితర సామాజిక, శాస్త్ర విషయ పరిచయాల్లో, చర్చల్లో ఇలాంటి స్పష్టత, కచ్చితమైన విషయ ప్రతిపాదన మనం గమనించవచ్చు.

అయితే సృజనాత్మక వచనం, విషయ ప్రధాన వచనం రెండూ స్పష్టమైన, కచ్చితమైన హద్దులు కలిగిన వేరు వేరు శైలీ భేదాలుగా చెప్పలేము. విషయ ప్రధాన వచనాల్లో సృజనాత్మక ఛాయలు కన్పించవచ్చు. సృజనాత్మక వచనాల్లో కచ్చితమైన విషయ ప్రతిపాదనా ఉండవచ్చు. ఈ రెండూ ఒక దానిలోకి ఒకటి చొరబడే సందర్భాలే ఎక్కువ.

**అభ్యాసం – 2**

విషయ ప్రధాన శైలి లక్షణాలను కొన్నింటిని పేర్కొనండి?

BRAOU

## 23 : 4 భావ వినిమయ మాధ్యమంగా పరిణతి చెందుతున్న వచనం

మనుష్యుల మధ్య భావాలూ, ఆలోచనలూ, స్పందనలూ వ్యక్తీకరించుకొని అందజేసుకొనే పద్ధతుల్లో వాచికమైన భాషా వ్యవహారం చాలా ప్రధానమైంది. అంగిక భాష (body language) కూడా భావ వినిమయానికి మనుషులు వాడుతుంటారు. ఆంగికపరమైన వాచికపరమైన ఈ భావ వినిమయ వ్యవహారం విడివిడిగా గిరిగీసినట్లు కన్పించదు. ఇది రెండూ పరస్పర పూరకాలు. రాసే భాషలో మాట్లాడే భాష, రాసే మాట్లాడే భాషల్లో ఆంగికపరమైన సంకేతాలు కలిసి పోయే కన్పిస్తాయి.

ఈనాడు శ్రవణ, దృశ్య మాధ్యమాల్లో మనం వినే చూసే వ్యవహారంలో పైన పేర్కొన్న పద్ధతి గమనించవచ్చు. దృశ్య మాధ్యమంలో శ్రోతల్ని ఆకట్టుకునేందుకు వాళ్ళతో ఒక సన్నిహిత సంవాద బాంధవ్యాన్ని ఏర్పరచుకునేందుకు వాచిక, ఆంగిక భాషా వ్యవహార శైలి ఒకటి ఈనాడు అభివృద్ధి చెందుతూ ఉంది. ఇది ఇంకా బలంగా కొన్ని సంప్రదాయాలను ఏర్పరచుకునే క్రమంలో ఉంది. కాబట్టి వీటి సమగ్ర పరిశీలనకు సంబంధించి ఒక కొత్త పద్ధతిని, పరిశోధనా వ్యూహాన్ని ఏర్పరచుకోవలసిన అవసరం ఉంది.

విషయ ప్రధానంగా రాయటం అంటే నీరసంగా రాయటం అనే అర్థం కాదు. అనాసక్తంగా రాయటం అంటే ఏమాత్రం చదవటానికి ప్రేరేపించని విధంగా రాయటమనీ కాదు. ప్రసార సాధనాల్లో ముఖ్యంగా పత్రికారంగంలో చదివించగలగడం (readability) చాలా ముఖ్యం. కాబట్టి విషయ ప్రధానమైన వచనం కాస్త సృజనాత్మకతను అద్దుకోవడం జరుగుతుంది. విషయ స్పష్టతకు లక్ష్యానికి భంగం కలిగించని విధంగా సృజనాత్మకతను రచయితలు ఈ రంగంలో చక్కగా వాడుకుంటారు. అంటే సృజనాత్మక వచనం విషయ ప్రధాన వచనం రెంటి మధ్య రేఖలు ఎప్పటికప్పుడూ చెరిగిపోతూనే ఉంటాయి. పాఠకుల్ని, విషయాల్ని, సందర్భాల్ని, ఉపయోగిస్తున్న మాధ్యమాల్ని దృష్టిలో పెట్టుకుని రచయిత తనకు తానుగా ఒక కొలమానాన్ని సృష్టించుకోక తప్పదు.

విషయ ప్రధాన వచనాల్లో ఆసక్తి కలిగించటానికి వర్ణనలు, పోలికలు తేవచ్చు. అయితే ఇది విషయాన్ని మరింత స్పష్టం చేయగలగాలి.

''బాల సూర్యుడు వ్యవస్థ మధ్యలో రూపుదాలుస్తున్నాడు''

ఈ వాక్యంలో 'బాలసూర్యుడు' కొత్తగా ఏర్పడ్డ సూర్యగోళం అనే అర్థంలో వాడటం వల్ల సృజనాత్మక ప్రయోగమైన విషయాన్ని మరింత కచ్చితంగా స్పష్టంగా చెప్పేందుకే ఇది ఉద్దేశించబడింది. శాస్త్ర విషయాలను వివరించేటప్పుడు వాక్యాలు సంక్షిప్తంగానూ, అర్థవంతంగానూ ఉంటాయి. ఇంకా చెప్పాలంటే అర్థాన్ని కూరికూరి సీసా మూతను బిగించినట్లుగా ఉంటుంది. అయితే ఇందులోనూ సృజనాత్మకతను చూపించవచ్చు.

''తెలుగులో స్వతహాగా క్రియలేని వాక్యాలేకాక ప్రయోగంలో క్రియాత్వం కోల్పోయిన వాక్యాలు కూడా మౌలిక క్రియారహిత వాక్యాల్లాగే ప్రవర్తిస్తాయి. ఉదాహరణకు:

ఎ. సుబ్బారావు గారు నిన్న ఢిల్లీ నుంచి వచ్చారు.

బి. సుబ్బారావుగారు నిన్న వచ్చింది ఢిల్లీ నుంచి.

సి. సుబ్బారావుగారు ఢిల్లీనుంచి వచ్చింది నిన్న.



BRAOU

డి. నిన్న ఢిల్లీనుంచి వచ్చింది సుబ్బారావుగారు.

ఈ పై వాక్య సమూహంలో మొదటిది సాధారణ క్రియా వాక్యం. ఆ క్రియా వాక్యం నుంచి క్రియాత్వం కోల్పోయిన వాక్యాలు ప్రాధాన్య వివక్ష కోసం నిష్పన్నమయినాయి. ఈ నిష్పన్న ద్విదళ వాక్యాలు మౌలిక క్రియా రహిత వాక్యాల్లాగే అన్ని విధాలా ప్రవర్తిస్తాయి. వీటిని ఇతర వాక్యాలతో అనుసంధించినపుడు గాని, వ్యతిరేక వాక్యాల్లో కాని అగుకు నిష్పన్న క్రియారూపాలను అనుసంధించుకోవాలి. ఇంతకు పూర్వపు వాద పద్ధతిలో ఆలోచిస్తే ఈ వాక్యాలు గుప్త నిర్మాణంలో కూడా ఆ పాటికే ఉన్న క్రియకు తోడుగా అగుధాతువును ప్రతిపాదించాల్సి ఉంటుంది. అంటే క్రియలేని వాక్యాలకు లాగే క్రియ ఉన వాక్యాలకి కూడా గుప్త నిర్మాణంలో అగు వంటి క్రియను ప్రతిపాదించాల్సి ఉంటుంది. క్రియలేని వాక్యాల కోసం తెచ్చుకున్న గుప్త నిర్మాణ క్రియా ప్రతిపాదన ఆ వాక్యాలకే పరిమితం కాక భాషా సర్వస్వానికి పరివ్యాప్తమై పరిశోధకులను భయపెట్టే బ్రహ్మ రాక్షసయి కూర్చుంటుంది.

ఏతా వాతా తేలిందేమిటంటే గుప్త నిర్మాణ క్రియా ప్రతిపాదనలో ఏ ఒక్కదాంట్లోనూ పసలేదనీ ఈ ప్రతిపాదనైనా ఉన్న చిక్కులను పరిష్కరించకపోగా కొత్త చిక్కులను తెచ్చిపెడుతున్నదనీ. గుప్త నిర్మాణం కామధేనువు కాదు, కల్పతరువూ కాదు, లేనివి సృష్టించి ఇవ్వడానికి।''

('కొన్ని తెలుగు వాక్యాల్లో క్రియాస్తి నాస్తి విచికిత్స' – చేకూరి రామారావు)

కొన్ని తెలుగు వాక్యాల్లో క్రియ ఉండదు. అట్లాంటి వాక్యాల గుప్త నిర్మాణంలో క్రియను ప్రతిపాదించలేని వాక్యాలు క్రియాలోప సూత్రం ద్వారా సాధించాలన్న ప్రతిపాదన ఒకటి భాషా శాస్త్రంలో ఉంది. ఆ వాదాన్ని ఖండిస్తూ ముగింపుగా చేకూరి రామారావు రాసిన వాక్యాలు ఇవి. క్రియలేని వాక్యాల కోసం తెచ్చుకున్న ఈ ప్రతిపాదన క్రియను నిమ్నీకరించిన వాక్యాల గుప్త నిర్మాణాన్ని కూడా విస్తరించాల్సిన అవస్థను గురించి చెబుతూ ఈ ప్రతిపాదనను బ్రహ్మ రాక్షసితో పోల్చారు. కథల్లో బ్రహ్మరాక్షసి మనుషుల కవసరమైన పనుల్తో బాటు వినాశకరమైన పనుల్ని కూడా చేస్తుంది. గుప్త నిర్మాణ క్రియ ప్రతిపాదనలో అసంగత్వాన్ని చూపించడానికి ఈ పోలిక పనికి వచ్చింది.

ఒక కాలంలో భాషా శాస్త్రంలో చాలా సమస్యలకు పరిష్కార మార్గం గుప్త నిర్మాణ ప్రతిపాదన అనుకున్నారు. అందులో వున్న అసంబద్ధత్వాన్ని చూపించడం కోసం కల్పతరువు, కామధేనువు మన సంస్కృతి నుంచి తీసుకున్న పోలికలు. ఇది విషయాన్ని ఎక్కువ అర్థం అయ్యేట్లు చేస్తుంది కాని మరుగు పరచదు.

సాహిత్య విమర్శ వ్యాసంలో కూడా విషయ ప్రధాన వచనమే ఎక్కువగా కన్పిస్తుంది. అయితే దీనిలో కూడా సృజనాత్మక ధోరణి పాటించిన రచయితలు ఉన్నారు. ఇక్కడ మనం చూడాల్సింది ఈ సృజనాత్మకత అతి వేలంగా మారి విషయ వాస్తవికతను దెబ్బతీసిందా లేదా అన్న విషయమే.

''చలమే లేకపోతే తెలుగు సాహిత్యంలో స్త్రీ పురుషుల ప్రేమ బహుశా యింకా అడవి బాపిరాజు ప్రేమకథల స్థాయిలో ఉండేవి. చలమే లేకపోతే మన సాహిత్యంలో యింకా అనేక కుటిల నీతులూ, కూట ధర్మాలూ స్వైర విహారం చేస్తూ ఉండేవి. చలమే లేకపోతే మన సాహిత్యంలో వాస్తవిక వాదం యింత బలంగా ఉండేది కాదు''.

(మహానుభావుడు చలం – రాచమల్లు రామచంద్రారెడ్డి)

పై వాక్యాల్లో సృజనాత్మకత ఉంది. ఆవేశం ఉంది. ఊపూ వేగం ఉన్నాయి. అయితే ఈ అంశాలు విషయ స్పష్టతకు, విషయ వాస్తవికతకు ఏమాత్రం భంగం కలిగించటం లేదు. విషయ ప్రధాన వచనం లేదా విమర్శలో శైలి ప్రధానంగా

కన్పించినా ఇలా సృజనాత్మక అంశాలు కలిసిపోయిన వచనం ఆయా రచయితల శైలీ వైవిధ్యాలకు ఉదాహరణలుగా నిలుస్తాయి.

పత్రికా రంగంలో రిపోర్టింగులో కూడా ఇంకా విషయ ప్రధాన, సృజనాత్మక వచనం కలసిన సందర్భాలు కొల్లలుగా కన్పిస్తాయి. ముఖ్యంగా వార్తకు శీర్షికలు పెట్టడంలో ఇటీవల చాలా పత్రికలు సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నాయి.

ఈ కింది శీర్షికలు చూడండి:

తుంగభద్ర మరో జలద్రోహ ముద్ర

నీళ్ళు కర్ణాటకకు, కన్నీళ్ళు ఆంధ్రకు

వర్షబీభత్సం వణికిన నగరం

సాధారణంగా వార్తారచనల్లో కనిపించే విషయ ప్రధాన శైలి ఆ వార్త స్వభావాన్ని బట్టి సృజనాత్మకతను అద్దుకుంటుంది. విషాద వార్తలను ప్రధానంగా ఆలంకారికంగా, కవితాత్మకంగా, రాసే సంప్రదాయం తెలుగు పత్రికల కుంది. వార్త కథనం ఆధారంగా శీర్షికా రచన చేసినపుడు అది విషాద వార్త అయిన సందర్భంలో అందులో వచన విన్యాసం ఎంత సృజనాత్మకంగా ఉంటుందో పరిశీలించటానికి కింది ఒక భాగాన్నిస్తున్నాం – చూడండి.

## ఈ వధ్యశిల పునాదులెక్కడ?

వేదాల్లో ఎక్కడా సతీసహగమనం ప్రస్తావన లేదు. తండ్రివల్ల అవమానం పొందిన పార్వతి ఆత్మాహుతి చేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న కథ ద్వారా ఈ అనాచారానికి మత ప్రాధాన్యం లభించిందని కమలాదేవి చటోపాధ్యాయ తన పుస్తకంలో పేర్కొన్నారు. విధిగా బాల్య వివాహాలు జరిగే కాలంలో సహజంగా బాల వితంతువులు కూడా వుండేవారు. భర్తే సర్వస్వం, అతడు లేని జీవితం నిరర్థకం అని బోధించే మత సాంప్రదాయానికి సమాధానంగా పుట్టుకొచ్చిందే సతీసహగమనం. ఈ అకృత్యం భారతదేశంలోకి కొన్ని విదేశీ తెగలు మోసుకొచ్చి ఉంటాయని భావిస్తున్నారు. ఎందుకంటే ' ఈలోకం లోనూ పరలోకంలోనూ' కూడా పురుషులు స్త్రీ మీద సర్వాధికారాలు కలిగి ఉండేందుకు ఉద్దేశించిన ఈ దురాచారం ఏదో ఒక రూపంలో అనేక దేశాల్లో ఉండేది. భారత దేశంలోనూ పురుషుడి నిర్హేతుకమైన, అసమంజసమైన కోరికలకు రూపమే సతీసహగమనం. అమెరికాలోని కోమంచి అనే తెగలో మరణించిన భర్తకు పరలోకంలో సహచర్యం కోసం అతడికి అత్యంత ప్రియమైన భార్యను చంపివేసేవారు. కేలిఫోర్నియాలోనూ, ఆఫ్రికాలోని కొన్ని తెగల్లోనూ రాజు మరణించినప్పుడు అతడి భార్యలందరి కాళ్ళు విరగ్గొట్టి (బహుశా పారిపోకుండానేమో) అతడితో బాటు సమాధి చేసేవారు. ఉగాండాలో రాజు మరణించిన తర్వాత రాణులందరినీ అతడి సమాధి చుట్టూ కట్టిన కట్టడంలో వేసి ఆకలితో మాడ్చి చంపేవారు. మరో తెగలో మరణించిన భర్తతో బాటు ఒక భార్య ఉరిపోసుకుని చనిపోయేది. చైనాలో భర్తశవం వద్ద ఆత్మహత్య చేసుకున్న స్త్రీలను పూజించేవారు. ఈజిప్టు, గ్రీస్ దేశాల్లో కూడా వితంతువులు ఆత్మాహుతికి తలపడే వారు. లేదా భర్తశవంతో బాటు సమాధి అయ్యేవారు. యుద్ధాల వల్ల తరిగిపోతున్న తమ సంతతిని వృద్ధి చేసుకోవాలన్న ఆసక్తి గల ఆర్యులు

BRAOU

సతీసహగమనాన్ని ప్రోత్సహించలేదని చరిత్ర చెబుతోంది. తమ మనుగడకూ, మత సంప్రదాయాలకు ప్రమాదం ఎదురవుతుందనగా తన రాజకీయ బలం నిరూపించుకోవడానికి మితిమీరిన ఉత్సాహం, పెద్ద ఎత్తున ప్రదర్శనల ద్వారా ఇలాంటి నికృష్టమైన ఆచారాలకు తలపడేవారు.

అందుకే బ్రిటిష్ పాలన కేంద్రీకృతమైన బెంగాల్‌లోనే 57 శాతం 'సతి' సంఘటనలు నమోదయ్యాయి. లార్డ్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు బెంగాల్ ప్రెసిడెన్సీలో ఏటా సతీసహగమనాల సంఖ్య 600-800 వరకు చేరేది. దక్షిణ భారత దేశంలో ఈ ఆచారం దాదాపు లేదనే చెప్పాలి. భారతదేశంలో బ్రిటిష్ పాలనకు ముందు సతీసహగమనాలను నిషేధించడానికి గట్టి ప్రయత్నాలు జరిగినట్లు ఆధారాలు లేవు. ఈ ఆచారాన్ని మొదటిసారిగా వ్యతిరేకించింది మొగలాయి చక్రవర్తులు. 'సతీ' సంఘటనలను కొంతవరకు అదుపు చేయడానికి హుమయూన్ లైసెన్సింగ్ పద్ధతిని ప్రవేశ పెట్టాడు. అక్బర్ చక్రవర్తి కూడా వీటిని అదుపు చేయడానికి శతవిధాల ప్రయత్నించాడు. జహంగీర్ సతీసహగమనాలను నిషేధిస్తూ చట్టం చేయగా, ఔరంగజేబు ఈ చట్టం అమలుకు గట్టి చర్యలు తీసుకున్నాడు. రాజపుత్ర రాజులు తమ ఏలుబడిలో ఈ దురాచారాన్ని అంతమొందించడానికి ప్రయత్నించారు. రావు బిషన్ సింగ్ అనే రాజపుత్ర రాజు తన భార్యలను సతీసహగమనానికి ఒడిగట్ట వద్దని ముందే ఆదేశించాడు. అనేకమంది రాజులు 'సతీ' సంఘటనలకు పాల్పడ్డ వారికి జరిమానా, కఠిన కారాగార శిక్ష కూడా విధించేవారు. మరాఠీ రాజులు కూడా మొదట్లో వ్యతిరేకించారు. గానీ పేష్వా రాజుల బ్రాహ్మణ పాలన కింద ఆ తర్వాత వారి ప్రయత్నాలు సాగలేదు.

BRAOU

1812లో బ్రిటిష్ ప్రభుత్వం స్మశాన వాటికల వద్ద పోలీసు అధికార్లను నియమించింది. అయినా ఈ సమయంలోనే 'సతీ' సంఘటనలు అధికంగా జరిగాయి. విదేశీయులైన మేజిస్ట్రేట్‌లు, ప్రేక్షకులుగా చూసిన జనం రెట్టింపు ఉత్సాహంతో సతీసహగమనాలను ప్రోత్సహించేవారు.

భారతదేశంలో 19వ శతాబ్దం నాటికి ఉన్న అనేక మూఢవిశ్వాసాల్లో మొట్టమొదట, సంస్కరణలకు నోచుకున్నది 'సతీసహగమనం'. రాజారామ్మోహన రాయ్ వంటి సంస్కర్తల అవిశ్రాంత కృషివల్ల 1829 డిసెంబర్ 4న అప్పటి గవర్నర్ జనరల్ విలియం బెంటిక్ 'సతీ నిషేధ చట్టం' ఆమోదించాడు. అయితే నేడు మనకు 1829 నాటి 17వ బెంగాల్ రెగ్యులేషన్ కనిపిస్తుంది. గాని నాటి 'సతీ నిషేధ చట్టం' మచ్చుకైనా కానరాదు. ఊహించిన విధంగానే బెంటింక్ ప్రవేశ పెట్టిన చట్టాన్ని రాజపుటానా రాష్ట్రాలు (ప్రస్తుత రాజస్థాన్ ప్రాంతం) ఆఖరున ఆమోదించాయి. అయితే చిత్తశుద్ధి లేని చట్టాల వల్ల ప్రయోజనం ఉండదన్నందుకు నిదర్శనంగా ఈ ప్రాంతంలో నిన్న మొన్నటి వరకు కూడా సతీసంఘటనలు యథేచ్ఛగా జరిగాయి. దేవరాల గ్రామంలోనే గతంలో ముగ్గురు స్త్రీలు భర్తల శవాలతో బాటు కాలిపోయారు. 1980 ఆగస్టు 30న ఝర్లీ గ్రామంలో రూప్ కన్వార్ అనే పదహారేళ్ళ యువతి వివాహమైన ఏడాదిలోగానే ఈ మతమౌఢ్యానికి బలి అయింది. ఆ స్థలంలో వెలసిన గుడిలో ఇప్పుడు ఏటా ఉత్సవాలు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా ఉమారియా గ్రామంలో 1986 సెప్టెంబర్ 26న ఇరవై ఏళ్ళ వైజయంతిని భర్త చితి వద్దకు ఊరేగింపుగా తీసికెళ్ళి గ్రామస్తులు ఆమెను బలవంతంగా కాల్చివేశారు. సకాలంలో అధికార యంత్రాంగం, పోలీసులూ జోక్యం చేసుకోవడం వల్ల ఈ ఏడాది ఏప్రిల్ 25న

పాలిజిల్లాలో భన్వారీ, 1985 మార్చి 12న జైపూర్ జిల్లాలో జస్వంత్ కన్వార్, 1983 జనవరి 27వ తేదీన ఇద్ జిల్లాలో గోకుల్ బాయ్ చితిమంటల నుంచి బతికి బైట పడ్డారు. అయితే ఇంతవరకు జరిగిన అన్ని సంఘటనల్లోనూ ఆత్మహత్య ప్రయత్నం లేదా హత్యాప్రయత్నాల క్రిందనే అరెస్టులు జరిగాయి తప్ప సతీ నిషేధ చట్టం మాటే లేదు. 'సతీ' సంఘటనల నిషేధాన్ని ఈ ఇరవై శతాబ్దం చివరిలోనైనా చట్టబద్ధం చేసే ఆలోచన ఈ దేశానికి లేదా? చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం సతి దురాచారాన్ని ఆమోదించడమే. సతీ స్థలాల వద్ద నిర్మించిన ఆలయాల ట్రస్టులకు పన్ను మినహాయింపు కలిగించడం ఈ పైశాచిక చర్యకు ప్రభుత్వ మద్దతు గాక మరేమనిపించుకుంటుంది?

(ఆంధ్రజ్యోతి, అక్టోబరు 4, 1987)

సమాచారాన్ని ఉన్నది ఉన్నట్లుగా అందించడమే పత్రికల లక్ష్యం. చిలువలు పలువలు కల్పించడం కాదు. సొంత వ్యాఖ్యలు, అభిప్రాయాలు కూడా రిపోర్టింగులో ఉండవు. అయితే రిపోర్టింగు ఎంత మేరకు సృజనాత్మకంగా ఉంటే వార్తకు భంగం కలుగదో పత్రికా రచయితలు తమంతట తామే నిర్ణయించుకోవాలి.

సృజనేతర రంగాల్లో భాష ప్రామాణికతను సంతరించుకుంటున్న దశ ఇది. ప్రసార సాధనాల్లో ప్రస్తుత వినియోగంలో ఉన్న భాషలో ఎన్నో కొత్త పోకడలూ, ప్రయోగాలూ కన్పిస్తున్నాయి. శైలీ భేదాలు ఏర్పడుతున్నాయి. సృజన రంగంలో వచనం, సృజనేతర రంగంలో వచనం మధ్య రేఖలు చెరిగిపోతున్నాయి. ఆధునిక వచన వికాస క్రమంలో ఇది ప్రధాన దశ.

BRAOU

**అభ్యాసం – 3**

దృశ్యమాధ్యమాల్లో ఈనాడు ఏర్పడుతున్న సన్నిహిత సంవాద శైలిని వివరించండి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 23.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

☞ అభివృద్ధి చెందిన సమాజాల్లో వచనం పరిణత రూపంలో కనిపిస్తుంది.

☞ వచనంలో భిన్న సామాజిక సందర్భాలకు అనుగుణంగా భావ వ్యక్తీకరణలో భాషరెండు ప్రధాన మార్గాల్లో కన్పిస్తుంది. ఒకటి: సృజనాత్మక రచన, రెండు: విషయ ప్రధాన రచన.

- సృజనాత్మక రచనలో చెప్పే పద్ధతికి ప్రాధాన్యం. అంటే భాషను ఉపయోగించే పద్ధతికీ, కూర్పుకూ ప్రాధాన్యం. విషయ ప్రధాన రచనలో చెపుతున్న విషయానికే ప్రాధాన్యం. అనాసక్తశైలిలో, సరళంగా స్పష్టంగా విషయాన్ని వివరించడమే విషయ ప్రధాన రచనలో ముఖ్యం.

- శ్రవ్య దృశ్య మాధ్యమాల్లో వాడే 'మాట్లాడే భాష' కూడా సృజనాత్మక వచనం లోని ప్రత్యేక లక్షణాల్ని ప్రదర్శిస్తుంది.

- ఆంగిక, వాచిక భాషా వ్యవహార శైలి దృశ్య మాధ్యమంలో ఈనాడు రూపుదిద్దుకుంటోంది.

- విషయస్పష్టతకి, లక్ష్యానికి భంగం కలిగించకుండా సృజనాత్మకశైలిని రచయితలు వాడుకుంటారు.

- సృజనరంగంలో వచనం, సృజనేతర రంగంలో వచనం మధ్య రేఖలు, హద్దులు చెరిగిపోతున్న దశ ఇది.

## 23.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. సృజనాత్మక రచనకు, విషయ ప్రధాన రచనకు తేడాల్ని పేర్కొనండి?

2. శ్రవ్య, దృశ్యమాధ్యమాల్లో వాడే భాషను గురించి వివరించండి?

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. సంపాదకీయాల్లో కనిపించే లక్షణాలను చర్చించండి?

2. వార్తారచనలో వచనం ఎలా ఉండాలో వివరించండి?

BRAOU

## భాగం : 24 బాలల కోసం రాయడం

**విషయ క్రమం**

24.0 ఉద్దేశం

24.1 ప్రవేశిక

24.2 పిల్లల స్వభావాన్ని గుర్తించడం

**అభ్యాసం - 1**

24.3 పిల్లలకోసం రాసేటప్పుడు మెలకువలు

**అభ్యాసం - 2**

24.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

24.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

### 24.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

☞ పిల్లల స్వభావాన్ని ఎలా అర్థం చేసుకోవాలో,

☞ పిల్లల కోసం ఎలా రాయాలో వివరించగలుగుతారు.

BRAOU

### 24.1 ప్రవేశిక

పిల్లల కోసం రాయదలచుకున్న వారు కొన్ని ముఖ్యమయిన విషయాలను అవగాహన చేసుకోవాలి.

పిల్లల కోసం రాయడానికీ పెద్దలకోసం రాయడానికీ తేడా ఉంది. మేధా సంబంధమైన ప్రక్రియలు పెద్దలకు వినోదాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయి.

పిల్లలకు అలా కాదు. వీరు చూడడానికీ వినడానికీ ఇష్టపడతారు. రచయిత వర్ణించే విధానం పద చిత్రాలలా ఉన్నప్పుడు పిల్లల కళ్ళ ముందు బొమ్మలు కదలాడుతాయి. పాత్రలు ప్రాణం పోసుకుని మాట్లాడాలి. అలా రాయగలిగినపుడే ఆ రచయిత పిల్లల సాహిత్యాన్ని సృష్టించ గలుగుతాడు.

### 24.2 పిల్లల స్వభావాన్ని గుర్తించడం

కల్పన కాని విషయాలలో పిల్లలు ముఖ్యంగా కోరుకునేది వారి సందేహాలకు సమాధానాలు. వారి కర్థం కాని

విషయాలకు వివరణతో అభిప్రాయాలతో వారికి పని లేదు. ఆ విషయం గురించి రచయిత ఏమనుకుంటున్నాడో పిల్లలకు అక్కరలేదు.

పిల్లలకున్నది, పెద్దలకు లేనిది అనుభవ రాహిత్యం. పిల్లలకదే వర ప్రసాదం. దాని వల్లనే పిల్లలకు ప్రతీదీ కొత్తగా, ఆశ్చర్య జనకంగా కన్పిస్తుంది. పిల్లలు ఏ విషయాన్నీ పక్షపాతంగా గానీ పాక్షికాభిప్రాయాలతో గానీ చూడరు.

పిల్లలు మొహమాటం లేని వారు, నిష్పక్షపాతంగా విమర్శించగలరు. నచ్చితే నచ్చిందంటారు. నచ్చకపోతే నచ్చలేదంటారు. డొంకతిరుగుడు వాళ్ళకి తెలియదు. అందువల్లనే 'రాజుగారికి బట్టలు లేవోచ్' అనగలిగాడు కథలోని పిల్లవాడు. అయితే పిల్లలలో ఉన్నంత విభిన్నత, విలక్షణత మరెక్కడా కన్పించదు. అందుకే ఒక పిల్లకాకికినచ్చినంత మాత్రాన అది అలాంటి పిల్లలందరికీ నచ్చాలన్న సిద్ధాంతమేమీ లేదు.

పిల్లల కోసం రాయదలచుకున్నవారు అన్ని వేళలా గుర్తుంచుకోవలసినవి కొన్ని ముఖ్యమైన అంశాలు:

పిల్లలను ఎప్పుడూ తక్కువ అంచనా వేయకండి. పిల్లల కోసం రాయడం పెద్దల కొరకు రాయడం కంటే సులువని పొరపాటున కూడా అనుకోవద్దు. నిజానికి పిల్లల కోసం రాయడానికే ఎక్కువ అనుభవం, కృషి అవసరం. కాబోయే రచయితలు, తమ రచనా వ్యాసంగం పిల్లల రచనలతో మొదలెడతామనుకోవడం శుద్ధ తప్పు. పిల్లలకు మీరు రాసినవి నచ్చాలంటే వారికి ఉపదేశాలు ఉపన్యాసాలు ఇవ్వకండి. వారిలో ఒకరుగా మారి మీకు తెలిసింది వారికి చెప్పే ప్రయత్నం చేయండి.

అన్నింటికంటే ముఖ్యమైనది ఏ విషయాన్నయినా పిల్లల్లాగా చూడడం నేర్చుకోండి. వారి లాగా అనుభూతి చెందేందుకు ప్రయత్నించండి. ఇదేమంత కష్టం కాదు. ఒకసారి మీ బాల్యాన్ని గుర్తు తెచ్చుకోండి. ఏయే సందర్భాలలో మీరెలా ప్రవర్తించారో, ఎలా ఆలోచించారో జ్ఞాపకం తెచ్చుకోండి. మీ బాల్యపు జ్ఞాపకాలు మీ కెంత చక్కగా గుర్తుంటే మీరంత మంచి రచయిత కాగల అవకాశముంది.

BRAOU

**అభ్యాసం – 1**

పిల్లలకోసం రాయదలచ్చిన వారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యాంశాలేవి?

## 24.3 పిల్లలకోసం రాసేప్పుడు మెలకువలు

ఇక అసలు విషయం రాయడం గురించి తెలుసుకుందాం.

పిల్లలు సరళ స్వభావులు. అందుకే వారి కోసం చేసే రచనలు కూడా సరళంగా, సులువుగా, స్పష్టంగా క్లిష్టత లేకుండా వుండాలి. ఈ సరళత పదాల ఎన్నికలో, శైలిలో, కల్పన అయితే పాత్రల రూపకల్పనలో, సన్నివేశాల సృష్టిలో,

కథనంలో అన్నిటా ఉండాలి.

పిల్లలకు రాయడానికి పదాలను జాగ్రత్తగా ఎన్నుకోవాలి. ఒకే అర్థం వచ్చే రెండు పదాలున్నప్పుడు ఆ రెంటిలో ఏది ఎక్కువ మందికి తెలిసి ఉంటుందో దాన్ని వాడడం మంచిది. 'తెలుసుకోవడం' ఎపుడయినా 'జ్ఞాన సముపార్జన' కంటె సులువే కదా! అయితే ఈ పదాలు ఎన్నికలో మరొక అంశాన్ని గమనించాలి. పిల్లలకు క్రమానుగతంగా కొత్త పదాలు పరిచయం చేసే ప్రయత్నం చేయాలి. కాని దాన్ని మితిమీరనీయకూడదు.

సరళత అనేది వ్యాకరణానికి కూడా వర్తిస్తుంది. చిన్న వాక్యాలు, క్లిష్టత లేని వాక్యాలు, సూటిగా రాయాలి. పిల్లలకు ఉపమానాలు, రూపకాలు నచ్చుతాయి. అలాగని పదే పదే వాటిని వాడడం మంచిది కాదు.

మంచి రచయిత కావడం ఒక రోజులో సాధ్యం కాదు. అన్ని కళల లాగే దీనికీ అభ్యాసం, కృషి కావాలి.

సాధారణంగా పిల్లలను వారి గ్రహణ శక్తిని బట్టి 2-5 సంవత్సరాల మధ్య వయస్సున్న వారిని మొదటి వర్గంగా, 6-10 సంవత్సరాల మధ్యయున్న వారిని రెండవవర్గంగా, 11 సంవత్సరాల పైబడిన వారిని మూడవ వర్గంగా విభజించే ఆనవాయితీ ఉన్నది. పిల్లల కోసం రచనలు చేసేవారు ఈ విభజనను దృష్టిలో ఉంచుకోవడం మంచిది. అయితే ఇవి కొండ గుర్తులే గానీ ఖచ్చితమయిన కొలతలు కాదు.

పిల్లల కొరకు రాయదలచుకున్నవారు సమకాలీన సాహిత్యంలో పేరు పొందిన పిల్లల రచనలు, రేడియో కార్యక్రమాలు, టెలివిజన్ కార్యక్రమాలు చదవడం, వినడం, చూడడం మంచిది. వీటిలో కాబోయే రచయితలు తెలుసుకోదగ్గవీ, నేర్చుకోదగినవీ చాలా అంశాలు ఉంటాయి. అయితే అలాంటి వాటిని అనుసరించే ప్రయత్నం చేయాలి తప్ప అనుకరించడం మంచిది కాదు.

కల్పన ప్రధాన మయిన రచనలు చేసేటప్పుడు కథనం సూటిగా ఉండేటట్లు చూచుకోవాలి. సన్నివేశాలు కానీ సంఘటనలు కానీ కాలగమనాన్ని అనుసరించి ఉండాలి. అవి వెనుక ముందు కాకుండా చూసుకోవాలి.

పిల్లల కోసం రాసేటప్పుడు వారి వైపు నుంచి ఆలోచించగలగాలి. వారిలా చూడగలగాలి. వారిలాగే అనుభూతి పొందగలగాలి. బాల్యంలో క్రియాశీలత ప్రధానంగా ఉంటుంది. అందువల్ల కథనం చురుగ్గా నడవాలి. సంఘటనలు ఒకదాని వెంట ఒకటిగా జరగాలి. నిరుత్సాహమైన వివరాలు చెప్పనక్కరలేదు. పెద్ద పెద్ద వర్ణనలు, నిడివిగల సంభాషణలు పిల్లలకు రుచించవు.

పిల్లల కోసం రాయదలచుకున్నవారు తప్పని సరిగా చదవాల్సినవి 'చందమామ' మాస పత్రిక, బాలానందం వారి నాటికలు, కథలు, రేడియో కార్యక్రమాలలో రేడియో అన్నయ్య - అక్కయ్య రూపొందించిన కదంబ కార్యక్రమాలు ముళ్ళపూడి వెంకట రమణ బుడుగు కథలు.

పిల్లల కోసం రచనలు చేసే వారికి చందమామ చక్కని ఒరవడి. కథనంలో, పదాల ఎన్నికలో, సూటిగా చెప్పడంలో, చదివించే గుణంలో చందమామకు చందమామే సాటి. పిల్లలలో పిల్లలై రేడియో అన్నయ్య, అక్కయ్య సృష్టించిన కార్యక్రమాలు అప్పటికీ ఇప్పటికీ అనుసరించదగినవి. ఇక ముళ్ళపూడివెంకట రమణ సృష్టించిన బుడుగు అచ్చమయిన తెలుగు పిల్లకు వారి ఆలోచనలు ఊహాపోహలు కల్తీలేని పిల్ల చేష్టలు రైలింజను డ్రైవర్ని 'ఇంజం డ్రైవరూ ఒక బీడీ యిస్తాను

BRAOU

గానీ వింజం తోలనిస్తావా?' అని అడిగే బుడుగు నిజంగా పిల్లల క్లిష్టతలేని సూటి ఆలోచనా విధానానికి అతి చక్కని ఉదాహరణ.

ఇకపోతే కాబోయే పిల్లల రచయితలు పొరపాటున కూడా చేయగూడనిది ఒకటుంది. అదేమిటంటే పత్రికలకు, రేడియోకు, టెలివిజన్‌కు చేసే రచనల్లో పిల్లలకు అవగాహన కాని, వారి అనుభవంలో లేని భావాలను వారి చేత ప్రకటింపచేయడం. ఇది మాత్రం ఎప్పటికీ వర్జనీయమే.

**అభ్యాసం -2**

పిల్లల వయస్సు గ్రహణ శక్తిని రచయితలెలా గుర్తించాలి?

## 24.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- పిల్లల కోసం రాయడానికీ పెద్దల కోసం రాయడానికీ ఎంతో తేడా ఉంది
- పిల్లలలో విభిన్నత, విలక్షణత ఎక్కువ. పిల్లల కోసం రాయడానికి ఎక్కువ కృషీ, అనుభవం అవసరం.
- పిల్లలకోసం చేసే రచనల్లో సరళత ఉండాలి
- పిల్లలలో వయస్సు వారీగా అవగాహన స్థాయిని గుర్తుంచుకుని వారి కోసం రాయాలి.
- కథనంలో క్లిష్టత ఉండకూడదు. క్రియాశీలత అంటే సంఘటనల పరంపర ఎక్కువ ఉండాలి.
- పిల్లలకు అవగాహన కాని, వారి అనుభవంలో లేని భావాలను ప్రకటింప జేయడం ఔచిత్యం కాదు.

## 24.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. పిల్లలకోసం రాసేటప్పుడు పాటించాల్సిన మెలకువలేమిటి?
2. పిల్లల వయస్సు ఆధారంగా గ్రహణశక్తికి అనువుగా రచనలు ఎలా చేయాలి?

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. సమకాలీన పత్రికారంగంలో పిల్లలకోసం కేటాయించిన అంశాలను గుర్తించి, వివరించండి?
2. పిల్లల సాహిత్యంలో మీరు చదివిన కొన్ని పుస్తకాలను సమీక్షించండి?

BRAOU

# భాగం: 25 మహిళల కోసం రాయడం

## విషయ క్రమం

25.0 ఉద్దేశం

25.1 ప్రవేశిక

25.2 రచనకు ముందు ఆలోచించాల్సిన అంశాలు

అభ్యాసం – 1

25.3 స్త్రీల కోసం రాయడం

అభ్యాసం – 2

25.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

25.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 25.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు –

- రచయితలు స్త్రీల కోసం రాసేటప్పుడు పాటించాల్సిన సూత్రాలు, గుర్తుంచుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించగలుగుతారు.

## 25.1 ప్రవేశిక

రచయితలు తాము రాయడం మొదలు పెట్టేముందు మూడు విషయాలను అవగాహన చేసుకొని నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. అవి: ఎవరి కోసం, ఏ ఉద్దేశంతో, ఏ మాధ్యమానికి రాయదలచుకున్నామన్నది.

ప్రజానీకంలోని ఏ వర్గపు ప్రజల కొరకు రాయదలచుకున్నామో ముందు నిర్ణయించుకోవాలి. గ్రామీణుల కొరకా, పట్టణవాసుల కొరకా, స్త్రీలా, పురుషులా, పిల్లలా, కార్మికులా లేక సాధారణ ప్రజలందరి కొరకా అన్న విషయం ఎన్నుకునే విషయాన్ని, చెప్పే పద్ధతినీ, వాడే భాషను శైలిని నిర్దేశిస్తుంది.

మనం రాయదలచుకున్నది కేవలం ఒక వర్గానికి లేదా తరగతికి చెందిన ప్రజలకు సమాచారాన్ని అందించడమో ఒక విషయాన్ని గురించిన అవగాహనను కలిగించడమో లేదా వినోదాన్ని కల్పించడమో అయి ఉంటుంది. పై మూడింటిలో

ఏది అన్నది నిర్ణయించుకుంటే అది మనం ఎన్నుకున్న విషయానికి సంబంధించిన పరిశీలన పద్ధతిని, చేయవలసిన పరిశోధన పద్ధతిని నిర్ధారిస్తుంది.

అన్ని మాధ్యమాలకూ ఒకే పద్ధతిలో రాయడం వీలు కాదు. కనుక ఏ మాధ్యమానికో ముందు నిర్ణయించుకుంటే దానికి తగిన విధంగా విషయాన్ని వస్తువును మలచుకునే వీలుంటుంది. ఈ మూడు అంశాలను పరిశీలిద్దాం.

## 25.2 రచనకు ముందు ఆలోచించాల్సిన అంశాలు

ఉదాహరణకు మనం స్త్రీల కోసం రాయాలని నిర్ణయించుకున్న తర్వాత ఏ వర్గపు స్త్రీలు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. గ్రామీణ స్త్రీలయితే వారి పనిపాటలేమిటి? పట్టణ వాసులయితే ఉద్యోగినులా, కార్మికులా, గృహిణులా? వారు ఏ వర్గానికి చెందిన వారో తెలుసుకున్న తర్వాత ఆయా వర్గాల సగటు విద్యార్హత లేమిటి? ఏయే విషయాలలో వారికి సమాచారం అవసరమవుతుంది? ఏయే విషయాలలో వారికవగాహన ఉన్నది? దేని గురించి వారి అవగాహనను పెంచే అవసరముంది? మొదలయిన విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం. దీనివలన మనకు చాలా ఉపయోగాలున్నాయి. ముఖ్యంగా విషయాల ఎన్నిక, వాటి మీద వివరాల సేకరణ సులువవుతుంది. మనం రాయదలచుకున్నది ఏ స్థాయిలో రాయాలి, ఎలాంటి భాష, శైలి వాడవచ్చునో తెలుస్తుంది. ఆయా వర్గాల వారి గురించి వారి ప్రాపంచిక దృక్పథాన్ని గురించి తెలుసుకున్నందువలన వారికి ఆదరణ పాత్రమయేలాగ రాసే వీలు కలుగుతుంది.

ఇక ఉద్దేశం విషయం చూద్దాం. సమాచారాన్ని అందించడం, అవగాహనను పెంపొందించడం, వినోదాన్ని కలిగించడం అనే మూడింటిలో ఏదో నిర్ణయమయితే విషయాన్ని ఎలా చెప్పాలో మనకు తెలుస్తుంది. ఉదాహరణకు చిన్న పెద్ద పట్టణాలలో ఉద్యోగాలు చేసుకునే స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు ఎలా ఉంటాయి? అవి గృహ సంబంధమయినవా? పని చేసే చోటికి చెందినవా? వాటికి పరిష్కార మార్గాలు ఏమిటి? పురుషాధిక్య ప్రపంచంలో పోటీకి తట్టుకుంటూ నెగ్గుకు రావడానికి ఆ స్త్రీలు ఏం చేయాలి? ఇది అవగాహనకు చెందిన విషయం గనుక ఆ పద్ధతిలో మనం ముందుకు సాగవచ్చు.

మాధ్యమాల విషయానికొస్తే మనకు ప్రధానంగా కనిపించేవి పత్రికలు, రేడియో, టెలివిజన్‌లు.

పత్రికలలో దిన, వార, మాస పత్రికలు ఉంటాయి. ఒకప్పుడు వార, మాస పత్రికలలో స్త్రీల కోసం కొన్ని పేజీలు కేటాయించేవారు. ఈరోజుల్లో దిన పత్రికలు కూడా స్త్రీల కోసం కొన్ని పేజీలు కేటాయిస్తున్నాయి. అంతేకాక కొన్ని వార, మాస పత్రికలు ప్రత్యేకంగా స్త్రీల కోసమే ప్రచురించబడుతున్నాయి. దిన, వార పత్రికలలో స్త్రీల కోసం కేటాయించిన భాగాలు కదంబాలుగా ఉంటాయి. స్త్రీలకు సంబంధించిన రకరకాలయిన అంశాలను గుదిగుచ్చి ప్రచురించడం జరుగుతున్నది. ఉదాహరణకు 'ఈనాడు' దినపత్రికలో ప్రచురించే 'వసుంధర'లో కుట్లు అల్లికలు దగ్గరనుండీ, వైద్యం వృత్తి విద్యల వరకూ విషయాలుగా దర్శనమిస్తున్నాయి. అలాగే 'వార్త' దిన పత్రికలో ప్రచురించబడే 'చెలి' ప్రముఖులైన స్త్రీలతో పరిచయాలు, కళలు, స్త్రీ సమస్యలపై చర్చలు, వ్యాసాలు ప్రచురిస్తూ ఉంది. ఈ పేజీల్లో మనకు కొట్టవచ్చినట్లు కన్పించేది విషయాలను స్త్రీల దృక్కోణం నుండి చూడడం, స్త్రీ సమస్యలపై వారి వారి అభిప్రాయాలను వెలిబుచ్చేందుకు ఒక వేదికగా పని చేయడం.

అలాగే మిగిలిన పత్రికలలో స్త్రీలలో ప్రముఖులైన వారితో పరిచయాలు, వారి అనుభవాలు పది మందికి తెలియజేసి సగటు పాఠకుడు, శ్రోత, ప్రేక్షకుడూ వారి నుండి స్ఫూర్తిని పొందేలా చూడడం కూడా జరుగుతున్నది.

ఇక రేడియోలో ప్రసారమయ్యే స్త్రీల ప్రత్యేక కార్యక్రమాలు సంచికలుగా ప్రసారమవుతాయి. సాధారణంగా

BRAOU

సమాచారం, అవగాహనను పెంచడం, వినోదాన్ని కలిగించడం, వీటి ప్రధానోద్దేశం. అయితే కార్యక్రమంలోని వేరు వేరు అంశాలు వివిధ ప్రక్రియల రూపంలో ప్రసారమవుతాయి. వీటితో పాటు చర్చలు, పరిచయాలు, సమాచారాన్ని అందించేందుకు అవగాహన పెంచేందుకు ప్రసారం చేస్తున్నారు.

ఇక టెలివిజన్‌లో స్త్రీల కార్యక్రమాలు రేడియో కార్యక్రమాలను పోలి ఉంటాయి. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చెందిన మహిళలతో పరిచయాలు, స్త్రీల సమస్యలపై దృష్టి కేంద్రీకరించే కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు.

పై విషయాల మీద కొంత అవగాహన ఏర్పడ్డ తర్వాత కాబోయే రచయిత చేయవలసిన ముఖ్యమయిన పని చదవడం, వినడం, చూడడం. పత్రికలలో స్త్రీల గురించి, స్త్రీల కోసం ప్రచురించబడే వాటిని చదవడం వలన రేడియో కార్యక్రమాలను వినడం వలన అలాంటివే స్త్రీల కార్యక్రమాలు చూడడం వలన చాలా విషయాలు తెలుస్తాయి. ఆయా విషయాలలో వివరాలను సేకరించడం సులువవుతుంది. ఎలాంటి భాష, శైలి ఏ సందర్భంలో మిగిలిన వారు వాడుతున్నారో తెలుస్తుంది. ఈ పని రచయితలు ఎంత విస్తృతంగా చేస్తే అంతమంచిది.

**అభ్యాసం – 1**

మాధ్యమాలలో స్త్రీల కోసం ప్రత్యేకించిన అంశాలను గురించి వివరించండి?

BRAOU

## 25.3 స్త్రీల కోసం రాయడం

రచయితలు కాగోరే వారికి ముఖ్యంగా కావలసింది పరిశీలనా దృక్పథం, పరిశోధనాసక్తి. ఈ రెండూ లేకుండా రాయాలనుకోవడం నేల విడిచి సాము చేయడమే అవుతుంది. ఎన్నుకున్న విషయం గురించి లోతుగా తరచి చూసినందువలన వివరాలను సేకరించి, అవగాహన చేసుకున్నందువలన సాధికారికంగా రాయడం వీలవుతుంది. చేసిన కృషి రచనలలో ప్రతి ఫలించినపుడు ఆ రచయితను చదువరులు విశ్వసిస్తారు.

ఇక రాయడం అంటే స్త్రీలనుద్దేశించి వారి కోసం రాసేవారు ముఖ్యంగా గుర్తుంచుకోదగ్గ ఒకటి రెండు అంశాలు:

రచయితలు స్త్రీలైనా, పురుషులైనా స్త్రీల కోసం రాసేటప్పుడు ఉపదేశ ధోరణిలోనూ, పెద్దరికం వహిస్తూనూ రాయడం కూడదు. సమానత్వం ప్రాతిపదికగా అభిప్రాయాలు వెలిబుచ్చడం సమంజసంగా వుంటుంది. పొరపాటున కూడా పురుషాధిక్యాన్ని సూచించే పదజాలాన్ని, భావజాలాన్ని వాడకూడదు. ఇలా రాయడం మనం రాస్తున్న దానిలో మనకు పూర్తిగా నమ్మకం ఉన్నప్పుడు, స్త్రీ పురుష సమానత్వాన్ని మనం మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని రచయితలు గుర్తుంచుకోవడం అన్ని విధాలా మంచిది. ఆ వాదంతో నమ్మకం లేనపుడు రాయకపోవడమే మంచిది.

**అభ్యాసం - 2**

స్త్రీల కోసం రాసేప్పుడు రచయిత గుర్తుంచుకోవాల్సిన విషయాలేమిటి?

## 25.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ☞ రచన ప్రారంభించే ముందు రచయితలు ఎవరి కోసం, ఏ ఉద్దేశ్యంతో ఏ మాధ్యమానికి రాయదలచుకున్నాం అనే విషయాల్ని పరిశీలించాలి.
- ☞ రచయితలు కావాలనుకున్న వారు పరిశోధనా దృక్పథాన్ని, పరిశీలనాసక్తిని తప్పనిసరిగా అలవరచుకోవాలి.
- ☞ స్త్రీలకోసం రాసేప్పుడు పొరబాటున కూడా పురుషాధిక్యాన్ని సూచించే పదజాలాన్ని, భావ జాలాన్ని వాడకూడదు.

## 25.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. రచన చేయడానికి ముందు రచయితలు ఎలాంటి విషయాల్ని దృష్టిలో ఉంచుకోవాలి?
2. స్త్రీల కోసం రాసేప్పుడు రచయితలు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. పత్రికల్లో స్త్రీలకోసం కేటాయించిన పేజీలను పరిశీలించి విశ్లేషించండి?
2. రచయితలు కాగోరేవారు చేయాల్సినదేమిటి?

BRAOU

# భాగం: 26 నిరక్షరాస్యుల కోసం రాయడం

**విషయ క్రమం**


26.0 ఉద్దేశం

26.1 ప్రవేశిక

26.2 అక్షరాస్యత నిర్వచనం

**అభ్యాసం -1**

26.3 నిరక్షరాస్యులు

**అభ్యాసం -2**

26.4 అక్షరమాల, పరిచయ పద్ధతులు

**అభ్యాసం -3**

26.5 అక్షరాలు నేర్పడం

26.6 తెలుగు అక్షరాలు

26.7 రాతలో చిక్కులు

**అభ్యాసం - 4**

26.8 వయోజనుల సమస్యలు

26.9 మన గమ్యం

26.10 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

26.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 26.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు:

- అక్షరాస్యత అంటే ఏమిటో తెలుసుకుంటారు.
- అక్షరాల పరిచయ పద్ధతుల్ని గుర్తిస్తారు.
- తెలుగు రాతలో చిక్కులేమిటో గ్రహిస్తారు.
- వయోజనుల సమస్యల్ని నివారించగలుగుతారు

BRAOU

## 26.1 ప్రవేశిక

మన దేశంలో చదువు బొత్తిగా రాని వాళ్ళ సంఖ్య చాలా ఎక్కువే ఉంది. (సుమారుగా 30 కోట్ల మంది) వెనకబడిన వర్గాల్లో, స్త్రీలలో ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న వారిలో, గిరిజనులలో, నిరక్షరాస్యులు అధికంగా ఉన్నారు. దేశంలో నూరుశాతం అక్షరాస్యత సాధించడం అనేది భగీరథ ప్రయత్నమే అవుతుంది. ఒక్కొక్కసారి అంత ప్రయత్నం అవసరం లేదని కూడా అనిపిస్తుంది. అక్షరాస్యతను ఒక సాధనంగా ఉపయోగించగలిగిన వాళ్ళకే చదువు నేర్పటానికి ప్రయత్నించాలి కానీ, అందరినీ మూకుమ్మడిగా పొద్దుపొడిచే లోగా అక్షరాస్యులని చెయ్యాలనే ప్రయత్నాలు అసహజం. యువకులూ, చదువు సంధ్యలు సమృద్ధిగా ఉన్న ప్రదేశాల్లోని వాళ్ళూ, తమ తమ వృత్తుల్లో చదవడం, రాయడం అవసరమైన వాళ్ళూ, పట్టణాలకి చేరువలో ఉన్నవాళ్లా చదువు నేర్చుకోవడానికి ఎక్కువగా ఉత్సాహపడతారు. వాళ్ళ ఉత్సాహాన్ని నిర్మాణ యుక్తంగా స్థిరాక్షస్యతలోకి మలచడం రచయితల కర్తవ్యం. అందరికీ గాక అందుకోగలిగిన కొందరికే విద్యనేర్పటం అనేది ముఖ్యమని కొంతకాలంగా విద్యావేత్తలు వాదిస్తున్నారు.

ప్రభుత్వాలు అయితే రాజకీయ ప్రయోజనాల కోసం నూరుశాతం అక్షరాస్యత సాధించాలనే మంకుపట్టుతో ఉన్నాయి. ఈ మధ్య జాతీయ అక్షరాస్యతామండలి (National Literacy Mission) కూడా ఈ పంథాకే ఇప్పుడు మొగ్గుచూపుతున్నది. ఇది శుభసూచకం. ఎక్కువ విజయాలు సాధించడానికీ, సార్థకమైన ప్రయోజనాలు పొందడానికీ మార్గం సుగమం అవుతుంది. అంతేగానీ పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రం పని చెయ్యదు.

## 26.2 అక్షరాస్యత నిర్వచనం

అక్షరాస్యత అంటే చదువు కాదు. చదువు అంటే విద్యకాదు. విద్య అంటే విజ్ఞానమూ కాదు. అక్షరాస్యత లేని వాళ్ళలో జీవితాన్ని చదివే జ్ఞానం ఉంటుంది. సమస్యలను అర్థం చేసుకొనే సామర్థ్యం ఉంటుంది. అక్షరాస్యత అనేది ఒక పనిముట్టు మాత్రమే. ఉలితో బొమ్మలు చెక్కినట్లు, ఓనమాలనేవి రచనల్లో ఉన్న సందేశాన్ని విడమరచి చెప్పే సాధనాలు మాత్రమే. మనకి కావాల్సిన సమాచారం మౌఖికంగా చాలా దొరుకుతుంది. కానీ, పనిలో నైపుణ్యం పెంచుకోడానికీ, సమస్యలని తార్కికంగా ఆలోచించి పరిష్కార మార్గాలు తెలుసుకోవడానికీ కొత్తగా వస్తున్న జ్ఞానాన్ని అంతర్గతం చేసుకోవడానికీ పనికొచ్చే ఉపాయాలు, సదుపాయాలు రచనల్లోనే నిక్షిప్తమై ఉన్నాయి. చదువు ద్వారా మాత్రమే వీటిని సంపాదించగలం. కొత్తగా వస్తున్న టెలివిజను ద్వారా గూడా నేర్చుకోవచ్చు గానీ అది పదిలమూ గాదు, సురక్షితమూ గాదు. అందుకే చదువు కావాలి. పైగా, అక్షరాస్యులు అధికంగా ఉన్నచోట నిరక్షరాస్యులకు న్యూనతాభావం ఉంటుంది. సంగీతం వింటున్న వాళ్ళ మధ్య బధిరుల్లాగా వినోదాలు – చూసేవాళ్ళ మధ్య గుడ్డివాళ్ళలాగా వీళ్ళు తమకు లేని చదువు గురించి బాధపడడం సహజమే. చెవుడూ, గుడ్డితనమూ ఒక్కొక్కసారి మార్చలేనివి. కాని, నిరక్షరాస్యత అట్లాగాదు. ఇది నివారించవచ్చు, దీనిని జయించవచ్చు. అయితే కోరిక ఉండాలి, సదుపాయాలు అందుబాటులో ఉండాలి. పాఠాలు రాసేవాళ్ళు ఈ ముఖ్య విషయాలు మనసులో ఉంచుకోవాలి. ప్రయత్నలోపం లేనిచోట్ల విజయావకాశాలు మెండుగా ఉంటాయి. ఎడారిలో బావి తవ్వడం, అడవుల్లో హోటళ్ళు కట్టడం వ్యర్థ ప్రయాస. కాని, మనుషులు నీళ్ళు ఉపయోగించుకునే చోటే బావి తవ్వాలి. ప్రయాణికులు వచ్చే చోటే హోటళ్లు కట్టాలి. అలాగే చదువు మీద ఆసక్తి ఉన్న వాళ్ళకీ, దాన్ని తమ నిత్యజీవితంలో ఉపయోగించుకునే అవకాశం ఉన్నవాళ్ళకే అక్షరాస్యత అవసరం. దాన్ని వాళ్ళు నిలుపుకోగలిగేట్లు ప్రచారకులు చేయూతనివ్వగలిగిన చోట్ల మాత్రమే అక్షరాస్యత ఉద్యమం చేపట్టాలి. యునెస్కో నిర్వచనం ప్రకారం అయిదో తరగతి వరకు చదివిన వాళ్ళంతా అక్షరాస్యులే. వయోజనులు కూడా అయిదో తరగతి సామర్థ్యం సాధించగలిగితే అక్షరాస్యుల కింద జమ అవుతారు. మన జనాభా లెక్కల శాఖ ప్రకారం మాతృభాషలో

తన పేరు, ఒక వాక్యం రాయగలిగిన ప్రతి వ్యక్తినీ అక్షరాస్యుడనే అంటారు. ఇందులో ఎంత సామర్థ్యం ఉన్నదీ మనకి తెలియదు. వార్తాపత్రిక చదవగలిగే సామర్థ్యం ఉంటే చదువు వచ్చిన వాళ్ళ కిందే లెక్క. అయితే రాతలో ఎంత సామర్థ్యం ఉన్నది అనేది తెలియదు. అక్షరాస్యతలో ప్రమాణాలు లేవు. ఎవరి అవసరం కొద్దీ వాళ్ళు అక్షరాస్యతని ఉపయోగిస్తారు.

అక్షరాస్యత అంటే చెప్పే దాన్ని రాయగలగాలి, రాసినదాన్ని చదవగలగాలి, చదివిందాన్ని వివరించి చెప్పగలగాలి. దీన్ని సామాన్య కొలమానంగా తీసుకొని మనం అక్షరాస్యులు ఎవరో గుర్తించవచ్చు. ఈ సామర్థ్యం ఒక వయోజనునికి అబ్బేటట్లు చేయడమే మన ధ్యేయం.

**అభ్యాసం-1**

అక్షరాస్యత అంటే ఏమిటో మీ సొంత మాటల్లో అయిదు వాక్యాలకి మించకుండా తెలపండి.

## 26.3 నిరక్షరాస్యులు

మన దేశంలో ఇంకా 40 శాతం నిరక్షరాస్యులే. ఆంధ్రప్రదేశ్‌లో 35 శాతం ప్రజలు చదువు లేని వాళ్ళే. అయితే వీళ్ళలో కొన్ని తరతమ భేదాలున్నాయి:

(i) భుక్తి కోసం రోజూ కష్టం చేసుకునే ప్రజలు. వీళ్ళకి పనులు అయిన తర్వాత మనం చదువు నేర్పాలనుకోవడం మంచి ఆశయమైతే కావచ్చు గాని, ఆచరణ సాధ్యం గాదు. పని బదులు ప్రభుత్వం కూలినిచ్చి చదువు నేర్పుతామంటే అది సహజంగా ఉంటుంది కాని మన ప్రభుత్వాలు అందుకు సిద్ధంగా లేవు. సోషలిస్టు దేశాల్లో మాత్రమే అది చెయ్యగలిగారు. అధికార బలగం రాజకీయ వేత్తలు వనరులన్నింటినీ గుత్తకి తీసుకున్న ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ సమాజాల్లో ఇది సాధ్యం గాదు. కనుక ఈ బడుగు వర్గాలకీ వినోదరూపంలో వాళ్ళ హక్కుల గురించి, సంఘశక్తి గురించి, పిల్లలని అనారోగ్యం నుంచి కాపాడుకునే సూత్రాలగురించి మౌఖికంగా విద్య చెప్పడం ఎక్కువ మేలు చేస్తుంది. రోజూ పని చేసే కష్ట జీవులని సాయంకాలమో రాత్రో ఓనమాల పేరుతో గంట సేపు కూర్చోపెట్టడం హింస అవుతుంది గాని విద్య గాదు. వాళ్ళకి వయోజన విద్య, లౌకిక జ్ఞానమూ కావాలి గానీ రాతకోతలు గాదు. నక్సలైట్ల ఉద్యమం ప్రజల్లో పాదుకొనడానికి ఈ మౌఖిక ప్రచారమే ముఖ్య కారణం. ఏది ముందు ఏది వెనుక అనే విచక్షణ వాళ్ళ కుంది.

(ii) రెండో వర్గం ఆర్థికంగానూ, సాంఘికంగానూ, వెనుకబడ్డ వాళ్ళు. వీళ్ళకి నిత్య జీవితాధారంగా ఏదో ఒక వృత్తో, వ్యాసంగమో ఉంటుంది. అయితే వీళ్ళు చదువుకోలేని వాళ్ళు. కాని వీళ్ళకి అక్షరాస్యులం కావాలన్న ఆసక్తి అంతగా ఉండదు. అయితే, చదువు అంటే గౌరవం, వ్యామోహం. వీళ్ళకి అక్షరాస్యత కంటే చదువు ముఖ్యం. అంటే రాయవలసిన అవసరం లేకుండా కేవలం అక్షరాలని గుర్తించి చదవగలిగే

BRAOU

నైపుణ్యం మనం నేర్పగలిగితే అది ఘన విజయం. రాయడం అనేది ఒక విధమైన హస్త వ్యాయామం. వాళ్ళ చేతులు ఈ ప్రక్రియకి అలవాటు పడడం చాలా కష్టం. ఒకవేళ అబ్బినా అది నింపాదిగా సంపాయించుకొనే దశకి వచ్చే సరికి మన అక్షరాస్యత కార్యక్రమం అయిపోతుంది. కాబట్టి, వీళ్ళకి కేవలం చదవడం మాత్రమే నేర్పాలి. రాయడం గాదు. ఇలాంటి ప్రక్రియవలన వాళ్ళకి చదివే శక్తి పెరుగుతుంది. పైగా, సమాజానికి మరో మేలు జరుగుతుంది. వాళ్ళ పిల్లలని తప్పనిసరిగా బడికి పంపి చదివించుకోవాలనే దీక్ష పెరుగుతుంది. వాళ్ళ పిల్లలని బడినుంచి తప్పించి తమ పనుల్లో వినియోగించుకునే పాత అలవాటు మార్చుకుంటారు.

(iii) ఇక మూడో వర్గం ఉంది. వీళ్ళు ఒకటి రెండేళ్ళు బళ్ళకి వెళ్ళిన వాళ్ళు. చదవడం, రాయడం మరచిపోయి ఉంటారు. వాళ్ళతోటి వయస్కులంతా చదువు సంధ్యలు నేర్చుకొని కొద్దో గొప్పో ఉద్యోగాల్లో, సద్యోగాల్లో, పనుల్లో వ్యాపకాల్లో ఉండి ఉంటారు. వయస్సులో ఇంకా పిన్నలే. అంటే నేర్చుకొనే జిజ్ఞాస ఇంకా వీళ్ళల్లో ఉంది. అంతే గాదు, నేర్చుకోవాలనే ఆత్రత కూడా ఉంది. మనం విద్యా బాణం ఎక్కుపెట్టాల్సింది వీళ్ళకోసం. వీళ్ళలో విద్యాభ్యాసానికి కావాల్సిన లక్షణాలు కొన్ని ఉంటాయి. అవి:

★ వయసులో 15–35 మధ్య ఉంటారు.

★ చదవడం, రాయడం వాళ్ళకి నిత్యజీవితంలో అవసరం

★ చదువుకోసం, కొంత సమయం కేటాయించగలరు.

★ ఇరుగు పొరుగున చదువుకునే సామాగ్రి నిత్యం లభ్యమవుతుంది.

★ ఆసక్తి ఉంటుంది గాబట్టి తొందరగా నేర్చుకుంటారు.

★ నిక్షిప్తంగానో, పరోక్షంగానో కొంత అక్షరజ్ఞానం ఉంటుంది గాబట్టి దాని మీద ఆధారపడి వాళ్ళ నైపుణ్యాన్ని పెంచటం సులభం. మన గమ్యం ఈ వర్గం కనుక వీళ్ళకి అనువైన సామాగ్రిని తయారు చేయడం రచయితల ధ్యేయంకావాలి.

**అభ్యాసం –2**

అక్షరాస్యతని అంతర్గతం చేసుకొనే నైపుణ్యం (absorbability) ఎవరికి ఉంటుంది ?

BRAOU

## 26.4 అక్షరమాల పరిచయ పద్ధతులు

అక్షరమాలని పరిచయం చెయ్యటంలో అనేక పద్ధతులున్నాయి. ప్రతిదాంట్లోనూ కొన్ని సుగుణాలు ఉన్నాయి. కొన్ని అనర్థాలున్నాయి. ఏ పద్ధతి ఉపయోగించాలనేది ఆయా రచయితల నిర్ణయానికి వదిలెయ్యాలి. కొన్నిటి గురించి క్లుప్తంగా చర్చిద్దాం.

(i) సాంప్రదాయకంగా వస్తున్న అక్షరమాల: నూరు శాతం మంది ప్రజలకి ఇది చిరపరిచితమే. మనకి చదివించే అ ఆ ఇ ఈ ఋ, వీటి వెనుక ఒక సంజ్ఞా వివేచన ఉంది. నానుడిగా ప్రజల వాడుకలో అక్షరాల అన్వయం అంతర్గతంగా ఇమిడి ఉంది. అ, ఆ, ఇ, ఈ లు అచ్చులు. అవి పలకడంలో ఒక లయ ఉంది. క చ ట త ప లు అంగుటినుంచి పెదాల దాకా వస్తాయి ఉచ్చారణలో. చదువరులకి ఈ పరిజ్ఞానం అనూచానంగా ఉంటుంది గాబట్టి దీంతో పాఠాలు మొదలు పెట్టవచ్చు. పైగా చిన్న పిల్లల పాఠ్య పుస్తకాల్లో ఇదే క్రమం ఉపయోగిస్తారు గాబట్టి పాఠ్యాంశాలు తయారు చేయడం సులభం. అయితే దీంట్లో ఉన్న అసౌలభ్యం ఏమంటే అక్షరాలూ, వాటి గుణింతాలూ వచ్చిందాకా వాక్యాలు నేర్పటం సాధ్యం గాదు.

(ii) అక్షర సారూప్యం ఆధారంగా అక్షర మాలని నేర్పే పద్ధతి: ఉదాహరణకి ' అ 'కీ ' ఈ 'కీ రాతలో పోలిక లేదు. కానీ ' వ ' కీ ' మ 'కీ అక్షర సారూప్యం ఉంది. వయోజనులకి లిపి నేర్పటంలో మైసూరులోని భారతీయ భాషా సంస్థ ఈ పద్ధతినే ఉపయోగిస్తున్నది. సారూప్యం ఆధారంగా అక్షరాలని వివిధ వర్గాలుగా విభజిస్తారు.

| | |
|---|---|
| వ | మ |
| న | స |
| గ | ర |

BRAOU

ఈ విధంగా అక్షరమాలని విభజించి పాఠ్య సామాగ్రిని తయారు చేస్తారు. అయితే, ఇందులో ఒక చిక్కు ఉంది. సారూప్యం ఉన్న అక్షరాలతో ప్రజలందరికీ అందుబాటులో ఉన్న మాటలు పరిచయం చెయ్యటం కష్టం అవుతుంది. ఉదాహరణకి పైన ఇచ్చిన మూడు జతలలో ఎన్ని వాడుక పదాలు వస్తాయి?

మ న, న స, మ ర, న గ, మ గ, ఈ అక్షరాలు చదువరుల మనసులో నాటుకునేట్లు చేయడానికి కృతక పదాలు గూడా ఉపయోగించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

స మ , ర స, ర వ, గ ర, వ ర

ఇది చదువరులలో జుగుప్స కలిగిస్తుంది, అనేది ఒక వాదం, మరొకటేమిటంటే సారూప్యం ఉన్న అక్షరాలతోనే గుణింతం తప్పులు ఎక్కువ చేస్తారు అనేది. ఇది భారతీయ భాషల సంస్థలోనూ గుర్తించారు. అక్షరరూపాలు భిన్నంగా ఉన్నప్పుడే నేర్చుకోవడం సులభమవుతుందని మరో వాదన ఉంది.

(iii) మూడో పద్ధతి ఎక్కువగా వాడుకలో ఉన్న మాటలతో అక్షరాలని పరిచయం చెయ్యటం, సారూప్యం, భిన్నత అనే అంశాలు ఇందులో ఖాతరు చేయరు. ఈ పద్ధతిలో మాటల ద్వారా అక్షరాలని నేర్పుతారు.

ఉదాహరణకి

| | | | |
|---|---|---|---|
| కారు | బాట | పెళ్ళి | చావు |
| తల | నడక | సినిమా | ఈనాడు |
| పొలం | పని | డబ్బు | బ్యాంకు |
| కూలి | జీతం | ప్రయాణం | రైలు |
| కూతురు | పెళ్ళాం | టిక్కెట్టు | ఛార్జీ |

ఒక్కో పదాన్ని పదే పదే ఉపయోగిస్తూ ఈ మాటల ఆధారంగా వాక్యాలు రాయటం, రాయించటం వలన ఆయా అక్షరాల స్వరూపం స్థిరంగా నిలుస్తుంది, అనేది ఈ పద్ధతిలో ఉన్న బలీయమైన ఆకర్షణ. అయితే ఇందులో ఉన్న చిక్కేమిటంటే అక్షరాలను విడమర్చటం, గుణింతాలని గుర్తించటం, అక్షరాలని విడిగా ఉపయోగించటం నేర్పాలంటే కొంత ఆలశ్యమవుతుంది. అంటే ' మా ' అనేది ' మ + ఆ ' ల కలయిక అనే విచక్షణ చదువరులకి తొందరగా అబ్బదు. అయితే ఈ పద్ధతిని వయోజన శిక్షణలో చాలా చోట్ల ఉపయోగిస్తున్నారు.

**అభ్యాసం-3**

అక్షరమాలని నేర్పటానికి ఏ పద్ధతి బాగుంటుందో సకారణంగా వివరించండి.

## 26.5 అక్షరాలు నేర్పటం

పాఠాలు తయారు చేయటం ఎట్లా? ఒక పద్ధతిని లేదా రెండు మూడు పద్ధతుల మిశ్రమాన్ని ఎన్నుకొన్న పిదప లిపి పరిచయం, గుర్తింపు దగ్గర నుంచీ మాటల కూర్పు వాక్య నిర్మాణం వరకూ చదువరులకి నేర్పాలంటే భిన్న భిన్న మార్గాలున్నాయి. వాటిలో కొన్నిటి గురించి ఇక్కడ చర్చిద్దాం:

(i) తరతమరీతి – అంటే సులభంగా రాయటానికి వీలయే ఏకాక్షరాలనుంచీ మిశ్రమాక్షరాలని ఒక క్రమంలో ఉపయోగించటం.

BRAOU

ఉదాహరణకి

(a) వ మ ష న ద ప

(b) వా మే అ నీ దో పు

(c) న్న గ్ర మో ద్ధ పై మ్మ

(d) ప్ప వ్య ఢ్ఢ ఈ క త

ఈ విధంగా అక్షరాలు, గుణింతాలు ఒక క్రమపద్ధతిలో ఉపయోగిస్తూ పాఠాలు రాయవచ్చు.

(ii) ఆకర్షణీయరీతి – అంటే సులువుగా బొమ్మలు వేయగలిగిన మాటల్తో అక్షరమాలని నేర్పడం

ఆవు జెండా బస్సు

బండి కారు బొంగరం

అయితే ఇది చిన్న పిల్లలకు ఉపయోగించినంతగా వయోజనులకి వర్తించదు. అయినా, కొన్ని చోట్ల ఈ పద్ధతిని గూడా అవలంబిస్తున్నారు. ముఖ్యంగా అక్షరాస్యత అసలే లేని కొన్ని సమాజాల్లో.

(iii) మాటలనుంచీ – వాక్యాలకి లేదా వాక్యాల నుంచీ మాటలకి – ఈ రీతిలోనూ కొన్ని పుస్తకాలు తయారు చేశారు. అక్షరాలకి గానీ, మాటలకి గానీ సొంత ప్రతిపత్తి అంటూ లేదు. అవి వాక్యాల్లో ఉపయోగించినపుడే ప్రయోజనం సిద్ధిస్తుంది. ప్రజలు వాక్యాలు మాట్లాడుతారు గాని మాటలు గాదు, అక్షరాలు గాదు. ఈ ప్రాతిపదిక మీద చదువరులకి వాక్యాలతో లిపి నేర్పడం మొదలు పెడతారు. ఉదాహరణకి

నా పేరు వెంకయ్య

నేను సినిమాకి వెళ్తున్నా

దీని ఖరీదు ఎంత

ఈ వాక్యాలలోని మాటలను విడదీసి, అక్షరాలని విడమర్చి గుణింతాలని విభజించి లిపిని గుర్తించగలిగే విధంగా పాఠాలు రాయటం. ఈ రీతిని చాలా చోట్ల విజయవంతంగా ఉపయోగిస్తున్నారు.

## 26.6 తెలుగు అక్షరాలు

అక్షరమాలనీ, గుణింతాలనీ, సంయుక్తాక్షరాలనీ పరిచయం చేసేటప్పుడు కొన్ని నియమాలు పాటించాలి. సులభంగా రాయటానికి వీలయ్యే అక్షరాలనుంచీ క్రమంగా చేతి విన్యాసానికి కష్టంగా ఉండే అక్షరాలనీ, కంటిచూపుతో గుర్తించి అంతర్గతం చేసుకోవడానికి కష్టమైన అక్షరాలనీ, రాతలో అరుదుగా వచ్చే సంకేతాలనీ పరిచయం చేయాలి.

BRAOU

(i) గుణింతం నేర్పేటప్పుడు కొమ్ములూ, పొల్లులూ దీర్ఘాలూ ఒక హల్లుకి ఎక్కడిస్తారు అనేది ముందు నేర్పాలి. ఉదాహరణకి అన్ని అక్షరాలకీ తలకట్టు తీసి దీర్ఘం చేరుస్తాం.

క కా

గ గా (వగైరా)

కాని కొన్నింటికి కొంత మార్పు అవసరం. హల్లునే ముందు మార్చాలి.

ప ఎ పా

స ఎ సా

ష ఎ షా

అలాగే ' ఈ ' కారం ఇచ్చేటప్పుడు ' లీ ' పైన చేరుస్తాం. కాని 'య'కి ఈకారం చేర్చేటప్పుడు ఆకార దీర్ఘమిస్తాం.

య యి యీ / (దీన్నే ' యా 'తో పోల్చండి)

కొన్ని అక్షరాలకి రెండుచోట్ల గుణింత సంజ్ఞలను చేర్చటం జరుగుతుంది. ఏదో ఒక పద్ధతినే మొదట్లో ఉపయోగించాలి.

ట టే టే హ హో హూ

మ మీ మీ య యో

మ మో మూ

కింద గీత ఉన్న ప్రయోగాలు ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. హల్లులకి 'ఐ' కారం చేర్చినపుడు రెండు చిహ్నాలని ఉపయోగిస్తాం – ఒకటి కింద, మరొకటి పైన

టై పై కై (వగైరా)

(ii) తర్వాత సంయుక్తాక్షరాలు రాసేటపుడు రెండు రకాలుగా రాస్తాం. కొన్ని హల్లులకి వాటి పోటిలు రూపాలని తలకట్టు లేకుండా కింద రాస్తాం.

ద ద్ద ణ ణ్ణ

గ గ్గ హ హ్హ

BRAOU

ట ట్ట

జ జ్జ

డ డ్డ (వగైరా)

కొన్నింటికి స్వల్పమైన మార్పులు చేస్తాం, అంటే కుడి పక్క గీతను పొడిగిస్తాం.

చ చ్చ శ శ్శ

ప ప్ప స స్ప

బ బ్బ

కొన్ని హల్లులకి పూర్తిగా భిన్నమైన సంకేతాలుంటాయి

న ్న న్న

మ ్మ మ్మ

ర ్ర ర్ర

య ్య య్య

వ ్వ వ్వ

ల ్ల ల్ల

త ్త త్త

BRAOU

కొన్ని వాచకాల్లో వీటిని, కలగాపులకంగా పరిచయం చేస్తారు. (కృష్ణమూర్తి గారి 'తేలిక తెలుగు వాచకం చూడండి) ఇలా వాడడం వలన ఒక సుగుణం ఉంది. చదువరులలో తెలియని మాటా, పరిచయం లేని అక్షరమూ, జిజ్ఞాస కలిగిస్తాయి. ఆ జిజ్ఞాస కలగటమే వాళ్ళలో ఆసక్తి పెరుగుతుందనటానికి గుర్తు. కొత్త దాన్ని గురించి తెలుసుకోవాలనే కుతూహలం పెరగడం జ్ఞాన సముపార్జనకి తొలిమెట్టు. దాన్ని రచయితలు ప్రోత్సహించాలి. అయితే అది తగు మోతాదులోనే చెయ్యాలి; విచ్చల విడిగా కాదు.

కొన్ని కొన్ని అక్షరాలూ, సంకేతాలూ ఉచ్చారణలో అవసరం లేకపోయినా రచనా వ్యాసంగంలో విరివిగా ఉపయోగిస్తాం గనుక వాటిని గూడా తప్పనిసరిగా కొత్త చదువరులకి పరిచయం చెయ్యాలి. ముఖ్యంగా సంస్కృత పదాలూ, ఇంగ్లీషు పదాలూ, హిందూస్తానీ పధాలు రాయాల్సినపుడు ఇవి అవసరం అవుతాయి.

ఋ 'ృ' కృష్ణుడు

ఋషి ఋణం

పర్యాయంగా రుషి, రుణం అనడం కూడా కద్దు. అలాగే మహాప్రాణులు అంటే వత్తు అక్షరాలు గూడా

ఖ ఛ ఠ థ ఫ ఘ ఝ ఢ ధ భ

రాతలో తరచుగా వచ్చే మరో సంకేతం హలంతం. అంటే అచ్చులేని హల్లులు. ఇంగ్లీషు, హిందీ వంటి భాషల నుంచి తెచ్చుకున్న పదాల్లో ఇవి అవసరమవుతాయి.

త త్ కామత్

గ గ్ సింగ్ (వగైరా)

## 26.7 రాతలో చిక్కులు

ఏ రీతిలో ఎన్నుకున్నా రచయితలు కొన్ని ముఖ్య విషయాలు గమనికలోకి తీసుకోవాలి. చిన్న పిల్లల ఆకళింపు శక్తి/ పెద్ద ల (వయోజనుల) ఆకళింపు శక్తిలో ఉన్న తేడా, చిన్న పిల్లలకి బొమ్మలూ, పాటలూ, లయబద్ధంగా ఉండే మాటల ద్వారా నేర్పితే తొందరగా ఆకట్టుకొంటుంది. కాని పెద్దలకి మాటల దొంతర్లు కావాలి. వివిధ అక్షరాలతో పదాలని ఎలా కూర్చుతారు? పద విభజన చెయ్యటం ఎట్లా, మాటలని వాక్యాలలో ఎట్లా ఇమడ్చాలి వగైరా ప్రశ్నలు వయోజనులకి వస్తాయి. అది నేర్పటమే అక్షరాస్యత. ఉచ్చారణకీ, రాతకీ బోలెడు వ్యత్యాసం ఉంది. ఉచ్చారణలో సంధులు ఎక్కువ జరుగుతాయి. వాటిని రాతలో పెట్టేటప్పుడు జాగ్రత్త పడాలి. ఉదాహరణకి –

నేన్జెప్పిందిను = నేను చెప్పింది విను

అది పాచ్చొక్కా = అది పాత చొక్కా

మేకుంది = మేక ఉంది

మేకు ఉంది

వయోజనులు నేర్చుకొనేది అక్షరాలు గాబట్టి రచయితలు సంధి లేకుండానే పదాలని రాయాలి. కొన్ని వాక్యాల్లో వ్యతిరేకార్థాలు వస్తాయి. ఉదాహరణ

సారాయి తాగమన్నారు

1. సారాయి తాగము అని అన్నారు.

2. సారాయి తాగు (ము) అని అన్నారు.

అలాగే, మనం మాట్లాడేటప్పుడు ఉచ్చారణ, లయ (intonation) ఉంటుంది. దాని ద్వారా అది ప్రశ్నో, ఆశ్చర్యార్థకమో, ఆజ్ఞో, నినాదమో, మనకి తెలుస్తుంది. ఇది రాతలో సాధ్యం కాదు కాబట్టి మనం విరామ చిహ్నాలని ఉపయోగిస్తాం. ఇంగ్లీషు భాషా ప్రభావం వల్ల ఇవి మన భాషలోకి కూడా ప్రవేశించాయి.

BRAOU

ఉదాహరణకి

'నిన్న వచ్చావు' అనే వాక్యాన్ని అనేక అర్థాల్లో ఉపయోగించవచ్చు.

| | | |
|---|---|---|
| నిన్న | వచ్చావు | (ప్రకటన) |
| నిన్న | వచ్చావు? | (ప్రశ్న) |
| నిన్న | వచ్చావు! | (ఆశ్చర్యం) |
| నిన్న | వచ్చావు | (భేదం - ఈరోజు కాదు అనే భావం) |
| నిన్న | వచ్చావు | (వ్యతిరేకం రాకపోవడానికి) |

ఉచ్చారణలయలో ఉండే ఈ అర్థ భేదాలని రాతలో చూపించలేం కాబట్టి విరామ చిహ్నాలని వాడతాం. ఇది కొత్తగా చదువు నేర్చుకునే వయోజనులకి సులభంగా అర్థమయేటట్లు బోధించాలి. పాఠాలు తయారు చేయటంలో గమనించవలసిన మరో ముఖ్య విషయం ఏమంటే; మనం వాళ్ళకి భాష నేర్పటం లేదు, ఎందుకంటే వాళ్ళకి భాష తెలుసు. మనం నేర్పవలసింది లిపీ, అక్షర సముదాయం, మాటల కూర్పూ, వాక్య నిర్మాణమూ, రాతల్లో ఎలా ఉంటాయో తెలియచెప్పటమే.

రంగనాయకమ్మ గారన్నట్లు ''మాట్లాడే భాషకి ఒక 'సగటు వేగం' ఉంటుంది. మాట్లాడే భాషలో ఉండే సూత్రాలన్నింటినీ రాసే భాషలో పాటిస్తూ రాస్తే, దాన్ని చదివేటప్పుడు అది కూడా మాట్లాడే భాషలాగే సగటు వేగంతో వెళ్ళిపోతూ ఉంటుంది'' (మనం వాడుక భాషే రాస్తున్నామా? పుట 155)

పై పుస్తకంలో ఆమె పత్రికల్లోంచి ఉదహరించిన కొన్ని వాక్యాలూ, వాటి సవరణలూ చూడండి. ఇవి దీర్ఘాలకీ, విభక్తులకీ, పద సముచ్చయాలకీ సంబంధించినవి.

1. సీత, రేఖని పిలువు

   – సీతనీ, రేఖనీ పిలువు

2. భుట్టో భార్య, కుమార్తె పై ఆంక్షలు

   – భుట్టో భార్యపైన, కుమార్తెపైనా ఆంక్షలు

3. పసిపిల్లల గర్భవతులకు రోగ నిరోధక టీకాలు వేసే సురక్షా కార్యక్రమం

   – పసి పిల్లలకూ, గర్భవతులకూ టీకాలు వేసే కార్యక్రమం

4. జైల్‌సింగ్, ఎం.జీ. రామచంద్రన్‌పై పుకార్లు సృష్టించారు.

   –జైల్‌సింగ్‌పై , ఎం.జీ. రామచంద్రన్‌పై పుకార్లు సృష్టించారు.

5. చెప్పులు లేక బూట్లు వేసుకుంటారు.

BRAOU

– చెప్పులో బూట్లో వేసుకొంటారు.

పై వాక్యాల్లో రెండో వరుసలో ఉన్నవి వాడుక భాషా ప్రయోగాలు. మొదటి వరుసలో ఉన్నవి ఒక్కోసారి అపార్థానికి దారితీసే విధంగా కూడా ఉన్నాయి. ముఖ్యంగా నాలుగూ, అయిదూ చదవండి. నాలుగో దాంట్లో ఎం.జి. రామచంద్రన్ పై జైల్ సింగ్ పుకారు సృష్టించారు అనే అర్థం వచ్చే ప్రమాదం ఉంది. అయిదో దాంట్లో చెప్పులు లేని వాళ్ళు (పాపం) బూట్లు వేసుకొంటారు కాబోలు అనే అర్థం ధ్వనిస్తుంది. కాని చెప్పదల్చుకొన్నది అది కాదుగదా. అందుకే ఉచ్చారణలో లయద్వారా, దీర్ఘాల ద్వారా, మాటల వరవడిలో తగిన విరామం (pause) ఇవ్వడం ద్వారా స్పష్టంగా అర్థమయ్యే వాక్యలే రాతలో అపార్థాలకి దారితీసే విధంగా ఉంటాయి. వయోజనులకీ కొత్తగా అక్షరాస్యత నేర్చుకునే వాళ్ళకీ ఇలాంటి ఇబ్బందులు కలిగించడం పాడిగాదు. వీలయినంతవరకూ తప్పులని దిద్దుకొని రాయాలి. విద్యావంతులకి రాసినట్లు వర్ణనలూ, చిక్కుముడులు ఈ పుస్తకాల్లో నివారించాలి. ఇది గగనమేమీ కాదు, అభ్యాసమే కొరవ.

**అభ్యాసం –4**

చదువరులు ఎదుర్కొనే సమస్యని ఒకదాన్ని తీసుకొని ఎలా పరిష్కరించాలో వివరించండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 26.8 వయోజనుల సమస్యలు

వయోజనులు కొత్తగా అక్షరాలు నేర్చుకునేటప్పుడు వాళ్ళకి రెండు సమస్యలు వస్తాయి. ఒకటి లాఘవంగా అక్షరాలని పెద్ద లిపిలో రాస్తారు కాని క్రమేణా గొలుసుకట్టి రాయడం, పద విభజన చేయడం నేర్చుకోవాలి. మనకి అలవాటు గనుక ఇది చాలా సులువుగా కనిపిస్తుంది, కాని కొత్త వాళ్ళకి కొంచెం కష్టం. రెండు అక్షరాలని విడిగానో లేదా ఏదో ఒక పరిచయమున్న మాటలోనో తేలికగా గుర్తిస్తారు. కాని వాటినే భిన్నమైన మాటల్లో కూర్చి గుర్తించడం, రాయడం, నేర్వాలంటే కొంత అభ్యాసం కావాలి. ఈ రెండు సమస్యలని అధిగమించాలంటే పాఠాలు రాసేటప్పుడే పునశ్చరణకి ఎక్కువ కాలం వినియోగించాలి. రాసే వాళ్ళకీ, నేర్చే వాళ్ళకీ ఇది విసుగే. కానీ తప్పదు. చదువరుల ఆసక్తి అక్షరాస్యత మీద నిలవాలి, కొనసాగాలి, పెంపొందాలి, అంటే అనుక్రమం ఉండాలి. ఈ ఆసక్తిని వయోజనులలో కలిగించడంలోనే రచయిత సామర్థ్యం ఉంది.

## 26.9 మన గమ్యం

చదువరుల ఆసక్తిని రేకెత్తించాలంటే మనం రాసే పాఠాలు ఆకర్షణీయంగా ఉండాలి. నిత్య జీవితంలో చేసే వృత్తి, వ్యాపకాల గురించి పాఠాలు రాయాలి అనేది ఇప్పటి వరకూ అందరూ పాటించే సంప్రదాయం. కాని, వయోజనులకి అలాంటి పాఠాలు విసుగు కలిగిస్తున్నాయని పరిశోధకులంటున్నారు. కొన్ని మాటలు గుర్తింపు కోసం నిత్య జీవితంలోంచీ తీసుకోవచ్చు. కానీ కొత్త చదువరుల కుతూహలం నిలవాలంటే నూతన ప్రయోగాలు అవసరం. ఎరువు, పొలం, దుక్కి, ఆవు, కూలి, ఊరు, పొలిమేర లాంటి పదాలు అవసరమే కాని మనం పాఠాల ద్వారా పొలం ఎట్లా సాగు చెయ్యడం, ఎరువు ఎంత వెయ్యాలి వగైరా నేర్పాలనుకోవడం పొరపాటవుతుంది. నేటి వయోజనులని ఎక్కువగా ఆకర్షించేవి సినిమాలు,



BRAOU

రాజకీయాలూను. వీటి చుట్టూ అల్లిన పాఠాలు వాళ్ళని బాగా ఆకట్టుకొంటాయి. ఇంకా చదవాలనే ఆసక్తిని పెంపు చేస్తాయి. అలాగే సామాన్య ఆరోగ్య సూత్రాలు, పిల్లల పెంపకం, ఆహార నియమాలు వగైరా స్త్రీలని ఎక్కువగా ఆకర్షిస్తాయి అని అనేక పరిశోధనలలో తేలింది. అన్నిటికంటే చదువరులలో ఆలోచన రేకెత్తించే పాఠాలు, కార్యోన్ముఖులుగా (activistic) మరల్చే పాఠాలు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయి. సారాయికి వ్యతిరేకంగా స్త్రీలను ఉత్సాహ పరచిన 'సీతమ్మ కథే' ఇందుకు ప్రబల నిదర్శనం. ఇక మూడోది: చదువుకి ఒక ప్రయోజనం ఉండాలి, దాన్ని నేర్చుకొన్న ప్రజలు ఏదో ఒక రూపంలో ఉపయోగించుకోవాలి. అక్షరాస్యత నేర్వగానే సంతకం చేయగలుగుతారు కాని జీవితంలో నిత్యం తారసిల్లే సమస్యలని పరిష్కరించుకోగలరా? కేలండరు చదవడం, గడియారం చూసి సమయం ఎంతో తెలుసుకోవడం, బస్సుల, రైళ్ళ రాకపోకలు చదవడం, కరపత్రాలు, లేబుళ్ళు చదివి తెలుసుకోవడం మచ్చుకి కొన్ని ఉదాహరణలు. ఇంకా బాంకులో ఎకౌంటు తెరవడం, వార్తాపత్రిక చదవడం చుట్టు పక్కలకి ఉత్తరాలు రాయడం, అప్పు పత్రం చదివి అర్థం చేసుకోవడం వగైరా. రెండో శ్రేణి ప్రయోజనాలు. పుస్తకాలు, నవలలు, కథలు చదవడం, విజ్ఞాపన పత్రాలు రాయడం, పిల్లలకి చదువులో సాయం చేయడం అనేవి ఉన్నతమైన ప్రయోజనాలు. ఈ స్థితికి రాగలిగినపుడే అక్షరాస్యత జీవితకాలం నిలుస్తుంది. అక్షరాస్యత మొదలు పెట్టిన ప్రతి వయోజనుడూ ఈ ఉన్నత శ్రేణి విద్యవరకూ వస్తాడని ఆశించడం అత్యాశే అవుతుంది. కాని, రెండో శ్రేణి వరకూ చాలామందినీ, మూడో శ్రేణి కి కొంతమందినీ తేగలిగితే మన కృషి సఫలీకృతమైనట్లే.

## 26.10 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- అక్షరాస్యత అంటే చెప్పేదాన్ని రాయగలగాలి. రాసిన దాన్ని చదవగలగాలి. చదివిందాన్ని వివరించి చెప్పగలగాలి.
- ఆంధ్రప్రదేశ్‌లో 35 శాతం నిరక్షరాస్యులైన ప్రజలున్నారు. వీళ్ళలో కొన్ని తరతమ భేదాలున్నాయి.
- అక్షరమాలను పరిచయం చేయడంలో అనేక పద్ధతులున్నాయి.
- ఉచ్చారణకీ, రాతకీ వ్యత్యాసం ఉంది. అందువల్ల బోలెడు చిక్కులు రాతలో ఎదురవుతాయి.
- చదువరులలో ఆలోచన రేకెత్తించి, వారిని కార్యోన్ముఖుల్ని చేయగల పాఠాలను రాయడం వల్ల వయోజనుల్లో జాగృతిని తీసుకురావచ్చు.

## 26.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. అక్షరాస్యతను నిర్వచించండి.
2. అక్షరమాలను పరిచయం చేసే పద్ధతులను పేర్కొనండి.

**II 15 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. రాతలో ఎదురయ్యే చిక్కులేమిటి.
2. వయోజనులకు రాసే పాఠాలు ఎలా ఉండాలి.

BRAOU

# భాగం : 27 కొత్తగా అక్షరాస్యులైన వారికోసం రాయడం

**విషయ క్రమం**

27.0 ఉద్దేశం

27.1 ప్రవేశిక

27.2 కొత్తగా అక్షరాస్యులైన వారికి పాఠాలు రాయడంలో గమనించాల్సిన అంశాలు

**అభ్యాసం – 1**

27.3 పాఠాల్లో నూతనత్వం, ప్రయోజనత్వం

27.3.1 స్వంత విషయాలు

27.3.2 పత్రికల్లో సంగతులు

27.3.3 ఆకళింపు శక్తిని పరీక్షించడం

27.3.4 క్లుప్తీకరించే నేర్పుకోసం

27.4 ఉత్తరాలు రాసే పద్ధతి

**అభ్యాసం – 2**

27.5 సామాజిక సందర్భాలకనుగుణంగా రచనా పద్ధతులు

27.5.1 మనీ ఆర్డరు ఫారం

27.5.2 ప్రామిసరీ నోటు

**అభ్యాసం – 3**

27.6 భాషకి సంబంధించి కొన్ని అంశాలు

27.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

27.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 27.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను చర్చించగలుగుతారు:

- కొత్తగా అక్షరాస్యులయిన వారికి పాఠాలు ఎలా రాయాలి?
- పాఠాల్లో కొత్తదనం, ప్రయోజనత్వం ఎలా కన్పించాలి?
- వివిధ సందర్భాలకనుగుణంగా రచనాపద్ధతుల్లో మెలకువలు ఎలా పాటించాలి?

BRAOU

## 27.1 ప్రవేశిక

కొత్తగా అక్షరాస్యులంటే కనీసం 240 గంటలు తరగతిలో కూర్చొని గాని లేదా బయటగానీ విజ్ఞానం సంపాదించిన వాళ్ళు. వాళ్ళకి రాయడం కంటే చదవడంలో ఎక్కువ లాఘవం ఉంటుంది. విద్యావంతులు గూడా 90% చదవడానికి (కేవలం 10% రాతకోతలకి) తమ అక్షరాస్యతని వినియోగిస్తారు. పత్రికా వ్యాసంగం, రచన, బోధన చేసేవాళ్ళు 50 శాతం వరకు రాతకోతలకి తమ నైపుణ్యాన్ని ఉపయోగిస్తారు. కాని ఇది కొత్తగా అక్షరాస్యులైన వారి విషయంలో వర్తించదు. అయితే, చదవగా చదవగా వాళ్ళలో అక్షరాల గుర్తింపూ, పద విభజనా జ్ఞానం పెరుగుతుంది. చదువుకీ రాతకీ ఇంత తేడా ఉండడం వల్లనే బాగా చదువుకొన్న వాళ్ళు కూడా గుణింతాల్లో తప్పులు చేస్తుంటారు. అంతేకాదు, కొన్ని మాటలు కూడా తప్పుగా ప్రయోగిస్తుంటారు. రాత నిత్యం అభ్యాసం లేని విద్యావంతులందరికీ కూడా ఇది వర్తిస్తుంది. అందుకని కొత్తగా అక్షరాస్యులైన వాళ్ళకి పాఠాలు రాసేటప్పుడు దీన్ని దృష్టిలో పెట్టుకొని పాఠ్య సామాగ్రి తయారు చేయాలి.

## 27.2 కొత్తగా అక్షరాస్యులైన వారికి పాఠాలు రాయడంలో గమనించాల్సిన అంశాలు

మన పాఠం చదువరులలో కుతూహలం కలిగించాలి. ఆసక్తిని పెంచాలి. నిత్య జీవితంలో పనికొచ్చే లేదా తెలుసుకోవాల్సిన ప్రయోజనాత్మకమైన అంశాలు రాయాలి. వీటిలో కొంత హాస్యం, కొన్ని కార్టూనులు గూడా జోడించవచ్చు. వాడుకలో ఉండే సామెతలూ, నుడికారాలూ విరివిగా ఉపయోగించాలి. ప్రతి పాఠానికీ ఒక ప్రయోజనం ఉండాలి. అందులోని ముఖ్యాంశాలు చదువరి గ్రహించాడా లేదా అనేది నిత్యం పరీక్షించి తెలుసుకోవాలి. ఇక రాత విషయంలో మన విద్యార్థులకి కీలకమైన విషయాలు అబ్బినయ్యా లేదా అనేది మానిటరు (పర్యవేక్షణ) చెయ్యాలి. అంటే వాళ్ళ చేత అభ్యాసాలు రాయించాలి. చేసిన తప్పులను సరిదిద్దాలి. తెలియజెప్పాలి. పాఠంలో భాగంగా కొత్త పదాల్ని పరిచయం చెయ్యడం కూడా ఒక ముఖ్యమైన ధ్యేయం. అందరికీ అన్ని పదాలూ అందుబాటులో ఉండవు. భాషని నూతన ప్రయోజనాల కోసం వినియోగించేటపుడు కొత్త కొత్త పదాలు భాషలో ప్రవేశిస్తాయి. ఉదాహరణకి ఇతర భాషా పదాలు, (శాటిలైట్, గెలటిన్, ఘెరావ్) సాంకేతిక పదాలు, (ఉపగ్రహం, దూరవిద్య) పర్యాయపదాలు, (పర్యవేక్షణ/ మూల్యాంకనం; దూరదర్శిని/ దుర్భిణి) సామాన్య పదాలకి సాంకేతికార్థాలు, (రాజకీయ అస్పృశ్యులు) మాండలికాలు: (తోడు/ సెవరి పేయడం) సంస్కృత సమాసాలు, (విప్లవ సారధి, వ్యూహరచన) వగైరా. అర్థం కావేమోనన్న అనుమానం వచ్చినప్పుడు కొత్త పదాలని వర్ణనాత్మకంగా వివరించాలి. వాచకాలు తయారు చేసేటప్పుడు అన్ని ప్రాంతాలకీ ఒకే పుస్తకం రాస్తే అందులో స్థానికత్వం లోపిస్తుంది. అందుకని జిల్లాకో పుస్తకం కాకపోయినా ఒక్కో ప్రాంతానికి ఒక్కో పుస్తకం తయారు చేయడం వాంఛనీయం, అందులో స్థానిక విశేషాలు, నైసర్గిక వివరాలు, స్థల పురాణాలు, ప్రజల సమస్యలు వగైరా విస్తారంగా ఉటంకించడానికి అవకాశం ఉంటుంది.

**అభ్యాసం –1**

వార్తాపత్రికల్లో తరచుగా వచ్చే గుణింతం తప్పులని పదింటిని ఏరి రాయండి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

BRAOU

## 27.3 పాఠాల్లో నూతనత్వం, ప్రయోజనత్వం

పాఠకుల్లో ఆసక్తిని పెంచే, రాతనైపుణ్యాన్ని పదిలపర్చే, సొంత ప్రయోజనాలకి ఉపయోగించుకొనే పాఠ్యసామాగ్రి తయారు చేయడం చాలా అవసరం. కేవలం నీతులు, పరిశుభ్రత, ప్రజాస్వామ్యం, హక్కులు మొదలైన వాటి గురించి ఇంతవరకు మీరు చూసిన అన్ని పుస్తకాల్లోనూ ఉండే ఉంటాయి. పాఠాల్లో నూతనత్వం సృష్టిస్తేనే పాఠకులని రంజింప చేస్తాయి; మనసుని ఆకట్టుకొంటాయి. అలాంటి కొన్ని ఉదాహరణలు ఇక్కడ చూద్దాం.

### 27.3.1 స్వంత విషయాలు

ప్రతి వ్యక్తికీ సొంత విషయాల మీద ఉన్న ఆసక్తి ఇతర విషయాల మీద ఉండదు. ఉదాహరణకి ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల వివరాల పట్టీ రాసుకొన్నాడనుకోండి. అందులో ఏమేమి ఉంటాయి:

1. తన పెళ్ళి జరిగిన రోజు
2. పిల్లలు పుట్టిన తేదీలు
3. తన డబ్బు లావాదేవీలు, తేదీలు
4. బయట ఊళ్ళలో ఉన్న తన చుట్టుపక్కల చిరునామాలు
5. కరెంటు, గ్యాస్ సిలెండర్ల నెంబర్లు, సైకిలు, స్కూటరు నెంబర్లు వగైరా
6. బాంకులో అకౌంటు నెంబరు తదితర వివరాలు

ఇలాంటివే గదా! ఇవి ఎలా రాయాలో నేర్పటం, ఒక ముఖ్యమైన భాగం.

BRAOU

### 27.3.2 పత్రికల్లో సంగతులు

పత్రికల్లో ప్రతిరోజూ అనేక కొత్త సంగతులు చదువుతుంటాం. అందులో కొన్ని ఏరుకొని నూతన విద్యావంతులకి సులభంగా గ్రాహ్యమయ్యే విధంగా రాసి పఠన సామాగ్రి తయారు చేయవచ్చు. మచ్చుకి కొన్ని ఉదాహరణలు ఈ కింద ఇస్తున్నాం. రచయితలు ఇలాంటి వాటిని కొంత మార్చవలసి ఉంటుంది.

1. చిలిపి సేల్స్‌మెన్ (బట్టల అంగడి వాడు)

| వి.ఎ. కుమార్ | విజయవాడ |
|---|---|

చిలిపిసేల్స్‌మెన్?

చీర చూపిస్తూ 'ఇది కట్టిచూపినా అందంగానే ఉంటుంది, విప్పి చూపినా అందంగానే ఉంటుంది' అని చెప్పేవాడు.

2. పార్లమెంటు సభ్యుడైన సినిమా నటుడు

**పార్లమెంటుకెళుతున్న మోహన్‌బాబు:** తెలుగు సినిమా రంగంనుండి రాజకీయాల్లోకి వెళ్ళే ఒరవడిలో మరో హీరో పేరు చేరింది. తెలుగు దేశం టికెట్‌మీద రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు మోహన్‌బాబు. గతంలో అదే పార్టీ తరఫున రావు గోపాలరావు రాజ్యసభ సభ్యుడు అయ్యారు. జగ్గయ్య, కృష్ణ, జమున లోక్‌సభ సభ్యులుగా పని చేశారు. ప్రస్తుతం తెలుగు సినీరంగం నుండి పార్లమెంటులో కూర్చునే ఏకైక వ్యక్తి మోహన్ బాబు.

మోహన్ బాబు ఎన్టీఆర్‌కి వీరాభిమానినని చెప్పుకుంటాడు. ఆయన హీరోగా మోహన్‌బాబు తీసిన 'మేజర్ చంద్రకాంత్' నిజానికి ఎన్టీఆర్‌కి కొత్త రాజకీయ ఊపునిచ్చింది. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం తరఫున ప్రచారంలో పాల్గొన్నాడు మోహన్‌బాబు. తిరిగి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని ఐదేళ్ళ క్రితంనుండే నమ్మకంగా చెప్పిన వ్యక్తి మోహన్‌బాబు ఒక్కడే. పార్టీ విధేయత, వ్యక్తిగత అభిమానం కలవగా మోహన్‌బాబుకి పార్లమెంటు సభ్యుడయ్యే అపూర్వ మైన అవకాశం చిక్కింది. ఈ సందర్భంలో అతను చెప్పిన విశేషాలు.

★ ఇలాంటి అవకాశం దొరుకుతుందనుకున్నారా?

సినీ హీరోని అవుతాననుకోలేదు. డ్రిల్‌మాస్టరుగా వున్న వాడిని సినీరంగానికి వచ్చాను. ఇదీ అలాగే. అంతా ఆ పైవాడి దయ.

★ గత జీవితం తలచుకుంటే ఏమనిపిస్తుంది?

డ్రిల్‌మాస్టర్ ఉద్యోగం కోసం 500 లంచం అడిగిన కౌన్సిలర్‌ని తలచుకుంటే కోపం వస్తుంది. లంచం తీసుకొని ఉద్యోగం ఇప్పించలేని ఆ మనిషిని చూస్తే కసి కలుగుతుంది.

★ ఇటువంటి సంఘటనలు చూస్తే మంచితనం మీద నమ్మకం పోదా?

అదే సమయంలో ఏ ప్రతిఫలం ఆపేక్షించక సహాయం చేసిన మా లెక్చరర్ బి.ఆర్. రెడ్డి గారి లాంటిమంచివారున్నారు కదా.

★ మీకు కోపం ఎక్కువట కదా?

నిజమే. ఆ విషయం అందరికీ తెలుసు. అయితే నాది అర్థంలేని కోపం కాదు. షూటింగ్‌లో జరిగే లోపం వల్ల కోపం వస్తుంది.

★ ఇతర తెలుగు హీరోలలా హిందీ సినిమా చేస్తారా?

చేయాలనే ఉంది. కానీ చేయను. ప్రస్తుతం వున్న పరిస్థితి బాగుంది.

★ పార్లమెంట్ సభ్యుడుగా ఏమి చేయాలనుకుంటున్నారు మీరు?

తెలుగుదేశంకి తలవంపులు తెచ్చే పనిమాత్రం చేయను – అని చెప్పాడు మోహన్‌బాబు.

BRAOU

3. పొడుపు కథ

జనవరి నెల ప్రశ్న

తల్లికీ, తండ్రికీ తేడా ఏమిటి?

ఉత్తమ సమాధానం:

తల్లివి 'నొప్పులు'! తండ్రివి 'తిప్పలు'!!

పంపినవారు:

గెంటేల చక్రవర్తి, బులుసుపాడు

4. రచయిత చతురత

ప్రసిద్ధ రచయిత మార్క్‌ట్వైన్‌ను ఆయన పొరుగింటి ఆసామి అడిగాడు.

ట్వైన్‌గారూ! మేయర్ పదవికోసం పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులపై మీ అభిప్రాయం ఏమిటి?

ఆ ఇద్దరిలో ఒకరు మాత్రమే ఆ పదవికి ఎన్నికవుతున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది! అని చెప్పాడు ట్వైన్.

BRAOU

5. టాటా కంటే గొప్పవాడు (స్వాతి 28.4.95)

కిళ్ళీకొట్టు సుందరం గర్వంగా అన్నాడు గోవిందంతో

'ఇప్పుడు నాకు టాటా అంత ఆస్తి వస్తే టాటాకంటే గొప్పవాడినైపోతాను'

'అదేమిటి అతడికున్నంత ఆస్తి వస్తే అతడితో సమానమవుతావుగాని అతడి కంటే గొప్పవాడివెలా అవుతావు'

'భలే వాడివి. నాకు కిళ్ళీబడ్డీకూడా ఉంది. టాటాకు ఇది లేదుగా మరి'

– మాధవి, అడవిపూడి.

### 27.3.3 ఆకళింపు శక్తిని పరీక్షించడం

ఈ క్రింది వార్తను చదివిన తర్వాత ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

*సంప్రదాయ పద్ధతిలో ఘన విజయాలు సాధించిన రైతు.*

# సంప్రదాయ పంథాలో హరిత విప్లవం

*ప్రకృతిపై సడలని విశ్వాసం ఓ ఆంధ్ర రైతుకు బ్రహ్మాండ మైన దిగుబడులనిస్తోంది*

**అమరనాథ్ కె. మీనన్.**

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని గూడూరు గ్రామంలో పచ్చటి పొలాల మధ్య ఉన్న ఆ మామిడిచెట్టుకు ఓ ప్రత్యేకత ఉంది. దాని వయసు 100 సంవత్సరాలకు పైమాటే. కానీ ఈ వేసవిలో కూడా దానికి 22,000లకు పైగా కాయలు కాస్తాయని అంచనా. అంటే 'రికార్డు స్థాయిలో దిగుబడి సాధించి నందుకు నేను మరో యోగ్యతాపత్రాన్ని సంపాదించుకున్నట్లే లెక్క' అని దాని యజమాని గొరివర్తి నరసింహ రాజా యాదవ్ ధీమాగా చెప్పారు.

వరి, ఇతర ధాన్యాల వంటల విషయంలో కూడా ఆయన ఇదే రకమైన దిగుబడులు సాధించగలుగుతున్నారు. దాంతో యాదవ్ మిగిలిన రైతు లందరికీ ఆదర్శ ప్రాయు డుగా మారారు. ఆయన కుటుంబ ఆధ్వ ర్యంలోని 300 ఎకరాల వ్యవసాయ క్షేత్రం ఉత్పాదకతకు సరైన నమూనాగా మారింది. బ్రహ్మాండమైన దిగుబడులతో ఆయన ఇప్ప టికే ఎన్నో రికార్డులు స్థాపించారు. దిగుబడిలో కొంత భాగాన్ని రైతులకు వంగడాల కింద విక్రయిస్తూ ఉంటారు. యాదవ్‌ను రాజాగారు అని అందరూ ఎంతో గౌరవంగా సంబోధిస్తారు. ఆయన కృషి పండిట్ బిరుదు పొందని కృషి పండి ట్. వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇప్పుడు అటువంటి బిరుదులనిచ్చే ఆచారాన్ని మానుకుంది. వ్యవసాయం భారీ సాంకేతిక పరిజ్ఞానానికి పర్యాయపదంగా మారిన తరుణంలో, ఆయన దృఢచిత్తంతో సహజ సేద్య విధానాలనే అనుసరిస్తూ వస్తున్నారు. ఉదాహరణకు, మామిడి చెట్టుకు దాని ఎండిపోయిన ఆకులు, పశువుల పేడ, వాటి మూత్రంతో కలిపిన సేంద్రియ ఎరువే పోషక పదార్థం.

> **యాదవ్ ఎప్పటికప్పుడు కొత్తరకం వంగడాలు ఉపయోగిస్తుంటారు. కొందరు రైతులు తరచు పంటలు మార్చినంత తేలికగా ఆయన సేద్యపు విధానాలు మార్చేస్తుంటారు.**

సహజ సేద్య విధానంపై ఆయనకున్న నమ్మకం, పాడి పరిశ్రమ, వ్యవసాయ రంగంలో ఆయన కుటుంబానికి ఉన్న రెండు శతాబ్దాల అనుభవం యాదవ్ విజయ రహస్యం అని చెప్పవచ్చు. వీటికి తోడు భూమిని దున్నడంలో ఆధునిక పద్ధతులను అనుసరించడం, వ్యక్తిగత పర్యవేక్షణ ఆయన ఇబ్బడి ముబ్బడిగా దిగుబడులు సాధించడానికి తోడ్పడుతున్నట్లు కనిపిస్తోంది. 'భారీ మూల్యం చెల్లించకుండా ఎవరూ ప్రకృతితో దాని సొంత భూసార సంరక్షణ, కీటక సంహార వ్యవస్థలతో పోరాడలేరు' అని యాదవ్ అన్నారు. రసాయనిక ఎరువులను, కృత్రిమ క్రిమిసంహారక మందులను మితంగా ఉపయోగించాలని ఆయన సలహా ఇచ్చారు.

యాదవ్ సాధించిన విజయాలు అన్నీ ఇన్నీ కావు. పూన బాస్మతి -1 రకంగా పిలుస్తున్న ధాన్యంతో ఆయన ఖరీఫ్ పంట కాలంలో హెక్టార్‌కు 7500 కిలోల దిగుబడిని, రబీ పంట కాలంలో హెక్టార్‌కు 8347 కిలోల దిగుబడిని

BRAOU

సాధించారు. రాష్ట్రంలో ధాన్యం పండించే రైతులలో బాస్మతి రకం ఇంకా బాగా ప్రాచుర్యం పొందలేదు. కానీ, యాదవ్ సాధించిన దిగుబడి మిగిలినవారు కూడా ఆయన మార్గంలో నడవడానికి నాంది పలికింది. ఇంతకు ముందు ఏడు రకాల ధాన్యంతో (హెక్టార్‌కు 9నుంచి 12 టన్నుల చొప్పున) అధిక దిగుబడులు సాధించారు. రెండు రకాల మినుములు వేసి హెక్టార్‌కు 3 టన్నుల చొప్పున, వేరు సెనగ వేసి హెక్టారుకు 4నుంచి 5 టన్నుల చొప్పున దిగుబడి సాధించారు. రైతులు ఒకే ఏడాదిలో మూడు రకాల పంటలు వేసి, అధిక దిగుబడులు సాధించడం అసాధ్యం అనే అపోహను కూడా యాదవ్ పటాపంచలు చేశారు.

సేద్యం ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కడం కూడా ఆయన విజయానికి మూలాధారం అయింది. యాదవ్ కొత్త రకం వంగడాలు ఉపయోగిస్తూ వచ్చారు. కొందరు రైతులు తరచు పంటలు మార్చినంత తేలికగా ఆయన సేద్యపు విధానాలు మారుస్తూ వచ్చారు. ఆయన వేసిన పంటలే ఆయనకు గౌరవ మన్ననలను తెచ్చిపెట్టాయి. ప్రభుత్వం నుంచి కూడా పురస్కారాలు లభించేట్లు చేశాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పాలక వర్గంలో, భారతీయ ధాన్య అభివృద్ధి మండలిలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధి మండలిలో ఆయనకు సభ్యత్వం లభించింది. 'విత్తనాలు, విషయ పరిజ్ఞానం, మెరుగుపరచిన సాంకేతిక విధానాలను తోటి రైతులతో పంచుకోవడం ద్వారా వారికి ఎంతో సహాయపడుతున్న ఆదర్శప్రాయుడాయన' అని కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీ పార్థసారథి భాస్కర్ అన్నారు.

BRAOU

వర్తమాన సేద్యపు విధానాలు యాదవ్‌కు గిట్టవు. అయితే 'వంటగదిలో గ్యాస్ స్టవ్‌పై వంట చేయడానికి అలవాటు పడిన మహిళ, ఇంధనం బాగా ఆదా అవుతుందని చెప్పి కట్టెలు, బొగ్గులు, పిడకల మిశ్రమాన్ని ఉపయోగించమని చెబితే ఉపయోగిస్తుందా' అని ఆయన అన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. వందలాది మంది రైతులు, అభిమానులు గూడూరు వచ్చి వెడుతూండడం పరిపాటి. వారిలో చాలామంది తాము కూడా రసాయనాలు, సేంద్రియ ఎరువుల మధ్య సరైన సమతూకాన్ని పాటించడం ద్వారా యాదవ్ మాదిరిగా అధిక దిగుబడులు పొందవచ్చుననే నమ్మకంతో తిరిగి వెడుతుంటారు. 'స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులనే ఎరువుగా ఉపయోగించుకునే సహజ సేద్య విధానాన్నే ప్రకృతి కోరుకుంటుంది' అని ఇటీవల ఈ విధానాన్ని అవలంబించడం ప్రారంభించిన సిపిఐ మాజీ శాసనసభ్యుడు సి. ప్రభాకర్ చౌదరి అన్నారు. యాదవ్ గ్రామాన్ని సందర్శించడం కోసం ఆయన రాజమండ్రి నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చారు. 'ఆకులు, పుడకలు, పేడతో సహా దేనినీ వ్యర్థం చేయనవసరం లేదని యాదవ్ నిరూపిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎం.వి. రావు కూడా ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'అందుబాటులో ఉన్న అవకాశాలన్నింటినీ ఉపయోగించుకోవడం ద్వారా వ్యవసాయ క్షేత్రం నుంచి వీలైనంత దిగుబడిని రాబట్టాలన్నదే ఆయన ఇచ్చే నినాదం' అని ఆయన అన్నారు.

వ్యవసాయం ఆషామాషీ వ్యవహారం కాదు. దానిని విజయవంతంగా నిర్వహిస్తున్న వారిలో ఒకరుగా యాదవ్ గర్విస్తున్నారు. ఆయన జీపు నెంబరు ప్లేటుపై ఈ కింది పదాలు తళతళ మెరుస్తూ ఉంటాయి. 'జాతీయ సృజనాత్మక రైతు అవార్డు విజేత'.

ప్రశ్నలు:

1. మామిడిచెట్టుకి ఎరువుగా నరసింహరాజు గారు ఏమి వాడారు?

2. ఆయన పండించే వరి పంట పేరు ఏమిటి?

3. యాదవ్‌గారి వ్యవసాయ పద్ధతి చూడడానికి వచ్చిన రాజకీయ ప్రముఖుని పేరేమిటి?

4. అయన ఎకరానికి ఎన్ని కిలోల వరిని పండిస్తారు?

5. నరసింహరాజుగారి మామిడి చెట్టుకి ఎన్నేళ్ళుంటాయి? ఈ సంవత్సరం ఎన్ని పండ్లు కాచింది?

6. గూడూరు ఏ జిల్లాలో ఉంది? ఆ జిల్లా కలెక్టరుగారి పేరేమిటి?

7. గౌరిపర్తి నరసింహరాజు యాదవ్ గారికి వచ్చిన బిరుదేమిటి?

8. ఆయనలాగే రైతులందరూ సహజమైన ఎరువులు ఉపయోగిస్తూ పంటలు పండించటానికి వీలవుతుందా? మీరు చేస్తారా?

### 27.3.4 క్లుప్తీకరించే నేర్పుకోసం

పాఠకుల ఆకళింపు శక్తిని పరీక్షించడానికి క్లుప్తీకరణ కూడా ఉపయోగిస్తుంది. అంటే, అనేక వివరాలతో ఉన్న పెద్ద పాఠాన్ని కుదించి రాయడం, విషయలోపం లేకుండా రాయడం. ఈ కింది వార్తని ముఖ్యాంశాలు వదలకుండా తగ్గించి రాయండి.

BRAOU

## అవాస్తవ చిత్రం

కాంగ్రెస్ (ఐ)లో ప్రత్యర్థి వర్గాలు రెండూ పోటాపోటీ బలప్రదర్శనలకు మే 19వ తేదీనే ముహూర్తంగా ఎంచుకోవడంతో దేశ రాజధానిలో కటౌట్ ఆర్టిస్టులకు భలే గిరాకీ తగిలింది. అయితే, కాంగ్రెస్(ఐ)లో అంతఃకలహాల గురించి ఈ ఆర్టిస్టులలో కొందరికి బొత్తిగా తెలియదు. కానీ, అందుకు వారిని తప్పుపట్టలేము. ముఖ్యంగా పార్టీలో అసమ్మతీయులకూ, విధేయులకూ మధ్య తేడా గురించి ఏమీ తెలియని ఒక ఆర్టిస్టు, అసమ్మతి వర్గం నియోగించినవారిలో ఉన్నాడు. అసమ్మతి వర్గ నాయకుల కటౌట్‌ను తయారు చేసి పార్లమెంట్ హౌస్ వద్ద ఒక కూడలిలో ఏర్పాటు చేసే పనిని ఆ ఆర్టిస్టుకు అప్పగించారు. 'ఒకసారి కాంగ్రెసువాది అయితే జీవితాంతం కాంగ్రెస్ వాదే' అన్న సూత్రంలో బహుశా ఆ ఆర్టిస్టుకు నమ్మకం ఉన్నట్లుంది. అందుకే పార్టీ అధ్యక్షుడు పి.వి. నరసింహారావు భారీ కటౌట్‌ను తయారు చేసి, ఆయనకు రెండు పక్కలా అర్జున్ సింగ్, ఎన్‌డి తివారీల చిత్రాలను కూర్చారు. అర్జున్ – తివారీ వర్గానికీ, నరసింహారావుకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఆర్టిస్టుకు తెలిసినట్లు లేదు. ఇతగాడు తయారు చేసిన కటౌట్‌ను చూసి కాంగ్రెస్ (ఐ) అగ్ర నాయకుల మధ్య సయోధ్య కుదరబోతున్నదని ఎవరైనా అనుకొంటే ఆశ్చర్యపడవలసిన పని లేదు. తాల్‌కటోరా స్టేడియంలో అసమ్మతీయుల సదస్సు ప్రారంభం కావడానికి రెండు రోజుల ముందు ఈ చిత్రంలో పొరపాటును

సరిదిద్దే యత్నం జరిగింది. నరసింహారావు కటౌట్‌లో పై భాగాన్ని తొలగించి, ఆ స్థానంలో రాజీవ్ గాంధీ చిత్రాన్ని అతికించారు. అయినా, ఈ కటౌట్‌లో అపశ్రుతి కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే ఉంది. రాజీవ్ గాంధీ ధోవతి ధరించినట్లు కటౌట్ ప్రదర్శించింది. రాజీవ్ ధోవతితో బయట తిరగడం ఎవరూ చూసినట్లు దాఖలా లేదు.

ఇండియా టుడే

## స్కానింగ్ వల్ల లాభాలు

పుట్టబోయే బిడ్డ ఆడో, మగో తెలుసుకోవాలనే కుతూహలం కడుపుతో ఉన్న ప్రతి స్త్రీకి సహజం. పూర్వపు రోజుల్లో అయితే పుట్టబోయేది ఎవరో తెలుసుకోవడానికి, నవమాసాలూ నిండి ప్రసవం అయ్యేదాకా ఆగాల్సి వచ్చేది. అయితే అభివృద్ధి చెందుతున్న వైద్య శాస్త్ర ఫలితంగా లభించిన స్కానింగ్ ద్వారా పుట్టబోయేది ఎవరో ముందుగానే తెలుసుకునే అవకాశం లభిస్తోంది. స్కానింగ్ ద్వారా ఇదొక్కటే కాకుండా ఇంకా చాలా ప్రయోజనాలున్నాయంటున్నారు లండన్‌లోని 'కింగ్స్ కాలేజ్ హాస్పటల్', డాక్టర్లు.

క్రోమోజోముల్లో ఏమైనా లోపాలుంటే ఇప్పటివరకు అమ్నియో సెంటసిస్, సివిఎస్ వంటి పరీక్షల ద్వారా మాత్రమే తెలుసుకోవడానికి అవకాశం ఉండేది. కానీ ఈ రెండు పరీక్షల వల్లకూడా గర్భస్థ శిశువుకు ప్రమాదం కలిగే అవకాశాలెక్కువ. ప్రొఫెసరు కిప్రోస్ నికొలైడ్స్ పుణ్యమా అని ఎటువంటి ప్రమాదం లేకుండానే ఇప్పుడు పరీక్ష చేయించుకునే వీలు కల్గింది.

ఈ విధానంలో గర్భవతిగా ఉన్నప్పుడు 10 నుంచి 14 వారాల మధ్య స్కానింగ్ తీయించుకోవాలి. దీనివల్ల క్రోమోజోముల్లో ఏమైనా లోపాలుంటే తెలుసుకునేందుకు వీలవుతుంది. (అంతేకాకుండా ప్రసవం అవడం కష్టమయ్యే స్త్రీలకు సివిఎస్ అమ్నియో సెంటిసిస్ పరీక్షల అవసరం తప్పదేమో కూడా ఈ విధానంలో తెలుసుకోవచ్చు). స్కానింగ్ ద్వారా గర్భస్థ పిండం మీద నల్లటి ప్రదేశం ఉన్నట్లు గుర్తిస్తే క్రోమోజోముల్లో లోపం (క్రోమోజోమల్ ఎబ్‌నార్మాలిటీ) అదే వయసు కల్గిన మిగిలిన స్త్రీల కంటే 10% ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయి. చల్లటి ప్రదేశం లోనివారిలో ఈ లోపం ఉండే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ స్కానింగ్ ద్వారా అన్ని క్రోమోజోముల్లోని అసాధారణతలను గుర్తించలేకపోయినా పైనచెప్పిన విధంగా కనీసం కొన్ని లోపాలనైనా గుర్తించవచ్చునట. అంతేకాకుండా స్కానింగ్ చేయించుకోవడం ద్వారా 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ'ని కూడా గుర్తించవచ్చునట. కాబట్టి గర్భవతిగా నున్నప్పుడు కనీసం ఒక్కసారైనా స్కానింగ్ చేయించుకోవడం మంచిదంటున్నారు-డాక్టర్లు.

స్కానింగ్ చేయించుకోవడం వల్ల స్త్రీలు ఆందోళనకు గురయ్యే అవకాశాలున్నా, ఏవైనా లోపాలుంటే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఈనాడు, 13.5.95

BRAOU

## 27.4 ఉత్తరాలు రాసే పద్ధతులు.

ఉత్తరం రాయడం మనకి ఎప్పుడో ఒకప్పుడు అవసరం అవుతుంది. ఉత్తరాలు రాయటమనేది ఒక కళ అని చేయి తిరిగిన రచయితలు, పాత్రికేయులు అంటారు. కాని, మన దైనందిన వ్యవహారాల్లో అంత ప్రావీణ్యం అక్కర్లేదు. అయితే, ఉత్తరాలు రాయడంలోని ప్రధానాంశాలన్నింటినీ పాఠకులకి నేర్పవలసి ఉంటుంది.

1 జూన్ 1995

హైదరాబాద్.

ప్రియమైన అన్నయ్యకి,

మీరంతా క్షేమంగా ఉన్నారని భావిస్తాను. ఇక్కడ మేమంతా క్షేమమే.

అసలు సంగతేమిటంటే – వదిన గారి అన్నయ్యగారి అబ్బాయికి ఈ సంవత్సరం పెళ్ళి చేసే ఆలోచన ఉందా? చదువు అయిపోయి ఉద్యోగంలో చేరాడు కనుక ఈ సంవత్సరం చేస్తారేమో కనుక్కోమని మీ మరదలు పోరుతోంది. మా అమ్మాయి సంగీతకి ఈ ఏడుగాకపోతే పై యేడయినా పెళ్ళి చేయాలనే ఆలోచన ఉంది. కొత్త చోటు కంటే తెలిసిన చోటయితే మంచిదని నా ఆలోచన గూడా. మరి దీన్ని గురించి నువ్వూ, వదినా మాట్లాడి వస్తారా? ఇక్కడ మా స్నేహితులకి, తెలిసిన వాళ్ళ దగ్గరనుంచి ఏవో కబుర్లు వస్తున్నాయి. కాని నికరంగా దేన్ని గురించీ తరచి కనుక్కోలేదు.

ఈ సంవత్సరం హైదరాబాదులో ఎండలు విపరీతంగా ఉన్నాయి. వానలు ఎప్పుడు పడతయ్యా అని నోళ్ళు తెరచుకు చూస్తున్నారు జనం.

ఏ విషయమూ వెంటనే తెలియపర్చవలసినది.

ఇట్లు

వెంకట్రావు.

అడ్రసు:

శ్రీ చుక్కపల్లి రామకోటయ్యగారు,

కంచర్ల పాలెం,

తెనాలి మండలం – 522 202

గుంటూరు జిల్లా.

BRAOU

ఇందులో ముఖ్యాంశాలేమిటి?

1. కుడిచేతివైపు తేదీ, స్థలం.
2. రెండో పంక్తిలో ఎడమవేపు ఉత్తరం అందుకొనేవారి పేరు/ బంధుత్వం
3. పేరా మొదట్లో పలకరింపులు
4. తర్వాత విషయం
5. చివరి పేరాలో లోకాభిరామాయణం.
6. తర్వాత ముగింపు
7. కొసకు రాయవలసిన చిరునామా. అందులో పిన్‌కోడ్ చాలా ముఖ్యం.

పాఠకుల చేత అనేక విషయాల మీద ఉత్తరాలు రాయించాలి.

BRAOU

**అభ్యాసం-2**

I. ఒక వ్యాపార ప్రకటన ఆధారంగా ఆకలింపు అభ్యాసం తయారు చేయండి.

II. కరెంటు తీగలు వదులుగా ఉండటం వలన తరచు కరెంటుపోతూ ఉంది. కరెంటు అధికారికి రాసే ఉత్తరంలో ఎలాంటి ముఖ్య విషయాలుండాలో తెలియజేస్తూ ఒక పిటిషను రాయండి.

III. వార్తాపత్రికల్లో వచ్చే కార్టూన్లనీ, రాజకీయ వార్తలనీ వయోజనులకు ఉపయోగించే రీతిలో ఒక పాఠ్యక్రమం తయారు చేయండి.

## 27.5 సామాజిక సందర్భాల కనుగుణంగా రచనా పద్ధతులు

మానసోల్లాసానికి పనికి వచ్చే సాహిత్యం ఉన్నట్లే లౌకిక అవసరాలకి పనికొచ్చే రాతకోతలు కొన్ని ఉంటాయి. ఇవి ప్రతిరోజూ, ప్రతి వ్యక్తికీ అవసరం కాకపోవచ్చు. కాని, అవసరం వచ్చినపుడు తనంత తానే చేసుకోగలిగిన సామర్థ్యం ఉండాలి. అలాంటి సామర్థ్యం నేర్పటమే పాఠ్య రచయితల ధ్యేయం, కర్తవ్యం. దూరవిద్యలో స్వవిద్య (self learning) ఎంత ముఖ్యమో, వయోజన విద్యలో గూడా అంతే ముఖ్యం. స్వావలంబన పూర్తిగా రాకముందే లేదా అది గట్టిగా నిలబడక ముందే వయోజన కార్యక్రమాలు ముగుస్తుంటాయి. అయితే మన పాఠకుడు పాత పాఠాలు తిరగవేస్తే ఆ పాఠం అతనికి తిరిగి వచ్చేటట్లుండాలి. అంటే పాఠాలే రెఫరెన్సు గ్రంథాలవుతాయన్న మాట. అందుకని లౌకికావసరాలకి పనికి వచ్చే అంశాలని మనం నేర్పాలి.

### 27.5.1 మనీ ఆర్డరు ఫారం

మన జీవితంలో ప్రతిరోజూ రాతకోతలు పని ఉండేది కొద్ది మందికే. అయితే, ఎప్పుడో ఒకసారి మన పాఠకులకి కూడా కొన్ని అవసరాలు ఏర్పడుతుంటాయి. చిన్న వాటికి కూడా ఇతరుల మీద ఆధారపడవలసి వస్తుంది.

ఉదాహరణకి – పిల్లలను స్కూల్లో చేర్పించాలంటే ఒక అప్లికేషను ఫారం నింపాలి; రైలు ప్రయాణం అవసరమైనప్పుడు రిజర్వేషను చేయించాలి;

| | | |
|---|---|---|
| 1. పంపిస్తున్న సొమ్ము ఎంత? అక్షరాల్లో | : | అయిదు వందలు |
| 2. పంపిస్తున్న సొమ్ము ఎంత? అంకెల్లో | : | 500/- |
| 3. ఎవరికి? వాళ్ళ చిరునామా | : | పెండ్యాల ప్రసాదరావు<br>రూమునెం: 176, వివేకవిన్యాస యూనివర్సిటీ హాస్టలు<br>ఆంధ్రయూనివర్సిటీ, వాల్తేరు |
| 4. పిన్‌కోడ్ | : | 530 003 |
| 5. పంపిస్తున్న వారి సంతకం | : | పెండ్యాల నాగేశ్వర రావు |
| 6. డబ్బు అక్షరాల్లో | : | అయిదు వందలు |
| 7. డబ్బు అంకెల్లో | : | 500/- |
| 8. డబ్బు అక్షరాల్లో | : | అయిదు వందలు |
| 9. తీసుకున్న వారి సంతకం | : | పెండ్యాల ప్రసాదరావు |

BRAOU

10. సాక్షి సంతకం : కాటూరి నారాయణరావు

11. పంపినవారి పేరు, చిరునామా : పెండ్యాల నాగేశ్వర రావు

(ఇదేమనకు రశీదుగా వస్తుంది) దొమ్మేరు (పోస్టు), పశ్చిమ గోదావరి జిల్లా,

12. పిన్‌కోడ్ : 531 052

13. డబ్బు తీసుకున్న వారి సంతకం :

14. డబ్బు పంపేవాళ్ళు రెండు ముక్కలు ఉత్తరం రాయవచ్చు)

చిరంజీవి ప్రసాద్‌కి,

నువ్వు బాగా చదువుతున్నావని ఆశిస్తున్నా. మా అందరి ఆశలు నీ మీదనే. శ్రద్ధగా చదివి మంచి మార్కులతో పాసవాలి. అమ్మ, అక్కయ్య అందరూ క్షేమం. డబ్బు అందిన వెంటనే ఉత్తరం రాయి. పొదుపుగా వాడుకో. ఈ సంవత్సరం పంటలు అంతబాగా లేవు. ఆరోగ్యం జాగ్రత్త.

ఆశీస్సులతో

నాన్న.

BRAOU

### 27.5.2 ప్రామిసరి నోటు

డబ్బు తెచ్చుకునే అవసరం గానీ, ఇచ్చే అవకాశం గానీ ప్రతి మనిషికీ ఎప్పుడో ఒకసారి రాక తప్పదు. ఇచ్చి పుచ్చుకోవడం సాధారణంగా రాత పత్రం మీద జరుగుతాయి. చిన్న మొత్తాలని చేబదుళ్ళు అంటారు. ఇది తరచుగా జరుగుతుంటుంది. మాట మీద నమ్మకంతో ఇది నడుస్తుంది. కాని పెద్ద మొత్తంలో పైకం తీసుకోవాలన్నా, ఇవ్వాలన్నా రాత అవసరమే మరి. అలాంటి రాత పత్రాలు ఎలా ఉంటాయో, అందులోని ముఖ్యాంశాలేమిటో తెలుసుకోవలసిన అవసరం ప్రతి వారికీ ఉంది. తనకి కాకపోయినా, ఇతరులకి సలహా ఇవ్వటానికైనా పనికివస్తుంది. లౌకిక జ్ఞానం అనే లౌకిక జీవితంలో చాలా అవసరం.

ఆన 1995 సంవత్సరం మే నెల 24వ తేదీన చేబ్రోలు మండలం బుడంపాడు గ్రామ కాపురస్తుడు వాసిరెడ్డి కృష్ణయ్యగారి కుమారుడు సూర్యనారాయణ రావు గార్కి డిటో గ్రామ కాపురస్తుడు పెమ్మసాని వెంకయ్య గారి కుమారుడు కోటేశ్వర రావు వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు.

నా అక్కర నిమిత్తం అనగా వ్యవసాయపు ఖర్చులకు గాను మీ తావున అప్పుగా పుచ్చుకున్న రొక్కం రూ. 2000/- అక్షరాలా ఇరువది వందల రూపాయలు మాత్రమే. ఇందుకు వడ్డీ నెల ఒకటికి నూటికి రూ. 2.00 అక్షరాల రెండు రూపాయలు వడ్డీ చొప్పున అయ్యే

అసలు ఫాయిదాలు మీకు గాని మీ అర్డరు పొందిన వారికి గాని అడిగినపుడు ఇవ్వగలవాడను. ఇది నా సమ్మతిన వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు.

ఇందుకు సాక్షులు

1. చేకూరి కాశయ్య వ్రాలు

2. చావా ఉమామహేశ్వర రావు వ్రాలు.

సంతకం

పెమ్మసాని కోటేశ్వర రావు వ్రాలు

దస్తూరి పోగుల రుద్రయ్య వ్రాలు.

ప్రామిసరీ నోటులో గమనించాల్సిన ముఖ్యాంశాలు.

1. ఇచ్చిన వాళ్ళ తీసుకొన్న వాళ్ళ పేర్లు, తండ్రుల పేర్లు, ఊరి పేరు.

2. తేదీ

3. తీసుకున్న మొత్తం అంకెల్లో, అక్షరాలలో

4. అవసరం

5. అప్పుకి వడ్డీ

6. అడిగినపుడు ఇస్తాను అనే హామీ

7. సాక్షుల సంతకాలు

8. తీసుకొన్న వారి సంతకం స్టాంపు మీద

9. నోటు వ్రాసిన వారి పేరు సంతకం

ఇన్ని వివరాలుంటేగాని అది కోర్టులో చెల్లదు. అందుకే మన వాళ్ళంటారు నోటికి ప్రాణం వ్రాలు అని. అప్పు ఇచ్చే వాళ్ళు, పుచ్చుకునే వాళ్ళు గూడా గమనించవలసిన అంశాలవన్నీ. అనుశ్రుతంగా మన గ్రామాల్లో చెల్లుబడి అయ్యే వాగ్దాన పత్రం నమూనా ఇది. ఇందులో మీరు గమనించే ఉంటారు. చాలా ఇంగ్లీషు పదాలు, పార్శీ పదాలు, గ్రాంధిక శైలిలో పదాలు, పదబంధాలు, చారిత్రక పదాలు ఉన్నాయి. ఇవన్నీ ఉంటేనే దానికి ప్రామాణీకత్వం అబ్బుతుందని మన ప్రజల నమ్మకం. కోర్టు వారు గూడా ఈ విధంగా రాసిన పత్రాలనే రుజువులుగా తీసుకుంటారు.

BRAOU

**అభ్యాసం – 3**

స్థానికంగా ఉన్న ఒక పౌర సమస్య మీద వార్తాపత్రికకి లేదా పౌర అధికారికి ఒక విన్నపం రాయండి?

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

## 27.6 భాషకి సంబంధించి కొన్ని అంశాలు

భాషలో ఏ పదం ఏ పదంతో జతగా వస్తుందో, ఏ పదభాగం ఏ పదంతో కూడి వస్తుందో మనకి తేలిగ్గానే అర్థమవుతుంది. అయితే, కొత్తగా అక్షరాస్యులైన వారికి రాతలో వీటిని గుర్తించటం, వీటి రాకను గుర్తించి ఊహించటం కష్టంగాదు గాని అది ఆలోచనారహితంగా రాదు. అది వాళ్ళకి అలవాటు అయ్యేట్లు చెయ్యాలంటే కొన్ని అభ్యాసాలు చేయించాలి. ఇక్కడ అలాంటి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

**1. తీరిన భయం (ఎస్.గంగప్ప)**

''శాంతా! శాంతా!'' అంటూ పిల్చారు హడావిడిగా బజారు నుంచి □ వచ్చిన సీతారామయ్య. ''వస్తున్నానండి'' అంది శాంతమ్మ లోపల్నుంచే. సీతారామయ్య ఈజీఛైర్లో విశ్రమిస్తుండగా శాంతమ్మ వచ్చింది.

''పిల్చారాండి''

''ఊ! ఇంకా ఏం జేస్తున్న □? ముహూర్తం □ పోతుంది.

''అంతా తయారై □ అమ్మాయిని □ చేస్తున్నాం''

''తొందరగా □ ముహూర్తం దాటిపోతే ప్రయోజనమేమి?

''నిజమేగాని, ఎందుకో □ భయంగా ఉందండీ''

'ఓసి పిచ్చిదానా! నీళ్ళలో నిండా మునిగాక □? గాలేమిటి? అంతటికీ □ ఉన్నాడు. ఏమొచ్చినా అనుభవించాలి గదా! ఇంత అనుభవించాం. ఇక .....

''ఆ! మీ మెట్ట □ కేం లెండి. అనుభవించే వాళ్ళకి తెలుస్తుంది బాధ''

''ఔనౌను అంతా నీవే అనుభవించినట్లు!''

''కాదనుకోండి. మీరు మాత్రం? పాపం......

''ఆ! ఇకచాలు కాని మాటల్లో □ అసలు విషయం మరచిపోతున్నావ్.''

''కాదండీ. పర్యవసానం ఎట్లుంటుందో అని నా □ దడ దడలాడి పోతూంది. సరే''

వెళ్ళిపోయింది శాంతమ్మ. '' అంతటికీ భగవంతుడే ఉన్నాడు'' నిట్టూర్చి అన్నాడు సీతారామయ్య.

పైన ఇచ్చిన కథా భాగంలో కొన్ని మాటలు, అక్షరాలు వదిలి వేశాం – అర్థం చెడకుండా సహజంగా ఇమిడేట్లు ఆ ఖాళీ గళ్ళని పూర్తి చెయ్యండి.

BRAOU

### 2. అడుసుమిల్లి శ్రీనివాసరావు (1901-1981)

ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిమానేసి, 1920లోనే ప్రజా ఉద్యమాలలో చేరిన త్యాగమూర్తి. దాదాపు యాభై ఏళ్ళపాటు నిర్విరామంగా కృషిచేసి వేటపాలెం, సారస్వత నికేతనాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ గ్రంథాలయంగా తీర్చిదిద్దిన కార్యశీలి. అయ్యంకి వారికి చేదోడు వాదోడుగా ఎన్నో జిల్లా స్థాయి సభలు నిర్వహించారు. రాష్ట్ర గ్రంథాలయ సంఘంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1939-42 ప్రాంతాలలో ఆంధ్ర గ్రంథాలయం - త్రైమాస పత్రికను ఆంధ్రాంగ్ల భాషలలో నిర్వహించారు. ఎన్నో గ్రంథాలయాల స్థాపనకు కృషి చేశారు.

### 3. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి (1826-1953)

గోల్కొండ పత్రిక సంపాదకులుగా చారిత్రిక విమర్శకులుగా ప్రసిద్ధులు ప్రతాపరెడ్డిగారు.... మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. న్యాయశాస్త్రం చదివారు. 1926లో గోల్కొండ పత్రిక ప్రారంభించి అందు గ్రంథాలయ సమాచారానికి విశేష ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణాలో గ్రంథాలయాల పునరుద్ధరణలోను తోడ్పడ్డారు. నిజాం ప్రభుత్వం గస్తీనిషాన్ - 53 అని నూతన గ్రంథాలయాల స్థాపన, సభల నిర్వహణపై నిషేధం ప్రకటించినప్పుడు ప్రతాపరెడ్డిగారు తీవ్రంగా ప్రతిఘటించారు. కొంతకాలం పాటు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉన్నారు.''గ్రంథాలయోద్యమము'' అనే గ్రంథాన్ని రాశారు.

### 4. శ్రీ పాతూరి నాగభూషణం (1907-1987)

గుంటూరు జిల్లా పెదపాలెం గ్రామంలో 1930లో ఆర్యబాల సమాజ గ్రంథాలయాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. ఈ గ్రంథాలయం తరపున బోటులో గ్రంథాలయ సేవ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 1935లో గ్రంథాలయ శాస్త్రంలో శిక్షణ పొందారు. 1938లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ కార్యదర్శిగా ఎన్నికై అయ్యంకి పిదప ఆ పదవిలో దాదాపు 35 సంవత్సరాలు కొనసాగారు. కొంతకాలం సంఘ అధ్యక్షులుగా ఉన్నారు. గ్రంథాలయ ట్రస్టు కోసం భవనాలు నిర్మించారు. గ్రంథాలయ శాస్త్రంలో అనేక రచనలు చేశారు. వీరి కృషికి గుర్తింపుగా ఆంధ్ర యూనివర్సిటీ 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సత్కరించింది. స్వాతంత్ర్య సమరయోధులుగా తామ్రపత్రం పొందిన త్యాగమూర్తి పాతూరి వారు.

వెలగా వెంకటప్పయ్య అయ్యంకి శత జయంతి సంచిక నించి పైనిచ్చిన జీవిత సంగ్రహాల నుపయోగించి (2-4) ఒక అభ్యాసం తయారు చేయండి.

## 27.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

ఈ భాగంలో మనం ఈ కింది విషయాలు చర్చించాం :

- ఎవరి కోసం రాస్తున్నాం? అంటే పాఠకులని బట్టి విషయం స్థాయి, భాష మారతాయన్న మాట గుర్తుంచుకోవాలి. పాఠకుల గ్రహణ శక్తిని బట్టీ, వినియోగించుకునే శక్తిని బట్టీ మనం పాఠాలు తయారు చేయాలి.



BRAOU

- పాఠాలు రాయటంలోని ముఖ్యాంశాలు: కొత్తగా అక్షరాస్యులయిన వారికి నీతి సూత్రాలు, రాజ్యాంగ హక్కులు గాదు కావాల్సింది. వాళ్ళలో ఉత్సాహాన్ని రేకెత్తించే విధంగా ఉండాలి పాఠాలు. అందుకోసం హాస్యం, నేరం, సినిమా, వినోదం, విజ్ఞానం, లౌకిక విషయాలు కూర్చిన సామాగ్రి కావాలి.

- పాఠాల్లో వాళ్ళు నిజజీవితంలో ఉపయోగించుకోగలిగిన విషయాలు మనం నేర్పాలి. లౌకిక జీవితంలో వచ్చే రాతకోతలు కొన్నయినా వాళ్ళు సొంతంగా చేసుకోగలిగిన స్థాయికి తీసుకురావాలి. ఆ ఉద్దేశంతో అభ్యాసాలు తయారు చేయాలి.

- మాటల సముదాయాన్ని సరిగా ఉపయోగించటం కొత్త పదాలని ప్రయోగించటం, సందర్భోచితమైన వాక్యాలు రాయటం మొదలైనవి పాఠాల్లో కీలకమైన విషయాలు. ఈ ప్రయోజనం నెరవేరితే మన ప్రయత్నం ఫలించినట్లే.

## 27.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. పాఠకుల్లో చదవాలనే ఉత్సాహం కలిగించాలంటే ఎటువంటి విషయాలుండాలి? రెండు ఉదాహరణలిచ్చి వివరించండి.

2. రాతలో పద విభజన, పదసముదాయం, విరామ చిహ్నాలు ఎలా ఉపయోగించాలో వివరించండి?

**II 15పంక్తుల్లో జవాబులు రాయండి**

1. రైల్వే రిజర్వేషను ఫారం ఎలా నింపాలో కొత్తగా అక్షరాస్యులైన వాళ్ళకి వివరించండి.

2. కేలండరు ఎట్లా చదవాలో ఒక పది వాక్యాల్లో వివరించండి.

BRAOU

## ఖండం : 6 శైలీ పత్రం : ప్రసార సాధనాలు

శైలీ పత్రంలో, పత్రికా రచనలోనూ, దృశ్య, శ్రవణ మాధ్యమానికి రూపొందించుకునే కార్యక్రమాల్లోనూ అనుసరించదగిన శైలిని చర్చించాం. విరామ చిహ్నాల వాడకంపైకి అప్రధానంగా కన్పించినప్పటికీ రచనలోనూ, పలకడంలోనూ అత్యంత కీలకంగా ఉంటాయని మీరు తెలుసుకుంటారు. ఈ ఖండం చదివాక శైలి పత్రం ప్రాధాన్యాన్ని మీరు విశ్లేషించగలుగుతారు. వృత్తిలో అన్వయించుకోగలుగుతారు.

ఈ ఖండంలో రెండుభాగాలున్నాయి. వరుస క్రమంలో

28. 'శైలీ పత్రం'

29. 'విరామ చిహ్నాలు'

BRAOU

BRAOU

## భాగం : 28 శైలీ పత్రం

### విషయ క్రమం

28.0 ఉద్దేశం

28.1 ప్రవేశిక

28.2 తెలుగు పత్రికలు : శైలీ పత్రాలు

28.3 రచనల రకాలు – భాషా ప్రయోగం

**అభ్యాసం – 1**

28.4 పత్రికా రచనలో మెలుకువలు

28.5 దృశ్య, శ్రవణ మాధ్యమాల రచనలో మెలకువలు

**అభ్యాసం – 2**

28.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

28.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 28.0 ఉద్దేశం

ఈ భాగం అధ్యయనం చేసిన తర్వాత మీరు ఈ కింది విషయాలను విశ్లేషించగలుగుతారు:

- శైలీపత్రం లేదా శైలీగ్రంథం రూపకల్పన ద్వారా నియమ బద్ధమైన ఏకరూపతను సాధించడం
- తెలుగుపత్రికలలో శైలీ పత్రం అమలు, వివిధ రచనలలో భాషా ప్రయోగం అంశాలు
- పత్రికలు, దృశ్య, శ్రవణ మాధ్యమాలలో శైలీ పత్రానికి సంబంధించి మెలుకువలు, ప్రాధాన్యం.

## 28.1 ప్రవేశిక

రచయితలు, సంపాదకులు, కాపీరైటర్లు అనుసరించదగిన ప్రామాణికమైన శైలీ పత్రాలు యూరోపియన్ భాషలకు లభిస్తాయి. ది యూనివర్సిటీ ఆఫ్ షికాగో ప్రెస్ 1969లో ఏకంగా 546 పేజీల పరిష్కృత ప్రచురణ 'మాన్యుయల్ ఆఫ్ స్టైల్'ను ప్రచురించింది. (12వ పరిష్కృత ప్రతి). వివిధ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు ప్రచురించే పరిశోధక పత్రికలలో, గ్రంథాలలో అనుసరించదగిన శైలి విషయంగా అవి తమ శైలీ పత్రాలను రూపొందించుకున్నాయి. ప్రచురణ సంస్థలు, పత్రికలు, ప్రసార సాధనాల సంస్థలు శైలీ పత్రికలకు ప్రాధాన్యమివ్వడాన్ని మనం ఇంగ్లీషులో గమనిస్తాం. భారతీయ భాషల విషయంలో ఈ రంగంలో కృషి అత్యల్పమని చెప్పవచ్చు). తెలుగు ఇందుకు మినహాయింపు కాదు.

BRAOU

BRAOU

గత ఐదు దశాబ్దాల కాలంలో సంభవించిన సాంకేతిక, సామాజిక, ఆర్థిక పరిణామాల కారణంగా భాషనుపయోగించే రంగాలు విస్తృతంగా పెరిగాయి. సమాచార రంగంలో ప్రయోగించే భాష, శైలి విషయంగా ఆలోచించవలసిన అవసరం కూడా ఏర్పడింది.

ఏ శైలీ పత్రం లేదా శైలీగ్రంథం అవసరమైనా అది రచయితకు, సంపాదకుడికి, కాపీరైటర్‌కు, టైప్‌సెట్టర్‌కు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు రచనలో ఒక క్రమత్వాన్ని సాధించడానికి ఉపయోగపడేది. రచనలో క్రమత్వం మూడు రకాలుగా ఉంటుంది:ః 1. రచనను సంసిద్ధపరచడం 2. శైలి ప్రచురణ. 3. ముద్రణ. రచన సంసిద్ధదశలో ప్రధానమైన అంశాలు: రాత ప్రతికూర్పు, ప్రూఫులు, రచనలకు సంబంధించిన హక్కులు, ఆమోదాలు. శైలికి సంబంధించి సరిచూసుకోవలసిన అంశాలు అనేకం. వాటిలో ప్రధానమైనవి: 1. రాసే అలవాట్లు (ఉచ్చారణకు, లేఖనానికి మధ్యగల సంబంధాన్ని పరిచూసుకోవడం), 2. పదనిర్మాణం, 3. విరామ చిహ్నాల వాడకం 4. సంక్షిప్త రూపాలు. ప్రచురణ, ముద్రణ దశలో రూపకల్పన (design), వాడవలసిన అక్షరాల కూర్పు (typography) ప్రాముఖ్యం వహిస్తాయి. రచనను సంసిద్ధ పరచడం, ప్రచురణ, ముద్రణ పరమైన సాంకేతికపరమైన అంశాలు. అందులో నిపుణులైన వ్యక్తులు వాటిని సరిచూసుకుంటారు. వాటికొక క్రమత్వాన్ని సాధించటానికీ, కళ్ళకు సులభంగా, సుఖంగా ఉండేటట్లు చూడడానికి ప్రయత్నంచేస్తారు. (ఇది రాత లేదా అచ్చు మాధ్యమానికే పరిమితం). శైలికి సంబంధించిన అంశాలు రచన ప్రమాణాన్ని పెంచడమే కాకుండా, రచన క్రమత్వాన్ని సాధించడమే కాకుండా, ఆ రచనను శ్రవ్యీకరించవలసినప్పుడు గానీ, దృశ్యీకరించవలసివచ్చినప్పుడు కానీ దోహదం చేస్తాయి. పేర్లను రాయటంలో, వాటిని పలకడంలో చిక్కులు కొన్ని వివాదాలకు దారి తీసినట్లు కూడా వింటున్నాం. మన భాషా ప్రాంతం కాని ప్రాంతానికి సంబంధించిన వ్యక్తుల పేర్లు కానీ, స్థలనామాలుగానీ రాసేటప్పుడు, పలికేటప్పుడు ఉత్పన్నమయ్యే సమస్యలను మన ప్రసార సాధనాలనుంచే ఉదాహరణలుగా తీసుకోవచ్చు. మొన్న మొన్నటి వరకు పెకింగ్ ఈ మధ్య 'బీజింగ్' అయింది. మనం 'టాల్‌స్టాయ్' గా వ్యవహరించే రచయిత పేరును రష్యన్ భాషానిపుణుల నేతృత్వంలో వచ్చిన అనువాదాల్లో 'టోల్‌స్టాయ్' అని చూస్తున్నాం. పేర్లను రాయటంలో తెలుగు పత్రికల్లో కానీ, తెలుగు మీడియాలో కానీ ఒక క్రమత్వం లేదేమో అని సందేహం వస్తుంది.

BRAOU

| | | |
|---|---|---|
| ఉదా: | రీగన్ | రేగన్ |
| | గార్బచేవ్ | గోర్బచేవ్ |
| | ఆర్స్ | ఉర్స్ |
| | వాజ్‌పాయి | వాజ్‌పేయి |
| | సేధీ | సేఠీ |
| | జక్కర్ | ఝాకర్ |

ఈ స్థితిని నివారించడానికే శైలీ పత్రం రూపకల్పన లేదా శైలీ గ్రంథం రూపకల్పన. శైలీ పత్రంగానీ, శైలీగ్రంథంగానీ భాషా దోషాలను నివారిస్తుంది. నియమ బద్ధమైన ఏకరూపతను సాధించి క్రమత్వానికి తోడ్పడుతుంది. క్రమత్వం ఏకాగ్రత చెడని పాఠకుడు లేదా శ్రోత లేదా ప్రేక్షకుడు ఏకాగ్రతకు దోహదం చేసే ప్రధాన అంశం.

## 28.2 తెలుగు పత్రికలు, శైలీ పత్రాలు

తెలుగులో ఈనాడు, ఉదయం పత్రికలు శైలీ పత్రాలను రూపొందించుకున్నాయి. డా. బూదరాజు రాధాకృష్ణ 'ఈనాడు భాషా స్వరూపం' ఈనాడు పత్రికకు విశిష్టంగా, వివరంగా రూపొందించిన శైలీ పత్రం. 'ఈనాడు' నిర్వహించే జర్నలిజంస్కూలు, ఆ సంస్థ ప్రచురించే ప్రత్యేక బులెటిన్‌లు ఈ పత్రికలో ప్రయోగించే భాషను ఏర్పరుచుకోవడానికి నిర్దేశించిన భాషామర్యాదలే. 'ఉదయం' సంపాదకవర్గం నిర్వహించిన 'ఉదయం శైలి'లో కూడా శైలికి సంబంధించిన సూచనలతో పాటు, ప్రమాదకరమైన పదాలు ఏవో, పర్యాయపదాలు తక్కువ అక్షరాలు గలవాటినే ఎందుకు ఎన్నుకోవాలో, వాక్య నిర్మాణంలో పాటించవలసిన జాగ్రత్తలేమిటో, మాండలికాల విషయంలో అనుసరించవలసిన పంథా ఏమిటో, గౌరవ వాచకాలను ఏ రకంగా వాడాలో, సంఖ్యలకు అక్షర రూపం ఏ రకంగా ఇవ్వాలో, ప్రముఖుల పేర్లకు ముందు వారి పదవులను ఏ రకంగా వివరించాలో చెప్పారు. ఈ శైలీ పత్రాలు రాసే భాషకు సంబంధించినవి. డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య రచయితలకు మార్గదర్శకంగా రూపొందించిన శైలీపత్రం తెలుగు అకాడమీ శైలీ పత్రాన్నీ, పత్రికల అనుభవాన్నీ, భాషా ప్రయోగ అనుభవాలనూ దృష్టిలో ఉంచుకుని రూపొందించినదే.

## 28.3 రచనల రకాలు - భాషా ప్రయోగం

రచనలు రెండు రకాలు. అవి: 1. సృజనాత్మక రచనలు, 2. సృజనాత్మకేతర రచనలు. సృజనాత్మక రచనలు కళాత్మకమైన భాషా ప్రయోగానికి సంబంధించినవి. వీటిలో సాహిత్యం ముఖ్యమైంది. సృజనాత్మకేతర రచనలు సమాచార ప్రసారం ప్రధాన లక్ష్యంగా కలిగినవి. శాస్త్ర విజ్ఞాన రచనలు, సామాజిక అంశాల మీద చేసే రచనలు, వర్తమాన విషయాల మీద రాసే రచనలు ఈ కోవలోకి వస్తాయి. వీటిలో విషయ ప్రతిపాదన, వివేచన, విశదీకరణ ప్రధానమైన శాస్త్ర వచనం ఉంటుంది. చెప్పే విషయంలో ఖచ్చితం అవసరం. వాస్తవాలను, పరిశీలనలను ప్రస్తావిస్తుంది. విషయ ప్రతిపాదనలో తర్క క్రమం ఆవశ్యకం. భాషను వాడడంలో అనాసక్త ధోరణి (objective style) అభిలషణీయం. ఇటువంటి రచనల్లో ఉద్దేశించిన సమాచారం పూర్తిగా, సూటిగా అందాలంటే శైలి నిరాడంబరంగా, సరళంగా, స్పష్టంగా, సంగ్రహంగా ఉండాలి.

BRAOU

అలంకార ప్రియత్వమూ, ఆవేశ ప్రకటనమూ, విషయాతిరిక్త మైన ఊహలు, భావ పారవశ్యమూ ఇటువంటి వచన రచనల్లో, ముఖ్యంగా శాస్త్ర వచన రచనకు అనువు కానివి. మన ఆలోచనలనూ, భావాలనూ, అభిప్రాయాలనూ తెలిపేటప్పుడు మనం ఎన్నుకునే పదాలు, పదబంధాలు, కూర్చే వాక్యాలు విషయ గ్రహణకు వీలుగా ఉండాలి. అతి వ్యాప్తి, అవ్యాప్తులు లేకుండా ఉండాలి. తెలుగు నుడికారానికి అనుగుణంగా ఉండాలి.

**అభ్యాసం – 1**

సృజనేతర రంగంలో భాషలో శైలి ఎలా ఉండాలి?

## 28.4 పత్రికారచనలో మెలకువలు

శైలికి సంబంధించి సరిచూసుకోవలసిన అంశాలు రాసే అలవాట్లకు, పద పదబంధ వాక్య నిర్మాణం వంటి వాటిమీద ఆధారపడి ఉంటాయని తెలుసుకున్నాం. విరామ చిహ్నాల వాడకం అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తుందని గ్రహించాం. వివిధ పత్రికలు అమలు చేస్తున్న శైలిలోతేడా ఉంటుంది. అయితే పత్రికా రచనలో కొన్ని మెలకువలను పాటించక తప్పదు. ఈ మెలకువల్ని ఇంచుమించు శైలీపత్రం ఏ పత్రికకైనా, కొంత భిన్నంగా ఉన్నా కలిగి ఉంటాయి. మీకు అందుబాటులో ఉన్న శైలీపత్రాల్ని పరిశీలిస్తే మీకే అర్థమవుతుంది. శైలీపత్రంలోని అంతర్భాగాలన్నీ అర్థమవుతాయి. ముఖ్యంగా ఈ కింద ప్రస్తావించే మెలకువలు పత్రికా రచనలో మీకు తోడ్పడగలవు.

రాతరూపాల్లో ఏకరూపత కోసం ఈ మెలకువలు బాగా తోడ్పడగలవు. ఈ సందర్భంగా తెలుగు మాటలను, సంస్కృత మాటలనూ, ఇంగ్లీషు మాటలనూ, ఇంగ్లీషు ద్వారా వచ్చిన ఇతర భాషల మాటలను రాయడంలో మనం గుర్తుంచుకోవలసిన అంశాలు:

★ ఐ, 'ఔ'లు ఉచ్ఛారణలో అయ్, అవ్‌లుగా వినిపిస్తాయి. కాబట్టి అయి, అవు అని రాస్తున్నాం.

ఉదా: ఐంది – అయింది, ఔతుంది – అవుతుంది. ఈ రెండు రూపాల్లో ఏది రాసినా తప్పు లేదు. రచన అంతటా ఒకేరకం రూపాలతో రాయటం ఏకరూపత దృష్టినుంచి మంచిది.

★ ఇ, ఈ, ఎ, ఏ, మొదలయ్యే పదాలకు ముందు ఉచ్ఛారణలో యకారమూ, ఉ, ఊ, ఒ, ఓ లతో మొదలయ్యే పదాలకు ముందు వకారమూ చేరతాయి.

ఉదా: ఇప్పుడు – యిప్పుడు, ఉభయ – వుభయ.

★ ఇంగ్లీషు, హిందీ వంటి భాషలనుంచి వచ్చిన యిట్లు చివరను పొల్లు అక్షరాలతోగానీ, అచ్చు కలిపి గానీ రాయవచ్చు. ఒక క్రమ పద్ధతి పాటించడం మంచిది.

★ ఇంగ్లీషు ద్వారా తెలుగులోకి వచ్చిన స్థలాల పేర్లు, వ్యక్తుల పేర్లను ఒక మంచి ఇంగ్లీషు నిఘంటువు సహాయంతో క్రమ పద్ధతిలో తెలుగు రాత పద్ధతుల ప్రకారం రాయడం మంచిది. మరొక భాషకు చెందిన పేర్లు రాసేటప్పుడు అసలు పేరు ముందు వస్తుందా, ఇంటి పేరు వస్తుందా అనేది గమనించాలి.

ఉదా: పెకింగ్ – బీజింగ్, టాల్‌స్టాయ్ – టోల్‌స్తాయ్. తెలుగు లిపిలో వీటిని రాయటమే శ్రేయస్కరం. అవసరమనిపిస్తే స్పెల్లింగులను బ్రాకెట్లలో ఇవ్వవచ్చు.

★ కొత్త భావాలను సూచించే కొత్త మాటలూ, కొత్త భావమూ, దాన్ని సూచించే పద్ధతీ అర్థం కావడం ప్రధానం.

★ వాడుకలో నలిగిన ఇంగ్లీషు మాటలను తెలుగు లిపిలో రాయవచ్చు.

ఉదా: పార్లమెంటు, అసెంబ్లీ, టెలివిజన్

BRAOU

★ మిశ్ర సమాసాలు (చెవికి ఇంపుగా ఉండేటట్లు) చేయవచ్చు

ఉదా: పార్లమెంటు ఎన్నికలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, పార్లమెంటు పద్ధతి ప్రజాస్వామ్యం, పైరవీ యంత్రాంగం, పార్టీ ఫిరాయింపులు, రేడియో ప్రసారాలు

★ సంస్కృతం మాటలను కొత్త అర్థంలో వాడే పద్ధతిని సాగించవచ్చు.

ఉదా: సచివాలయం - సెక్రటేరియట్

★ ఇంగ్లీషు అర్థాలకు దగ్గర్లో ఉండేటట్లు తెలుగు మాటలు కల్పించే పద్ధతిని గానీ యథాతథానువాదం చేసే పద్ధతిని గానీ సాగించవచ్చు.

★ పదాలను పూర్వ అచ్చు లేదా హల్లుతో ప్రారంభించి రాయవచ్చు.

ఉదా: ఊరు– వూరు, ఈనాడు - యీనాడు, ఎన్నికలు - యెన్నికలు, ఏకం - యేకం, ఒకటి - వొకటి, ఓటు – వోటు, రెండు రకాలు రాసినా తప్పులేదు. కాని అన్నిచోట్ల అచ్చులో రాయడమే మంచి పద్ధతి. ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్న నిఘంటువుల్లో ఈ రకం మాటలు అచ్చులోనే దొరకుతాయి.

★ చెప్పారు, చేశారు, పలికారు వంటి మాటలను చెప్పేరు, చేశేరు, పలికేరు అని రాసినా తప్పులేదు. ఏదో ఒక రకాన్ని క్రమ పద్ధతిలో వాడటం మంచిది. పత్రికారచనల్లో ఎక్కువగా మొదటి రకమే వాడుతున్నారు.

★ బండి 'ఱ' ఎక్కడా వాడనవసరం లేదు.

★ క్రావడి సూచించే మాటలను క్రావడి లేకుండా రాయడమే మంచిది

ఉదా: వ్రాత – రాత, వ్రాశాడు – రాశాడు, త్రుప్పు – తుప్పు

★ పదం చివర 'ము' వచ్చే మాటలను సున్నాతో రాయడం మంచిది. వాక్యం చివర వచ్చినా సరే.

ఉదా: సామ్యవాదము – సామ్యవాదం, అది సామ్రాజ్యవాద దేశము– అది సామ్రాజ్యవాద దేశం

★ హల్లు మీద రాసే 'ఋ'కు గుర్తులు ృ,. ృ గుర్తుతోనే రాయడం మంచిది.

ఉదా: దృష్టి – ద్రుష్టి, కృషి – క్రుషి

★ వత్తు అక్షరాలను సంయుక్తాక్షరాలలో రాసేటప్పుడు అనుమానం కలిగితే నిఘంటువును సంప్రదించడం మంచిది. ఘ, భ, థ, ధ, క్క, జ్ఞ, ష్ట, ష్ఠ మొదలైన అక్షరాలుండే మాటల విషయంలో జాగ్రత్త అవసరం. అట్లాగే శ, ష, స లు ఉండే మాటలను జాగ్రత్తగా రాయాలి.

BRAOU

### సమాస కల్పన:

★ రూఢి లేని పదాలను, పలువురు, అయ్యేది, అద్ది, వంటి మాటలను వదలడం మంచిది. వాడుకలోని తేలిక మాటలు దొరకనప్పుడే బరువు మాటలను వాడటం మంచిది.

ఉదా: అడిగారు, ప్రశ్నించారు అనే బదులు 'పృచ్ఛించారు' అని వాడటం మంచిది కాదు.

★ సుదీర్ఘ సమాసాలు స్ఫూర్తికి అవరోధం. చిన్న చిన్న మాటల్లో భావాన్ని తెల్పడమే మంచిది.

### మాండలిక పదాలు:

★ ప్రాంతీయ మాండలిక పదాలను అవసరమైతే వాడటం తప్పు కాదు. అన్ని ప్రాంతాల పాఠకులకు అర్థమయ్యే పద్ధతుల్లో వివరణ ఇచ్చిగానీ, ఇవ్వకుండాగానీ వాటిని ఉపయోగించవచ్చు.

ఉదా: పైరవీ, పైరవీకారు, లొల్లి, రగడ , గలాటా , గలాభా

### వాక్యరచన:

★ సరళ వాక్యాల్లో రచన చేయడం సర్వసాధారణంగా మంచిది.

★ సాధ్యమైనంతవరకు కర్మణి ప్రయోగాలను పరిహరించడం మేలు. అయితే వీటి రచన అవసరాలను బట్టి రాయవచ్చు.

ఉదా: ముందు భాగాల్లో ఈ విషయం వివరించబడింది. గమనించండి.

★ ఏది ... అది, ఎవరైతే ... వారు లాంటి సర్వనామ రూపాలను వాడే వాక్యాలు రాయడం వీలయినంత వరకు తగ్గించాలి.

★ ప్రత్యక్ష అనుకరణ రాసే పద్ధతి అంటే ఒకరు అన్న మాటలను వాళ్ళు అన్నట్టుగానే చెప్పడం అనుసరణీయం. పత్రికా రచనలో పరోక్ష అనుకరణ పద్ధతే ఎక్కువ.

★ పరోక్ష అనుకృతి అంటే ఒకరు అన్న మాటల సారాంశాన్ని చెప్పడం. 'అని' చేర్చి రాసే వాక్యాలు ఇవి.

ఉదా: తాను అధ్యక్షుణ్ణి కలుసుకొని చర్చించానని ఆయన అన్నారు.

★ సంకలనార్థం – పద సంకలనంతో మరియు అనే మాట ఇంగ్లీషు, హిందీ భాషల ప్రభావం వల్ల కనిపిస్తుంది. ఇది వాడకంలో అంత ప్రచారంలో లేదు. అవసరం కూడా లేదు. మాట చివర 'అ' వస్తే దానికి దీర్ఘమూ, 'ఇ' వస్తే దీర్ఘమూ 'ఉ' వస్తే దీర్ఘమూ సంకలనార్థాన్ని తెలుపుతాయి.

చీకటి, వెలుతురు – చీకటి వెలుతురూ

BRAOU

లోపల, బయట – లోపలా , బయటా

రెండు వాక్యాల మధ్య 'కామా' తో ఈ సంకలనాన్ని సూచించడం అవసరం లేదు.

★ సంక్షిప్త రూపాలు – సంక్షిప్త రూపాలకు రెండు మూడు అర్థాలుండవచ్చు. సందర్భాన్ని బట్టి అవసరమైతే పూర్తి వివరణను, ఇంగ్లీషు లిపిలోగానీ, తెలుగు లిపిలోగానీ బ్రాకెట్లలో ఇవ్వవచ్చు. ఒకే పద్ధతిని పాటించడం అవసరం. వాడుకలో ఉన్న సంక్షిప్త అనువాద రూపాలను ఇవ్వవచ్చు.

ఉదా: NABARD - National Bank for Agricultural and Rural Development

ఐరాస – ఐక్య రాజ్య సమితి

★ బిరుదులు: విశేషణాల రూపంలో బిరుదులు ఇవ్వడం మంచిది కాదు, ప్రజాస్వామిక లక్షణమూ కాదు.

ఉదా: మార్క్సిస్టు తత్వశాస్త్ర మహోపాధ్యాయులు లెనిన్‌గారు.

★ గౌరవ వాచకాలు: వ్యక్తుల పేర్లు సాదాసీదాగా రాసి క్రియాపదం బహువచనంలో రాయడం మేలు. రచన అంతటా ఒకే పద్ధతిని పాటించడం మంచిది.

ఉదా: రూసో ......... ప్రతిపాదించారు.

ఎం.ఎన్. రాయ్...... వివరించారు.

శ్రీ, గారు వాడకుండానే గౌరవాన్ని ఈ రకంగా ఏ దేశస్తుని విషయంలోనైనా సూచించవచ్చు.

BRAOU

## 28.5 దృశ్య, శ్రవణ మాధ్యమాల రచనలో మెలకువలు

పత్రికా రచనకున్న మాదిరే దృశ్య, శ్రవణ మాధ్యమాలకు రచనా శైలి ఉంటుంది. కార్యక్రమాన్ని ఆకట్టుకునే విధంగానూ, ఆకర్షణీయంగానూ, బాగా అర్థమయ్యే రీతిలో ప్రసారం చేయడానికి 'శైలి' బాగా తోడ్పడుతుంది. బిబిసి, వాయిస్ ఆఫ్ అమెరికా వంటి ప్రసార సంస్థలు తమకంటూ ప్రత్యేక ప్రసార శైలీ పత్రాన్ని రూపొందించుకున్నాయి. మన దేశంలో ఆకాశవాణి, దూరదర్శన్‌ల ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాల విషయంలోనూ, శైలీ నిబద్ధత కన్పిస్తుంది. విస్తృత పరిధిలో పరిశీలన చేసినప్పుడు 'శైలీ పత్రాల'లో పొందుపరచిన వివరాల ముఖ్య తేడాలు గమనిస్తాం. అయితే కార్యక్రమాలు అర్థవంతంగా ఉండాలనే 'భావం' మూలసూత్రంగానే ఈ వైవిధ్యం ఉన్న శైలీ పత్రాల నిర్మాణం ఉందని గ్రహిస్తాం.

మూడవ పాఠ్యాంశం ఎలక్ట్రానిక్ మాధ్యమం రచనా పద్ధతులలో మొదటి ఖండం రెండవ భాగంలోనూ, రెండవ ఖండం ఐదవ భాగంలోనూ, మూడు, నాలుగు ఖండాలలో పది, పదహారవ భాగాలలోనూ దృశ్య శ్రవణ మాధ్యమాలకు అనుసరించవలసిన రచనా పద్ధతులను చర్చించాం. వాటిని ఈ భాగంలో అన్వయించుకోవాలి. చర్చించిన శైలికి సంబంధించిన ప్రధానమైన మెలకువలని ఒకసారి పరిశీలించండి. పత్రికా రచనలో మెలకువలు కొన్ని సరిపోయినప్పటికీ, దృశ్య శ్రవణ మాధ్యమాలకు సంబంధించిన విశిష్టమైన మెలకువలు కొన్ని ప్రత్యేకించి కన్పిస్తాయి. వాటిని పరిశీలిద్దాం:

★ ప్రచురణ మాధ్యమంలో వాడే విశ్లేషణాలను, ఉపమానాలను పదబంధాలను, వాక్యనిర్మాణాలను వాడటం తగదు.

★ చిన్న వాక్యం సరిపోయే సందర్భాల్లో పొడుగాటి వాక్యాలకోసం ప్రయత్నించవద్దు. అట్లాగే పెద్ద పెద్ద పదాల కోసం తాపత్రయం వద్దు.

★ పదాల వాడకంలో పొదుపరితనం అవసరం. మీ మాట, హావభావాలు, నేపథ్య సంగీతాలు, నిశ్శబ్దం భాషకు తోడౌతాయి. ఒక పదాన్నో, వాక్యాన్నో కత్తిరించే అవకాశం ఉంటే, కత్తిరించండి.

active వాక్యాలను చెప్పగలిగినప్పుడు

derive వాక్యాల జోలికి పోకండి

రేడియో, టెలివిజన్ ప్రసారాలను కొన్నిటిని విని, చూసి వాటిల్లో శైలికి సంబంధించిన అంశాల్ని విశ్లేషణ చేయగలిగితే – దృశ్య, శ్రవణ మాధ్యమాలకు రాయడంలో చక్కటి నైపుణ్యాన్ని సాధించడానికి వీలవుతుంది. రాసే పద్ధతుల్లో ఉండే, శైలికి సంబంధించిన విషయాలు తెలుస్తాయి.

అభ్యాసం – 2

దృశ్య శ్రవణ మాధ్యమాలకు సంబంధించి శైలీ పత్రం ప్రాధాన్యాన్ని వివరించండి.

BRAOU

## 28.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- రచయితకు, సంపాదకుడికి, కాపీరైటర్‌కు, టైప్‌సెట్టర్‌కు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు రచనలో ఒక క్రమత్వాన్ని సాధించడానికి శైలీచిత్రం లేదా శైలీగ్రంథం తోడ్పడతాయి.
- శైలికి సంబంధించి పరిచూసుకోవలసిన అంశాలు అనేకం. రాసే అలవాట్లు, పదబంధ వాక్య నిర్మాణం, విరామ చిహ్నాల వాడకం, సంక్షిప్త రూపాలు – ఈ నాలుగు వాటిలో ప్రధానమైనవి.
- శైలీపత్రం భాషా దోషాలను నివారిస్తుంది. నియమబద్ధమైన ఏకరూపతను సాధించడం ద్వారా క్రమత్వానికి తోడ్పడుతుంది.
- పత్రికలు తమతమ శైలీ పత్రాలను రూపొందించుకుంటాయి. తెలుగు పత్రికలయిన ఈనాడు, ఉదయం దినపత్రికలు శైలీపత్రాలను ఏర్పరచుకున్నాయి.

☞ సమాసకల్పన, మాండలిక పదాలు, వాక్యరచన, బిరుదులు, గౌరవవాచకాలు, సంక్షిప్త రూపాల వంటి వాటి విషయంలో పత్రికలకు రాసేటప్పుడు కొన్ని మెలకువల్ని పాటించాలి.

☞ దృశ్యశ్రవణ మాధ్యమాలకు ప్రత్యేకించి పాటించవలసిన మెలకువలు కొన్ని ఉన్నాయి.

## 28.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి**

1. శైలీపత్రం ప్రాధాన్యాన్ని వివరిస్తూ, వివిధ రకాల రచనలలో భాషా ప్రయోగాన్ని ప్రస్తావించండి?
2. పత్రికారచనలో శైలిపత్రంలో భాగంగా గమనించదగిన మెలకువల్ని సోదాహరణగా వర్ణించండి?

**II కింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి**

1. తెలుగు పత్రికలలో 'శైలీ పత్రాలు'.
2. దృశ్యశ్రవణ మాధ్యమాలకు సంబంధించి 'శైలీపత్రం' లో కన్పించే మెలకువలు.

BRAOU

## భాగం : 29 విరామ చిహ్నాలు

### విషయ క్రమం

29.0 ఉద్దేశం

29.1 ప్రవేశిక

29.2 విరామ చిహ్నాల రకాలు

**అభ్యాసం – 1**

29.3 విరామ చిహ్నాలు వాడే పద్ధతులు

**అభ్యాసం – 2**

29.4 పత్రికారచనలో విరామ చిహ్నాలు

29.5 దృశ్యశ్రవణ మాధ్యమాలలో విరామ చిహ్నాలు

29.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం

29.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 29.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక ఈ కింది విషయాలను వివరించగలుగుతారు :

- విరామ చిహ్నాల ప్రయోజనాలు, రకాలు
- పత్రికారచనలో విరామ చిహ్నాల వాడకం
- దృశ్య శ్రవణ మాధ్యమాలలో విరామ చిహ్నాల ప్రత్యేకతలు, విశిష్ట లక్షణాలు

## 29.1 ప్రవేశిక

మాట్లాడేటప్పుడు కేవలం మాటల మీదనే ఆధారపడం; భుజాలు ఎగరవేస్తాం; కనుబొమలు ముడుస్తాం; తల ఊపుతాం; ముందుకూ వెనక్కి వంగుతుంటాం; చేతులు ఆడిస్తాం; పాదాలను నేలతో తాడిస్తాం; చిన్న పిల్లలకు కోపం వచ్చినప్పుడు, వాళ్ళు మారాం చేస్తున్నప్పుడు మాట్లాడుతూ, ఏడుస్తూ, కోపం ప్రకటిస్తూ, ఎగురుతూ ఎగురుతూ

నేలకు తాకిస్తారు చూడండి, అట్లా. మన గొంతు పెంచుతాం, తగ్గిస్తాం. గొంతులో జీర పలుకుతుంది. కోపం వచ్చినపుడు, ఆనందం వేసినపుడు, బాధ కలిగినపుడు, దుఃఖం ముంచుకొచ్చినప్పుడు మన మాటల మీద ఆయా భావాల ప్రభావం ఉంటుంది. మాట్లాడుతూ, మాట్లాడుతూ ఆగుతాం, మనం మాట్లాడే వాక్యాలు ఎక్కడో ఒకచోట ముగుస్తాయి, ఎప్పుడో ఒక సమయంలో ముగుస్తాయి; మళ్ళీ మొదలవుతాయి. మధ్య మధ్య ఊపిరంటూ పీల్చుకోకుండా వాక్యాలు ఏకధాటిగా సాగవు. వాటికి పరిమితి ఉంది.

రాసే భాషలో, అచ్చులో అక్కడక్కడ ఆపడం సూచించే మాటలను వాడడం వ్యవహార రీత్యా కుదరదు. ఇక్కడ వాక్యం ముగిసింది, ఇక్కడ రవంత నిలపాలి, ఇక్కడ ప్రశ్న అంటూ రాతలో రాసే వాక్యాల తర్వాత సూచన లివ్వడం అసాధ్యం. అందువల్ల ఆపడం (విరామం) సూచించడానికి కొన్ని సంకేతాలను భాషా వ్యవహర్తలు ఏర్పరచుకుంటారు. అటువంటి సంకేతాలను విరామ చిహ్నాలు అని అంటారు. ఇంగ్లీషులో వీటినిpunctuation marksఅని అంటారు. రేడియో, టెలివిజన్ వంటి ప్రసార మాధ్యమాలలో మాట్లాడే భాషకు 'మాధ్యమం' పరంగా కొన్ని పరిమితులు ఉన్నా, మాట్లాడేటప్పుడు, ఉండే సౌలభ్యాలు కొన్ని అందుబాటులో ఉంటాయి. కాబట్టే దృశ్య శ్రవణ మాధ్యమాలకు రాసే భాషలో కొన్ని సూక్ష్మ మైన భేదాలు కన్పిస్తాయి. విస్తృత పరిధిలో ఆలోచిస్తే విరామ చిహ్నాల వాడకంలో తేడా ఏదీ కన్పించదు.

'విరామ చిహ్నాలు' అనే సమాసంలో రెండు మాటలున్నాయి. ఈ సమాసానికి అర్థం విరామాన్ని సూచించే గుర్తులు అని. రాతలో విషయంగానీ, అచ్చులో విషయం గానీ, ప్రసారంలో విషయంగానీ సులభంగా గుర్తించడానికీ, మనసు కెక్కడానికీ వాక్యాలుగా, ఉపవాక్యాలుగా విభజిస్తారు. అట్లా విభజించిన భాగాలను విరామంలోనూ, గుర్తుల లోనూ సూచించే పద్ధతిని విరామ చిహ్నాలు ఉపయోగించే పద్ధతి అని అంటారు. విరామ చిహ్నాలను వాడడంలో నైపుణ్యం అలవడితే భావబోధ స్పష్టంగా సాగుతుంది. రచన చేసే వ్యక్తి అనుకునే రీతిలో భావ వ్యక్తీకరణ అప్పుడే బలంగా సాగుతుంది. పత్రికా రచనలోనూ, దృశ్యశ్రవణ మాధ్యమాల రచనలోనూ విరామ చిహ్నాలు వాడగలిగే నైపుణ్యం 'రచనకు' నాణ్యతను ఆపాదించగలదు. మన పూర్వపు రాతలో మాటకూ మాటకూ విరామాన్ని సూచించే అలవాటు లేదు. అచ్చు యంత్రాలూ, పత్రికలూ వచ్చిన తరువాతనే ఆ అలవాటు వచ్చింది. తెలుగులో కానీ, ఇతర భారతీయ భాషల్లోకానీ పదాన్ని నిర్వచించడం కష్టం, కొన్ని పదాలను కలిపి చేసిన సమాసాలను కూడా పదం అని వ్యవహరించేవారు. విడిగా వాడదగిన మూల రూపాలూ, చేర్చిన మూల రూపాలను పదాలుగా గుర్తించవచ్చు. అక్కడే వస్తుంది చిక్కు. పర్యాయాలంటే ఏవి? వీటిని గుర్తించడం కూడా అంత తేలిక కాదు. విభక్తులు తీసుకోండి. ను / ని, కు / కి, తో, లో, వంటివి ప్రత్యయాలు అని అందరూ ఒప్పుకుంటారు. కాని, నుంచి, వల్ల, బట్టి, తోటి, కూడా, మీద, పైన, పక్క, కింద, గురించి, చేత మొదలైన వాటిని ఏమనాలి? శాస్త్ర సంబంధమైన నిర్వచనాల మాట ఎట్లా ఉన్నప్పటికీ, రాతకూ, అచ్చుకూ సంబంధించినంత వరకూ వీటిని పదాలు గానే గుర్తించడం మంచిది. ప్రసార మాధ్యమాల కోసం మాట్లాడే రూపంలో రాసే రాతకు సంబంధించి ఇదే వాదన సరిపోతుంది, వీటిని పదాలుగానే గుర్తించడం చేయాలి.

## 29.2 విరామ చిహ్నాల రకాలు

వాక్యం మొదలయిన చోటునుంచి చుక్కతో పూర్తయ్యే లోపల మరికొన్ని గుర్తులను వాడతాం. వాక్యార్థాన్ని స్పష్టంగా చెప్పడం కోసమే ఈ పని చేస్తాం. ఈ కింది వాక్యాలను పరిశీలిస్తే వాక్యార్థాన్ని తెలుసుకోవడానికి విరామ చిహ్నాల అవసరం ఏమిటో తెలుస్తుంది.

BRAOU

సమైక్యతా శక్తులను ప్రోత్సహించడానికి మేధావులు జాతీయ ఉద్యమాన్ని నిర్మించాలి అంటూ శంకరాచార్యులు ఉద్బోధించారు ఆయన హిందుత్వం గురించి మాట్లాడలేదు ప్రత్యేకమయిన ఏదో ఒక మతంతో ప్రాంతంతో భాషతో కులంతో ప్రమేయం లేని భారతీయులు గురించి ఆయన అభిలషించారు

''... సమైక్యతా శక్తులను ప్రోత్సహించడానికి మేధావులు జాతీయ ఉద్యమాన్ని నిర్మించాలి...'' అంటూ శంకరాచార్యులు ఉద్బోధించారు. ఆయన హిందుత్వం గురించి మాట్లాడ లేదు. ప్రత్యేకమయిన ఏదో ఒక మతంతో, ప్రాంతంతో, భాషతో, కులంతో ప్రమేయం లేని భారతీయత గురించి ఆయన అభిలషించారు.

వాక్యార్థాన్ని స్పష్టంగా గుర్తించడానికి " " . . . . , వంటి గుర్తులు తోడ్పడుతున్నాయి. ప్రతీ గుర్తు ఒక ప్రత్యేకమైన విరామ భావననూ, విరామ స్థాయినీ సూచిస్తుంది. విరామ భావన, స్థాయిలను కలుపుకుని వాక్యాల్లోని, మాటల్లోని భావవ్యక్తీకరణను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాం. ఈ కోణంలోంచి పరిశీలన చేసి విరామ చిహ్నాలను కొన్ని రకాలుగా గుర్తించవచ్చు, వాటి ప్రయోజనాన్నీ గ్రహించవచ్చు. విరామ చిహ్నాలను ఇష్టం వచ్చిన రీతిలో వాడటం వల్ల ప్రయోజనం ఏదీ సిద్ధించదు. వాటిని 'నియమంగా' వాడినప్పుడే వాక్యార్థం స్పష్టతకు నోచుకోగలదు. ప్రసార మాధ్యమాలకోసం రాసినా, పత్రికా రచన కోసం రాసినా రాతలో వాడే విరామ చిహ్నాలు ఒకటే. విరామ చిహ్నాల రకాలు అవే.

ఈ కింద కొన్ని గుర్తులున్నాయి. గళ్ళ పక్కనే గళ్ళలోని గుర్తుల పేర్లున్నాయి. వీటిని ఒకటి రెండు సార్లు పరిశీలించండి, గుర్తుంచుకోండి. ఈ భాగంలో వీటన్నిటినీ మీకు పరిచయం చేయడం లేదు. అయినా గుర్తుంచుకోవడం వల్ల నష్టం లేదు.

BRAOU

| | | | |
|---|---|---|---|
| . | ముగింపు చుక్క లేదా బిందువు | — | పొట్టిగీత |
| . . . | మూడు చుక్కలు | — — — | పొట్టిగీతల వరుస |
| : | కోలన్ | ______ | పొడుగుగీత |
| , | కామా | _____ | కింది గీత |
| ; | సెమికోలన్ | \| | ఒంటి నిలువుగీత |
| : — | కోలన్ డాష్ | \|\| | జంట నిలువుగీతలు |
| ,, | సదరహీచిహ్నం/ డిట్టో | ! | రాగచిహ్నం లేదా ఆశ్చర్యచిహ్నం |
| / | భేద చిహ్నం | ( ) | కుండలీకరణం |
| ' | సంక్షేపచిహ్నం | [ ] | నిలువు కుండలీకరణం |

‘ ’ ఒంటి ఉల్లేఖన చిహ్నాలు

“ ” జంట ఉల్లేఖన చిహ్నాలు

? ప్రశ్నా చిహ్నం

{ } బంధన చిహ్నం

★ నక్షత్ర చిహ్నం

★★★ నక్షత్రాల వరుస

**అభ్యాసం – 1**

I ‘విరామ చిహ్నం’ అంటే ఏమిటి – నిర్వచించండి.

II రెండు మూడు వాక్యాలలో ఉండే వార్తను రాసి, దానిలో వాడిన విరామ చిహ్నాలను ఐదింటినయినా గుర్తించి చెప్పండి.

BRAOU

## 29.3 విరామ చిహ్నాలు వాడే పద్ధతులు

ఆధునిక వచన రచన ప్రచారానికి వచ్చిన తర్వాతనే, ముఖ్యంగా పత్రికారచన వ్యాప్తిలో, రకరకాల విరామ చిహ్నాలను వాడే పద్ధతులు ఏర్పడ్డాయి.

ఈ భాగంలో కింది వాటిని వాడే పద్ధతులు తెలుసుకోండి :

- ముగింపు చుక్క లేదా బిందువు
- కామా
- సెమికోలన్
- పొట్టిగీత
- పొడుగు గీత
- ప్రశ్న చిహ్నం

☞ రాగ చిహ్నం

☞ జంట ఉల్లేఖన చిహ్నాలు

☞ మూడు చుక్కలు

ఇవి సాధారణంగా పత్రికా రచనలో, ప్రసార మాధ్యమాల రచనల్లో ఎదురయ్యే విరామ చిహ్నాలు.

## • ముగింపు చుక్క లేదా బిందువు

చాలా భాషల్లో వాక్యం యొక్క ముగింపును బిందువుతోనే సూచిస్తున్నారు. తెలుగులోనూ అంతే (అయితే, ఒకప్పుడు పద్యాంతాలనూ, శ్లోకాంతాలనూ, వాటి భాగాలనూ ఒక గీటులో వేరు చేస్తూ సూచించే వాళ్ళు; రెండు గీట్లు లోనూ సూచించే వాళ్ళు). ఇప్పుడు బిందువును వాడుతున్నారు.

1. నిశ్చయార్థక వాక్యం

సినిమా పుట్టుకతో వ్యాపారం. (రా.రా)

చాలా మతాలు పరిణామవాదాన్ని ప్రతిఘటిస్తాయి. (కొ.కు)

2. మర్యాదపూర్వకమైన చివరలో, ఆజ్ఞ చివరలో

కావలసినంత వ్యవధి మీరు తీసుకోవచ్చు.

ఈ ఉత్తరానికి ప్రత్యుత్తరం రాయండి.

3. ప్రామాణికమైన సంక్షిప్త రూపాల మధ్యలో, చివరలో

| | | | |
|---|---|---|---|
| కి. | కిలో | క్రీ.శ. | క్రీస్తు శకం |
| మీ. | మీటరు | మొ. | మొదలయినవి |
| రూ. | రూపాయి | డా. | డాక్టరు |
| గం. | గంటలు | | |

UNO, AICC, BJP లాంటి మాటలలో (సంక్షిప్త రూపాలలో) ఇంగ్లీషులో బిందువులు వాడడం మానేశారు. UNESCO, UNICEF, ASIAN అనే మాటలను తెలుగులో (ఇంగ్లీషు సంక్షిప్త రూపాల ఉచ్చారణ అధారంగా) యునెస్కో, యూనిసెఫ్, ఆసియన్ అని రాస్తాం. కాబట్టి వాటిలో బిందువులు వాడే అవకాశమే లేదు.

4. ఇంటి పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే రాస్తే, ఆ మొదటి అక్షరం చివరలో

శ్రీ. శ్రీనివాసరావు (శ్రీరంగం శ్రీనివాసరావు)

5. ఒక విషయం కింద కారణాలు వరుసగా చెప్పవలసి వచ్చినప్పుడు వాటి వరుసను సూచించే అంకెలు, అక్షరాలు వాడతారు. వాటి చివరలో

BRAOU

వార్తాపత్రికలు ఎందుకు చదువుతానంటే

1. వార్తలు తెలుస్తాయి.

2. ప్రపంచజ్ఞానం సమకూరుతుంది.

## , కామా

చదవడంలో రవంత నిలవవలసిన చోట్ల వాడే గుర్తు ఇది. విరామ చిహ్నాల్లో బిందువు తర్వాత ఎక్కువగా వాడే గుర్తు. రచనలో స్పష్టతను సాధించడానికి ఈ గుర్తు తోడ్పడుతుంది. మితిమీరి ఈ గుర్తును వాడినా, పొరపాటుగా వాడినా స్పష్టత దెబ్బతింటుంది. మిగతా గుర్తులకంటే, దీని విషయంలో జాగ్రత్త వహించడం అవసరం.

★ తేదీని సూచించే అంకె తర్వాత నెలపేరు అక్షరాల్లో రాస్తే, మధ్యలో కామా వాడతారు.

జనవరి, 1994

★ తేదీని సూచించే అంకెకూ సంవత్సరాన్ని సూచించే అంకెకూ మధ్యలోనూ వాడతారు.

జనవరి 1, 1996

★ సంబోధన చివరలో

★ వ్యక్తి పేరు తర్వాత చేర్చే డిగ్రీకి, బిరుదుకూ, పదవికి ముందూ

★ అంకెల్లో వేలనూ, లక్షలనూ, కోట్లనూ దశాంశ పద్ధతిలో అంకెల్లోనే రాసినప్పుడు

★ అవును, లేదు, కాదు, అసలు, రెండవది, మూడవది లాంటి పదాలలో వాక్యం మొదలయితే, వాటి చివరలో

★ విశేష్యాలు వరుసగా వచ్చినపుడు

ఉదా: గురజాడ కవి, కథకుడు, నాటక రచయిత, వ్యాసకర్త, భాషా శాస్త్రజ్ఞుడు, సంస్కర్త, అన్నింటికీ మించి, గొప్ప మేధావి.

★ విశేషణాలు వరుసగా వచ్చినప్పుడు

★ పదబంధాల చివరలో – ఉదా: సింహగర్జనతో, ప్రభంజన వేగంతో, సర్వమానవ కళ్యాణ కాంక్షతో, నూతన యుగ నిర్మాణం కోసం ప్రజ కదిలింది.

★ ఉపవాక్యాల చివరలో – ఉదా: నేరుగావెళ్ళి, కుడివైపుకి తిరిగి, పార్కు దాటండి.

## ; సెమికోలన్

ఇది సమన్వయ చిహ్నం. సమాపక క్రియలతో కూడిన చిన్న చిన్న వాక్యాలు వరుసగా వచ్చినప్పుడు వాటిని కలిపి

BRAOU

ఒకే వాక్యంగా రాయడం వల్ల చిన్న వాక్యాల మధ్య ఉన్న సంబంధం బాగా వ్యక్తమవుతుంది. అట్లాగే రెండు మూడు వాక్యాల మధ్య గాఢమైన సంబంధం ఉన్నప్పుడు కూడా కలిపి రాస్తారు. సమాపక క్రియలతో కూడిన చిన్న చిన్న వాక్యాలు ఈ రకమైన వాక్యంలో ఉపవాక్యాలుగా వరుసగా వస్తాయి. ఉప వాక్యాల మధ్య సంబంధాన్ని తెలుపుతూ, వాటిని ఒకదానినుంచి మరొక దానిని విడదీయడానికి సెమికోలన్ వాడతారు. ఈ భాగంలోనే ప్రవేశిక కింద మొదటి పేరాను ఉదాహరణగా ఒకసారి పరిశీలించండి.

## : సెమికోలన్

ఇది నిలువులో రెండు చుక్కల గుర్తు. వాక్యంలో పట్టిక ఇచ్చేటప్పుడు ఆ పట్టికకు ముందు కోలన్ వాడతారు.

## - పొట్టిగీత

ఇది చిన్న అడ్డగీత. పెద్ద అడ్డగీత ఐన డాష్‌తో తరచు పొరపాటు పడుతుంటారు. రెండింటిని వాడటంలో తేడా ఉంది. నిజానికి తెలుగు భాషలో, తెలుగు మాటల్లో హైఫన్ లేదు. ఇంగ్లీషులో సమాసాల్లాంటి పదాల్లో హైఫన్ వాడతారు. self-relent, vice-president, Indo-Aryan, Sub-Inspector ఇలాంటి మాటలు తెలుగులో లేవు. కంపోజిటర్లకూ, ప్రూఫు రీడర్లకూ (కొందరు పత్రికా రచయితలకు కూడా) తెలియకపోవడం వల్ల ఇట్లాంటి మాటలను (భారత్ - ఫ్రాన్స్ సహకారం, ఇండో - పాక్ సంబంధాలు) తెలుగు లిపిలో ఇంగ్లీషులో మాదిరే రాస్తున్నారు. ఇండో పాక్ సంబంధాలు వంటి మాటలను న్యాయంగా తెలుగు చేసి భారత పాకిస్తాన్ సంబంధాలు అని రాయాలి. సబ్‌ఇన్‌స్పెక్టరు వంటి మాటలను కూడా హైఫన్ లేకుండా తెలుగులో రాయవచ్చు. రాస్తూనే ఉన్నారు. ఒక మాటలో చెప్పాలంటే, హైఫన్ తెలుగులో వాడనవసరం లేదు. 1993-94 వార్షిక బడ్జెట్ వంటి వాక్యాలలో తప్ప.

B R A O U

## —— పొడవు గీత (డాష్)

ఇది పెద్ద అడ్డగీత. ఆలోచనల్లో అంతరాయం ఏర్పడినప్పుడూ, ఆలోచనలు మారినప్పుడూ, ఆ మానసిక స్థితిని సంకేతించడానికి ఈ గుర్తు తోడ్పడుతుంది. టైపులో డాష్‌ను సూచించాలంటే, రెండు హైఫన్లు కొట్టాలి. ఇది వచ్చే సందర్భాలు:

ఉదా: ఒక వాక్యంలోని ప్రత్యేక భావాన్ని కానీ, ప్రధాన విషయాన్ని కానీ నొక్కి చెప్పే సందర్భాల్లో

వరుసగా మాటలును వాడి, వాటినుంచి భావాన్ని పూర్తి చేసే తుది ఉపవాక్యాన్ని వేరు చేయడానికి.
ఉదా: డబ్బు, కీర్తి, అధికారం – ఇవి అతని జీవిత లక్ష్యాలు.

## ? ప్రశ్న చిహ్నం

ప్రశ్నలు భాష మాట్లాడేటప్పుడు వేసినంత ఎక్కువగా, రచనలో వేయం. పత్రికా రచనలో ప్రశ్నార్థకాలను పరిమితంగా ఉపయోగించడం మేలు. రేడియో, టెలివిజన్‌లలో కార్యక్రమ రూపాన్ని బట్టి, అవసరాలను బట్టి ప్రశ్నలను

బాగానే ఉపయోగిస్తారు. కానీ మితిమీరడం చేయరు. ముఖ్యంగా పరిచయాలు, ఇంటర్వ్యూలు వంటి కార్యక్రమాలలో ప్రశ్నల వాడకం చూస్తాం. పత్రికా రచనలో మాత్రం ఒక అంశానికి సంబంధించి అనుమానం కలిగినపుడు, అది నిజమో కాదో తెలియనపుడు వాక్యం చివరలో ఈ గుర్తుతో రాయడం కన్పిస్తుంది.

ఉదా: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ?

### " " జంట ఉల్లేఖన చిహ్నాలు

ఈ గుర్తులు కథల్లో, నవలల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పత్రికా రచనలోనూ, ప్రసార మాధ్యమాలకు రాసే భాషలోనూ – వక్తలు చెప్పిన మాటల్ని యథాతథంగా ఇస్తున్నప్పుడూ, వాక్యం మొదట్లో చివర్లో, ఈ చిహ్నాలు వాడతారు. అయితే ప్రసార మాధ్యమాలలో వక్తతోనే ప్రత్యక్షంగా చెప్పించగల అవకాశం ఉంటుంది కాబట్టి దీని ఉపయోగం పరిమితమే. పత్రికా రచనలో మాత్రం అధిక స్థాయిలోనే చూస్తాం.

### ... మూడు చుక్కలు

ఇది మూడు చుక్కల గుర్తు. సి.పి. బ్రౌన్ రాసిన ఇంగ్లీషు తెలుగు నిఘంటువులో ఈ మాటకు " శబ్దలోపము, వాక్యలోపము అనగా అధ్యాహారము చేసినకొనవలసినది, ఆ మాటను ఇక్కడ తెచ్చుకొనవలసినది" అనే అర్థం కనిపిస్తుంది. మాట లోపించినట్లయితే వాక్యం మొదట్లోగానీ, మధ్యలోగానీ మూడు చుక్కలు వాడతారు. వాక్యం చివరలో బిందువుతో సహా నాలుగు చుక్కలు వాడతారు. వీటిని అమితంగా ఉపయోగించడం మంచిది కాదు. సంభాషణల్లో సమాధానం రానప్పుడు, కొన్ని క్షణాలు మౌనంగా ఉన్నప్పుడు, ఆ స్థితిని సూచించే విధంగా ఈ గుర్తులు వాడతారు, కాబట్టి దృశ్య శ్రవణ మాధ్యమాల రచనల్లో దీనికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

BRAOU

**అభ్యాసం – 2**

ఏదైనా ఒక వార్తా భాగాన్ని తీసుకుని దానిలోని విరామ చిహ్నాల రకాలు వాడటాన్ని గుర్తించి, వాడిన సందర్భాల్ని చెప్పే ప్రయత్నం చేయండి

## 29.4 పత్రికా రచనలో విరామ చిహ్నాలు

వాక్యంలో ఆగవలసిన చోటును సూచించే గుర్తులు విరామ చిహ్నాలని తెలుసుకున్నాం. ఈ గుర్తులు మాట్లాడే భాషలో ఉండవు. రాసే భాషలో కనిపిస్తాయి, రాసినట్లే అచ్చు వేస్తారు కాబట్టి అచ్చులో కూడా కనిపిస్తాయి. వీటిని మీరు ఏ వ్యాసమో, కథో, నవలో, నాటికో, వార్తాపత్రికో చదువుతున్నప్పుడు గమనించి ఉంటారు; ముందు భాగాల్లో చూసి ఉంటారు; ఇప్పుడు చూస్తున్నారు. రాసే భాషలో వీటికి నిర్దిష్టమైన ప్రయోజనాలు ఉన్నాయని ఈ పాటికే అర్థం చేసుకుని ఉంటారు.

పత్రికా రచనకు సంబంధించిన శైలీ పత్రం ఉంటుందనీ, తెలుగు పత్రికలలోనూ దీని రూపకల్పన గురించి ఇంతకు ముందు 28వ భాగంలో తెలుసుకున్నాం. శైలీ పత్రంలో 'విరామ చిహ్నాలు' కూడా అంతర్భాగంగా గుర్తించాం. అయితే రచనలో విరామ చిహ్నాల కున్న ప్రాధాన్యం వల్ల విడిగా ఒకే భాగాన్ని కేటాయించాం. పత్రికలకు, ప్రసార మాధ్యమాలకు రాసే భాషల్లో వాక్య నిర్మాణమూ, విరామాల వాడకమూ తెలుసుకున్నాం.

వార్తాపత్రికలు, పత్రికలు అనేకం, అన్ని పత్రికల్లోనూ రచనల్లో విరామ చిహ్నాలు వాడటం తప్పనిసరి. పత్రికలు, వార్తాపత్రికలు ఏవైనా విరామ చిహ్నాలకున్న అర్థమూ, భావన, ప్రయోజనమూ మారవు. కాకపోతే రచన రకాన్ని బట్టి విరామ చిహ్నాల ప్రాధాన్యంలో సూక్ష్మ భేదాలుంటాయి. కొన్ని పత్రికలలో కొన్ని విరామ చిహ్నాలను ఎక్కువగా వాడితే, కొన్ని రకాలలో ఇంకొన్ని వాడతారు. ఉదా: మామూలు వార్తలు రాయడంలో, సమావేశాలను రిపోర్టు చేయడంలో, శాస్త్ర సాంకేతికాంశాల రచనల్లో, ఇంటర్వ్యూలు, పరిచయాలు, ప్రత్యేక వ్యాసాలు, ప్రమాదాలు, ప్రకృతి బీభత్సాలు వంటి వాటి గురించి రాసే వార్తలయినా, వార్తాకథనాలయినా, కథాకథనాలయినా విరామ చిహ్నాలు వాడకం ఉంటుంది. ఒకసారి ఈ రకమైన రచనలను పరిశీలిస్తే విరామ చిహ్నాలు వాడకంలో, వాడే విధానంలో సూక్ష్మమైన భేదాలు గమనించగలం. పత్రిక డిజైనింగ్, లే అవుట్‌ల వల్ల కూడా విరామ చిహ్నాలను వాడే విధానంలో మార్పు కనిపిస్తుంది. ఇక్కడ పత్రిక ఆకర్షణీయంగా కన్పించాలనే నేపథ్యంలో వీటి వాడకం నిర్ణయిస్తారు. అయితే విరామ చిహ్నాలకున్న ప్రాధాన్యం ఏమాత్రం దెబ్బతినదు. పేజీ ప్రణాళిక ఉద్దేశం ఆకర్షణే అయినా దాన్ని పురికొల్పేది పఠనా సౌలభ్యమేనని మర్చిపోకూడదు. వార్తా పత్రికలలో ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర స్థాయి, ప్రాంతీయ, స్థానికంగా ప్రచురించే వాటిల్లోనూ విరామ చిహ్నాల వాడకంలో కొన్ని తేడాలను గమనించగలం. వాడే భాష ఇందుకు ఒక కారణమైతే, ముద్రణా టెక్నాలజీ మరొక కారణం. లెటర్ ప్రెస్ ముద్రణా విధానంలోనూ, ఆఫ్‌సెట్ ముద్రణ పద్ధతిలో విరామ చిహ్నాల వాడకంలోనూ మౌలికమైన భేదాలు ఏవీ కన్పించకపోయినా, కొన్ని పరిమితులను ఎదుర్కొంటాం. ముద్రణా పద్ధతి ఏదైనా, డిజైనింగ్ లే అవుట్ ఎలా ఉన్నా, పత్రిక స్థాయి ఎలాంటిదయినా రచనలో వాక్య నిర్మాణాన్నీ, వ్యాకరణాంశాలనూ విస్మరించం. భావబోధకూ, అర్థ బోధకూ ఇవి అవసరం.

ఇంగ్లీషు ఇతర భాషల నుంచి వచ్చే పదాలు, పదబంధాల వాడకం, వార్తల అనువాదాలు విరామ చిహ్నాల వాడకంలో కొన్ని ఇబ్బందుల్ని సృష్టించే అవకాశాలున్నాయి. వీటిని రాసేటప్పుడు విరామ చిహ్నాలు వాడకంలో ప్రత్యేక శైలిని గమనిస్తాం.

చిన్న వాక్యాలు రాసేటప్పుడు వచ్చే విరామ చిహ్నాలు, పెద్ద పెద్ద వాక్యాలు ముఖ్యంగా సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలు రాసే సమయాలలో వార్తాపత్రికలయినా, శాస్త్ర విషయాల పత్రికలయినా, సాహిత్య పత్రికలయినా, వాటి రచనల్లో కన్పించే విరామ చిహ్నాల వాడకం పరిధిలో తేడా కన్పిస్తుంది.

BRAOU

అట్లాగే ప్రత్యేక వ్యాసాలు, సంపాదకీయాల విషయంలో విరామ చిహ్నాలకు ఒక విధమైన ప్రత్యేకత ఉంటుంది. నేర సంబంధమైన వార్తలు, న్యాయ సంబంధమైన అంశాలను రాసేందుకు వాడే చట్ట భాషలో వాక్య నిర్మాణంలో వాడే విరామ చిహ్నాల వ్యూహం వేరు. ఇటువంటి సందర్భాలలో రచయితకు భాష విషయంలోనే కాకుండా న్యాయపరిభాష అనుపానులు కొంతమేరయినా తెలిసి ఉండాలి. అప్పుడే విరామ చిహ్నాల వాడకంలో న్యాయం జరుగుతుంది.

తెలుగు పత్రికలలో వచ్చే వార్తా రచనలను కానివ్వండి, కథల్ని కానివ్వండి, ప్రత్యేక వ్యాసాలను కానివ్వండి ఒకసారి పరిశీలిస్తే విరామ చిహ్నాలు వాడకంలో మెలకువలు తెలుస్తాయి. అయితే దీనికంటే ముందు పత్రికా రచయిత కాదలచుకున్న వారెవరయినా సరే ఆ పత్రిక ఏర్పాటు చేసుకున్న శైలీపత్రంలోని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. శైలీ పత్రంలో ఏఏ అంశాలు భాషతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉన్నాయో గుర్తించాలి. దానితో పాటు పరోక్ష సంబంధం కలిగిన అంశాల ప్రభావం భాషమీద, భాష ప్రభావం వాటి మీద ఎలాంటిదో గమనించగలగాలి. 'భావ ప్రసార స్పష్టత' పత్రికా రచనలో అత్యంత కీలకమైన అంశం కాబట్టి వీటి విషయంలో పరిజ్ఞానం పత్రికా రచయితకు ఉండాలి. పత్రికా రచనలో నైపుణ్యానికి ఈ పరిజ్ఞానం కోసం చేసే కృషే బాటలు వేస్తుంది. ఏది ఏమైనా పత్రికా రచనలో వాస్తవికాంశాలే పాఠకుడిని ఆకట్టుకోవాలి గానీ, భాష కాదు. అంటే భాష వాడకంలో, దాంట్లో అంతర్భాగమైన విరామ చిహ్నాలను వాడడంలో ఎంత నేర్పుకోవాలో ఒకసారి మీరే ఆలోచించండి, అర్థమవుతుంది.

## 29.5 దృశ్యశ్రవణ మాధ్యమాలు: విరామ చిహ్నాలు

BRAOU

రాసే భాషలో వాడే విరామ చిహ్నాలనే దృశ్య మాధ్యమాల రచనల్లోనూ ఉపయోగిస్తారు. రాసే భాషకు, మాట్లాడే భాషకు స్వరంలో, ఊనికలో, విరామాలను పాటించడంలో తేడా ఉంటుందని ఎలక్ట్రానిక్ మాధ్యమాల కోసం రాయడం అన్న పాఠ్యాంశంలోని భాగాలలో చర్చించుకున్నాం. వాటిని ఇక్కడ అన్వయించి చదువుకోవాలి.

మాట్లాడే సందర్భంలో సహజ సిద్ధమైన శబ్దాలు, ప్రతిధ్వనులు, నిశ్శబ్దాలు ఉంటాయి. దృశ్య శ్రవణ మాధ్యమాల కార్యక్రమాలు ప్రధానంగా రెండు విధాలు: అవి: 1. రికార్డు చేసి ప్రసారం చేసే కార్యక్రమాలు, 2. ప్రత్యక్ష ప్రసారాలు. రికార్డు చేసి ప్రసారం చేసే కార్యక్రమాలకు రచనను ముందే చేయవలసి ఉంటుంది. కార్యక్రమానికి ముందే రచన చేయడం, రూపకల్పన పూర్తయిన తర్వాత రచన చేయడం – కార్యక్రమ రూపాన్ని బట్టి ఉంటాయి. కానీ ప్రత్యక్ష ప్రసారాల విషయంలో అప్పటికప్పుడు జరిగేదాన్ని వర్ణించి చెప్తాడు 'వాఖ్యాత'. ఇక్కడ వాఖ్యాత కుండే భాషా జ్ఞానమూ, అతను మాట్లాడే తీరూ ఆధారంగా విరామ చిహ్నాల ఉపయోగం ఉంటుంది.

టెలివిజన్‌కు చదివినపుడు కన్పించే విరామ తత్వం వేరు. రేడియోలో వేరు. రేడియోలో స్వరం విరామాలను స్ఫురింపగలదు. టెలివిజన్‌లో స్వరం, శరీర సౌజ్ఞలు కలసి విరామాన్ని ప్రదర్శిస్తాయి. ఈ రెండు మాధ్యమాలలో 'విరామాలు' మాట్లాడే వ్యక్తి శిక్షణ మీద ఆధారపడి ఉంటాయి. వ్యక్తి మాట్లాడే తీరు, వేగం మీద ఆధారపడి కన్పించడమూ సహజమే. అట్లాగే శబ్దాలు, సహజ శబ్దాలు, నేపథ్య సంగీతం వంటివి విరామ సంకేతాలుగా కొన్ని సమయాల్లో వ్యవహరిస్తాయి. రేడియోలో ఈ వ్యవధి సంగీతాన్ని విరామ సంగీతంలో సంకేతించడం రేడియో కోసం చేసే రచనల్లో చూడవచ్చు. ఈ దృశ్య శ్రవణ విరామాలు – రచనలోని విరామ చిహ్నాలకు తమ సహకారాన్ని అందిస్తాయి. కొన్ని సందర్భాల్లో పరిమితుల్ని సృష్టిస్తాయి.

ప్రసార మాధ్యమాల వివిధ కార్యక్రమ రూపాలకు వాడే భాష, విరామ చిహ్నాల వాడకంలో సూక్ష్మ భేదాలు కనిపిస్తాయి. నాటకంలో, రూపకంలో, వార్తల్లో, ప్రసంగాల్లో, కన్పించే మాటల విరుపు, నొక్కుడు, స్వరం ఎత్తుగడ,

జారుడు, ధ్వనిలో ఎత్తు పల్లాల విన్యాసం, వంటివి చాలా మటుకు విరామ చిహ్నాలకు బలాన్ని చేకూరుస్తాయి. దృశ్యమాధ్యమంలో నయితే శరీర సౌంజ్ఞలు దీనికి తోడువస్తాయి. శ్రోతను, ప్రేక్షకుడిని కార్యక్రమంలో తాదాత్మ్యం చెందేలా ప్రవర్తిస్తాయి.

చదువుకునేటప్పుడు విరామ చిహ్నాలను మనం ఊహించుకుని చూస్తే చదివే విరామం కంటే, మాట్లాడే సందర్భంలో విరామం వ్యవధి కాస్త ఎక్కువే అనిపిస్తుంది. రెండు మాటల మధ్యనో, పదాల మధ్యనో వచ్చే నిశ్శబ్ద రూపంలోని విరామం ఎదుటి వ్యక్తిలో పలు రకాల ఆలోచనలను రేపుతుంది. సందర్భాన్ని బట్టి భయం కావచ్చు, ఆనందం కావచ్చు, కోపం కావచ్చు, ప్రేమ కావచ్చు. అంటే రాతరూపంలోని 'ఫుల్‌స్టాప్' కంటే నిశ్శబ్దం ప్రతిభావంతమైన విరామ చిహ్నంగా గుర్తించాలి.

కార్యక్రమ ప్రక్రియను బట్టి, లక్ష్యాన్ని బట్టి, ప్రేక్షకుడి స్థాయిని బట్టి భాష ఉంటుంది. రాసే శైలి ఏర్పడుతుంది. మాట్లాడే తీరును అవే చెప్తాయి. ఇవన్నీ కలిసి మాట వేగాన్ని, మాటల విరుపును నిర్ధారించగలవు. అంటే ప్రసార మాధ్యమాలకు రాసే భాషలో/ మాట్లాడే భాషలో మాట్లాడే వేగం, అనుసరించదగిన స్వరవ్యూహం భాష, వ్యాకరణ సంబంధాలను కాపాడాలి. అప్పుడే రచనలో భావబోధన, శబ్దబోధన పటిష్ఠంగా ప్రసారమవగలదు.

ప్రసార మాధ్యమాలకు రాసే మాటల్లో సెమికోలన్ ( ; ), కోలన్ ( : ) లను పెద్దగా వాడరు. ప్రసార పత్రాలను చదివే వ్యక్తులు / గీతను పోలిన గీతల్ని వాక్యం పూర్తయినట్లు గుర్తించడానికి వాడతారు. ఇదే చిహ్నాన్ని కొందరు చదువుకునేందుకు వీలయ్యే విధంగా మాటల విరుపుల కోసం తమ పఠనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒకే వాక్యంలో గుర్తిస్తారు. వాక్యార్థాన్ని, వాక్యంలోని భావాన్ని శ్రోతకో, ప్రేక్షకుడికో తమ నైపుణ్యాన్ని జోడించి సూటిగా చెప్పేందుకే ఈ పని చేస్తారు. ప్రశ్నార్థకం ( ? ), ఆశ్చర్యార్థకం ( ! ) వంటి చిహ్నాలను మాట పలికే తీరులోనో, నొక్కులలోనో, శరీర సౌంజ్ఞల ఆధారంగానో ప్రదర్శిస్తారు. పత్రికల్లో వార్తలను, ఇతర రచనలను చదివి, వాటినే రేడియో, టెలివిజన్ ప్రసారాల కోసం ఎలా రూపొందించాలో, ప్రయత్నించి చూడండి. విరామ చిహ్నాల ప్రయోజనం బాగా తెలుస్తుంది.

BRAOU

**అభ్యాసం – 3**

I 'మాట్లాడే భాషలో' విరామ చిహ్నాలకు తోడ్పడే విరామాలు – ప్రస్తావించండి

II పత్రికా రచనలో శైలీ పత్రంలోని అంతర్భాగమే విరామ చిహ్నాలు – వివరించండి

## 29.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ☞ విరామ చిహ్నాలంటే రాసే భాషలో, మాట్లాడే భాషలో విరామాన్ని సూచించే గుర్తులు.

- ☞ పత్రికల కోసం రాయడంలో, ప్రసార మాధ్యమాలకు రాయడంలో వచ్చే విరామ చిహ్నాలు ఒకటే అయినా, వాడకంలో సూక్ష్మమైన భేదాలు కనిపిస్తాయి. రాసే భాషకు, మాట్లాడే భాషకు ఉన్న విశిష్ట లక్షణాలే ఇందుకు దోహదం చేస్తాయి.

- ☞ భావ బోధ కోసం, అర్థ బోధ కోసం విరామ చిహ్నాలు బాగా ఉపకరిస్తాయి.

- ☞ వాడే ప్రతీ విరామ చిహ్నం వెనకాల ఒక విరామ భావన ఉంటుంది. పత్రికారచనలో, ప్రసార మాధ్యమాల రచనలో వాడే చిహ్నాలు ఒకటే. విరామ చిహ్నాల రకాలు అనేకం.

- ☞ ప్రధానమైన, కీలకమైన విరామ చిహ్నాలను గుర్తించి వాడే పద్ధతులు తెలుసుకోవాలి. వాటిని వాడే నైపుణ్యాన్ని అలవరచుకోవాలి.

- ☞ పత్రికా రచనలో, ప్రసార మాధ్యమాల రచనలో రచయితలకు మార్గదర్శకంగా శైలీ పత్రాలు ఉంటాయి. భాషను ఎలా వాడాలి, విశ్లేషణాల్ని ఎలా చెప్పాలి, చిత్రాల్ని, రేఖా చిత్రాల్ని ఎలా ఇవ్వాలి, అంకెలు చెప్పే విధానం ఎలా ఉండాలి వంటి అంశాలను రచనలో వివరించే శైలిని ఇందులో ఇస్తారు. వీటి ఆధారంగా విరామ చిహ్నాలను వాడాలి.

- ☞ దృశ్యశ్రవణ కార్యక్రమ రూపం, ప్రసార పద్ధతులను బట్టి ప్రసారాలలో విరామాలను వాడతారు. ప్రత్యక్ష ప్రసారాలలో విరామాలు వాడే విధానం వేరు. స్వర వ్యూహం, శరీర సౌంజ్ఞలు, రేడియో, టెలివిజన్ ప్రసారాలలో కీలకమైనవి. రాతరూపంలోని ఫుల్‌స్టాప్ కంటె ప్రసార మాధ్యమంలో 'నిశ్శబ్దం' ప్రతిభావంతమైన విరామ చిహ్నం.

BRAOU

## 29.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. విరామ చిహ్నాల రకాలేవి? నాలుగైదు ప్రధాన విరామ చిహ్నాలను వర్ణించండి?

2. పత్రికారచనలో విరామ చిహ్నాల ప్రయోజనాన్ని గుర్తించండి?

**II కింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. దృశ్యశ్రవణ మాధ్యమాలలో విరామ చిహ్నాల తీరుతెన్నులు వివరించండి.

2. పొట్టిగీత, పొడవు గీత ఎప్పుడు వాడతారు. రెండింటి వాడకంలో ఎదురయ్యే తేడాలను వివరించండి?

# చదవదగిన పుస్తకాలు


రామారావు చేకూరి, 1975, తెలుగు వాక్యం, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

పరకాల సూర్యమోహన్, పత్రికా రచయితల పదకోశం, హైదరాబాదు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.

కృష్ణమూర్తి భద్రిరాజు, సులభవాచకం, 1990.

కృష్ణమూర్తి భద్రిరాజు, (సం), తెలుగు భాషా చరిత్ర, సాహిత్య అకాడమి, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్, 1979.

రాధాకృష్ణ బూదరాజు, ఈనాడు భాషా స్వరూపం.

విశ్వనాథం కస్తూరి, తెలుగు వెలుగు, మైసూరు, సి.ఐ.ఐ.ఎల్, 1972.

రంగనాయకమ్మ, వాడుక భాషే రాస్తున్నామా? విజయవాడ, విశాలాంధ్ర; విజయవాడ, స్వీట్ హోమ్స్ పబ్లిషర్స్, 1990.

రామచంద్రారెడ్డి రాచమల్లు, అనువాద సమస్యలు, హైదరాబాదు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 1987.

నళిని జి. అనువాద సిద్ధాంతాలు, 1989.

నారాయణరావు చిలుకూరి, ఆంధ్రభాషా చరిత్రము, 1, 2, సంపుటాలు, వాల్తేరు, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు, 1937.

వేంకటరమణమూర్తి, గిడుగు, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం, విజయవాడ, విశాలాంధ్ర ప్రచురణాలయం, 1933.

*Bassenelt, - Susan Mc Guire. Translation Studies, Methuen. London, 1980.*

*Bapuji B.R. Social Meaning of Translations In Modern Times. In society, state and Education, Essays in the Political sociology of language education. Madras T.R. Publications, 1993.*

*Catford, John C. A Linguistic theory of Translation, London, Oxford University Press, 1965.*

*Finch, C.A. An Approach to Technical Translation ; An Introductory guide for Scientific readers, U.K., Pergamon press, 1969.*


BRAOU

*Jakobson, Roman. On Linguistic Aspects of Translation. In Brower and Renben (eds) on Translation, Cambridge Mass : Harward University press, 1959.*

*Majumdar M. ' The Myth of Total Literacy ' Times of India, 1994.*

*Newmark, Peter, A Textbook of Translation, U.K., Prentice Hall, 1988.*

*New mark, Peter, Translation and Culture, In "A Textbook of Translation ", U.K., Prentice Hall International Ltd. pp 94 - 103, 1988.*

*Nida Eugene A. "Bible Translating : An Analysis of Principles and Procedures, with special reference to aboriginal languages. London United Bible Societies, London, 1947.*

*Nida & Taber, Charles R. The Theory and practice of Translation. Second photo machanical print. Leiden. The Netherlands : E.J. Brill, for the United Bible Societies, 1982.*

*Pinchuk, Isadore. Scientific and Technical Translation, London, Andre Deutsch, 1977.*

*Rao G.S. "The concept of Absorbability in Literacy "*
*MSS IGNOU, 1992.*

*Rao G.S. ' Literacy Methodology ' Mysore, CIIL, 1978.*

*Raijout T.S. Refreshing Trends in Literacy compaingn' Hindusthan times, 1994.*

*Reddy G.N. Influence of English on Telugu Literature, 1994.*

*Rajyarama, K. Problems of Translating Advertising literature from English to Telugu : A case study. M.phil Dissertation, Hyderabad, University of Hyderabad, 1990.*

*Savory, Theodore. An Art of Translation, London, Jonathan cape, 1957.*

*Tytler, A.F. 1971, Essays on the Principles of Translation. Reissued, vol.13, Amsterdam , 1978.*

BRAOU

BRAOU

BRAOU